# అర్థశాస్త్రం

# ప్రభుత్వ విత్తం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0459

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్

1996 - 97

CM-0459
31-3-97

## రచయితల బృందం

సంపాదకుడు :
ఆచార్య ఆర్. రాధాకృష్ణ

సహ సంపాదకులు :
ఆచార్య పి. రామయ్య
శ్రీ కె. సతీష్ రెడ్డి

రచయితలు :
ఆచార్య ఎం. ఎల్. కాంతారావు
ఆచార్య ఎస్. సుబ్రమణ్యం
ఆచార్య ఎస్. సారుప్రియ
డా॥ టి. దివాకర్ రావు
డా॥ కె. శివ సుబ్రమణ్యం

ముఖ చిత్రం :
శ్రీ చంద్ర

గ్రాఫిక్స్ :
శ్రీ ఎం. రమేష్

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. CM-0459
Date 31-3-97
Call No 330
6971

**డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**
హైదరాబాదు

ప్రథమ ముద్రణ 1985
పరిష్కృత ముద్రణ 1991

**Reprint : 1992 - 93, 1995, 1996 - 97**

© కాపీరైటు **డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించదలుచుకొంటే విశ్వవిద్యాలయ అనుమతి పొందాలి.

ఈ పాఠాలు సార్వత్రిక విశ్వ విద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం

ఇతర వివరములకు :
డైరక్టర్ (అకడమిక్), **డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**
సోమాజిగూడ, హైదరాబాదు - 500 482.

ముద్రణ : **మోడరన్ ప్రింటర్స్** బి - 3, వ్యూ టవర్స్, లకిడికా పూల్, హైదరాబాద్ - 500 004. ఫోన్ : 316753.

BRAOU

# పుస్తక పరిచయం

రెండవ ప్రపంచయుద్ధానంతరం రాజ్యం యొక్క విధులు ముందున్నడూ లేనంతగా మారాయి. సమాజాన్ని పవిత్రపేదిగా చేసి, ప్రజలందరికీ న్యాయాన్ని చేకూర్చి, స్వయంగా అభివృద్ధి కార్యకలాపాలలో పాల్గొనేటంతటి విస్తృతంగా నేడు రాజ్యం యొక్క పరిధి పెరిగింది. ఇంతటి విస్తృతమైన, బహు విధమైన కార్యకలాపాలను కొనసాగించడానికి రాజ్యానికి డబ్బు అవసరం ఎంతైనా ఉంది. ఇందులో ప్రత్యామ్నాయ విధాన సాధనాలను ఉపయోగించి ప్రభుత్వం తన ఆదాయ వనరులను ఎలా సమకూర్చుకోవాలి. దాని వివిధ కార్యకలాపాలకు అవసరమైన విత్తాన్ని ఎలా కేటాయించాలి. ప్రైవేటు రంగాన్ని ఎలా క్రమబద్ధం చేయాలి అనేవి సంక్షేమం, అభివృద్ధి, స్థిరత్వం అనే మూడు అంశాల దృష్ట్యా ఆలోచించాల్సి వుంటుంది. ప్రభుత్వ రాబడి వనరుల సమీకరణ, ప్రభుత్వ వ్యయ నిర్మాణానికి సంబంధించిన సాధనాల ఎంపిక అనే ప్రమాణాత్మక నిర్ణయాలను సూచిస్తుంది.

ఈ కోర్సు ప్రాథమికోద్దేశమేమంటే ప్రభుత్వ విత్తంలోని అర్థికాంశాలను - అంటే సంక్షేమ అర్థశాస్త్రం, సూక్ష్మ, స్థూల అర్థికాంశాలను తెలియజేయడం. ముఖ్యంగా ఈ కోర్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాల గురించిన చర్చ సాగుతుంది.

ఈ పుస్తకం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయం వారిచే నొసంగబడు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులోని తృతీయ సంవత్సరం పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన ప్రభుత్వ విత్తంలోని అంశాలను గూర్చి వివరిస్తుంది. అధ్యయన సౌలభ్యం కోసం పాఠ్య ప్రణాళికను ఖండంలుగా, ఖండంలను వివిధ భాగాలుగా విభజించాం. ప్రతి ఖండం, సాధరణంగా, ఒక ప్రత్యేక విషయ అధ్యయనం కలిగి వుంటుంది.

ప్రభుత్వ విత్తం అనే కోర్సులో ఏడు ఖండాలున్నాయి. మొదటి భాగం ప్రభుత్వ విత్త స్వభావాన్ని రెండవ భాగం ప్రభుత్వ రాబడిని గురించి చర్చించాయి. మూడవ భాగం భారతదేశ పన్నుల వ్యవస్థను, నాల్గవ భాగం ప్రభుత్వ వ్యయాన్ని, ఐదవ భాగం ప్రభుత్వ ఋణాన్ని గురించి తెలియజేస్తాయి. ఆరు, ఏడు భాగంలు విధులననుసరించిన విత్తాన్ని, అభివృద్ధి, ఫెడరల్ విత్తాలను వివరిస్తాయి.

విద్యార్థులకు ఎక్కువ కష్టం లేకుండా చదివి అర్థం చేసుకోవడంలో పాఠాలను నియమానుసారంగా ప్రత్యేక నిపుణులచే తయారుచేయబడ్డాయి. ప్రతి పాఠం దాని విషయక్రమం, లక్ష్యాల వివరణతో ఆరంభించబడి విద్యార్థి అవగాహనను పరీక్షించే అభ్యాసాలతో ముగుస్తుంది.

ప్రభుత్వ విత్తం యొక్క విశిష్ట గుణాత్మకతను, దాని ప్రాముఖ్యాన్ని తెలిపే మౌలిక సమస్యలను విద్యార్థి సరియైన విధంగా అవగాహన చేసుకోవడంలో ఈ పాఠ్యాంశాలు దోహదపడగలవని ఈ విశ్వవిద్యాలయం ఆశిస్తోంది.

BRAOU

BRAOU

# ఖండం - 1

## ప్రభుత్వ విత్త పరిచయం

ప్రభుత్వ విత్త స్వభావాన్ని, పరిధిని ప్రభుత్వ విత్తంలోని వివిధ అంశాలను తెలుసుకొంటాం. ప్రభుత్వ విత్తానికి, ప్రైవేటు విత్తానికి గల పోలికలను తేడాలను రెండవ భాగంలో చదువుతాం. ప్రభుత్వ విత్త కార్యకలాపాలకు ఆధారాలను గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం ద్వారా చర్చిస్తాం.

ఈ ఖండంలోని మూడు భాగాలు :

భాగం - 1 : ప్రభుత్వ విత్త స్వభావం
భాగం - 2 : ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం
భాగం - 3 : గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం

***

BRAOU

BRAOU

# భాగం – 1 : ప్రభుత్వ విత్తం – స్వభావం.

విషయక్రమం


1.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
1.1 పరిచయం
1.2 ప్రభుత్వ కార్యకలాపాల పరిధి
1.3 సామూహిక వస్తువులు – వ్యక్తిగత వస్తువులు – బహిష్కరణ సూత్రం
 1.3.1 మెరిట్ కోరికల ముఖ్య లక్షణాలు
 1.3.2 సామూహిక మరియు వ్యక్తిగత వస్తువుల మధ్య తారతమ్యం
1.4 ఇతర నియమాలు
 1.4.1 ప్రయివేటు రంగము యొక్క ప్రోత్సాహానికి మూలం
 1.4.2 ప్రయివేటు వినియోగం/ ఉత్పత్తిలో మారుతున్న విధానం
 1.4.3 ఆదాయ పునఃపంపిణీ సాధనం
1.5 వివిధ ఆర్థిక కార్యకలాపాల మధ్య సంబంధము మరియు
 1.5.1 ఏకపక్ష మరియు ద్విపక్ష ప్రవాహము
 1.5.2 ధనాత్మక మరియు ఋణాత్మక చెల్లింపులు
1.6 ప్రభుత్వ విత్తం – నిర్వచనాలు
1.7 ప్రభుత్వవిత్తము లో ముఖ్యభాగాలు
1.8 సారాంశము / ముగింపు
1.9 సంప్రదించు పుస్తకాలు
1.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 1.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగము ప్రభుత్వ విత్తం యొక్క స్వభావము మరియు దీనిలోని ముఖ్యమయిన భాగాలను వివరిస్తుంది. ఈభాగము చదివినతదుపరి మీరు

- ప్రభుత్వ కార్యకలాపాల పరిధిని వివరించ గలరు.
- ప్రభుత్వ విత్త శాస్త్రాన్ని వివరించగలరు.
- ప్రభుత్వ విత్తంను నిర్వచించగలరు.
- ప్రభుత్వ విత్తం లోని భాగాలను గుర్తించగలరు.

## 1.1 పరిచయం

అర్థశాస్త్రంలో ప్రభుత్వ విత్తం ఒక ముఖ్యమయిన విభాగం. ఈ శాస్త్రం ప్రభుత్వం యొక్క వివిధ విత్త కార్యక్రమాలతో పాటు ముఖ్యంగా, ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఋణం, మొదలగువాటిని గురించి పరిశీలిస్తుంది. ఈ భాగంలో ప్రభుత్వ విత్తంను గురించి ప్రవేశపెట్టడం జరిగినది. ఆధునికప్రపంచములో ప్రభుత్వం యొక్క పాత్ర వివిధ రకాలుగా పెరగడం వలన, సంక్షేమ రాజ్య భావనతో ప్రభుత్వ విత్త స్వభావం



BRAOU

మారిపోయింది. ఈ భాగంలో వివిధ ప్రభుత్వ విత్త నిర్వచనాలను వివరించడంతో బాటు ప్రభుత్వ విత్త వివిధ భాగాలను గురించి చర్చించడం జరిగినది.

## 1.2 ప్రభుత్వ కార్యకలాపాల పరిధి

అర్థశాస్త్రంలో ప్రభుత్వ విత్తం ఒక ప్రముఖ శాఖ. ఇది రాజ్యం యొక్క వివిధ విత్త కార్యకలాపాలను గూర్చి తెలియజేస్తుంది. వీటిలో ముఖ్యమైనవి ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వవ్యయం,ప్రభుత్వ ఋణం. ప్రభుత్వవిత్త స్వభావాన్ని గూర్చి తెలుసుకోబోయే ముందు ఆర్థిక నిర్వహణలో ప్రభుత్వ కార్యకలాపాల పరిధిని గూర్చి తెలుసుకోవడం అవసరం. సాంప్రదాయక ఆర్థిక వేత్తలు రాజ్యానికి రెండే విధులు నిర్ణయించారు. అవి - విదేశీయుల దురాక్రమణలనుండి దేశాన్ని రక్షించడం, అంతఃకలహాలను అణచడం. ఈ విధులను పోలీసు రాజ్యం (Police State) విధులు అంటారు. కానికాలక్రమేణా ముఖ్యంగా రెండవ ప్రపంచయుద్ధం తరువాత రాజ్యం యొక్క విధులు విపరీతంగా విస్తరించబడ్డాయి. కొన్ని ముఖ్య వస్తువుల ఉత్పత్తి, పంపిణీలు, ప్రజలకు సాంఘికన్యాయం చేకూర్చడం. కొరతగా ఉన్న వనరులను తగు పద్ధతిని ఉపయోగించడం మొదలైనవి కూడా రాజ్యం యొక్క విధులలో చేర్చబడ్డాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుల, ఉత్పత్తిదారుల ఆర్థిక కార్యకలాపాలు మార్కెట్టు యంత్రాంగం ద్వారా నడిపించబడతాయి. కాని ఆర్థిక కార్యక్రమాలు పూర్తిగా మార్కెట్టు యంత్రాంగానికి వదలివేస్తే దాని వల్ల ప్రైవేటు ఆర్థికశక్తి పెరిగి సాంఘిక న్యాయం కుంటుపడుతుందనే విషయం ప్రపంచంలో చాలా దేశాల అనుభవంలో వెల్లడైంది. దీనివల్ల ఆదాయ సంపదల్లో అసమానతలు పెరుగుతాయి. అంతేకాక అసంపూర్ణ వినియోగం, అక్రమ వినియోగం వల్ల వనరులు వ్యర్థమౌతాయి. మార్కెట్టు యంత్రాంగంపై ఆధారపడిన ఆర్థికవ్యవస్థ ఆర్థిక సౌభాగ్యం (booms) ఆర్థికమాంద్యం (depression) కారణంగా ఒడిదుడుకులకు లోనవుతుంది. కావున ప్రభుత్వ కార్యకలాపాలను విస్తృతపరిచి ఈ ఒడిదుడుకులను సరిదిద్దాలని పలువురి అభిప్రాయం. ప్రపంచంలోనిదేశాలలో కొన్ని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకి చెందినవైతే మరికొన్ని సామ్యవాద ఆర్థిక వ్యవస్థకు చెందినవి. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో మార్కెట్టు యంత్రాంగం అతి తక్కువ పాత్ర నిర్వహిస్తుంది. ఉత్పత్తి, పంపిణీలకు సంబంధించిన కార్యకలాపాలలో ప్రభుత్వ రంగం ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. ఈ రెండు ఆర్థిక విధానాలే కాకుండా మిశ్రమ, ఆర్థిక వ్యవస్థ అనే ఇంకో విధానం కూడా ఉంది. ఇది పై రెండు విధానాల లక్షణాలను కలిగి ఉంటుంది. అంటే ప్రభుత్వ రంగం, ప్రైవేటురంగం కూడా ప్రముఖ పాత్రను వహిస్తాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఈ కోవకు చెందినదే.

BRAOU

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వకార్యకలాపాల పరిధి ఏమిటి? ఈ ప్రశ్న పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలకే ఎక్కువుగా సంబంధించినది. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో అన్ని ఆర్థిక కార్యకలాపాలు ప్రభుత్వంచేతే నిర్వహింపబడతాయి. కాబట్టి సామ్యవాద ఆర్థిక వ్యవస్థలోని ప్రభుత్వ విత్త సమస్యలు మిగతా రెండు విధానాలకి భిన్నంగా ఉంటాయి. ఉత్పత్తి కారకాలన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వల్ల ధర, ఉత్పత్తి విధానాల రెండింటివి కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

ప్రభుత్వ ధర విధానాలు ప్రభుత్వ విత్తంలో ఒక ప్రముఖ పాత్ర నిర్వహిస్తాయి. సామ్యవాద ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకై వనరులను సమీకరించడానికి ఉత్పత్తి వ్యయంపై కొంత కలిపి (mark up) ధర నిర్ణయించబడుతుంది. అంతేకాని అదనపు పన్నుల ద్వారా వనరుల సమీకరణకు ప్రాధాన్యత ఇవ్వబడదు. ఇప్పుడు పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ ఏ విధంగా ఉంటుందో తెలుసుకుందాం. ఈ వ్యవస్థల్లో ముఖ్యంగా రెండు అంశాలను గుర్తుంచుకోవాలి. 1. ప్రైవేటు రంగం తన విధులను సంతృప్తికరంగా నిర్వహించలేనపుడే ప్రభుత్వ జోక్యం అవశ్యకమౌతుంది. 2. ప్రజాసంక్షేమ లక్ష్యసాధనదృష్ట్యా (egalitarian Point of view) ప్రైవేటు రంగ కార్యకలాపాల నియంత్రణకు, తనిఖీని, క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక పాత్ర నిర్వహిస్తుంది.

## 1.3 సామూహిక వస్తువులు – వ్యక్తిగత వస్తువులు – బహిష్కరణ సూత్రం

పై రెండు అంశాల్లో మొదటిదాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే ముందుగా మనం సామాజిక వస్తువులు, వ్యక్తిగతవస్తువులమధ్యగల తేడాలను తెలుసుకోవాలి. ఈ తేడాను ఒక ఉదాహరణ ద్వారా పరిశీలిద్దాం. ప్రజల జీవితాన్ని ఆస్తిపాస్తులను రాజ్యం రక్షిస్తోంది. దేశంలోని ప్రతి వ్యక్తికి అతడు కోరినా కోరక పోయినా రాజ్యం ఈ సేవను అందజేస్తుంది. ఈ సేవలకు మార్కెట్టు యంత్రాంగం ద్వారా ధర నిర్ణయించలేము. ఇటువంటి వస్తు సేవలనే సామూహిక వస్తువులు (Collective goods) అంటాము. ఇట్టి వస్తు సేవలు ప్రజలందరికి అందుబాటులో ఉంటాయి. అందువల్లనే వాటిని ప్రభుత్వ వస్తువులు (Public goods) అని కూడా అంటాము. ఇవి కాకుండా మరో రకం వస్తువులు కూడా ఉన్నాయి. వీటిని ప్రవేటు వస్తువులు (Private goods) అంటారు. రొట్టె, బట్ట, కిల్లీ మున్నగు వస్తువులను ఉదాహరణగా తీసుకుందాం. మార్కెట్టు ధరను చెల్లించి వీటిని మనం పొందగల్గుతున్నాం. మార్కెట్టు ధరను చెల్లించకుండా ఏ వ్యక్తి వీనిని పొందలేడు. ఈ వస్తువులు కావాలని కోరుకున్న వారందరూ ధర చెల్లించవలసిందే. కావున ధర చెల్లించిన వారి నుండి చెల్లించని వారిని వేరు చేయవచ్చు. ఇంకో మాటలో చెప్పాలంటే ధర చెల్లించి ఆ వస్తువును కొనుక్కోవడానికి ఇష్టపడని వాళ్ళని మార్కెటు యంత్రాంగం బహిష్కరిస్తుంది. ఈ లక్షణాన్నే బహిష్కరణ సూత్రం (Execlusive principle) అంటారు. మార్కెట్టు యంత్రాంగంచే ధర నిర్ణయింపబడిన వస్తువులన్నింటికి బహిష్కరణ సూత్రం వర్తిస్తుంది. కాని ధర నిర్ణయింపబడక అందరి చేత వినియోగింపబడుతున్న వస్తు సేవలకు బహిష్కరణ సూత్రం వర్తించదు. సామూహిక వస్తువును ప్రభుత్వం అందజేసినపుడే బహిష్కరణ కష్టమౌతుంది. కాని ప్రైవేటు రంగం ద్వారా అందజేయబడితే బహిష్కరణ కష్టం కాదు. ఈ సందర్భంలో మస్‌గ్రేవ్ అభిప్రాయం ఏమనగా మెరిట్ కోరికల (Merit wants) సంతృప్తికి ప్రభుత్వకార్యకాలాపాలు అవసరం. సామూహికంగా సంతృప్తి పరచబడే కోరికలనే మెరిట్ కోరికలు అంటారు. ఉదాహరణకు విద్య ఆరోగ్య సేవలు ప్రజలందరికి ఉపకరించేవే. ఇవి ప్రైవేటు రంగమునందు కూడా నెలకొల్పవచ్చును. కాని అప్పుడవి బహిష్కరణ సూత్ర ప్రాతిపదికగా అందజేయబడతాయి. ధర చెల్లించని వారికి ఈ సేవలు అందుబాటులో ఉండవు. అందువల్ల సమాజానికి ఉపకరించే ఈ సేవలు ప్రభుత్వమేనెలకొల్పి ప్రజలకు అందుబాటులో ఉంచడం ఎంతైన అవసరం.

### 1.3.1 మెరిట్ కోరికల యొక్క ముఖ్య లక్షణాలు

i) వినియోగదారుని అభిరుచులతో జోక్యం చేసుకోవడం.

ii) వినియోగ విభేదం

iii) బహిర్గత నిబంధనకు లోనవడం

మెరిట్ మరియు సాంఘిక కోరికలు సామూహిక కోరికలో భాగం. ఇవి ప్రభుత్వ విత్తశాస్త్రంలో నార్మేటివ్ స్వభావానికి లోనవుతూ వీటి సంతృప్తి కొరకు కృషి చేయడం జరుగుతుంది.

### 1.3.2 సామూహిక మరియు వ్యక్తిగత వస్తువుల మధ్య తారతమ్యం

**a) ఉపాంత వ్యయ ఆధారం**

ఉపాంత వ్యయం (Marginal cost) దృష్ట్యా కూడా ప్రభుత్వం వీటిని అందించడం సమర్థనీయం.సామూహిక వస్తువు యొక్క ఉపాంత వ్యయం శూన్యం కాని, శూన్యానికి దగ్గరగా కాని ఉంటుంది. అంటే ఒక అదనపు వ్యక్తికి ఈ సదుపాయాన్ని అందజేయడానికి గమనించదగిన అదనపు వ్యయం పెరుగుదల ఉండదు.



B R A O U

అయితే ఏ సామూహిక వస్తువైనా ఉపాంత వ్యయం పెరగకుండా అపరిమితంగా సప్లై చేయడం ప్రభుత్వానికి కూడా ఎల్లవేళలా సాధ్యం కాదనే విషయం గుర్తుంచుకోవాలి.

**b) బహిర్గతాల ఆధారం**

ప్రభుత్వ కార్యకలాపాల పరిధి ఇంకా కొన్ని కారణాల వల్ల కూడా బలపర్చబడింది. ఒక వస్తువు యొక్క ఉత్పత్తిలో కాని ఉపయోగంలో కాని కొన్ని ఫలితాలు ఇతరుల మీదకు ప్రసరించవచ్చును. వీటిని బహిర్గత ఫలితాలు (externalities) అంటారు. వీటి వల్ల ఇతరులకు ఆర్థికంగా లాభం కాని, నష్టం కాని కలగవచ్చు. అంతేకాక వీటివల్ల సమాజానికంతకూ కూడ వ్యయాలు, లాభాలు కలగవచ్చు. ఉదాహరణకు ఒక కాగితం పరిశ్రమను తీసుకుందాం. ఇది వదిలోని నీటిని కలుషితం చేసిందనుకొండి. దీన్ని సమాజ వ్యయంగా భావించాలి. ఈ నష్ట పరిహారాన్ని పారిశ్రామిక వేత్త చెల్లించపోవచ్చు. ప్రైవేటు రంగం లోని సంస్థ కావడం వల్ల లాభాలను గరిష్టం చేసేటప్పుడు ఈ వ్యయం లెక్కలోకి రాదు. సాంఘిక లాభ నష్టాలను పరిగణించవలసిన ఇటువంటి కార్యకలాపాలను పూర్తిగా ప్రైవేటు రంగానికి వదలి వేయడం కంటే ప్రభుత్వం యొక్క అదుపు వీటిపై ఉంచడం అవసరం.

**c) మార్కెటు యంత్రాంగ ఆధారం**

ప్రైవేటు, ప్రభుత్వ వస్తువులను పోల్చేటపుడు ప్రైవేటు వస్తువుల విషయంలో మార్కెట్టు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తుందని, ప్రభుత్వ వస్తువుల విషయంలో మార్కెట్టు యంత్రాంగం విఫలమౌతుందనే సామాన్య వాదన. ప్రైవేటు వస్తువుకు మార్కెట్టు యంత్రాంగం సమర్థవంతంగా ఉపయోగించడానికి రెండు కారణాలున్నాయి. 1 బహిష్కరణ సూత్రం వర్తించడం వల్ల. 2. వినియోగంలో వైరం ఉండడం వల్ల సామర్థ్య లోపం లేకుండానే బహిష్కరించగలగడం వల్ల. మార్కెట్టు యాంత్రాంగం విఫలమైన సందర్భాల్లో ప్రభుత్వ వస్తువులనుసమర్థిస్తాం. బహిష్కరణ సూత్రం వర్తించకపోయినా పోటీ లేకపోయినా మార్కెట్టు యంత్రాంగం విఫలమౌతుంది. వినియోగంలో వైరం ఉన్నంతవరకు వస్తువు సమర్థవంతంగా ఉపయోగించబడుతుంది. వినియోగంలో వైరం లేనపుడు బహిష్కరణ సూత్రాన్ని అమలు చేయడంలో అర్థం లేదు. ఏ వస్తువుం వినియోగంలో వైరం ఉంటుందో ఆ వస్తువులను సామూహిక వస్తువులు అంటారు.

B R A O U

**d) నష్ట భయ ఆధారం**

ప్రభుత్వ చర్యను ఇంకో సందర్భంలో కూడా బలపర్చవచ్చు. కొన్నిరకాలైన నష్ట భయాలను (risks) ప్రైవేటు వ్యవస్థ భరించలేదు. ఉదాహరణకు ఆధునాతన సాంకేతిక విజ్ఞాన భారీ పెట్టుబడి అవసరమైనపుడు ప్రైవేటు రంగం ఉత్పత్తి కార్యక్రమాన్ని చేపట్ట లేదు.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి – 1**

---

1. బహిష్కరణ సూత్రం అనగా నేమి?
2. సామూహిక వస్తువులను వివరించుము.
3. మెరిట్ కోరికలు అనగానేమి?
5. సాంఘిక వస్తువులు అనగా నేమి?

## 1.4 ఇతర నియమాలు

ఈ క్రింది లక్ష్యాల సాధనలో ప్రభుత్వ కార్యకలాపాల పరిధిని పరిశీలిద్దాం.

1. పోటితో కూడిన ప్రోత్సాహానికే మార్గంగానూ (as a competing source of initiative)
2. ప్రైవేటు రంగానికి చెందిన ఉత్పత్తివినియోగాల్ని ప్రభావితం చెయ్యడం లోనూ
3. ఆదాయాన్ని పున్‌పంపిణిచేసే సాధనంగాను.

### 1.4.1 ప్రైవేటు రంగము యొక్క ప్రోత్సాహానికి మూలం

ఈ లక్ష్యాలను విపులంగా పరిశీలిద్దాం. ప్రభుత్వం ప్రైవేటు రంగానికి తగిన ప్రోత్సాహమిస్తుంది. వస్తు సేవల ఉత్పత్తి పంపిణీలలో ప్రైవేటు రంగానికంటే ప్రభుత్వ రంగానికి ఆధిక్యత ఉండవచ్చు. ప్రభుత్వ కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలవలె లాభోద్దేశాలను కలిగివుండవు. అయినా విద్యుదుత్పత్తి రవాణా, కీలక వస్తువుల ఉత్పత్తి వంటి కొన్ని వస్తువుల విషయంలో లాభోద్దేశాన్ని కలిగి యుండవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ సంస్థల కంటే చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. కాని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవస్థాపకుల కొరత వల్ల పోటితో కూడిన ప్రోత్సాహానికి మార్గంగా ప్రభుత్వం చాలా ముఖ్య పాత్రను వహిస్తుంది. ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు రంగ సంస్థలతో పోటీ చేయడం నేడు మనం చూస్తున్నాం. ప్రైవేటు సంస్థల సామర్థ్యాన్ని పెంచడానికి ఈ పోటీ చాలా దోహదం చేస్తుంది. అయినప్పటికి ఇండియా వంటి కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలకంటే ప్రైవేటు సంస్థలే మెరుగ్గా ఉన్నాయనే విమర్శ ఉంది. పోటితో కూడిన ప్రోత్సాహానికి మార్గంగా వ్యవహరించడమే ప్రభుత్వోద్దేశమనుకొంటే ఈ విమర్శకి తావు లేదు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ లోపాలకు ఆ సంస్థని నడుపుతున్న వ్యక్తుల అసమర్థతే కారణం కాని ప్రభుత్వ కార్యకలాపాల పరిధిని విస్తరింపజేయడం వల్ల కాదు. కావున ఈ దేశాల్లో ప్రభుత్వరంగం, ప్రైవేటు రంగ సంస్థలకు పోటీలో కూడిన ప్రోత్సాహానికి మార్గంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### 1.4.2 ప్రయివేటు వినియోగం / ఉత్పత్తిలో మారుతున్న విధానం

ఇక రెండవ లక్ష్యమైన 'వ్యక్తిగత వినియోగం లేక ఉత్పత్తి విధానంలో మార్పు' అనే విషయాన్ని పరిశీలిద్దాం. సాంఘిక సంక్షేమానికి భంగకరమైన మందులు, ఆల్కహాలు మొదలగు వస్తువుల ఉత్పత్తిపై ప్రభుత్వం నిషేధం విధించవచ్చు. ఒక్కొక్కసారి అధిక పన్నులను విధించి మార్కెట్టు యంత్రాంగం ద్వారా వ్యక్తిగత వినియోగాన్ని తగ్గించవచ్చు. ఒక వస్తువుపై పన్ను విధించడం వల్ల దాని ధర పెరిగి డిమాండు తగ్గిపోతుంది. ప్రభుత్వం కొన్ని వస్తువులపై వ్యక్తిగత వినియోగాన్ని ప్రోత్సాహించాలనుకొంటే పన్ను విధించడానికి బదులు వాటిపై సబ్సిడీలు చెల్లిస్తుంది. ఇలా చేయడంలో ప్రభుత్వ ఉద్దేశం ఆ వస్తువుల ధరలు తగ్గేటట్టు డిమాండు పెరిగేటట్టు చూడ్డమే. అలాగే సమాజ శ్రేయస్సుకు భంగకరమైన వస్తువుల ఉత్పత్తిని ప్రభుత్వం నిషేధించవచ్చు. ఈ విషయంలో పన్ను యంత్రాంగం ఒక ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రభుత్వం డిమాండు పెంచడానికి గాని ఎగుమతులను పెంచడానికిగాని వస్తువుల ఉత్పత్తిని పెంచకోరుతుంది. ఇందుకు ఎక్సైజ్ సుంకాలను, ఎగుమతి సుంకాలను (export tariffs) తగ్గించడం వంటి చర్యలు ఉపయోగపడతాయి. ప్రభుత్వం పన్నుల యంత్రాంగాన్నే కాకుండా పరిపాలన చర్యలు ద్రవ్య చర్యలు కూడా తీసుకొని ప్రయివేటు వినియోగం ఉత్పత్తులను క్రమబద్ధం చేయవచ్చు. కాని ఖచ్చితంగా చెప్పాలంటే ద్రవ్య పద్ధతులు బ్యాంకింగు పద్ధతి క్రిందకు రావడంతో ఇవి ప్రభుత్వ విత్తంలో భాగం కానేరావనే విషయం మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

BRAOU

### 1.4.3 ఆదాయ పునః పంపిణీ సాధనం

ఇక మూడవ లక్ష్యం 'ఆదాయాన్ని పునః పంపిణీ చేయడం'. ధనిక పేదవర్గాల మధ్య గల అసమానతలను తగ్గించడం దాని ధ్యేయం. ఒక ఉదాహరణ పరిశీలిద్దాం.

తక్కువ ఆదాయం కలవారికి అదనపు ఆదాయం కల్పించడం కోసమే ప్రభుత్వం సాంఘిక భద్రత, నిరుద్యోగ భీమా మొదలైన కార్యక్రమాలు చేపడుతుంది. ఒక్కొక్కసారి కొంత మంది ఉత్పత్తి దారులకు ప్రయోజనం చేకూర్చడానికి కొన్ని వస్తువుల ఉత్పత్తిలో సబ్సిడీలను చెల్లించవచ్చు. అదే విధంగా ప్రభుత్వంచే నిర్మించబడుతున్న కట్టడాలు (Public works) వాటిని ఉపయోగించే వారికి ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కోశ పద్ధతి కూడా ఈ విధానానికి ఉద్దేశించినదే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆదాయాన్ని పునః పంపిణీ చేయడం ఒక ముఖ్య విధానంగా రూపొందింది. ఈ విధానాన్ని రెండు కారణాలవల్ల సమంజసంగా భావించవచ్చు.

i) శ్రేయోరాజ్య సాధనకు

ii) సార్థక డిమాండు కల్పించుటకు

శ్రేయోరాజ్యంలో దేశ ప్రజల శ్రేయోస్సు మెరుగ్గా ఉండి ఆర్థికాభివృద్ధి ఫలితాలు అన్ని వర్గాలకు చేరతాయి. అసమానతలు ఒక హద్దును మించి పెరిగితే సామాన్య ప్రజల వినియోగానికి ఉత్పత్తి చేయబడ్డ వస్తువులకు మార్కెట్టులో సరియైన గిరాకి ఉండదు. ఒక వైపు ధనిక వర్గాలు వాడే విలాస వస్తువులకు గిరాకి ఉండగా మరొకవైపు పేద వర్గాలకు అవసరాలకు సరిపడు కొనుగోలు శక్తి ఉండదు. కాబట్టి కోశ విధానం ద్వారా ఆదాయాన్ని పునః పంపిణీ చేసే పద్ధతి సామాన్యుల వినియోగవస్తువుల సార్థక డిమాండును పెంచడానికి ఉపకరిస్తుంది.

## 1.5 వివిధ ఆర్థిక కార్యకలాపాల మధ్య సంబంధము

### 1.5.1 ఏకపక్ష, ద్విపక్ష ప్రవాహము (Unilateral and bilateral flows)

ప్రజల ఆర్థిక కార్యకలాపాల్లో ప్రభుత్వ జోక్యం ఆవశ్యకమని ఇంతవరకు జరిగిన చర్చ వల్ల తెలుసుకున్నాం. ప్రభుత్వ ప్రైవేటు రంగాలచే నిర్వహించబడుతున్న వివిధ ఆర్థిక కార్యకలాపాల నడుమగల సంబంధాన్ని మనం ఇప్పుడు చర్చిద్దాం. ప్రెస్ట్ (Presl) ఆర్థిక కార్యకలాపాలను రెండు తరగతులుగా వర్గీకరించెను. 1. ఏకపక్ష ప్రవాహాలు 2. ద్విపక్ష ప్రవాహాలు. ప్రభుత్వం వస్తు సేవలను ప్రైవేటు రంగం నుండి మార్కెట్టు యంత్రాంగం ద్వారా కొనుగోలు చేస్తే దానిని ద్విపక్ష ప్రవాహము అంటారు. ఇందు వస్తు సేవలు ప్రైవేటు రంగం నుండి ప్రభుత్వ రంగానికి, నిధులు ప్రభుత్వ రంగంనుండి ప్రైవేటు రంగానికి చేరుతున్నాయి. ఈ వ్యవహారంలో ధర ద్రవ్యం రెండు ఇమిడి ఉన్నాయి. ద్రవ్యం ఒకటే ఇమిడి ఉన్న ప్రవాహాలు కూడా ఉండవచ్చు. ఇంకో మాటలో చెప్పాలంటే ఈ వ్యవహారాలకు (transactions) మార్కెటు యంత్రాంగంతో ఏ విధమైన సంబంధం ఉండదు. వృద్ధాప్య పింఛను, ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు ఇట్టి వ్యవహారాలకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ విధమైన చెల్లింపులను బదిలీ చెల్లింపులు అంటారు. వీటికి మార్కెట్టుతో గాని,ధరతో కాని సంబంధం లేదు.

### 1.5.2 ధనాత్మక మరియు ఋణాత్మక చెల్లింపులు

ఈ చెల్లింపులను ధనాత్మక చెల్లింపులు (positive payments) ఋణాత్మక చెల్లింపులు (negative payments) అని రెండు విధాలు గా వర్గీకరించవచ్చు. వృద్ధాప్య పింఛను నందు ప్రభుత్వ ధనం వ్యక్తులకు చేరుతుంది. ఇట్టి చెల్లింపులను ధనాత్మక చెల్లింపులు అంటారు. అదే విధంగా వ్యక్తులు ప్రభుత్వానికి పన్నులు

చెల్లించడాన్ని ఋణాత్మక చెల్లింపులు అంటారు. ఉదాహరణకు ఆదాయపు పన్ను ప్రభుత్వానికి చెల్లించడం వల్ల వ్యక్తులకు ప్రత్యక్ష లాభముండదు. ఇది ఋణాత్మక చెల్లింపులో చేరుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో సబ్సిడీలు అనే పదం కూడా ఉంది. బదిలీ చెల్లింపులు, సబ్సిడీల మధ్య గల తేడా ఏమిటి? ఒక వస్తువుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే సబ్సిడీకి సమానంగా దాని మార్కెట్టు ధర తగ్గిపోతుంది. ఫలితంగా ఆ వస్తువు నుండి వచ్చే పరోక్ష పన్ను ఆదాయం కూడా అదే అనుపాతంలో తగ్గిపోతుంది. కాబట్టి సబ్సిడీలు ఋణాత్మక పరోక్ష పన్నులకుండే ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇంకో విధంగా చెప్పాలంటే వృద్ధాప్యపింఛను మొదలగు బదిలీ చెల్లింపులు ఋణాత్మక ప్రత్యక్ష పన్నుగాను, సబ్సిడీలను ఋణాత్మక పరోక్ష పన్నుగాను భావించవచ్చు. బదిలీ చెల్లింపులు ప్రజల ఆదాయాన్ని ప్రత్యక్షంగా పెంచితే, సబ్సిడీలు మార్కెట్టులోని వస్తువుల ధరలను తగ్గిస్తాయి. ప్రభుత్వ విత్తంలో ఈ ఏకపక్ష ద్విపక్ష ప్రవాహాలు చాలా ముఖ్యమైనవి. ఇవి ఆర్థిక వనరుల కేటాయింపును కోరదగిన తీరులోకి మారుస్తాయి. పన్నుల వ్యవస్థలో కాని ప్రభుత్వ వ్యయంలో కాని మార్పులు చేసినపుడు ఈ రెండు ప్రవాహాలు ప్రభావితమౌతాయి.

కావున ప్రభుత్వ విత్తం చర్యలు అర్థం చేసుకోవడానికి ఈ క్రింది ప్రశ్నలు ఉపకరిస్తాయి.

1. వనరుల కేటాయింపు సమర్థవంతంగా చేయడానికి ఏకపక్ష ద్విపక్ష విధానాలు అనగా ప్రభుత్వ విత్తం చర్యలు ఎంతవరకు ఉపకరిస్తాయి?

2. ప్రభుత్వ వ్యయం ఋణ విధానాలు ధరల స్థిరత్వాన్ని సంపూర్ణోద్యోగితను సాధించడంలో ఎంతవరకు విజయవంతమౌతాయి.

3. సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఆదాయ పంపిణీని క్రమబద్ధం చేయడంలో ప్రభుత్వ విత్తం చర్యలు ఎంత వరకు తమ ప్రభావాన్ని చూపుతాయి? రాబోవు పాఠాల్లో ఈ విషయాలన్నీ విడివిడిగా చర్చించబడతాయి.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

5. ఏకపక్ష ప్రవాహం అనగా నేమి?
6. ద్విపక్ష ప్రవాహం భావనను వివరించుము.
7. ధనాత్మక, ఋణాత్మక చెల్లింపులలో గల తారతమ్యమును విశదీకరించుము.

---

## 1.6 ప్రభుత్వ విత్తం – నిర్వచనాలు

ప్రభుత్వ విత్తంను చాలామంది అర్థశాస్త్ర వేత్తలు చాలా రకాలుగా నిర్వచించారు. వాటిలో కొన్నిటిని మనం చర్చిద్దాం. ప్రభుత్వ కార్యకలాపాల్లో వచ్చిన మార్పులననుసరించి ప్రభుత్వ విత్తం నిర్వచనం మారుతోంది. సాంప్రదాయక ఆర్థిక వేత్తల రచనల్లో ప్రభుత్వ పాత్ర అతి తక్కువగా ఉండాలనే అభిప్రాయం వెలిబుచ్చారు. "ప్రణాళికల్లో చాలా తక్కువ ఖర్చుచేయబడింది అత్యుత్తమ ప్రణాళికా అని, పన్నుల్లో చాలా తక్కువ విధించబడిందిచాలా మంచి పన్ను" అని 'సే ' (Say) పేర్కొన్నాడు. ఈ అభిప్రాయం ఆ రోజుల్లో అమలులో ఉన్న స్వేచ్ఛా వాణిజ్యవాదం (Laisseze faire) పై ఆధారపడింది.

ప్రభుత్వ విత్తం ప్రభుత్వంచే రాబట్టబడిన నిధులను ప్రభుత్వ ఖర్చుల నిమిత్తం వాడుటకు పరిమితమైన శాస్త్రమని (Plehm) నిర్వచించినాడు. ప్రభుత్వ విత్తం ఎక్కువగా కోశాగార (ట్రెజరి) చర్యలతోను ప్రైవేటు రంగ పని తీరుపై ఈ చర్యల ప్రభావాన్ని గురించి తెలియజేస్తుంది.



B R A O U

'బాస్టబుల్' (Bastable) ప్రకారం " అన్ని దేశాలకు - అభివృద్ధి చెందిన, వెనుకబడ్డ-కొన్ని సదుపాయాలు అవసరం. కనుక ప్రభుత్వ వనరుల సృష్టి మరియు వాడుక ప్రభుత్వ విత్త శాస్త్రం యొక్క విషయం". ఈ నిర్వచనాన్ని బట్టి బాస్టబుల్ కొన్ని వస్తువులను ప్రజలకు సృష్టి చేయడంలో ప్రభుత్వ జోక్యాన్ని సమర్థించినట్లు తెలుస్తోంది. 'ఉర్సుల హిక్సు' (Hicks) ప్రకారం ప్రభుత్వ ప్రైవేటు కార్యకలాపాల మధ్య ఒక ప్రాధమికమైన తేడా ఉంది. వినియోగదారుల ప్రత్యక్ష కోరికలచే నిర్ణయింపబడని వస్తు సేవలను అందజేయుటయే ప్రభుత్వ కార్యకలాపాల ఉద్దేశమని ఆమె నమ్మకం. ఇటువంటి కార్యకలాపాలను తెలియజేయునదే ప్రభుత్వ విత్తం. ఈ నిర్వచనాన్ని బట్టి మార్కెట్ యంత్రాంగంచే నిర్వహింపబడని ప్రభుత్వకార్యకలాపాలకు సంబంధించిన శాస్త్రమే ప్రభుత్వ విత్తం అని తెలుస్తుంది.

ప్రభుత్వ ఆదాయ వ్యయాలను గూర్చియు, ఈ రెండు ఒక దానితో మరొకటి ఎలా సర్దుబాటు చేసుకుంటాయో తెలియజేసే శాస్త్ర మని 'డాల్టన్' నిర్వచనం. ఈ శాస్త్రం అర్థశాస్త్రానికి, రాజనీతి శాస్త్రానికి సరిహద్దుగా ఉండే శాస్త్రమని ఇతని అభిప్రాయం. దీన్ని బట్టి డాల్టన్ ప్రభుత్వ బడ్జెట్ ప్రభుత్వ విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో కంటె సర్దుబాటుకే ఎక్కువ ప్రాముఖ్యమిచ్చినట్టు కన్పిస్తోంది.

కాని ఈ ఆధునిక కాలంలో సంక్షేమ రాజ్య సిద్ధాంతం ప్రాముర్యంలోకి వచ్చింది. దీని ఫలితంగా ప్రభుత్వ విత్తం పరిధి విస్తృతమైంది. నిరుద్యోగాన్ని తగ్గించడం, పంపిణీ న్యాయం చేకూర్చడం, ఆర్థికాభివృద్ధిని సాధించడం ఆధునిక ప్రభుత్వాల విధి. ఇది ప్రభుత్వ విత్తం పరిధిలో కొత్త విధానం. మస్‌గ్రేవ్, బచ్‌నన్ (Buchnan) మొదలైన ఆర్థికవేత్తల అభిప్రాయం. ప్రభుత్వ విత్తం యొక్క మూల సమస్యలు విత్తం సమస్యలు కాదని ప్రభుత్వ బడ్జెట్ అమలు తెలియజేస్తున్న ఆర్థిక విధానమే ఇందలి ముఖ్యాంశమని అభిప్రాయపడిరి. కాబట్టి పన్నులు ప్రభుత్వ వ్యయం, వనరుల కేటాయింపు, ఉత్పాదకత, ధరలు, ఆదాయపంపిణీ, పరిపాలన సామర్థ్యం మొదలైనవి ప్రభుత్వ విత్తంలోని ముఖ్యమైన అంశాలు. ఈ విధమైన పద్ధతిలో ప్రభుత్వ విత్తంను పరిశీలించడాన్ని జాతీయ ఆదాయం లేక ఉద్యోగిత పద్ధతి అంటారు. ఇంతకు పూర్వం చెప్పినట్లుగా ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వ జోక్యం లేనపుడే సమర్థవంతంగా నిర్వహింపబడుతు అభిప్రాయం ఉండేది. ఈ అభిప్రాయం సే యొక్క మార్కెట్ సిద్ధాంతం వల్ల బలపరచబడింది. కాని ఆర్థిక మాంద్యం తరువాత 'కేన్సు' (Keynes) రాసిన జనరల్ థీరి ప్రచురణ అయ్యాక ప్రభుత్వ విత్తంకు చాలా ప్రాతినిధ్యం వచ్చింది. స్వల్పకాలిక సమస్యల పరిష్కారానికి సమతూక బడ్జెట్ కంటె అసమతూక బడ్జెట్‌లే అవసరమని వివిధ దేశాలవారు గుర్తించారు. అసమతూక బడ్జెట్ అనగా వ్యయం ఆదాయాన్ని మించుతుందని కాదు. ఒక్కొక్కప్పుడు ఆదాయం ఖర్చును మించినపుడు కూడా అసమతూక బడ్జెట్ ఉండవచ్చు. సమస్యల పరిష్కారానికి ఇది ఒక సవరణగా ఉపయోగిస్తుంది. ఈ మధ్య మన దేశంలో కూడా అసమతూక బడ్జెట్లే అమలు జరుపబడుతున్నాయి. ఫెడరల్ వ్యవస్థలో ప్రభుత్వ విత్తం కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన ఆర్థిక సమస్యల నన్నిటిని చర్చిస్తుంది.

## 1.7 ప్రభుత్వ విత్తంలో ముఖ్య భాగాలు

ప్రభుత్వ విత్తంలోని విషయాన్ని ఈ క్రింది శాఖలుగా విభజింపవచ్చు.

### 1.7.1 ప్రభుత్వాదాయం

ప్రభుత్వాదాయాన్ని పెంచే వివిధ పద్ధతులను ఈ శాఖ చేపడుతుంది. ప్రభుత్వాదాయం పన్ను రాబడి, ఇతర రాబడులు అనే వాటితో కూడి ఉంటుంది. పన్ను రాబడిని రెండు విధాలుగా విభజించవచ్చు. 1. ప్రత్యక్షపన్నురాబడి 2. పరోక్ష పన్ను రాబడి. ఇతర ఆదాయాల శీర్షిక క్రింద ఫీజులు, జరిమానాలు మొదలైనఅంశాలు ఉంటాయి.



BRAOU

పన్నురాబడిలో పన్నుల అంతిమ ప్రభావం, పన్నుల ప్రభావాన్ని గూర్చి నేర్చుకుంటాం. పన్నులు విధించినపుడు కొనుగోలు శక్తి ప్రజలనుండి ప్రభుత్వానికి బదిలీ అవుతుంది. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, పంపిణీ ఉద్యోగం మొదలగు వాటిపై పన్నుల ప్రభావం ఉంటుంది. దేశీయంగా గాని, అంతర్జాతీయంగా గాని సేకరించిన ఋణాలు కూడా ప్రభుత్వాదాయాన్ని వృద్ధి చేస్తాయి. దీన్ని ప్రభుత్వ ఋణంగా విడిగా తెలుసుకుంటాం.

### 1.7.2 ప్రభుత్వ వ్యయం

ప్రభుత్వ వ్యయాలను గూర్చి విధానాలను గూర్చి ఈ శాఖలో మనం చదువుతాం వివిధాలైన వస్తు సేవల పంపిణీ, డిమాండులపై ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగ పని తీరును కూడా ఇది ప్రభావితం చేస్తుంది. ఆర్థికాభివృద్ధి మాత్రమే గాక దేశంలో సాంఘిక సంక్షేమం స్థిరత్వాన్ని పెంపొందించడమే ప్రభుత్వ వ్యయఉద్దేశ్యం. ఇప్పుడు అనేక కారణాల వల్ల ప్రభుత్వ ఖర్చు పెరుగుతోంది. ప్రభుత్వ వ్యయ నియమాలు. ఆర్థిక వ్యవస్థలో వాని ప్రభావం కూడా ఇందులో చర్చించబడతాయి.

### 1.7.3 ప్రభుత్వ ఋణం

దేశీయంగా ప్రజలనుండిగాని , అంతర్జాతీయంగా గాని ప్రభుత్వం సేకరించే ఋణాలనే ప్రభుత్వఋణం అంటారు. ఇచ్చితంగా చెప్పాలంటే ప్రభుత్వాదాయంలో ప్రభుత్వ ఋణం ఒక భాగం. ఆధునిక ప్రభుత్వాలు పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని ఎదుర్కోవడానికి తగిన ఋణాలను తీసుకుంటున్నాయి. కనుక ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావాలను తెలుసుకోవడానికి వీలుగా ప్రభుత్వ ఋణాన్ని గూర్చి విడిగా తెలుసుకోవడమే మంచిది. ఇతరులనుండి ఋణం తీసుకురావడానికి ప్రభుత్వం అనుసరించే వివిధ పద్ధతులు దీనిలో చర్చించబడతాయి. ప్రభుత్వఋణ చెల్లింపు పద్ధతులు కూడా తెలుసుకుంటాం.

### 1.7.4 విత్త నిర్వహణ

ప్రభుత్వ విత్త కార్యకలాపాల వ్యవహారాలకు ఉపకరించే వివిధ పద్ధతులను ఇందులో చదువుతాం. బడ్జెట్ తయారగు విధానం, పార్లమెంటులో కాని, అసెంబ్లీలో కాని దాన్ని ప్రవేశపెట్టడం, అమలు పరచడం మొదలైన వాటిని కూడా ఇందులో తెలుసుకుంటాం. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల ముందు (ex-ante), వెనుక (ex-post) పరిస్థితులను గూర్చి ఈ అంశంలో చర్చిస్తాం.

BRAOU

### 1.7.5 స్థిరత్వం పెరుగుదల

ఇప్పుడు ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, పెరుగుదలలకు సహాయపడే విధానాలనే అధిక ప్రాధాన్యం కల్పించడమే జరుగుతోంది. ప్రభుత్వ విత్తంలో ఒక భాగంగా ఈ పద్ధతులను జత చేయడం చాలాకాలంగా జరుగుతోంది. కాని ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతోనే స్థిరత్వం పెరుగుదలపై ఏ ప్రభావం ఉందో తెలుసుకోవాలి. అందుకు ఈ విషయం విడిగా చర్చించబడుతుంది.

## 1.8 సారాంశం / ముగింపు

ప్రభుత్వ విత్తంపై ఈ భాగం కేవలం ప్రవేశిక మాత్రమే, కావున ప్రభుత్వ విత్తంలోని ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడం జరిగినది. దీనిలో ప్రభుత్వ విత్తం స్వభావం పరిధి, కొందరు అర్థశాస్త్రజ్ఞులు నిర్వచనాలు

మొదలగునవి విశదీకరించడం జరిగినది. వీటితో బాటు ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వ రుణం మొదలగు భావనలను కూడా తెలుసుకొన్నాము. దీని తదుపరి భాగములో ప్రభుత్వ విత్తం వ్యక్తిగత విత్తంతో ని తేడాలను గమనిస్తాం.

– డా॥ టి. దివాకర రావు

## 1.9 సంప్రదింపు పుస్తకాలు

1. B.P.Tyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Hugh Dalton : Principles of Public Finance
4. తెలుగు అకాడమి : ప్రభుత్వ విత్తం ( పబ్లిక్ ఫైనాన్స్)
5. తెలుగు అకాడమి : ద్రవ్యం - విత్తం.

## 1.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ప్రభుత్వ విత్తం యొక్క స్వభావం, పరిధిని వివరించుము?
2. ప్రభుత్వ విత్తంను నిర్వచిస్తూ దీనిలోని వివిధ భాగాలను వివరించుము.
3. వ్యక్తిగత మరియు సామూహిక వస్తువులకు గల తారతమ్యమును వివరించుము.

II. క్రింది వాటికి సుమారు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. ఏకపక్ష ద్విపక్ష ప్రవాహములకు గల భేదాన్ని గమనించుము.
2. ప్రభుత్వ విత్తం యొక్క మూడు ముఖ్యమైన భాగాలు ఏవి?
3. బహిష్కరణ సూత్రంను వివరింపుము.

•••

BRAOU

# భాగం – 2 : ప్రభుత్వ విత్తం – ప్రయివేటు విత్తం

**విషయక్రమం**

2.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
2.1 పరిచయం
2.2 ప్రభుత్వ, ప్రయివేటు విత్తంల పోలిక
2.3 సారాంశము / ముగింపు
2.4 సంప్రదింపు పుస్తకాలు
2.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 2.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగం ప్రభుత్వ, ప్రయివేటు విత్తంలలోగల పోలికలు, తేడాలను తెలియజేస్తుంది. ఈ భాగం చదివిన తరువాత మీరు ప్రభుత్వ, ప్రయివేటు విత్తం అనగా నేమో విశదీకరించగలరు.

## 2.1 పరిచయం

BRAOU

ప్రభుత్వ, ప్రయివేటు విత్తం మధ్య తేడాలను తెలుసుకోడం ఎంతైనా అవసరం. ప్రభుత్వ విత్తం ప్రభుత్వం లేక ప్రభుత్వ రంగం యొక్క ఆర్థిక సమస్యలను, విధానాలను తెలియజేయగా ప్రయివేటు విత్తం ప్రయివేటు రంగంలోని వ్యక్తులకు సంస్థలకు సంబంధించినది. ఈ రెండింటికి మధ్య కొన్ని పోలికలు, తేడాలు ఉన్నాయి.

ప్రభుత్వ ప్రయివేటు రంగాల కార్యకలాపాలన్నిటిలోనూ వస్తు సేవల క్రయవిక్రయాలకు, ఉత్పత్తి వినిమయము, పెట్టుబడి, మొదలగు వ్యవహారాలను క్రమపద్ధతిలో నుంచుటకు ద్రవ్యం కావాలి. ఆధునిక కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ద్రవ్య చలామణిపై ఆధారపడ్డవే. అన్ని కార్యకలాపాలూ విత్తసంబంధమైన లావాదేవీలతో ముడిపడి వుంటాయి. ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు రెండూ ప్రజల కోర్కెలను తీర్చే వస్తు సేవల ఉత్పత్తిలో పాల్గొంటాయి. ఈ రెండు రంగాలకు కూడా వనరుల కొరత సామాన్య సమస్యకావటంవల్ల అందుబాటులో ఉన్న వనరులను జాగ్రత్తగా వాడటం రెండు రంగాలకూ సామాన్య ధ్యేయమే. పై విషయాలన్నీ ప్రభుత్వ,ప్రయివేటు విత్తం పోలికలను తెలియజేస్తున్నాయి. అట్లే వీటి మధ్యగల తేడాలను కూడా తెలుసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఆధునిక సంక్షేమ రాజ్యాల్లో అనుసరించవలసిన ప్రభుత్వ విధాన చర్యలను అర్థం చేసుకొనేందుకు ఈ తేడాలను తెలుసుకోవాలి. కావున ప్రయివేటు, ప్రభుత్వ విత్తంల మధ్య పోలికలను తేడాలనువిపులంగా పరిశీలిద్దాం.

## 2.2 ప్రభుత్వ, ప్రయివేటు విత్తం పోలికలు, తేడాలు

### 2.2.1 ఆదాయ వ్యయాల మధ్య సర్దుబాటు

'డాల్టన్' చెప్పినట్లు వ్యక్తికి సాధ్యపడే ఖర్చును అతని ఆదాయం నిర్ణయించగా ప్రభుత్వం విషయంలో ఖర్చు ఆదాయాన్ని నిర్ణయిస్తుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తి తన ఖర్చును ఆదాయానికి సరిచేసుకొంటే

ప్రభుత్వం తన ఆదాయాన్ని ఖర్చుకు సరిచేసుకుంటుంది. ఈ తేడాను గురించి చాల చర్చ జరిగింది. వ్యక్తికి కూడా ఎల్లపుడూ తన ఖర్చును ఆదాయానికి సరిచేసుకోవడం సాధ్యంకాదనే వాదనకూడా ఉంది. ఉదాహరణకు కుటుంబయజమానిపై ఆర్థికంగా ఆధారపడిన వారి సంఖ్య పెరిగినచో, మరికొంత కాలాన్ని పనిలో వినియోగించి అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి అతడు ప్రయత్నిస్తాడు. అదే విధంగా పిల్లలు ఆర్జనపరులు కాగానే తన శ్రమను తగ్గించుకొని విశ్రాంతి సమయాన్ని పెంచుకొనేందుకు ప్రయత్నిస్తాడు. ఇంక ప్రభుత్వ విషయం పరిశీలిద్దాం. ముందుగా ఖర్చును అంచనా వేసుకొని దానికి తగిన ద్రవ్య వనరులను సమకూర్చుకోవడం ప్రభుత్వానికి కూడా ఎల్లప్పుడూ సాధ్యం కాదు. ప్రభుత్వం అమితంగా పన్నులు, ఋణాలద్వారా ఆదాయాన్ని సంపాదిస్తే ఆర్థిక వ్యవస్థలో పొదుపు పెట్టుబడులు దెబ్బతింటాయి. అంతేగాక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక వనరులను పెంచడం చాలా కష్టం. చాలామంది ప్రజలు బీదవారు కావడం వల్ల పన్నులు విధింపదగిన సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఇక ఋణాల విషయానికి వస్తే స్వదేశీ ఋణాల ద్వారా ఎక్కువ మొత్తాలను సేకరించడం కష్టం. విదేశీ ఋణాల ద్వారా వనరులను సేకరిస్తే తరువాత కాలంలో ప్రమాదకర ఫలితాలు ఏర్పడతాయి. బడ్జెట్ లోటు ద్వారా వనరులను సేకరిస్తే ద్రవ్యోల్బణ పరిణామాలు తలెత్తే ప్రమాదముంది. కాబట్టి ప్రభుత్వం కూడా ఖర్చును ఆదాయానికి తగినట్లుగా సరిపెట్టుకోవలసిన అవసరం ఉంది. అయితే ఆదాయ వ్యయాల్లో గణనీయమైన మార్పులను తీసుకువచ్చే సామర్థ్యం ప్రభుత్వానికున్నంతగా వ్యక్తికి లేదు. కావున ఆదాయ వ్యయాలను నిర్ణయించుకోవడంలో ప్రభుత్వ ప్రయివేటు విత్తంలకు తేడా ఉంది.

### 2.2.2 మార్కెటు / బడ్జెటు సూత్రం

ప్రయివేటు విత్తం మార్కెటు సూత్రాన్ని అనుసరిస్తుందని ప్రభుత్వ విత్తం బడ్జెటు సూత్రాన్ని అనుసరిస్తుందనీ చెప్పబడుతోంది. మార్కెటు సూత్రం ఆర్థిక హేతువాదం (Rationality) పై ఆధారపడుతుంది. కాని బడ్జెటు సూత్రం విషయంలో ఆదాయాన్ని పెంచడం ఖర్చును నిర్ణయించడం లాభాల అంచనాలపై ఆధారపడదు. ప్రభుత్వ నిర్ణయాలు రాజకీయ పరిపాలన పద్ధతులపై ఆధారపడి శ్రేయోరాజ్య సిద్ధాంతానికి ప్రాధాన్యతనిస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా వాణిజ్య సరళిలోనే నిర్వహించబడాలని లేనిచో అవి నిలదొక్కుకోవడం కష్టమని కొందరు ఆర్థివేత్తల అభిప్రాయం, అయినప్పటికి ప్రభుత్వ విత్త నిర్వహణలో ముఖ్యోద్దేశం సాంఘిక లక్ష్యాల సాధనే.

BRAOU

### 2.2.3 వ్యక్తిగత / సాంఘిక అభిలాష

ప్రభుత్వ విత్త నిర్వహణలో మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలుదృష్టిలో ఉంచుకోబడతాయి. అంతేకాక స్వల్పకాలిక సమస్యలు కూడా దృష్టిలో ఉంచుకోబడతాయి. ప్రభుత్వము చేపట్టే సాంఘిక ఆర్థిక అవస్థాపనా పెట్టుబడులు కొన్ని అల్పకాలిక ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయం కాకపోయినా దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయాలు.ఉదాహరణకు అడవుల వ్యాప్తీకరణ, భూసార రక్షణ, విద్య, ఆరోగ్యం మున్నగు వాటిపై పెట్టుబడి, ఖర్చు, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయమే కాని అల్పకాలిక ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయం కాదు, అదే వ్యక్తి నిర్ణయాల్లో అయితే స్వల్పకాలిక ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. డాల్టన్ చెప్పినట్లుగా పరిపాలకులు భవిష్యత్తును జాగ్రత్తగా వూహించి ఎక్కువ మొత్తాలను భవిష్యత్తుకు కేటాయించాలి. ప్రైవేటు వ్యక్తులు భవిష్యత్తుకు అంత ప్రాధాన్యత నీయలేరు.

### 2.2.4 అంతర్గత మరియు బహిర్గత ఋణాలు

ప్రభుత్వం దేశ ప్రజలనుండి అప్పు తీసుకోగలదు. దీనినే స్వదేశీ ఋణం అంటారు. సాధారణంగా ప్రభుత్వ

ఋణాలపై వడ్డీ రేటు వ్యక్తుల ఋణాలపై వడ్డీరేటుకంటె తక్కువగా ఉంటుంది. ఇది సహజమే. ఏమంటే ప్రభుత్వానికి వ్యక్తులకంటే పరపతి సామర్థ్యం (Credit worthiness) ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వము కేంద్రబ్యాంకు యితర ఆర్థిక సంస్థలు యిచ్చే సదుపాయాలను వాడుకొని స్వదేశీ ఋణాలను పొందవచ్చును.

ప్రభుత్వం స్వదేశీ ఋణాలనే గాక విదేశీ ఋణాలను కూడా సేకరించగలదు. కాని వ్యక్తి విషయంలో ఇలా రెండు రకాలైన ఋణాలకు తావుండదు. అతడు ఇతరుల నుండి మాత్రమే ఋణాలను సేకరించగలడు. తననుండి తాను ఋణం సేకరించడం అనే దానికి అర్థం లేదు.

## 2.2.5 న్యాయబద్ధ ద్రవ్య తయారీ

కరెన్సీ ముద్రణాధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ప్రయివేటు వ్యక్తులకు గాని సంస్థలకు గాని అట్టి హక్కు ఉండదు. ద్రవ్యం లోహ రూపంలో ఉన్నప్పుడు ద్రవ్యాన్ని సృష్టించడంలో కొంత పరిమితి ఉండేది. కాని కాగితపు కరెన్సీ వచ్చాక ఈ పరిమితి పోయింది. ప్రభుత్వానికి ఆదాయం అవసరమయినప్పుడల్లా ద్రవ్యాన్ని సృష్టించగలదు. కాని ఈ చర్య అవాంఛనీయ పరిణామాలకు దారితీస్తుంది. ఈ విధంగా ప్రభుత్వ వ్యయం పెరిగినట్లయితే మార్కెటులోని వస్తు సేవల్లో ఎక్కువ భాగం ప్రభుత్వంచే కొనబడి మిగిలిన ఆర్థిక వ్యవస్థకు తక్కువ వస్తు సేవలను ఎక్కువ ద్రవ్యానికి అందచేస్తుంది. ఈ పరిస్థితి చాలా ప్రశ్నలకు దారితీస్తుంది. (1) ప్రభుత్వంచే కొనబడిన వస్తు సేవలు ఏ విధంగా ఉపయోగించబడుతున్నాయి? ప్రభుత్వ పంపిణీకి, మూలధన సంచయానికా లేక సామాజిక వినియోగానికా? (2) వస్తు సేవలకై పెరిగిన ప్రభుత్వ డిమాండు మార్కెటు ధరల స్థిరీకరణకు దారితీస్తుందా? (3) ద్రవ్యాన్ని సృష్టించడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని సాధించడం వల్ల ఏర్పడే అల్పకాలిక దీర్ఘకాలిక ఫలితాలేమిటి? ఈ అంశాలన్నింటిని పరిశీలిస్తే ప్రభుత్వం వ్యయానికవసరమయ్యే ద్రవ్యాన్ని సంపాదించడానికి కరెన్సీని విస్తృత పరచడం ఎల్ల వేళలా కోరదగినది కాదని తెలుస్తుంది. ఐనప్పటికి ప్రభుత్వానికున్న ఈ కరెన్సీ ముద్రణాధికారం ప్రభుత్వ, ప్రైవేటు ఆర్థిక విధానాలకు గల మూలభూతమైన తేడాను తెలియచేస్తుంది.

## 2.2.6 ప్రజాసంక్షేమము లేదా వ్యక్తిగత ఉపాంత ప్రయోజనం

వ్యక్తి తన ఆదాయాన్ని వివిధ వస్తు సేవలపై ఖర్చు పెట్టేటప్పుడు ప్రతి రూపాయి నుండి వచ్చే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండేటట్లు తద్వారా మొత్తం ప్రయోజనం గరిష్టమయ్యేటట్లు తన వ్యయాన్ని కేటాయిస్తాడు. దీనినే సమోపాంత ప్రయోజన సూత్రం అంటారు. ప్రభుత్వం వ్యయం యొక్క ఉపాంత ప్రయోజనాన్ని పరాశ్రయ ప్రమాణమైన అంచనా వేయడంలో ప్రజా శ్రేయస్సును లేదా సాంఘిక సంక్షేమాన్ని లెక్కలోకి తీసుకొంటుంది. కాని వ్యక్తి ఆత్మాశ్రయ ప్రమాణమైన ప్రయోజనాన్ని పరాశ్రయ ప్రమాణమైన ధరలో ముడిపెట్టివ్యయాన్ని నిర్ణయిస్తాడు. కాని వివిధ ప్రభుత్వ వ్యయాలనుండి సాంఘిక సంక్షేమ రూపంలో లభించే ఉపాంత ప్రయోజనాలను సమానం చేయడానికి అనేక అడ్డంకులున్నాయి. ప్రభుత్వ వ్యయ కేటాయింపుకు పోటీ పడే వివిధ శాఖలనుండి వచ్చే డిమాండు, రాజకీయ వత్తిడులు ఈ సిద్ధాంతాన్ని అమలు చేయడంలో ఆటంకంగా ఉంటాయి.

## 2.2.7 ఆదాయ పెంపుదల విధానం

ప్రభుత్వానికి నిర్బంధ పద్ధతుల ద్వారా ఆదాయాన్ని పెంచుకొనే శక్తి ఉంది. ప్రభుత్వం విధించే పన్నులను ప్రజలు తిరస్కరించలేరు. ప్రయివేటు వ్యక్తులు గాని సంస్థలుగాని ఇతరులనుండి బలవంతంగా ధనాన్ని వసూలు

చేయలేరు. కాని వ్యక్తి కూడా కొన్ని మార్గాల ద్వారా పన్ను చెల్లింపునుండి తప్పించుకోవచ్చని ఒక వాదం ఉంది. ఉదాహరణకు వస్తువులపై పన్నులను ఆ వస్తువులను కొనకపోవడం ద్వారా తప్పించుకోవచ్చు. ఆస్తిని పెంచుకోకపోవడం ద్వారా మరణ సుంకాలనుండి తప్పించుకోవచ్చు. కానీ ఈ మార్గాలన్నీ ఆచరణ యోగ్యం కావు. అలాగే ఏకస్వామ్య శక్తి ఉన్నప్పటికీ వ్యాపార సంస్థలు కొనుగోలు దారులపై ధరలను రుద్దడం ద్వారా అన్ని సందర్భాల్లోనూ కుదరదు. ఏది ఏమైనా నిర్బంధ పద్ధతులను అనుసరించగల శక్తి ప్రభుత్వానికున్నంతగా ప్రయివేటు వ్యక్తులకు సంస్థలకు ఉండదు.

### 2.2.8 రహస్య మరియు ప్రచార విధానం

ప్రభుత్వ విత్త విషయాలకు రహస్యమనేది లేదు. కాని వ్యక్తి ఆదాయ వ్యయాలు ఇతరులకు తెలియనవసరం లేదు. వ్యక్తి తన విత్త విషయాలు యితరులకు తెలియడం యిష్టపడక పోవచ్చు. ప్రభుత్వం విషయంలో ఆదాయ వ్యయాలు అందరికీ తెలుస్తాయి. ప్రభుత్వ బడ్జెటులను ఎవరైనా విమర్శించవచ్చు. కాని ప్రభుత్వ విత్తాలను గురించి యిటువంటి ఆలోచన అన్ని వేళలా సరియైనది కాదు. దేశ రక్షణకై ప్రభుత్వం చేసే ఖర్చు పూర్తిగా తెలియజేయబడదు. అయినప్పటికీ ఆసక్తిగలవారు ప్రయివేటు విత్తాలను గూర్చి కంటె ప్రభుత్వ విత్తాలను గూర్చి తెలుసుకునేందుకే ఎక్కువ అవకాశం ఉంది.

### 2.2.9 ప్రస్తుత వనరుల పంపిణీ

ఇంతవరకు ప్రభుత్వ ప్రయివేటు విత్తాల భేదాలను స్థూలంగా తెలుసుకున్నాం. ఇప్పుడు వనరులను వేర్వేరు ఉపయోగాలకు కేటాయించడంలో ప్రయివేటు విత్త నిర్వహణకు ప్రభుత్వ విత్త నిర్వహణకు గల భేదాలను తెలుసుకుందాం. సౌలభ్యం కోసం ఉత్పాదక వనరుల సప్లై స్థిరమైనదని పూహిద్దాం. ప్రయివేటు రంగంలో వనరుల సమర్థవంతమైన కేటాయింపులో పరిపూర్ణ పోటీ ప్రాముఖ్యత వహిస్తుంది. ఉదాహరణకు అమ్మకం ద్వారా వచ్చే ఉపాంత ఆదాయం ఉత్పత్తి యొక్క ఉపాంత వ్యయానికి సమానమైనచో అభిలషణీయ మైన ఉత్పత్తి స్థాయిని సాధించామని అనుకోవాలి. అనగా ప్రతి ఉత్పత్తి కారకం యొక్క ఉపాంత వ్యయం ఆ కారకం యొక్క ఉపాంత ఉత్పాదనకు సమానం అని అర్థం. ప్రయివేటు విత్త నిర్వహణలో వనరుల కేటాయింపు వస్తువుల తయారీలోనూ వినియోగంలోనూ ఏర్పడే సామాజిక లాభనష్టాలపై ఆధారపడి ఉండదు. ఇంకో విధంగా చెప్పాలంటే సాపేక్ష ఉపాంత ప్రయివేటు ఉత్పత్తులను సాపేక్ష ఉపాంత కారకాల ధరలకు సమానం చేసినంత మాత్రాన సమాజ శ్రేయస్సు దృష్ట్యా అభిలషణీయమైన కారకాల కేటాయింపు జరగదు. ప్రభుత్వ విత్త నిర్వహణలో సామాజిక లాభనష్టాలు పరిగణింపబడతాయి కనుక వనరులు అత్యుత్తమంగా కేటాయింపబడతాయి.

ప్రయివేటు విత్త నిర్వహణలో వనరులు సాపేక్ష ధరలని బట్టి వాడబడతాయి. ఉదాహరణకు ప్రయివేటు వ్యవస్థాపకుడు తాను ఉత్పత్తి చేసిన వస్తు సేవలకు వినియోగాన్ని బట్టి ధర నిర్ణయిస్తాడు. వినియోగదారులకు లభించే ప్రయోజనాలను కొలవవచ్చు. కాని కొన్ని ప్రభుత్వ విత్త నిర్వహణల్లో ధరల యంత్రాంగం ద్వారా వనరులకేటాయింపుసాధ్యంకాదు. ఉదాహరణకు రక్షణ వ్యయంవల్ల ఒక వ్యక్తి ఎంత ప్రయోజనాన్ని పొందుతున్నాడో చెప్పలేము. అలాగే విద్య విషయంలో కూడా పూర్తి వ్యయాన్ని వ్యక్తులనుంచి రాబట్టడం కోరదగింది కాదు. వనరుల కేటాయింపు ప్రయివేటు లాభనష్టాలు ఆధారంగా నిర్ణయించేటప్పుడు పన్నులపై కంటే ధరలపై ఆధారపడుట మంచిది. కాని సామాజిక లాభ నష్టాలు తటస్థ పడినపుడు ప్రభుత్వ విత్త నిర్వహణలో పన్నుల వ్యవస్థలో మార్పుల ద్వారా గాని ప్రభుత్వ వ్యయంలో మార్పుల ద్వారా గాని వనరుల కేటాయింపు జరుగుతుంది. దీనిని బట్టి ప్రయివేటు రంగానికి ముఖ్య ఆదాయ మార్గం డిమాండు ఉత్పత్తి వ్యయాలచే నిర్ణయించబడిన ధరలనియు, ప్రభుత్వానికి ముఖ్య ఆదాయ మార్గం పన్నులనియు తెలుస్తోంది.

BRAOU

### 2.2.10 సబ్సిడీలు మరియు బదిలీలు

ప్రయివేటు ప్రభుత్వ విత్త నిర్వహణల్లో బదలాయింపులు సబ్సిడీల విషయంలో కూడా తేడాగా ఉంటాయి. ఇది ప్రభుత్వ రంగ వ్యయాల పరిధికి సంబంధించినది. బదలాయింపులు, సబ్సిడీలు వనరులను ఒక ప్రయోజనం నుండి మరొక ప్రయోజనానికి మరలించడానికి ఉపయోగిస్తాయి. ప్రయివేటు వ్యయంలో ఇటువంటి సదుపాయం లేదు.

### 2.2.11 పర్యవేక్షణ మరియు నియంత్రణ

ఈ సందర్భంలో మరో ముఖ్య విషయం ఏమంటే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రయివేటు విత్త నిర్వహణ ప్రభుత్వంచే క్రమబద్ధం చేయబడుతుంది. మరో మాటలో చెప్పాలంటే ప్రభుత్వ విత్త నిర్వహణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం వివిధ ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధం చేసి గరిష్ఠ సంక్షేమాన్ని సాధించడమే. దీనికై ప్రభుత్వం ప్రయివేటు రంగానికి చెందిన ఆర్థిక కార్యకలాపాలను తనిఖీ చేస్తుండాలి. అమెరికా, బ్రిటన్ మొదలగు పెట్టుబడిదారీ దేశాల్లో మార్కెటు యంత్రాంగం ప్రాధాన్యత వహించడం వల్ల ప్రయివేటు విత్త నిర్వహణలో ప్రభుత్వ అజమాయిషీ చాల తక్కువగా ఉంటుంది.

## 2.3 ముగింపు

ప్రయివేటు ప్రభుత్వ విత్తాల పోలికల కంటే తేడాలు చాలా ముఖ్యమైనవని పై చర్చ ద్వారా తెలుస్తోంది. ఆధునిక కాలంలో ప్రయివేటు సంస్థలు కూడా ప్రభుత్వ సంస్థల వలే వనరులను సమీకరించగలుగుతున్నాయి. ఉదాహరణకు ప్రయివేటు సంస్థలు బాండ్లు, షేర్లు, డిబెంచర్లు మొదలగు వాని ద్వారా తమ విత్త నిర్వహణకు కావలసిన వనరులలో అధిక భాగాన్ని సమీకరిస్తున్నాయి. కాని పన్నుల విధింపువంటి నిర్బంధ పద్ధతులను అనుసరించే అవకాశం ప్రయివేటు సంస్థలకు లేదు. అంతేగాక ప్రయివేటు విత్త నిర్వహణలో కంటె ప్రభుత్వ విత్త నిర్వహణలో సాంఘిక బాధ్యత ఎక్కువగా ఉంటుంది.

— డా॥ టి. దివాకరరావు

## 2.4 సంప్రదించు పుస్తకాలు


| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | Hugh Dalton | : | Principles of Public Finance |
| 4. | తెలుగు అకాడమి | : | ప్రభుత్వ విత్తం |


## 2.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. ప్రభుత్వ, ప్రయివేటు విత్తంనకు గల పోలికలను గుర్తింపుము.

II. ఈ క్రింది ప్రశ్నకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. ప్రభుత్వ, ప్రయివేటు విత్తంనకు గల తేడాలను లెక్కింపుము.

B R A O U

Dr. BRAOU
LIBRARY
Acc. No: CM-0459
Class No: 330
6&m

# భాగం – 3 : గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతము

**విషయక్రమం**


3.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

3.1 పరిచయం

3.2 గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతము

- 3.2.1 ప్రమేయాలు
- 3.2.2 సిద్ధాంతము
- 3.2.3 ప్రభుత్వ ఆదాయ వ్యయ కేటాయింపు
- 3.2.4 పరిమితులు

3.3 గరిష్ట సాంఘిక సూత్ర పరీక్ష

3.4 సారంశము / ముగింపు

3.5 సంప్రదించు పుస్తకాలు

3.6 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 3.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఒక దేశంలో ప్రభుత్వ విత్తం యొక్క పనితీరును గరిష్ట సాంఘిక ప్రయోజనం ద్వారా విశదపరచడం ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకోగలుగుతారు.

- ఏఏ ప్రమేయాలపై గరిష్ట సాంఘిక ప్రయోజనం ఆధారపడి ఉంటుంది.
- గరిష్ట సాంఘిక ప్రయోజనంను విశదీకరించడం
- ఈ సూత్రం యొక్క పరిమితులను వివరించడం
- గరిష్ట సాంఘిక ప్రయోజన పరీక్షలను విశ్లేషించడం

## 3.1 పరిచయం

ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వం జోక్యం అవసరమనే విషయం ముందు పాఠాల్లో తెలుసుకున్నాం. ప్రభుత్వ కార్యకలాపాలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వ బడ్జెట్ లో వ్యయభాగం విపరీతంగా పెరిగిపోయింది. ఇలా పెద్ద మొత్తాల్లో ఉండే ప్రభుత్వ వ్యయాన్ని ఎదుర్కొనేందుకు అదనపు పన్ను విధింపు వల్ల గాని ప్రభుత్వ ఋణాన్ని పెంచడం ద్వారా గాని పెద్ద మొత్తంలో ఆదాయాన్ని పెంచవలసి వచ్చింది. కాని, ప్రభుత్వ ఋణం ద్వారా గాని, పన్నుల విధింపు ద్వార కాని పెంచితే వ్యక్తుల వద్ద నుండే ద్రవ్యం తగ్గిపోతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే వివిధ అంశాలపై ప్రభుత్వం ఖర్చు చేసేందుకు వనరులు ప్రైవేటు వ్యక్తులనుండి ప్రభుత్వానికి బదిలీ చేయబడతాయి. ఈ ప్రక్రియ ప్రజలపై ఎట్టి ప్రభావం చూపుతోంది? వారు ప్రయోజనం పొందుతున్నారా? అనేది చాలా ముఖ్యమైన విషయం. ప్రభుత్వం పెద్ద మొత్తపు వ్యయంతో కూడిన కార్యక్రమాన్ని చేపట్టినపుడు ద్రవ్యం



BRAOU

ప్రభుత్వం నుండి ఉత్పత్తి కారకాల యజమానులకు ప్రవహిస్తుంది. ప్రభుత్వ వ్యయం ఉత్పాదక ఆస్తులను సృష్టించడానికి కాని వృద్ధాప్య పింఛను మొదలైన బదిలీ చెల్లింపులకు గాని ఉపయోగించవచ్చును. ప్రభుత్వవ్యయ విధానం ఏదైనా అది సమాజానికి కొన్ని ప్రయోజనాలను చేకూరుస్తుంది. ప్రభుత్వ విత్త వ్యవహారాల లాభనష్టాలను జాగ్రత్తగా విశ్లేషించి ఆర్థిక వ్యవస్థను ఎంతవరకు క్రమబద్ధం చేస్తున్నామో పరిశీలించాలి.

## 3.2 గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతము

ప్రాచీన కాలంలో ప్రభుత్వం యొక్క విధులు తక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వబడలేదు. ప్రభుత్వ విధులు చాలా తక్కువగా నుండటం వల్ల (పోలీసు రాజ్య విధులు) పన్నుల రూపంలో చాలా తక్కువ మొత్తాన్ని వసూలు చేసి ప్రభుత్వ వ్యయ కార్యక్రమంపై కూడా చాలా తక్కువ ధనాన్ని ఉపయోగించేవారు. "ప్రణాళికల్లో అత్యుత్తమమైనది కనిష్ట వ్యయంతో కూడినది. పన్నుల్లో అత్యుత్తమమైనది కనిష్ట మొత్తాన్ని వసూలు చేసేదని" 'జె.బి.సే' అభిప్రాయం. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం నిర్వహించవలసిన పాత్ర చాలా తక్కువ అనే విషయాన్ని ఈ అభిప్రాయం (statement) బలపరుస్తోంది. పన్ను విధింపువల్ల తగ్గిపోయే ప్రైవేటు వ్యయం ఉత్పాదకమైనదనియూ పన్ను విధింపు ద్వారా సమకూర్చబడిన ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమైనదనియూ ఆడం స్మిత్, రికార్డో వంటి సాంప్రదాయ ఆర్థిక వేత్తలు అభిప్రాయపడిరి. కాని డాల్టన్ చెప్పినట్లు " ఈ భేదా చాలాకాలంగా తిరస్కరించబడింది. ఏ ఖర్చుకైన ఉత్పాదకత పరీక్ష సంఘ ప్రయోజనమే. ఈ దృష్టితో పరిశీలిస్తే విద్య ఆరోగ్యాలపై చేయు ప్రభుత్వ వ్యయం విలాసాలపై చేయు ప్రైవేటు వ్యయం కంటె ఎక్కువ ఉత్పాదకరమైనది". ఆధునిక శ్రేయోరాజ్యాలు అనేక విధులను నిర్వహించాలి. కనుక ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమైనదనీ (unproductive) పన్నులన్నీ హానికరమైనవనే ఈ వాదనకు ఇప్పుడు విలువ లేదు. బడ్జెట్ విధానాలు , ఋణవిధానాలు ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేసేవిగా ప్రాముఖ్యాన్ని పొందాయి. ముఖ్య వస్తు సేవల డిమాండు సప్లైలు ప్రభుత్వ విత్త చర్యం వల్ల ప్రభావితమై దేశం యొక్క జాతీయాదాయాన్ని ప్రభావితం చేస్తాయి. కావున ప్రభుత్వ విత్త కార్యక్రమాలు సమాజంలోని ప్రజలకు గరిష్ట ప్రయోజనాన్ని లేదా సంక్షేమాన్ని కల్పించేటట్లుగా తీర్చిదిద్దబడాలి. ఈ లక్ష్య సాధనకు అనుసరించబడుతున్న సూత్రాన్నే ప్రభుత్వ విత్త సూత్రం లేదా గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రం (principle of maximum social advantage) అని అంటారు.

BRAOU

### మీ అవగాహనను పరీక్షించుకోండి

1. గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతము అనగానేమి?

### 3.2.1 ప్రమేయాలు

*గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రాన్ని విశ్లేషించడానికి ఈ క్రింది ప్రమేయాలు చేయడం జరిగింది.*

మొదటగా ప్రభుత్వాదాయం పన్నుల వల్ల సమకూడినదే కాని కానుగోలు, ఋణాలు ఫీజులు మొదలైన ఇతర రకాలతో కూడినది కాదని అనుకొందాం. ఇక రెండవది పన్నులు ఉపాంత ఋణాత్మక ప్రయోజనం (ఉపాంత సాంఘిక ఋణాత్మక ప్రయోజనం) పెంచేవిగాను ప్రభుత్వ వ్యయం క్షీణోపాంత ప్రయోజనానికి (ఉపాంత సాంఘిక ప్రయోజనం) లోనైనదిగా ఊహిద్దాం. ప్రజలనుండి ఎక్కువ పన్నులు వసూలు చేయడం వల్ల ఉపాంత సాంఘిక ఋణాత్మక ప్రయోజనం పెరుగుతుందని, ప్రభుత్వం ఎక్కువ ధనాన్ని ఖర్చు పెట్టడం వల్ల ప్రజల ఉపాంత సాంఘిక ప్రయోజనం తగ్గుతుందని ఈ ప్రమేయపు అర్థం. ఇంకో మాటలో చెప్పాలంటే పన్నులు వనరులను ప్రైవేటు

వ్యక్తులనుండి ప్రభుత్వానికి మరలించగా ప్రభుత్వ వ్యయం మొదట సంఘ శ్రేయస్సుకు అవసరమైన అంశాలపై వెచ్చించబడుతుంది.

### 3.2.2. సిద్ధాంతము

ప్రభుత్వ విత్త చర్యల ద్వారా ప్రజల కొనుగోలు శక్తిలో మార్పులు తేవచ్చును. ఉదాహరణకు లోటు బడ్జెట్ వల్ల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అట్లే మిగులు బడ్జెట్ ద్వారా కొనుగోలు శక్తి తగ్గును. కొనుగోలు శక్తిలో వచ్చు మార్పుల వల్ల వివిధ వర్గాల మధ్య సంపద పంపిణిలో మార్పులు వస్తాయి. కావున ప్రభుత్వ విత్త చర్యలు అధిక సంక్షేమానికి దారితీస్తే ఆ చర్యలు కోరదగినవి. అలా కాకపోతే ఆ చర్యలు కోరదగినవి కావు. డాల్టన్ అభిప్రాయంలో "గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని కలుగజేసే ప్రభుత్వ విత్త చర్యలు అత్యుత్తమ ప్రభుత్వ విత్త పద్ధతి".

ఈ ఆలోచన ప్రకారం ప్రతి అదనపు రూపాయి ఖర్చు వల్ల సాంఘిక లాభం తగ్గుతుందని పన్నుగా తీసుకున్న ఉత్పత్తి అదనపు రూపాయి వల్ల సాంఘిక ఋణాత్మక ప్రయోజనం పెరుగుతుందని చెప్పవచ్చు. ఈ ప్రక్రియలో వ్యయం వల్ల కలిగిన అదనపు ప్రయోజనం పన్ను విధింపు వల్ల కలిగిన అదనపు త్యాగానికి సమానం అవుతుంది. ఈ స్థితిలో ప్రభుత్వ విత్త చర్యం వల్ల గరిష్ట సాంఘిక సంక్షేమమేర్పడుతుంది. అంటే ప్రభుత్వ పన్ను మరియు వ్యయ కార్యక్రమాలు అభిలషణీయ స్థాయిలో ఉన్నాయని అర్థం. ఈ అభిప్రాయాన్ని ఈ క్రింది పటం ద్వారా తెలియజేయవచ్చును.




పటము 3.1

ఈ పటంలో OX అక్షం పన్నుల వల్ల వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ వ్యయాన్ని తెలియజేస్తుంది. OY అక్షం వ్యయం ద్వారా లభించే ఉపాంత సాంఘిక ప్రయోజనాన్నీ పన్నుల వల్ల ఏర్పడే ఉపాంత సాంఘిక త్యాగాన్ని

తెలియజేస్తుంది. పైన చెప్పినట్లుగా అధిక పన్నులు ఎక్కువ ఉపాంత త్యాగానికి దారితీస్తాయి. ఈ విషయాన్ని పైకి వాలి ఉన్న $SS_1$ రేఖ తెలియజేస్తుంది. ఇదే మాదిరిగా ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలు పెరిగే కొద్దీ ఉపాంత సాంఘిక ప్రయోజనం తగ్గుతుంది. ఈ విషయం క్రిందకు వాలుతున్న $BB_1$ రేఖ ద్వారా తెలుస్తోంది. పన్నుల విధింపువల్ల OM ఆదాయం సమకూర్చబడి ప్రభుత్వ విత్త చర్యలవల్ల వ్యయం చేసినపుడు ఈ రెండు రేఖలూ ఖండించుకుంటున్నాయి. ఈ స్థితిలో ప్రభుత్వ విత్త చర్యల వల్ల సంఘానికి గరిష్ఠ ప్రయోజనం చేకూరుతుంది.

ప్రభుత్వం $OM_1$ ద్రవ్యాన్ని రాబట్టి ఖర్చు చేసిందనుకోండి దీని ఫలితమేమిటి? ఈ స్థితిలో పన్నుల వల్ల కలిగిన ఉపాంత త్యాగం వ్యయం వల్ల కలిగే ఉపాంత ప్రయోజనం కంటె తక్కువగా ఉంటుంది. కాబట్టి పన్నుల ద్వారా మరికొంత ఆదాయాన్ని రాబట్టివ్యయం చేసి సాంఘిక ప్రయోజనాన్ని పెంచవచ్చు. అలాగే ప్రభుత్వం $OM_2$ ద్రవ్యాన్ని సమీకరించి ఖర్చు చేసినచో ఏమగును? ఉపాంత సాంఘిక లాభం ఉపాంత త్యాగం కంటే తక్కువగా ఉంటుందని తెలుస్తోంది. కాబట్టి OM ద్రవ్యాన్ని సమీకరించి ఖర్చు చేసినప్పుడే అభిలషణీయ (optimum) పరిస్థితి ఏర్పడుతోందని తెలుస్తోంది. ఈ స్థితిలో ఉపాంత త్యాగమూ, ఉపాంత ప్రయోజనమూ సమానమై గరిష్ఠ సాంఘిక ప్రయోజనం ఏర్పడుతుంది.

### 3.2.3 ప్రభుత్వ ఆదాయ వ్యయాల కేటాయింపు

గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రం ప్రభుత్వ విత్త చర్యలు ఎంతవరకు విస్తరించాలో తెలియజేయడమే కాకుండా ప్రభుత్వ ఆదాయాన్ని ఎలా ఎంచాలో ప్రభుత్వ వ్యయాన్ని వివిధ అంశాలకు ఎలా కేటాయించాలో కూడా తెలియజేస్తుంది. ఇప్పుడు ఈ విషయాలను పరిశీలిద్దాం.

ప్రభుత్వ వ్యయం ప్రతి అంశం నుండి వచ్చే ఉపాంత సాంఘిక ప్రయోజనం సమానంగా ఉండేటట్లు కల్పించబడాలి. అనగా సమ ఉపాంత ప్రయోజన సూత్రాన్ని అనుసరించాలి. ఒక ప్రయోజనం నుండి లభించే ఉపాంత ప్రయోజనం మరొక ప్రయోజనం నుండి లభించే ఉపాంత ప్రయోజనం కంటె ఎక్కువగాఉంటే మొత్తం ప్రయోజనం గరిష్ఠం కాదు. ఈ స్థితిలో ప్రభుత్వం మొదటి అంశంపై ఖర్చును పెంచి రెండవ అంశంపై తగ్గించాలి. ఈ విషయాన్ని పటం ద్వారా తెలియజేయవచ్చు.




పటం 3.2



B R A O U

ఈ పటంలో $AA_1$ రేఖ A అంశంపై వేయబడిన వ్యయం వల్ల కలిగేఉపాంత ప్రయోజనాన్ని సూచిస్తుంది. అలాగే $BB_1$ రేఖ B అంశంపై వేయబడిన వ్యయం యొక్క ఉపాంత ప్రయోజనాన్ని సూచిస్తుంది. ప్రభుత్వం $OM_1$ ద్రవ్యాన్ని A పైనా $OM_2$ ద్రవ్యాన్ని B పైనా ఖర్చు చేసి వీటి వలన కలుగు ఉపాంత ప్రయోజనాలను సమానం చేస్తుంది. ఈ స్థితిలో సమాజానికి చేకూరే మొత్తం ప్రయోజనం గరిష్ఠ స్థాయిని చేరుతుంది. ఇప్పుడు వ్యయపద్ధతిని తారుమారు చేసి చూద్దాం. దీనివల్ల B నుండి కలిగే ఉపాంత ప్రయోజనం A నుండి కలిగే ఉపాంత ప్రయోజనం కంటె ఎక్కువగా ఉంటుంది. మొదటి పరిస్థితిలో మొత్తం ప్రయోజం $OM_1P_1A + OM_2P_2B$ కాగా రెండవ పరిస్థితిలో $OM_1NB + OM_2DA$ అవుతుంది. ఈ విధంగా మొత్తం ప్రయోజనం $P_1DP_2N$ మేరకు తగ్గుతుంది. కావున మొత్తం ప్రయోజనాన్ని గరిష్ఠ స్థాయికి చేర్చేందుకు AB ల నుండి వచ్చే ఉపాంత ప్రయోజనాలు సమానమయ్యే రీతిలో వ్యయాన్ని నిర్ధారణ చేయాలని తెలుస్తోంది.

పన్నుల విధింపు విషయంలో కూడా గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రం నిర్దేశించేదేమంటే – వివిధ అంశాలపై పన్నులు ప్రతి అంశం వల్ల కలిగే ఉపాంత త్యాగాన్ని సమానం చేసే రీతిలో ఉండాలి. అట్టి స్థితిలో మొత్తం త్యాగం కనిష్ఠ స్థాయిలో ఉంటుంది. ఈ విషయాన్ని కూడా పటం ద్వారా చూపవచ్చు.




పటం 3.3

పైపటంలో పన్నులు OX అక్షంపైనా, ఉపాంత త్యాగం OY అక్షం పైనా చూపబడింది. ప్రభుత్వం A అంశం నుండి $OM_1$ మొత్తాన్ని B అంశం నుండి $OM_2$ మొత్తాన్నీ పొందితే సంఘం యొక్క మొత్తం త్యాగం కనిష్ఠ స్థాయిలో ఉంటుంది. మొత్తం త్యాగం పటంలో చూపినట్లు $OM_1P_1A$ (A నుండి) + $OM_2P_2B$ (B నుండి) కి సమానం. ప్రభుత్వం పన్నులు విధించే రీతిని మార్చితే ఏమౌతుంది? మొత్తం త్యాగం $OM_1KP$ (Bనుండి) + $OM_2DA$ (A నుండి) కు సమానమగును. మొత్తం త్యాగం $DP_1KP_2$ మేరకు పెరిగిందనే విషయం స్పష్టము.

3.2.4 పరిమితులు

గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రంలోని పరిమితులు పరిశీలిద్దాం.

1. ప్రయోజనాలనూ, త్యాగాలనూ కొలవడం చాలా కష్టం, ఏమంటే ఇవి ఆత్మాశ్రయానికి సంబంధించినవి. ప్రభుత్వం ప్రజలను విదేశీ దండయాత్రల నుండి, దేశీయ కల్లోలా నుండి రక్షించాలనే విషయాన్ని అంగీకరిస్తే సమాజానికి వచ్చే ప్రయోజనం దానిపై అయ్యే ఖర్చు కంటే ఎక్కువగానే ఉంటుంది. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ రక్షణ లేకుండా ఉత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టలేరు. కావున ప్రభుత్వ విత్త కార్యకలాపాల ప్రయోజనాలను త్యాగాలతో బేరీజు వేసి చర్చించడం సమంజసం కాదు.

2. గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రంలో ప్రతి పన్నూ సంఘంపై భారం గానూ ప్రతి ప్రభుత్వ వ్యయం సాంఘిక ప్రయోజనకారిగాను ఊహించబడుతుంది. కాని ఈ విధంగా సామాన్యీకరించలేము. ఉదాహరణకు మత్తు పదార్థల వినియోగంపై విధించే పన్నును సంఘంపై భారం మోపే దానిగా ఊహించరాదు. అలాగే అనవసరయుద్ధాలపై చేయు ప్రభుత్వ వ్యయాన్ని ప్రయోజనకారిగా తలచరాదు.

3. ప్రతి ప్రభుత్వ వ్యయానికి దాని వల్ల కలిగే స్వల్పకాలిక ప్రయోజనాన్ని అంచనా వేయలేము. ప్రయోజనాలు దీర్ఘకాలానికి విస్తరించి దేశ పురోభివృద్ధికి దారి తీయవచ్చు. ఉదాహరణకు సాంఘిక అవస్థాపనలపై చేయు ప్రభుత్వ వ్యయం బహిర్గత ఆదాలకు దారితీసి ఉత్పత్తి కార్యక్రమాన్ని వేగవరచి తద్వారా వెనుకబడిన దేశం యొక్క పేదరిక మనే విషవలయాన్ని ఛేదించడానికి సహాయపడుతుంది.

4. ప్రభుత్వ వ్యయాన్ని పన్నుల నుండి కాకుండా లోటు బడ్జెట్ ద్వారా ఎదుర్కొన్నచో పన్నుల భారం లేకపోవడం వల్ల సంఘానికి ప్రయోజనం చేకూరుతుందని తలచరాదు. లోటు బడ్జెట్ దేశ ఆర్థికాభివృద్ధిని కుంటుపరచగలదు.

BRAOU

5. గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రాన్ని విశ్లేషించినప్పుడు పన్నుల వల్ల వచ్చే ప్రభుత్వాదాయన్ని మాత్రమే పరిగణిస్తున్నాం. కాని జరిమానాలు ఫీజులు ప్రభుత్వ రంగం నుండి వచ్చే లాభాలు మార్కెట్ ఋణాలు మొదలైన ఎన్నో ప్రభుత్వాదాయంలో ఇమిడి ఉన్నాయి.

---

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

---

1. ఏఏ ప్రమేయాలపై గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రం పని చేస్తుందో తెలుపుము.
2. ఈ సూత్రం యొక్క పరిమితులు ఏవి?

---

## 3.3 గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్ర పరీక్ష

---

పైన చర్చించిన పరిమితులున్నా, గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రం ప్రభుత్వ విత్త చర్యల వల్ల సమాజానికి లాభం కలుగుతుందో లేదో తెలుసుకునేందుకు ఉపకరిస్తుంది. ముందు చెప్పినట్లు బడ్జెట్ కార్యక్రమాలు వీలైనంత కనిష్ట స్థాయిలో ఉండాలనే వాదం ప్రైవేటు వ్యక్తులు వనరులను ఎక్కువ సమర్థవంతంగా వాడి సంపూర్ణ ఉద్యోగిత పెరిగే వృద్ధి రేటు (Acclerated) సాధించడానికి తోడ్పడగలదనే అభిప్రాయం నుంచి ఉత్పన్నమైంది. ఈ అభిప్రాయం మార్కెట్టు పద్ధతిని సమర్థిస్తుంది. కాని మార్కెట్ యంత్రాంగం సమర్థవంతంగా లేకపోతే (చాలా

## 3.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రం పరీక్షలను వివరించుము.
2. గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రాన్ని విమర్శనాత్మకంగా పరీక్షించుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంత పరిమితులు ఏవి?
2. గరిష్ట సాంఘిక ప్రయోజనంలో డాల్టన్ సూచించిన పరీక్షను వివరించుము.

●●●

B R A O U

# ఖండం – 2

## ప్రభుత్వ ఆదాయం

ప్రభుత్వ రాబడిలో ముఖ్యమైన ఆధారాలలో ఒకటైన పన్నుల విధానం సైద్ధాంతిక అంశాలను ఈ ఖండం చర్చిస్తుంది. వివిధ రకాలైన పన్నులను చర్చించడం జరిగింది. పన్నుల విధింపుకు ఆధారాలను అనగా పన్ను విధింపు నియమాలను వివరించాం. పన్నులకు సంబంధించిన వివిధ భావనలను – ఆరంభ భారం, అంతిమ భారం, పన్ను చెల్లింపు సామర్థ్యం, పన్ను భారం, పన్ను ప్రయత్నం – తెలుసుకొంటూ, వాటిని లెక్కించు పద్ధతులను చర్చిస్తాం.

**ఈ ఖండంలో గల 9 భాగాలు :**


భాగం – 4. : ప్రభుత్వ ఆదాయ వనరులు, వర్గీకరణ
భాగం – 5 : ప్రత్యక్ష, పరోక్ష పన్నులు
భాగం – 6 : పురోగామి, అనుపాత, తిరోగామి పన్నులు
భాగం – 7 : పన్నుల విధింపు నియమాలు
భాగం – 8 : పన్నుల విధింపు న్యాయం – వివిధ సిద్ధాంతాలు
భాగం – 9 : పన్ను తొలి ప్రభావం – అంతిమ ప్రభావం – లెక్కించు పద్ధతులు
భాగం – 10 : అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పన్నుల ప్రభావాలు
భాగం – 11 : పన్ను చెల్లింపు సామర్థ్యం – పన్ను చెల్లింపు సామర్థ్య నిర్ణయాలు
భాగం – 12 : పన్ను భారం–భావనలు, లెక్కించు పద్ధతులు


❖❖❖

BRAOU

BRAOU

# భాగం – 4 : ప్రభుత్వ ఆదాయ వనరులు – వర్గీకరణ

**విషయక్రమం**


4.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

4.1 పరిచయం

4.2 వివిధ ప్రభుత్వ ఆదాయ ఆధారాలు

4.3 ప్రభుత్వ ఆదాయ వర్గీకరణ

- 4.3.1 ఉచిత ఆదాయం
- 4.3.2 ఒప్పందపు ఆదాయం
- 4.3.3 నిర్బంధ ఆదాయం
- 4.3.4 ఫీజు, పన్ను, ప్రత్యేక విధింపులు

4.4 పన్ను, ఫీజుల తేడాలు

4.5 పన్ను, ప్రత్యేక విధింపుల తేడాలు

4.6 ప్రత్యేక విధింపు, ఫీజుల తేడాలు

4.7 ఇతర ఆదాయాలు

4.8 ప్రభుత్వ ఆదాయ వివిధ ఆధారాలు – వర్గీకరణ

4.9 పన్ను విధింపు లక్ష్యాలు

4.10 'పన్ను' లక్షణాలు

- 4.10.1 నిర్బంధ చెల్లింపులు
- 4.10.2 త్యాగ స్వభావము
- 4.10.3 సమాజ శ్రేయస్సు ఖర్చుకొరకు
- 4.10.4 సమాన ప్రతిఫలం లేకుండుట
- 4.10.5 కొనుగోలు శక్తి బదిలీ

4.11 సారాంశము / ముగింపు

4.12 సంప్రదించు పుస్తకాలు

4.13 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 4.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగంలో ప్రభుత్వం వివిధ విధులను నిర్వర్తించడములో కావలసిన ఆదాయాన్ని ఏఏ ఆధారాల ద్వారా సమకూర్చుకొంటుందో తెలుసుకోగలుగుతారు.

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది వాటిని అవగాహన చేసుకోగలుగుతారు.

- వివిధ ప్రభుత్వ ఆదాయవనరులను గుర్తించడం
- ప్రభుత్వ ఆదాయాన్ని వివిధ భాగాలలో వర్గీకరించడం.
- ప్రభుత్వ ఆదాయ వివిధ భావనలు, ముఖ్యంగా, పెనాల్టీలు పన్ను, ఫీజు, ప్రత్యేక విధింపులు, జరిమాన విరాళాలు మొదలగునవి.
- పన్ను ముఖ్య లక్షణాలను గుర్తించడము.

BRAOU

సమంజసం. ఈ ఆదాయాలు చెల్లించినవారికి తిరిగి వస్తు సేవలను అందజేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదు. ఇంకో ముఖ్య విషయమేమంటే కానుకల భారం చెల్లించినవారిసామర్థ్యానికి అనుపాతంలో ఉండదు.

### 4.3.2 ఒప్పందపు ఆదాయం

రెండవది ఒప్పందపు ఆదాయం అద్దెలు. ప్రభుత్వంచే అమ్మబడిన వస్తుసేవల నుండి వచ్చిన రాబడి మొదలైన ఆదాయంలో ఈ రకానికి చెందుతాయి. ప్రభుత్వానికి భూములు, భవనాల రూపంలో ఆస్తులు ఉంటాయి. ఇవి ప్రజలకు కౌలుకు ఇవ్వబడతాయి. అలాగే ప్రభుత్వ సంస్థలు ఉత్పత్తి చేసిన వస్తు సేవల అమ్మకంవల్ల కూడ ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. రైల్వేలు, తంతితపాలా మొదలైన సేవలవల్ల వచ్చే ఆదాయం దీనికుదాహరణ. ప్రైవేటు వ్యక్తులు వస్తు సేవల ధరలను వసూలు చేసే పద్ధతిని పోలి ఉండుటచే "సెలిగ్‌మన్" ఈ రకమైన ఒప్పందపు ఆదాయాలను ధరలు అని పిలిచాడు. కాని ప్రైవేటు రంగంలోని వస్తుసేవల ధరలు మార్కెట్ యంత్రాంగంచే నిర్ణయించబడగా ఆధునిక సంక్షేమరాజ్యాల్లో ప్రభుత్వం వసూలు చేసే వస్తుసేవల ధరలను ఏవిధంగా నిర్ణయించాలనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి.

### 4 3.3 నిర్బంధ ఆదాయం

పన్నులు, ఫీజులు, జరిమానాలు ప్రత్యేక విధింపులు మొదలైనవి నిర్బంధ ఆదాయాలు. ఆస్తులను స్వాధీనంచేసుకోడానికి అపరాధ రుసుము, పన్నులను విధించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. ప్రభుత్వం దేశంలోని ఆస్తులన్నింటిపైన సంపూర్ణ అధికారాలను కలిగిఉండుటచే అవసరమైతే అది ప్రజల ఆస్తినికూడా బలవంతంగా స్వాధీనం చేసుకోగలదు. కాని సాధారణంగా ప్రభుత్వం ఈ అధికారాన్ని వినియోగించదు. ప్రభుత్వానికి దండన విధించే అధికారం ఉంది. కనుక అది ప్రజలపై జరిమానాలను పెనాల్టీలను విధించగలదు. అలా విధించినపుడు ప్రజలువాటిని చెల్లించి తీరాలి. కాని ఆదాయం దృష్ట్యా దీని కంటే పన్ను విధించే అధికారమే ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వ కార్యకలాపాలు చాలా తక్కువగా ఉన్న ప్రాచీనకాలంలో పన్నుల విధింపుకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడలేదు. పన్నులన్నీ హానికరమైనవిగా పరిగణింపబడేవి. కాని ఆధునికకాలంలో ప్రభుత్వాదాయంలో అధికభాగం పన్నులద్వారనే లభిస్తోంది. ఈ నిర్బంధపు ఆదాయంలోని కొన్ని ముఖ్యాంశాలను సెలిగ్‌మన్ ఈక్రింది విధంగా నిర్వచించెను.

BRAOU

### 4.3.4 ఫీజు, పన్ను ప్రత్యేక విధింపులు

ఫీజు : ప్రజాక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందజేసే సేవల వ్యయాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు సేవల వల్ల ప్రయోజనం పొందిన వారి నుండి ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని ఫీజు అంటారు.

పన్ను : ప్రజలందరి సామాన్య ప్రయోజనం కోసం చేసిన వ్యయాన్ని రాబట్టుకొనేందుకు వ్యక్తుల నుండి నిర్బంధంగా ప్రభుత్వం వసూలు చేసే మొత్తాలు పన్నులు. దీనిలో ఏ ఒక్కరికీ ప్రత్యేక ప్రయోజనం ఉండదు.

ప్రత్యేక విధింపులు : ప్రజాశ్రేయస్సుకై ప్రభుత్వం తలపెట్టిన పనులు ఆస్తుల విలువలను పెంచినపుడు లాభంపొందిన ఆస్తి యజమానులు నుండి వారు పొందిన లాభానికిఅనుపాతంలో ఆ పనులకయ్యే ఖర్చును రాబట్టడానికిగాను ఒక్కసారి మాత్రమే వసూలు చేసే మొత్తాలు ప్రత్యేక విధింపులు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1.

1. ఏవేని నాలుగు ప్రభుత్వ ఆదాయ ఆధారాలను గుర్తించుము.
2. ఆడమ్స్ ప్రభుత్వ ఆదాయ వర్గీకరణ ఏమి?
3. సెలిగ్‌మన్ చే వర్గీకరించబడిన ప్రభుత్వ ఆదాయాలను వివరించుము?

## 4.4 పన్ను, ఫీజుల తేడాలు

వివిధ రకాలైన ఆదాయాల మధ్యగల తేడాలేమిటి అనే విషయాన్ని మనం గమనించాలి. ఉదాహరణకు ఫీజు, పన్నులకు గల తేడాలను పరిశీలిద్దాం.

1. ప్రభుత్వం ప్రజలకు సామాన్యసేవలను అందజేయటానికయ్యే వ్యయాలను ఎదుర్కోనేందుకు పన్ను విధించబడుతుంది. దీనిలో సమాన ప్రతిఫలం (quid proquo) ఉండదు. ఫీజు ప్రభుత్వం నుండి ప్రత్యేక సేవలను పొందుటకై చెల్లించబడుతుంది. కాబట్టి దీన్ని చెల్లించేవారికి సమాన ప్రతిఫలం ఉంటుంది.

2. పన్నులు చెల్లింపు సామర్థ్యం ఆధారంగా విధించబడతాయి. ఫీజు చెల్లింపు దారుకు సంక్రమించిన ప్రత్యేక ప్రయోజనం ఆధారంగా విధించబడుతుంది.

3. ఫీజు ఆ ప్రత్యేక సేవను అందజేయుటకైన వ్యయానికి తగినట్లు సరిపెట్టబడుతుంది. కాని పన్ను విషయంలో ఈ విధంగా విడివిడిగా కొలవడానికి వీలుండదు.

అయితే ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. పన్ను, ఫీజుల రెండింటి వసూళ్ళలో ప్రభుత్వం యొక్క ముఖ్యోద్దేశం సాంఘిక ప్రయోజనాలను సమకూర్చడమే. కాని ఫీజులు చెల్లించే వారికి ఒక ప్రత్యేక ప్రయోజనం కలుగజేస్తుంది. కోర్టు ఫీజులు, రిజిస్ట్రేషను ఫీజులు మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. ఈ విధమైన వ్యక్తిగత ప్రయోజనం పన్ను చెల్లించేవారికి కల్పించబడదు. ప్రభుత్వం అందజేసే సేవలను ప్రయోజనాలను పొందగోరే వ్యక్తుల వడవడిని క్రమబద్ధం చేయడమే ఫీజు వసూలు చేయడంలో ప్రభుత్వ ఉద్దేశం.
ఇప్పుడు ప్రత్యేక చెల్లింపునకు పన్నుకు గల తేడాలను చూద్దాం.

## 4.5 పన్ను, ప్రత్యేక విధింపుల తేడాలు

1. ప్రత్యేక చెల్లింపులలో ప్రజాశ్రేయస్సు అనే అంశం స్పష్టంగా కన్పిస్తుంది. ప్రయోజనం పొందేవారు గుర్తించగలిగినపుడే దాన్ని విధించాలి. ప్రత్యేక విధింపులు సబబు లేకుండా విధించబడరాదు. 2. పన్నులు సామాన్య ప్రయోజనాల సాధన కనుసరమయ్యే వ్యయాలను ఎదుర్కోనేందుకు విధించే నిర్బంధ వసూళ్ళుకాగా ప్రత్యేక విధింపు వల్ల పొందిన ప్రత్యేక ప్రయోజనానికి చెల్లించే నిర్బంధ వసూలు. 3. ప్రత్యేక విధింపులు పొందిన ప్రయోజనాల అనుపాతంలోనే విధించబడతాయి. ఉదాహరణకు ఒక పథకం వల్ల ఒక ప్రాంతం లోని ఆస్తుల విలువలు పెరిగితే ఈ విధింపు కోసం నిర్ణయించిన ప్రత్యేక చెల్లింపులు ఆస్తుల అనుపాతంలోనే చెల్లించబడతాయి. కాని పన్ను చెల్లింపులు అనుపాతం గాని, పురోగామిగా గాని ఉండవచ్చు. 4. ప్రత్యేక విధింపు ఒక్కసారి మాత్రమే చెల్లించబడుతుంది. కాని పన్నులను ఎల్లప్పుడు చెల్లించాలి.

ప్రత్యేక విధింపు పన్ను కూడా నిర్బంధమైనదే. కాని మొదటిది ప్రత్యేక ప్రయోజనం కలిగి ఉంటుంది. ఈ



BRAOU

విషయంలో ప్రత్యేక విధింపు ఫీజును పోలి ఉంటుంది. అయినప్పటికి ఫీజును పోలి ఉంటుంది. అయినప్పటికి ఫీజ ప్రత్యేక విధింపులో కొన్ని తేడాలున్నాయి.

## 4.6 ప్రత్యేక విధింపు, ఫీజుల తేడాలు

1. ప్రత్యేక విధింపులో స్థానికమైన ప్రత్యేక ప్రయోజనాలను విధించబడుతాయి. కాని ఫీజ ప్రభుత్వంచే నిర్వరచబడిన ఏ సేవకైనా వర్తిస్తుంది. ప్రభుత్వానికి చెల్లించే కొన్ని ఫీజులు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి, అనుమతి పొందడానికి చెల్లించబడతాయి. ప్రత్యేక విధింపుకు ఫీజుకు ఉన్నంత నిర్వహణ విస్తీర్ణత ( field of operation) ఉండదు.

2. ప్రభుత్వం నుండి సేవ అందుకున్నప్పుడల్లా ప్రజలు ఫీజ చెల్లించాలి. కాని ప్రత్యేక విధింపు ఒక్కసారి మాత్రమే చెల్లించబడుతుంది.

3. ప్రత్యేక విధింపు విషయంలో వ్యక్తి ప్రయోజనాన్ని పొందే వర్గంలో సభ్యుడుగా చెల్లిస్తాడు. కాని ఫీజ విషయంలో ఇది వర్తించదు.

4. ప్రత్యేక విధింపు స్థిరాస్థికి కల్గిన ప్రయోజనాలకు సంబంధించి ఉంటుంది. కాని ఫీజ ఇతర అంశాలకు కూడా ప్రయోజనం కలుగజేయవచ్చు.

## 4.7 ఇతర ఆదాయాలు

ఫీజులు, పన్నులు ప్రత్యేక విధింపులు వంటి ప్రముఖ ఆదాయ మార్గలే కాక జరిమానాలు, స్వచ్ఛంద కానుకలు ఎస్చీట్ లు (escheats) వంటి చిన్న తరహా ఆదాయమార్గాలు కూడా ఉంటాయి. ప్రజలను చట్ట విరుద్ధ చర్యల నుండి మళ్ళించడానికి ప్రజలకు జరిమానాలు విధించబడతాయి. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే జరిమానా విధించబడుతుంది. కొన్ని షరతులకు కట్టుబడి ఉండని ప్రజలపై ప్రభుత్వం పెనాల్టీలు, అపరాధరుసుము (forfeiture) విధిస్తుంది. ఉదాహరణకు ఒక కాంట్రాక్టరు సకాలంలో తన పనిముగించకపోతే ప్రభుత్వం అతనిపై పెనాల్టీ విధిస్తుంది. జరిమానాలు, పెనాల్టీలు, అపరాధరుసుము మొదలైనవి ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని సంపాదించలేవు. వ్యక్తుల నడవడికను క్రమబద్ధం చేయడానికి మాత్రమే ఇవి విధించబడతాయి. స్వచ్ఛంద కానుకలు బహుమతులు మొదలైన వాటివల్ల వచ్చే ఆదాయం అనిశ్చితంగా ఉంటుంది. ఈ మార్గం ద్వారా ప్రభుత్వం ఎక్కువ ఆదాయాన్ని ఆశించకూడదు. అదేవిధంగా ఎస్చీట్ల వల్ల లభించే ఆదాయం కూడానాల స్వల్పం. వారసులు లేనప్పుడు వీలు వ్రాయనప్పుడు మరణించినవారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. వీటిని ఎస్చీట్ లు అంటారు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

4. ఈ క్రింది పదాలను వివరించండి.

(a) ఫీజ (b) పన్ను (c) ప్రత్యేక విధింపులు

(d) జరిమాన (e) పెనాల్టీ మరియు (f) ఎస్చీట్ లు

### 4.10.2 త్యాగ స్వభావము

చెల్లింపుదారు పక్షంలో త్యాగం ఇమిడి ఉండుట పన్ను రెండవ లక్షణం. ఒక వ్యక్తి పన్ను చెల్లించినపుడు ఆ మొత్తం మేరకు అతని ఆదాయం తగ్గుతుంది. కాబట్టి పన్ను చెల్లించే వారు కొంత మొత్తాన్ని త్యాగం చేస్తారు.

### 4.10.3 సమాజశ్రేయస్సు ఖర్చు కొరకు

సమాజ శ్రేయస్సు కోసం ప్రభుత్వ సేవల ఉత్పత్తిపై ఖర్చు చెయడానికి ప్రభుత్వం పన్నులను వసూలు చేస్తోంది.

### 4.10.4 సమాన ప్రతిఫలం లేకుండుట

పన్ను చెల్లించడం అంటే వస్తువుకు ధర చెల్లించడం వంటిదికాదు. ఇది ఫీజుకు కూడా భిన్నమైంది. పన్నుయొక్క ప్రాథమిక లక్షణం సమాన ప్రతిఫలనముండటం కాదు. అంటేపన్ను చెల్లించేవారికి ప్రత్యక్ష ప్రయోజనం ఉండదు.

### 4.10.5 కొనుగోలు శక్తి బదిలీ

పన్ను చెల్లించే వారి ఆదాయం నుండి అది చెల్లించబడటం మరియొక లక్షణం. అందుచే ఎప్పుడైతే పన్ను చెల్లించబడిందో అప్పుడు పన్ను చెల్లించే వారి నుండి ప్రభుత్వానికి కొనుగోలు శక్తి బదిలీ అవుతుంది.

BRAOU

తుదిగా పన్నులు వ్యక్తుల చేత చెల్లింపబడతాయి కాని వస్తువుల చేతకాదనే విషయం తెలుసుకోవాలి. ప్రజలచే కొనుగోలు చేసే వస్తువులపై విధించిన పన్నుల విషయంలో కూడాఅవి వ్యక్తులచే మాత్రమే చెల్లింపబడతాయి.

## 4.11 సారాంశము / ముగింపు

ప్రభుత్వ ఆదాయ వనరులు ఉన్నాయనీ వివిధ ఆర్థిక వేత్తలు వివిధ రకాలైన వర్గీకరణను సూచించారనీ మనం తెలుసుకున్నాం. వివిధ రకాలుగా వర్గీకరించడం వల్ల ఈ వనరుల పోలికలు తేడాలు తెలుసుకున్నాం. ఒక సూత్రాన్ని సామాన్యంగా వర్తింపజేసేటప్పుడు ఇది అన్ని రకాల ఆదాయాలకూ వర్తిస్తుందా లేక కొన్ని రకాలకే వర్తిస్తుందా అనే విషయం కూడా తెలుసుకోవాలి. వివిధ ప్రభుత్వ ఆదాయాల ప్రభావాలు, అంతిమ ప్రభావం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి వివిధ ఆదాయ మార్గాలు, వాటివర్గీకరణ గూర్చి జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ విషయాలన్నీ తెలుస్తాయి.

— డా॥ టి. దివాకర్ రావు

## 4.12 సంప్రదింపు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Hugh Dalton : Principles of Public Finance

## 4.8 ప్రభుత్వ ఆదాయ వివిధ ఆధారాలు – వర్గీకరణ

ఇంతవరకు చర్చించిన వివిధ ఆదాయ మార్గాలను స్థూలంగా నాల్గు తరగతులుగా విభజించవచ్చు. అవి 1. పన్నులు 2. పరిపాలనా ఆదాయాలు 3. ప్రభుత్వ డొమైన్ మరియు వాణిజ్య ఆదాయాలు 4. గ్రాంటులూ, కానుకలు (gifts) , ఫీజులు, జరిమానాలు, పెనాల్టీలు ఎస్కేట్ లు, ప్రత్యేక విధింపులు మొదలైనవి పరిపాలనా ఆదాయాల్లోని కొన్ని అంశాలు. ప్రభుత్వ ఆస్తి నుండి వచ్చిన ఆదాయం వివిధ ప్రభుత్వ శాఖలనుండి వచ్చిన ఆదాయం మొదలైనవి మూడవవర్గానికి చెందుతాయి. గ్రాంటులు కానుకలు కొన్ని ప్రత్యేక విధులను నిర్వహించడానికి ఒక ప్రభుత్వం నుండి మరొక ప్రభుత్వానికి ఇవ్వబడతాయి. ఉదాహరణకు ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కొన్ని గ్రాంట్లు ఇస్తుంది. వీటని తిరిగి చెల్లించనవసరం లేదు బహుమతులు, కానుకలు స్వచ్ఛందంగా ఇచ్చేవి.

## 4.9 పన్ను విధింపు లక్ష్యాలు

ప్రభుత్వాదాయ వర్గీకరణం ఏమైనప్పటికీ రాజ్యం యొక్క వివిధ కార్యకలాపాలు ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేసి వనరులను సమర్థవంతంగా కేటాయించి సాంఘిక ఆర్థిక శ్రేయస్సును గరిష్టం చేయడానికి ఉద్దేశింపబడినవే. అన్ని రకాల పన్నులు ఇతర ఆదాయాలు రెండు ముఖ్య లక్ష్యాల సాధనకు విధించబడతాయి. 1. ప్రభుత్వానికి తన విధులను నిర్వహించడానికి ద్రవ్యం అవసరం. ఇది ఆదాయ లక్ష్యం. 2. ప్రజల ఆర్థిక జీవన విధానంలో మార్పుతీసుకురావడం రెండవ లక్ష్యం. ఇది చాల ముఖ్యమైన లక్ష్యం. ఉదాహరణకు ప్రైవేటు సంస్థలచే తయారు చేయబడుతున్న వస్తు సేవల ఉత్పత్తిని నిరుత్సాహపరచడానికి ప్రభుత్వం దానిపై పన్ను విధించవచ్చు. అదే విధంగా రాష్ట్రాలచే అందజేయబడుతున్న వస్తు సేవల వినియోగాన్ని నిరుత్సాహపరచడానికి ప్రభుత్వం ఫీజును విధించవచ్చు.

BRAOU

## 4.10 'పన్ను' లక్షణాలు

ప్రతి ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్ష పరోక్ష పన్నులూ, అనుపాతపు పురోగామి పన్నులూ మొదలగు అనేక విధాలైన పన్నులు విధించబడతాయి. పన్నుల గురించి ఇంకా వివరాలనురాబోయే పాఠాలలో తెలుసుకుందాం. పన్నుల గురించిన విపులమైన విశ్లేషణ అక్కడ చేయబడుతుంది. కాని ఈ క్రింద కొన్ని పన్నుల ముఖ్య లక్షణాలు పేర్కొనబడ్డాయి.

### 4.10.1 నిర్బంధ చెల్లింపులు

పై పేరాలో సెలిగ్ మన్ నిర్వచనం ప్రకారం పన్ను నిర్బంధ చెల్లింపు అనే విషయం తెలిసికొన్నాం. ప్రభుత్వం తన విధులను సక్రమంగా నిర్వహించాలంటే ప్రతి పౌరుడు ఎంతో కొంత ప్రభుత్వానికి సహాయపడాలి. పన్ను అనేది తప్పనిసరి చెల్లింపు అనే విషయంపై కొంతమంది ఆర్థికవేత్తలలో అభిప్రాయ భేదాలున్నాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి సంపాదనను పెంచకుండా ఉండటం ద్వారా వ్యక్తిగత ఆదాయపు పన్నును చెల్లించకుండా ఉండవచ్చు. అదే విధంగావస్తు సేవలపై విధింపబడిన పరోక్ష పన్నును వాటి వినియోగాన్ని ఆపుట ద్వారా చెల్లించకుండ ఉండవచ్చు. ఏమైనప్పటికి చట్ట ప్రకారం పన్ను చెల్లించవలసి ఉంటే ఏ ఒక్కరూ కూడా దాన్ని చెల్లించకుండా తప్పించుకోలేరు.

## 4.13. నమూనా పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది వానికి సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ప్రభుత్వ ఆదాయాన్ని వివిధ భాగాలలో వర్గీకరించుము.
2. పన్నులక్షణాలను వివరించుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ప్రభుత్వ ఆదాయ వివిధ ఆధారాలను గుర్తించుము.
2. 'పన్ను' లక్షణాలను వివరించుము.
3. ఈ క్రింది భావనలను వివరించుము.

   (a) పన్ను (b) ఫీజు

   (c) ప్రత్యేక విధింపులు

●●●

BRAOU

# భాగం – 5 : ప్రత్యక్ష, పరోక్ష పన్నులు

విషయక్రమం

5.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
5.1 పరిచయం
5.2 పన్నుల వర్గీకరణ : ప్రత్యక్ష పరోక్ష పన్నులు.
- వర్గీకరణ న్యాయం
- ప్రత్యేక లేదా మూల్యానుగత పరోక్ష పన్నులు

5.3 ప్రత్యక్ష పన్నుల వల్ల లాభాలు
5.4 ప్రత్యక్ష పన్నుల వల్ల నష్టాలు
5.5 పరోక్ష పన్నుల వల్ల లాభాలు
5.6 పరోక్ష పన్నుల వల్ల నష్టాలు
5.7 పరోక్ష ప్రత్యక్ష పన్నుల పోలికలు
5.8 అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు.
5.9 ప్రత్యక్ష పన్నులు, కొన్ని ఉదాహరణలు
5.10 పరోక్ష పన్నులు కొన్ని ఉదాహరణలు
5.11 స్థానిక ప్రభుత్వాలు – పన్ను విధింపు
5.12 సారాంశము / ముగింపు
5.13 సంప్రదించు పుస్తకాలు
5.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 5.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

BRAOU

ఈ భాగం ముఖ్యోద్దేశము పన్నుల వర్గీకరణను, ప్రత్యక్ష పరోక్ష పన్నుల లాభనష్టాలను చర్చించడం జరిగినది.ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రిందిభావనలను అవగాహన చేసుకోగలుగుతారు.

- పన్నుల వర్గీకరణ
- ప్రత్యక్ష పన్నుల లాభనష్టాలు
- పరోక్ష పన్నుల లాభనష్టాల విశ్లేషణ
- అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలలో వీటి పాత్ర
- ముఖ్యమయిన పరోక్ష ప్రత్యక్ష పన్నులను గుర్తించడం

## 5.1 పరిచయం

ప్రభుత్వ ఆదాయ వర్గీకరణ గూర్చి వెనుకటి భాగంలో తెలుసుకున్నాం. ప్రభుత్వ ఆదాయంలో పన్నులు అధిక భాగాన్ని ఆక్రమిస్తున్నాయని తెలుసుకున్నాం. పన్ను, ఫీజు మరియు ప్రత్యేక విధింపులలో గల తేడాలను కూడా వివరించడం జరిగినది. గత భాగంలో పన్ను లక్షణాలను గురించి కూడా తెలుసుకోవడమైనది. ఈ భాగంలో

పన్నుల వర్గీకరణ, అనగా ప్రత్యక్ష పరోక్ష పన్నులను విశ్లేషించడం జరిగినది. ఏరకమయినటువంటి పన్నులకుకూడా కొన్ని లాభాలు , నష్టాలు ఉంటాయి. అలాగే ప్రత్యక్ష, పరోక్షపన్నులకు కూడా ఉన్నాయి. వీటిని ఈ భాగంలో వివరంగా వివరించడం జరిగినది. అభివృద్ధి చెందుతున్న దేశాలు సాధారణంగా పరోక్షపన్నుల విధానం పై ఆధారపడి ఉండడము వలన, అభివృద్ధి చెందిన దేశాలు ప్రత్యక్ష పన్నులపై ఆధారపడి ఉన్నాయి. వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పోరేటు ఆదాయపన్ను, వ్యయపన్ను మొదలగునవి కొన్ని ముఖ్యమయిన ప్రత్యక్షపన్నులు అలాగే ఎక్సైజ్ సుంకము, అమ్మకపుపన్ను,కస్టమ్స్‌డ్యూటీ మొదలగునవి కొన్ని పరోక్ష పన్నులకు ఉదాహరణలు. వీటిని ఈ బాగంలో అర్థం చేసుకోవడం కొరకు ప్రయత్నించెదము.

## 5.2. పన్నుల వర్గీకరణ – ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులు

పన్నులను చాలారకాలుగా విభజించవచ్చు. ప్రత్యక్షపన్ను, పరోక్షపన్ను, వ్యక్తి గత పన్ను, ఆదాయం పన్ను, ఆస్తి పన్ను, వినియోగపు పన్ను, ఉత్పత్తి పన్ను, మూల్యానుగతమైన పన్ను, స్పెసిఫిక్ పన్ను మొదలైనవి. వీటి వర్గీకరణ ఏమైనప్పటికి స్థూలదృష్టితో పరికించిన ఇవన్నీ ప్రత్యక్ష పన్నుగా గాని, పరోక్ష పన్నుగా గాని ఉంటాయి. కాబట్టి ఇప్పుడు ప్రత్యక్ష పరోక్ష పన్నుల లక్షణాలను గూర్చి తెలుసుకుందాం.

పన్ను కారణంగా కొనుగోలు శక్తి వ్యక్తులనుండి ప్రభుత్వానికి బదిలీ అవుతుంది. ఉదాహరణకు ఆదాయపన్ను చెల్లించే వ్యక్తి పన్ను రూపంలో కొంత ఆదాయాన్ని కోల్పోతాడు. పన్ను చెల్లించే వ్యక్తి నుండి ప్రభుత్వానికి కొనుగోలు శక్తి బదిలీ అవుతుంది. అందుచేత ఇది ఆదాయంలో కొంత భాగాన్ని చెల్లించవలసి రావడంచేత అది బాధతోగాని, త్యాగంతో కాని కూడి ఉంటుంది. ప్రభుత్వానికి ఒకసారి పన్ను చెల్లించిన వ్యక్తి ఆ భారాన్ని మరియొకరికి మార్చడానికి వీలుంటుందా? అలా ఉంటే దానిని ద్రవ్యభారాన్ని బదిలీచేయడం అని అంటారు. కేంద్ర ఎక్సైజు సుంకం వంటి పరోక్ష పన్నులు ఇందుకు ఉదాహరణ. వస్తువును తయారు చేసినవారు దీనిని చెల్లించాలి. కాని అతడు దానిని టోకు వ్యాపారస్తునికి బదిలీ చేస్తాడు. అతడు మళ్ళీ దీనిని చిల్లర వ్యాపారస్తునకు బదిలీ చేస్తాడు.చివరకు ఆ వస్తువును కొన్న వినియోగదారునిపై ఆ భారం పడుతుంది. పన్ను బదిలీ చేయడానికి అవకాశముందా లేదా అనేది అనేక అంశాలపై ఆధారపడుతుంది. ఈ అంశాలను తరువాతి పాఠాలలో వివరంగా చర్చిద్దాం. ప్రత్యక్షపరోక్ష పన్నుల లక్షణాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును. పన్ను భారాన్ని మరియొకరికి బదిలీ చేయడానికి వీలులేని దానిని ప్రత్యక్షపన్ను అనీ బదలీ చేయడానికి వీలున్న దానిని పరోక్షపన్ను అనీ చాలా మంది ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. ఇంకోమాటలో చెప్పాలంటే ప్రత్యక్షపన్నును ప్రభుత్వానికి చెల్లించే వ్యక్తి ఆ భారాన్ని తానొక్కడే భరిస్తాడు. దాని తొలి ప్రబావం (impact) అంతిమ ప్రబావం (incidence) కూడా అతని మీదే ఉంటుంది. పరోక్షపన్నులో పన్ను చెల్లించేవ్యక్తి ఆ భారాన్ని ఇంకొకరికి బదిలిచేయవచ్చు. దాని తొలిప్రభావం కొంతమంది మీద, అంతిమ ప్రభావం మరికొంత మంది మీద ఉంటుంది. అనగా పరోక్షపన్నులో తొలి ప్రబావం, అంతిమ ప్రభావం ఒకేవ్యక్తి మీద ఉండవు. ఇంతవరకు పన్ను బదలాయింపు సూత్రం (Principle of tax Shifting) ఆదారంగా ప్రత్యక్షపరోక్ష పన్నుల లక్షణాలను తెలుసుకున్నాం.

ఆర్థిక స్థితిగతులను బట్టి అనగా ఆదాయ సంపదలను బట్టి విధించే పన్నులను, ప్రత్యక్షపన్నులంటారని 'జే.స్. మిల్' అభిప్రాయం. ఒక వ్యక్తి నుండి అతడు పొందిన నష్ట పరిహారాన్ని ఇంకొకరి వద్ద నుండి తిరిగి పొందుతాడనే అభిప్రాయంతో వసూలు చేయబడే పన్నును పరోక్ష పన్ను అంటారు. ప్రత్యక్ష పరోక్ష పన్నులకు చేయబడిన ఈ నిర్వచనాలు స్పష్టంగా లేవు. అంతేకాక ఈ విషయంలో ఆర్థిక వేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఆర్థశాస్త్ర సాహిత్యంలో ప్రత్యక్షపరోక్షపన్నుల మధ్యగల తేడాలు అనేక ఇతర ఆధారాలను బట్టి చేయబడ్డాయి. ఉదాహరణకు వాటి మధ్య గల భేదాన్ని ఈ విధంగా గుర్తించవచ్చు. ఉత్పత్తి మీద విధించిన పన్నును ప్రత్యక్ష పన్ను అనీ, వినియోగాలమీద విధించిన పన్నును పరోక్షపన్ననీ అనవచ్చు. అదేవిధంగా కొద్దిమంది ఆర్థికవేత్తలు ఆదాయం మీద

BRAOU

విధించిన పన్నును ప్రత్యక్ష పన్ను అనీ, వ్యయం మీద విధించిన పన్నును పరోక్షపన్ను అనీ అభిప్రాయపడిరి.

డాల్టన్ ప్రత్యక్ష పరోక్ష పన్నుల భేధాన్ని బహిర్గతంగా ఉంటుందని గుర్తించెను. "ప్రత్యక్ష పన్ను ఏవ్యక్తిపై చట్టపరంగా విధించబడుతుందో అతనే చెల్లించాల్సి ఉంటుంది, కాని పరోక్షపన్ను ఎవరిపై విధించబడుతుందో, అతను కొంతకాని లేదా మొత్తం ఇతరులచే చెల్లించబడుతుంది. ఇది వారి వారి మధ్య ఉన్నటువంటి ఒప్పందాలపై ఆధారపడి ఉంటుంది.

వర్గీకరణ యొక్క న్యాయం

ఆధునిక అర్థికవేత్తలు ఈ విధమైన పన్నుల వర్గీకరణ యొక్క న్యాయాన్ని (validity) ప్రశ్నించిరి ఉత్పత్తి మీద విధించిన పన్నును ప్రత్యక్ష పన్నుఅనీ, వినియోగం మీద విధించిన పన్నును పరోక్షమనీ పేర్కొనడానికి కారణాలేమిటి? ఈ రెండు ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపాలు, ఈ రెండూ కూడా ఒక దానిని విడిచి రెండవది విలువలేదు. అలాగే ఆదాయ వ్యయాల ఆధారంగా పన్నుల నడుమ తేడాలను నిర్ణయించడంలో ఏకాభిప్రాయం లేదు. ఈ రెండు కార్యకలాపాలు కూడా ఆర్థిక వ్యవస్థలో నిధుల ప్రవాహం దృష్ట్యా ఆదాయ వ్యయాల వ్యవహారాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఆధునిక కాలంలో పన్ను చెల్లించేవారి చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల మధ్య గల తేడాలు గుర్తింపబడుతున్నాయి. ఉదాహరణకు వ్యక్తిగతఆదాయ పన్ను ప్రత్యక్ష పన్నుగా గుర్తింపబడుతోంది ఆదాయం ఒక వ్యక్తి యొక్క చెల్లింపు శక్తిని తెలుపుతుందనే అభిప్రాయంతో ఆదాయం ఆదారంగా వ్యక్తి మీద పన్ను విధింపబడుతుంది. అదే విధంగా బహుమతి పన్ను, కార్పొరేషన్ పన్ను, సంపదపన్ను మొదలైనవి ప్రత్యక్ష పన్నులుగా విభజించబడ్డాయి. పరోక్ష పన్నుల విషయంలో చెల్లింపు సామర్థ్యం పరోక్షంగా గుర్తింపబడుతుంది. ఉదాహరణకు రేడియోపై విధించబడిన ఎక్సైజ్ సుంకం పరోక్ష పన్ను రేడియో కొన్న వ్యక్తికి పన్ను చెల్లించగల శక్తి ఉన్నదని ఊహించబడుతోంది. అధిక ధరగల వస్తువులను కొనే వ్యక్తి పరోక్ష పన్నుగా ఎక్కువ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధపడతాడు. ఈ కారణం చేతే విలాస వస్తువులకు పన్ను అధికంగా ఉంటుంది. సమాజంలోని ధనిక వర్గాలు దానిని చెల్లించగల సామర్థ్యం కలిగి ఉంటాయి. ఆదాయ వ్యయాలలో ఏది చెల్లింపు సామర్థ్యాన్ని తెలియజేస్తుందనే విషయంలో అర్థికవేత్తలలో ఏకాభిప్రాయం లేదు. ఏ ఆధారం ప్రకారంగా చూసినా ప్రతీ ఆర్థిక వ్యవస్థలోను ప్రత్యక్ష పరోక్షపన్నులుంటాయి. ప్రత్యక్ష పరోక్ష పన్నులమధ్యగల తేడాలను గుర్తించడానికి జె.ఎస్. మిల్ చేసిన వర్గీకరణను గ్రహించవచ్చును.

BRAOU

ప్రత్యేక లేదా మూల్యానుగత పరోక్ష పన్నులు

పరోక్ష పన్నులు స్పెసిఫిక్ పన్నుగాగాని, మూల్యానుగతమైన పన్నుగాగాని ఉంటాయి. పన్ను వస్తువు భౌతిక పరిమాణం (Physical quantity) ఆధారంగా విధించబడితే దానిని స్పెసిఫిక్ పన్ను అంటారు. వస్తువు యొక్క ద్రవ్య విలువను బట్టి పన్నును విలువలో శాతంగా తెలిపితే దానిని మూల్యానుగతమైన పన్ను అంటారు. ఈ రోజుల్లో పరోక్ష పన్నులలో అధిక భాగం మూల్యానుగతమైన పన్నులే. మూల్యానుగతమైన పన్నులలో గల లాభమేమంటే వస్తువు భౌతిక పరిమాణంపెరిగినపుడు పన్ను ఆదాయందానంతటదే పెరుగుతుంది. ఉదాహరణకు 20 రూ॥ల విలువగల వస్తువుపై 5 శాతం పన్ను విధించిన దాని వల్ల వచ్చే పన్ను ఆదాయం 1 రూ॥. వస్తువు ధర 40॥ లకు పెరిగినచో పన్ను ఆదాయం 2 రూ॥లకు పెరుగుతుంది.

## 5.3 ప్రత్యక్ష పన్నుల వల్ల లాభాలు

### 5.3.1 వ్యక్తుల చెల్లింపు సామర్థ్యం



ప్రత్యక్షపన్నుల లాభాల్లో ఈక్రిందివి ముఖ్యమైనవి 1. వ్యక్తుల చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి విధించడానికి

వీలవుతుంది. చట్ట ప్రకారం ఒక వ్యక్తి మీద విధింపబడిన ఆ పన్ను భారాన్ని మరొకరికి బదలాయించడానికి వీలుండదు. కనుక పన్ను చెల్లించే వారి యొక్క చెల్లింపు సామర్థ్యం ప్రభుత్వం చేత ప్రత్యక్షంగా నిర్ణయించబడుతుంది చెల్లింపు సామర్థ్యం ఆధారంగా విధించబడిన పన్నులు సమతానియమాన్ని సంతృప్తి పరుస్తాయి. పరోక్షపన్నుల విషయంలో కూడా విలాస వస్తువులపై పన్ను విధించడం ద్వారా చెల్లింపు సామర్థ్య సూత్రం అమలు పర్చబడినప్పటికి వస్తువులను ఎంచుకోడంలో తప్పు చేయడానికి అవకాశాలున్నాయి.

### 5.3.2 పురోగామి పరిమాణం

ప్రత్యక్షపన్నుల మరియొక లాభం పురోగామి పరిమాణానికి సంబంధించినది. ప్రత్యక్షపన్నులన్నీ పురోగామి పన్నులే అవగా ఆధారంతో పాటు పన్ను రేటు కూడా పెరుగుతుంది. ప్రత్యక్ష పన్నుల రేట్లను సరిగా ఎంచుకున్నప్పుడే చెల్లింపు సామర్థ్య లక్షణం నెరవేరుతుంది. ప్రత్యక్ష పన్నుల విధానం కనిష్ట సమిష్టి త్యాగసూత్రాన్ని సంతృప్తి పరుస్తుంది.

### 5.3.3 అసమానతలను తగ్గించడం

పై విషయానికి అనుబంధంగా ప్రత్యక్షపన్నులు ఆదాయ సంపదల్లోని అసమానతలను తగ్గించడానికి ఉపయోగిస్తాయని చెప్పవచ్చు. ఆర్థిక అసమానతలు తగ్గించడం ద్వారా అనేక సాంఘిక దుష్ట శక్తులను అదుపులో పెట్టవచ్చు. ఈ లక్ష్య సాధనలో ప్రత్యక్ష పన్నులు ఎంతవరకు సఫలీకృతమయ్యాయనే విషయాన్ని వేరుగా చర్చించాలి.

### 5.3.4 వనరుల కేటాయింపు

ప్రత్యక్ష పన్నులు వనరుల కేటాయింపును అస్తవ్యస్తం చేయ్యవు కనుక సంక్షేమ సాధన దృష్ట్యా పరోక్ష పన్నులకంటే గూడ ఇవి అనుకూలమైనవిగా భావించబడుతున్నాయి. కాని ఈ ఆలోచన కొన్ని అవాస్తవిక ప్రమేయాలపై ఆధారపడింది. ( ఈ విషయం మరోచోట పటం ద్వారా వివరించబడింది.)

### 5.3.5 ఉత్పాదకత వ్యాకోచత్వం

ప్రత్యక్ష పన్నులు ఉత్పాదకత వ్యాకోచత్వ లక్షణాల వల్ల కూడా బలపరచబడ్డాయి. సంఘంయొక్క ఆదాయం పెరిగితే ప్రత్యక్షపన్నుల వల్ల వచ్చే ఆదాయంకూడా పెరుగుతుంది. పరోక్షపన్నులవల్ల వచ్చే ఆదాయం కూడా పెరుగుతుంది. పరోక్ష పన్నులలో కూడా ఈ అవకాశం ఉంది. అంతేకాక కొన్ని ప్రత్యక్ష పన్నులలో వ్యాకోచత్వం తక్కువకాని మొత్తం మీద సరియైన పద్ధతిలో ఏర్పాటు చేసినప్పుడు ప్రత్యక్ష పన్నులు ఉత్పాదకత వ్యాకోచత్వాలను కలిగి ఉంటాయి. ఆదాయ విషయంలోనేకాక ఇతర సాంఘిక ఆర్థిక అంశాలు కూడ ప్రత్యక్షపన్నుల విధింపును బలపరుస్తాయి.

### 5.3.6 వ్యక్తుల పౌర సత్వ బాధ్యత

ప్రత్యక్ష పన్ను చెల్లించే వ్యక్తులకు పౌరసత్వపు బాధ్యతలను కలుగచేసి ప్రభుత్వ ఆదాయ వ్యయ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి దోహదం చేస్తాయి. పరోక్షపన్నుల ద్వారా తామెంత చెల్లిస్తున్నారో చెల్లింపుదారులకు తెలియకపోవుటచే చెల్లింపుదారులు ప్రభుత్వ ఆదాయ వ్యయకార్యకలాపాల్లో అభిలాషను చూపరు. కాని ఈ ఆలోచన విమర్శించబడుతుంది. ప్రతిపౌరుడు తానెంత మొత్తాన్ని పన్నుల రూపంలో చెల్లిస్తున్నాడు మొదలైన

BRAOU

అంశాలు చెల్లింపుదారులకు తెలియడంవల్ల పన్ను ఎగవేయడానికి ప్రయత్నిస్తారనే విమర్శ ఉంది.

ఇంతవరకు చర్చించిన అంశాలను బట్టి ప్రత్యక్ష పన్నులు చెల్లింపు సామర్థ్య సూత్రాన్ని తృప్తిపరుస్తాయి కనుక సమాజంలోని వివిధ వర్గాలమధ్య ఆదాయ సంపదల్లోని అసమానతలను తొలగించడానికి లేదా తగ్గించడానికి, ప్రభుత్వం తన విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి కావలసిన ఆదాయాన్ని సంపాదించడానికి ప్రత్యక్ష పన్నులు సహకరిస్తాయి.

## 5.4 ప్రత్యక్ష పన్నుల వల్ల నష్టాలు

### 5.4.1 సౌకర్య నియమం పాటించకపోవడం

ఇక ప్రత్యక్ష పన్నుల నష్టాలను పరిశీలిద్దాం. ప్రత్యక్ష పన్నులు సాధారణంగా సౌకర్యనియమాన్ని పాటించవు. పరోక్ష పన్నుల్లా కాక ప్రత్యక్ష పన్నులు ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని చెల్లించవలసినవై ఉంటాయి. కొన్ని సార్లు ముందుగా కూడా చెల్లించవలసి ఉంటుంది.

### 5.4.2 పొదుపు వ్యయాలపై ప్రభావం

పొదుపు వ్యయాలపై కూడా ప్రత్యక్ష పన్నులు చెడు ప్రభావాలు కలిగి ఉంటాయి. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయ పన్నును పెంచడంవల్ల పన్ను చెల్లించేవారి పనిచేయాలనేకోరికను దెబ్బతీసి విరామానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేటట్లు చేయవచ్చు. ఇది పన్ను చెల్లించే వారందరికి వర్తించదు. పన్ను చెల్లింపుదారుని కుటుంబసమస్యలు, అతని ఆదాయ వ్యాకోచత్వం మొదలైన అనేక అంశాలను కూడ లెక్కలోకి తీసుకుంటే కాని ఈ విషయాన్ని నిర్ణయించలేము. అదే విధంగా ఆస్తిపన్ను, వారసత్వ పన్ను మొదలగు పన్ను చెల్లింపు దారుని పొదుపు పెట్టుబడులపై ప్రభావాన్ని చూపుతాయి.

### 5.4.3 క్లిష్టతరమైన చట్టాలు

ప్రత్యక్షపన్నులకు సంబంధించిన పన్ను చట్టాలు క్లిష్టతరమైనవి. ప్రత్యక్ష పన్నుల (rules) నియమాలు చెల్లింపుదారులకు తెలియవు. అందుచే తమ రికార్డులను సరిగా ఉంచడానికి పన్ను పత్రాలను (tax returns) ప్రభుత్వానికి సకాలంలో సమర్పించడానికి చెల్లింపుదార్లు ఇతరులపై ఆధారపడాలి. ఇది క్లిష్టతరమైన పద్ధతి.

### 5.4.4 పన్ను ఎగవేత

ఆధునిక కాలంలో ప్రత్యక్ష పన్నులు తక్కువ ఉత్పాదకతను, వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటున్నాయి. దానికి కారణం పన్ను ఎగవేత అధిక శాతంలో ఉండటమే. ప్రత్యక్షపన్నుల విషయంలో పన్ను అధికారుల పీడింపును గూర్చి కూడ ఎన్నో ఫిర్యాదులున్నాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ప్రత్యక్ష పన్ను అనగా నేమి?
2. మూల్యానుగత పన్ను అనగానేమి?

B R A O U

3. ప్రత్యక్ష పన్ను వలన కలుగు లాభాలేవి?
4. పరోక్ష పన్నుల వలన కలుగు నష్టాలను గుర్తించుము.

## 5.5 పరోక్ష పన్నుల లాభాలు

పరోక్ష పన్నుల లాభాలలో ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

### 5.5.1 ఇబ్బంది తక్కువ

పన్ను అధికారులచేత వస్తుసేవల వినిమయ వ్యవహారాలు జరిగిన సమయంలోనే వసూలు చేయబడుటచే వీని వల్ల ఇబ్బంది చాలాతక్కువగాఉంటుంది.పరోక్ష పన్ను వస్తువు ధరలో కూడి ఉంటుంది. కాబట్టి పన్ను చెల్లించేవారు వారు పన్ను చెల్లిస్తున్నామనే తలంపు లేకుండానే చెల్లిస్తారు.

### 5.5.2 ఎగవేతకు తక్కువ అవకాశం

పరోక్ష పన్నుల్లో పన్ను ఎగవేతకు అవకాశము చాలా తక్కువ. ఉత్పత్తిస్థానాల్లో ప్రభుత్వ యంత్రాంగం సరియైన అదుపును (checks), గూఢాచారులను ఏర్పాటు చేస్తే ఒక వస్తువుపై విధించబడిన ఎక్సైజ్ సుంకాన్ని ఎగవేయడం చాలా కష్టం. కాని దీనిని సాధారణీకరించలేము. అమ్మకపు పన్నుల వంటి కొన్ని పన్నులను నిర్వహించడం చాలా కష్టం. ఎక్సైజ్ సుంకంలో కంటె అమ్మకం పన్నులో ఎగవేత ఎక్కువగా ఉంటుంది.

### 5.5.3 ఎక్కువ ఆదాయం

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో తగిన పొదుపు మొత్తాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం మూలధనసంచయనానికి పన్నులపై ఆధారపడుతుంది.ప్రత్యక్ష పన్నులపై వచ్చే ఆదాయం తక్కువగా ఉండడంవల్ల ఆర్థిక వనరులను సమకూర్చుకోవటానికి ప్రభుత్వం పరోక్ష పన్నులపై ఎక్కువ ఆధారపడుతుంది.

### 5.5.4 విలాస వినియోగాన్ని తగ్గించడం

పరోక్షపన్నులు విలాస వినియోగాన్ని తగ్గిస్తాయి దాని వల్ల కుటుంబ పొదుపు మొత్తాలు పెరుగుతాయి. వీటిని ఆర్థికాభివృద్ధికి ఉపయోగించవచ్చు. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి వినియోగాలను క్రమబద్ధం చేయడానికి పరోక్షపన్నులు సాధనంగా ఉపయోగిస్తాయి. ఉదాహరణకు ఒక వస్తువుపై ఎక్కువ రేటులో ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తే ఆ వస్తువు ధర పెరుగుతుంది. ఫలితంగా ఆ వస్తువు డిమాండు దెబ్బ తింటుంది. కాబట్టి ఆ విధమైన వస్తువుల ఉత్పత్తి తగ్గి పన్నులు తక్కువగా ఉన్న వేరొక వస్తువుల ఉత్పత్తికి ఆ వనరులు తరలింపబడతాయి. అదే విధంగా ఉద్యోగిత, వినియోగకార్యక్రమాలు కూడా పరోక్షపన్నుల వల్ల క్రమబద్ధం చేయబడతాయి.

### 5.5.5 సమతా సూత్రం

ధనిక వర్గాలచే సాధారణంగా వినియోగింపబడే వస్తువులపై కూడా పరోక్షపన్నులను విధిస్తే పరోక్ష పన్నుల విషయంలో సమతా సూత్రం నెరవేరుతుంది. ఈ విధమైన పరోక్ష పన్నులు సమాజంలోని వివిధ వర్గాల మధ్య వినియోగంలోని అసమానతలను తొలగించడానికి దోహదం చేస్తాయి.

## 5.6 పరోక్షపన్నుల వల్ల నష్టాలు

పరోక్ష పన్నుల వల్ల కలిగే కొన్ని ముఖ్య నష్టాలను మనం ఇప్పుడు చూద్దాం.

### 5.6.1 తిరోగమన స్వభావం

పరోక్షపన్నులలో అధిక భాగానికి తిరోగామిత్వం (regressiveness) ఆరోపించబడుతోంది. ఒక వస్తువును కొనుక్కునేటప్పుడు బీదవాడు, ధనికుడు కూడా సమానమైన మొత్తాన్నే చెల్లిస్తాడు. అందుచేత ఈ పన్నులు చెల్లింపు సామర్థ్య సూత్రాన్ని త్రోసి పుచ్చుతాయనివిమర్శింపబడుతోంది. ఇంకో విధంగా చెప్పాలంటే పరోక్ష పన్నులు సమతా నియమాన్ని నెరవేర్చడం లేదనవచ్చు.

### 5.6.2 ద్రవ్యోల్బణ లక్షణం

పరోక్షపన్నులు ద్రవ్యోల్బణ లక్షణాన్ని కలిగి ఉంటాయి. పరోక్షపన్నులు విధింపబడినవో వస్తు సేవల ధరలు పెరుగుతాయి. దానివల్ల ద్రవ్యోల్బణ శక్తులు ఉత్పన్నమౌతాయి. ఆధునిక కాలంలో చాలా వస్తువులపై ఎక్కువగా పరోక్ష పన్నులు విధించడం ద్రవ్యోల్బణం పెరగడానికి ఒక కారణంగా చెప్పబడుతుంది. దీని ఫలితంగాదేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడవచ్చు.

### 5.6.3 వసూళ్ళలో అనిశ్చలత

ఈ పన్నుల వల్ల ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందో ఖచ్చితంగా తెలియదు. పరోక్షపన్నులు అధికంగా విధిస్తే ఆ వస్తువుల డిమాండు తగ్గిపోయి పన్ను ఆదాయం కూడా తగ్గుతుంది.

### 5.6.4 ఎగవేతకు అవకాశం

పరోక్షపన్నుల విషయంలోకూడ పన్ను ఎగవేతకు అవకాశం ఉందనే వాదం ఉంది. ఉదాహరణకు దొంగ రవాణా, నకిలీ చట్టాలను తయారుచేయడం వల్ల అమ్మకం పన్నును ఎగవేసే అవకాశాలున్నాయి.

### 5.6.5 లాభదాయకం లేకపోవడం

కొన్ని సమయాల్లో పరోక్షపన్నుల వసూళ్ళు, నిర్వహణకు అయ్యే వ్యయాలు అమితంగా ఉంటాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి –2

1. పరోక్ష పన్నులనగానేమి?
2. పరోక్ష పన్ను లాభాలను గుర్తించుము
3. పరోక్ష పన్నుల వలన కలుగు నష్టాలు ఏవి?

B R A O U

## 5.7 ప్రత్యక్ష పరోక్ష పన్నుల పోలికలు

ప్రత్యక్ష పరోక్ష పన్నులు రెండింటికీ కూడా లాభనష్టాలు ఉన్నాయనే విషయంపై చర్చవల్ల తెలుస్తుంది. ప్రతీపన్నుల వ్యవస్థ ఈ రెండు పన్నులను కలిగిఉంటుంది. సాధించదగిన అనేక లక్ష్యాలనుదృష్టిలో ఉంచుకుంటూ పరోక్ష పన్నుల కంటెప్రత్యక్షపన్నులుతక్కువ భారాన్ని కలిగి ఉంటాయా? అనే అంశాన్ని ఇప్పుడు చర్చిద్దాం.

పరోక్షపన్నులకంటె ప్రత్యక్షపన్నుల విషయంలో తక్కువ త్యాగానికి గురి అవుతారు. కనుక పరోక్ష పన్నుల కంటె ప్రత్యక్ష పన్నులే మేలైనవని హిక్స్ అభిప్రాయం.

పరోక్ష పన్నుల, ప్రత్యక్షపన్నుల ఆధిక్యత విషయంలో ఆర్థికవేత్తలలో ఏకాభిప్రాయంలేదు. పన్నుల విధింపును ఎల్లప్పుడుఉత్పత్తి పంపిణీలపై వాని ప్రభావాల దృష్ట్యా విశ్లేషణ చేయాలి. ప్రభుత్వంచేవిధింపబడిన ప్రత్యక్ష పన్నులుగాని పరోక్ష పన్నులుగాని ఎంత భారాన్ని కలగజేస్తున్నాయి అనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రభుత్వ వ్యయ ప్రభావాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి.

## 5.8 అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఆర్థికాభివృద్ధిని త్వరితం చేయడానికి పేదరికపు విషవలయాన్ని ఛేదించడం అవసరం. దీనికిమూలధన సంచయనానికి ఎక్కువవనరులు అవసరం. ఈ వనరులను సమీకరించడానికి పన్నులు ప్రధానపాత్ర వహిస్తాయి. అంతేకాక ఆర్థిక స్థిరత్వాన్ని వనరుల కేటాయింపులోసామర్థ్యాన్ని అభిలషణీయమైన ఆదాయ పంపిణీని సాధించడానికి కూడపన్నులు ఉపకరిస్తాయి. సరియైన పన్నులు విధించబడటంలో ఉద్దేశం ప్రజల వినియోగాన్ని తగ్గించకపోతే ఆదాయమంతా వినియోగింపబడి పొదుపులేవీ మిగలవు. తగిన పన్నులను విధించడం ద్వారా ప్రజల వినియోగాన్నితగ్గించి వనరులను ప్రభుత్వానికి మళ్ళించడం పన్నుల ఉద్దేశం. కాని ఈ విధమైన మళ్ళింపు సార్థక డిమాండును తగ్గించరాదని గుర్తుంచుకోవాలి. పన్నుల నిర్మాణం ఏమిటి? ప్రత్యక్ష పరోక్ష పన్నుల కలయిక ఏ విధంగా ఉండాలి?

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నిటిలో పరోక్షపన్నులకంటె ప్రత్యక్షపన్నులపై నమ్మకం ఎక్కువగా ఉంచారు కాని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పన్ను నిర్మాణంలో పరోక్ష పన్నులే ఎక్కువ ప్రాధాన్యం వహిస్తున్నాయి. బ్రిటన్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా అభివృద్ధి తొలి దశల్లో ప్రత్యక్షపన్నుల నిర్మాణం ప్రబలమవలేదు. కాని కాలక్రమంగా వారి ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధిచెందుతుంటే పరోక్షపన్ను నుండి ప్రత్యక్ష పన్నులకు స్పష్టమైన మార్పు జరిగింది.

*అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రత్యక్ష పరోక్ష పన్నులపాత్ర*

వెనుకబడ్డ దేశాల్లో ఆర్థికాభివృద్ధి ప్రణాళికా లక్ష్యాలను సాధించడానికి ప్రత్యక్ష పరోక్షపన్నులలో ఏది ముఖ్యమనే దాని కంటె అది నిర్వహిస్తున్న పాత్ర ప్రాధాన్యత వహిస్తుంది. ప్రత్యక్ష పరోక్ష పన్నుల ఎంపిక చాలా వివాదాలకి దారి తీసింది. పన్నుల విధానంలో సమగ్రత సాధించడానికి ఈ రెండు రకాలైన పన్నుల అవసరమే. వాటిని పూరకాలుగా గుర్తించాలి. కాని వ్యతిరేకమయిన వవి భావించరాదు.

ఇంతకు ముందు వివరించినట్లు పరోక్షపన్ను ద్వారా కొంత మొత్తం వసూలు చేసినప్పుడూఅంతే మొత్తాన్ని ప్రత్యక్ష పన్ను ద్వారా వసూలు చేసినప్పటి కంటె తక్కువ శ్రేయస్సు స్థితిలో ఉండడాన్ని, మార్షల్,హిక్స్



BRAOU

మొదలగు ఆర్థిక వేత్తల విశ్వాసం. మార్షల్ అభిప్రాయంలో వస్తువుపై పన్ను విధించినపుడు పన్ను ఆదాయంకంటే వినియోగ దారుని మిగులులో తగ్గుదల ఎక్కువగా ఉంటుంది. అలాగేహిక్స్‌కూడ వస్తువులపై విధించిన పన్నులు ఆదాయ పన్ను కంటె ఎక్కువ భారాన్ని వినియోగదారునిపై మోపుతాయని అభిప్రాయపడెను.

### వనరుల వంపిణీ పై పరోక్ష పన్నుల ప్రభావం

పరోక్షపన్నులలోని లోపాలలో అతిముఖ్యమైనది వనరుల కేటాయింపులో వీటి ప్రభావానికి సంబంధించినదని చాలామంది ఆర్థికవేత్తలు తెలిపారు. పరోక్ష పన్నులుసాపేక్ష ధరలలో మార్పులను తీసుకువస్తాయి. ఫలితంగా వనరులు పన్ను విధింపబడిన పరిశ్రమ నుండి వేరే ఉత్పత్తి మార్గాల్లోకి తరలిపోతాయి. ఈ విధమైన తరలింపు ఉత్పత్తి రీతులను మార్చి వేసి పూర్వపు పరిస్థితికంటె తక్కువ ప్రయోజన పరిస్థితిని కల్పిస్తుంది. పరోక్ష పన్నులు లేనప్పుడు ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేయబడిన వివిధ వస్తువుల సాపేక్ష పరిమాణాలు ఆదర్శవంతంగా ఉంటాయని ఈ వాదన ఊహిస్తుంది. కాని పరోక్షపన్నును విధించడం వల్లవనరుల కేటాయింపులోవచ్చినమార్పులు అనవసరమైనవని తలంచరాదు. కొన్ని వస్తువుల ఉత్పత్తి వినియోగాన్ని క్రమబద్ధం చేయడానికి కొన్ని సార్లు వనరుల బదలాయింపు కోరదగింది అవుతుంది. ఉదాహరణకు హానికరమైన మందులు, మత్తు పదార్థాలు మొదలైన వానిపై పరోక్ష పన్నులను విధించడంలో ఉద్దేశం వాటి ఉత్పత్తి వినియోగాన్ని తగ్గించి ప్రజల సంక్షేమాన్ని పెంచడం, ప్రత్యక్ష పన్నుల కంటె పరోక్ష పన్నులు అధిక భారాన్ని కలిగి ఉంటాయనే వాదన అన్ని సందర్భాల్లోను సరికాదు.

వ్యక్తి గత ఆదాయపు పన్ను మొదలైన ప్రత్యక్ష పన్నుల విషయంలో కూడా అధిక బార వాదన తీసుకురావచ్చు. ఉదాహరణకు ఆదాయపన్ను ఒక వ్యక్తి పెట్టుబడి నిర్ణయాలను భంగపరిచేటట్టుగా ఉన్నప్పుడూ అతనిపై అధిక బారం పడుతుంది. వ్యక్తిపని,విశ్రాంతి ఎంపిక ఈ పన్ను చెల్లింపులవల్ల ప్రభావితమౌతుంది. ఇంతకీ చెప్పేదేమంటే ప్రత్యక్ష పన్నుల నెంచుకోవాలా పరోక్ష పన్నుల నెంచుకోవాలా అనే వివాదం ప్రభుత్వ విత్తం సాహిత్యంలో చాలా ప్రాధాన్యత వహిస్తోంది. కాని ఆర్థిక వేత్తల మధ్య ఏకాభిప్రాయంలేదు.

గణాంక వివరాల దృష్ట్యా ఒక ముఖ్యమైన అంశం స్పష్టంగా కన్పిస్తోంది. మొత్తంపన్నుల ఆదాయంలో ప్రత్యక్ష పన్నుల భాగం అభివృద్ధి చెందుతున్న దేశాలలో కంటె అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా ఎక్కువ

BRAOU

**పట్టిక – 1**

**మొత్తం పన్నుల ఆదాయంలో ప్రత్యక్ష పరోక్ష పన్నుల ఆదాయాల శాతం**

| క్రమసంఖ్య | దేశం | ప్రత్యక్ష పన్నుల భాగం (%) | పరోక్షపన్నుల భాగం (%) |
|---|---|---|---|
| 1. | అమెరికా | 92.3 | 7.7 |
| 2. | బ్రిటన్ | 66.6 | 33.4 |
| 3. | ఆస్ట్రేలియా | 72.4 | 27.6 |
| 4. | జపాన్ | 73.4 | 26.6 |
| 5. | ఇండియా | 22.3 | 77.6 |
| 6. | ఫిలిప్పైన్స్ | 23.4 | 76.6 |
| 7. | పాకిస్తాన్ | 14.6 | 85.4 |

ఆధారం : U.N. Statistical Year Book, 1976

## అభివృద్ధి చెందిన దేశాలలో ప్రత్యక్ష పన్నుల పాత్ర

అభివృద్ధి చెందిన దేశాల్లో పన్నుల విధానంలోని ప్రత్యక్ష పన్నులు చాలా ముఖ్య మైన పాత్రను వహిస్తున్నాయనే విషయం దీని వల్ల తెలుస్తుంది. ఈ విధమైన పరిస్థితికి కొన్ని కారణాలను చెప్పవచ్చు.

1.అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజల తలసరి ఆదాయం ఎక్కువగా ఉండి వారు జీవనాధారం కంటె ఎక్కువ స్థాయిలో ఉంటారు కనుక పన్ను వ్యవస్థలో వ్యాకోచత్వాన్ని పెంచడానికి ఎక్కువ ఆదాయాన్ని పొందడానికి ప్రత్యక్ష పన్నులు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి.

2. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కంటె అభివృద్ధి చెందిన దేశాల పన్నుల నిర్మాణంలో ప్రత్యక్ష పన్నుల విధింపు చాలా ఎక్కువగా ఉంటుంది.

3.అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రత్యక్ష పన్నుల ద్వారా వనరులను పెంచడానికి అనుకూలమైన పరిస్థితులుంటాయి. 'రిచర్డ్ గూడ్' ప్రకారం ఆ మార్గాలు :

1. ద్రవ్య ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య చలామణి అధికంగా వుండడం.
2. పన్ను చెల్లించేవారిలో అక్షరాస్యత ఎక్కువగా ఉండడం
3. నిజాయితీగ, నమ్మదగినవిగా చిట్టాలు నిర్వహింపబడటం
4. పన్ను చెల్లించే వారిలో చాలా భాగం స్వచ్ఛందంగా సమ్మతి ప్రకటించటం.
5. మంచి రాజకీయ పరిస్థితులుండటం
6. నిజాయితీ సమర్థతలతో కూడిన పన్నుల పరిపాలన

## అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రత్యక్ష పన్నుల పాత్ర

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ పరిస్థితులుండవు.ద్రవ్యచలామణిలేని వస్తుమారకం అధికంగా వుండుట. కనీస జీవనస్థాయిలోనే బ్రతుకుతున్న ప్రజలు అధిక సంఖ్యలో ఉండడం వల్ల ప్రత్యక్ష పన్ను విధింపును ప్రవేశపెట్టడం సాధ్యంకాదు. అభివృద్ధి చెందుతున్నదేశాల్లో ప్రత్యక్ష పన్నుల పాత్ర చాలా తక్కువగా ఉండుటకు జాన్. హెచ్. అడ్లర్, ఈ క్రింది కారణాలను పేర్కొనెను. 1. భూస్వాముల, పట్టణ ఆస్తులయజమానుల రాజకీయ పలుకుబడి 2.ద్రవ్యోల్బణం వల్ల పన్నుల ఆదారం తగ్గడం రేట్లు పెంచడం ద్వారా దీన్ని సరిచేయకపోవడం 3. ఆస్తి విలువను మదింపుచేసి ఎప్పటికప్పుడు సవరించడం కష్టంగా ఉండటం.

అధిక సంఖ్యలో ఉద్యోగస్థులు పని చేసే పెద్ద సంస్థలు ఉన్నప్పుడే ఆదాయం, లేక లాభాలపై ప్రత్యక్షపన్నుల విధింపు విజయవంతమౌతుందని కాల్డార్ అభిప్రాయం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ఆర్థిక వ్యవస్థ చిన్న చిన్న సంస్థలతో కూడి ఉంటుంది. వాటి యజమానుల లాభాలపై దాన్ని అందులో పనిచేసే ఉద్యోగస్తుల వేతనాలపై ప్రత్యక్షపన్నులను విధించడం సౌకర్యంగాను సమర్థవంతంగాను ఉండదు. ఈ కారణాలన్నిటి వల్ల అభివృద్ధి చెందని దేశాల్లో ప్రత్యక్ష పన్నులు చాలా తక్కువ పాత్ర వహిస్తున్నాయనే విషయం తెలుస్తోంది.

## రష్యా జపాన్‌లలో పరోక్ష పన్నులపై ఆధారపడడం

అభివృద్ధి చెందిన దేశాల్లో రష్యా, జపాన్ వంటివిప్రత్యక్ష పన్నుల కంటె పరోక్ష పన్నుల మీదే ఎక్కువ ఆధారపడుతున్నాయి. రష్యాలో కార్మికులకు కల్పించే ప్రోత్సాహకాలలో ద్రవ్య శ్రమఅధిక ప్రాధాన్యత వహిస్తోంది.

కార్మికులు ధరలలో మార్పుల కన్నా జీతాల్లో మార్పులకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తారని ప్రభుత్వం నమ్మకం [illegible] వారు ఇంటికి తీసుకు వెళ్ళే జీతం మీద ఎక్కువ ఆశ కనబరుస్తారు. కాబట్టి పరోక్ష పన్నుల వల్ల ధరలు పెరిగినప్పటికీ కార్మికులలో ద్రవ్య భ్రమ ఫలితం బలంగా ఉంటుంది. పరిపాలన కారణాల వల్ల కూడా రష్యా ప్రభుత్వం వస్తువులపై విధించే పరోక్ష పన్నులపై అధికంగా ఆధారపడుతుంది. ఆర్థికాభివృద్ధి తొలి దశల్లో సంఖ్య తక్కువగా ఉండి నమ్మకమైన ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలు టోకు వ్యాపార సంస్థలు కొద్ది సంఖ్యలో ఉండి నమ్మకమైన చిట్టాలను కలిగి ఉంటాయి. కనుక టర్నోవర్‌పై పన్ను వసూలు చేయబడేది. అందువల్ల పన్ను వసూలు చౌకగాను,ఎగవేతకు అవకాశం లేకుండానూ ఉండేది.

జపాను విషయంలో ప్రభుత్వ వ్యయం, పన్నులుచాల తక్కువ. మూలధన సంచయనానికి ప్రైవేటు రంగంపై ఎక్కువ ఆధారపడింది. జపాను అభివృద్ధి చెందుతున్న సంవత్సరాల్లో తక్కువ ఉత్పాదకత కలిగిన వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు మొదలైన వాటి నుండి అధిక ఉత్పాదకత కలిగిన రంగాలకు కార్మికులు మారడం ద్వారా మూలధన సంచయనం వేగంగా జరిగింది. ప్రభుత్వం ప్రత్యక్షపన్నులలో కొన్ని మినహాయింపులను ఇవ్వడం వల్ల వ్యక్తుల, ప్రైవేటు కార్పోరేషన్ల పొదుపులు పెరిగాయి. కాని ప్రత్యక్ష పన్నుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపువల్ల జపాన్ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు పెరిగాయని గుర్తించబడింది. కనుక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పంపిణీ న్యాయం ఉద్దేశమైతే జపాన్ నమూనా పనికిరాదు

ఈ దేశాల్లో అభివృద్ధి తొలిదశల్లో పరోక్ష పన్నులపై ఎక్కువ ఆదారపడడం వల్ల ఆదాయ సంపదల పునః పంపిణీ దెబ్బ తింటుంది. కాబట్టి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అభివృద్ధి తొలి దశల్లో పరోక్షపన్నులపై ఎక్కువగా ఆధారపడ్డం ఆదాయ సంపదల పునఃపంపిణీనీ దెబ్బతీస్తుంది. కాని ప్రత్యక్ష పన్నులపై ఆధారపడితే ఈ దేశాల్లో ఆర్థికాభివృద్ధికి అవసరమైన ద్రవ్యవనరులు సమకూరవు. కనుక అభివృద్ధి చెందుతున్న దేశాలు రెండు సమస్యలలో చిక్కుకున్నాయి. ఇవి – 1. వెనుకబడినదేశాలఅభివృద్ధి క్రమాలకు అవసరమయ్యే ద్రవ్య వనరులను సమకూర్చడం ఎలా? 2. అలా ద్రవ్యవనరులను సమీకరించినప్పుడు సాంఘిక న్యాయం దృష్ట్యా ఆదాయ పునఃపంపిణీ ఎలా ప్రభావితమౌతుంది.?

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్ష పరోక్ష పన్నులు రెండూ వాటి పాత్రను నిర్వహిస్తున్నాయి. వీటి అవసరాన్ని సమర్థించే కొన్ని వాదనలను పరిశీలిద్దాం.

**అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరోక్షపన్నుల సమర్థత**

పరోక్ష పన్నులను సమర్థించే వాదనలు ఈక్రింది విధంగా ఉన్నాయి.

1. పరోక్షపన్నులు వస్తువుల ధరలలో కలిసిపోయి ఉంటాయి. కనుక పురోగామిగా ఉండే ప్రత్యక్షపన్ను కంటె ఇవి తక్కువ నిరుత్సాహక ప్రభావాన్ని కలుగజేస్తాయి. 'ఆర్థర్ లూయిస్' చెప్పినట్లుగా "పన్ను చెల్లించే వారికి తాము కొన్న వస్తువు యొక్క ధరలో ఎంత పన్ను ఇమిడి ఉందో తెలియదు. పన్ను విధింపు వల్ల కలిగే నిరుత్సాహక ప్రభావం మానసికమైంది కావున ప్రత్యక్ష పన్ను కంటె పరోక్ష పన్ను ఉపయోగించడం వల్ల దాన్ని తొలగించవచ్చు."

2. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సరాసరి ఆదాయం ఎక్కువగా ఉండడంవల్ల ప్రత్యక్షపన్నుల ద్వారా [illegible] ద్రవ్య వనరులను సమకూర్చుకొనే అవకాశం తక్కువ. కనుక తార్కికంగా చూస్తే ఇది పరోక్షపన్నుల ద్వారానే [illegible] వనరులను సమకూర్చుకోగలదని అర్థమౌతుంది.



BRAOU

3. అభివృద్ధి తొలిదశల్లో విలాస వినియోగాన్ని తగ్గించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు ఆదాయాలు పెరిగే కొద్ది విలాసాలపై ఎక్కువగా ఖర్చు పెడతారు. కాబట్టి పరోక్ష పన్నుల విధింపు ద్వారా దానిని తగ్గించాలి. కానిదీనివల్లప్రజల వినియోగం దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకోవాలి. రాజా జె. చెల్లయ్య అభిప్రాయం ప్రకారం పరోక్షపన్నులు ప్రజల వినియోగంలో వచ్చే పెరుగుదలనుఅదుపు చేసేవిగా ఉండాలి కాని ప్రస్తుత వినియోగాన్ని తగ్గించరాదు ఈ విషయాన్ని పరిశీలించడానికి పరోక్ష పన్నులు ఉపయోగిస్తాయి.

4. సాధరణంగా పరోక్ష పన్నులు తిరోగామి పన్నులుగా పరిగణింపబడతాయి. కాని సాధారణ వ్యక్తి వినియోగించే వస్తువులపై కంటే ధనికవర్గాలు వినియోగించే వస్తువులపై అధిక రేట్లతో పన్ను విధించడంవల్ల పరోక్ష పన్నులకు కూడా పురోగామిత్వం కలుగజేయవచ్చు.

5. లేడీ హిక్స్, బి. మిశ్రా మొదలైన ఆర్థిక వేత్తల అభిప్రాయంలో పరోక్షపన్నుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా మొత్తం ఖర్చును తగ్గించి ద్రవ్యోల్బణాన్ని అరికట్టేవిగా గుర్తింపబడ్డాయి.

పై అంశాలను బట్టి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లోని పరిస్థితుల దృష్ట్యా ప్రత్యక్షపన్నుల కంటె పరోక్ష పన్నులు చాలా ఆధిక్యత కలవనే అభిప్రాయం కలుగుతోంది. కాని ప్రత్యక్ష పన్నులకు అనుకూలంగా కూడా బలమైన వాదనలున్నాయి.

ప్రత్యక్షపన్నుల అనుకూల వాదన

1. అభివృద్ధిచెందుతున్న దేశాల్లో పరోక్ష పన్నులు చాలా ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నప్పటికీ వీటిని ప్రభుత్వానికి వనరులను సమకూర్చడానికి ఉపయోగపడే అల్పకాలిక చర్యగానే భావించాలి. దేశం ఒక అభివృద్ధి స్థాయిని చేరుకున్నాక ప్రత్యక్షపన్నులే ఎక్కువ ప్రాధాన్యత వహించే పరిస్థితిని సృష్టించేటట్టు కోశవిధానం ఉండాలి. అభివృద్ధి చెందిన దేశాలైన బ్రిటన్ అమెరికాలను పరిశీలిస్తే పరోక్ష పన్నుల నుండి ప్రత్యక్ష పన్నుల విధానానికి మారినట్లు మనం గుర్తించవచ్చు.

BRAOU

2. ప్రత్యక్షపన్నులు ఈ దేశాల పన్నుల నిర్మాణంలో అంతర్గత పరిణామావకాశత (built-in-flexilility) కలిగి ఉన్నాయి. జాతీయాదాయం పెరిగితే ప్రభుత్వానికి పన్ను ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశముంది. ప్రత్యక్ష పన్నులు పురోగామిత్వాన్ని కలిగి ఉండడంవల్ల జాతీయాదాయం పెరిగినప్పుడు పన్ను ఆదాయాన్ని పెంచడానికి చాలా అనువుగా ఉంటాయి.

3. ప్రత్యక్ష పన్నులు పురోగామిత్వ లక్ష్యాన్ని పన్నుల విధింపులో సమతా నియమాన్నీ నెరవేరుస్తాయి.

4. ప్రత్యక్ష పన్నులు, ప్రైవేటు మూలధన సంచయనంపై చెడు ఫలితాలు కలుగజేస్తాయనే విమర్శ ఉన్నప్పటికీ వాటిని విధించేటప్పుడు సరియైన జాగ్రత్త తీసుకుంటే ఈ విమర్శకు అవకాశం ఉండదు. ప్రత్యక్ష పన్నులు విధించేటప్పుడు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

i). ప్రత్యక్షపన్నుల వల్ల కలిగే సగటు భారాన్ని కనీస స్థాయిలో ఉంచి ఉపాంత భారం పురోగామి కాకుండ చూడవచ్చు.

ii). ఉత్పత్తి, ప్రైవేటు మూలధన సంచయనాలపై చెడు ఫలితాలు కలుగజేయకుండా ఆదారాలను గుర్తించాలి.

iii). ప్రైవేటు మూలధన సంచయనంపై పన్నులు చెడు ఫలితాలను కలుగజేయకుండా ఉండేటట్లుగా కొన్ని మినహాయింపుల నివ్వాలి.

5. ఇతర పరిస్థితులు అనుకూలంగాఉంటే ప్రత్యక్షపన్నులు ప్రైవేటు పెట్టుబడిపై చెడు ఫలితాలు కలుగజేయవని చెప్పబడుతోంది. సంస్థాగత విత్త సదుపాయాలు, పెట్టుబడిపై ఎక్కువ రాబడికి అవకాశం, అనుకూల పారిశ్రామిక వాతావరణం మొదలైన అంశాలు అనుకూలంగా ఉంటే ప్రైవేటు పెట్టుబడి పెరుగుతుంది.

6. పరోక్షపన్నులతోపోలిస్తే ప్రత్యక్షపన్నులు ధనికపేద వర్గాలమధ్య అసమానతలను తగ్గించడానికి శక్తివంతమైన సాధనాలుగా కనిపిస్తాయి. పరోక్షపన్నులు తిరోగామితత్వాన్ని కలిగి ఉండి అసమానతలను తీవ్రతరం చేస్తాయి.

## 5.9 ప్రత్యక్షపన్నులు – కొన్ని ఉదాహరణలు

### 5.9.1 వ్యక్తిగత ఆదాయపు పన్ను

ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఆదాయపు పన్ను భావనలోను, పరిధిలోనూ అనేక తేడాలున్నాయి. ఆదాయపు పన్నులు సర్వసామాన్యంగా (universal) కాని పాక్షికంగా కాని ఉంటాయి సర్వసామాన్యమైన ఆదాయపు పన్నులో మినహాయింపు పరిమితి చాలా తక్కువగా ఉండి దాదాపు ప్రతి కుటుంబం చెల్లించవలసి వచ్చేటట్లుగా ఉంటుంది. రెండవ ప్రపంచయుద్ధకాలంలో ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా వంటి దేశాలు ఈ విధమైన సర్వసామాన్య ఆదాయ పన్నును విధించాయి. పాక్షిక ఆదాయపు పన్ను విధానంలో చాలా తక్కువ కుటుంబాలు పన్ను చెల్లిస్తాయి. వ్యక్తిగత మినహాయింపులు ఎక్కువగా ఆమోదింపబడతాయి. కొన్ని దేశాల్లో ఆ దేశంలో ఉత్పత్తి అయిన ఆదాయంపై మాత్రమే (ఆధారసూత్రం) పన్నులు విధించబడతాయి. మరికొన్ని దేశాల్లో ఆయా దేశాల్లో నివసించే వారి ఆదాయం పైన వారు పరదేశాల్లో సంపాదించిన ఆదాయంపైన కూడ పన్ను విధించబడుతుంది. ఆధునిక ఆర్థికవేత్తలు పన్ను విధించడానికి ఆదాయాన్ని మూడు విధాలుగా విభజించారు. 1. వినియోగంలో సేవల ప్రవాహంగా ఆదాయం (income as service-flow in consumption) 2.మరల మరల పొందిన ఆదాయంలో (income as "recurrent" receipts) 3. ఆదాయంఒక నిర్ణీత కాలంలో వ్యక్తి ఆర్థిక శక్తికి నికరచేర్పులు (as the net additions to an individual).

BRAOU

### వినియోగ భావనలో సేవా భావన

మొదటిపద్ధతిలో నిర్ణీతకాలంలో ఒక వ్యక్తిచే కొనుగోలు చేయబడిన వస్తుసేవల విలువ ఆదాయంగా పరిగణింపబడుతుంది. ఇది కుటుంబ వినియోగ వ్యయం. మరియు మన్నికగల వస్తువుల నుండియు, కుటుంబసభ్యులు కుటుంబశ్రేయస్సుకై చేసిన చెల్లింపు లేని శ్రమ యొక్కయు, అంచనావేయబడినద్రవ్య విలువ కలుపగా వస్తుంది. ఈ నిర్వచనంలో మన్నికగల వస్తువులపై వ్యయాలు అవి ఉత్పాదక వస్తువులైనా, వినియోగవస్తువులైనా పొదుపుగానే పరిగణింపబడతాయి. ఈ భావనను ఆచరణలో పెడితే ధనికవర్గాల ప్రస్తుత ఆదాయాలలో చాల భాగం వ్యక్తి గత ఆదాయపు పన్ను విధానం నుండి తప్పించుకుంటుంది. ఈ భావన ఆదాయపు పన్నును వ్యయ పన్నుగాను, వినియోగ పన్నుగాను మార్చేస్తోంది.

### వినియోగార్థమైన మరల వచ్చే ఆదాయాలు భావన

రెండవ భావన వినియోగార్థమైన మరల మరల వచ్చే ఆదాయాలకు సంబంధించినది. ఈ భావనను

'కార్ల్‌షైహన్' ప్రతిపాదించెను. అతడు ఆదాయానికి మూడు లక్షణాలను పేర్కొన్నాడు. అవి 1. పొందడం 2. వస్తుందని ఊహించగలగడం 3. వ్యయార్హతకంది. ఈ లక్షణాల ఆధారంగా జీతాలు, వడ్డీలు, భాటకాలు (rents) వార్షికాలు, (annuities) పెన్షనులు, కార్పొరేటు డివిడెండ్లు మొదలగు అంశాలను ఆదాయంలో చేర్చినాడు. ఈ పద్ధతిలో మూలధనం మార్పిడుల వల్ల కలిగే లాభనష్టాలు మరల మరల రావు కనుక ఇందులో చేర్చబడలేదు. కొందరు ఆర్థికవేత్తలు ఈ భావనను ఈ క్రింది విధంగావిమర్శించినారు.

1. వడ్డీలు డివిడెండ్లు మొదలైన ఆదాయాలను మరల మరల వచ్చేవిగా చెప్పడం అన్ని సందర్భాల్లోనూ సరికాదు. ఒక వ్యక్తి ఈ విధమైన ఆదాయాన్ని అప్పుడప్పుడు అనుభవిస్తాడు.

2. మూలధన లాభనష్టాల వల్ల వచ్చిన ఆదాయాలు మరల మరల వచ్చేవి కాకపోవడం వల్ల పన్ను విధింపునుండి తప్పుకుంటాయి.

## నికర చేర్పుల భావన

నికర చేర్పులు అనే మూడవ భావన ఆధారంగా పన్ను విధించడం సమంజసమని భావించబడుతోంది. ఒక నిర్ణీతకాలంలో వ్యక్తి పొందిన అన్ని రకాల ఆదాయాలు లేదా కొనుగోలు శక్తి పెరుగుదల పన్ను విధించడానికి తగిన ఆదాయంగా గుర్తించబడుతోంది. ఆదాయాన్ని ఈ విధంగా లెక్కించడం వల్ల వ్యక్తి పన్ను చెల్లింపు సామర్థ్యం లెక్కలోకి తీసుకోబడుతుంది. ఈ భావనలో పై రెండుపద్ధతులలోని అన్ని అంశాలు కూడా చేర్చబడి ఉన్నాయి.

కావున వ్యక్తిగత ఆదాయపు పన్ను నికరచేర్పు భావన ప్రకారం లెక్కించిన ఆదాయం ఆధారంగా వసూలు చేయబడుతోంది. సాధరణంగా ఆదాయపు పన్ను రేట్లు పురోగామిత్వాన్ని కలిగి ఉంటాయి. అంటే ఎక్కువ ఆదాయాన్ని సంపాదించేవారు ఎక్కువ అనుపాతంలో పన్ను చెల్లించవలసి ఉంటుంది. పన్ను విధింపుకు తీసుకోబడిన ఆదాయం పెరిగినపుడు పన్ను రేటు కూడా పెరుగుతుంది. ఉదాహరణకు ఇండియాలో 1990-91 సంవత్సరంలోని వ్యక్తిగత ఆదాయపు పన్ను పట్టిక ఈ క్రింద ఇవ్వబడింది.

B R A O U

### పట్టిక – 2
### ఆదాయపన్ను రేటు విధానం

| | నికర ఆదాయ రేంజి | ఆదాయపు పన్ను రేటు |
|---|---|---|
| 1. | 22,000 రూ॥లకు | లేదు |
| 2. | 22,000 రూ॥లనుండి 30,000 రూ॥ల వరకు | 22,000 రూ॥లకు పైబడిన ఆదాయంలో 20% |
| 3. | 30,000 రూ॥లనుండి 50,000 రూ॥లకు | రూ॥ 1600 + 30,000 రూ॥ల పై బడిన ఆదాయంలో 30% |
| 4. | 50,000 రూ॥ల నుండి 1,00,000 రూ॥ల వరకు | రూ॥ 7,600 +50,000 రూ॥ల పై బడిన ఆదాయంలో 40% |
| 5. | రూ॥ 1,00,000 పై బడి | రూ॥ 27,600 + 1,00.000 పైబడిన ఆదాయంలో 50% |

ఆదాయం పెరిగితే ప్రతీ స్లాబ్ లోను పన్ను రేటు కూడా పెరుగుతుందని పై పట్టికను బట్టి తెలుసుకోవచ్చు. పై రేట్లప్రకారం విధించబడిన పన్నే కాకుండా ఆ పన్ను మొత్తంపై 8% సర్ చార్జీని ఒక వేళ మొత్తం ఆదాయం 75,000 రూ॥లకు మించినట్లయితే విధిస్తుంది.

### 5.9.2 కార్పోరేషన్ ఆదాయపు పన్ను

కార్పోరేషన్ పైనా, కంపెనీ ఆదాయాలపైనా విధించే పన్నును 'కార్పోరేషన్ ఆదాయపు పన్ను' అంటారు ఇది ఈ క్రింది అంశాల ఆధారంగా సమర్థించబడింది. 1. కార్పోరేషన్ ప్రత్యేకమయిన వ్యక్తిత్వము కలది. కాబట్టి వాటాదారుల చెల్లింపు సామర్థ్యానికి అదనంగా దీనికి కూడా కొంత చెల్లించగల సామర్థ్యం ఉంటుంది. 2. వాటాదార్లు కార్పోరేషన్ నుండి కొన్ని. ప్రత్యేక సదుపాయాలను అనుభవిస్తారు. కనుక అదనపు పన్నులను విధించడంన్యాయం.3) కార్పోరేషన్ పన్ను లేకపోతే కంపెనీలలో పంచబడని లాభాలు పన్నుల పరిధిలోకి రావు. వ్యక్తిగతాదాయ పన్నులాగేకార్పోరేషన్ పన్నుగూడాప్రభుత్వం చేత కొన్ని మినహాయింపులను తగ్గింపులను పొందుతుంది.

### 5.9.3 వ్యయంపై పన్ను

వ్యయ పన్ను అని పిలవబడేవ్యక్తిగత వ్యయపన్ను ఒక ప్రత్యక్ష పన్ను. జరిగిన సంవత్సరంలోని వ్యయం ఆధారంగా ఈ పన్ను చెల్లించవలసి ఉంటుంది. ప్రపంచంలోని చాలా దేశాలలో ఈ పన్ను ప్రవేశపెట్టబడి ప్రస్తుతం కొన్ని దేశాలలో మాత్రమే ఇది అమలులో ఉంది. ఈ పన్ను ప్రధమంగా హాబ్స్, మిల్, ఫిషర్ మరియు ఈ మధ్య కాల్డార్ లచే సమర్దించబడింది. ఆదాయం కంటె, వ్యయమే వ్యక్తి చెల్లింపు సామర్థ్యానికి సరైన సూచిక అని వీరి వాదన.

వ్యక్తుల పొదుపు దృష్ట్యా కూడా ఈ పన్ను సమర్థించబడింది. వ్యయంపై పన్ను ఉద్యోగంలో చేరిన కొత్తలో చేసిన ఖర్చుకీ ఉద్యోగ విరమణానంతరము చేసిన ఖర్చుకీ మధ్య విచక్షణ చూపదు. ఆదాయం పన్ను విషయంలో ఉద్యోగం మొదటిలో చేసిన పొదుపుల నుండి వచ్చిన ఆదాయంపై తిరిగి ఆదాయపు పన్ను చెల్లించవలసి వస్తుంది కాని ఆదాయపు పన్ను పొదుపులపై రెండుసార్లు పన్ను విధిస్తోంది. ఉదహరణకు ఇద్దరు వ్యక్తులు ఒకే ఆదాయాన్ని పొందుతూ ఒకే ఆదాయ పన్ను చెల్లిస్తారనుకుందాం. మొత్తంలో మొదటి వ్యక్తి ఆసంవత్సరంలోనే అంతా ఖర్చు చేయాలని నిశ్చయించుకుంటే రెండవ వ్యక్తి ఆదాయంలో కొంత భాగం భవిష్యత్తు కోసం దాచి దానిపై అతడు వడ్డీని పొందుతాడు. ఆ వడ్డీపై కూడా ఆదాయపు పన్ను విధించబడుతుంది. అందుచే ఆదాయపు పన్ను పొదుపుకు వ్యతిరేకమైందని సాదరణంగా చెప్పబడుతోంది. ( అంటే ఆదాయపు పన్ను పొదుపునకు వ్యతిరేకమైందని సాధారణంగా చెప్పబడుతోంది.) అంటే వడ్డీపై విధించిన పన్ను వెంటనే కొనుగోలుకి, తరువాత కొనుగోలుకి మధ్య విచక్షణ చూపుతుంది.

## 5.10 పరోక్ష పన్నులు – కొన్ని ఉదాహరణలు

### 5.10.1 ఎక్సైజ్ సుంకాలు

అమ్మకానికిగాని వినియోగానికిగాని దేశంలో ఉత్పత్తి అయిన వస్తుసేవలపై ఎక్సైజు సుంకం విధించబడుతుంది. వాటిలో కొన్ని మూల్యానుగతమైనవి. అనగా వస్తువుల విలువ ఆధారంగా విధించబడేవి. కొన్ని నిర్దిష్టమైనవి అనగా యూనిట్ ఆధారంగా విధించినవి ఈ పన్నులుసాధరణ అమ్మకం పన్నువలెకాక ఒకే సారి సామాన్యంగా వస్తువు ఉత్పత్తి లోనే విధించబడతాయి. ఉదాహరణకు ఇండియాలో రెండు రకాలైన ఎక్సైజ



BRAOU

సుంకాలున్నాయి. అవి 1. కేంద్ర ప్రభుత్వం చేత విధింపబడిన కేంద్ర ఎక్సైజ్ సుంకాలు 2. మత్తుకలిగించే వస్తువులపై అనగా ఆల్కహాలు కొన్ని మందులపై రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ఎక్సైజ్ సుంకాలు. ప్రస్తుతకాలంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని సంపాదించే మార్గంలో ఎక్సైజ్ సుంకం చాలా ముఖ్యమైనది.

### 5.10.2 అమ్మకం పన్ను

ఈ పన్ను వస్తు సేవల అమ్మకంపై విధించబడుతుంది కొన్ని దేశాల్లో సేవలన్నిటిపైనా పన్ను విధించబడటం లేదు. వినిమయం జరిగినపుడు ప్రభుత్వానికి అమ్మకం పన్ను చెల్లించాలి. ఆ పన్ను మూల్యానుగతమైనది కాని నిశ్చితమైనది కాని అయి ఉంటుంది కాని ఇప్పుడు ప్రపంచంలోని అన్నిదేశాల్లోనూ అమ్మకం పన్ను మూల్యాను గతంగానే విధించబడుతోంది. అమ్మకం పన్నును 1. ఏకస్థాన అమ్మకం పన్ను (single point tax). 2. ద్విస్థాన అమ్మకంపన్ను (double point tax) 3. పెక్కు స్థానాల అమ్మకం పన్ను (multi point tax) అని మూడు విధాలుగా ఉంటుంది. ఏకస్థాన అమ్మకం పన్ను అయితే వస్తు వినిమయంలో ఒక్క స్థానంలోనే పన్ను విధించబడుతుంది. వస్తు వినిమయంలో రెండు స్థానాల్లో పన్ను విధించబడితే దానిని ద్విస్థాన అమ్మకం పన్ను అంటారు పెక్కు స్థానాల అమ్మకం పన్ను వినిమయం జరిగినప్పుడల్లా విధించబడుతుంది.

### 5.10.3 కస్టమ్స్ డ్యూటీలు

ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన పరోక్ష పన్నులను కస్టమ్స్ డ్యూటీలు అంటారు. ప్రతీదేశం తమ దేశం లోకి దిగుమతి అయ్యే వస్తువులపై కొన్ని పన్నులను విధిస్తుంది. వాటిని దిగుమతి సుంకాలు అంటారు. అదే విధంగా ఎగుమతులపై విధించిన పన్నులను ఎగుమతి సుంకాలు అంటారు. ఈ సుంకాలను కొన్నిలక్ష్యాలను సాధించడానికి విధిస్తారు. అవి 1.విదేశీ వర్తకాన్ని క్రమబద్ధం చేయడం, 2.విదేశీమారకద్రవ్యాన్నీ పెంచుకోవడం, 3. దేశంలో తయారైన వస్తువులకు రక్షణ కల్పించడం

### 5.10.4 వేల్యూ ఆడెడ్‌టాక్స్ (value added tax)

వేల్యూ ఆడెడ్ టాక్స్ అమ్మకం పన్నులలోకి చేరుతుంది. ఇది మొత్తం వస్తువు అమ్మకం విలువ మీద విధించినది కాదు. తయారీలోని వివిధ స్థాయిలలో ఆ వస్తువు అదనంగా పొందిన విలువమీదనే ఈ పన్ను విధించబడుతుంది. వస్తువు స్థూల విలువనుండి ఇతర సంస్థల నుండి కొనుగోలు చేసిన సరుకుల విలువను తీసివేయగావేల్యూ ఆడెడ్ వస్తుంది. ఈ పన్నును చివరి అమ్మకందారునుండి వసూలు చేయడంలో ఉద్దేశం ఏమనగా ఆ వస్తువు వివిధ ఉత్పత్తి వర్తక స్థాయిల్లో అమ్మకం దారులు చెల్లించిన పన్నులను ఇతడు ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రపంచంలోని కొన్ని దేశాలు వారి పన్నులవిధానంలో దీనిని ముఖ్యమైన పరోక్ష పన్నుగా ప్రవేశపెట్టారు. భారతదేశంలో ఈ పన్ను ఇంతవరకూ ప్రవేశ పెట్టబడలేదు. అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకాలవంటి పరోక్షపన్నుల స్థానంలో దీనిని ప్రవేశపెట్టాలని భారత ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. MODVAT (Modified system of value added tax) యొక్క వివరణ ఇంకో భాగంలో ఇవ్వడం జరిగింది.

## 5.11 స్థానిక ప్రభుత్వాలచే విధింపబడు పన్నులు

పైన చెప్పిన ప్రత్యక్షపరోక్షపన్నులనే కాక ఫెడరల్ వ్యవస్థలో స్థానికంగా కొన్ని పన్నులను విధిస్తారు. ఫెడరల్ ప్రభుత్వాలలో స్థానిక సంస్థలు ఆదాయాన్ని పెంచడానికిమాత్రమే గాక వస్తుసేవల ఉత్పత్తి వినియోగాలను క్రమబద్ధం చేయడానికి కూడా పన్నులను విధించే అధికారం కలిగి ఉంటాయి. వాటిలో కొన్నిటిని పరిశీలిద్దాం.



B R A O U

### 5.11.1 వృత్తి పన్ను

వివిధ రకాలైన వృత్తుల ద్వారా ఆదాయాన్ని పొందుతున్న వ్యక్తుల వృత్తిపై విధించే పన్నునే వృత్తి పన్ను అంటారు.

### 5.11.2 ఆక్ట్రాయ్ (octroi)

వినియోగానికి గాని, అమ్మకానికిగాని ఒక ప్రాంతం లోకి ప్రవేశించిన వస్తువులపై ఈ పన్ను విధించబడుతుంది. ముడిసరుకులు, మధ్యరకం వస్తువులు మొదలైన ఉత్పాదకాలుకూడా ఆక్ట్రాయ్‌లోనికి చేరతాయి. ఇది చాలా తిరోగామిత్వాన్ని కలిగి ఉందని విమర్శింపబడుతోంది.

### 5.11.3 ప్రవేశ రుసుము (entry tax)

ఇది ఒక విధమైన ఆక్ట్రాయే కాని ఆక్ట్రాయేకంటె తక్కువ చెడు ఫలితాన్నిస్తుంది. అన్ని ప్రాంతాల్లోనూ ఒకే విధమైన పన్ను రేటు విధించబడుతుంది. కాని కొన్ని ఎంపిక చేయబడిన వస్తువులపైనే ఈ పన్ను విధింపు ఉంటుంది. ఈ పన్ను భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో విధించబడుతోంది.

### 5.11.4 ఇంటి పన్ను

స్థానిక సంస్థలకు ఇంటి పన్ను ముఖ్యమైన ఆదాయ మార్గం. ఇంటి అద్దె విలువను బట్టి ఈ పన్ను విధిస్తారు. ఇది ఏడాదికి ఒకసారి చెల్లించాలి.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి – 3**

---

7. *ఈ క్రింది భావనలను 4 పంక్తులకు మించకుండా వివరించండి.*

(a) వ్యక్తిగత ఆదాయపన్ను
(b) కార్పొరేషన్ ఆదాయపు పన్ను
(c) వ్యయంపై పన్ను
(d) ఆక్ట్రాయ్
(e) ప్రవేశ రుసుము
(f) ఎక్సైజ్ సుంకము
(g) అమ్మకపు పన్ను
(h) కస్టమ్స్ డ్యూటీ
(i) వేల్యూ ఆడెడ్ పన్ను (VAT)

---

## 5.12 సారంశము / ముగింపు

---

ఇంతవరకు మనం వివిధ రకాలైన ప్రత్యక్ష పన్నులను గూర్చి తెలుసుకున్నాం. ఈ రెండు పన్నులు ఒక దానికొకటి విరుద్ధమైనవి కావు. ఒకదాని కొకటి పూరకమైనవి. ఏదేశ పన్నుల నిర్మాణంలోనైనా ఈ రెండు పన్నులు చాలా ప్రముఖ పాత్ర వహిస్తాయి.

**— డా॥ టి. దివాకరరావు**



BRAOU

## 5.13 సంప్రదించు పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Tyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | Hugh Dalton | : | Principles of Public Finance |

## 5.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు లిమ్ము.

1. ప్రత్యక్ష పన్నులు అనగానేమి? వీటి లాభ నష్టాలను గురించి వివరించుము.
2. పరోక్షపన్నులు అనగానేమి? వీటి లాభనష్టాలను గురించి విశదీకరించుము.
3. ప్రత్యక్ష, పరోక్ష పన్నులను పోల్చుము? ఏఏ పరిస్థితులలో పరోక్ష పన్నులు ప్రత్యక్షపన్నుల కంటే మేలైనవి?

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు లిమ్ము.

1. ప్రత్యక్ష, పరోక్ష పన్నులలో గల తేడా లేవి?
2. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు కొన్ని ఉదాహరణలనిస్తూ వాటిలో ఏవేని రెండింటిని వివరించుము.

•••

BRAOU

# భాగం – 6 : పురోగామి, అనుపాత, తిరోగామి పన్నులు

విషయక్రమం


6.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

6.1 పరిచయం

6.2 అనుపాత, పురోగామి, తిరోగామి, డిగ్రెసివ్ పన్నుల అర్థాలు

6.3 ఈ పన్నులపై లభించు సాహిత్యం

6.4 అంతర్ సంబంధాలు

6.5 పురోగామి, అనుపాత పన్ను విధానంలో వాదనలు

6.6 పురోగామి పన్నుల అనుకూలవాదనలు

6.7 పురోగామి పన్నుల వల్ల నష్టాలు

6.8 అనుపాత పన్ను విధానంలో అనుకూల ప్రతికూల వాదనలు

6.9 సారాంశము / ముగింపు

6.10 సంప్రదింపు పుస్తకాలు

6.11 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 6.0 లక్ష్యాలు, ఉద్దేశ్యాలు

ఈ భాగము యొక్క ముఖ్య ఉద్దేశము పురోగామి, అనుపాత తిరోగామి పన్నుల గురించి వివరించడం. ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను వివరించగల్గుతారు.

- పురోగామి పన్నుల వలన కలుగు లాభనష్టాలను వివరించడం.
- అనుపాత పన్ను విధానంలో కల లాభ నష్టాలను విశదీకరించడం
- తిరోగామి, డిగ్రెసివ్ పన్ను భావనలను గుర్తించడం.

BRAOU

## 6.1 పరిచయం

సమాన ప్రతిఫలం ఏమీ లేకుండా ఒక వ్యక్తి ప్రభుత్వానికి నిర్బంధంగా చెల్లించే మొత్తాన్ని పన్ను అంటారని మనం. ఇదివరకే తెలుసుకున్నాం. పన్నులను విధించడానికి అనేక సిద్ధాంతాలు రూపొందించబడ్డాయి. చెల్లింపు సామర్థ్యం ఆధారంగా పన్నులు విధించబడతాయని చాలామంది ఆర్థికవేత్తలు అంగీకరించారు. అయినప్పటికీ పన్నుల విధానానికి సంబంధించినంతవరకు చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించే కొలమానం, వివరణల గురించి ఏకాభిప్రాయం లేదు. కొంత మంది పురోగామి పన్నుల విధానాన్ని, మరికొంతమంది అనుపాత పన్నుల విధానాన్ని బలపరిచారు.

## 6.2 అనుపాత, పురోగామి, తిరోగామి, డిగ్రెసివ్ పన్నుల అర్థాలు

పన్నులు అనేక విధాలుగా వర్గీకరించబడ్డాయి. సాధరణంగా పన్నుల వర్గీకరణ పురోగామిత్వం ఆధారంగా చేయబడుతుంది. పన్ను ఆధారంలోని అనుపాత పెరుగుదల కంటె ఎక్కువ రేటులో పన్ను బాధ్యత పెరిగితే దానిని పురోగామి పన్ను అంటారు. చట్ట బద్ధమైన వివరణలో ఏ చలాంకానికైతే పన్ను విధింపు వర్తిస్తుందో అదే పన్ను

ఆధారం. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయపు పన్ను విషయంలో ఒక వ్యక్తి యొక్క నికరాదాయం పన్ను ఆధారం (tax base) గా గ్రహించబడుతుంది. అదేవిధంగా సంపద పన్నుకు ఆస్తి విలువ పన్ను ఆధారంగా ఉంటుంది. పురోగామి పన్నుల విధానంలో పన్ను ఆధారంలో పన్ను భాద్యత (tax liability) యొక్క అనుపాతం పెరుగుతూ ఉంటుంది. పన్ను ఆధారం పెరిగినపుడు పన్ను భాద్యత తగ్గితే దాన్ని తిరోగామి పన్ను అంటారు. అదే విధంగా ఆధారం ఏమైనప్పటికి పన్ను రేటులో మార్పులేకుండా ఉంటేదాన్ని అనుపాత పన్ను అంటారు.

సాధారణంగా ప్రత్యక్ష పన్నులు పురోగామి పన్నురేటును, పరోక్షపన్నులు అనుపాత పన్నురేటును కలిగిఉంటాయి. కాని పరోక్ష పన్ను కూడా పురోగామి రేటులో ఉండటానికి అవకాశముంది. పేద ప్రజలకంటె ధనికుల నుండి ఎక్కువ ధనాన్ని తీసుకొనే పద్ధతిలో పరోక్షపన్నులు విధించబడితే వీటిని పురోగామి పన్నులని చెప్పవచ్చు. ఉదాహరణకు ధనికవర్గం కొనుగోలు చేసే వస్తువులపై అధికరేట్లలో పరోక్షపన్నులు విధించబడతాయి. పేదవర్గం వినియోగించే వస్తువులపై పన్ను రేటు తక్కువగా ఉంటుంది. అటువంటి పన్నులు పురోగామిత్వాన్ని కలిగి ఉంటాయి. అలాకాకుండా పేదవర్గాలు కొనుగోలు చేసే అవసరాలపై ఎక్కువ పన్ను విధిస్తే అటువంటి వాటిని తిరోగామి పన్నులు అంటారు. వస్తు సేవల కొనుగోలులో ఒకే విధమైన పన్ను మొత్తాన్ని ధనిక, పేద వర్గాలు చెల్లిస్తాయి. దీని వల్ల పేదవర్గాల వారి త్యాగం ధనిక వర్గాల వారి త్యాగం కంటె ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అనుపాత పన్నులు నిత్యావసర వస్తువుల కొనుగోలుపై విధించడం న్యాయం కాదు. పరోక్ష పన్నులలో కూడా పైన చెప్పిన విధంగానే పన్ను ఆధారం పెరిగినపుడు సార్థక పన్ను రేటు తగ్గిపోవడాన్ని తిరోగామి పన్ను అంటారు. పన్ను విధానాల్లో తగిన మార్పులను ప్రవేశపెట్టి ప్రత్యక్షపరోక్షపన్నులలో తిరోగామిత్వాన్ని తొలగించడం చాలా అవసరం. కాని ఆచరణలో ప్రభుత్వం చేత నిర్వహింపబడుతున్న పన్నుల నుండి తిరోగామిత్వాన్ని పూర్తిగా తొలగించడం ఎప్పటికీ సాధ్యంకాదు.

పన్ను ఆధారం పెరిగే కొద్ది పురోగామిత్వం క్షీణిస్తుంటే దానిని 'డిగ్రెసివ్' పన్ను అంటారు. సాధారణంగా డిగ్రెసివ్ పన్ను విధింపు రెండు రకాలుగా ఉంటుంది. 1. పన్ను ఆధారంలోని కొంత మొత్తాన్ని పన్ను చెల్లింపు నుండి మినహాయించి మిగిలిన మొత్తానికి ఒకే పన్ను రేటు వర్తింపచేయడం 2. పన్ను ఆధారం పెరిగినంత వేగంగా పన్ను రేట్ల పట్టిక పెంచకపోవడం. క్లుప్తంగా చెప్పాలంటే పన్ను రేట్ల నిర్మాణాన్ని బట్టి పన్నులను అనుపాత, పురోగామి, తిరోగామి, డిగ్రెసివ్ అనే నాలుగు రకాలుగా చెప్పవచ్చు.

BRAOU

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. పురోగామి పన్ను అనగా నేమి?
2. అనుపాత పన్నును వివరించుము.
3. తిరోగామి పన్ను అనగా నేమి ?
4. డిగ్రెసివ్ పన్నును వివరించుము.

## 6.3. ఈ పన్నులపై లభించు సాహిత్యం

పదహారవ శతాబ్ది మొదటి భాగంలో 'గ్యూసి యార్డిని' అనే రచయిత పురోగామి పన్నుల విధానాన్ని గూర్చి ఒక వ్యాసంలో సమర్థించగా అదే శతాబ్ది చివరి భాగంలో 'బోడిన్' అనే ఆర్థికవేత్త అనుపాత పన్నుల విధానాన్ని సమర్థించాడు. తర్వాత ఆ సూత్రం అనేకమంది రచయితలచే కొద్ది మార్పులతో తిరిగి చెప్పబడింది. పన్ను విధింపులో సమానత్వం అంటే త్యాగసమానత్వమని జే.యస్.మిల్ అభిప్రాయం. చెల్లింపు సామర్థ్య భావన వివరణలో సమత్యాగ సూత్రానికి ప్రాముఖ్యత నివ్వాలి. త్యాగం పక్కిలి ఆత్మాశ్రయాంశమైనదని దానిని ...

పరాశ్రయాంశంగా కొలవడం కష్టం అని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి. కోహెన్ స్టువర్ట్, ఎడ్జ్‌వర్త్ అనే ఆర్థిక వేత్తలు సమత్యాగానికి సంబంధించి మూడు భావనలను ప్రతిపాదించారు.

1. సమనిరపేక్ష త్యాగం (equal absolute sacrifice)
2. సమానుపాత త్యాగం ( equal proportional sacrifice )
3. సమోపాంత త్యాగం ( equal marginal sacrifice )

వ్యక్తుల మధ్య ప్రయోజనాలను పోల్చడం సాధ్యం అనే ముఖ్యప్రమేయాన్ని తీసుకొంటే తప్ప త్యాగం ఆధారంగా పన్నులు విధించలేము.

ఆర్థికవేత్తలు సమత్యాగాన్ని గూర్చిన మూడు భావనలున్నాయి.

1. సరియైన త్యాగానికి త్యాగ భావనను ఎంచుకోవడం 2. అలా ఎంచుకోబడిన భావన రేటు విధానాన్ని నిర్ణయించడం. ఇంకో విధంగా చెప్పాలంటే త్యాగానికి సంబంధించిన వివిధ భావనల ప్రయోజనాల విషయాల గురించి వారి మధ్య ఒక అంగీకారం లేదు. ఉదాహరణకు కోహెన్ స్టువర్ట్ సమానుపాత త్యాగ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తే, సిడ్జ్‌విక్, మార్షల్‌లు సమ నిరపేక్ష త్యాగ సిద్ధాంతానికి ప్రాధాన్యత నిచ్చారు. 3. ఎడ్జ్‌వర్త్, పిగూలు, సంక్షేమం దృష్ట్యా కనిష్ట సమిష్టి త్యాగానికి దారి తీసే సమోపాంత త్యాగ సిద్ధాంతాన్ని ఎంచుకోవాలని వాదిస్తారు. ఈ మూడు సమత్యాగ భావనల యొక్క లాభ నష్టాలు మరియొక పాఠంలో చర్చించబడతాయి.

## 6.4 అంతరసంబంధాలు

పన్నుల రేటు నిర్మాణంలో పురోగామిత్వాన్ని చర్చించేటప్పుడు మన భావం దానిలోని ద్రవ్య భారమేగాని వాస్తవిక భారం కాదు. పన్ను చెల్లింపుదారుల త్యాగాన్ని బట్టి వాస్తవిక భారాన్ని లెక్కించవచ్చు. ఎక్కువ ఆదాయ స్థాయిల్లో ఒక్కొక్కప్పుడు పురోగామి పన్ను అవసరమైనంతగా పురోగామి కాకపోతే దాన్ని తిరోగామి పన్నుగా గుర్తించవచ్చు. అదే విధంగా వాస్తవిక భారం దృష్ట్యా అనుపాత పన్ను తిరోగామి పన్నుగా భావించబడుతుంది. దీనికి కారణం అనుపాత పన్ను రేట్ల వల్ల తక్కువ ఆదాయ వర్గాల వారు ఎక్కువ వాస్తవిక భారాన్ని భరించవలసి రావడమే. ఇంతకుముందే వివరించినట్లుగా అధిక ఆదాయస్థాయిలవద్ద ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణించడమే పురోగామి పన్నులు విధించాలనే వాదనకు మూలాధారమైన సూత్రం.

●

పురోగామి పన్నుల విధానం, అనుపాత పన్నుల విధానంలో దేనిని ఎంచుకోవాలి అనేది అంతా ఆదాయ వినియోగ రేఖ వాలుపై ఆధారపడి ఉంటుంది. ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణించడంపై పురోగామి విధానం ఆధారపడి ఉంది. సాధరణంగా ఆదాయం పెరిగే కొలది ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణిస్తుందని ఆర్థికవేత్తలందరూ అంగీకరిస్తారు. ఏదైనా ఒక వస్తువు వినియోగంలో వర్తించే క్షీణోపాంత ప్రయోజన సూత్రానికి ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణించడానికి తేడా ఉంటుంది. ఒక వస్తువు యొక్క ఉపాంత ప్రయోజనం శూన్యంగా కాని, వ్యతిరేకంగా గాని ఉండవచ్చు. కాని ఆదాయ ఉపాంత ప్రయోజనం శూన్యంగా కాని, వ్యతిరేకంగా కాని ఉండదు. ఆదాయ ఉపాంత ప్రయోజనం వ్యతిరేకంగా ఉండకపోతే దాని వాలు ఏవిధంగా ఉంటుంది? ఆదాయ ఉపాంత ప్రయోజన రేఖ ఒకానొక బిందువు తర్వాత క్షితిజ సమాంతరంగా ఉంటుందని 'బ్రెండ్' అభిప్రాయంకాగా 'లిన్‌డెన్' అభిప్రాయం ప్రకారం అది క్షీణించడం కొనసాగుతుంది. ఆదాయం పెరుగుతూంటే ఆదాయం యొక్క ఉపాంత ప్రయోజనం క్షీణిస్తుందనే ప్రతిపాదన చాలా అంశాల ఆధారంగా విమర్శింపబడింది.



1. ఆదాయం పెరగడంతోపాటు అవసరాలు కూడా కూడా పెరుగుతాయి. అందువల్ల వ్యక్తి ఆదాయం పెరిగినపుడు

అతని ఆదాయ ఉపాంత ప్రయోజన రేఖ పైకి జరుగుతుంది.

2. ఆదాయాలు పొందే వివిధ వ్యక్తుల ఉపాంత ప్రయోజనాలు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి.

3. క్షీణోపాంత ప్రయోజన పరికల్పన చాలా మంది ఆర్థికవేత్తలచే ఆమోదింపబడినప్పటికి ఆదాయ ఉపాంత ప్రయోజనం ఏ రేటులో క్షీణిస్తుందనే విషయంలో వారి మధ్య పూర్తి అంగీకారం లేదు. ఈ సందర్భంలో రేటు నిర్మాణాన్ని ఎంచుకోడానికి సంబంధించిన మూడు పరిస్థితులు వివరింపబడ్డాయి. అవి :

1. ఆదాయం పెరుగుతున్న రేటులోనే ఉపాంత ప్రయోజనం క్షీణించడం.
2. ఆదాయంలోని పెరుగుదల రేటుకంటే ఎక్కువ రేటులో ఉపాంత ప్రయోజనం క్షీణించడం.
3. ఆదాయంలోని పెరుగుదల రేటుకంటే తక్కువ రేటులో ఉపాంత ప్రయోజనం క్షీణించడం.

మొదటి పరిస్థితిలో అనుపాత పన్ను విధానం, రెండవ దానిలో పురోగామి పన్ను విధానం మూడవ దానిలో తిరోగామి పన్ను విధానం అవసరం.

## 6.5 పురోగామి, అనుపాత పన్ను విధానంలో వాదనలు

పురోగామి, అనుపాత పన్నుల విధానాల గురించిన వాద ప్రతివాదాలు ఈ క్రింది విషయాలపై ఆధారపడి ఉంటాయి.

1. ఒక పన్ను విధించబడినపుడు పన్ను చెల్లింపుదారు కొంత మొత్తాన్ని త్యాగం చేయవలసి ఉంటుంది. పన్ను చెల్లింపుదారుని త్యాగం యొక్క లెక్కింపుపై పన్ను విధింపు న్యాయం ఆధారపడింది.

2. ఒక పన్ను విధించబడినపుడు దాని ప్రభావం ఆర్థిక, సాంఘిక వ్యవస్థలపై ఉంటుంది. ఉదాహరణకు ఆర్థికాభివృద్ధి , పొదుపు, పెట్టుబడి మొదలైన వానిపై దాని ప్రభావం ఉంటుంది.

BRAOU

## 6.6 పురోగామి పన్నుల అనుకూల వాదాలు

ఆదాయం పెరుగుటతో బాటు పన్ను రేటుకూడా పెరిగితే దానిని పురోగామి పన్ను అంటారు. వ్యక్తిగత ఆదాయ పన్ను పురోగామి పన్నుకి మంచి ఉదాహరణ. 'టేలర్' మాటల్లో పురోగామి పన్నుల విధింపు వల్ల ఆదాయాలు పెరిగితే పన్నురేటు కూడా పెరుగుతుంది. కావున సార్థక పన్ను రేటు కూడా పెరుగుతుంది. అంటే పన్ను విధింపు శక్తి పెరుగుదల ఆదాయ పెరుగుదల అనుపాతం కంటె ఎక్కువగా ఉంటుంది. దానికి వ్యతిరేకంగా వ్యక్తిగత ఆదాయాలు తగ్గితే పన్ను రేటు తగ్గుతుంది. అనగా ఆదాయంలో తరుగుదల కంటె పన్నులలో తరుగుదల అనుపాతం ఎక్కువగా ఉంటుంది. కావున సార్థక పన్నురేటు తగ్గుతుంది. ఈ క్రింది కారణాల వల్ల పురోగామి పన్నులు ప్రతి దేశంలోను విధింపబడుతున్నాయి.

### 6.6.1 చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము

పురోగామి పన్నులు చెల్లింపు సామర్థ్య సిద్ధాంతంపై ఆధారపడి ఉంటాయి. వ్యక్తి యొక్క చెల్లింపు సామర్థ్యం ఆధారంగా పన్నులు విధింపబడాలని చాలామంది ఆర్థిక వేత్తలు అంగీకరించారు. ద్రవ్యానికి సంబంధించిన క్షీణోపాంత

ప్రయోజనం ఆధారంగా ఈ భావన ఇదివరకే వివరించబడింది. ధనికులు పెద్ద మొత్తాల్లో ద్రవ్యాన్ని కలిగి ఉంటారు. కాబట్టి ఉపాంత ద్రవ్య నిధులనుండి వారు పొందే ప్రయోజనం తక్కువగా ఉంటుంది. అందుచే పన్ను చెల్లింపుదారుని ఆదాయం పెరుగుదలకంటె ఎక్కువ అనుపాతంలో అతని పెరిగిన ఆదాయాలనుండి ఎక్కువ మొత్తాలను తీసుకొనేటట్లుగా పన్ను విధిస్తే అది న్యాయసమ్మతమైన చెల్లింపు సామర్థ్య సిద్ధాంతంపై ఆధారపడిందిగా ఉంటుంది.

ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని ఖచ్చితంగా కొలవడం, వ్యక్తుల ఉపాంత ప్రయోజనాల మధ్య తేడాలను పోల్చడం చాలా కష్టం. ఆ విధమైన భేదాన్ని కొలవడానికి ఒక ఖచ్చితమైన పద్ధతిని రూపొందించగలిగితే సమిష్టి త్యాగ సిద్ధాంతాన్ని సాధించడానికి సిలైన పద్ధతిలో పన్ను రేటు షెడ్యూలును తయారుచేయటం, కాని ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని కొలవలేకపోవడమనే అసమర్థత పురోగామి పన్నులను సమర్థించే విషయంలో ఆటంకం కారాదు. కారణం ధనికవర్గాలు పన్నుల రూపంలో చాలా మొత్తాలను చెల్లించి అధిక ద్రవ్య భారాన్ని భరించగలవు. అందువల్లనే పురోగామి పన్నులు సమర్థింపబడ్డాయి.

### 6.6.2 అసమానతలను తగ్గించడం

సమాజంలోని వివిధ వర్గాల మధ్య నెలకొని ఉన్న అసమానతలను తగ్గించడానికి సహాయపడుతుంది. కావున పురోగామి పన్నుల విధానం సమర్థింపబడుతోంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వివిధ వర్గాల ప్రజల మధ్య తీవ్రమైన ఆదాయ అసమానతలను సృష్టించడానికి మార్కెట్ యంత్రాంగం దారితీస్తోంది. అందుచే 'అడోల్ఫ్ వాగ్నర్' మార్కెట్ శక్తుల ప్రాబల్యం వల్ల, వారసత్వ వ్యవస్థ వల్ల ఆదాయ సంపదల పంపిణీలో ఏర్పడిన అసమానతలను సరిదిద్దడానికి శక్తివంతమైన సాధనంగా పన్నుల వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. కాబట్టి ఈ సాంఘిక లక్ష్య సాధన కోసం పురోగామి పన్నుల విధింపు సమర్థింపబడింది.

### 6.6.3 విలాసవస్తు వినియోగం తగ్గింపు

పురోగామి పన్నుల విధింపుకు అనుకూలంగా ఉన్న మరొక వాదన ధనిక వర్గాల పొదుపు మొత్తాలపై పన్ను విధించాలనే అభిప్రాయంపై ఆధారపడి ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశంలో ధనికులు పేదలకంటే ఎక్కువగా పొదుపు చేయగలరు. ఒక వేళ ప్రభుత్వం ధనికులపై పన్ను ఎక్కువగా విధించకపోతే (పురోగామి పన్నుల ద్వారా) వారి విలాస వస్తు వినియోగం పెరుగుతుంది. అందువల్ల సమాజం యొక్క అరుదైన ఉత్పత్తి వనరులు వ్యర్థమౌతాయి. అందుచే విలాస వస్తు వినియోగం నుండి ధనికులను తప్పించడానికి పురోగామి పన్నుల విధానం అనుకూలమైనదని వాదించబడుతుంది.

### 6.6.4 ప్రభుత్వ ఖజానాకు ఆదాలు

పురోగామి పన్నుల విధింపువల్ల ప్రభుత్వ ఖజానాకు లభించే ద్రవ్య వనరులు అధికంగా ఉండడమేకాక వాటి నిర్వహణ వ్యయంకూడా తక్కువగా ఉంటుంది. కావున మితవ్యయ న్యాయాన్ని బట్టి పురోగామి పన్నుల విధింపు సమంజసమైనదే.

### 6.6.5 ఎక్కువ వ్యాకోచత్వం

పురోగామిత్వంపై ఆధారపడిన పన్ను విధానం ఎక్కువ వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటుంది. ప్రభుత్వానికి అదనపు ద్రవ్యం అవసరమైతే పురోగామి పన్ను రేట్లను పెంచడం ద్వారా దానిని సులభంగా పొందవచ్చు. పన్ను

రేటులో ఈ విధమైన పెరుగుదల పేద ప్రజలపై పన్ను భారాన్ని పెంచకపోవచ్చు..

### 6.6.6 కోశ పర్యాప్తి నియమం

పురోగామి పన్నులు కోశపర్యాప్తి నియమాన్ని సంతృప్తిపరుస్తున్నాయి. ఆధునిక ప్రభుత్వాలు నేడు చాలా విధులను నిర్వహించవలసి ఉంది. ప్రభుత్వానికి సరిపోయినన్ని ద్రవ్య వనరులు లభించకపోతే సాంఘిక, ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి అవకాశంఉండదు. అందువల్ల పురోగామి పన్నుల విధానం బలపరచబడింది.

### 6.6.7 ఆర్థిక స్థిరత్వం

పురోగామి పన్నుల విధానం వల్ల ఆర్థిక స్థిరత్వం సమకూరుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థలో కొనుగోలు శక్తిని క్రమబద్ధం చేయడం ద్వారా ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులను సరిదిద్దడానికి పురోగామి పన్నులు ఉపయోగపడతాయి. పురోగామి పన్నుల విధానంలో పన్ను రేటు పెరిగితే సార్థక డిమాండు తగ్గి ద్రవ్యోల్బణం తగ్గుతుంది. అలాగే పన్ను రేట్లను తగ్గించడం వల్ల సార్థక డిమాండు పెరిగి ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు తొలగింపబడతాయి.

పురోగామి పన్నుల విధానానికి అనుకూలంగా చాలా వాదాలు పైన చెప్పబడ్డాయి. అలాగే దానికి వ్యతిరేకమయినవి కూడా చాలా ఉన్నాయి. ఇప్పుడు పురోగామి పన్నుల విధానానికి వ్యతిరేకమయిన వాదాలను పరిశీలిద్దాం.

## 6.7 పురోగామి పన్నుల వల్ల నష్టాలు

### 6.7.1 పొదుపు పెట్టుబడులను నిరుత్సాహపరుచుట

పురోగామి పన్నులు మూలధన సంచయనాన్ని నిరుత్సాహపరుస్తాయి. ఆదాయ సంపదలపై ఎక్కువ రేట్లలో పన్ను విధిస్తే ప్రజలు ఎక్కువ పొదుపు చేయగలస్థితిలో ఉండరు. అందువల్ల మూలధన సంచయనం దెబ్బతింటుంది. పన్ను రేట్లు ఎక్కువ పురోగామిగా ఉంటే ప్రజలు తమ ద్రవ్యాన్ని ఎక్కడ పన్ను రేట్లు తక్కువగా ఉంటాయో ఆ ప్రాంతాలలో లేక ఆ దేశాలలో పెట్టుబడి పెట్టవచ్చు. ఇది మూలధన సంచయనం తగ్గిపోవడానికి దారి తీస్తుంది. పెట్టుబడి ఇతర దేశాలకి తరలిపోవడాన్ని కూడా మనం గమనించవచ్చు. సాధారణంగా ప్రత్యక్ష పన్ను రేట్లు ఎక్కువగా ఉన్నప్పుడు ఈ విధంగా జరుగుతుంది. (పురోగామి పన్నుల ప్రత్యక్ష పన్ను గా కూడా ఉంటాయి).

పురోగామి పన్నుల విధానం వల్ల మరొక లోపం ఏమంటే ఇది పని చేయాలనే కోరికను దెబ్బతీయవచ్చు. ఫలితంగా ఆర్థిక అభివృద్ధి కుంటుపడుతుంది. వ్యక్తి కష్టపడి పనిచేస్తేనే ఆదాయన్ని,సంపదను కూడబెట్టుకోవడానికి అవకాశముంటుంది. పురోగామి పన్నుల విధానం వల్ల అదనపు ఆదాయ సంపదలు అధిక పన్ను రేట్లకు గురిఅవుతున్నాయి. తమ శ్రమ ఫలితాన్ని అనుభవించే అవకాశం లేకపోతే ప్రజలు తక్కువ పనిచేయడాన్ని ఎంచుకుంటారు. అందువల్ల ఉత్పాదకత క్షీణిస్తుంది.

పురోగామి పన్నుల విధానాన్ని వ్యతిరేకిస్తున్న ఈ వాదం పూర్తిగా నిజం కాదు. ఎందువల్లనంటే ఆర్థిక వ్యవస్థలో సామర్థ్యం, పొదుపు, పెట్టుబడులను పెంచడానికి తగిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం తన పన్నుల వ్యవస్థలో ప్రవేశపెట్టవచ్చు. అయినా పొదుపు పెట్టుబడులకు సంబంధించినంతవరకు అధికమైన పురోగామిత్వం చాలా చెడు ఫలితాలను కలుగజేస్తుంది.



BRAOU

### 6.7.2 మితవ్యయ, కష్టించి పనిచేయడాన్ని శిక్షించడం

పురోగామి పన్నుల విధానంమిత వ్యయాన్ని, కష్టించి పనిచేయడం లేకుండ జేసి సోమరితనాన్ని అతివ్యయాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శింపబడింది. ప్రజలు వారి తెలివితేటలను సామర్థ్యాలననుసరించి కష్టపడి పనిచేసి ఆదాయ సంపదలను కూడబెట్టుకొంటారు. అలా కష్టించి పనిచేసే వారి మీద పన్ను భారం అధికంగా విధించబడుతుంది. సోమరిగా ఉండి తక్కువ ఆదాయాన్ని సంపాదించే వారిపై తక్కువ పన్ను భారం పడుతుంది.ఇంకో విధంగా చెప్పాలంటే ప్రభుత్వానికి అధిక మొత్తంలో పన్నులు చెల్లించేవారు సమాజ సేవ భారాన్ని ఎక్కువగా భరిస్తున్నారు. అందుకే పురోగామిత్వంపై ఒక పరిమితి ఉండాలి. ఒక పరిమితి దాటిన తరువాత అది న్యాయ సమ్మతమైనది కాదని జె.యస్.మిల్ అభిప్రాయం.

కాని ఈ విమర్శకూడా పూర్తిగా నిజం కాదు. ఒకవ్యక్తి ఆదాయ సంపదలను కూడ బెట్టాలంటే అతని శ్రమ ఒక్కటే చాలదు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం కల్పించిన అవస్థాపనా సౌకర్యాలు మొదలైన సదుపాయాల వల్లకూడా అది సాధ్యమౌతుంది. ఈ పద్ధతిలో ఆలోచిస్తే ఈ విమర్శ అంత తీవ్రమైంది కాదు.

### 6.7.3 ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని లెక్కించలేం

పరాశ్రయాంశాత్మకంగా ఆదాయం యొక్క ఉపాంత ప్రయోజనాన్ని ఖచ్చితంగా లెక్కించలేం. అందువల్ల సరియైన రేటు నిర్మాణం ఏర్పరచడానికి అవకాశం లేదు అని చాలామంది ఈ విధానాన్ని విమర్శిస్తున్నారు. పురోగామి పన్నుల రేట్లు నిర్హేతుకంగా నిర్ణయింపబడతాయని వీరి వాదన.

### 6.7.4 పన్ను రేటు నిర్మాణంలో నిర్హేతుకత్వం

పురోగామి పన్నుల రేటు నిర్మాణంలో కొంత నిర్హేతుకత్వం ఉంది. కాని సరియైన స్లాబ్ పద్ధతిని అనుసరించి పురోగామి పన్నులను విధించవచ్చును. ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని ఖచ్చితంగా లెక్కకట్టలేకపోయినప్పటికి ప్రజాసంక్షేమం దృష్ట్యా ధనికులు ఎక్కువ భారాన్ని భరించేటట్లు చేయాలని చాలామంది ఆధునిక ఆర్థిక వేత్తలు నమ్ముతున్నారు.

### 6.7.5 పన్ను ఎగవేతను ప్రోత్సహించడం

పురోగామి పన్నులు పన్ను ఎగవేతను ప్రోత్సహించి ఆర్థికవ్యవస్థలో నల్లధనం పెరుగుదలకు దారి తీస్తోందని చాలామంది విమర్శకుల అభిప్రాయం. పన్ను రేట్లు ఎక్కువగా ఉంటే నకిలి చట్టాలను ప్రకటనలను తయారు చేసి పన్ను విధించడానికవసరమయ్యే ఆదాయంలో కొంత భాగాన్ని దాచడానికి ప్రయత్నిస్తాడు. ఈ వాదంలో కొంత నిజం ఉంది. వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లు ఎక్కువగా ఉండడంవల్లనే పన్ను ఎగవేత జరుగుతోందని ఈ మధ్య గుర్తింపబడింది. ఇండియాలో కూడా నల్లధనం గురించి వచ్చిన కొత్త నివేదిక ఈ అంశాన్ని బలపరుస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వ పరిపాలనాయంత్రాంగం పటిష్టంగా ఉంటే పన్ను ఎగవేతను తగ్గించవచ్చు.

## 6.8 అనుపాంత పన్నుల విధానానికి అనుకూల, ప్రతికూల వాదులు

### 6.8.1 వేర్వేరు పన్ను రేట్లను నిర్ణయించడం

పరాశ్రయమైన పద్ధతిలో ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని లెక్కించడం సాధ్యం కాదు. కనుక అనుపాత



BRAOU

పన్ను విధానాన్ని అనుసరించాలని కొందరి వాదన. ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని లెక్కించడం ఎక్కువగా ఆత్మాశ్రయమైనది. కాబట్టి వివిధ రకాల వ్యక్తులు ఆదాయాలనుండి పొందిన ప్రయోజనాలను పోల్చడం కూడా సాధ్యం కాదు. అందుచే వేర్వేరు ఆదాయ స్థాయిల వద్ద వేర్వేరు పన్ను రేట్లను నిర్ణయించవలసిన అవసరం లేకుండా అనుపాత పన్ను విధానానికి వీరు ప్రాధాన్యత నిచ్చారు.

అనుపాత పన్నుల విధానానికి అనుగుణమైన ఈ వాదంకూడా సమంజసమైంది కాదు. ఆదాయం పెరిగితే ఆదాయ ఉపాంత ప్రయోజనం (వస్తువు ఉపాంత ప్రయోజనం వలె) తగ్గుతుందనీ అందరికి తెలిసిన విషయమే. అందుచే పేదవాని ఆదాయ ఉపాంత ప్రయోజనం ధనికుని ఆదాయ ఉపాంత ప్రయోజనం కంటేఎక్కువ ఉంటుందని తలంచవచ్చు. కాబట్టి పన్నుల విధానంలో రేటు నిర్మాణం పురోగామిగా ఉండాలనేది న్యాయసమ్మతం.

### 6.8.2 పన్ను చెల్లింపు దారుల సాపేక్ష స్థితిగతులలో మార్పులు

పన్ను చెల్లింపుదారుల సాపేక్షస్థితిగతులలో ఎలాంటి మార్పులు చేయదు అనే అనుపాత పన్నుల విధానానికి అనుకూలమైన మరొక వాదన. పన్ను చెల్లించే వారి మధ్య గల సాపేక్ష పరిస్థితి పన్ను చెల్లించక ముందు, చెల్లించిన తరువాత ఒకే విధంగా ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణతో ఈ అంశాన్ని గ్రహించవచ్చు. అన్ని నికరాదాయాల మీద 5 శాతం పన్ను విధించబడుతుందనుకుందాం. ఈ క్రింద వివిధ వ్యక్తుల పన్ను చెల్లింపుకు ముందు వెనుకల ఆదాయం చూపబడింది.

| పన్ను చెల్లింపుకు ముందు ఆదాయం. రూ॥లలో | చెల్లించిన పన్ను రూ॥లలో | పన్ను చెల్లించిన తరువాత ఆదాయం. రూ॥లలో |
|---|---|---|
| 100 | 5 | 95 |
| 1,000 | 50 | 950 |
| 10,000 | 500 | 9,500 |
| 1,00,000 | 5,000 | 95,000 |

వివిధ వ్యక్తుల ఆదాయాల మధ్య గల సాపేక్ష సంబంధం మారలేదని ఇది చూపుతోంది. వారిలో ఏ ఇద్దరి ఆదాయాల మధ్యనైనా గల భేదం పన్ను చెల్లించకముందు, చెల్లించిన తర్వాత కూడ ఒకే విధంగా అనగా పదిరెట్లు ఉంది.

ఈ వాదం ఆధారంగా ఆర్థికవ్యవస్థలో వివిధ ఉపయోగాల మధ్య వనరుల కేటాయింపుపై అనుపాతపుపన్ను విధింపు ప్రభావ శూన్యంగా ఉంటుందని చెప్పవచ్చు. ఇంకోవిధంగా చెప్పాలంటే అనుపాత పన్ను సాపేక్ష డిమాండు సప్లై పరిస్థితులలో ఎట్టి మార్పు తీసుకురాదు. ఫలితంగా ఆర్థివ్యవస్థ అభివృద్ధిపై దాని ప్రభావం ఉండదు. అయితే ఇది డిమాండు, సప్లైల వ్యాకోచత్వం మీద ఆధారపడిఉంటుంది.

ఈ వాదంలో కొంత సత్యం కనిపిస్తున్నప్పటికి పన్ను పన్ను వాస్తవిక ఆదాయ స్థితి ఒకే విధంగా ఉండదు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఆదాయం 100 రూ॥లు అయినప్పుడు అతడు 5 రూ॥లు చెల్లించడం, 10,000 రూ॥లు సంపాదించే వ్యక్తి 500 రూ॥లు చెల్లించడం కంటె చాలా భారమైంది. ఒక ధనికుని విషయంలో పన్ను చెల్లింపు వల్ల అతని వినియోగ ప్రమాణం మార్పు చెందదు. కానిపేదవాని విషయంలోవినియోగ ప్రమాణం మార్పు చెందుతుంది. కాబట్టి అనుపాతపు పన్ను ప్రభావ శూన్యం అనే ఊహ సరియైనది కాదు. పొదుపు, వినియోగం కూడా మార్పు చెందితే ఆ పన్ను ప్రభావం శూన్యంగా ఉండజాలదు. అందుకే ఈ పన్ను వలన ద్రవ్య సంబంధమయిన సాపేక్ష స్థితులలో మార్పులేక పోయినప్పటికి వాస్తవిక సాపేక్ష స్థితులలో తప్పకుండా మార్పు ఉంటుంది.

### 6.8.3 పొదుపు పెట్టుబడులకు అనుకూలము

పురోగామి పన్నుల విధానానికి సంబంధించిన అనేక దోషాలు దానిలో లేవనేది అనుపాతపన్నులకు అనుకూలమైనదని మరియొక వాదము. పురోగామి విధానంలో గల ఎక్కువ పన్ను రేట్లు ఆర్థిక వ్యవస్థలోని పొదుపును పెట్టుబడిని కూడా దెబ్బతీస్తాయి. కాబట్టి అనుపాత పన్నుల విధానం అనుకూలమైంది.

ఈ వాదం ఎల్లప్పుడూ సరియైనది కాదు. పురోగామి విధానంలోని ఎక్కువ రేట్ల వల్ల మాత్రమే కాక అనుపాత పన్నుల విధానంలోని ఎక్కువ రేట్ల వల్ల కూడా పొదుపు, పెట్టుబడులు దెబ్బతినవచ్చు.

కాబట్టి అనుపాత పన్నులు ఆర్థిక వ్యవస్థలోని పొదుపు, పెట్టుబడులను ప్రభావితం చేయవని తలంచడం సరియైనది కాదు.

### 6.8.4 నిర్వహణ సులభం

అనుపాత పన్నుల నిర్వహణ చాలా సులభమైంది. అనుపాత పన్నుల విధానాన్ని సులువుగా అందరికీ ఒకే విధంగా వర్తింపజేయవచ్చును. పన్నుల నిర్మాణం క్లిష్టమైనది కాదు. కనుక పన్నుల రేట్ల తారతమ్యాన్ని నిర్ణయించడంలో గల సమస్యలేవీ ఇందులో ఉండవు. పురోగామి పన్ను విధానంలో పన్ను నిర్మాణం ప్రభుత్వ ఇష్టాయిష్టాలపై ఆధారపడి నిర్హేతుకంగా నిర్ణయింపబడుతుందని అనుపాత పన్నులను సమర్థించే వారి వాదన.

అనుపాత పన్నులు సౌలభ్యంగాను సౌకర్యంగాను ఉంటాయనేది నిజం. కాని పరిపాలనా నిర్వహణదృష్ట్యా అవి ఎల్లప్పుడూ సౌలభ్య, సౌకర్యాలను కలిగి ఉంటాయని ఊహించరాదు. ఉదాహరణకు ఆదాయ స్థాయిలను పరిగణించకుండా ప్రజలందరి పైనా అనుపాత ఆదాయపు పన్నును విధిస్తే అధికసంఖ్యలో ఉన్న చెల్లింపు దారుల నుండి లభించు పన్ను ఆదాయాన్ని అంచనావేయడం చాలా కష్టం. ఆ విధమైన పరిస్థితిలో అనుపాత పన్నుల విధానం సౌలభ్యమైనదని చెప్పలేం. అదేవిధంగా పన్ను వసూలుకు చాలా కేంద్రాలను నెలకొల్పవలసి రావడం వలన పరిపాలనా సంబంధమైన పెక్కు సమస్యలు తలెత్తుతాయి. అయితే పన్ను రేట్లు నిర్మాణానికి సంబధించినంతవరకు పురోగామి పన్నులకంటె అనుపాత పన్నులు చాలా సౌలభ్యంతో కూడుకొన్నవి.

BRAOU

## 6.9 సారంశము , ముగింపు

అనుపాత పన్నుల విధానానికి అనుకూలమైన ప్రతికూలమైన పెక్కు వాదాలు పైన చెప్పబడ్డాయి. 19వ శతాబ్దంలోని చాలామంది రచయితలు అనుపాత పన్ను విధానానికి ప్రాధాన్యతనీయగా 20వ శతాబ్దంలో పురోగామి పన్నులవిధానంపై మక్కువ చూపారు. అనుపాత, పురోగామి పన్నులలో ఏది ఉండవలననేది నేటి ముఖ్యమైన ప్రశ్న కాదు.పురోగామి పన్నుల విధానంలో రేట్లు ఏ విధంగా ఉండవలెననేది నేటి సమస్య. ప్రతీ పన్ను వ్యవస్థలోను అనుపాత , పురోగామి పన్నులు రెండింటి మిశ్రమమే అన్నింటికంటె సమంజసమైనది.

*– డా. టి. దివాకర్ రావు*

## 6.10 సంప్రదించు పుస్తకాలు

1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance

3. Hugh Dalton : Principles of Public Finance

## 6.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులు జవాబు లిమ్ము

1. పురోగామి పన్ను అనగానేమి? దీని వలన కలుగు లాభనష్టాలను పరీక్షించుము.
2. అనుపాత పన్ను విధానం అనగా నేమి? దీని లాభ నష్టాలను విశ్లేషించుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులు జవాబులిమ్ము.

1. తిరోగామి మరియు డిగ్రెసివ్ పన్నులను వివరించుము.
2. పురోగామి మరియు అనుపాత పన్నులలో గల తేడాలను గుర్తించుము.

•••

BRAOU

# భాగం – 7 : పన్ను విధింపు నియమాలు

## విషయక్రమం


7.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

7.1 పరిచయం

7.2 పన్ను విధింపు నియమాలు

7.3 అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను విధింపు నియమాలు

7.4 మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలు

7.5 పన్నుల యొక్క ఉద్దేశాలు

7.6 మంచిపన్ను విధానం సూత్రాలు

7.7 సారాంశము, ముగింపు

7.8 సంప్రదించు పుస్తకాలు

7.9 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 7.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం, ఏవి పన్నులను ఏలా విధించాలో, ఏవి పన్ను విధింపు నియమాలపై ఆధారపడి ఉంటుందో తెలుసుకుందాం.

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది వాటిని అవగాహన చేసుకోగల్గుతారు.

- వివిధ పన్ను విధింపు సూత్రాలను విశ్లేషించడం.
- అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను విధానపు ముఖ్య లక్షణాలను విశదీకరించడం.
- మంచి పన్నుల విధానం యొక్క ముఖ్య లక్షణాలను గుర్తించడం.
- మంచి పన్నుల సూత్రాలను నిర్ణయించు అంశాలను గుర్తించడం.

BRAOU

## 7.1 పరిచయం

వివిధ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రభుత్వానికి ద్రవ్య వనరులు అవసరం. ప్రభుత్వ ఆదాయానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో పన్నులు, కరెన్సీ నుండి ఆదాయం, మార్కెట్టు ఋణాలు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, ప్రభుత్వ సంస్థల ఆదాయం, ఫీజులు, జరిమానాలు చందాలు ముఖ్యమైనవి. చెల్లింపుదారులకు ప్రత్యక్ష ప్రయోజనమేమి లేకుండ నిర్బంధంగా వసూలు చేయబడేదే పన్ను. ఇది ప్రభుత్వం చేసిన సేవలకు చెల్లింపబడే ధర కాదు. అయితే ప్రభుత్వం పన్ను రాబడులను ఖర్చు చేసినపుడు పన్ను చెల్లింపుదారులకు పరోక్షంగా ప్రయోజనాలు కలగాలి. ఒకప్పుడు అతి ముఖ్యంగా భావించబడిన ప్రభుత్వ విధులకు తరువాత కాలంలో అంత ప్రాధాన్యత ఉండకపోవచ్చు. దీని ఫలితంగా పన్నుల వ్యవస్థ లక్షణాలు మారతాయి. ఉదాహరణకు పంతొమ్మిదవ శతాబ్దంలో విదేశ దాడులను ఎదుర్కోవడం, దేశంలో శాంతి భద్రతలను కాపాడడం వరకే పరిమితంగా ఉండేవి. ఈ పరిమిత కార్యకలాపాలను కొనసాగించడానికి తక్కువ నిధులు సరిపోయేవి. కాని ఇరవయ్యోవ శతాబ్దంలో ముఖ్యంగా రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ప్రభుత్వకార్యకలాపాలు గణనీయంగా పెరిగి ఎక్కువ నిధులు అవసరం కావడంతో

ప్రభుత్వ విత్త శాస్త్రంలో పన్నుల విధింపుకు ప్రాధాన్యత పెరిగింది. ప్రభుత్వ ఆదాయ మార్గాలలో పన్ను విధింపు అతి ముఖ్యమైనది. దీని ప్రాధాన్యతను గుర్తించడంతో బాటు పన్నులు విధించబడే విధానం గురించి కూడా తెలుసుకోవాలి. ఎక్కువ సంఖ్యలో పన్నులు విధించడం కంటే ఒకే పన్నును విదించడం మేలని కొందరు ఆర్థిక వేత్తల వాదన. కొందరు వినిమోగంపై పన్ను విధించాలంటే మరికొందరు ఆదాయ సంపదలపై పన్నులు విధించాలని చెప్పారు. అదేవిధంగా పన్ను రేట్ల నిర్మాణము గురించి కూడా ఆర్థిక వేత్తలతో ఏకాభిప్రాయం లేదు. కొందరు పురోగామి పన్ను విధానాన్ని సమర్థించగా మరికొందరు అనుపాత పన్ను విధానాన్ని సమర్థించారు. ఈ రకంగా విభిన్న అభిప్రాయాలున్నపుడు పన్నుల నిధింపు ఏ నిర్దేశిక సూత్రాలపై ఆధారపడాలి? ఈ విషయాన్ని పరిశీలిద్దాం.

## 7.2 పన్నుల విధింపు నియమాలు

ఆడమ్‌స్మిత్ ప్రతిపాదించిన పన్నుల విధింపు నియమాలు నాల్గింటిని నేర్చుకొందాం.

### 7.2.1 సమతా నియమం

"ప్రతిదేశం పౌరులూ వీలైనంత వరకూ తన శక్తి మేరకు, అనగా, ప్రభుత్వ రక్షణ క్రింద వారు అనుభవిస్తున్న ఆదాయాల అనుపాతంలో ప్రభుత్వ నిర్వహణకు కావలసిన వనరులను సమకూర్చాలి."

ఈ నియమం ఆర్థిక న్యాయమనే లక్ష్యాన్ని బలపరుస్తుంది. ఏ ప్రభుత్వం యొక్క రక్షణ వల్ల తమ ఆస్తులు, ప్రాణాలు భద్రంగా ఉన్నాయో ఆ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికిక ప్రతిదేశపు పౌరులపై పన్నులను విధించాలి. ప్రభుత్వం పౌరుల ఆస్తులకు రక్షణ కల్పించకపోతే ఆర్థిక కార్యకాలాపాలను కొనసాగించి ఆదాయాలను సంపాదించుకోవడం వారికి సాధ్యం కాదు. సాధారణంగా ధనవంతులు ఎక్కువ ఆస్తిని కలిగి ఉంటారు కావున ప్రభుత్వం నుండి ఎక్కువ రక్షణ పొందుతారు. కాబట్టి వారు త్యాగం చేసి పేదవారి కంటె ఎక్కువ పన్నులను చెల్లించడం సమంజసం.. స్మిత్ సమతానియమం పురోగామి అనుపాత పన్నులు రెంటికి ప్రాధాన్యత నిస్తుంది. ఈ నియమం పన్ను విధింపులో సమానత్వం లేదా న్యాయం అనే సూత్రాన్ని పాటిస్తుంది. వ్యక్తులు తమ శక్తి మేరకు పన్నులను చెల్లించాలి. పేద వారికంటె ధనవంతులు ఎక్కువ అనుపాతంలో చెల్లించినట్లైతే పన్ను చెల్లింపులో సమాన త్యాగాన్ని సాధించవచ్చు. ఇంకో విధంగా చెప్పాలంటే ఈ నియమంలో పురోగామి పన్ను విధానం అంతర్గతంగా ఉంది. సామాన్యంగా పరోక్ష పన్నులు కంటె ప్రత్యక్ష పన్నులు పురోగామిగా ఉండడం వల్ల ఈ నియమాన్ని సంతృప్తి పరుస్తారు.

BRAOU

ఈ నియమం అనుపాత పన్ను విధానాన్ని కూడా సమర్థిస్తుందని మరికొందరి వాదన. 'స్మిత్' సమతా నియమాన్ని జాగ్రత్తగా విశ్లేషించినట్లయితే ప్రజలు తమ శక్తి మేరకు పన్నులను చెల్లించాలనడంలో అతడు పురోగామి పన్ను విధానం వైపు మొగ్గు చూపినట్లు కనబడుతోంది. నిర్వచనపు రెండో భాగంలో ప్రభుత్వ రక్షణ వల్ల ప్రజలు అనుభవిస్తున్న ఆదాయాల అనుపాతంలో పన్నులను చెల్లించాలని చెప్పబడింది. ఈ భాగాన్ని పరిశీలిస్తే 'స్మిత్' అనుపాత పన్ను విధానానికి అనుకూలంగా ఉన్నట్లు కనబడుతోంది. పన్ను విదింపు చెల్లించే శక్తిపై ఆధారపడి ఉండడం న్యాయం కనుక ఈ నియమం పురోగామి పన్ను విధానానికే ప్రాధాన్యత నిస్తోందని చాలా మంది అభిప్రాయం. సమతా నియమం ఈ క్రింది విధంగా విమర్శించబడింది.

1) త్యాగమనేది ఆత్మాశ్రయమైనదగుటచే చెల్లింపు సామర్థ్యాన్ని కొలవడం కష్టం. 2) ఇది పాక్షికంగా నైతికంగాను, పాక్షికంగా ఆర్థికంగాను ఉంది. ఈ విధమైన విమర్శ ఉన్నప్పటికి పన్నుల వ్యవస్థను రూపొందించడంలో ఇది ప్రధానమైనది. ఆదాయ, సంపదల దృష్ట్యా చాలా పన్నులు సమతా నియమంపై ఆధారపడి విధించబడుతున్నాయి.

### 7.2.2 నిశ్చయతా నియమం

"ప్రతివ్యక్తి చెల్లించవలసిన పన్ను ఖచ్చితంగాను ఆకారణమైనది కాకుండాను ఉండాలి. పన్ను చెల్లించవలసిన సమయం చెల్లింపు విధానము, చెల్లించవలసిన మొత్తం, చెల్లింపు దారునకు ఇతరులందరికి కూడా స్పష్టంగా తెలియజేయబడాలి".

ఈ నియమం పన్ను చెల్లింపు లోని సందిగ్ధతను తొలగించడానికి ఉద్దేశించబడింది. 'అడమ్‌స్మిత్' ప్రకారము అనిశ్చయుత అసమర్థతను లంచగొండితనాన్ని ప్రోత్సహిస్తుంది. అందువలన ప్రతి వ్యక్తికి తాను ఎంత చెల్లించాలో ఎవరికి ఎప్పుడో చెల్లించాలో ముందుగానే తెలియాలి. నిర్వహణ దృష్ట్యా కూడా ఇది చాలా ముఖ్యం. ప్రభుత్వానికి కూడా ఎప్పుడు ఎవరి వద్దనుండి ఎంత పన్ను వచ్చేది తెలుస్తుంది. తాను చెల్లించవలసిన పన్ను ముందుగా తెలిసినట్లయితే చెల్లింపుదారుడు తన వ్యయాన్ని తగిన విధంగా మార్చుకోగలడు. "పాత పన్ను అసలు పన్నే కాదనే'' సామెత ఉంది. ఎందువల్లననగా పాత పన్నులు పూర్తిగా తెలిసి ఉండి నిశ్చయంగా ఉంటాయి. కొద్ది రోజులు అలవాటు పడిన తరువాత చెప్పులు కరుస్తాయనే బాధ తప్పుతుంది. అట్లే అలవాటుపడ్డ పాతపన్నులు వ్యక్తులను బాధించవు. కొత్త పన్నులను గూర్చి వివరాలు పూర్తిగా తెలియకపోవడం వల్ల భారంగా అనిపిస్తాయి.

### 7.2.3 సౌకర్య నియమం

"ప్రతి పన్ను చెల్లింపుదారునకు సౌకర్యమైన సమయంలోనూ, పద్ధతిలోనూ వసూలు చేయబడాలి".

నిశ్చయుతా నియమంవలె ఇది కూడా నిర్వహణా సౌలభ్యం కొరకు ఉద్దేశించ బడినదే. ఇది పన్ను చెల్లింపు సమయానికి పద్ధతికి ప్రాధన్యతనిస్తోంది. చెల్లింపుదారునకు సౌకర్యమైన సమయంలోనూ, పద్ధతిలోనూ పన్నులు వసూలు చేయబడాలి. ఉదాహరణకు భూమి పన్నును రైతుకు ఆదాయం వచ్చే పంట కాలంలో వసూలు చేస్తే అతనికి మిక్కిలి సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఉద్యోగస్తులపై విధించిన ఆదాయపు పన్నును వారి జీతం నుంచి మినహాయించడం సులువైన, మేలైన పద్ధతి, పరోక్షపన్నులు వస్తువుల అమ్మకం సమయంలో ధరతోపాటు వసూలు చేయబడతాయి. ఉదాహరణకు వినియోగదారుడొక రేడియోను కొన్నప్పుడు ధరతోపాటు పన్ను కూడా చెల్లిస్తాడు. పన్ను ధరలో కలిసిపోడం వల్ల పన్ను చెల్లిస్తున్నానే భావం లేకుండా వినియోగదారుడు ఆ పన్నును చెల్లిస్తున్నాడు. సౌకర్య నియమాన్ని పాటిస్తే చెల్లింపుదారుల నుండి ప్రతిఘటన రాదు.ప్రభుత్వానికి కూడా పన్ను వసూలు చేయడం సులభం.

### 7.2.4 మితవ్యయ వ్యయం

ఆడమ్‌స్మిత్ ప్రకారం పన్ను ఆదాయం నిర్వహణా వ్యయం కంటె అధికంగా ఉండాలి. మితవ్యయ సూత్రం ప్రకారం "ప్రతి పన్నులోను ప్రభుత్వ ఖజానాకు వచ్చే రాబడి చెల్లింపుదారులనుండి వసూలు చేయబడి మొత్తానికి గల తేడా ఎక్కువగా ఉండాలి." పన్ను వసూలు నిర్వహణా యంత్రాంగము క్లిష్టంగాను,భారీ గాను ఉండరాదని ఈ నియమం చెబుతుంది. నిజానికి స్మిత్ కాలంలో కంటె ఆధునిక కాలంలోనే ఈ నియమానికి అధిక ప్రాధన్యత గలదు. ఎందుకంటె కొన్ని పన్నుల విషయంలో నిర్వహణా వ్యయాలు విపరీతంగా పెరుగుతున్నాయి. వేరొక అర్థంలో కూడాఈ నియమం అన్వయించబడింది. ఆర్థిక వ్యవస్థలో అధికోత్పత్తి స్థాయిలను సాధించడానికి ప్రజల ఉత్పాదకతను పెంచాలి. పన్నులు ఉత్పాదకతను తగ్గించేవిగా ఉండరాదు. అందుకనే ప్రజల ఉత్పాదకతను తగ్గించే కొన్ని హనికరమైన మందుల వినియోగంపై అధిక పన్నులను విధించబడుతున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంగాక మందుల వినియోగాన్ని నిరోధించడమే ఈ పన్నుల లక్ష్యం. ఇట్టి పన్నుల విషయంలో ఆదాయం కంటే నిర్వహణా వ్యయాలు అధికంగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి మితవ్యయ నియమం పన్నుల ఆదాయ,

నిర్వహణా వ్యయాలను మాత్రమే గాక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావాలను కూడా లెక్కలోకి తీసుకుంటుంది. ఉత్పాదకత పెరుగుతున్నంత కాలం ఆదాయ, నిర్వహణా వ్యయాలతో నిమిత్తం లేకుండానే పన్నులను సమర్థించవచ్చు.

'ఆడమస్మిత్' ప్రతిపాదించిన పై నాల్గు నియమాలకు కొందరు రచయితలచే తరువాత మరికొన్ని చేర్చబడ్డాయి. అవి సిద్ధాంతరీత్యా 'స్మిత్' నియమాలంత పటిష్టంగా లేక పోయినా ఆచరణలో చాలా ప్రాధాన్యతను కల్గి ఉన్నాయి. కనుక వాటిని గురించి కూడా నేర్చుకుందాం. అవి 1) ఉత్పాదకతా నియమం 2) వ్యాకోచత్వనియమం 3) సౌలభ్య నియమం 4) భిన్నతా నియమం మొదలగునవి.

### 7.2.5 ఉత్పాదకతా నియమం

బాస్టబుల్ ప్రకారం పన్నులు ఉత్పాదకంగా ఉండాలి. అనగా పన్నుల విధింపు సరిపడునంత ఆదాయాన్ని తెచ్చేదిగా ఉండాలి. తగినన్ని ద్రవ్యవనరులు లేనిదే ప్రభుత్వం తన విధులను నిర్వర్తించలేదు. కావున పన్నులు ప్రభుత్వానికి సరిపడునంత ఆదాయాన్ని తెచ్చి పెట్టేవిగా ఉండాలి. 'గ్లాడ్ స్టోను' ప్రకారం "పన్నుల వ్యవస్థ ముఖ్యలక్ష్యం ప్రభుత్వ నిర్వహణకు కావలసిన ద్రవ్యవనరులను సమకూర్చడమే కాబట్టి ఆర్థిక మంత్రి ఎప్పుడూ ఒక పన్ను యొక్క సుగుణాలను అది తెచ్చే ఆదాయాన్ని బట్టి అంచనా వేస్తాడు".

### 7.2.6 వ్యాకోచత్వ నియమం

జాతీయాదాయం పెరిగినప్పుడల్లా పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. జాతీయాదాయపు పెరుగుదల శాతంకంటె పన్ను ఆదాయపు పెరుగుదల శాతం అధికంగా ఉంటే ఆ పన్నును వ్యాకోచ పన్ననీ, తక్కువగా ఉంటే అవ్యాకోచపన్ననీ అంటారు. పన్ను ఆదాయంలో వచ్చే మార్పులు మూడు అంశాలపై ఆధారపడిఉంటాయి. అవి 1) ప్రాతిపదిక మార్పులు, 2) రేట్ల మార్పులు, 3) జాతీయాదాయపు మార్పులు, ప్రాతిపదిక, రేటు నిలకడగా ఉండి జాతీయాదాయంలోని మార్పులకంటె పన్ను ఆదాయం ఎక్కువ శాతం పెరిగితే ఆ పన్నును వ్యాకోచ పన్ను అంటారు. అలా కాకుండా పన్ను ఆదాయంలోని పెరుగుదలను లెక్కించేటప్పుడు జాతీయాదాయంలోని మార్పులతో బాటు ప్రాతిపదిక మార్పులను రేటు మార్పులను కూడా పరిగణిస్తే అది పన్ను బయాన్సీ (Buoyancy) ని తెలుపుతుంది. ఈ నియమం ప్రకారం వ్యాకోచ పన్నులు మేలైనవి. బాస్టబిల్ కూడా వ్యాకోచత్వ నియమంను సమర్థించినాడు.

BRAOU

### 7.2.7 సౌలభ్య నియమం

పన్నుల వ్యవస్థ సులభంగా, సరళంగా అందరికీ తెలిసేదిగా ఉండాలి. దానిని అర్థం చేసుకోవడానికి చెల్లింపుదారునకు ఏమీ కష్టం ఉండకూడదు. ఈ నియమం చెల్లింపుదారునికి నిర్వహణా యంత్రాంగానికి కూడా సహాయ పడుతుంది. పన్ను శాసనాలు సాధారణ పాఠుకు కూడా అర్థమయ్యేవిగా ఉండాలి.

### 7.2.8 భిన్నతానియమం

పన్నుల వ్యవస్థలో అన్ని రకాల పన్నులు అనగా ప్రత్యక్ష, పరోక్షపన్నులు, పురోగామి అనుపాత పన్నులు, ఆదాయ, వినియోగ సంపదలపై విధించే పన్నులు, మూల్యానుగత (Advalorem) పన్నులు మొదలుగునవి ఉండాలి. ఎక్కువ రకాల పన్నులుంటే వాటి లోపాలు, సంఘృష్ట శక్తులు (frictional forces) పరస్పరం ఢీకొని దుష్ఫలితాలు రద్దయిపోయే అవకాశం ఉంది. సంఘృష్ట శక్తులలో కొన్ని ముఖ్యమైనవి పన్నుల ఎగవేత, బదిలీ, వ్యతిరేక, వ్యాప్తి

మూల ధనీకరణ మొదలగునవి. ఎక్కువ రకాల పన్నులుంటే ఈ సంఘృష్టతలు తగ్గించబడతాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఆదాయపు పన్నును ఎగవేసాడనుకొందాము. అతడు ఈ మొత్తాన్ని విలాస వస్తువులపై ఖర్చు చేసే అవకాశం ఉంది. అందుచే విలాస వస్తువులపై పరోక్ష పన్నులను విధించి నట్టయితే ఈ మొత్తంలో కొంత భాగాన్ని ప్రభుత్వం రాబట్టుకొనే అవకాశం ఉంది. కావున ఎక్కువ రకాల పన్నులుండడం మేలని ఈ నియమం భావిస్తుంది. అయితే యిక్కడ ఒక హెచ్చరికను గమనించాలి. వివిధ రకాలైన పన్నులను విధించాలనే నియమాన్ని బలపరుస్తున్నప్పటికీ ఒకే వస్తువుపై ఎక్కువ పన్నులు పడకుండా చూడాలి. ఎందుకంటే ఎక్కువ సంఖ్యలో పన్నులుంటే నిర్వహణ కష్టమౌతుంది.

ఈ నియమాలలో కొన్నింటి మధ్య పరస్పర సంఘృష్టతలు (frictions) తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు ఉత్పాదకతా నియమానికి, సమతా, సౌకర్య నియమాలకు సంఘృష్టత తలెత్తే అవకాశం ఉంది. అలాగే కొన్ని సందర్భాల్లో మిత వ్యయ నియమం ఉత్పాదకతతో ఘర్షణ పడుతుంది. రెండు నియమాలకు ఘర్షణ తలెత్తినప్పుడు ఏ నియమం ఎక్కువ లక్ష్యాలను సాధించడానికి సాయపడుతుందో దానిని ఎంచుకోవాలి. "ఘర్షణ వచ్చినపుడు ఎక్కువ ప్రధానమైన దానిని ఎన్నుకోండి" అనేది 'షిరాస్' సలహా.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ఆడమ్‌స్మిత్ ద్వారా సూచించిన పన్ను విధించు నియమాలను సూచించుము.
2. మిగిలిన పన్ను విధింపునియమాలు ఏవి?

## 7.3 అభివృద్ధిచెందుతున్న దేశాలలో పన్ను విధింపు నియమాలు

ఇప్పటి వరకు చర్చించిన పన్నునియమాలన్నీ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలన్నిటికీ వర్తిస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కోశ విధానపు ముఖ్య లక్ష్యం మూలధన సంచయనం ద్వారా వృద్ధి ప్రక్రియను ప్రోత్సహించడం, ఇట్టి ఆర్థిక వ్యవస్థ పన్నుల నిర్మాణంలో ఈ క్రింది అదనపు అంశాలకు కూడా ప్రాధాన్యతనీయాలి.

BRAOU

### 7.3.1 ఆర్థిక మిగుళ్ళ సమీకరణ

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక మిగుళ్ళను గుర్తించి, సమీకరించి పెట్టుబడి మార్గాల వైపు మళ్ళించడం పన్నుల విధింపు ముఖ్య లక్ష్యాలలో ఒకటి. మరో విధంగా చెప్పాలంటే పన్ను విధింపు మూలధనసంచయనానికి సహాయపడాలి. ఈ చర్య వ్యక్తుల, సంస్థల మిగుళ్ళ కల్పనను నిరుత్సాహపరచకుండా జాగ్రత్త వహించాలి. ఈ విషయాన్ని ఒక ఉదాహరణ ద్వారా విశదపరచవచ్చు. ప్రభుత్వం ఆదాయపు పన్నును విధించినప్పుడు ఆ మేరకు వ్యక్తుల వ్యయార్హ ఆదాయం తగ్గి పోతుంది. పన్ను రేటు అధికంగా ఉంటే సంపాదించాలనే కోరిక తద్వారా, పనిచేయాలనే ఉత్సాహం దెబ్బతింటాయి. దీనికి కారణం పనిచేయడం ద్వారా సంపాదించిన ఆదనపు ఆదాయంలో అధికభాగం పన్ను రూపంలో చెల్లించవలసి వస్తుందని అతడు ఆలోచించడమే కాబట్టి, ఈ ప్రభావాలన్నింటినీ లెక్కలోకి తీసుకుంటూ, అభివృద్ధి ప్రక్రియలో లభించిన మిగులు ద్రవ్య వనరులను గుర్తించడం చాలా కష్టం, అలా గుర్తించగలిగితే తగిన పన్నుల ద్వారా వాటిని సమీకరించవచ్చు.

### 7.3.2. వినియోగంలో తగ్గింపు

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రజలు పేదవారు. అభివృద్ధి ప్రక్రియలో సహజంగా వారి ఆదాయాలు పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధి ప్రారంభదశలో వారి ఆదాయాలతోబాటు వినియోగ వ్యయం పెరగడం కూడా మనం

గమనిస్తాం. వినియోగం పెరిగితే పెట్టుబడికి అవసరమయ్యే వనరుల లభ్యత తగ్గిపోతుంది. ఆర్థికాభివృద్ధి పెట్టుబడి రేటు మీద ఆధారపడి ఉంటుంది. కావున అవసర వస్తువులు తప్ప మిగిలిన అన్ని వస్తువుల మీద పన్నులను విధించి వినియోగంలోని పెరుగుదలను తగ్గించడం అవసరం. విలాస వస్తువులపై విధించబడిన పరోక్ష పన్నులు వాటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించి పెట్టుబడికి అవసరమగు వనరులను విడుదల చేస్తాయి.

### 7.3.3 ఆదాయ వ్యాకోచ నియమం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జాతీయాదాయంలో పెరుగుదల కంటే పన్ను ఆదాయం పెరుగుదల తక్కువ అనుపాతంలో ఉంటుంది. అనగా పన్ను వ్యాకోచత్వం ఒకటి కంటె తక్కువగా ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే ఈ దేశాల్లో పన్నుల వ్యవస్థ అవ్యాకోచంగా ఉంటుంది.

అందువల్ల జాతీయాదాయం పెరుగుతున్న కొద్దీ అదనపు పన్నులు విధించకుండానే పెరుగుతున్న రేటులో అదనపు ఆదాయాన్ని ఖజానాలోకి తరలించేటట్లుగా పన్నుల నిర్మాణం ఉండాలి. ఈ లక్షణమున్న దానిని పరిణాత్మక పన్నుల వ్యవస్థ అంటాము. ఈ నియమాన్ని తృప్తి పరచాలంటే ఆదాయ డిమాండు వ్యాకోచత్వం ఎక్కువగా ఉన్న వస్తువులపైన పన్నులను విధించాలి. పన్నుల వ్యవస్థ పురోగామిగా ఉన్నపుడు ఈ నియమం తృప్తి చెందే అవకాశం ఉంది.

### 7.3.4 సమతా నియమం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పన్నుల భారం వేరు వేరు వర్గాల మధ్య సమానంగా పంపిణీ చేయబడాలి. ఆర్థిక అసమానతలను తగ్గించడంలో పన్నుల విధింపు సహాయపడాలి. పేదవారికంటె ధనవంతులకు చెల్లింపు శక్తి ఎక్కువగా ఉంటుంది కనుక వారిపై ఎక్కువ పన్నులు విధించాలి. కాని దీనివల్ల అధికోత్పత్తి, పొదుపు దెబ్బతినకుండా చూడాలి.

---

మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

---

3. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పన్నుల విధానంలో ఏఏ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలో గుర్తించండి?

---

## 7.4 మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలు

---

పైన పేర్కొన్న నియమాల్లో ఎక్కువ వాటిని తృప్తిపరిచే దానిని మంచి పన్నుల వ్యవస్థ అంటాము. పన్నుల నియమాలు కొన్ని పరస్పరం ఘర్షణ పడతాయి. కావున ఏ వ్యవస్థ కూడా అన్ని నియమాలను తృప్తిపరచలేదు. కాబట్టి మంచి పన్నుల వ్యవస్థ వీలైనన్ని ఎక్కువ నియమాలను తృప్తిపరచేదిగా ఉంటే చాలు. ఒకే విధమైన పన్నుల నియమాలు అన్ని దేశాలకు కాలాలకు సరిపడవు. ఒక దేశం చేరుకున్న ఆర్థికాభివృద్ధి స్థాయిని బట్టి తగిన పన్ను నియమాలను నిర్ణయించాలి. దీనికొరకు పన్నుల విధింపు యొక్క అనేక అంశాలను విశ్లేషించాలి. పన్నుల వ్యవస్థలోని కొన్ని సమస్యలను నిర్వహణదృష్ట్యాను, మరికొన్నింటిని పన్నుల రకాలు. రూపాలు రేట్లు, చెల్లింపు సమయం మున్నగు అంశాల దృష్ట్యా పరిశీలించాలి. ఒక దేశపు పన్నుల వ్యవస్థను విశ్లేషించేటప్పుడు ఈ క్రింది విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.

### 7.4.1 ఆర్థిక వ్యవస్థపై కలుగు ప్రభావం

ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావాలను బట్టి పన్నుల వ్యవస్థ మంచి చెడ్డలను నిర్ణయించాలి. ఖచ్చితంగా



BRAOU

చెప్పాలంటే ఇతర అంశాలను, ప్రభుత్వ వ్యయాన్ని పూర్తిగా విస్మరించి పన్నుల వ్యవస్థను విడిగా పరిశీలించడం సరియైనది కాదు. ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను పరిశీలించనిదే ఒక పన్నుల వ్యవస్థ మేలైనదో కాదో చెప్పలేము. కానీ పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయము ప్రభుత్వ ఋణాలు, బడ్జెట్ లోట్లు, ఇతర ఆదాయాలు మొదలగు వాటితో కలిసిపోవడం వల్ల ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలకు పన్ను భారాలను పోల్చరాదు. అయితే మిగతా చలాంకాలన్నీ నిలకడగా ఉన్నాయనుకొని పన్నుల రూపాలు రేట్లు, చెల్లింపు సమయం మొదలగు అంశాలను పరిశీలించవచ్చు. కావున సామాన్యంగా మంచి పన్నుల వ్యవస్థ గురించి చెప్పేటప్పుడు మనం పన్నుల విధింపును విడిగానే పరిశీలిస్తాము.

### 7.4.2 వివిధ పన్ను విధానాలను విశ్లేషించడం

పన్నుల వ్యవస్థను విశ్లేషించేటప్పుడు చాలా కోణాలనుండి పరిశీలించాలి. రెండు వ్యవస్థలనుండి ఒకే ఆదాయం లభించేటప్పుడు తక్కువ హానికరమైన దానిని ఎంచుకోవాలి. ఆర్థిక, సాంఘిక ప్రభావాల దృష్ట్యా ప్రతి పన్నుల వ్యవస్థలోను బాగోగులుంటాయి. ప్రతి పన్నుల వ్యవస్థలోను పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుంటాయి. కనుక ఏదో ఒక దానిని ఎంచుకోవడం కష్టం. అందువల్ల ఒక వ్యవస్థ బాగోగులను మరొక వ్యవస్థ బాగోగులతో పోల్చి దేశం యొక్క ఆర్థికాభివృద్ధి లక్ష్యాల దృష్ట్యా శ్రేయస్కరమైన దానిని ఎంచుకోవాలి. ఈ ఎంపికలో ఏ లక్ష్యాన్ని సాధించడానికి ఏ లక్ష్యాన్ని త్యాగం చేయగలమో జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి.

### 7.4.3 ఆచరణోగ్యం

సిద్ధాంతరీత్యా మేలైన పన్నుల వ్యవస్థ ఆచరణలో మేలైనదిగా ఉండకపోవచ్చు. ఊహాత్మకంగా వేరు వేరు పన్నుల విధింపు చర్యల ఉపాంత ప్రయోజనాలను పోల్చవచ్చు. కాని ఆచరణలో ద్రవ్యం ఉపాంత ప్రయోజనాన్ని కొలవడం చాలా సమస్యలతో నిండి ఉంది. మేలైన పన్నుల విషయంలో కూడ వాటిని అమలు పరచేటపుడు, రాజకీయ,నిర్వహణా కారణాల వల్ల సమస్యలు ఎదురౌతాయి. కాబట్టి పన్నులను విధించేటపుడు ఆచరణలో ఎదురయ్యే సమస్యల గురించి కూడ ప్రభుత్వాలు జాగ్రత్తగా ఆలోచించాలి.

### 7.4.4 చెల్లింపుదారు వైఖరి

పన్నుల వ్యవస్థ మంచి చెడ్డలను విచారించేటపుడు చెల్లింపుదారు వైఖరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కొందరి అభిప్రాయం. ప్రతి చెల్లింపుదారు పన్నుల భారం తనపై కొద్దిగా ఉండాలని కోరుకుంటూ ఇతరులపై ఎంత ఎక్కువగా వద్దా పట్టించుకోడు. కాని పన్నుల భారం అందరిపైనా సమానంగా ఉండేటట్లు చూడ్డం అవసరం. అన్యాయంగా తనపై అధిక భారంపడిందని ఏ చెల్లింపుదారు బాధపడరాదు. వాస్తవానికి చెల్లింపుదారు వైఖరిని చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ఆర్థికేతర అంశాలైన వరదలు, కరువులు మొదలగు ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ పరిస్థితి ప్రభావితం చేస్తాయి. కాబట్టి అలాంటి పరిస్థితులకు కూడా సరిపడునట్టు పరిణామాత్మకంగా పన్నుల చట్టాలను రూపొందించాలి.

### 7.4.5 పన్ను మార్పులో కాలపరిధి

పన్నుల వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులను తీసుకురాలేమని తెలుసుకోవడం అవసరం. ఏదైనా ఒక క్రొత్త పన్నును ప్రవేశపెట్టవచ్చు లేదా పాత పన్ను నొకదానిని పూర్తిగా రద్దు చేయడం కాని సవరించడం కాని చేయవచ్చు. కాని మొత్తం పన్ను వ్యవస్థను మార్చడానికి దీర్ఘకాలం పడుతుంది.

ఒక పన్నుల వ్యవస్థను విశ్లేషించేటపుడు ముందు చెప్పిన అంశాలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మంచి పన్నుల వ్యవస్థ ముఖ్య జాతీయ లక్ష్యాలతో సమన్వయం కలిగి ఉండాలి. చాలామంది ఆధునిక ఆర్థికవేత్తలు మంచి పన్నుల వ్యవస్థ పురోగామి సూత్రంపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడుతున్నారు. ఇంకో విధంగా చెప్పాలంటే జాతీయదాయం పెరిగినపుడు దానికి తగినట్లుగా పన్ను రేటు పెరగాలి. ఈ నియమాన్ని తృప్తిపరిస్తే పన్నుల భారం పేదవారిపై కంటే ధనవంతులపై అధికంగా పడుతుంది. అనుపాత పన్నులను తిరోగామి పన్నులను తక్కువగా విధించాలి.

మస్‌గ్రేవ్ మంచి పన్ను విధానంలో మరి కొన్ని లక్షణాలను వివరించడం జరిగింది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

i) పన్ను భారం సమంగా ఉండడము.
ii) ఆర్థిక నిర్ణయాలలో జోక్యం చాలా తక్కువగా ఉండడము.
iii) సమతా విధానంలో జోక్యం చాలా తక్కువగా ఉండడము.
IV) వృద్ధి లక్షణాల స్థిరీకరణలో కోశవిధానాంశంకు స్థానం కల్పించడం.
V) న్యాయమైన, స్వచ్ఛంద పరిపాలన.
Vi) పరిపాలనా, అనువర్తిత వ్యయాలు చాలా తక్కువగా ఉండడము.

ఆధునిక ఆర్థికవేత్తలు పరోక్షపన్నులకంటె ప్రత్యక్షపన్నులకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. అంతేగాక ఒకే పన్ను పద్ధతి కంటె ఎక్కువ రకాల పన్నులు విధించే పద్ధతిని బలపరుస్తున్నారు. అయితే పన్నుల సంఖ్య అధికంగా ఉండాలని మాత్రం దీని అర్థంకాదు. అధిక సంఖ్యలో పన్నులుండడం మంచిదికాదు. 'లేడీహిక్స్' ప్రకారం మంచి పన్నుల వ్యవస్థ మూడు లక్షణాలను కలిగి ఉండాలి. అవి (1) ప్రభుత్వం సమకూర్చే సేవలకయ్యే వ్యయాలకు తగినట్టు ఆదాయాన్ని సంపాదించేదిగా ఉండాలి. (2) వ్యక్తుల ఆదాయాలను కుటుంబ పరిస్థితులను లెక్కలోకి తీసుకొంటూ చెల్లింపు శక్తి మేరకు పన్నులు విధించబడాలి. (3) పన్నులు సార్వజనీకంగా ఉండాలి. అనగా ఏ విధమైన విచక్షణ లేకుండా ఒకే పరిస్థితులలో ఉన్న వ్యక్తులపై ఒకే విధమైన భారం ఉండాలి. కొందరు ఆర్థికవేత్తలు వాణిజ్య పారిశ్రామికాభివృద్ధికి పన్నులు తోడ్పడాలని భావించారు. ఏదేమైనా పన్నుల వ్యవస్థ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి.

మంచి పన్నుల వ్యవస్థ క్రింది లక్షణాలను కలిగి ఉండాలి.

1. పన్నుల వ్యవస్థలో భిన్నత్వముండాలి. పన్నుల సంఖ్య ఎక్కువగా ఉండరాదు.
2. సమానత కలిగి ఉండాలి.
3. సౌలభ్యంగా ఉండాలి.
4. నిర్వహణ సమర్థవంతంగా ఉండాలి. అనగా ఎగవేతకు లంచగొండితనానికి అవకాశముండరాదు.
5. వ్యాకోచత, బయాన్సీ కలిగి ఉండాలి.
6. నిర్వహణ వ్యయం అల్పంగా ఉండాలి.
7. అసమానతలను తగ్గించేవిగా ఉండాలి.
8. వాణిజ్యాన్ని పరిశ్రమలను ప్రోత్సహించి వృద్ధి ప్రక్రియకు సహాయపడుటకు తగిన ప్రోత్సాహకాలను కలిగి ఉండాలి.
9. పన్నుల వ్యవస్థ సంఘటితంగా ఉండాలి.

B R A O U

## 7.5 పన్నుల యొక్క ఉద్దేశాలు

పన్నుల విధింపు లక్ష్యాలు మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలు దగ్గర సంబంధం కల్గింటాయి. అవి వివిధ రకాలైన పన్నుల నియమాలు తప్ప ఇంకేమీ కావు. పూర్వం పన్నుల విధింపు లక్ష్యం ప్రభుత్వానికి ఆదాయాన్ని సంపాదించడమే సంప్రదాయవాదులు ప్రజాజీవనంలో ప్రభుత్వజోక్యానికి ప్రాధాన్యత నీయలేదు. అందువలన పన్నుల విధింపుకు కూడా ప్రాధాన్యత ఇవ్వబడలేదు. కాని ఆధునిక కాలంలో ప్రభుత్వ విధులు విస్తారంగా పెరిగాయి. అయితే ఇప్పుడు పన్నులను విధించడం కేవలం ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని పెంచడం కోసం మాత్రమే కాదు. ఇది ఆర్థిక కార్యకలాపాలను నియంత్రణ చేయడానికి ఉపయోగపడుతుంది. ఆధునికకాలంలో పన్నుల విధింపు ఉద్దేశ్యాల్లో ముఖ్యమైనవి నాలుగు. అవి

1. ఆర్థికాభివృద్ధి కొరకు వనరులను సమీకరించడం
2. వినియోగాన్ని నియంత్రణ చేయడం. కొన్ని పరోక్ష పన్నులు వస్తువుల ఉత్పత్తి వినియోగాలను క్రమబద్ధం చేయుటకు ఉద్దేశింపబడ్డవే.
3. ద్రవ్యోల్బణ ప్రతి ద్రవ్యోల్బణాలను అరికట్టడం.
4. వివిధ వర్గాల ఆదాయ సంపదల్లోని అసమానతలను తగ్గించడం.

ఈ లక్ష్యాలన్నీ పన్నుల విధింపు నియమాలను మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలను నేర్చుకొన్నప్పుడు మనం పరిశీలించాం

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 3

4. మంచి పన్ను విధానం యొక్క ముఖ్య లక్షణాలను గుర్తించుము.
5. పన్ను విధింపు – లక్షణాలు ఏవి ?

## 7.6 మంచి పన్ను విధానం సూత్రాలు

సాధరణంగా మంచి పన్నుల వ్యవస్థకు ఈ క్రింది నాలుగు సూత్రాలు ఆపాదించబడతాయి.

(i) పన్నుల భారం సమానంగా పంచబడాలి.
(ii) పన్నుల వ్యవస్థ ఉత్పాదకంగా ఉండాలి.
(iii) చెల్లింపుదారుల హక్కులను, సమస్యలను పరిగణించేదిగా ఉండాలి.
(iv) మారుతున్న అవసరాలకు తగినట్టు పన్నుల వ్యవస్థ పరిణామాత్మకంగా ఉండాలి.

ఈ అంశాలను మరికొంత వివరిద్దాం.

### 7.6.1 పన్నుల భారాన్ని సమానంగా పంచుట

ఏ పన్నుల వ్యవస్థలో నైనా పన్నుల విధింపులో సమత లేదా న్యాయం ప్రధాన లక్ష్యంగా అంగీకరించబడుతుంది. కాని ఏ విధమైన ఆత్మాశ్రయాంశం లేకుండా పరాశ్రయాంశ పద్ధతిలో సమత లేదా న్యాయాన్ని నిర్వచించడం, కొలవడం, సాధించడం అనే విషయాల్లో ఆర్థిక వేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. సమానత్వాన్ని

BRAOU

రెండు విధాలుగా పరిశీలించవచ్చు. మొదటి పద్ధతి సమానావకాశాలున్న వారిపై సమాన భారం పడేటట్లు చూడ్డం. అనగా ఒకే విధమైన పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులందరు భరించే పన్నుల భారం ఒకే విధంగా ఉండాలి. రెండవ పద్ధతి వేరు వేరు పరిస్థితుల్లో నున్న వ్యక్తులను వారి సామర్థ్యాలకు తగ్గట్టు వేర్వేరుగా చూడ్డం. సమానత్వం యొక్క ఈ విధమైన వివరణ ప్రకారం పన్నుల భారాన్ని పేదవారి కంటె ధనికులు అధికంగా భరించాలి.

### 7.6.2 పన్నుల వ్యవస్థ ఉత్పాదకంగా ఉండుట

ప్రభుత్వ వ్యయంలోని వివిధ అంశాలపై ఖర్చు చేయడానికి తగినన్ని వనరులు ప్రభుత్వ ఖజానాకు లభించేందుకు వీలుగా పన్నుల వ్యవస్థ ఉత్పాదకంగా ఉండాలి. ఆధునిక కాలంలో ప్రభుత్వం అనేక రకాల విధులను నిర్వహిస్తోంది. కనుక ఎక్కువ ఆదాయం అవసరం. పన్నుల వ్యవస్థ ఉత్పాదకంగా ఉన్నట్లయితే ప్రభుత్వం తనకు కావలసిన ద్రవ్య వనరులను సులభంగాసేకరించుకోగలదు. పన్నుల వ్యవస్థ అనుత్పాదకంగా ఉన్నట్లయితే ప్రభుత్వం ప్రణాళికా పథకాలను కొనసాగించడం కష్టం. పన్ను ఉత్పాదకత అంటే ప్రభుత్వ ఖజానాకు అధికరాబడులను తెచ్చి పెట్టడం మాత్రమే కాదు. అవి క్రమంగానూ పరిణామాత్మకంగానూ ఉండాలి. అయితే ఉత్పాదకత దేశం యొక్క సాధారణ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడిన సాపేక్ష భావన.

### 7.6.3 చెల్లింపు దారుల హక్కులు – సమస్యలు

ఈ అంశం నేరుగా పన్ను చెల్లింపుదారుల నిజాయితీకి సమర్థవంతమైన పన్నుల నిర్వహణకు సంబంధించినది. పన్ను చెల్లింపుదారుల హక్కులకు ప్రాధాన్యత నీయాలి. ప్రజాస్వామ్యంలో పన్ను చెల్లింపుదారులనిజాయితీని పెంచకుండా పన్నుల నిర్వహణను సమర్థవంతంగా నడపలేము. కాబట్టి ప్రభుత్వం ఈ క్రింది చర్యలను తీసుకోవడం అవసరం.

1). పన్ను విధింపు చర్యల గురించి చెల్లింపుదారులకు స్పష్టంగా తెలిపేటట్లు చూడాలి.
2). పన్ను చెల్లింపు, వసూళ్ళకు సంబంధించిన అసౌకర్యాన్ని జోక్యాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి.
3) పన్ను చెల్లింపుదారుల ఫిర్యాదులపై అధికారులు వెంటనే హాజరు కావాలి.

ఇందులో మొదటిది సౌలభ్య నియమానికి, రెండవది సౌకర్య నియమానికి దగ్గరగా ఉన్నట్లు గ్రహించవచ్చు. ఆధునిక కాలంలో పన్ను చెల్లింపుదారులు సాధారణంగా పన్నుల చెల్లింపు, వసూళ్ళకు సంబంధించి అనేక ఫిర్యాదులు చేస్తారు. సంబంధిత అధికారులు వెంటనే హజరై వాటిని పరిష్కరించినట్లయితే చెల్లింపుదారులు ఎక్కువ సంతృప్తి చెందుతారు. ఇది పన్ను చెల్లింపుదారుల నిజాయితీని పెంచుతుంది. ఫలితంగా పన్నుల వసూలు సులభమౌతుంది. పన్ను చెల్లింపుదారుల సహకారంతో మాత్రమే పన్నుల నిర్వహణ సమర్థవంతంగా ఉంటుంది.

### 7.6.4 పన్నుల వ్యవస్థ పరిణామాత్మకత

దీనిలో చాలా అంశాలు ఇమిడిఉన్నాయి. సమర్థవంతమైన పన్నుల వ్యవస్థ ప్రణాళికా లక్ష్యాలను సాధించుటకు ఉద్దేశించబడినది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో స్థిరత్వంతో కూడిన అభివృద్ధికి ప్రాధన్యత ఇవ్వబడుతుంది. అందువలన పన్నుల వ్యవస్థ మూలధన సంచయనాన్ని త్వరితంగా పెంచి వృద్ధి ప్రక్రియకు సహాయపడాలి. ఆర్థిక వ్యవస్థలోని మిగులు ద్రవ్య వనరులను గురించి వాటిని ఉత్పాదక పెట్టుబడులకు మళ్ళించాలి. వృద్ధి ప్రక్రియలో వనరుల సమీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. రెండవ లక్ష్యమైన స్థిరత్వాన్ని సాధించడమంటే ద్రవ్యోల్బణ ప్రతి ద్రవ్యోల్బణ శక్తులను పన్నుల వ్యవస్థ ద్వారా నిరోధించుట. అభివృద్ధి

BRAOU

చెందుతున్న దేశాల్లో ద్రవ్యోల్బణ పరిస్థితులుండటం సహజం. కాబట్టి పన్నుల వ్యవస్థ సమిష్టి డిమాండును తగ్గించి తద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసిన అవసరం ఉంది. ఈ విధంగా పన్నుల విధింపు ద్వారా ద్రవ్యోల్బణ ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను పరిష్కరించవచ్చును. సమాజంలోని వేర్వేరు వర్గాల ఆదాయ సంపదల అసమానతలను తగ్గించడం మంచి పన్నుల వ్యవస్థ మరొక లక్ష్యం. పన్నుల విధింపు ద్వారా సాధింపబడిన ఆదాయ పునః పంపిణీ ప్రజల ఆర్థిక సౌభాగ్యాన్ని పెంచడానికి సహాయపడుతుంది. ఈ లక్ష్యం సాంఘిక న్యాయానికి సంబంధించినది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 4

6. మంచి పన్ను విధానం యొక్క ముఖ్యమయిన సూత్రాలు ఏవి ?

## 7.7 సారంశము, ముగింపు

ప్రభుత్వానికి కావలసిన ఆదాయాన్ని పన్ను విధింపు ద్వారా సముపార్జించుకుంటామని తెలుసుకొన్నాము. పన్ను అనునది తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. కాలక్రమేణ పన్ను విధింపు లక్ష్యాలు మారుతూ ఉంటాయి. కావున ఏఏ సూత్రాలపై పన్ను విధించబడడానికి కావలిసిన మార్గదర్శక సూత్రాల అవసరం ఉంది. ఈ భాగంలో మనం పన్ను విధింపు నియమాలను సాధరణ పరిధిలో మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలో విశ్లేషించడం జరిగినది. మంచి పన్ను విధానం యొక్క ముఖ్య లక్షణాలు ఆ పన్ను యొక్క ఉద్దేశాలకు మరియు సూత్రాలకు దగ్గరగా ఉండవలెను. ఈ భాగంలో మంచి పన్ను విధానంలోని ముఖ్య లక్షణాలు, ఉద్దేశాలు, మరియు సూత్రాలను గురించి తెలుసుకొన్నాము.

*– డా॥ టి. దివాకర్ రావు*

## 7.8 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Musgrane & Musgrane : Theory of Public Finance


## 7.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. 30 పంక్తులలో ఈ క్రింది వాటికి జవాబు లిమ్ము.
   1. పన్ను విధింపు నియమాలను విమర్శనాత్మకంగా పరిశీలించుము ?
   2. మంచి పన్ను విధానం యొక్క ముఖ్యమయిన లక్షణాలు ఏవి ?

II. 15 పంక్తులలో ఈ క్రింది వాటికి జవాబు లిమ్ము.
   1. పన్ను యొక్క ఉద్దేశాలు వివరించుము.
   2. మంచి పన్ను విధానం యొక్క సూత్రాలను విశ్లేషించుము.
   3. మంచి పన్ను విధానం యొక్క లక్షణాలను గుర్తించుము.
   4. చెల్లింపు సామర్థ్యము అను నియమాన్ని విశదీకరించుము.
   5. వ్యాకోచత్వ మరియు మితవ్యయ నియమాలను వివరించుము.
   6. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను విధింపు నియమాలు ఏవి?

●●●

BRAOU

# భాగం – 8 : పన్ను విధింపులో న్యాయం – వివిధ సిద్ధాంతాలు

విషయక్రమం


8.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
8.1 పరిచయం
8.2 తొలి అభిప్రాయాలు, లాభ మరియు చెల్లింపు సామర్థ్య సిద్ధాంతములు
8.3 పన్ను విధింపు లాభ సిద్ధాంతము
8.4 సేవా వ్యయాల పన్ను సిద్ధాంతము
8.5 చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము
8.6 చెల్లింపు సామర్థ్యము : ఆత్మాశ్రయాంశ సూచికలు
8.6.1 సమ నిరపేక్ష త్యాగం
8.6.2 సమానుపాత త్యాగం
8.6.3 సమ ఉపాంత త్యాగం
8.6.4 ముగింపు విశేషాంశం
8.7 చెల్లింపు సామర్థ్యం – పరాశ్రయాంశ సూచికలు
8.7.1 ఆస్తి
8.7.2 ఆదాయం
8.7.3 వ్యయం
8.8 సారాంశము; ముగింపు
8.9 సంప్రదించు పుస్తకాలు
8.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 8.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం పన్ను విధింపులో కల వివిధ సిద్ధాంతాలను విశదీకరించడం. ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అర్థం చేసుకోగలుగుతారు.

- పన్ను విధింపు లాభ సిద్ధాంతము వివరించడము
- సేవా వ్యయాల సిద్ధాంతాన్ని విశ్లేషించడం
- చెల్లింపు సామర్థ్యాన్ని విశదపరచడం, మరియు
- చెల్లింపు సామర్థ్యంలో ఆత్మాశ్రయాంశ, పరాశ్రయంశ భావనలను గుర్తించడం.

## 8.1 పరిచయం

పన్ను విధింపులో న్యాయం అనగా పన్ను విధింపు సామర్థ్యం ఎలా నిర్ణయించబడాలి అనే విషయం గురించి నేర్చుకుందాం. సమాన ప్రతిఫలనం *(quid-pro-quo)* లేకుండా ఒక వ్యక్తి ప్రభుత్వానికి చేయు నిర్బంధ చెల్లింపును పన్ను అంటారు. పన్ను విధింపు యొక్క ద్రవ్యభారం ఏ విధంగా పంపిణీ చేయ బడుతోంది? పన్ను భారపు



BRAOU

పంపిణీలో సమానత్వాన్ని సాధించడానికి ఏ సూత్రాలను అనుసరించాలి.? పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వానికి మధ్య గల సంబంధం ఏమిటి? పన్ను విధింపులో న్యాయాన్ని నిర్ణయించు వివిధ అంశాల విశ్లేషణలో ఈ ప్రశ్నలకు జవాబులు లభిస్తాయి. పన్ను భారాన్ని ఏ విధంగా పంపిణీ చేయాలో తెలియజేయడానికి మూడు ముఖ్య సిద్ధాంతాలు కలవు. అవి: 1. లాభ సిద్ధాంతం 2. సేవా వ్యయ సిద్ధాంతం 3. చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం. లాభ సిద్ధాంతం పన్ను చెల్లింపును ప్రభుత్వం అందజేసిన వస్తుసేవల వల్ల లభించే ప్రయోజనానికి జత చేస్తుంది. ప్రభుత్వం అందజేసిన వస్తు సేవలపై అయ్యే వ్యయానికి జతచేస్తుంది. చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం పన్ను చెల్లింపును వ్యక్తుల చెల్లింపు సామర్థ్యానికి జత చేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన సిద్ధాంతం.

## 8.2 తొలి అభిప్రాయాలు : లాభ మరియు చెల్లింపు సామర్థ్య సిద్ధాంతాలు

మధ్యయుగాలనుండి నేటి వరకు గల వివిధ తత్వవేత్తలు, ఆర్థికవేత్తలు, రాజనీతిజ్ఞులు మొదలగు వారి రచనలనుండి పన్ను విధింపు సూత్రాలపై గల వివిధ అభిప్రాయాలను తెలుసుకోవచ్చని 'మస్‌గ్రేవ్' తెలిపెను. ప్రజలకు సార్వభౌమాత్వానికి మధ్య గల సంబంధాలలో అతి ముఖ్యమైనది పన్ను చెల్లించవలసిన బాధ్యత , పన్ను విధించే అధికారము. లాభ సిద్ధాంతానికి సబంధించినంతవరకు ప్రభుత్వానికి చెల్లింపుదారులకు నడుమ ఒప్పందపు సంబంధము వంటిదని చెప్పెను.

### లాభ సిద్ధాంత ప్రతికూల అనుకూల వాదనలు

పన్ను విధింపు ప్రభుత్వం అందించిన సేవలకు తగిన ధర వసూలు చేయడమనేది రాజ్యపు ఒప్పంద (Contract theory of state) సిద్ధాంతానికి సహజపూరకం (natural Complement) వంటిదని 17,18 శతాబ్దాలలోని ఆర్థికవేత్తలు రాజనీతిజ్ఞులు అభిప్రాయపడిరి. ప్రభుత్వ కార్యకలాపాల వల్ల వివిధ వస్తు సేవలను పొందుతున్న వ్యక్తులు తాము పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో ప్రభుత్వానికి సహాయం చేయడం వారి విధి అని లాభ సిద్ధాంతం తెలుపుతుంది. పన్ను చెల్లింపుదారుకు ప్రభుత్వానికి మధ్య గల సంబంధం సమాన ప్రతి ఫలనంపై ఆధారపడి వుంటుందని 'జే.యస్.మిల్' అభిప్రాయపడెను. ప్రభుత్వ సేవల వల్ల పొందిన ప్రయోజనాల అనుపాతంలో పన్ను చెల్లించాలని చెప్పడం వల్ల ఈ సిద్ధాంతం ఆదాయ సంపదల పంపిణీ సమానంగా వుండాలనే అంశానికి ప్రాధాన్యత నీయడం లేదని తెలుస్తోంది. అదే విధంగా పన్నుల విధానం ద్వారా వృద్ధి స్థిరత్వ సమస్యలను పరిష్కరించవచ్చుననే అంశానికి కూడ ఈ సిద్ధాంతం ప్రాధాన్యత నీయడం లేదు. వస్తు సేవలు ప్రభుత్వం చేత ఏ విధంగా అందజేయబడుతున్నాయి ? ఇందుకు బదులుగా సమాజం ఏ విధంగా చెల్లించాలి? ఈ అంశాలపైననే లాభ సిద్ధాంతం దృష్టిని కేంద్రీకరిస్తోంది.

BRAOU

### లాభ సిద్ధాంత రక్షణ విధానం

లాభ సిద్ధాంతాన్ని బలపర్చిన తొలి రచయితలు రక్షణనే ఆధారంగా తీసుకున్నారు. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రభుత్వం ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తోంది. ఈ రక్షణ అవసరం ప్రభుత్వం రక్షణ కల్పించిన ఆస్తి సంపదల విలువకు అనుపాతంలో వుంటుంది. అందుచే అనుపాత పన్నువిధానం లాభ సిద్ధాంతాన్ని బలపరచిన వారిచే సమర్థించబడింది. రూసో, సిస్‌మాండి మొదలగు కొందరు రచయితలు యీ అభిప్రాయాన్ని అంగీకరించలేదు. రూసో అభిప్రాయంలో బీదవారి కంటె ధనికులు రక్షణ వల్ల ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతారని అభిప్రాయపడెను. అదేవిధంగా, ఆదాయాలకంటె రక్షణ అవసరం ఎక్కువ వేగంగా పెరుగుతుందని సిస్‌మాండి అభిప్రాయపడెను. అందుకనే అతడు పురోగామి పన్నుల విధానాన్ని బలపర్చెను.

### లాభ సిద్ధాంత ఉపాంత ప్రయోజనం

కొంతమంది రచయితలు ఉపాంత ప్రయోజనమనే భావనను ఆధారంగా తీసుకొని లాభ సిద్ధాంతాన్ని బలపర్చిరి. ఉదాహరణకు, ప్రతి వినియోగదారుడు ప్రభుత్వం అందజేసిన సేవల వల్ల లభించిన ఉపాంత ప్రయోజనానికి సమానంగా ఉండేటట్లు ధరచెల్లించాలని మజ్జోలా అభిప్రాయం.

ఎమిల్ సేక్స్ (Emil Sax) అనే మరొక రచయిత వ్యక్తిగత సామూహిక కోరికలు (personal collective wants) సరియైన సామూహిక కోరికలు (collective wants proper) అనే భావనల మధ్య తేడాలను గుర్తించెను. దీనిలో మొదటి రకానికే బహిష్కరణ సూత్రం వర్తిసుంది గాని రెండవరకానికి వర్తించదనేది సుస్పష్టం. ప్రభుత్వ సేవల లాభాన్నుండి ఏ వ్యక్తినీ తప్పించలేము. కావున ఒక వ్యక్తి పొందిన లాభాన్ని లెక్కించడానికి అనుపాతపు ఆదాయపు పన్నే మంచి సూచిక (proxy) అని 'సేక్స్' అభిప్రాయం. ప్రభుత్వ సేవలకై వ్యక్తుల స్వచ్ఛంద (Voluntory) ఉమ్మడి (Collective) చర్యల ఆధారంగా పన్నులు విధించబడాలని 'నట్ విక్సెల్' (knut wicksell, అభిప్రాయపడెను. ఈ అభిప్రాయాన్ని ఆచరణలో పెడితే ఆదాయ పంపిణీ సమతను ( equitable distribution of income) సాధించడంలో పన్నుల విధానం ఎట్టి పాత్రనూ వహించదు. ఆర్థిక వ్యవస్థలోనూ ఆదాయ పంపిణీ సమత సాధారణంగా వుండదు కనుక ప్రభుత్వ సేవలు స్వచ్ఛంధ (voluntary)గిరాకీ ఆధారంగానే వినియోగింప బడాలనే అభిప్రాయం సరికాదు. అదే విధంగా 'ఎరిక్ లిండాల్' ( Erik Lindahl) కూడ ఆదాయ పంపిణీ సమతను సాధించడంలో పన్నుల విధానానికి ప్రాధన్యత నీయలేదు. అతడు వ్యక్తులు చెల్లించిన పన్నులు వారిచే తమ అభీష్టానుసారం పొందబడిన సేవల స్వచ్ఛంద వినిమయం ఆధారంగా లాభ సిద్ధాంతాన్ని బలపర్చెను.

### చెల్లింపు సామర్థ్య సిద్ధాంత పంపిణీ విధానం

ఆర్థిక వ్యవస్థలో పంపిణీ విధానాలకు ప్రాముఖ్యతనిస్తే చెల్లింపు సామర్థ్య పద్ధతి న్యాయ సమ్మతమౌతుంది. ఈ సిద్ధాంతం సామాజిక వాదులచే బలపర్చబడింది. 'ఆడమ్‌స్మిత్' ఈ పన్ను విధింపు నియమాల్లో ఒకటైన సమతా నియమంలో (Cannon of equity) చెల్లింపు సామర్థ్యానికి అధిక ప్రాధాన్యత నిచ్చెను. ఆధునిక సంక్షేమ రాజ్యాలు కూడ చెల్లింపు సామర్థ్యం ఆధారంగా ఏర్పరచబడిన పన్నుల విధానానికే అధిక ప్రాధాన్యత నిస్తున్నాయి.

### పన్ను విధింపు మార్గాలు

పన్నుల విధానంలో స్థూలంగా రెండు పద్ధతులున్నాయని పై చర్చ వల్ల వల్ల తెలుస్తుంది. అవి – 1. ప్రభుత్వ కార్యకలాపాల నుండి వ్యక్తులు పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో పన్నులు విధించడం, 2. చెల్లింపు దారుల సామర్థ్యాన్ని బట్టి పన్నులు విధించడం. ప్రయోజన విధానాన్ని తీసుకుంటే ప్రభుత్వానికి పన్ను చెల్లింపుదారుకు మధ్య సమాన ప్రతిఫలన సంబంధం వుంటుంది. అప్పుడు పన్నులు తప్పని సరియైన చెల్లింపులుగా పరిగణించబడవు. కాని చెల్లింపు సామర్థ్య విధానం తీసుకుంటే ప్రభుత్వ ఖజానాకు నిర్బంధ సహాయంగా గుర్తించబడతాయి. ఈ పద్ధతి పన్నుల విధానంలో సమాన ప్రతిఫలనముండదు. ఇప్పుడు మనం ఈ విధానాల లాభనష్టాలను గూర్చి తెలుసుకుందాం.

## 8.3 పన్ను విధింపు లాభ సిద్ధాంతము

ప్రభుత్వం యొక్క వివిధ కార్యకలాపాల ద్వారా సమాజం పొందుతున్న ప్రయోజనాల కోసం ప్రభుత్వం సేవలను అందజేయడంలో చేసిన వ్యయాన్ని వ్యక్తులు పొందిన లాభాల అనుపాతంలో ప్రభుత్వానికి చెల్లించడం



Dr. BRAOU LIBRARY Acc. No: CM-0459 Class No: 330 6&N

న్యాయ సమ్మతము. లాభ సిద్ధాంతం యొక్క లాభాలు ఈ క్రింది విధంగా వుంటాయి.

### 8.3.1 లాభ సిద్ధాంత లాభాలు

(i) ప్రభుత్వ సేవల వల్ల లాభం పొందిన వారిపై పన్ను విధించడం న్యాయ సమ్మతమైనదనే ప్రమేయంపై ఈ సిద్ధాంతం ఆధారపడివుంది.

(ii) బడ్జెటు యొక్క ఆదాయ వ్యయాలు రెండింటికి ఈ సిద్ధాంతం ప్రాధాన్యత విస్తోంది. ప్రభుత్వం కొన్ని వస్తు సేవలను కల్పిస్తే బడ్జెటులోని వ్యయభాగం ప్రభావితమౌతుంది. సమాజంపై పన్ను విధిస్తే బడ్జెటులో ఆదాయ భాగం ప్రభావితమౌతుంది. లాభ సిద్ధాంతం ప్రభుత్వ వ్యయాన్నే కాక పన్ను చెల్లించేవారి పన్ను భాగాలు కూడ నిర్ణయిస్తుంది. ఇంకో మాటలో చెప్పాలంటే లాభ సిద్ధాంతం ప్రభుత్వ సేవలు పన్ను భాగాలను ఒకేసారి నిర్ణయిస్తుంది.

(iii) సమర్థవంతమైన వనరుల కేటాయింపుకు యిది సహాయపడుతుంది.

(iv) పొందిన లాభాన్ని లెక్కించగల సందర్భాల్లోనే ఈ సిద్ధాంతాన్ని అమలు చేయగలము. పోలీసు శాఖ నిర్వహణ కోసం స్థానిక ఆస్తిపన్నులు, ఒక ప్రాంతంలో ప్రభుత్వ పనుల నిమిత్తం వసూలు చేయబడిన ప్రత్యేక చెల్లింపులు ఇందులకు ఉదాహరణలు.

### 8.3.2 లాభసిద్ధాంతములోని లోపాలు

లాభసిద్ధాంతంలో చాలా లోపాలున్నాయి. అందులో కొన్ని చర్చిద్దాం.

(a) ప్రయోజనాలను వ్యక్తులకు విడదీసి లెక్కించలేము. ప్రభుత్వవిధులు వివిధ రకాలైనవి, క్లిష్టతరమైనవి. ప్రభుత్వం చేత నిర్వహించబడుతున్న వివిధ కార్యకలాపాల వల్ల మొత్తం సమాజం ప్రయోజనాన్ని పొందుతుంది. వ్యక్తిగత ప్రయోజనాలను లెక్కించడం చాల కష్టతరమైనది. సాధ్యం కానిది. అందుచేత వ్యక్తులు పొందిన ప్రయోజనాల అనుపాతంలో పన్నులను వసూలు చేయడం సాధ్యం కాదు. ఈ విధంగా లాభ సిద్ధాంతంలో అనేక సిద్ధాంతపరమైన ( theoretical ), ఆచరణపరమైన (practical) సమస్యలున్నాయి.

(b) పన్ను చెల్లించేవారికి ప్రభుత్వానికి మధ్య సమాన ప్రతిఫలనముండాలనడం తీవ్ర విమర్శకు గురైంది. పూర్వపు విత్త రచయితలు పన్నుచెల్లింపుదారులకు ప్రభుత్వానికి మధ్య గల సంబంధం ప్రయివేటు కోరికలను తీర్చుకోవడంతో సమానంగా భావించి పన్నులను ధరలతో సమానంగా పరిగణించారు. కాని ప్రభుత్వం అందజేస్తున్న అనేక సేవలు సామూహిక కోరికలను (Collective wants) సంతృప్తి పరిచేవే. ఆధునిక కాలంలో ప్రభుత్వం కల్పిస్తున్న కొన్ని సేవలు మొత్తం సమాజం యొక్క సంక్షేమానికుద్దేశింపబడినవే కాని వ్యక్తిగత సంక్షేమానికి ఉద్దేశింపబడినవి కావు. అందుచే వీటికి సమాన ప్రతిఫలనం ఆధారంగా వినిమయం సాధ్యం కాదు.

(c) ప్రయోజనాలను వ్యక్తిగతంగా విడదీయలేము కనుక పన్ను విధింపును వివిధ కార్యక్రమాల కవసరమగు విత్తాన్ని సమీకరించే సామూహిక సాధనంగా (collective instrument) పరిగణించాలి. అందుచే పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో పన్నులను వసూలు చేయడం సాధ్యం కాదు.

BRAOU

(d) లాభ సిద్ధాంతం ఒక్కొక్కసారి విచిత్రమైన ఫలితాలనిస్తుంది. ఉదాహరణకు ప్రతివ్యక్తి తాను గ్రహించిన ప్రయోజనాలను బట్టి ప్రభుత్వానికి చెల్లించాలి అనుకొంటే ఒక పెన్షను దారుని సంగతేమిటి ? పెన్షనుకు సమానమైన మొత్తాన్ని పన్నుల రూపంలో చెల్లించమని అడిగితే చాలా హాస్యాస్పదంగా వుంటుంది. అందుచేత ప్రయోజనాల అనుపాతంలో పన్నులను చెల్లించమనడం సరైన పద్ధతి కాదు.

(e) పన్ను భారం ధనికులపై కంటె పేదవారిపై అధికంగా ఉంటుంది. సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వ ఆదాయంలో ఎక్కువ భాగం పేద ప్రజల ప్రయోజనానికే ఉపయోగించబడుతుంది. పేదవారిని వారు పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో పన్నులను చెల్లించమంటే అది తిరోగామి విధానానికి దారి తీస్తుంది. ఇంకో మాటల్లో చెప్పాలంటే, లాభ సిద్ధాంతం సమర్థిస్తున్న అనుపాత పన్నుల విధానం స్వాభావికంగా తిరోగామి లక్షణాన్ని కలిగి వుంటుంది.

(f) పైన చెప్పినట్లు పంపిణీ, స్థిరత్వ సమస్యలకు ఈ సిద్ధాంతం ఎక్కువ ప్రాముఖ్యత నీయడం లేదు. కాని ఆధునిక కాలంలో అభివృద్ధి ప్రణాళికల ధ్యేయాల్లో ఈ రెండూ ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి. లాభ సిద్ధాంతము తిరోగమన పన్ను విధానానికి దారి తీస్తుంది. కాబట్టి J.S. Mill దీన్ని త్రోసి పుచ్చినది.

(g) లాభ సిద్ధాంతాన్ని కొని సందర్భాల్లోనే అమలుపర్చగలము. ఒక ప్రత్యేకమైన సేవను ప్రభుత్వం సమకూర్చినపుడు వ్యక్తిగత ప్రయోజనాలను లెక్కించడం సాధ్యం గావచ్చు. కనుక ప్రయోజనాల అనుపాతంలో పన్నులను చెల్లించమని ప్రజలను అడగవచ్చు. లాభ సిద్ధాంతాన్ని అమలుపరచాలంటే ప్రభుత్వం కల్పించే ప్రతి సేవ వ్యాపార సరళిలో ఉండాలి. కాని సంక్షేమ రాజ్యం యొక్క కార్యకలాపాలలో చాలా వరకు వ్యాపార పద్ధతుల్లో నిర్వహించబడవు. అందుకే ఆర్థిక వ్యవస్థలు పన్నులన్నింటిని లాభ సిద్ధాంతం దృష్ట్యా విశ్లేషించడం తర్క విరుద్ధం.

ప్రభుత్వం అందజేసే సేవలవల్ల కలిగే ప్రయోజనాలను లెక్కించడం సాధ్యం కాదు కనుక లాభ సిద్ధాంతం ఆచరణ యోగ్యం కాదనే విషయం పై విమర్శవల్ల తెలుస్తోంది.

## 8.4 సేవా వ్యయాల సిద్ధాంతం

ఈ సిద్ధాంతం లాభ సిద్ధాంతానికి దగ్గర సంబంధం కలిగి ఉంటుంది. వివిధ ప్రభుత్వ సేవలను పొందే వ్యక్తులు ప్రయోజనాల అనుపాతంలో పన్నులు చెల్లించాలని లాభ సిద్ధాంతం తెలుపగా సేవా వ్యయ సిద్ధాంతం ఈ సేవలనందించడానికయ్యే వ్యయానికి ప్రాధాన్యత నిస్తుంది. ప్రభుత్వం మార్కెట్‌లోని అమ్మకందారువలె భావించబడుతుంది. ప్రభుత్వం అందజేసిన వస్తుసేవలకయ్యే వ్యయాన్ని వాటిని ఉపయోగించుకొన్న వ్యక్తులపై పన్ను విధించడం ద్వారా రాబట్టుకోవాలి. ఈ సిద్ధాంతం ప్రకారం పౌరులు ప్రభుత్వంనుండి ఏ విధమైన ప్రయోజనాలను ఆశించరాదు. ఎవరైనా ప్రయోజనాన్ని పొందితే అతడు దాని వ్యయాన్ని చెల్లించాలి. ఈ సిద్ధాంతం ప్రభుత్వం యొక్క రక్షణ సంక్షేమ విధులకు ఆదాయ పంపిణీ సమస్యలకు ప్రాధాన్యత నివ్వడం లేదు. ఇది సంతులిత (Balanced) బడ్జెట్ విధానాన్ని బలపరుస్తుంది. దీన్ని అమలుపరిస్తే ప్రభుత్వాదాయ మార్గాల్లో చాలా వాటికి పన్ను ల విధింపులో చోటుండరాదు. ఉదాహరణకు ఆకస్మిక లాభాలు (Wind fall gains) స్థిరాస్తుల ధరలు పెరుగుదల వల్ల వచ్చిన లాభాలు (Capital gains) సంపాదించని పెట్టుబడులు (unearned investments) వారసత్వం బహుమతులు మొదలైనవి పన్ను విధింపు పరిధిలోనికి రావు. ప్రభుత్వం అందజేసిన సేవల వ్యయాన్ని వ్యక్తులు భరించాలి. కనుక ఈ సిద్ధాంతం అన్ని రకాల సంక్షేమ కార్యకలాపాలను తిరస్కరిస్తుంది.

లాభ సిద్ధాంతం లాగే ఇది కూడా ఆచరణ సాధ్యమైనది కాదు. సేవా వ్యయాన్ని కొలవడం, వాటిని

BRAOU

ప్రయోజనాలు పొందిన వివిధ వ్యక్తులకు ఆపాదించడం చాలా కష్టం.

ప్రభుత్వం అందించే చాలా సేవలకు ప్రైవేటు వస్తువుల విషయంలో వలె బహిష్కరణ సూత్రం వర్తించదు. ప్రభుత్వ సేవల ప్రయోజనం పొందడానికి సమాజంలోని వ్యకులందరు అర్హులే. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రభుత్వ వస్తువుల వినియోగంలో వాటాను ఎవ్వరికీ తిరస్కరించలేము. కాబట్టి సేవా వ్యయాన్ని వివిధ వ్యక్తుల మధ్య పంచలేము.

స్పష్టమైన బావనలతో సేవా వ్యయాన్ని లెక్కజేయడం సాధ్యం కాదనేది దీనికి గల మరొక అభ్యంతరం. ఉదాహరణకు వనరులు అసమర్థంగా వినియోగింపబడితే సేవా వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తి అసమర్థత వల్ల పెరిగిన వ్యయాన్ని పన్నుల రూపంలో వినియోగదారులను చెల్లించమనడం సమంజసం కాదు.

అలాగే ఈ సిద్ధాంతం బహిర్గత ఫలితాల సమస్యను వివరించడానికి తగదు. బహిర్గత ఫలితాల వల్ల సామాజిక ప్రయోజనాలు, వ్యయాలు కూడా ఉత్పన్నమౌతాయి. ప్రైవేటు ఉత్పత్తిదారులవలె ప్రభుత్వం కూడా వాణిజ్య వ్యయాలను మాత్రమే తీసుకున్నపుడు ఈ సిద్ధాంతం వర్తిస్తుంది. కాని ఈ అభిప్రాయం సరైనది కాదు. పన్ను చెల్లించే బాధ్యతను నిర్ణయించడానికి ప్రభుత్వం నికర సాంఘిక వ్యయాన్ని అంచనా వేయవలసి ఉంటుంది.

ప్రభుత్వం ఏ విధమైన సేవలను ఎంతమేరకు అందించాలనేది ముఖ్యమైన ప్రశ్న. సేవా వ్యయాన్ని పన్నుల ద్వారా పౌరులను చెల్లించమంటున్నపుడు ఎటువంటి సేవలను అందజేయాలనే విషయాన్ని ప్రభుత్వం తనంతట తానే నిర్ణయించడం సరియైన పద్ధతి కాదు. అయితే ప్రభుత్వ సేవలకు పౌరులకు ప్రాధాన్యతలను (Preferences) తెలుసుకోవడం ఎలా ? ప్రభుత్వ సేవలకు పౌరులిచ్చే నిజమైన ప్రాధాన్యతలను తెలుసుకోవడం ఆచరణలో చాలా సమస్యలతో కూడినది.

ఈ సిద్ధాంతంలో పైన చెప్పిన లోపాలున్నప్పటికీ కొన్ని సందర్భాలలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఒక సేవ ప్రత్యేకంగా కల్పించబడితే దాని వల్ల ప్రయోజనం పొందే వారి నుండి దాని వ్యయాన్ని తిరిగి పొందడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. సీటి సరఫరా, రైల్వేలు మొదలైనవి దీనికి ఉదాహరణ. కాని పన్ను విధింపులో న్యాయాన్ని నిర్ణయించడానికి ఈ సిద్ధాంతం తగినది కాదు. పేద ప్రజలకుద్దేశింపబడిన ఉచిత విద్య,వైద్య సౌకర్యాలను ఈ సిద్ధాంతం ఆధారంగా వివరించలేము. పన్ను సమాన ప్రతిఫలనము లేకుండానే చేసే నిర్బంధ చెల్లింపు పన్ను అనే నిర్వచనానికి ఈ సిద్ధాంతం వ్యతిరేకంగా ఉంది. ఈ సూత్రం 'పన్ను' విధింపుకు ఉన్న లక్షణాలతో కూడుకొని లేదు. అనగా 'సమాన ప్రతిఫలనం' కాని ఈ సిద్ధాంత ప్రకారం పన్ను అనునది సేవా వ్యయాలకు ప్రతిఫలంగా చెల్లించబడునదిగా గుర్తించవచ్చు.

### మీ అవగాహనను పరీక్షించుకొండి - 1

1. సేవా వ్యయాల సిద్ధాంత పన్ను విధానమనగా నేమి?
2. లాభ సిద్ధాంత పన్ను విధానమనగా నేమి?

## 8.5 చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము

### 8.5.1 సిద్ధాంతము

లాభ సిద్ధాంతం, సేవావ్యయ సిద్ధాంతం వలె కాక ఇది పూర్తిగా పన్ను నిర్వచనం ప్రకారం ఉంటుంది. రాజ్యానికి



BRAOU

పౌరులకు మధ్య సమాన ప్రతిఫలన సంబంధం ఉండాలని ఈ సిద్ధాంతం ప్రతిపాదించదు. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రభుత్వానికి పౌరుని‌కు మధ్య వాణిజ్యపరమైన సంబంధాలుండవు. సమాన ప్రతిఫలనం లేకుండా ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం పౌరుల సమిష్టి బాధ్యత? సమాజంలో సభ్యులందరి మధ్య న్యాయాన్నీ, సమతనీ సాధించేటట్లు పన్ను భాగాన్ని పౌరులందరూ పంచుకోవాలనే ఆలోచన నుంచి చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం ఆవిర్భవించింది. పన్నులు చెల్లింపుదారుల చెల్లింపు సామర్థ్యం ప్రకారం విధింపబడాలని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. ఇది 'ఆడమ్‌స్మిత్' తన సమతా నియమం (cannon of equity) ఆధారంగా రూపొందించాడు. "ప్రతి రాజ్యంలోని పౌరులు వారి శక్తి మేరకు ప్రభుత్వ నిర్వహణకవసరమయ్యే ద్రవ్యాన్ని చెల్లించాలని" సమతా నియమం చెబుతుంది.

మస్‌గ్రేవ్. మరియు పి.బి. మస్‌గ్రేవ్‌లు అభిప్రాయపడినట్లు లాభ సిద్ధాంతం కొన్ని ప్రత్యేకమైన ప్రభుత్వ విధులకు మాత్రమే వర్తిస్తుంది. కాబట్టి పన్నుల వ్యవస్థ యొక్క సాధారణ సమస్యను వివరించడానికి ఇది ఉపకరించదు. పన్ను విధింపు ద్వారా ఆదాయ పునఃపంపిణీని సాధించడమెలాగో లాభసిద్ధాంతం వివరించలేదు. అందుకే పన్ను విధింపులో సమతను సాధించడానికి ప్రజల సామర్థ్యపు అనుపాతంలో ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి.

### 8.5.2 లాభాలు

పన్నుల విధానంలో చెల్లింపు సామర్థ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు ఈ క్రింది అభిప్రాయాలను తెలియచేశారు.

1. సామర్థ్యపు త్యాగ వివరణ (sacrifice interpretation of ability) దృష్ట్యా చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం సమర్థించబడింది. త్యాగం అనేది ఆత్మాశ్రయభావం. త్యాగం ఆధారంగా సామర్థ్యాన్ని లెక్కించడానికి వేర్వేరు సూత్రాలు సూచించబడ్డాయి. స్థూలంగా త్యాగానికి మూడు రకాల వివరణలు ఇవ్వబడ్డాయి. 1. సమత్యాగం 2. అనుపాత త్యాగం 3. కనిష్ఠ త్యాగం (దీనిని ఉపాంత త్యాగ సిద్ధాంతమని కూడా అంటారు.) . త్యాగం దృష్ట్యా ధనికులు ఎక్కువ పన్నుల భారాన్ని భరించడం న్యాయసమ్మతం.

2. ఆదాయ క్షీణోపాంత ప్రయోజనం ఆధారంగా ఈ సిద్ధాంతం న్యాయ సమ్మతమైంది. ఆదాయ స్థాయి పెరిగే కొద్దీ ఆదాయ ఉపాంత ప్రయోజనం తగ్గుతుంది. అందుచే పేదవారి కంటె ధనికులే ఎక్కువ అనుపాతంలో పన్ను భారాన్ని భరించాలి.

3. కొన్ని ప్రాథమిక అవసరాలుతీరిన పిమ్మట పేదవానికంటె ధనికులకే ఎక్కువ వనరులు మిగిలి ఉంటాయి. అందుచే పేదలకంటె ధనికులే పన్ను భారాన్ని ఎక్కువగా భరించాలనేది న్యాయ సమ్మతమైనది.

### 8.5.3 విమర్శ

చెల్లింపు సామర్థ్య సిద్ధాంతాన్ని సమర్థించే పై మూడు అంశాలను పరిశీలిస్తే అవి వాస్తవికమైనవి కావని తెలుస్తుంది. త్యాగం లేక ఆదాయ ఉపాంత ప్రయోజనం ఆత్మాశ్రయం కావడమే దీనిలోని ముఖ్యమైన ప్రతిబంధకము.

## 8.6 చెల్లింపు సామర్థ్యం – ఆత్మాశ్రయాంశ సూచికలు

'జే.యస్.మిల్' కాలం నుండీ కూడ చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం సమత్యాగంగా ఊహించబడుతోంది.



BRAOU

ఆదాయ ప్రయోజనం అందరికి ఒకే విధంగా ఉంటుందనుకొంటే సమాన ఆదాయాన్ని పొందే వ్యక్తులు సమాన చెల్లింపు సామర్థ్యం కల్గి ఉంటారు. కావున వారు సమాన మొత్తాల్లో పన్ను చెల్లించాలి. సమత్వ సూత్రాన్ని అర్థం చేసుకొనేందుకు క్షితిజ సమాంతర (Horizontal) క్షితిజలంబం (vertical) అనే రెండు పరిస్థితులను తెలుసుకోవాలి. సమాన పరిస్థితులు కలిగిన ప్రజలకు సమాన పన్నులు విధించడాన్ని క్షితిజ సమాంతర సమత్వం అంటారు. అసమాన ఆదాయాలు కలిగిన వారికి అసమాన పన్నులను విధించడాన్ని క్షితిజలంబ సమత్వం (vertical equality) అంటారు. ఈ రెండింటిలో క్షితిజ సమాంతర సమత్వం తక్కువ విమర్శకు గురైంది. సమత్వాన్ని సమాన ఆదాయ నష్టం దృష్ట్యా కాకుండా సమాన ప్రయోజన నష్టం దృష్ట్యా అన్వయించినట్లయితే క్షితిజసమాంతర సమత్వం రెండు ముఖ్య ఊహలపై ఆధారపడి ఉంటుంది. 1. ఆదాయ ప్రయోజనాన్ని సంఖ్యాపరంగా లెక్కించవచ్చు. 2. ఆదాయ ప్రయోజన పట్టిక ప్రజలందరికి ఒక్క విధంగానే ఉంటుంది. కాని క్షితిజ లంబ సమత్వానికి (vertical equality) కావలసిన షరతులను సాధించడం ఎలా? ఈ ప్రశ్నకు జవాబు ఆదాయ ప్రయోజన రేఖ ఆకారాన్ని బట్టి సమత్యాగ నిర్వచనాన్ని బట్టి ఉంటుంది. ఇదివరకే చెప్పినట్లుగా సమత్యాగాన్ని 1. సమ నిరపేక్ష త్యాగం. 2. సమానుపాత త్యాగం 3. సమ ఉపాంత త్యాగం అని మూడు విధాలుగా వివరించవచ్చు. డాల్టన్ ఇంకో విధంగా కూడా అనగా ఆదాయాల స్థిర సమానత (constant equality of incomes) అనే భావన ద్వారా సమత్యాగాన్ని నిర్వచించెను. అంటే పన్ను చెల్లింపు దారుల సాపేక్ష ఆదాయ స్థితి పన్ను చెల్లింపుకు ముందు, తర్వాత కూడ ఒకే విధంగా ఉండటం. పన్ను చెల్లింపుదారుని ఆదాయం మారినపుడు ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని ఏ విధంగా లెక్కించాలి అనేది చిక్కు సమస్య. వ్యక్తుల ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని పోల్చడం మరింత కష్టమైనది. ఆదాయ ఉపాంత ప్రయోజనం లెక్కింపులో ఏకాభిప్రాయం లేకపోయిన పన్ను చెల్లింపుదారులలో ఆదాయ ప్రయోజన పట్టిక ఒకే విధంగా ఉంటుందనే ప్రమేయం అంగీకరించబడింది. దాని ద్వారా సమాన త్యాగం యొక్క వివిధ వివరణలను విశ్లేషించవచ్చు. త్యాగం యొక్క మూడు ప్రమేయాలను వివరణలను మనం ఇప్పుడు చర్చిద్దాం.

BRAOU

### 8.6.1 సమ నిరపేక్ష త్యాగం

వివిధ పన్నుల చెల్లింపుదారులలో ప్రయోజన నష్టం సమానంగా ఉంటుందని ఈత్యాగం యొక్క వివరణ తెలుపుతుంది. ఈ సిద్ధాంతాన్ని వర్తింపజేస్తే సమాజంలో ప్రతీ వ్యక్తి పన్ను కొరకు కొంత మొత్తాన్ని చెల్లించాలి. ఎవ్వరూ మినహాయింపబడరాదు. ఆదాయ ఉపాంత ప్రయోజనం ఆదాయ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. కనుక వివిధ ఆదాయాలతో కూడిన పన్ను చెల్లింపుదారుల మొత్తం సమానం కాదు. ఉదాహరణకు వేర్వేరు ఆదాయాలు కల ఇద్దరు పన్ను చెలింపుదారులున్నారనుకొందాం. ఎక్కువ ఆదాయాన్ని పొందే వ్యక్తి ఎక్కువ పన్ను చెల్లిస్తాడు. అలాగే తక్కువ ఆదాయాన్ని పొందే వ్యక్తి తక్కువ పన్ను చెల్లిస్తాడు. కాని పన్ను వల్ల కలిగే త్యాగం లేక ప్రయోజన నష్టం ఇరువురికీ సమానంగానే ఉంటుంది.

### 8.6.2 సమానుపాత త్యాగం

పన్ను ఫలితంగా కోల్పోయిన ప్రయోజనం పన్ను చెల్లింపుదారుల ఆదాయానికి అనుపాతంగా ఉండాలని దీని అర్థం. ఈ సూత్రంలో పన్ను చెల్లింపుదారుల త్యాగం, ఆదాయాల నిష్పత్తి పన్ను చెల్లింపుదారులందరికి సమానంగానే ఉండి దీని విలువ ఒకటి అవుతుంది. ఎక్కువ ఆదాయాన్ని సంపాదించే ప్రజలు ఎక్కువ మొత్తాలను పన్నుగా చెల్లించినప్పటికీ త్యాగం ఆదాయాల నిష్పత్తి అందరికీ సమానంగానే ఉంటుంది. సమానుపాత త్యాగ సూత్రాన్ని ఈ క్రింది విధంగా కూడా చూపవచ్చు. ABC లు పొందే తృప్తిని వారి ఆదాయం ద్వారా కొలుస్తున్నామనుకుందాం.

$$\frac{\text{A పన్ను చెల్లింపు దారుని త్యాగం}}{\text{A ఆదాయం}} = \frac{\text{B పన్ను చెలింపు దారుని త్యాగం}}{\text{B ఆదాయం}} = \text{ఇట్లే అందరి వ్యక్తులకు.}$$

ప్రతిపన్ను చెల్లింపుదారు తమ తృప్తిలో ఒక స్థిరమైన శాతాన్ని త్యాగం చేయాలని పై సూత్రం తెలుపుతోంది. సమానుపాత త్యాగ సూత్రాన్ని అమలుపరిస్తే రేటు నిర్మాణం ఎలా ఉంటుంది? ఆదాయ ఉపాంత ప్రయోజనం స్థిరంగా ఉంటే ఈ సూత్రం అనుపాత పన్నుల విధానానికి దారి తీస్తుంది. కాని ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణిస్తోంటే ఉపాంత సగటు ప్రయోజనాల సాపేక్ష బదిలీ శాతాలను తెలుసుకోవాలి. ఉపాంత సగటు తగ్గుదల రేట్లు సమానంగా ఉంటే ప్రయోజనాల అనుపాత పన్ను పద్ధతి ఈ సూత్రాన్ని తృప్తి పరుస్తుంది. అలాకాకుండా సగటు ప్రయోజనం కంటె ఉపాంత ప్రయోజనం త్వరితంగా పడిపోతే ఈ లక్ష్యాన్ని సంతృప్తి పరచడానికి పురోగామి పన్నుల విధానం తోడ్పడుతుంది. అదేవిధంగా సగటు ప్రయోజనం కంటె ఉపాంత ప్రయోజనం తక్కువ వేగంతో పడుతోంటే ఈ సూత్రాన్ని సంతృప్తి పరచడానికి తిరోగామి పన్నుల విధానం అవసరం.

### 8.6.3 సమ ఉపాంత త్యాగం లేదా కనిష్ఠ సమిష్టి త్యాగం

సమ ఉపాంత త్యాగం ద్వారా సమతకు మరియొక వివరణ ఇవ్వబడింది. అంటే ప్రతి పన్ను చెల్లింపుదారుని ఉపాంత త్యాగం సమానంగా ఉండేటట్లు పన్ను భారం పంచబడుతుంది. సంక్షేమ సాధన దృష్ట్యా ఈ సూత్రం సమర్థింపబడుతోంది. పన్ను చెలింపుదారుల ఉపాంత త్యాగం సమానంగా ఉంటే సమాజం యొక్క మొత్తం త్యాగం కనిష్ఠంగా ఉంటుంది.

సమ ఉపాంత త్యాగ సూత్రం సమతకు కంటె సామర్థ్యానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తోంది. ఎడ్జ్‌వర్త్, పిగూ ఈ సూత్రాన్ని బలపర్చారు.

### 8.6.4 ముగింపు విశేషాంశము

త్యాగం యొక్క మూడు భావనలను డాల్టన్ మాటల్లో తెలుసుకోవడం అవసరం. "సమ త్యాగ సూత్రం ప్రకారం పన్ను చెలింపుదారుల నిజభారం సమానంగా ఉండేటట్లు పన్నుల ప్రత్యక్షద్రవ్య భారం పంపిణీ చేయబడాలి. అనుపాత త్యాగ సూత్రం ప్రకారం ప్రతీ చెల్లింపుదారుని ప్రత్యక్ష నిజభారం అతడు ఆదాయం నుండి పొందిన ఆర్థిక శ్రేయస్సుకు అనుపాతంలో ఉండాలి. కనిష్ఠ త్యాగ సూత్రం ప్రకారం అందరి చెల్లింపుదారుల పైన పడే మొత్తం నిజభారం వీలైనంత తక్కువగా ఉండాలి" (డాల్టన్ : ప్రిన్సిపుల్స్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ ,పుట 63).

ఈ మూడు త్యాగాల్లోను సమ ఉపాంత త్యాగ సూత్రం చాలామందిచే అంగీకరింపబడింది. ఈ సందర్భంలో మనం గుర్తుంచుకోవలసిందేమంటే త్యాగం అనేది ఆత్మాశ్రయమైన భావన. కనుక ఆదాయ ఉపాంత ప్రయోజన రేఖను అంచనా వేయడం కష్టం. చెల్లింపు సామర్థ్యాన్ని త్యాగరూపంలో వ్యక్తం చేసినపుడు అస్పష్టంగా ఉంటుంది. అందుకే చెల్లింపు సామర్థ్యాన్ని పరాశ్రయ పద్ధతిలో వ్యక్తం చేయవలసిన అవసరం ఏర్పడింది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

1. చెల్లింపు సామర్థ్యమనగా నేమి?
2. ఏదేని సమానుపాత త్యాగంను వివరించుము.

---

## 8.7 చెల్లింపు సామర్థ్యం – పరాశ్రయాంశ సూచికలు

చెలింపు సామర్థ్యానికి సరియైన సూచిక ఏమిటి? పూర్వపు రోజుల్లో సామర్థ్యం ఆస్తికి ముడిపెట్టబడింది.

BRAOU

అందుచే ఎక్కువ ఆస్తి ఉన్నవారు ఎక్కువ చెల్లింపు సామర్థ్యం ఉన్నవారిగా పరిగణింపబడేవారు కాలక్రమంగా సాంఘిక ప్రగతిలో ప్రాధాన్యత ఆస్తి నుండి ఆదాయం వైపుకు మార్చబడింది. 'ఆడమ్‌స్మిత్' ఆదాయం ఆధారంగా సామర్థ్య నియమాన్ని సూత్రీకరించేడు. ఈ మధ్య కొందరు ఆర్థిక వేత్తలు వినియోగాన్ని చెల్లింపు సామర్థ్యానికి సూచికగా ఉపయోగిస్తున్నారు.

*ఈరెండింటి యొక్క అంతరార్థాలను (implications) పరిశీలిద్దాం.*

### 8.7.1 ఆస్తి

ఆదాయాన్ని చెల్లింపు సామర్థ్యానికి ఆధారంగా తీసుకోవడంలో కొన్ని లోపాలున్నాయి. ఒక వ్యక్తికి ఆదాయం ఉన్నా ఆస్తి ఉండకపోవచ్చు. అతడు ఆస్తి పన్ను పరిధిలోకి రాకపోవచ్చు. కొన్ని ఆస్తుల వల్ల ఆదాయం ఉండకపోవచ్చు. ఉదాహరణకు సాలినా పదిలక్షలు ఆదాయం వచ్చే వ్యక్తి యొక్క చెల్లింపు సామర్థ్యం ఆదాయం రాని ఒక పెద్ద ఇల్లుగల ఒక వితంతువు యొక్క చెల్లింపు సామర్థ్యంకంటె చాల ఎక్కువ ఉంటుంది. కాబట్టి కొన్ని సమయాల్లో ఆస్తి చెల్లింపు సామర్థ్యాన్ని సూచించక పోవచ్చు.

### 8.7.2 ఆదాయం

ఈ రోజుల్లో ఆదాయం చెల్లింపు సామర్థ్యానికి సూచికగా వాడబడుతోంది. కాబట్టి చాలామంది ఆర్థిక వేత్తలు ధనికుల భాగం ఎక్కువగా ఉండే పురోగామి పన్నుల విధానాన్ని సమర్థించారు. ఆదాయాన్ని ఒకరి చెల్లింపు సామర్థ్యానికి సూచికగా ఊహించడంలో అన్ని ఆధారాల నుండి వచ్చే ఆదాయాలను తీసుకునేందుకు వీలవుతుంది. అనగా జీతాలు, ఆస్తులు, పెట్టుబడులు, షేర్లు, డిబెంచర్లు మొదలైన వాటి నుండి వచ్చే ఆదాయాలన్నిటిపైనా పన్ను వేయడానికి వీలవుతుంది. కాని కొంతమంది ఉద్దేశంలో ఆదాయం చెల్లింపు సామర్థ్యానికి సూచికగా ఉపయోగపడదు. వీరు చెప్పే కారణాలను పరిశీలిద్దాం.

1. ఆర్జిత ఆదాయానికి, అనార్జిత ఆదాయానికి తేడా గమనించాలి. ఒక వ్యక్తికి వచ్చిన ఆదాయం ఆస్తినుండి వచ్చినదో స్వయంకృషిపై వచ్చినదో తెలుసుకోవడం అవసరం. పన్నుల విధానంలో సమతను సాధించాలంటే ఆస్తినుండి వచ్చిన ఆదాయానికి స్వయంకృషిపై వచ్చిన దానికంటె ఎక్కువ రేటులో పన్ను విధించాలి.
2. ఒక వ్యక్తి చెల్లింపు సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు కుటుంబపరిస్థితులను కూడా గమనించాలి. ఒక కుటుంబానికి ఎక్కువ ఆదాయం వచ్చినా ఆధారపడిన వాళ్లు కూడా ఎక్కువ ఉండవచ్చు. అందుచేత పిల్లలు గల వివాహితునిపై కంటె అవివాహితునిపై ఎక్కువ రేటులో పన్ను విధించవచ్చు.
3. ఆదాయం మొత్తంపై పన్ను విధించరాదు. ప్రస్తుత జీవన ప్రమాణాన్ని బట్టి కనీస మినహాయింపు పరిమితిని నిర్ణయించాలి.
4. పురోగామి సూత్రం ఆదాయం ఆధారంగానే వర్తింపజేయబడుతోంది. కాని రేటు నిర్మాణం చాలా అకారణంగా ఉంటోంది.
5. ఈ పరిమితులున్నా చాలా దేశాల్లో ఆదాయమే చెల్లింపు సామర్థ్యానికి ఉత్తమమైన సూచికగా గుర్తించబడుతుంది.

### 8.7.3 వ్యయం

ఈ మధ్య 'కాల్డర్' అనే ఒక ప్రముఖ ఆర్థిక వేత్త పన్ను విధింపుకు వ్యయం ఆధారంగా ఉండాలని సూచించాడు. చెల్లింపు సామర్థ్యానికి ఆదాయం సరియైన సూచిక కాదని ఖర్చు పెట్టే శక్తి చెల్లింపు సామర్థ్యానికి సూచిక అని ఇతని అభిప్రాయం. ఆదాయ పన్ను నిజమైన చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి విధింపబడకపోవుటవల్ల వానిలో అవినీతి, పన్ను

B R A O U

ఎగవేత కూడి ఉండుటవల్లను ఆదాయాన్ని ఆధారంగా తీసుకోకూడదని ఇతని వాదన. ఆదాయపు పన్ను పని. పొదుపులను దెబ్బతీసి ప్రైవేటు మూల ధన సంచయనాన్ని నిరుత్సాహపరుస్తుంది. కాబట్టి కాల్డార్ వినియోగాన్ని ఆధారంగా సమర్థించాడు.

కాని కొందరు ఆర్థికవేత్తలు చెల్లింపు సామర్థ్యానికి సూచికగా వినియోగాన్ని తీసుకోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. వినియోగంపై పన్ను ధనికులపై కంటె బీదలపై ఎక్కువగా పడుతుంది. ఇవి సాధారణంగా తిరోగామి పన్నులుగా ఉంటాయి. ఒక వ్యక్తి కుటుంబ పరిస్థితులవల్ల ఆదాయం తక్కువ ఉన్నా ఎక్కువ ఖర్చు చేయవచ్చు. ఇలాంటప్పుడు అతడు ఎక్కువ చెల్లింపు సామర్థ్యం కలవాడని నిర్ణయించడం సరికాదు.

## 8.8. ముగింపు సారాంశము

చెల్లింపు సామర్థ్యాన్ని తెలియచేసే మూడు పరాశ్రయ సూచికలు లోపాలు లేనివి కావని చూసాము. కాబట్టి పన్ను విధానంలో ఆస్తి, ఆదాయం, వినియోగాల ఆధారంగా విధించబడే వివిధ పన్నులు ఉండాలి. ఈ స్థితిలో సమతా సూత్రాన్ని దాదాపు సంతృప్తి పరిచే పన్నుల విధానానికి చేరుకోవచ్చు. కాబట్టి నవీన పన్నుల విధానం ఆదాయం, ఆస్తి, వినియోగాలపై పన్నులను కలిగి ఉంటుంది. పన్నుల భారాన్ని పన్నుల విధానాన్నంతనూ తీసుకొని నిర్ణయించాలి. కాని ప్రతి పన్నును ఆధారంగా చేసుకొని నిర్ణయించరాదు. కొన్ని పన్నులు సమత్వ సూత్రాన్ననుసరించి ఉండకపోవచ్చు. ఒక పన్నులోని అసమానత మరొక పన్నుచే సరిదిద్దబడవచ్చు. పన్నుల విధానంలోని సమతను గురించి అనేక అభిప్రాయాలున్నాయి. ఇది ఆచరణలో పెట్టడానికి కష్టమైన భావన. అందుకే సమత్వం ఒక క్లిష్టమైన యజమానురాలు, వేదాంతులు అనుసరించాలి, రాజకీయ నాయకులుపరిశీలించాలి అనే డాల్టన్ మాటలను అంగీకరించక తప్పదు.

**– డా॥ టి. దివాకర్ రావు**

## 8.9 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. Hugh Dalton : Principles of Public Finance
3. H.L. Bhatia : Public Finance
4. Musgrave : Theory of Public Finance


BRAOU

## 8.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబులిమ్ము.

1. లాభ సిద్ధాంత పన్ను విధానం గురించి విమర్శనాత్మకంగా వివరించుము.
2. చెల్లింపు సామర్థ్యంను గురించి విశదీకరించుము.
3. చెల్లింపు సామర్థ్యంలోని ఆత్మాశ్రయాంశ మరియు పరాశ్రయాంశ సూత్రాలను విశ్లేషించుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. పన్ను విధానంలో ఏవేని రెండు విధానాలను వివరించుము.
2. సేవా వ్యయ పన్ను సిద్ధాంతాన్ని విశదీకరించుము.
3. సమత్యాగ సూత్రాన్ని వివరించుము.
4. చెల్లింపు సామర్థ్యంలోని మూడు పరాశ్రయాంశ సూత్రాలను విశ్లేషించుము.

●●●

# భాగం – 9 : పన్ను తొలి, అంతిమ ప్రభావం – లెక్కించు పద్ధతులు

విషయ క్రమం


9.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
9.1 పరిచయం
9.2 పన్ను తొలి ప్రభావం
9.3 పన్ను అంతిమ ప్రభావం
9.4 పన్ను బదలాయింపు
9.4.1 పన్నుల భారం ముందు బదిలీ చేయడం
9.4.2 పన్నుల భారం వెనుకకు బదిలీ చేయడం
9.4.3 పన్ను మూలధనీకరణ పద్ధతి
9.5 అంతిమ ప్రభావం – తొలి సిద్ధాంతాలు
9.5.1 కేంద్రీకరణ సిద్ధాంతము
9.5.2 వ్యాప్తి సిద్ధాంతము
9.5.3 డిమాండ్ సప్లై సిద్ధాంతము
9.6 డిమాండ్, సప్లై అంతిమ పన్ను విధింపు సిద్ధాంతము
9.7 కొన్ని ప్రత్యేక పన్నుల అంతిమ ప్రభావము
9.7.1 ఏక స్వామ్య లాభాలపై పన్ను
9.7.2 ఆదాయంపై పన్ను అంతిమ ప్రభావము
9.7.3 ఆస్తిపై పన్ను అంతిమ ప్రభావము
9.8 రెండు సార్లు పన్ను విధించు విధానము
9.9 అంతిమ ప్రభావము – కొన్ని భావనలు
9.10 ముగింపు , సారాంశము
9.11 సంప్రదించు పుస్తకాలు
9.12 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 9.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగం యొక్క ఉద్దేశం పన్ను తొలి, అంతిమ ప్రభావం, బదిలీ మరియు లెక్కించు పద్ధతులు మరియు వివిధ సిద్ధాంతాలను విశ్లేషించడం.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అర్థం చేసుకోగలుగుతారు.

- పన్ను తొలి, అంతిమ, బదిలీ పన్ను విధానం మరియు రెండుసార్లు పన్ను విధించు విధానంను గుర్తించడము.
- పన్ను అంతిమ ప్రభావ సిద్ధాంతాలను విశదీకరించడము.
- డిమాండ్ సప్లై సిద్ధాంతాలను రేఖాపటాల ద్వారా విశ్లేషించడము మరియు
- కొన్ని ప్రత్యేక పన్నుల అంతిమ ప్రభావంను వివరించడము.

## 9.1 పరిచయం

వ్యక్తులు లేదా ఆర్థిక సంస్థలు అనేక ఆర్థిక కార్యకలాపాల్లో మునిగి ఉంటాయి. ప్రభుత్వం ఒక పన్ను విధించినప్పుడు దాన్ని చెల్లించవలసిన బాధ్యత చట్టరీత్యా ఏదో ఒక వ్యక్తిపైగాని, సంస్థపైగాని పడుతుంది. పన్నులు చెల్లించినపుడు వ్యయార్హ ఆదాయం (disposable income) తగ్గిపోతుంది. కాబట్టి వ్యక్తులు, సంస్థలు వీలైనంత వరకు పన్ను భారాన్ని ఇతరులకు బదలాయించడం ద్వారా తనపై గల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈ ప్రక్రియను వివరించడానికి కొన్ని పదాలు వాడుకలోకి వచ్చాయి. అవి 1. పన్ను తొలి ప్రభావం, 2. పన్ను అంతిమ ప్రభావం 3. పన్ను బదలాయింపు. వీటి గురించి తెలుసుకుందాం.

## 9.2 పన్ను తొలి ప్రభావం

ప్రభుత్వం ఒక పన్ను విధిస్తే చట్టరీత్యా దానిని చెల్లించవలసిన వ్యక్తిపై ఆ పన్ను యొక్క ద్రవ్యభారం పడుతుంది. దీనినే పన్ను తొలి ప్రభావం (impact) అంటారు. కేంద్ర ఎక్సైజ్ సుంకాలు దీనికి ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ సుంకాలను ప్రథమంగా ఉత్పత్తి దారుడే చెల్లించాలి. వాస్తవానికిది అంతిమ చెల్లింపు స్థానం కాదు. కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని చెల్లించిన ఉత్పత్తిదారుడు ముందుగా తాను చెల్లించినప్పటికీ ఆ భారాన్ని ఇతరులకు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రక్రియలో పన్ను భారం క్రమంగా ఉత్పత్తిదారునుండి టోకు వ్యాపారస్తునికి, చిల్లర వ్యాపారస్తునికి చేరి చివరగా వినియోగదారునికి బదలాయించబడుతుంది. కావున ముందుగా ద్రవ్యభారాన్ని వహిస్తున్న ఉత్పత్తిదారు మీదనే పన్ను తొలి ప్రభావం ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో పన్ను భారాన్ని బదిలీ చేయడానికి వీలుండదు. మరికొన్ని సందర్భాల్లో పాక్షికంగా బదిలీ చేయవచ్చు.

## 9.3 పన్ను అంతిమ ప్రభావం

పన్నును మొట్టమొదటిసారిగా చెల్లించే వ్యక్తి మీద ఆ పన్ను తొలి ప్రభావం ఉంటుంది. పన్ను యొక్క తుది భారాన్ని అంతిమ ప్రభావం అంటారు. పన్ను భారాన్ని బట్టి చివరగా భరించే వ్యక్తి మీదగాని, వ్యక్తుల సముదాయం మీద కాని దాని అంతిమ భారం ఉంటుంది. అంతిమ చెల్లింపుదారుపై పన్ను భారం స్థిరపడడమే అంతిమ ప్రభావమని 'సెలిగ్‌మన్' నిర్వచించెను. ఇంకో మాటలో చెప్పాలంటే ఇది పన్ను యొక్క అంతిమ చెల్లింపు స్థానం. అనగా అంతిమ భారాన్ని భరిస్తున్న వ్యక్తి దాన్ని ఇతరులకు బదిలీ చేయలేడు. 'మస్‌గ్రేవ్' నిర్వచనం ప్రకారం పన్ను యొక్క ప్రత్యక్ష ద్రవ్యభారం లేక తుది స్థానాన్ని తెలియజేయడానికే అంతిమ ప్రభావం అనే పదాన్ని సాధారణంగా వాడతారు. ఇది చివరకు పన్ను బదలాయింపు ప్రక్రియ ఆగిపోయిన వ్యక్తి దగ్గర సంభవిస్తుంది.

## 9.4 పన్ను బదలాయింపు

పన్ను యొక్క ద్రవ్యభారాన్ని మరియొకరికి బదిలీ చెయ్యటాన్నే పన్ను బదలాయింపు అంటారు. పన్నుకు సంబంధించిన ప్రత్యక్ష ద్రవ్యభారం ధర సవరింపుల ద్వారా తొలి ప్రభావం నుండి అంతిమ ప్రభావం వరకు పయనించే వివిధ పద్ధతులను ఇది తెలియజేస్తుంది. పన్ను అంతిమ చెల్లింపు స్థానాన్ని చేరేవరకు బదలాయింపు జరుగుతూనే ఉంటుంది. దీనివల్ల ద్రవ్యభారాన్ని బదిలీ చేయడం చట్టబద్ధమని తెలుస్తోంది. పన్ను ఎగవేయడం చట్టవిరుద్ధమైనది. సాధారణంగా ధరలలో తగిన సర్దుబాట్లు చేయడం ద్వారా బదలాయింపు జరుగుతుంది. పన్ను వస్తువు యొక్క ధరతో కలిసిఉంటుంది. అది ఉత్పత్తి దారునుండి టోకు వర్తకునికి తర్వాత చిల్లర వర్తకునికి చేరి అంతిమంగా వినియోగదారుని చేరుకుంటుంది. ఒక్కొక్క సారి ఉత్పత్తి కారకాల ధరల సవరింపుల ద్వారాకూడా పన్ను బదిలీ



BRAOU

చేయడానికి అవకాశం ఉంటుంది. వస్తువు ధరనుకాని కారకాల ధరలను కాని మార్చడానికి వీలులేనప్పుడు వస్తునాణ్యతలో మార్పుల ద్వారాకూడా బదలాయింపుకు అవకాశం ఉంటుంది.

### 9.4.1 పన్ను భారం ముందు బదిలీ చేయడం

ముందు చెప్పినట్లుగా వస్తువు ధర సవరింపు పన్ను బదలాయింపుకు ముఖ్య సాధనంగా ఉంటుంది. బదిలీ ప్రక్రియలో మిగిలిన అంశాలన్నీ స్థిరంగా ఉన్నప్పుడు ధరలోని పెరుగుదల పన్ను మొత్తంకంటె అధికంగా ఉంటే పన్ను భారం పూర్తిగా బదిలీ చేయబడిందని చెప్పవచ్చు. పన్ను ఉత్పత్తిదారునుండి టోకు వ్యాపారస్తునకు, తర్వాత చిల్లర వ్యాపారస్తునకు చివరగా వినియోగదారునకు బదిలి చేయబడితే దానిని ముందుకు బదిలీ చేయబడింది *(forward shifting)* అంటాము. ముందుకు బదిలీ చేయడం విషయంలో వస్తువు ధర పెరుగుతుంది. ఒక్కొక్కసారి మొత్తం పన్నును బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. ఒక్కొక్కసారి కొంతభాగం మాత్రమే బదిలీ అవుతుంది. పన్ను చెల్లించే సంస్థకు బదిలీ చేయడానికి అవకాశంలేని సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా బదిలీకి అవకాశం లేనప్పుడు తొలి ప్రభావం అంతిమ ప్రభావం కూడా ఆ సంస్థ మీదనే ఉంటాయి.

### 9.4.2 పన్ను భారం వెనుకకు బదిలీ చేయడం

పన్ను బదిలీల వల్ల ఉత్పత్తి కారకాల ధరలు మారితే దాన్ని వెనుకకు బదిలీ *(backward shifting)* అంటారు. ఇంకో మాటలో చెప్పాలంటే పన్ను విధించిన తరువాత కూడా ఆ వస్తువు యొక్క ధరలో మార్పులేకపోతే దాన్ని వెనుకకు బదిలీ చేయడం అంటారు. వస్తువు తయారీలో ఉపయోగించబడిన కారకాల ధరలు తగ్గుతాయి. ఒక ఉదాహరణద్వారా ఈ అంశాన్ని స్పష్టంగా వివరించవచ్చు. ఒక పరిశ్రమకు సరఫరా చేయబడిన ముడిసరుకుల సప్లై అవ్యాకోచత్వాన్ని కలిగి ఉన్నాయనుకొందాం. అంటే పరిశ్రమ ముడి సరుకు ధరను తగ్గించినప్పటికీ సరఫరా తగ్గదు. అందుచే పరిశ్రమ మీద పన్ను విధించబడితే ముడిసరుకు ధర తగ్గించడం ద్వారా దానిని వెనుకకు బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. అలాకాక ముడిసరుకు సప్లై వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటే పన్ను భారాన్ని వెనుకకు బదిలీ చేయడానికి ఉత్పత్తిదారుకు అవకాశం లేదు. అదే విధంగా ఒక ప్రాంతంలో శ్రామికుల సప్లై అవ్యాకోచంగా ఉందనుకొందాం. ఉత్పత్తిదారుడు శ్రామికుల వేతనాన్ని తగ్గించడం ద్వారా పన్ను బదిలీ చేయవచ్చు. అయితే పన్ను బదలాయింపు ప్రక్రియపై కార్మికసంఘాల ప్రతిఘటన మొదలగు ఇతర అంశాల ప్రభావంలేదని భావించిన పై విషయం యదార్థమౌతుంది.

BRAOU

### 9.4.3 పన్ను మూలధనీకరణ పద్ధతి

పన్ను భారాన్ని వెనుకకు బదిలీచేయడానికి పన్ను మూలధనీకరణ *(tax capitalisation)* ఒక ప్రత్యేక పద్ధతి. సాలినా కొంత ఆదాయాన్నిచ్చే స్థిరాస్తులు అమ్మబడినపుడు కొనుగోలుదారులు భవిష్యత్తులో ఆ ఆస్తిపై పడు పన్ను భారాన్ని లెక్కించుకొని దానిలో కొంత భాగాన్ని కాని పూర్తిగా కాని అమ్మకపు దారులకు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ ఆస్తిని కొనగోరువారు ఆస్తి విలువను పన్నుమూలధనీకరణ ద్వారా డిస్కౌంటు *(discount)* చేసి పన్ను చెల్లింపునుండి తప్పించుకుంటారు. అనగా ఆ ఆస్తిని తక్కువ ధరకు కొంటారు. పన్ను మూలధన్నీ కరణకు ఒక ఉదాహరణను పరిశీలిద్దాం.

ఒక భూమి విలువ 1,000 రూ॥లు అనుకుందాం. దాని సంవత్సరాదాయం 50 రూ॥. దానిపై సాలీనా చెల్లించవలసిన నిశ్చితపన్ను రూ॥10 అనుకుందాం. ఆ భూస్వామికి సాలినా లభించే నికరాదాయం 40 రూ॥లు అవుతుంది. పన్ను లేకుండా ఆ భూమి పై వచ్చే ఆదాయ ప్రతిఫలనం దాని విలువలో 5 శాతం ఉంటుంది. కొనుగోలు

దారు పన్ను చెల్లించిన పిదప కూడా ఆస్తి విలువలో 5 శాతం ప్రతిఫలం రావాలనుకుంటే 800 రూ॥లకే అతడా భూమిని తీసుకోవడానికి ఇష్టపడతాడు. ఇంకో విధంగా చెప్పాలంటే 800 రూ॥లపై 5 శాతం పన్నే సాలీనా 40 రూ.లు అవుతుంది. ఆ ఆస్తి విలువ 1,000 రూ॥లు అయినప్పటికి కొనుగోలు దారుడు దాన్ని 800 రూ॥లకే పొందినచో భవిష్యత్తులో చెల్లించవలసిన పన్నుల నుంచి కొనుగోలుదారు తప్పించుకోగలడు. పన్ను యొక్క మొత్తం ద్రవ్య భారాన్ని ప్రతిబింబించే 200 రూ॥ల మొత్తం ఒకేసారి తగ్గించబడింది. కొన్ని పరిస్థితులలో మాత్రమే మూలధనీకరణకు అవకాశముంటుందని గుర్తుంచుకోవాలి. ఆస్తి విలువ, అలాగే దాని నుండి వచ్చే సాలుసరి ఆదాయం స్థిరంగా ఉండాలి. కొనుగోలుదారు పెట్టుబడికి ప్రత్యామ్నాయ అవకాశాలుండాలి. ఆస్తి మూలధనపు విలువ సాలుసరి ఆదాయాన్ని కలిగి ఉన్నప్పుడే మూలధనీకరణకు అవకాశం ఉంటుంది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. పన్ను తొలి ప్రభావమనగానేమి?
2. పన్ను అంతిమ ప్రభావమనగానేమి?
3. పన్ను బదలాయింపు అనగా నేమి?
4. పన్నుల భారం ముందు వెనుకలకు బదిలీ చేయడంను గుర్తించుము.
5. పన్ను మూలధనీకరణ అనగా నేమి?

## 9.5 అంతిమ ప్రభావం – తొలి సిద్ధాంతాలు

ఈ సిద్ధాంతాలను సాంప్రదాయ, ఆధునిక సిద్ధాంతాలుగా విభజింపవచ్చును. కేంద్రీకరణ మరియు వ్యాప్తి సిద్ధాంతాలు సాంప్రదాయ సిద్ధాంతానికి డిమాండ్ సప్లై సిద్ధాంతము ఆధునిక సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్నటువంటివిగా భావించవచ్చును.

B R A O U

### 9.5.1 కేంద్రీకరణ సిద్ధాంతం (Concentration theory)

19 వ శతాబ్దంలో సహజధర్మ వాదులైన ఫ్రెంచి శాస్త్రవేత్తల ప్రకారం భూమిపై లభించు భాటకం తప్ప మిగిలిన అన్ని పన్నులను బదిలీ చేయవచ్చు. వ్యవసాయ మొక్కటే ఉత్పాదకమైనదనీ మిగిలిన వృత్తులన్నీ అనుత్పాదకమైనవనీ వారి నమ్మకం. అందుచే వ్యవసాయేతర వృత్తులన్నీ మిగులు (surplus) ను ఉత్పత్తి చేయవని భావించారు కాబట్టి వారు భూమిపై విధింపబడే పన్ను తప్ప ఇతర వృత్తులపై ఏ విధమైన పన్నులు ఉండరాదన్నారు. ఇతర వృత్తులపై పన్నులు విధించినప్పటికీ అవి అంతిమంగా వ్యవసాయదారులకే బదిలీ చేయబడతాయి. ఎందుకంటే వ్యవసాయేతర వృత్తుల వారు మిగులును ఉత్పత్తి చేయలేరు. సహజ ధర్మవాదుల ఈ వాదన యధార్థమైనది కాదు.వ్యవసాయేతర రంగాల్లో కూడా మిగులును ఉత్పత్తి చేయవచ్చు. కావుననే ఆధునిక పన్ను నియమాలన్నీ ఒకే పన్ను విధానాని కంటె - ఎక్కువ పన్నుల విధానానికి ప్రాధాన్యత నిస్తున్నాయి. కాని సహజ ధర్మ వాదుల ఆలోచన ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. అదేమనగా మిగులు కల్పించలేని సంస్థలపై పన్నులు విధించబడినపుడు వాటిని చెల్లించే శక్తి ఆ సంస్థలకు ఉండదు. కావున పన్ను భారాన్ని ఇతరులకు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తాయి. వారి అభిప్రాయములో పన్నులన్నీ బదిలీ చేయబడి వ్యవసాయ భాటకంపై కేంద్రీకరింపబడతాయి.

సాంప్రదాయ ఆర్థికవేత్తల ప్రకారం ఆర్థిక వ్యవస్థలోని మిగుళ్ళు-భాటకం (rent), లాభాలని రెండు రకాలుగా ఉంటాయి. 'రికార్డో' భాటక సిద్ధాంతం ప్రకారం క్షీణోపాంత ప్రతిఫల సిద్ధాంతం, మాల్థస్" జనాభా సిద్ధాంతాలవల్ల

భాటకం లభిస్తోంది. వ్యవసాయోత్పత్తుల మీద పన్ను విధిస్తే ఏం జరుగుతుంది? వ్యవసాయ ధరలు పెరుగుతాయి. శ్రామికుల జీవన వ్యయం పెరుగుతుంది. ఫలితంగా వేతనాలు పెరిగితే లాభాలు క్షీణిస్తాయి. ఎక్కువ ధరల పెరుగుదలవల్ల లభించిన ఆదాయం నుండి వ్యవసాయదారులు పన్ను చెల్లిస్తారు. కనుక వ్యవసాయ భాటకం మారదు. అందుచే అంతిమ ప్రభావం లాభాలపై ఉంటుంది. కాని వేతనాలపై పన్ను విధిస్తే ఏమౌతుంది? అప్పుడు కూడ అంతిమ ప్రభావం లాభాల మీదే కాని భాటకాల మీద ఉండదు. ఎందుకంటే శ్రామికుల జీవన ప్రమాణాన్ని విలకడగా ఉంచడానికి లాభాలనుండి కొంత ద్రవ్య వేతనాలు చెల్లించాలి. లాభాలపైనే పన్ను విధించబడితే వేతనాలను తగ్గించడం ద్వారా దానిని బదిలీ చేయడానికి అవకాశం లేదు. దీనికి కారణం కనీస జీవన స్థాయిలో ఉన్న వేతనాలను మరింత తగ్గించడానికి కుదరకపోవడమే. కాని వ్యవసాయ భాటకంపై పన్ను విధించబడితే సంప్రదాయవాదుల ప్రకారం భాటకం ఉత్పత్తి వ్యయంలో భాగం కాదు కనుక భూస్వాములు దీనిని బదిలీ చేయలేరు. పన్ను మొత్తాన్ని వారే భరించాలి.

పన్నుల అంతిమ ప్రభావపు సమస్యకు సంతృప్తికరమైన విశదీకరణను కేంద్రీకరణ సిద్ధాంతం కల్పించలేదు.

### 9.5.2 వ్యాప్తి సిద్ధాంతం (Diffusion theory)

ఈ సిద్ధాంతం ప్రకారం పన్నుల అంతిమ ప్రభావం ఆర్థిక వ్యవస్థ అంతట వ్యాప్తి చెందుతుంది. వివిధ ఆర్థిక సంస్థలు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండుటచే ఒక స్థానంలో విధించబడిన పన్ను అనేక సార్లు బదిలీ చేయబడుతుంది. కావున దాని తుది విశ్రమస్థానాన్ని గుర్తించడం చాలా కష్టం. అందుచే పన్ను యొక్క తుది అంతిమ ప్రభావం కనుగొనడం సాధ్యం కాదని ఈ సిద్ధాంతాన్ని బలపరచే 'మాన్స్‌ఫీల్డ్ (Mansfield) , కేనర్డ్ (Canard) ల వాదన. ప్రతి పన్ను దాని భారం మొత్తం సమాజానికంతటికి సమానంగా పంపిణి చేయబడే వరకు మరల బదిలీ చేయబడుతుందని వారి నమ్మకం. ఈ సిద్ధాంతం చాలామంది అర్థశాస్త్రవేత్తలచే విమర్శింపబడింది. వ్యాప్తి సిద్ధాంత పన్ను ప్రభావాలు అంతిమ ప్రభావం కనుగొనడంలో మూల సమస్య నుండి దూరంగా తొలగిపోయిందని 'డాల్టన్' పేర్కొనెను. కొన్ని పన్నుల ప్రభావాలను అంతిమ ప్రభావాన్ని అంచనా వేయడం కష్టమైనా అవి ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపిస్తాయని భావించడం సరైనది కాదు. వ్యాప్తి సిద్ధాంతం పరిపూర్ణ పోటి, ఉత్పత్తికారకాల మధ్య గమనశీలత ఉంటాయని భావిస్తుంది. వాస్తవానికి మార్కెట్లో పరిపూర్ణ పోటి ఎప్పుడూ ఉండదు. కారకాల గమనశీలత కూడా పెక్కు కారణాల వల్ల పరిమితం చేయబడుతుంది. 'మస్‌గ్రేవ్' కూడా వ్యాప్తి సిద్ధాంతపు ప్రభావాలను అంగీకరించలేదు. అన్ని పన్నులు ఉత్పత్తి వ్యయంలో ప్రవేశించి వ్యాప్తి చెందుతాయనే ప్రమేయం కూడ నిజం కాదు. ఆస్తి, వడ్డీ, వేతనాలపై విధింపబడిన పన్నులు ఉత్పత్తి వ్యయంలో భాగం కావు. కాబట్టి వ్యాప్తి సిద్ధాంతం వదలివేయబడింది.

### 9.5.3 డిమాండ్, సప్లై సిద్ధాంతం (Demand - Supply theory )

ఇది పన్నుల అంతిమ ప్రభావాన్ని గూర్చి తెలియజేసే ఆధునిక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం పన్ను అంతిమ ప్రభావనిర్ణయం వస్తు మార్కెట్‌లో డిమాండు సప్లై శక్తుల ఆధారంగా ధర నిర్ణయింపబడడాన్ని పోలి ఉంటుంది. ధరల మార్పుల ద్వారా పన్ను బదలాయింపు జరుగుతుందనే విషయం మనం ఇలకు ముందే తెలుసుకున్నాం. మార్కెట్‌లోని డిమాండు, సప్లై శక్తులను బట్టి ధర మార్పులు వస్తాయి. ఇంకో విధంగా చెప్పాలంటే మార్కెట్ పరిస్థితిని ప్రభావితం చేసే అంశాలే పన్ను బదలాయింపు ప్రక్రియను కూడా ప్రభావితం చేస్తాయి. మార్కెట్ పరిస్థితులు, ఉత్పత్తి కారకాల గమనశీలత (mobility) , సప్లై డిమాండుల వ్యాకోచత్వం మొదలైన అంశాలు పన్ను బదలాయింపును ప్రభావితం చేస్తాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి - 2

6. వ్యష్టి సిద్ధాంతము అనగా నేమి?
7. డిమాండ్, సప్లై అంతిమ పన్ను ప్రభావసిద్ధాంతము ద్వారా ఏమి నేర్చుకొందువు?

## 9.6 డిమాండ్, సప్లై అంతిమ పన్ను విధింపు సిద్ధాంతము

పన్ను విధింపబడితే వస్తువు ధర పెరుగుతుంది. వస్తువు ధర పన్ను మొత్తానికి సరిపోయేటంతగా పెరిగితే అంతిమ ప్రభావం పూర్తిగా వినియోగదారునిపై ఉంటుంది. ధర పెరగకపోయినట్లైతే అంతిమ ప్రభావం పూర్తిగా ఉత్పత్తి దారునిపై ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే ధర పన్ను మొత్తం కంటె తక్కువగా పెరిగితే అంతిమ ప్రభావం అమ్మకందారుకు వినియోగదారుకు మధ్య పంచబడుతుంది. డిమాండు వ్యాకోచంగా ఉంటే ముందుకు బదిలీ అవుతుంది. సప్లై వ్యాకోచత్వం ఉంటే వెనుకకు బదిలీ అవుతుంది. అవ్యాకోచత్వ డిమాండు కలిగిన ఒక వస్తువుపై పన్ను విధింపబడితే పన్ను వినియోగదారునికి బదిలీ చేయబడుతుంది. ఉదాహరణకు అవసర వస్తువులపై విధింపబడిన పన్ను వినియోగదారునికి బదిలీ చేయబడుతుంది. ఉదాహరణకు అవసర వస్తువులపై విధింపబడిన పన్ను వినియోగదారులపై నెట్టివేయబడుతుంది. ఎందుకంటె అవసరాలపై గల డిమాండు అవ్యాకోచత్వాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి వినియోగదారులు వారి వినియోగం తగ్గించుకోలేరు. ఇంకోలా చెప్పాలంటే ఉత్పత్తిదారు లేదా అమ్మకందారు ఉద్దేశంలో అమ్మకాలు అంతగా తగ్గిపోవు. సౌకర్యాలు, విలాసాలపై పన్ను విధింపబడితే ఏం జరుగుతుంది? ఈ వస్తువులు వ్యాకోచత్వ డిమాండును కలిగి ఉంటాయి. అంతిమ ప్రభావం వినియోగదారులకు పూర్తిగా బదిలీ చేయబడదు. పన్నులో కొంత భాగాన్ని అమ్మకందారులు భరిస్తారు. ఎందుకంటే వ్యాకోచ డిమాండు కలిగిన వస్తువులపై పన్ను విధింపువల్ల ధర పెరిగితే ఉత్పత్తిదారుని అమ్మకాలు దెబ్బతింటాయి. కొనుగోలుదారుల అమ్మకం దారుల సాపేక్ష ప్రతిఘటన శక్తిపై (comparative resistance) పన్ను బదలాయింపు ఆధారపడుతుంది. అమ్మకం దారులు కూడ పన్ను ద్రవ్యభారాన్ని బదిలీ చేయడానికి చూడగా కొనుగోలుదారులు దాని నుండి తప్పించుకోడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి పన్ను యొక్క అంతిమ ప్రభావం డిమాండు సప్లైల సాపేక్ష వ్యాకోచత్వంపై ఆధారపడి ఉంటుంది. డిమాండు పూర్తి వ్యాకోచత్వంగా ఉంటే అంతిమ ప్రభావం పూర్తిగా అమ్మకందారు మీదే ఉంటుంది. పన్ను మూలంగా ధరపెరిగితే వస్తువు డిమాండు దెబ్బతింటుంది. అందుచే వినియోగదారునికి బదిలి చేయడం వీలవదు. డిమాండు పూర్తి అవ్యాకోచత్వాన్ని పొందితే (డిమాండు రేఖకి క్షితిజ లంబంగా ఉంటే) అంతిమ ప్రభావం పూర్తిగా వినియోగదారు మీదనే ఉంటుంది. పన్ను మూలంగా వస్తువు ధర పెరిగినప్పటికీ వినియోగదారులు తమ డిమాండును తగ్గించుకోలేరు. ఇప్పుడు పన్ను భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం అమ్మకందారుకు చాలా సులభం. అదే విధంగా సప్లై పూర్తిగా వ్యాకోచత్వాన్ని పొందితే వినియోగ దారులే పూర్తి భారాన్ని వహిస్తారు. అది అవ్యాకోచత్వాన్ని పొందితే అంతిమ ప్రభావం పూర్తిగా అమ్మకందారు మీద ఉంటుంది. ఈ పరిస్థితులు పటంలో చూపబడ్డాయి.

BRAOU




పటం 9.1

పైపటంలో $DD^1$ వస్తువు యొక్క డిమాండు రేఖ, పన్ను విధింపుకు ముందుగల ధర PM. పన్ను విధింపు ఫలితంగా సప్లై రేఖ SS ఎడమవైపుకు జరుగుతుంది. కొత్త ధర $P^1M^1$ కూడ పన్ను ముందుగల పాత ధర PM కు సమానం. అంతిమ ప్రభావం పూర్తిగా అమ్మకందారే భరిస్తున్నాడు. ఈ పటంలో డిమాండురేఖ పూర్తి అవ్యాకోచత్వాన్ని పొందింది.




పటం 9.2

BRAOU

రెండవ పటంలో పూర్తి అవ్యాకోచత్వం గల డిమాండు రేఖ చూపబడింది. పన్ను భారాన్ని పూర్తిగా వినియోగదారుడే భరిస్తాడు. $D_1D$ అనేది నిలువుగా వున్న డిమాండు రేఖ. SS అనేది సప్లై రేఖ, పన్ను విధించిన తర్వాత అది ఎడమవైపుకు $(S_1S_1)$ జరుగుతుంది.

పన్ను విధించకముందు వస్తువు ధర PD. పన్ను విధించిన తర్వాత అది $P_1D$కి పెరుగుతుంది. డిమాండు పూర్తి అవ్యాకోచంగా ఉన్నందువల్ల వినియోగదారుడు పన్ను భారంనుండి తప్పించుకోలేడు. అమ్మకం దారుడు పన్నుభారాన్ని పూర్తిగా వినియోగదారునికి బదిలీ చేస్తాడు. $P_1P$ అనునది పన్నును తెలియజేస్తుంది.




పటము 9.3

మూడవపటంలో సప్లై రేఖ పూర్తి వ్యాకోచత్వంగా ఉంది. పన్ను విధింపబడితే అది $S_1S_1$ గా పైకి జరుగుతుంది. మొత్తం పన్ను $P_1K$ కొనుగోలుదారులచే భరించబడుతుంది. అంటే ధర మొదటి స్థాయి ( PM లేదా $KM_1$ ) నుండి $P_1M_1$ కు పెరుగుతుంది.




పటం 9.4

నాలుగవ పటంలో సప్లై అవ్యాకోచత్వాన్ని చూస్తాం. పన్నుకు ముందు ధర ON. పన్ను విధించిన తర్వాత కూడా ధర పెరగడానికి అవకాశం లేదు. సప్లై రేఖలో మార్పులేక పోవడం వల్ల $DD_1$ డిమాండురేఖతో పన్ను విధింపబడిన తర్వాత కూడా అదే ధర కొనసాగుతుంది. అందుచే పన్ను మొత్తం అమ్మకం దారులచే భరించబడుతుంది.

కాని ఆచరణలో డిమాండు సప్లై రేఖలు పూర్తిగా వ్యాకోచత్వాన్ని కాని, పూర్తిగా అవ్యాకోచత్వాన్నిగాని పొందవు. అందుచే డిమాండు, సప్లై రేఖలు సాధారణ పద్ధతిలో ఉంటే అప్పుడు పరిస్థితేమిటి? సాధారణంగా డిమాండురేఖ ఎడమ నుండి కుడికి క్రిందికి వాలి ఉంటుంది. అదేవిధంగా సప్లైరేఖ సాధారణంగా ఎడమ నుండి కుడికి పైకి వాలి ఉంటుంది. 5వ పటంలో సాధారణ డిమాండు సప్లైరేఖలు చూపబడ్డాయి. పన్ను విధింపబడినప్పుడు ఏం జరుగుతుందో కనుగొందాం.




పటం 9.5

BRAOU

5వ పటంలో DD, SS అనేవి వస్తువు యొక్క సాధారణ డిమాండు, సప్లైరేఖలు. PM సమతౌల్యధర. పన్ను విధింపబడిన తర్వాత సప్లై రేఖ ఎడమవైపుగా పైకి జరుగుతుంది. ($S_1S_1$) . కొత్త సమతౌల్యధర $P_1M_1$. అనగా వస్తువు ధర $P_1N$ పెరుగుతుంది. SS, $S_1S_1$ ల మధ్య నిలువు దూరం సమానంగా ఉండి యూనిట్ కి విధింపబడిన పన్నును ప్రతిబింబిస్తుంది. ఇక్కడ పన్ను అంతిమ ప్రభావం $P_1K$ . ఇది $P_1N$ కి సమానం. అమ్మకం దారు భరించే భాగం NK . ఇంకో విధంగా చెప్పాలంటే పన్ను ద్రవ్యభారం వినియోగదారు, అమ్మకందారుల మధ్య సప్లై డిమాండుల వ్యాకోచత్వాల నిష్పత్తిలో పంచబడింది. పైపటం నుండి మనం గ్రహించిన డిమాండు, సప్లైల వ్యాకోచత్వాన్ని క్రింది విధంగా చూపవచ్చు.

డిమాండ్ వ్యాకోచత్వము (ed) = $\dfrac{\text{డిమాండ్ నిష్పత్తిలోని మార్పు}}{\text{కొనుగోలుదారుని ధరలో వచ్చిన నిష్పత్తిమార్పు}}$

సప్లై వ్యాకోచత్వము (es) = $\dfrac{\text{సప్లై నిష్పత్తిలోని మార్పు}}{\text{అమ్మకపుదారుల ధరలోని నిష్పత్తి మార్పు}}$

డిమాండు పరిమాణంలోని మార్పు శాతాన్ని ధరలోని మార్పు శాతం చేత భాగిస్తే డిమాండు వ్యాకోచత్వం వస్తుంది. సప్లై పరిమాణంలోని మార్పు శాతాన్ని ధరలోని మార్పు శాతం చేత భాగిస్తే సప్లై వ్యాకోచత్వం వస్తుంది. మొత్తం పన్నులో ధర పెరుగుదల $P_1N$ వినియోగదారులచే భరించబడుతుంది. కావున మిగిలిన భాగం NK అమ్మకం దారులచే భరించబడుతుంది. సప్లై పట్టిక SS ప్రకారం అమ్మకందారు OM పరిమాణాన్ని PM ధరకు అమ్ముతాడు. పన్ను విధించిన పిదప సప్లై పట్టిక పైకి బదిలీ అవుతుంది. అంటే వస్తువు సప్లైని తగ్గించడానికి అమ్మకందారు ఇష్టం చూపుతాడు. అమ్మకందారుల ఉద్దేశంలో సప్లై ధరలో మార్పు NK పై రెండు సమాసాల (equitions) నుండి సప్లై (es) డిమాండు వ్యాకోచత్వాల ($e^d$) నిష్పత్తిని కనుగొనవచ్చును.

$$\frac{es}{ed} = \frac{P_1N}{NK} = \frac{\text{వినియోగదారులపై ద్రవ్యభారం}}{\text{అమ్మకందారులపై ద్రవ్యభారం}}$$

దీనిని ఈ క్రింది విధంగా విశదీకరించవచ్చును.

a) ఒక వేళ es = ed అయితే పన్ను భారం కొనుగోలుదారులపై మరియు అమ్మకపు దారులపై సమానంగా విభజింపవచ్చును. వస్తువు యొక్క ధర 50% పెరుగుతుంది.

b) ఒక వేళ es>ed అయితే అంతిమ భారం కొనుగోలు దారులపై ఉంటుంది. వస్తువు ధర 50% కంటె ఎక్కువగా పెరుగుతుంది.

c) ఒక వేళ es<ed అయితే పన్ను భారం అమ్మకందారులపై ఎక్కువగా ఉంటుంది.

ఉత్పత్తితో పాటు పెరిగే రేటు గల పన్నును తీసుకొంటే రేటు కూడా పెరుగుతుంది. ఉత్పత్తిదారుపై కంటే వినియోగదారునిపైనే దాని అంతిమ ప్రభావం తక్కువగా ఉంటుంది. ఇది పురోగామి పన్ను ఉత్పత్తి పెరిగే కొద్దీ పాత క్రొత్త సప్లై రేఖల మధ్య నిలువు దూరం పెరుగుతుంది అదే విధంగా తిరోగామిపన్ను విషయంలో ఉత్పత్తి పెరిగితే రేటు తగ్గుతుంది. అప్పుడు అంతిమ ప్రభావం అమ్మకం దారుల మీద కంటె వినియోగ దారులమీదే ఎక్కువ ఉంటుంది.

BRAOU

## 9.7 కొన్ని ప్రత్యేక పన్నుల అంతిమ ప్రభావం

### 9.7.1 ఏకస్వామ్య లాభాలపై పన్ను

ఏకస్వామ్యదారుడు లాభాలు గరిష్టమయ్యే పద్ధతిలో ఉత్పత్తిని, ధరను నిర్ణయించుకుంటాడు. ఉపాంత వ్యయం MC, ఉపాంత రాబడి MR కి సమానంగా ఉంటే లాభం గరిష్ట స్థాయిలో ఉంటుంది. ఒక వేళ ఏకస్వామ్యలాభాలపై పన్ను విధింపబడితే అంతిమ ప్రభావన్నెవరు భరిస్తారు? పన్ను విధింపబడినపుడు కూడ అతడు తన లాభాలను గరిష్టం చేసుకొనేటట్లు ఉత్పత్తిని, ధరను నిర్ణయిస్తాడు. కావున సాధారణంగా ఏకస్వామ్యదారుడు అంతిమ ప్రభావాన్ని భరిస్తాడని, భారాన్ని వినియోగదారునికి బదిలీ చేయలేడని అనిపిస్తుంది. వస్తువుల అమ్మకం తరువాతనే ఏకస్వామ్యదారు లాభాలు గడిస్తాడు. కాబట్టి లాభాలపై విధింపబడిన పన్నును కొనుగోలుదారులకు బదిలీ చెయ్యలేడనే విషయం గుర్తుంచుకోవాలి. పన్ను విధింపు తర్వాత ఏకస్వామ్యదారుని లాభాలు తగ్గిపోతాయని గరిష్ట లాభాలను పొందాలనుకొన్నపుడు ధరను పెంచడం ద్వారా పన్ను భారాన్ని వినియోగదారునికి బదిలీ చేయలేడని మస్‌గ్రేవ్, పి.బి. మస్‌గ్రేవ్ లు చక్కగా చెప్పేరు.

మొత్తంరాబడి TR. మొత్తం వ్యయం TC. లాభాలు P=TR-TC. $\frac{dp}{dq}=O$ అయ్యే ఉత్పత్తి స్థాయి వద్ద అనగా $d(TR)/d_q = O$ వద్ద లాభాలు గరిష్ట స్థాయిలో ఉంటాయి. ఈ పరిస్థితి MR=MC ని సూచించును. లాభాలపై రేటులో పన్ను విధింపబడితే ఏకస్వామ్యదారుడు (l-t) (TR - TC) ని గరిష్టం చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. Q తో అవకలనం చేసి శూన్యానికి సమానం చేసి సాధించగా

$$(l-t)\frac{d(TR)}{dQ} - (l-t)\frac{d(TC)}{dQ} = O$$

(l-t) చే భాగించగా MR = MC తిరిగి మిగులుతుంది.

పన్ను వల్ల ఏకస్వామ్య లాభాలు తగ్గించబడతాయి. ఈ పరిస్థితిని పటం ద్వారా చూపవచ్చు.




పటం 9.6

అరవపటంలో AR, MRలు ( సగటు ఉపాంత రాబడి రేఖలు ) క్రిందికి వాలి ఉన్నాయి. పన్నుకు ముందు MC= MR అయిన దగ్గర OM ఉత్పత్తికి OP ఏకస్వామ్య ధర. CDEP ఏకస్వామ్యదారుడు సంపాదించిన గరిష్ఠ లాభాలు. ముందు చెప్పినట్లుగా పన్ను విధింపబడినప్పటికీ అది బదిలీ చేయబడలేదు. కావున మొత్తం లాభం (CDEP) తగ్గింపబడుతుంది. పన్ను విధింపు తర్వాత కూడా MC=MR దగ్గరే అతని లాభం గరిష్ఠమౌతుంది. కాని ఇప్పుడు అతని లాభం $CDE_1P_1$ కి తగ్గించబడింది.

అమ్మకాలపై పన్ను విధిస్తే ముందు చెప్పినట్లు సప్లైరేఖ పైకి జరుగుతుంది. పన్ను అంతిమ ప్రభావం ఏకస్వామ్యదారుడు కొనుగోలుదార్ల మధ్య డిమాండు సప్లై వ్యాకోచత్వ నిష్పత్తిలో పంచబడుతుంది.

### 9.7.2 ఆదాయపన్ను

వ్యక్తిగత ఆదాయాలపై విధింపబడిన పన్నును ఆదాయపు పన్ను అంటారు. ఇది బదిలీ చేయబడదు. ఎందుకంటే పన్ను భారాన్ని బదిలీ చేయడానికవసరమయ్యే వినియమ వ్యవహారంతో దీనికి సంబంధం లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే ఆదాయపు పన్ను వల్ల వస్తు వ్యయం కాని, ధరకాని పెరగదు. జీతంపై ఆధారపడిన వారి విషయంలో స్థూలవేతనం నుండి అనుమతింపబడిన మినహాయింపులను తీసి వేయగా పన్ను విధించదగిన ఆదాయం వస్తుంది. ఆదాయ పన్ను ప్రత్యక్ష పన్ను. ఆదాయ స్థాయిని బట్టి పన్ను రేటు మారుతుంది. కొన్ని దేశాలలో ఆదాయ పన్ను విధానంలో ఆర్జితాదాయాలకు, అనార్జితాదాయాలకు మధ్య విచక్షణ చూపడుతుంది.

### 9.7.3 ఆస్తిపై పన్ను అంతిమ ప్రభావం

ఆస్తిని వినియోగానికి కాని ఉత్పత్తికి కాని ఉపయోగింపవచ్చు. ఆస్తి వినియోగానికి ఉపయోగించబడినపుడు దాని యజమానిపై విధించబడిన పన్ను బదిలీ చేయబడదు. ఎందుకంటే ముందుకు బదిలీ చేయడానికి అవసరమయ్యే ధర ఉండదు. ఉదాహరణకు ఇంటి మీదకాని, నివాసయోగ్యమైన భూమిమీదకాని విధింపబడిన పన్ను బదిలీ చేయబడదు. కాని కొన్ని సార్లు ఇంటిపన్ను పరోక్షంగా బదిలీ చేయబడుతుంది. అంటే ఇంటి అద్దెను పెంచడం వల్ల అద్దెకుండే వారిపై ఈ భారం బదిలీ చేయబడుతుంది. ఆ పరిస్థితిలో పన్ను అంతిమ ప్రభావం ఇంటి యజమాని, అద్దెకుండె వారి మధ్య డిమాండు సప్లై వ్యాకోచత్వం ఆధారంగా విభజించబడుతుంది. ఆస్తి పన్ను విషయంలో మూల ధనీకరణవల్ల పన్ను భారాన్ని, వెనుకకు బదిలీ చేసే అవకాశం ఉంది. ఆస్తి కొనుగోలు దారు భవిష్యత్తులో పన్ను చెల్లింపులకోసం దాని విలువను తగ్గిస్తాడు. ఈ విషయం ఇదివరకే విపులీకరించబడింది.

ఆస్తి ఉత్పత్తి కోసం ఉపయోగించబడితే పన్ను అంతిమ ప్రభావం ఏమౌతుంది? ఒక భవనం వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించబడితే ఆ భవనంపై విధించిన పన్ను భారాన్ని ఆ ఉత్పత్తుల కొనుగోలుదారులకు బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. దీనినే పన్ను ముందుకు బదిలీ అంటారు. ఇది ఉత్పత్తి చేయబడిన వస్తువు యొక్క డిమాండు సప్లై వ్యాకోచత్వంపై ఆధారపడి ఉంటుంది.

డిమాండు సప్లై వ్యాకోచత్వాల ఆధారంగా పన్ను బదిలీ నిర్ణయింపబడుతుంది. అంతిమ ప్రభావాన్ని ప్రభావితం చేసే మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. అవి మార్కెట్ లో ఉపయోగింపబడే సాధారణ పద్ధతులతో సంబంధం కలిగి ఉంటాయి. ఉదాహరణకు ఉత్పత్తి దారులచే ఒక వస్తువుకు నిర్ణయింపబడిన అసలు ధర వినియోగదారులకు తెలియకపోవచ్చు. ఏదో ఒక అమ్మకం దారు పన్ను కూడా కలుపు కొని ధరను నిర్ణయించి కొనుగోలుదారుకు భారాన్ని బదిలీ చేస్తాడు. కొన్ని సార్లు మార్కెట్ లోపం వల్ల అసలు పన్నుకంటె ఎక్కువగా ధరను పెంచడానికి అవకాశం ఉంది. ఒక వస్తువు తయారీలో ప్రవేశించే ఉత్పాదకాలపై విధించిన పన్ను వల్ల



BRAOU

భారం 2. పన్ను వాస్తవిక భారం. ప్రత్యక్ష ద్రవ్యభారానికి సంబంధించిన అంతిమ ద్రవ్యభారం మనం ఇదివరకే తెలుసుకున్నాం. ఒక పన్ను విధించబడినపుడు మార్కెట్ పరిస్థితులపై వస్తు స్వభావం, డిమాండు, సప్లై వ్యాకోచత్వం మొదలైన అంశాల ఆధారంగా అది ఇతరులకు బదిలీ చేయబడుతుంది. 'డాల్టన్' మాటల్లో "ఆదాయంలోని ప్రతి షిల్లింగు (లేదా రూపాయి) పెరుగుదలకు తగినట్లు దానికి సంబంధించిన ప్రత్యక్ష ద్రవ్య భారం లేక అంతిమ ప్రభావం ఎవరో ఒకరి మీద పడుతుంది". తుదకు ఏ వ్యక్తి పన్ను చెల్లిస్తున్నాడనే విషయం తెలుసుకోవడం చాలా కష్టం. డాల్టన్ తెలిపిన రెండవ పద్ధతికి సంబంధించినంతవరకు చెల్లించిన ప్రతి పన్ను ఆర్థిక శ్రేయస్సు తగ్గడానికి కారణమౌతుంది. ఖచ్చితంగా చెప్పాలంటే ఇది పన్ను వాస్తవిక భారానికి సంబంధించిన సమస్య కాని అంతిమ ప్రభావం సమస్యకాదు. ప్రత్యక్ష నిజభారం లాగే పరోక్ష నిజ భారం కూడా ఉండవచ్చు. వినియోగం, ఆదాయ పంపిణీ మొదలైన వానిలోని మార్పుల ద్వారా నిజభారాన్ని లెక్కించవచ్చు.

నామమాత్రపు (formal) మరియు సార్థక (effective) అంతిమ ప్రభావాల మధ్యగల తేడాను 'లేడీహిక్స్' గుర్తించెను. ఈమె ప్రకారం నామ మాత్రపు అంతిమ ప్రభావం ప్రత్యక్ష ద్రవ్యభారం కాగా సార్థక అంతిమ ప్రభావం పన్ను యొక్క స్థూల ఫలితాల స్వభావాన్ని తెలియజేస్తుంది. కావున 'లేడీ హిక్స్' తెలిపిన నామమాత్రపు అంతిమ ప్రభావం ఇంచుమించుగా 'డాల్టన్' చెప్పిన ప్రత్యక్ష ద్రవ్యభారానికి సరిపోలుతుంది. మస్‌గ్రేవ్ ప్రకారం పన్ను విధింపు ఫలితాలు చాలా ఆర్థిక చలాంకాలను ప్రభావితం చేయవచ్చు. అవి ఒక దేశంలోని ఉత్పత్తి, వినియోగం, ఆదాయ సంపదల పంపిణీ, ఉద్యోగిత మొదలగు వానిని ప్రభావితం చేస్తాయి. మస్ గ్రేవ్ మాటల్లో "ప్రత్యక్ష ద్రవ్యభారానికి సంబంధించని పంపిణీ,ఉత్పత్తిలోని మార్పులు అవశిష్టమైన ఫలితాలు".

## 9.10 సారాంశము / ముగింపు

అంతిమ ప్రభావాన్ని గూర్చి రెండు ప్రాథమిక అంశాలను తప్పనిసరిగా గుర్తు పెట్టుకోవాలి. 1. పన్నులన్నీ వ్యక్తుల ఆదాయాల నుండే చెల్లించబడతాయి. కావున వ్యక్తుల నుండి పన్ను చెల్లింపు సంస్థలనుండి కొనుగోలు శక్తి ప్రభుత్వాధికారానికి బదిలీ చేయడం దీనిలో ఇమిడి ఉంది. 2. పన్ను విధింపబడిన వ్యక్తి అంతిమ ప్రభావాన్ని తప్పనిసరిగా భరించనవసరం లేదు. అతడు మొదట ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తాడు. కాని తర్వాత పన్ను భారాన్ని ముందుకు కాని వెనుకకు కాని బదిలీ చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ బదలాయింపు అనేక అంశాలపై ఆధారపడుతుంది. పన్నుల ప్రభావాలు వాస్తవిక భారాన్ని తెలియజేయగా పన్ను అంతిమ ప్రభావం ద్రవ్యభారాన్ని తెలుపుతుంది.

BRAOU

– డా. టి. దివాకరరావు

## 9.11 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Musgrave R.A. : Theory of Public Finance

క్యాస్కేడింగ్ ప్రభావం (Cascading effect) కలుగవచ్చు. దీనివల్ల ఒక వస్తువు ధర పన్ను మొత్తం కంటె కూడా ఎక్కువగా పెరుగుతుంది. కొన్ని సార్లు పన్ను చాలా తక్కువగా ఉంటే వస్తువు ధర పెంచకుండా ఉత్పత్తిదారులు తమంత తామే ఆ పన్నును భరిస్తారు. కాబట్టి వారు కొనుగోలుదార్ల సదభిప్రాయాన్ని (good will) పోగొట్టుకోకుండా ఉంటారు. ఒక వస్తువుకు ఎక్కువ సంఖ్యలో ప్రత్యామ్నాయాలుంటే పన్ను బదిలీ కష్టమౌతుంది. కొనుగోలుదారు తన వినియోగాన్ని పన్ను విధించబడిన వస్తువుల నుండి పన్ను విధించని లేక పన్ను తక్కువగా నున్న వస్తువులకు మార్చుకుంటాడు.

## 9.8 రెండు సార్లు పన్ను విధించే విధానం

పన్ను విధింపతగిన వనరులపై ఒకసారి కంటె ఎక్కువగా పన్ను విధించడాన్ని రెండు సార్లు పన్ను విధించే విధానం (double taxation) అంటారు. ప్రభుత్వం దేశీయ ప్రజల ఆదాయాలపైనేకాక ఆ దేశంనుండి సంపాదిస్తున్న విదేశీయులపై కూడ పన్నులు విధిస్తుంది. వేరు వేరు దేశాలు వేరువేరు పన్నుల చట్టాలను అమలుపరుస్తాయి. ఈ పరిస్థితుల్లో ఒకే వ్యక్తి ఆదాయంపై రెండు సార్లు పన్ను విధించబడే అవకాశం ఉంది. ఉదాహరణకు X అనే అతడు A అనే దేశంలో ఆధాయాన్ని సంపాదిస్తాడు. అతడు B అనే దేశానికి చెందినవాడు. X ఆదాయంపై A అనే దేశ ప్రభుత్వమే కాకుండా B అనే దేశ ప్రభుత్వం కూడా పన్ను విధిస్తుంది. ఒక్కొక్కసారి వేరే దేశంలో సంపాదించిన ఆదాయాలపై కూడా రెండు సార్లు పన్ను విధింపబడవచ్చు అని వాదించబడుతుంది. ఉదాహరణకు ఒక కంపెనీలో కార్పోరేషన్ పన్ను క్రింద కంపెనీ లాభాలపై పన్ను విధించడమే కాకుండా భాగస్వాములకు కూడా వ్యక్తిగత ఆదాయపన్ను విధించబడుతుంది. కాని, రెండు కాని అంతకంటె ఎక్కువ ప్రభుత్వాలచే పన్ను విధింపబడటాన్నే రెండుసార్లు పన్ను విధించే విధానమని సాధారణంగా చెప్పబడుతుంది. రెండుసార్లు పన్ను విధించే విధానం ప్రజల కష్టపడి పనిచేసే కుతూహలాన్ని దెబ్బతీస్తుంది. ఆధునిక కాలంలో రెండుసార్లు పన్ను విధించే విధానాన్ని అవలంబించే దేశాలు వచ్చే సమస్యలను గుర్తిస్తున్నాయి. రెండు దేశాలలో ఆదాయ పన్ను చెల్లించే వ్యక్తులకు రెండు దేశాలు కూడా కొన్ని మినహాయింపులను ఇస్తున్నాయి.

BRAOU

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 3

8. ఆదాయం పన్ను బదిలీ చేయబడుతుందా?
9. పన్ను బదలాయింపును నిర్ణయించు అంశాలు ఏమి?
10. రెండుసార్లు పన్ను విధించే విధానమనగా నేమి?

## 9.9 అంతిమ ప్రభావం – కొన్ని భావనలు

లేడీహిక్స్, మస్‌గ్రేవ్ మొదలైన ఆర్థికవేత్తలు పన్ను అంతిమ ప్రభావాన్ని ఆర్థిక వ్యవస్థలోని ఆదాయ పంపిణిలో మార్పులను బట్టి వివరించారు. ప్రభుత్వ బడ్జెట్ విధానంలో మార్పులను గూర్చిన మూడు ముఖ్యఫలితాలను ఈ రచయితలు తెలియజేశారు. 1. ప్రజల నుండి ప్రభుత్వానికి వనరుల బదిలీలో మార్పులు, 2. ఉత్పత్తి ఫలితాలు, 3. ఆదాయ పంపిణిపై ఫలితాలు. అంతిమ ప్రభావం అనే పదం ద్రవ్యభారం అనే అర్థంలో గ్రహించబడింది.పంపిణీ మార్పుల దృష్ట్యా పన్ను అంతిమ ప్రభావం, ప్రభుత్వ వ్యయ అంతిమ ప్రభావం, సంతులిత బడ్జెట్ అంతిమ ప్రభావం అనే భావనలు ఉపయోగపడతాయి. ఈ భావనలన్నీ పన్నుల విధింపు భారం అనే తరువాత పాఠంలో వివరంగా తెలుపబడతాయి.

'డాల్టన్' ప్రకారం పన్ను అంతిమ భారాన్ని స్థూలంగా రెండు రకాలుగా విశ్లేషించవచ్చు. 1. ప్రత్యక్ష ద్రవ్య

అభిలషణీయతలకు దారి తీయదని ఋజువైంది. దీనికి కారణం మార్కెట్లో పరిపూర్ణపోటీ లేకపోవడమే. అందుచేత వనరుల కేటాయింపు, వస్తూత్పత్తి అభిలషణీయంగా ఉండవు. కనుక ప్రభావ శూన్య (natural) పన్ను విధానం అనుసరించనవసరం లేదు. ఆధునిక ప్రభుత్వాలు చాలా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీనికి తగినంత ఆదాయం కావాలి. పన్ను విధింపు వల్ల ఉత్పత్తి వినియోగాల పద్ధతి మారకుండా ఉండదు. నిజానికి వాంఛనీయమైన మార్పులు తేవడానికే ప్రభుత్వం అనేక పన్ను లు విధిస్తుంది. పన్నుల విధానం మార్కెట్ యంత్రాంగాన్ని నాశనం చేస్తుందని తలంచరాదు. మార్కెట్ యంత్రాంగాన్ని క్రమబద్ధం చేయడమే పన్ను విధానం యొక్క లక్ష్యం. కావున ప్రభుత్వం తీసుకునే పన్ను విధింపు చర్యలు మార్కెట్ లోని సప్లై డిమాండ్ శక్తులను ప్రభావితం చేస్తాయి. పన్ను ల వల్ల వినియోగం, ఉత్పత్తి, పంపిణీలు ప్రభావితమౌతాయి. ఆధునిక ప్రభుత్వాల మారుతున్న పాత్ర దృష్ట్యా పన్నుల విధానం ఖజానాకు ఆదాయమివ్వడమే కాకుండా పొదుపు, ఎగుమతులను పెంచడానికి ప్రైవేటు రంగం అభివృద్ధి చెందడానికి కావలసిన ప్రోత్సాహం ఇవ్వడానికి ఉపయోగిస్తుంది. ఏగో ఉద్దేశంలో పన్నుల విధానం మార్కెట్ లోని డిమాండు సప్లై శక్తులను ప్రభావితం చేసి మార్కెట్ ప్రవర్తనలో కూడా మార్పులు కలుగజేస్తుంది. ఈ మార్పులను ప్రకటన ప్రభావం గా ( announcement effect ) వర్ణించాడు. పన్నుల ప్రభావాలను ప్రతి పన్నును తీసుకునిగాని, మొత్తం అన్నిటినీ తీసుకొనిగాని విశ్లేషించవచ్చు. మొత్తం పన్నులన్నిటినీ తీసుకుంటే సమిష్టి ప్రభావాన్ని స్థూల దృష్టితో చూడవచ్చు. డాల్టన్ అభిప్రాయం ప్రకారంగా "ఆర్థిక భావన దృష్టిలో మంచిపన్ను విధానం ఏదనగా మంచి లేదా అతి తక్కువ చెడు ఆర్థిక ప్రభావం కలిగి ఉన్నటు వంటిది".

## 10.2 ఉత్పత్తిపై పన్నుల ప్రభావాలు

'డాల్టన్' జాతీయోత్పత్తిపై పన్నుల ప్రభావాన్ని (i) పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావంగానూ (ii) పని, పొదుపు, పెట్టుబడులను నిర్వహించు కోరికపై ప్రభావంగాను విశ్లేషించాడు. మొదటి అంశాన్ని తీసుకుందాం.

BRAOU

### 10.2.1 పని చేసే సామర్థ్యంపై ప్రభావం

పన్నులు చెల్లించేవారి వ్యయార్హ ఆదాయాన్ని తగ్గిస్తాయి. పనిచేసే సామర్థ్యం జనాభా యొక్క ఆరోగ్యంపైనా, విద్యాశిక్షణ పైనా ఆధారపడి ఉంటుంది. ఈ రెంటిపై పెట్టుబడిని మానవ రూపంలో పెట్టుబడి అంటాము. ఒక వ్యక్తియొక్క పనిచేసే సామర్థ్యం వీటన్నిటిపైనా ఆధారపడిఉంటుంది. అయితే ఏ పన్నులు ప్రజల పనిచేసే సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడతాయో తెలుసుకోవాలి. పురోగామి పన్నులు ధనిక వర్గాలపై పడగా అనుపాత పన్నులు బీదవర్గాలపై పడతాయి. పరోక్ష పన్నులను విధిస్తే బీదవారి వినియోగం తగ్గుతుంది. ధనికుల విషయంలో ఇలా ఉండదు. వీరికి పన్నులు చెల్లించాక కూడా చాలినంత ఆదాయం ఉంటుంది. కనుక వీరి వినియోగ ప్రమాణాలు మారవు. ఇంకో మాటల్లో చెప్పాలంటే పనిచేసే సామర్థ్యం దెబ్బతినకుండా ఉండాలంటే పురోగామి పన్నుల విధానం అవసరం. ధనికులు తమ పొదుపు నుండి పన్నులు చెల్లించి తమ ఆరోగ్యం ప్రావీణ్యత దెబ్బతినకుండా చేసుకోగలరు. అలాగని పరోక్ష పన్నులు పూర్తిగా పనికిరానివని కాదు. విలాస వస్తువులకు ఆదాయ వ్యాకోచ డిమాండు హెచ్చుగా ఉంటుంది. వీటిపై పన్ను విధించడం వల్ల వినియోగ స్థాయి దెబ్బతినదు.. అయితే సామాన్యుల వినియోగంలోకి వచ్చే వస్తువులపై విపరీతమైన పన్నులు పడి పనిచేసే సామర్థ్యం దెబ్బతినకుండా చూసుకోవాలి.

### 10.2.2 పొదుపు చేసే సామర్థ్యంపై ప్రభావం

పన్నులు పొదుపు చేసే సామర్థ్యాన్ని ఎంతవరకు పెంచుతాయి? అభివృద్ధి చెందని ఆర్థికవ్యవస్థలో బీదలకు పొదుపు చేయడానికి సరిపడే ఆదాయం ఉండదు. ధనికులే పొదుపు చేయగలరు. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ధనికుల

ఆదాయాలు బీదల ఆదాయాలకంటె ఎక్కువ రేటులో పెరుగుతాయి. పురోగామి లేక ప్రత్యక్షపన్నులు విధించడం వల్ల వీరి పొదుపు పైన పన్ను విధించినట్లవుతుంది. ఈ స్థితిలో పురోగామి పన్నులను విధిస్తే పొదుపు దెబ్బతింటుంది. ఇది పురోగామి పన్నుల విధానంపై సామన్య విమర్శ. కాబట్టి వ్యక్తుల పొదుపు దెబ్బతినరాదనేది మన లక్ష్యమైతే పురోగామి పన్నులపై తక్కువగా ఆధారపడాలి. ఇట్టి స్థితిలో ప్రభుత్వానికి ఆదాయం ఎలా వస్తుంది? ఇక మిగిలిందల్లా పరోక్ష పన్నులే.వీటికి తిరోగామి లక్ష్యం ఉంది. పొదుపుపై పన్ను వేయకుండా పరోక్ష పన్నులు విధిస్తే సంపద ఆదాయాల్లో వ్యత్యాసాలను తగ్గించాలనే లక్ష్యం సంగతేమిటి? ప్రజాసంక్షేమం దృష్ట్యా ఆదాయ సంపదలలోని అసమానతలు తగ్గించడం అత్యంత ప్రాధాన్యత వహిస్తుంది. పరోక్షపన్నులపై ఎక్కువ ఆధారపడితే పనిచేసే శక్తి కూడా దెబ్బతింటుంది. అందువలన ప్రభుత్వం ఈ ప్రభావాలన్నింటిని విశ్లేషించి పైన చెప్పిన రెండు లక్ష్యాలను కూడా నెరవేర్చే విధానాన్ని ఎన్నుకోవాలి. ఇక్కడ సమస్య ఏమిటంటే పరోక్షపన్నులు వినియోగాన్ని, పనిచేసే శక్తిని దెబ్బతీస్తే ప్రత్యక్ష పన్నులు పొదుపు మొత్తాలను తద్వారా పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతినిపిస్తాయి.

### 10.2.3 పెట్టుబడి సామర్థ్యంపై ప్రభావం

పెట్టుబడి పెట్టే సామర్థ్యం పొదుపుచేసే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. పొదుపు మొత్తాలను ఉత్తేజపరిచే కారణాలు, పెట్టుబడిని ఉత్తేజపరిచే కారణాలు వేరుగాఉంటాయి. వ్యక్తి దృష్ట్యా పెట్టుబడి ప్రస్తుతపు లేదా గత పొదుపు మొత్తం మీద ఆధారపడనవసరం లేదు. పెట్టుబడికి అనుకూల వాతావరణముండి ఆకర్షణీయమైన లాభాలు (return) ఉంటే వ్యక్తి బ్యాంకులనుండి అప్పు తీసుకుని పెట్టుబడి పెట్టవచ్చు. కాని ఇది ఒక వ్యక్తి లేదా పెట్టుబడిదారుని విషయంలోనే సంభవం. మొత్తం ఆర్థిక వ్యవస్థనంతను తీసుకుంటే ఇది సంభవం కాదు. బ్యాంకింగు వ్యవస్థద్వారా పరపతి విస్తరణకు అనేక పరిమితులున్నాయి. తగినన్ని డిపాజిట్లు లేనిదే పెద్ద మొత్తాలలో ఋణాలను విస్తరించడం బ్యాంకులకు సాధ్యం కాదు. తగినంత లాభాలు లేనప్పుడు బ్యాంకులు ఋణాలను పెద్ద మొత్తాలలో విస్తరించినట్లైతే ద్రవ్యోల్బణకు దారితీసి సంఘానికి హని కలుగజేస్తాయి. ద్రవ్యోల్బణం వల్ల పేదల వినియోగానికి దెబ్బతగిలి వీరి పనిచేసే సామర్థ్యం కుంటుపడుతుంది. ఒక్కొక్కప్పుడు ద్రవ్యోల్బణం కొన్ని వస్తువుల వినియోగాన్ని తగ్గించి నిర్బంధ పొదుపును పెంచడానికి సాయపడుతుంది. కాని బ్యాంకుల ఋణ విస్తరణ ఒక హద్దు దాటితే ద్రవ్యోల్బణకు దారితీస్తుందని తెలుసుకోవాలి. ఒక వ్యక్తి పన్నులు ఎగవేసి తన ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేయవచ్చు. కాని ఆ మొత్తాన్ని అతడు బాహ్యంగా పెట్టుబడికి ఉపయోగించలేడు. ఒక వ్యక్తికి పెట్టుబడి పెట్టే సామర్థ్యమున్నప్పటికీ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు అది కార్యరూపం దాల్చదు. ఉదాహరణకు ప్రస్తుత పరిస్థితి పెట్టుబడికి ప్రోత్సాహకరంగా లేకపోవచ్చు. భవిష్యత్తు విషయంలో పెట్టుబడిదారుడు సంభావ్య ఆదాయం గురించి ఆలోచిస్తాడు. పెట్టుబడులపై కూడా పన్ను విధిస్తే ఇవి పెట్టుబడిని నిరుత్సాహపరుస్తాయి. అలాగే భవిష్యత్తులో వచ్చే ఆదాయాలపై కూడా పన్నులు విధిస్తే పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడకపోవచ్చు. పన్నుల రేటు చెల్లింపు పద్ధతి మొదలగునవి కూడా వ్యక్తి యొక్క పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి.

పన్నుల ద్వారా వసూలు చేసిన ద్రవ్యాన్ని ప్రభుత్వం పెట్టుబడికి వాడితే దేశం యొక్క ఆర్థికాభివృద్ధికి ఆటంకం ఉండదు. ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే ప్రైవేటు వ్యక్తులను పెట్టుబడికి అనుమతించడం ద్వారా అభివృద్ధి సాధించాలా? లేక ప్రభుత్వం పొదుపుమొత్తాలను పన్నుల ద్వారా గ్రహించి శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధిని సాధించే పద్ధతిలో పెట్టుబడులకు వాడాలా? ప్రైవేటు పెట్టుబడి లాభధ్యేయంచే నడిపించబడుతోంది. కాబట్టి ప్రభుత్వం సంతులిత ప్రాంతీయాభివృద్ధి (balanced development) ని సాధించదలచినట్లైతే పన్నుల ద్వారా వ్యక్తిగత పొదుపులను సేకరించి ఆ మొత్తాలను కోరదగిన మార్గాల్లోకి పెట్టుబడిని మళ్ళించాలి. కాబట్టి ప్రైవేటు పొదుపుల నుండి ప్రైవేటు పెట్టుబడిని ఎంతవరకు ప్రోత్సాహపరచాలి అనేది ప్రభుత్వ విధానంపై ఆధారపడి ఉంటుంది. ఏ విధంగానైనా ఆర్థికాభివృద్ధికి మూలధన సంచయనం (capital accumulation) చాలా అవసరం.

BRAOU

## 9.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులిమ్ము.

1. పన్ను అంతిమ భారాన్ని వివరించుము.
2. పన్ను అంతిమ భార సిద్ధాంతాలను క్లుప్తంగా విశదీకరించుము.
3. డిమాండ్ సప్లై పన్ను అంతిమ భార సిద్ధాంతాన్ని పరిశీలించుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. పన్ను తొలి, అంతిమ పన్ను భారాలలో గల తారతమ్యంను గుర్తించుము.
2. పన్ను బదలీయింపుల పద్ధతులను విశదీకరించుము.
3. కేంద్రీకరణ, వ్యాప్తి సిద్ధాంతములను వివరించుము.
4. ఈ క్రింది భావనలను వివరించుము.
   (a) పన్ను మూలధనీకరణ
   (b) రెండుసార్లు పన్ను విధించు విధానం.

●●●

BRAOU

# భాగం - 10 : అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలో పన్నుల ప్రభావాలు

విషయక్రమం

10.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
10.1 పరిచయం
10.2 ఉత్పత్తిపై పన్ను విధింపు ప్రభావం
10.3 పంపిణీపై పన్ను విధింపు ప్రభావం
10.4 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పన్ను విధింపు ప్రభావం
    10.4.1 ఆదాయ ప్రభావం
    10.4.2 తరలింపు ప్రభావం
    10.4.3 ధర ప్రభావం
    10.4.4 పంపిణీ ప్రభావం
10.5 ముగింపు
10.6 సంప్రదించు పుస్తకాలు
10.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 10.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగం ఉత్పత్తి, పంపిణీ, మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను ప్రభావం ఏలా ఉంటుందో వివరించగలదు.

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకోగలుగుతారు.

- ఉత్పత్తి, పంపిణీలపై పన్ను ప్రభావం ఎలా ఉంటుంది, మరియు
- అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను ప్రభావం విశదీకరించడం.

## 10.1 పరిచయం

స్వేచ్ఛా వ్యాపార (*laissez faire*) ఆర్థిక వ్యవస్థలో ప్రజల ఆర్థిక విషయాల్లో ప్రభుత్వ జోక్యం విదేశీ దాడులనుండి, అంతర్గత కల్లోలాల నుండి రక్షించడం వంటి కొద్ది విధులకే పరిమితం కావాలనే నమ్మకముండేది. ప్రభుత్వానికి తమ కార్యకలాపాల నిర్వహణకై ఆదాయాలు అవసరం. ఈ కార్యకలాపాలు పై విధానంలో చాలా తక్కువగా ఉంటాయి కనుక పన్నులు ఖజానాకు ఆదాయాలు తేవడానికే ఉపయోగిస్తాయి. ఈ సిద్ధాంతాన్ని సమర్థించే వారి ఉద్దేశంలో పన్నులు ప్రభావ శూన్యం కావాలి. అంటే మార్కెట్ శక్తుల వల్ల ఏర్పడే ఆర్థిక అంశాలు పన్ను విధింపు వల్ల మారిపోరాదు. ఈ రకమైన వాదం సామాన్య కోశ హేతువాదం (general fiscal rationality) పై ఆధారపడి ఉంది. అనగా కోశ విధానం వల్ల వనరుల కేటాయింపు మారరాదు. మరో మాటలో చెప్పాలంటే మార్కెట్ యంత్రాంగం ద్వారా జరిగే వనరుల కేటాయింపువల్ల జరిగిన వస్తూత్పత్తి సాంఘికావసరాలను తీరుస్తుంది. కనుక అభిలషణీయంగా ఉంటుందని ఈ ఆలోచనలో ముఖ్య నమ్మకం. కాని కాలక్రమేణా మార్కెట్ యంత్రాంగం ద్వారా జరిగే వనరుల కేటాయింపు సహేతుకంగా ఉండదనీ, సాంఘిక మరియు ఉత్పత్తి



BRAOU

ప్రైవేటు పొదుపును ప్రభుత్వ పెట్టుబడిగా వాడి గాని లేదా తక్కువ పురోగామి పన్నుల విధానాన్ని అనుసరించి గాని ప్రైవేటు పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రోత్సహించి కాని ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు.

మనం ఇప్పుడు చర్చించవలసిన రెండవ అంశం పనిచేయుటకు, పొదుపు చేయుటకు, పెట్టుబడి పెట్టుటకు గల కోరికను గురించినది. పనిచేయుటకు, పొదుపు చేయుటకు, పెట్టుబడి పెట్టుటకు సామర్థ్యం వీటిని గురించిన కోరికపైనే ఆధారపడి ఉంటుంది. ఈ అంశం ఆత్మాశ్రయమైనది. ఒకని కోరిక పరిమాణాన్ని గణించలేని చాలా అంశాలపై ఆధారపడిఉంటుంది. ఉదాహరణకు బ్రిటీష్‌వారి పాలనలో మనదేశంలోని భూస్వాములు లాభాలు పొందిననూ, వారి పొదుపు మొత్తాలను విలాస వినియోగానికి వాడారే కాని మూలధనసంచయనానికి వాడలేదు. పని, పొదుపు, పెట్టుబడులను చేసే కోరికలను పరిసరాలు ఉత్తేజపరుస్తాయి. అందువలన పన్నుల వ్యవస్థ ప్రజల పని, పొదుపు పెట్టుబడుల కోరికలను పెంచుటకవసరమైన ఉత్సాహకాలను సమకూర్చేవిగా ఉండాలి.

### 10.2.4 పని చేయాలనే కోరికపై ప్రభావం

ఒక వ్యక్తి ఎక్కువ ఆదాయాన్ని సంపాదించడానికే పని చేసే కోరికను కలిగి ఉంటాడు. ఎక్కువ పనిచేస్తే ఆదాయం కూడా పెరుగుతుంది. అంటే ఆదాయం శ్రమకు ప్రతిఫలం అన్నమాట. పన్ను చెల్లింపులు చెల్లింపుదారుని వ్యయార్హ ఆదాయాన్ని తగ్గిస్తాయి. కాబట్టి నిటారైన (steep) రేట్లతో కూడిన పురోగామి పన్నులను ప్రవేశపెడితే వ్యక్తుల శ్రమ సప్లైని తగ్గించవచ్చు. దీనికి కారణం శ్రమను పెంచి ఆదాయాన్ని పెంచుకుంటే దానిలో ఎక్కువ భాగం ఆదాయపు పన్ను, ఆస్తిపన్ను వంటి ప్రత్యక్ష పన్నుల రూపంలో పోతుందనే వారి భయమే. కావున ప్రత్యక్ష పన్నులు పనిచేసే కోరికను దెబ్బతీస్తాయి. కాని ఆ ఆలోచన పూర్తిగా సరైనది కాదు. కొన్ని సార్లు పన్ను చెల్లింపు వల్ల కుటుంబ ఆదాయంలో తగ్గిపోయిన భారాన్ని భర్తీ చేయడానికి వ్యక్తి ఎక్కువ గంటలు పనిచేయవలసి వస్తుంది. పేదవారు అసలే తక్కువ స్థాయిలో ఉన్న తమ వినియోగ ప్రమాణాలను ఇంకా తగ్గించుకోలేరు. వీరు వాడుకొనే వస్తువులపై పరోక్షపన్నులు విధిస్తే వారి ప్రస్తుత వినియోగం దెబ్బతింటుంది. తమ వినియోగస్థాయిని నిలబెట్టుకునేందుకు వీరు ఎక్కువ పనిచేయవలసి వస్తుంది. ఈ రకంగా ఆలోచిస్తే పన్నుల వల్ల పనిచేయడానికి ఇష్టత పెరుగుతుందనిపిస్తుంది. ఇట్టి ప్రభావం అందరి వ్యక్తులపైనా ఒకే మాదిరిగా ఉండదు. ఇది వ్యక్తియొక్క ఆదాయ వ్యాకోచత్వ డిమాండుపై ఆధారపడుతుంది. పన్ను చెల్లించే వాని కుటుంబావసరాలు పన్ను రేట్లు మొదలగునవి పనిచేసే కోరికను ప్రభావితం చేస్తాయి. కాని స్పష్టంగా చెప్పాలంటే అధికమైన పురోగామి పన్నులను విధిస్తే చాలామంది ప్రజల పనిచేసే కోరిక దెబ్బతింటుంది.

BRAOU

### 10.2.5 పొదుపు చేసే కోరికలపై ప్రభావం

ఈ అంశం పొదుపు చేసే సామర్థ్యానికి దగ్గరగా ఉంటుంది. పొదుపు చేసే సామర్థ్యమున్ననూ కోరిక లేకపోవచ్చు. అనగా సామర్థ్యం ప్రకారం ఎక్కువ ఆదాయం కలవారు ఎక్కువ పొదుపు చేయాలి. కాని అతనికి పొదుపు చేసే కోరిక లేకపోతే పొదుపు మొత్తాలు ఉండవలసిన వాటికంటె తక్కువగాఉంటాయి. అన్ని ప్రత్యక్ష పన్నులను పురోగామి పన్నులను వ్యక్తుల పొదుపు కోరికను నిరుత్సాహపరిచేవిగా తలంచరాదు. ఉదాహరణకు ఆదాయపు పన్ను బదులుగా వ్యయంపై పన్ను విధిస్తే పొదుపు చేయాలనే కోరికపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? వ్యయంపై పన్ను ఆదాయపు పన్ను వలెనే పురోగామి అయినా పొదుపును ప్రోత్సహిస్తుంది. కావున వ్యక్తిపొదుపు పెరుగుతున్నది. దీనికి బదులుగా నిటారైన పురోగామి రేట్లతో కూడిన ఆదాయపు పన్ను విధిస్తే పొదుపు చేయడానికి వీలుపడదని ముందే తెలుస్తుంది. ఒక వ్యక్తి ఎంతమొత్తాన్ని పొదుపు చేయడానికి సిద్ధపడతాడు అనేది మొత్తం పన్ను వ్యవస్థపై ఆధారపడుతుంది. ప్రతి పన్నునూ విడి విడిగా పరిశీలించి మొత్తం పొదుపుపై ఆయా పన్నుల ప్రభావాన్ని చెప్పడం కష్టం. కాబట్టి వ్యక్తుల పొదుపు పెంచడానికి కావలసిన ప్రోత్సాహకాలు (incentives) కలగజేయాలి.

ఉదాహరణకు భారతదేశపు ఆదాయపు పన్ను నందు జీవిత బీమా, ప్రావిడెంటు ఫండు చెల్లింపుల ద్వారా చేసే పొదుపుకు పన్ను మినహాయింపు ఉంటుంది. ఈ విధంగా ప్రోత్సాహకాలు కలుగజేస్తే వ్యక్తి పొదుపు పెరుగుతుంది. వ్యక్తులకు పొదుపు పెంచడానికి తగిన ప్రోత్సాహమీయనిచో పన్ను విధింపు పొదుపు చేయాలనే కోరికనే కాకుండా వారి పని చేయాలనే కోరికను కూడా దెబ్బతీస్తుంది. కావున ప్రజలు తమ పొదుపు మొత్తాలను పెంచేటట్లుగా ప్రజలను ప్రోత్సహించాలి. ప్రైవేటు రంగంలో పొదుపు పెరగనిచో పెట్టుబడి కూడ క్షీణించి ఆర్థికాభివృద్ధిని కుంటుపరుస్తుంది. ఈ సందర్భంలో ఇంకొక విషయమేమిటంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ రేటు ఆకర్షణీయంగా ఉంటే పొదుపు చేయాలనే కోరిక బలపడుతుంది. అలాగే ప్రభుత్వ బాండ్లు సెక్యూరిటీలు మొదలగు వాటిలో పొదుపు చేయాడానికి జనం ముందుకు వస్తారు. పొదుపు మొత్తం ఆదాయంపైనా మరియు పెట్టుబడి ప్రతిఫలనం రేటుపైనా ఆధారపడుతుందని మర్చిపోరాదు. సాంప్రదాయ ఆర్థికవేత్తలు వడ్డీరేటు ఎక్కువగా ఉంటే పొదుపు ఎక్కువగా ఉంటుందని నమ్మారు. అనగా పొదుపు వడ్డీ వ్యాకోచత కలిగి ఉంటుందన్నారు. కాని కీన్సు ప్రకారం ఒక దేశంలో పొదుపు మొత్తం జాతీయ ఆదాయ స్థాయిపై ఆధారపడుతుంది.

### 10.2.6 పెట్టుబడి కోరికపై ప్రభావం

పన్నుల విధానం పెట్టుబడి కోరికను ఎలా ప్రభావితం చేస్తుంది? సాంప్రదాయ వడ్డీరేటు సిద్ధాంతం ప్రకారం వడ్డీ రేటు తక్కువ ఉంటే పెట్టుబడి ఎక్కువ ఉంటుంది. కానీ కీన్సు దృష్టిలో పెట్టుబడి మూలధన ఉపాంత ఉత్పాదక సామర్థ్యం (marginal efficiancy of capital) పై కూడా ఆధారపడుతుంది. పెట్టుబడిదారుడు వర్తమాన పెట్టుబడిపై భవిష్యత్తులో వచ్చే ప్రతి ఫలాలు లెక్కిస్తాడు. పెట్టుబడి పెట్టాలంటే పొదుపు చేయాలి. కావున పొదుపు చేసే కోరిక, పెట్టుబడి అన్యోన్య సంబంధం కలిగి ఉంటాయి. వీటిని విడివిడిగా తీసుకోరాదు. తమ ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేయగోరువారు అనేక విధాలుగా పెట్టుబడి పెట్టకోర్తారు. వీటిలో కొన్ని ఉత్పాదకాల పెట్టుబడులు (production investment) కాగా, మరికొన్ని అనుత్పాదక పెట్టుబడులు (unproductive investment). ఉదాహరణకు బంగారం, వెండి రూపాలలో చేసిన పొదుపులు ఉత్పాదక పెట్టుబడులను కల్పించుట లేదు. మరికొన్ని పెట్టుబడులు ఆస్తి రూపంలోనూ ద్రవ్య రూపంలోనూ కూడా ఉంటాయి. పెట్టుబడి పెట్టాలనే కోరిక పన్ను విధింపు ప్రభావం మీదనే కాక పెట్టుబడి నుండి వచ్చే ఆదాయంపై విధించబడే పన్నును బట్టి కూడా ఉంటుంది. పెట్టుబడి నుండి వచ్చే ఆదాయం ఎక్కువ పన్నుకు గురైనచో అది పొదుపు కోరికను దెబ్బతీస్తుంది. వివిధ పెట్టుబడుల నుండి వచ్చే ఆదాయాలను వేర్వేరుగా పరిగణించాలి. సాంఘికార్థిక ప్రయోజనాల దృష్ట్యా అవాంఛనీయమైన పెట్టుబడి నుండి వచ్చే ఆదాయంపై పన్ను అధికంగా విధించాలి. ఉదాహరణకు ఏదైన ఒక పరిశ్రమను ప్రోత్సహించాలంటే ఆ పరిశ్రమలో పెట్టుబడులపై ఎక్కువ పన్నులను విధించరాదు. కొన్ని మినహాయింపులను కూడా ఇస్తే పెట్టుబడి పెరగవచ్చు. ఉదాహరణగా కార్పొరేటు పన్ను నుండి తరుగుదల (depreciation) కు కొంత మినహాయింపు ఇస్తే కంపెనీల నికరలాభాలు పెరిగి పెట్టుబడి కూడా పెరుగుతుంది. అలాగే పన్నుల విరామం (tax holidays) మరియు ఇతర పన్ను మినహాయింపులు కూడా పెట్టుబడి పెంచడానికి ఉద్దేశించబడినవే. కావున పెట్టుబడి కోరిక ప్రభుత్వంచే ఈయబడిన ప్రస్తుత ప్రోత్సాహకాలపైనే కాక పెట్టుబడి వాతావరణంపైనా, భవిష్యత్తులో వచ్చే లాభావకాశాలపైనా ఆధారపడుతుంది.

## 10.3 పంపిణీపై పన్నుల ప్రభావం

ఇంతవరకు ఉత్పత్తిపై పన్నుల ప్రభావాలను విశ్లేషించాం. ఇప్పుడు పంపిణీపై పన్నుల ప్రభావాన్ని గూర్చి తెలుసుకుందాం. వ్యక్తుల కొనుగోలు శక్తిని పన్ను విధింపు ఏ విధంగా ప్రభావితం చేస్తుంది.? ధనికులపై గల ప్రభావమేమిటి? పేదవారు ఏ విధంగా బాధపడుతున్నారు? అనే విషయాలను మనం ఇంతవరకు తెలుసుకున్నాం. ఇప్పుడు పంపిణీపై పన్ను విధింపు ప్రభావం తెలుసుకుందాం. ఈ సందర్భంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక



BRAOU

అసమానతలను తగ్గించడానికి పన్ను విధింపు చర్యలు ఎంతవరకు ఉపయోగపడతాయో తెలుసుకోవాలి. ఉత్పత్తి పంపిణీలను మార్కెట్టు శక్తులకు వదిలేస్తే అసమానతలు పెరిగిపోతాయి. పేదవారు మరింత పేదవారుగా ధనికులు మరింత ధనికులుగా మారుతారు. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో ఇది సర్వసాధారణం. అందువల్ల సరియైన పన్ను విధింపు చర్యల ద్వారా ప్రభుత్వం అసమానతలను తొలగించడానికి ప్రయత్నిస్తుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఆదాయాన్ని పునఃపంపిణీ చేయడమనే లక్ష్యాన్ని సాధించడానికి పురోగామి పన్నులను విధించాలి. ఆదాయపు పన్ను, సంపద పన్ను, కార్పోరేషన్ పన్ను మొదలగు ప్రత్యక్ష పన్నులు సమాజంలోని ఆదాయాన్ని పునః పంపిణీ చేయడానికి ఉపయోగిస్తాయి. పరోక్షపన్నులు కూడా ఎక్కువ ఆదాయ డిమాండు వ్యాకోచత్వాన్ని కలిగి ఇదే ప్రయోజనాన్ని సాధిస్తాయి. కొని సందర్భాల్లో ఆదాయ పునః పంపిణీకై తీసుకున్న పన్ను విధింపు చర్యలు ఇతర లక్ష్యాలతో విభేదిస్తాయి. పన్ను విధింపు ప్రభావం పేదవారిపై కంటె ధనికులపై అధికంగా ఉంటే ప్రైవేటు పొదుపులు దెబ్బతింటాయి. అదే విధంగా పరోక్ష పన్నుల విధింపు పనిచేయడానికీ, పొదుపు చేయడానికి గల కోరికను దెబ్బతీస్తుంది. ఒక్క ఆర్థికవ్యవస్థలో ఆదాయ పునః పంపిణీని స్వల్పకాలిక దృష్టిలోనూ దీర్ఘకాలిక దృష్టిలోనూ కూడ చూడవచ్చు. పన్ను విధింపు ఆదాయ పునఃపంపిణీ సాధనగా ఉపయోగిస్తే స్వల్పకాలిక ఉత్పత్తి దెబ్బతినకపోవచ్చు. కాని దీర్ఘకాలంలో ప్రజల ఆదాయ, పొదుపులలో మార్పులు తీసుకురావచ్చు. పన్ను విధింపు చర్యల ద్వారా ఆదాయాన్ని పునః పంపిణీ చేసే లక్ష్యం స్వల్పకాలంలో సాధించడానికి అవకాశం లేదు. ఇతర పద్ధతుల ద్వారా ఆస్తుల యాజమాన్యంలో తగిన మార్పులు లేనిచో ఈ లక్ష్య సాధనకు అనేకమైన సంస్థాగత ఆటంకాలు ఏర్పడతాయి. కేవలం పన్ను విధింపు పైనే ఆధారపడితే ఆదాయ పునః పంపిణీ లక్ష్యసాధనకు చాలా కాలం పడుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే స్వల్పకాలంలో ఆదాయ పంపిణీపై పన్ను విధింపు ప్రభావాలు తక్కువ ప్రాధాన్యత వహిస్తాయి. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో మిగులు ప్రాంతాలను గుర్తించడం అవసరం. ఈ విధమైన మిగుళ్ళను అనుమతిస్తే అసమానతలు పెరుగుతాయి. కాబట్టి ఈ విధమైన మిగుళ్ళపై పన్నులను విధించాలి. కొన్ని పురోగామి పన్నులు ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఉద్దేశింపబడినవే. ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంలో కూడా పన్ను విధింపు ప్రాధాన్యత వహిస్తుంది.

పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలో ముఖ్య ఆర్థిక చలాంకాలైన ఆదాయం, ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలు మొదలగు వాటిని ప్రభావితం చేసే వ్యాపార చక్రాలు ఏర్పడటానికి గట్టి అవకాశాలున్నాయి. పన్ను విధింపు ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి, ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి ఉపయోగిస్తుంది. కాబట్టి స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించబడుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాథమిక దశల్లో వివిధ పథకాల అమలుకు ప్రభుత్వం అధిక వ్యయం చేస్తుంది. ఇవన్నీ ద్రవ్యోల్బణకు దారి తీసేవే. ద్రవ్యోల్బణం ఉత్పత్తిదారులకు మేలు చేసి, తక్కువ నియత ఆదాయ వర్గాలను దెబ్బతీస్తుంది. అసమానతలు పెరగడానికి సహాయపడుతుంది. ఇట్టి ద్రవ్యోల్బణ పోకడలను తగ్గించడానికి పన్ను విధింపు చర్యలు ఉపయోగిస్తాయి. ఆ విధమైన చర్యలు నిధులననుసరించిన విత్తం (functional finance) క్రిందకు వస్తాయి. ఈ భావనను 'లెర్నర్' మొదలగు ఆర్థిక వేత్తలు బలపర్చారు.

---

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

---

1. పన్ను విధింపు ద్వారా ఉత్పత్తి ఎలా ప్రభావితమవుతుంది?
2. పన్ను విధింపు పంపిణీ పై ఎలాంటి ప్రభావం ఉంటుందో వివరించుము.

---

## 10.4 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలపై పన్నుల ప్రభావం

---

రాజా జె. చెల్లయ్య అనే ఆర్థికవేత్త 'వెనుకబడిన దేశాల్లో కోశ విధానం' అనే గ్రంథంలో వెనుకబడిన దేశాల్లో పరోక్షపన్నుల ప్రభావాలను విశ్లేషించాడు. ఆర్థికాభివృద్ధి దృష్ట్యా పరోక్షపన్నులు మూడు లక్ష్యాలను సాధించాలి.

అవి: 1) ప్రభుత్వరంగ పెట్టుబడికి కావలసిన వనరులను సమీకరించడం. 2) విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి రేటును పెంచడం. 3) ఉపాంత పొదుపురేటును పెంచడం. ఈ లక్ష్యాలను సాధించడానికి వనరుల కొనుగోలు శక్తి కూడా పన్నుల విధింపు ద్వారా అభిలషణీయమైన మార్గాలకు తరలించబడాలి. దీన్ని మూడు విధాలుగా సాధించవచ్చును అవి: 1) వనరులను ప్రభుత్వ రంగం నుండి ప్రైవేటు రంగానికి తరలించడం. 2) వనరులను ప్రైవేటు రంగంలో వినియోగ పరిశ్రమలనుండి ఉత్పాదక వస్తు పరిశ్రమలకు తరలించడం. 3). డిమాండును దిగుమతి వస్తువుల నుండి దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు మరలించడం. పన్ను విధింపువల్ల వనరులు ప్రైవేటు రంగంనుండి ప్రభుత్వరంగానికి బదిలీచేయడబడతాయి. వనరులను ఒక పరిశ్రమనుండి మరొక పరిశ్రమకు తరలించడానికి వ్యత్యాస పన్ను విధింపు (differential taxation) చాలా ప్రాధాన్యత వహిస్తుంది. మూడవ రకం తరలింపులో స్వదేశ పరిశ్రమలను విదేశీ పోటీ నుండి రక్షించి ప్రోత్సహించడానికి తగు చర్యలు తీసుకోబడతాయి. వీటిలో దిగుమతి సుంకాలు విధించడం ఒకటి. దిగుమతి చేయబడిన విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించడానికి ఈ పన్నులు విధించబడతాయి. విలాస వస్తువుల ఉత్పత్తి దేశంలో కూడ తగ్గినపుడే వీటి ప్రభావం ఉంటుంది. చెల్లింపుల సమతూక సమస్యలు (difficulties in balance of payments) ఎదుర్కొంటున్న కాలంలో ఈ పన్నులు దిగుమతులను తగ్గించి ద్రవ్యోల్బణ పోకడలను కూడా అరికడతాయి. దిగుమతి పన్నుల ప్రభావం ఒక దేశం అనుసరించిన పన్ను విధానాలకు మిగిలిన దేశాలు ఏ విధంగా ప్రతిస్పందిస్తున్నాయి అనే విషయం మీద ఆధరపడి ఉంది. వనరుల తరలింపు పద్ధతిలో రెండు రకాలైన బదిలీలను గూర్చి తెలుసుకున్నాం.వ్యక్తుల కొనుగోలు శక్తి రాజ్యానికి బదిలి చేయబడడం మొదటి రకం. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ఇది కొంత వరకు ఉపయోగిస్తుంది. వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు కావలసిన వస్తుసేవలను రాజ్యం కొనుగోలు చేయడం రెండవ రకం ఈ విధంగా ప్రైవేటు రంగం నుండి స్వీకరించిన వనరులు ప్రభుత్వ వ్యయ యంత్రాంగం ద్వారా తిరిగి ఉపయోగించబడతాయి. అప్పుడు కొనుగోలు శక్తి రాజ్యం నుండి తిరిగి వ్యక్తులకు బదిలీ అవుతుంది. ఈ బదిలీ ద్రవ్యోల్బణ వత్తిడులకు దారితీయవచ్చు. కాని పన్ను రాబడిని అభివృద్ధి కార్యకలాపాలకు వినియోగిస్తే ఉత్పత్తి పెరుగుతుంది. ఈ సందర్భంలో ఉత్పత్తిపై ప్రభావం ధనాత్మకంగా (positive) ఉంటుంది. ఇంకో మాటలో చెప్పాలంటే పన్నుల తుది ఫలితాలు పన్నుల స్వభావంపైనే కాక పన్నుల విధానం ద్వారా సమకూర్చబడిన ఆదాయం ఏ విధంగా ఖర్చవుతోంది అనే విషయంపై కూడ ఆధారపడిఉంటాయి. దీన్ని విశ్లేషించాలంటే పన్నుల ప్రభావాన్ని నాలుగు విధాలుగా విభజించవచ్చు. (1) ఆదాయ ప్రభావం (2) తరలింపు ప్రభావం (3) ధర ప్రభావం (4) పంపిణీ ప్రభావం. ఇప్పుడు మనం ఈ నాలుగు విధాలను విపులంగా తెలుసుకుందాం.

### 10.4.1 ఆదాయ ప్రభావం

ఒక వస్తువుపై పన్ను విధిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందనే విషయం అందరికి తెలిసిందే. ఇది ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను మొదలగు పరోక్ష పన్నులకే వర్తిస్తుంది. ఒక్కొక్కసారి ఒక వస్తువుపై పన్ను విధించినప్పటికీ ప్రభుత్వానికి తగినంత రాబడి ఉండదు. ఉదాహరణకు ఎక్కువ మొత్తంలో రక్షణ పన్ను విధించినప్పటికి ఖజానాకు ఎక్కువ రాబడి ఉండదు. కాని ఈ విధమైన విషయాల్లో ముఖ్యలక్షణం విదేశీ పోటీ నుండి స్వదేశీ పరిశ్రమను రక్షించడం అయి ఉంటుంది. ఒక వస్తువు తక్కువ ధర వ్యాకోచత్వ డిమాండును కలిగి వుంటే ఆ వస్తువుపై పన్ను విధింపు వల్ల ఆ వస్తువు నుండి వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంటుంది. పన్ను విధించేటప్పుడు ధర డిమాండు వ్యాకోచత్వంతోపాటు ఆదాయ డిమాండు వ్యాకోచత్వాన్ని కూడా పరిశీలించాలి. ఒక వస్తువు యొక్క ధర డిమాండు వ్యాకోచత్వం వేర్వేరు ఆదాయ వర్గాలకు వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి ఆదాయ డిమాండు వ్యాకోచత్వం ఎక్కువగా ఉన్న వస్తువుపై పన్నులు విధించడం సమంజసం. ఆదాయపు పన్ను, కార్పోరేషన్ పన్ను వంటి ప్రత్యక్ష పన్నుల విషయంలో ఆదాయ ప్రభావం రేట్లపైనా తారతమ్యత (graduation) పైనా ఆధారపడిఉంటుంది. మినహాయింపుల సదుపాయాలు అధికంగా ఉంటే ప్రత్యక్ష పన్నుల భారం ధనికవర్గం పైనే పడవచ్చు. ఇట్టి పన్నుల వల్ల పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యాలు దెబ్బతింటాయని ఇంతకుముందే



B R A O U

తెలుసుకున్నాం. ఒక్కొక్కప్పుడు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రత్యక్ష పన్నులపై గల అధిక ఉపాంత రేట్లవల్ల దెబ్బతినవచ్చు. తగిన రేట్ల తారతమ్యతను ఎంచుకుంటే ఆదాయ ప్రభావం గుర్తించతగినంతగా ఉంటుంది.

### 10.4.2 తరలింపు ప్రభావం

పన్నుల విధానం ద్వారా ఒక చోటనుండి మరొక చోటికి వనరులు తరలించవచ్చు. ఎంతవరకు తరలించవచ్చుననే విషయం డిమాండు, సప్లైల సాపేక్ష వ్యాకోచత్వాలపై ఆధారపడి ఉంటుంది. డిమాండు, సప్లైలు ఎక్కువ అవ్యాకోచత్వం కలిగి ఉంటే పన్ను మార్పు ద్వారా వనరుల తరలింపుకు తక్కువ అవకాశం ఉంటుంది. వనరుల తరలింపు ఉద్యోగితపై కూడా ప్రభావం కలిగి ఉంటుంది. పన్నులనుండి వచ్చిన ఆదాయం పన్ను విధింపబడిన వస్తువులకు అదనపు డిమాండును కల్పించడానికి ఉపయోగించే కార్యక్రమాలపై ఖర్చుపెడితే నికరమైన వనరుల తరలింపు ఉండదు. ఒక ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేయవచ్చు. వేతన వస్తువులపై పన్ను విధించి ఆ వచ్చిన ఆదాయంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించామనుకుందాం. ఇప్పుడు వనరుల తరలింపువల్ల నికర ప్రభావం గుర్తించతగినంతగా ఉండకపోవచ్చు. పన్నుల వల్ల తగ్గింపబడిన డిమాండు అదనపు ఉద్యోగిత ద్వారా అవే వస్తువులకు కల్పించబడిన అదనపు డిమాండుకు సమానంగా ఉండవచ్చు. సమతూకం ఉంటుంది. ఈ విధంగా పన్ను విధింపు ఉద్యోగిత కల్పనపై ప్రభావం చూపుతుందనే విషయం మనం గుర్తిస్తాం. పన్నుల ప్రభావాలు ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలించాలి.

### 10.4.3 ధర ప్రభావం

పన్ను విధించబడితే వస్తువు ధర పెరుగుతుంది. డిమాండు సప్లైల పరిస్థితిని అది ప్రభావితం చేస్తుంది. వస్తూత్పత్తిలో తగ్గుదల వస్తుధరను పెంచడంలోనూ, కారకాల ఆదాయాలను మార్చడంలోనూ ఎంత ప్రభావాన్ని కలిగి ఉంటుందనేది డిమాండు, సప్లై వ్యాకోచత్వాల మీద ఆధారపడి ఉంటుంది. పన్ను ముందు వెనుకలకు బదలాయింపు డిమాండు సప్లైల వ్యాకోచత్వాలపై ఆధారపడి ఉంటుందని వెనుకటి పాఠంలో నేర్చుకున్నాం.

అధిక కొనుగోలు శక్తిని తీసుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమైతే సాంఘిక ఆర్థిక అంశం దృష్ట్యా ధర ప్రభావం వనరుల కేటాయింపును తలక్రిందులు చేయవచ్చు. అంతేకాక ద్రవ్యోల్బణం యొక్క చెడు ప్రభావాలు ప్రజలపై పడవచ్చు. కాబట్టి జీవనాధార స్థాయికంటె తక్కువలో అధిక ప్రజలు నివసించే అభివృద్ధి చెందిన దేశాల్లో ధర ప్రభావాన్ని జాగ్రత్తగా విశ్లేషించాలి. వస్తువుల రకాలు, మార్కెట్టులో పోటీ స్థాయి, పన్ను రాబడి, ప్రభుత్వం ఖర్చు చేసే విధానం మొదలైనవన్నీ పన్ను విధింపులో ధర ప్రభావాన్ని విశ్లేషించడానికి ఉపయోగిస్తాయి.

### 10.4.4 పంపిణీ ప్రభావం

ఒక వస్తువుపై పన్ను విధిస్తే దాని ధర పెరుగుతుంది. ఎక్కువ ఆదాయ డిమాండు వ్యాకోచత్వం కలిగిన వస్తువులపై పన్ను విధించడం వల్ల ఆదాయ అసమానతలు తగ్గించడానికి అవకాశముంటుందనే వాదన ఉంది. ప్రత్యక్ష పరోక్ష పన్నులు రెండూకూడా ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగిస్తాయి. పన్ను భారం సంఘంలోని ధనిక వర్గానికి చెందిన వారు వహిస్తారని ఆలోచన. పన్ను నిజభారానికి ఇచట ప్రాధాన్యత ఇవ్వబడలేదు. ప్రభుత్వ వ్యయం యొక్క లాభాలు కూడా లెక్కలోకి తీసుకోబడలేదు. కాబట్టి పన్ను విధింపు ద్వారా ఆదాయాన్ని పునఃపంపిణీ చేయాలనుకొంటే పన్ను ద్రవ్య భారాన్ని నిజభారాన్నీ ఎవరు భరిస్తారనే విషయాన్ని గుర్తించాలి. ప్రభుత్వ వ్యయం నుండి ప్రజలకు కలిగే లాభాలను కూడ లెక్కలోకి తీసుకోవాలి. కేవలం కొందరు ధనవంతులపై పన్ను విధించినంత మాత్రాన ఈ లక్ష్యం సంతృప్తికరంగా సాధింపబడదు. అస్తుల యాజమాన్య పంపిణీలో మార్పులు తెచ్చేందుకు



BRAOU

పన్ను విధింపుతో పాటు కొన్ని పరిపాలనా చర్యలు ప్రవేశపెట్టబడాలి. అయినప్పటికి పన్ను విధింపు చర్యలను జాగ్రత్తగా ఎంచుకొని ఉపయోగిస్తే కొంత మేరకు ఆదాయ సంపదల్లో అసమానతలు తొలగించవచ్చు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి -2

3. పన్ను ప్రభావాలను తెలుపుము.

## 10.5 ముగింపు

పన్నుల ప్రభావాన్ని గూర్చి వివిధ ఆర్థికవేత్తలు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. వీటి సారాంశం ఏమంటే – పన్ను విధింపు ప్రభుత్వానికి ఆదాయాన్ని సంపాదించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధం చేసే సాధనంగా కూడా ఉపయోగించబడాలి. ఉత్పత్తి, పంపిణీ, ఉద్యోగితలపై వీటి ప్రభావం ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడ్డ దేశంలో పన్నువిధింపు అభివృద్ధి కార్యక్రమాల కవసరమగు వనరుల సమీకరణకే కాక విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించడానికి కూడా ఉపయోగిస్తుంది. దీనివల్ల వనరులు వినియోగ వస్తువుల ఉత్పత్తి నుండి ఉత్పాదక వస్తువుల ఉత్పత్తికి తరలింపబడడం, ద్రవ్యోల్బణ పోకడలను అరికట్టడం, ఆదాయ అసమానతలు తగ్గించడం వంటి ప్రయోజనాలను సాధించవచ్చు. ప్రత్యక్ష, పరోక్ష పన్ను విధింపులను జాగ్రత్తగా ఎంచుకోవాలి. ఖచ్చితంగా చెప్పాలంటే పన్నుల ప్రభావాలను విడిగా విశ్లేషించడం కుదరదు. ఆత్మాశ్రయం కావడం వల్ల ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను లెక్కించడం కష్ట సాధ్యమైనప్పటికీ పన్ను విధింపు ప్రభావాలను వీటితో జతపర్చి మాత్రమే విశ్లేషణ చేయాలి.

-- డా॥ టి. దివాకరరావు

## 10.6 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Musgrave : Theory of Public Finance


## 10.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబులిమ్ము.

1. ఉత్పత్తి మరియు పంపిణీపై పన్ను ప్రభావము గురించి వ్రాయుము.
2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ అసమానతలను పన్నుల ద్వారా ఎలా తగ్గించవచ్చో వివరించుము.

BRAOU

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. పని, పొదుపు , పెట్టుబడుల సామర్థ్యంపై పన్ను ప్రభావం ఏవిధంగా ఉంటుంది?
2. పని చేయాలనే కోరిక పన్ను విధింపు వల్ల ప్రభావితమవుతుందనే అభిప్రాయంతో నీవు అంగీకరింతువా? వివరింపుము.
3. ఒక అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలో పన్ను విధింపు యొక్క ఆదాయ ప్రభావాన్ని, తరలింపు ప్రభావాన్ని వివరింపుము.

•••

BRAOU

# భాగం – 11 : పన్ను చెల్లింపు సామర్థ్యం – పన్ను ప్రయత్న నిర్ణయాంశాలు

విషయక్రమం

11.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
11.1 పరిచయం
11.2 పన్ను చెల్లింపు సామర్థ్యం – వివిధ భావనలు
    11.2.1 నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
    11.2.2 సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
11.3 పన్ను విధింపు పరిమితులు
11.4 పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించే అంశాలు
11.5 భారతదేశములో పన్ను చెల్లింపు సామర్థ్యం
11.6 పన్ను సంభావ్యత
11.7 పన్ను ప్రయత్నం – దాని నిర్ణయకాలు
11.8 ముగింపు
11.9 సంప్రదించు పుస్తకాలు
11.10. నమూనా పరీక్షా ప్రశ్నలు

## 11.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం పన్ను చెల్లింపు సామర్థ్యం మరియు సామర్థ్య నిర్ణయాలను గురించి విశదీకరించడము.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అవగాహన చేసుకోగలుగుతారు.

- వివిధ పన్ను చెల్లింపు సామర్థ్య భావనలను వివరించడం.
- పన్ను చెల్లింపు సామర్థ్య అంశాలను గుర్తించడము.
- భారతదేశములో పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని విశదీకరించడము.
- పన్ను సంభావ్యత, పన్ను ప్రయత్నం అను భావనలను గుర్తించడము.

## 11.1 పరిచయం

ప్రభుత్వం అనేక లక్ష్యాలను సాధించడం కోసం పన్నులను విధిస్తుందనే అంశాన్ని తొలి పాఠాల్లో నేర్చుకొన్నాం. పన్ను విధింపు వల్ల చెల్లింపుదారుని వ్యయార్హ ఆదాయం క్షీణిస్తుంది. ప్రభుత్వాదాయాలను అపరిమితంగా పెంచడం కోసం అదే పనిగా పన్నులను పెంచలేము. వాటిని చెల్లించే స్థితిలో ప్రజలుండాలి. లేకపోతే అవి చెడు ప్రభావాన్ని కల్పిస్తాయి. పన్ను విధానానికి సంబంధించిన చర్చలన్నింటిలోనూ పన్ను చెల్లింపు సామర్థ్యం (taxable capacity) అనే భావన ప్రాధాన్యత వహించింది. పన్నులస్థాయి ప్రజల చెల్లింపు సామర్థ్యానికి చేరుకున్న

BRAOU

తరువాత అదనపు పన్నులను విధించడంకాని పన్నుల రేటును పెంచడంగాని చేయరాదు. ప్రభుత్వం అభివృద్ధి పథకాలను కొనసాగింపడానికి పన్నుల ద్వారా అదనపు ద్రవ్య వనరులను సమీకరించదలచినపుడు ప్రజల పన్ను చెల్లించే శక్తిని దృష్టిలో ఉంచుకోవాలి. పన్నుల విధింపు ప్రజల సామర్థ్యపు పరిమితులలో ఉంటూ వారికి తగిన ప్రోత్సాహకాలను కల్పించాలి.

## 11.2 పన్ను చెల్లింపు సామర్థ్యం – వివిధ భావనలు

పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పలువురు రచయితలు వేరువేరుగా నిర్వచించారు. వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం. పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని విశ్లేషించే ప్రయత్నాలు మొదట బ్రిటిష్ ఆర్థికవేత్తలు చేసారు. సర్ జోసయ్య స్టాంప్ అనే ఆర్థికవేత్త నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం (absolute taxable capacity) అనే భావనను 20వ శతాబ్దపు తొలిరోజుల్లో ఇంగ్లాండులో బాగా ప్రచారంలోకి తెచ్చాడు. "ఆర్థిక వ్యవస్థలో పౌరుడు ఏ విధమైన దుఃఖం, అణగారిన తనం, అస్తవ్యస్తాలకు గురికాకుండా ప్రభుత్వ ఖర్చుల నిమిత్తం చెల్లించగలిగిన పన్ను మొత్తాన్ని పన్ను చెల్లింపు సామర్థ్యమని" అతడు నిర్వచించాడు. అతని అభిప్రాయం ప్రకారం మొత్తం ఉత్పత్తి నుండి జనాభాను జీవనాధార స్థాయిలో పోషించడానికి కవసరమైన కనీస మొత్తాన్ని తీసివేస్తే ప్రజల

పన్ను చెల్లింపు సామర్థ్యం = మొత్తం ఉత్పత్తి - జనాభాను జీవనాధర స్థాయిలో పోషించుటకు అవసరమైన కనీస మొత్తం.

పన్ను చెల్లింపు సామర్థ్యం తెలుస్తుంది. ఫిండ్లేషిరాస్ నిర్వచనం ప్రకారం "ప్రజలనుండి డబ్బు పిండి వసూలు చేయడానికగల పరిమితే పన్ను చెల్లింపు సామర్థ్యం. ప్రజల జీవన ప్రమాణాన్ని అదే స్థాయిలో ఉంచడానికవసరమైన వస్తూత్పత్తి చేయడానికి కావలసిన కనీస వినియోగపు మొత్తం కంటె మిగులుగా ఉన్న ఉత్పత్తే పన్ను చెల్లింపు సామర్థ్యం". "పన్ను చెల్లించడానికి ప్రజలు బ్యాంకు అప్పులపై ఆధారపడవలసి వస్తే ఆ దేశం సామర్థ్యం మేరకు పూర్తిగా పన్నులు విధించినట్లు మనం భావించవచ్చని " సర్ డ్యూమండ్ ఫ్రైజర్ అనే ఆర్థికవేత్త చెప్పాడు. కిమ్మర్ అభిప్రాయం ప్రకారం "ఒక ప్రైవేటు పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ నిర్వహణలోను, ఉత్పత్తి ప్రక్రియలోను ప్రభుత్వ జోక్యం ఎక్కువగా లేకుండా ద్రవ్య వనరులను సమీకరించగల సామర్థ్యమే పన్ను చెల్లింపు సామర్థ్యం". పన్నుచెల్లింపు సామర్థ్యాన్ని లెక్కించడం చాలా కష్టంతో కూడు కొన్న పని అని అందరూ అంగీకరించారు. కాబట్టి డాల్టన్ నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యానికి సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యానికి మధ్య బేధం గుర్తించాడు.

B R A O U

### 11.2.1 నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం

నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనగా ఒక పౌరుని కనీస జీవనానికవసరమైన దాని కంటె అధికంగా ఉన్నది ప్రభుత్వం ఉపయోగించుకోగల మిగులు అని అర్థం. అనగా పన్ను చెల్లించిన తర్వాత పౌరుని వద్ద అతని కనీసావసరాలకు కావలసిన మొత్తం తప్ప ఇంకేమీ మిగలదు. నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనే భావన సిద్ధాంత పరంగా సరైనదయినప్పటికి వాస్తవంగా దాన్ని గణించేటప్పుడు అనేక సమస్యలు ఎదురౌతాయి. ఒక పౌరుడు తన కనీస జీవన ప్రమాణ స్థాయి నిలుపుకోడానికవసరమైన కనీస మొత్తమెంతో చెప్పడం చాలా కష్టం. పన్నులు వ్యక్తుల దగ్గర ఇంకేమీ మిగల్చకపోతే పని చేయడానికి పొదుపు, పెట్టుబడులకు వారికి గల ప్రోత్సాహకాల మాటేమిటి? కాబట్టి నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనే భావన అస్పష్టంగా ఉందని విమర్శిస్తూ డాల్టన్ త్రోసిపుచ్చాడు. ప్రభుత్వ విత్త చర్చలలో దానికి చోటుండరాదని అతడు పేర్కొన్నాడు. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమే సరైనదని అతడు భావించాడు.

### 11.2.2 సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం

ఈ భావన ఒక వర్గం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని మరొక వర్గం యొక్క సామర్థ్యంతో పోల్చుతుంది.

ఈ భావనను ఒక ఉదాహరణ ద్వారా స్పష్టం చేయవచ్చు. ఆదాయ సంపదలు అధికంగా గల ధనిక వర్గం వారికి పేదవర్గం వారి కంటె పన్ను చెల్లించే సామర్థ్యం అధికంగా ఉంటుంది. ప్రభుత్వం తన బడ్జెట్ అవసరాలకు పన్నుల ద్వారా ద్రవ్య వనరులను సేకరించినపుడు పేద వర్గంపై కంటె ధనిక వర్గం మీద అధిక భారం మోపేదిగా ఉండాలని సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనే భావన తెలియజేస్తుంది. కాని వివిధ వర్గాల వారి సాపేక్ష సామర్థ్యాన్ని నిర్ణయించడం ఎలాగనేదే సమస్య. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం జనాభా, ఆదాయ పెరుగుదల రేటు, ఆదాయ పంపిణీ, వివిధ వర్గాల వారి జీవన ప్రమాణాలు మొదలగు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

---

1. నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అనగా నేమి ?
2. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అనగా నేమి?

---

## 11.3 పన్ను విధింపు అవధులు (limits of taxation)

---

పన్ను విధింపు అవధులను తెలుసుకోడానికి ముందు పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని లెక్కించడం ఎలాగో తెలుసుకోవాలి. కాలిన్ క్లార్క్ 'శ్రేయస్సు మరియు పన్ను విధింపు' అనే తన గ్రంథంలో పన్ను విధింపు యొక్క గరిష్ఠ అవధి జాతీయోత్పత్తిలో 25 శాతంగా ఉండాలని చెప్పాడు. అంతకు మించి పన్నులను విధించినట్లైతే పనిచేసే కోరిక, పొదుపు పెట్టుబడులు దెబ్బతింటాయి. మూలధనసంచయనం జాతీయోత్పత్తి ప్రక్రియపై దుష్ట ప్రభావాన్ని కలుగజేస్తుంది. అధిక పన్ను రేటు దేశ రాజకీయ వ్యవస్థను కూడా దెబ్బ తీస్తుందని కాలిన్ క్లార్క్ విశ్వసించాడు. కాబట్టి ఇంగ్లాండ్, అమెరికా మొదలగు దేశాలలో జాతీయాదాయంలో 25 శాతం సురక్షితమైన గరిష్ఠ అవధిగా నిర్ణయించబడింది. కాని ఈ అవధిని ఆర్థిక వేత్తలు విమర్శించారు.

రాజకీయ సాంఘిక సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ అవసరాలకు పన్నుల ద్వారా వసూలు చేసే మొత్తం జాతీయాదాయంలోని శాతంగా తీసుకుంటే ధనిక దేశాలలో కంటే పేద దేశాలలో చాల తక్కువగా ఉంటుంది. వెనుకబడిన దేశాల్లో పన్నుల ద్వారా వచ్చే ప్రభుత్వాదాయం స్థూల జాతీయాదాయంలో 8 నుండి 15 శాతం ఉండగా, అభివృద్ధి చెందిన దేశాలలో 25 నుండి 30 శాతం వరకు ఉంటున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పన్నుల ద్వారా వచ్చే జాతీయాదాయం (జాతీయాదాయంలో శాతంగా) తక్కువగా ఉండడానికి గల కారణం వారి పేదరికం ఒక్కటే కాదు. వారికి గల సంభావ్యత (taxation potential) ను సమర్థవంతంగా వినియోగంలోనికి తెచ్చుకోలేక పోవడం కూడా.

అభివృద్ధి చెందిన దేశాలకు వర్తించే పన్ను అవధులు పేద దేశాలకు వర్తించవనే విమర్శ కూడా ఉంది. కొన్ని దేశాల్లో కాలిన్ క్లార్క్ సూచించిన 25% అవధిని చేరుకోవడానికి చాలా ముందే పన్ను విధింపువలన చెడు ఫలితాలు కలుగవచ్చు.

పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించేటప్పుడు పన్నులను మాత్రమే పరిగణనలోనికి తీసుకోరాదు. పన్ను భారాన్ని ప్రజలు ఎంతవరకు భరించగలరనే అంశం ప్రభుత్వ వ్యయం వల్ల కలిగే అనుకూల ఫలితాలను బట్టి కూడా ఉంటుంది. అందువల్లనే పన్ను చెల్లింపు సామర్థ్య భావనను విడిచిపెట్టి అభిలషణీయమైన బడ్జెట్ అనే భావనను స్వీకరించాలని మస్‌గ్రేవ్ వాదన. కొంతమంది ఆర్థికవేత్తల అభిప్రాయంలో పన్ను విధింపు చర్యలు ద్రవ్యోల్బణకు దారితీస్తుందని వీరి వాదన. అందుచేత ఏ దేశంలోనైనా పన్ను విధింపు గరిష్ఠ అవధి స్థూల జాతీయాదయంలో 25% గా ఉండాలనడం సరికాదు. డాల్టన్ మాటల్లో ఏ కాలంలోనైనా ఒక దేశం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని



BRAOU

ప్రతిబింబించేటట్లు ఒక మొత్తాన్ని నిర్ణయించడం సాధ్యం కాదు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

1. కాలిన్ క్లార్క్ యొక్క గరిష్ట అవధి పన్ను విధింపు భావనను అంగీకరింతువా? లేనిచో ఎందుకు?

## 11.4 పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించే అంశాలు

ప్రపంచదేశాలన్నిటా వర్తించే నిశ్చిత పన్ను విధింపు స్థాయి అంటూ ఏదీలేదు. ఈ స్థాయి ఆయా దేశాల సాంఘిక ఆర్థిక రాజకీయాంశాలపై ఆధారపడి ఉంటుంది. పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించే ముఖ్యాంశాలు ఈ క్రింద పేర్కొనబడ్డాయి.

### 11.4.1 జాతీయాదాయ పరిమాణం

ఆర్థికాభివృద్ధి తెలియజేసే ముఖ్యమైన సూచికల్లో జాతీయదాయ పరిమాణం ఒకటి. ప్రజలు ధనవంతులైతే ఎక్కువ పన్నులు చెల్లించేశక్తి కలిగి ఉంటారు. కాబట్టి ఆ దేశం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యం అధికంగా ఉంటుంది. సహజవనరుల లభ్యత, వాటి వినియోగం సాంకేతిక విజ్ఞాన స్థాయి మొదలగు అంశాలతో జాతీయాదాయానికి ప్రమేయాత్మక సంబంధముంది. జాతీయాదయ పరిమాణం అధికంగా ఉంటే ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యం కూడా అధికంగా ఉంటుంది. ఈ విధంగా భావించినపుడు వెనుకబడిన దేశాల ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యం అభివృద్ధి చెందిన దేశాలలో కంటె తక్కువగా ఉంటుంది.

### 11.4.2 ఆదాయ పంపిణి

జాతీయాదాయ స్థాయి ఎక్కువగా ఉంటే పన్ను చెల్లింపు సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుందని చెప్పడం సరికాదు. అది ఉత్పత్తి కారకాల యజమానుల మధ్య ఏ విధంగా పంపిణీ అయిందో కూడా చూడాలి. జాతీయ ఆదాయ పంపిణీని వైయక్తిక ఆదాయ పంపిణీ, విధులననుసరించి పంపిణీ అని రెండూ విధాలుగా చూడవచ్చు. చాలా దేశాలకు వైయక్తిక ఆదాయ పంపిణీపై గణాంక వివరాలు లేవు. అందుచే ఒక దేశం ఎక్కువ పన్ను చెల్లింపు సామర్థ్యం కలిగి ఉందో లేదో చెప్పడం సాధ్యం కాదు. కాని విధులననుసరించిన పంపిణీ గణాంకా వివరాలు ఇంచుమించు అన్ని ప్రపంచదేశాలకు ఉన్నాయి. ధనవంతులకు పన్ను చెల్లింపు సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. కనుక ఆదాయపంపిణీ వక్రీయంగా (skewed) ఉంటే దేశం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యం అధికంగా ఉంటుంది. కాని ఆధునిక ప్రభుత్వాలన్నీ ప్రజా సంక్షేమం దృష్ట్యా ఆదాయ సంపదల పంపిణీలోని అసమానతలను తగ్గించడానికి ప్రయత్నిస్తుండగా పన్ను చెల్లింపు సామర్థ్యం పెంచడం కోసం వక్రీయ పంపిణీ సమర్థనీయం కాదు. ఆదాయ సంపదల పంపిణీ సమానంగా ఉంటే సంక్షేమ పథకాలపై ప్రభుత్వ వ్యయభారం తగ్గి పన్నులు విధించే అవసరం కూడా తగ్గుతుంది. ఏమైనప్పటికీ పన్ను చెల్లింపు సామర్థ్యానికి సంబంధించినంతవరకు ఆదాయ సంపదల పంపిణీలోని అసమానతలు అనుకూలమైనవే.

### 11.4.3 జనాభా పరిమాణము మరియు పెరుగుదల రేటు

ఒక దేశం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యం జనాభా పరిమాణం మీద, పెరుగుదల రేటుపైన కూడ ఆధారపడి ఉంటుంది. నిర్ణీత జాతీయాదాయస్థాయి వద్ద జనాభా అధికంగా ఉంటే పన్ను చెల్లింపు సామర్థ్యం

అల్పంగా ఉంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే పన్ను చెల్లింపు సామర్థ్యం వాస్తవిక తలసరి ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. స్థూల జాతీయాదాయ పెరుగుదల రేటు కంటె జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంటే వాస్తవిక తలసరి ఆదాయం పడిపోతుంది. జనాభా పరిమాణం, పెరుగుదలరేటు కూడా అల్పంగా ఉండి స్థూలజాతీయాదం పెరిగే కొద్దీ పన్ను చెల్లింపు సామర్థ్యం వృద్ధి చెందుతుంది.

### 11.4.4 పన్ను విధింపు తీరు (pattern of taxation)

ఈ అంశం ఒక దేశం అనుసరించిన పన్నుల వ్యవస్థ తీరును తెలియజేస్తుంది. అనగా స్థూలజాతీయాదాయం ఎంత శాతంలో పెరుగుతోంది. పన్ను వలన వచ్చే ఆదాయం దానిలో ఎంత శాతం పెరుగుతుంది. పన్ను వలన వచ్చే ఆదాయం అనే దాని కంటె ఏఏ రకాల పన్నులు అమలులో ఉన్నాయనేది ముఖ్యం. పన్నుల వ్యవస్థలోని మార్పులకు ప్రజలు ఏవిధంగా ప్రతిస్పందిస్తున్నారో గమనిస్తూ ఏ విధమైన ఇబ్బంది లేకుండా వారు పన్నులు చెల్లించగలిగేటట్లు చూడాలి.

### 11.4.5 ప్రభుత్వ వ్యయ స్వభావం

పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని ప్రభుత్వ వ్యయప్రయోజనాలతో జతపరచి పరిశీలించాలి. ప్రభుత్వ వ్యయ పెరుగుదల జాతీయదాయాన్ని పెంచి తద్వారా పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పెంచవచ్చు. పన్నుల వల్ల వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం పెట్టుబడులకుపయోగిస్తే పన్ను చెల్లింపు సామర్థ్యం పెరుగుతుంది. అందుచేత ప్రభుత్వ వ్యయం మూలధన సంచయనాన్ని పెంచడం ద్వారా ఆర్థికాభివృద్ధి, అభివృద్ధులను త్వరితంగా చేసి పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పెంచుతుంది. కొన్ని రకాల ప్రభుత్వ వ్యయం అనుత్పాదకంగా ఉండి పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.

### 11.4.6 ప్రజల జీవన ప్రమాణం

ఒక వ్యక్తి యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యం అతని ఆదాయం నుండి కనీసజీవన ప్రమాణపు ఖర్చులను తీసివేయగా మిగిలిన దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక దేశం పన్ను చెల్లింపు సామర్థ్యం అనగా మొత్తం జాతీయాదాయం నుండి ప్రజలను పోషించడానికి మూలధనరాశిని (Capital Stock) నిలుపుకోడానికి అవసరమైన దాన్ని తీసివేయగా మిగిలింది. జీవన ప్రమాణం నిలకడగా ఉన్నప్పుడు జాతీయాదాయం లోని పెరుగుదల పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పెంచుతుంది. కాని ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన విషయమేమిటంటే జీవన ప్రమాణం ఆత్మాశ్రయాంసమైంది. అన్ని సమాజాలకు ఒకే విధంగా ఉండదు. అంతేకాక ఇదికాలానుగుణంగా మార్పుచెందుతుంది. జాతీయాదాయం పెరిగినపుడు జీవన ప్రమాణం కూడా పెరగవచ్చు. ఒక స్థాయి దాటిన తరువాత జీవన ప్రమాణం స్థిరంగా ఉండి జాతీయాదాయం పెరుగుదలతో బాటు పన్ను చెల్లింపు సామర్థ్యం కూడా పెరుగుతుంది.

### 11.4.7 ఆర్థికేతరాంశాలు

పన్ను చెల్లించే సామర్థ్యం కొన్ని ఆర్థికేతరాంశాల వలన కూడా ప్రభావితం కావచ్చు. ఉదాహరణకు ఒక్కొక్కప్పుడు రాజకీయాంశాలు దాన్ని ప్రభావితం చేస్తాయి. యుద్ధం వంటి అసాధారణ సమయాల్లో అధిక పన్నుల భారాన్ని వహించడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. పన్నులు చెల్లించడానికి ప్రజలు మానసికంగా సిద్ధపడి ఉన్నట్లైతే పన్ను చెల్లించే సామర్థ్యం అధికంగా ఉంటుంది. అందుచేత పన్నులను అధికంగా విధించడానికి గల



BRAOU

కారణాలను, ప్రభుత్వ వ్యయప్రయోజనాలను ప్రభుత్వ పని తీరును తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై గలదు.

## 11.5 భారతదేశములో పన్ను చెల్లింపు సామర్థ్యం

జాతీయాదాయంలో పన్ను ఆదాయపు శాతాన్ని పన్ను చెల్లింపు సామర్థ్యానికి సూచికగా తీసుకుంటే భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి ఇది చాలా తక్కువగానే ఉంటోంది. చాలా సంవత్సరాల వరకు అది జాతీయాదాయంలో 11 నుండి 14 శాతం వరకు మాత్రమే ఉంది. ఈ మధ్యకాలంలో ఈ నిష్పత్తి పెరుగుతోంది. ప్రస్తుతం ఈ శాతం (కారకాల వ్యయం దృష్ట్యా) రమారమి 18నుండి 20 శాతం వరకు ఉంది. కొంత మంది ఆర్థిక వేత్తలు ఇండియా పన్ను చెల్లించే సామర్థ్యపు గరిష్ఠ స్థాయిని చేరుకొన్నట్లు భావిస్తున్నారు. కాని ఈ అభిప్రాయం పూర్తిగా నిజం కాదు. పన్ను చెల్లింపు సామర్థ్యం అనేది ఒక నిశ్చల భావన (static concept) కాదు. ఇది అనేక అంశాలపై ఆధారపడి కాలానుగతంగా మారుతుంది. అందుచేత ఒక సమయంలో నిర్ణయించబడిన పన్ను చెల్లింపు సామర్థ్యం అవధిమారి పన్నులు విధించడానికి గల అవకాశం పెరగవచ్చు. లేదా తగ్గవచ్చు. కొన్ని ముఖ్యమైనఅంశాలను గమనిస్తే భారతదేశపు పన్ను చెల్లింపు సామర్థ్యం గరిష్ఠ స్థాయిని చేరలేదని తెలుస్తోంది.

భారతదేశం అధిక జనాభా గల దేశం. 40% ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారు. పేద ప్రజల ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నందువలన వారింకే మాత్రం అదనపు పన్నుల భారాన్ని భరించలేరు. అందుచేత కొత్త పన్నులను విధించేటప్పుడు కాని లేదా అమలులో ఉన్న పన్నుల రేట్లను పెంచేటప్పుడు కాని వాటి ప్రభావాలను విశ్లేషణ చేయడం అత్యంతావశ్యకం. పేద ప్రజలవినియోగ వస్తువులపై పన్నులు విధించేటప్పుడు చాలా ఎక్కువ జాగ్రత్త వహించాలి. ఆర్థిక వ్యవస్థలో వస్తుమార్పిడి గల రంగాల ఉనికి వల్ల కూడా పన్ను విధించే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. వస్తుమార్పిడి వినిమయ కార్యకలాపాలను గూడా ద్రవ్య చలామణి పరిధిలోకి తీసుకువస్తే వాటిపై గూడా పన్నులు విధించి వసూలు చేయవచ్చును.

ప్రణాళికా యుగం ప్రారంభమైనప్పటినుండి భారత ప్రభుత్వం అనేక సాంఘిక సంక్షేమ ఆర్థికాభివృద్ధి పథకాలపై చాలా ధనాన్ని ఖర్చు చేస్తుంది. ఫలితంగా ప్రజల యొక్క ఆదాయాలు పెరుగుతున్నాయి. ఈ ఆర్థికాభివృద్ధి ప్రయోజనాల భాగం సమాజంలోని కొన్ని వర్గాల ప్రజలకు చేరకపోయినప్పటికీ మొత్తం మీద ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. అందుచేత ప్రభుత్వ వ్యయం వలన కలిగే ప్రయోజనాల దృష్ట్యా పన్నుల విధింపునకు గల అవకాశాలు కనుక్కోవచ్చు. అదనపు పన్నులను విధించడమూ మానడమూ అనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలమీద ఆధారపడి ఉంటుంది. భారతదేశ పన్నుల వ్యవస్థలోని వివిధ పన్నుల గురించి తర్వాత పాఠాల్లో చర్చిద్దాం.

## 11.6 పన్ను సంభావ్యత (tax potential)

పన్ను సంభావ్యత అనే భావన సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనే భావనకు సమానార్థకమైంది. అయితే సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనేభావన ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో ఆచరణయోగ్యం కాకపోవుటచే అమెరికా ఆర్థికవేత్తలు దీన్ని నిర్లక్ష్యం చేసారు. అందుచేత ప్రభుత్వ విధానాలను నిర్దేశించడానికి ఈ భావనకు బదులుగా వారు 'పన్ను సంభావ్యత' అనే భావనను ప్రవేశపెట్టారు. కాని అర్థంలో మాత్రం రెండు పదాలు ఇంచుమించు ఒకటే. ఒకదేశం యొక్క పన్ను సంభావ్యతను మదింపు చేయడానికి కొన్ని ఆర్థిక చలాంకాలు ఉపయోగపడతాయి.

## 11.7 పన్ను ప్రయత్నం నిర్ణయకాలు ( tax effort and its determinents)

పన్ను చెల్లించే సామర్థ్యం, పన్ను సంభావ్యత అనే భావనలను ఇదివరకే తెలుసుకున్నాం. ఇప్పుడు పన్ను ప్రయత్నం అనే భావన గురించి అర్థం చేసుకోడానికి ప్రయత్నిద్దాం. ఒక ప్రభుత్వం యొక్క పన్ను ప్రయత్నం అనగా వాస్తవంగా వసూలు చేసిన పన్ను మొత్తానికి పన్ను చెల్లించే సామర్థ్యాన్ని తెలియజేసే మొత్తానికి గల నిష్పత్తి. కాబట్టి ఈ భావన వాస్తవంగా వసూలు చేయబడిన పన్నుల ఆదాయానికి అంచనా వేయబడిన పన్నుల సంభావ్య ఆదాయానికి గల నిష్పత్తిని తెలుపుతుంది. ఆర్.జె. క్రాజ్న్యుస్కి (Krazniewski) ప్రకారం సాపేక్ష పన్ను ప్రయత్నం (rational tax effort) అనగా పన్ను ఆదాయానికి పన్ను చెల్లింపు సామర్థ్యపు అంచనాకు గల సంబంధం. ఇంతకు ముందే అనుకొన్నట్లుగా పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిరపేక్ష భావంలో కొలవలేము. అది సాపేక్ష భావంలో కొంత వరకు మాత్రమే కొలవబడగలదు. అందుచేత పన్ను ప్రయత్నం కూడా నిరపేక్ష భావం గాక సాపేక్ష భావం లోనే కొలవబడుతుంది. కాబట్టి పన్ను ప్రయత్నాన్ని కొలవడానికి ఒక ప్రాంతంలో గల కొన్ని రాష్ట్రాలను తీసుకొని వాటి సగటు సాధనను (performance) పోల్చి చూస్తారు. వివిధ రాష్ట్రాల పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించే అంశాలను లెక్కలోనికి తీసుకొంటూ ఒక రాష్ట్రం యొక్క పన్ను ప్రయత్నాన్ని (performance) మరొక రాష్ట్రం సాధనతో (performance) పోల్చి చూస్తారు. ఒక రాష్ట్రంలో పన్ను విధింపు స్థాయిని పెంచవచ్చా? పెంచగలిగితే ఎంత మేరకు?

### 11.7.1 భారతదేశములో పన్ను సంభావ్యత – నిర్ణయాకాలు

ఇప్పుడు భారతదేశ పన్ను వ్యవస్థలోని పన్ను ప్రయత్న నిర్ణాయకాలను తెలుసుకొందాం. రాష్ట్రానికి రాష్ట్రానికి పన్ను ప్రయత్నంలోని భేదాలను ఈ క్రింది ఆర్థిక చలాంకాల సహాయంతో వివరించవచ్చు. ఇవి – 1) రాష్ట్ర మొత్తం ఆదాయం/తలసరి ఆదాయం (2) వివిధ రంగాల మధ్య ఆదాయ పంపిణీ (3) పట్టణీకరణ (urbanisation) (4) అక్షరాస్యత (5) పారిశ్రామికీకరణ (6) జనాభాలో పనిచేసే వారి శాతం (7) వెనుకటి సంవత్సరాలలో ఏర్పడిన బడ్జెటు లోటుల పరిమాణం (8) కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయిన ద్రవ్య వనరుల మొత్తం (9) ద్రవ్యోల్బణ ప్రభావం. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ (NCAER) అను పరిశోధనా సంస్థ జరిపిన పరిశోధనలో అమ్మకం పన్నులో రాష్ట్రాల మధ్యగల తేడాలను (1) తలసరి ఆదాయం (2) పారిశ్రామిక రంగం నుండి లభించిన తలసరి ఆదాయం (3) పట్టణవాసుల శాతం అనే చలాంకాలేవీ వివరించలేకపోయాయని కనుగొన్నారు. రాష్ట్రాల మధ్య పన్ను ప్రయత్నంలోని వ్యత్యాసాలను పరిశీలించిన కొన్ని అధ్యయనాలు (1) వ్యవసాయేతర ఆదాయపు వాటా (2) కనీస జీవనాధార స్థాయికి పైబడిన వారి శాతం (3) తలసరి అభివృద్ధి వ్యయం అనే చలాంకాలు పన్ను ప్రయత్నంపై ప్రభావాన్ని కలిగి ఉన్నట్లు కనుగొన్నాయి.

సమిష్టిగా పన్నులన్నింటిపై అధ్యయనం చేయడానికి బదులు విడిగా తీసుకుంటే పన్ను ప్రయత్న నిర్ణయకాలను సరిగా విశ్లేషించవచ్చు. ప్రతి పన్ను కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ లక్షణాలనుప్రభావితం చేసే అంశాలు వివిధ పన్నులకు వేర్వేరుగా ఉంటాయి.

## 11.8 ముగింపు, సారాంశము

పన్ను చెల్లింపు సామర్థ్య భావనలోని వివిధ అంశాలకు ప్రాధాన్యత నిస్తూ అనేక నిర్వచనాలు వచ్చాయి. ఉత్పాదక సామర్థ్యంతోగాని ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో గాని ఎక్కువ జోక్యం లేకుండా పన్నుల రాబడిని పెంచగలిగే సామర్థ్యమే పన్ను చెల్లింపు సామర్థ్యమని చెప్పవచ్చు. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల్లో పన్నుల ద్వారా ప్రజల

BRAOU

పొదుపునంతటినీ పూర్తిగా తీసుకోవడం సాధ్యంకాదు. అట్టి చర్య ప్రైవేటు పెట్టుబడిని నిరుత్సాహపరుస్తుంది. నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమనే భావన మిథ్య. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం వాస్తవమైంది. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. వాటిలో (1) తలసరి వాస్తవిక ఆదాయం (2) ఆదాయ పంపిణీలో అసమానతలు (3) వివిధ రంగాలకు మధ్య జాతీయాదాయ పంపిణీ (4) ప్రభుత్వ వ్యయ స్వభావ పరిధి (5) పన్ను ప్రాతిపదిక (6) ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య చలామణి (7) ప్రజల మనస్తత్వం (8) పన్నుల నిర్వహణ ముఖ్యమైనవి. పన్ను చెల్లింపు సామర్థ్యం అనే బ్రిటిష్ వారి భావనకు సమానార్థకంగా పన్నుల సంభావ్యత అనే భావనను అమెరికా ఆర్థికవేత్తలు ప్రవేశపెట్టారు. పన్ను సంభావ్యత కూడా సాపేక్ష భావనయే. ఈ చర్చలో పన్ను సంభావ్యత కూడా సాపేక్ష భావనయే. ఈ చర్చలో పన్ను ప్రయత్నం మరొక ముఖ్య భావన. వాస్తవంగా వసూలైన పన్ను మొత్తానికి, పన్ను చెల్లింపు సామర్థ్యానికి గల నిష్పత్తే పన్ను ప్రయత్నం. పన్ను ప్రయత్న నిర్ణయకాలు వివిధ పన్నులకు వేర్వేరుగా ఉంటాయి. కాని వీటిలో తలసరి ఆదాయం ముఖ్య స్వతంత్ర చలాంకం.

ఈ పాఠంలో పన్ను సంభావ్యతను ఎంత వరకు ఖచ్చితంగా అంచనా వేయగలమో పన్నుల ద్వారా దానిని ఏ మేరకు సాధించగలమో తెలుసుకున్నాం. పని, పొదుపు, పెట్టుబడులపై చెడు ప్రభావం లేకుండా పన్ను ప్రయత్నాన్ని ఎంతవరకు పెంచగలమో కూడా తెలుసుకున్నాం. ఆధునిక ప్రభుత్వాలు అభివృద్ధి పథకాలను అమలు పర్చడానికి అవసరమైన ద్రవ్య వనరులను సమకూర్చుకోడానికి నూతన మార్గాలను వెదకడంలో పన్ను ప్రయత్నమనే భావన ప్రాధాన్యత వహిస్తుంది.

– డా. టి. దివాకరరావు

## 11.9 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Hugh Dalton : Principles of Public Finance


## 11.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబులిమ్ము

1. పన్ను సంభావ్యతను వివరిస్తూ, ఒక దేశములో దాన్ని నిర్ణయించు అంశాలు ఏవి?
2. భారతదేశములో పన్ను చెల్లింపు సామర్థ్యంను గురించి విమర్శనాత్మకంగా వివరించుము.

II. ఈ క్రింది వాటికి 15 పంక్తులలో జవాబు లిమ్ము

1. పన్ను సంభావ్యత లోని వివిధ భావనలను వివరించుము.
2. 'పన్ను సంభావ్యత' మరియు 'పన్ను ప్రయత్నం' భావనలను వివరించుము.
3. భారతదేశములో 'పన్ను ప్రయత్నంలను' నిర్ణయించు కారకాలు ఏవి?

●●●



BRAOU

# భాగం – 12 : పన్ను భారం – భావనలు – లెక్కించు పద్ధతులు

విషయక్రమం


12.0 ఉద్దేశాలు మరియు లక్ష్యాలు
12.1 పరిచయం
12.2 పన్ను భారం - భావనలు
12.3 పన్ను భారం - వ్యాపం
12.4 పన్ను భారం - లెక్కించు పద్ధతులు
    12.4.1 నిశ్చిత అంతిమ భారం
    12.4.2 వ్యత్యాస అంతిమ భారం
12.5 పన్ను భారం - పంపిణీ
12.6 అంతిమ భారం యొక్క పురోగామి, అనుపాతం మరియు తిరోగామి పంపిణీలు
12.7 పన్ను భారంపై పరిమితులు
12.8 ముగింపు
12.9 సంప్రదించు పుస్తకాలు
12.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 12.0 ఉద్దేశాలు మరియు లక్ష్యాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం పన్ను భారంలో కల వివిధ భావనలు మరియు లెక్కించు పద్ధతులను గురించి వివరించడము.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అర్థం చేసుకోగలుగుతారు.

- పన్ను భారం వివిధ భావనలను గుర్తించడము
- పన్ను భారంలో గల వివిధ భాగాలను గుర్తించడము
- పన్ను భారం ను లెక్కించు విధానాలు
- పన్ను భారంలో గల పంపిణీ విధానాన్ని వివరించడము మరియు
- పన్ను భారంలో గల పరిమితులను గుర్తించడము

## 12.1 పరిచయం

పన్ను భారం అంటే ఏమిటో తెలుసుకుని దీనికి సంబంధించిన వివిధ భావనలు లెక్కించేటప్పుడు ఎదురయ్యే సమస్యలు ఈ పాఠంలో నేర్చుకుంటాం. పన్ను తొలిభారం అంతిమ భారం అంటే ఏమిటో క్రిందటి పాఠంలో నేర్చుకున్నాం. అయితే పన్ను అంతిమ భారానికి పన్ను భారానికి తేడా ఏమిటి? పన్నులను గూర్చి వచ్చిన సాహిత్యంలో కొందరు ఈ రెండింటిని ఒకే సందర్భంలో వాడారు. మరికొందరు రెంటికి తేడా చూపారు. 'సెలిగ్మన్' అభిప్రాయంలో ఈ రెండు మాటలకు అర్థం ఒక్కటే. కాని జే.యస్. డ్యూ అభిప్రాయంలో పన్ను భారం వాస్తవిక ఆదాయంలో తరుగుదలను తెలపగా పన్ను అంతిమ భారం పన్ను భారం యొక్క పంపిణీని తెలుపుతుంది. పన్ను



BRAOU

భారపు పంపిణీని తెలుసుకోడానికి ఆదాయాన్ని కాని వినియోగాన్ని కాని ఆధారంగా తీసుకుంటే ఒక పన్ను తిరోగామా, అనుపాతమైనదా, పురోగామా అనే విషయం తెలుస్తుంది. ఒక పన్ను రేటు మరియు దాని స్థాయి నిర్మాణాలను బట్టి అది పురోగామి, అనుపాత,తిరోగామి పన్నులంటే ఏమిటో వెనుకటి పాఠాల్లో నేర్చుకున్నాం. ఈ పాఠంలో ఈ పదాలను పన్ను భారం పంపిణీ దృష్ట్యా వివరిస్తున్నాం. పన్ను అంతిమ భారం, పన్ను ప్రభావాలను గూర్చి మనం ఇంతకు ముందే నేర్చుకున్న దానికి ఈ అంశం అనుబంధంగా ఉంటుంది.

పంపిణీలో వచ్చే మార్పులను ఆదాయం, ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలు, పెరుగుదలలో వచ్చే మార్పుల ద్వారా విశ్లేషించవచ్చు. ఈ మార్పులన్నీ ఒక దానితో ఒకటి ప్రతిస్పందిస్తాయి. పంపిణీ ప్రభావాలను చర్చించే ముందు పన్ను భారానికి సంబంధించిన భావనలు తెలుసుకోవాలి.

## 12.2 పన్ను భారం – భావనలు

పన్ను భారం ద్రవ్యరూపంలో కాని వాస్తవిక రూపంలో కాని ఉండవచ్చని డాల్టన్ అభిప్రాయం. ద్రవ్య రూపంలో చెల్లించిన పన్ను మొత్తం ప్రత్యక్ష ద్రవ్య భారాన్ని తెలుపుతుంది. అలాగే చెల్లింపుదారుచే త్యాగం చేయబడిన ఆర్థిక సంక్షేమం పన్ను ప్రత్యక్ష వాస్తవిక భారాన్ని తెలియజేస్తుంది. వీటిలో మొదటిది పన్ను అంతిమభారానికి, రెండోది పన్నుల ప్రభావాలకు సంబంధించినవి. కొన్ని సందర్భాల్లో పరోక్ష ద్రవ్య భారం వాస్తవిక భారాల మధ్య వ్యత్యాసం కూడా గుర్తించబడుతుంది. ఒక ఉదాహరణ ద్వారా ఈ తేడాను స్పష్టం చేయవచ్చు. ఒక వస్తువుపై పన్ను విధించబడినపుడు ఆ మొత్తం మొదట టోకు వ్యాపారస్తుని నుండి వసూలు చేయబడను. కాని అతడు ఆ భారాన్ని వినియోగ దారునిపైకి నెట్టి వేయును. సామాన్యంగా అతడు పన్ను చెల్లించటానికీ వినియోగదారుల నుండి తిరిగి వసూలు చేసుకునేటందుకూ మధ్య కొంత కాలం గడచును. దీని వల్ల పన్ను మొదట చెల్లించిన వానికి వడ్డీ నష్టమగును. ఈ వడ్డీ నష్టాన్నే పరోక్ష ద్రవ్య భారమని కొందరు వివరించిరి. వడ్డీ నష్టాన్నిముందుగానే లెక్కించగలిగినచో ఈ మొత్తాన్ని కూడా ధరను పెంచడం ద్వారా వినియోగదారునిపైకి నెట్టి వేయగలడు. ఇంక పరోక్ష వాస్తవిక భారమంటే ఏమిటో చూద్దాం.

పైన చెప్పినట్లు ప్రత్యక్ష వాస్తవిక భారమంటే ఆర్థిక శ్రేయస్సులో చెల్లింపుదారుకు కలిగిన నష్టం. పరోక్ష వాస్తవిక భారమంటే పన్ను విధించడం వల్ల తగ్గిన వినియోగం కారణంగా ఏర్పడ్డ ఆర్థిక శ్రేయోనష్టం. పన్ను విధించడం వల్ల కొనుగోలు తగ్గుతుందా లేదా అనేది డిమాండు వ్యాకోచత్వంపై ఆధారపడుతుంది.

వ్యావహారిక (formal) అంతిమ భారం, సార్థక (effective) అంతిమ భారమని రెండు భావనలను లేడి హిక్స్ కల్పించారు. వివిధ ఆదాయ వర్గాల మధ్య పన్ను ద్రవ్యభారం ఏ విధంగా పంపిణీ అయ్యేదీ వ్యావహారిక అంతిమ భారం తెలియజేస్తుంది. సార్థక అంతిమ భారం పన్నులో మార్పువల్ల కలిగే ఫలితాలకు చెల్లింపుదారుని ప్రతి చర్యను తెలియజేస్తుంది. ఇందుకోసం రెండు ఆర్థిక స్థితులు, అనగా పన్ను ఉన్నప్పటి , లేనప్పటి ఆర్థిక స్థితులు పరిపోల్చబడుతాయి. లేడి హిక్స్ మాటల్లో "ఒక పన్ను యొక్క పూర్తి ఆర్థికఫలితాలను తెలుసుకొనేందుకు రెండు పరిస్థితులను అనగా పన్ను అమలులో ఉన్నప్పటి పరిస్థితిని, అంతకు పూర్వపు స్థితిని సరిపోల్చాలి. ఈ సందర్భంలో వినియోగదారుల కోర్కెలు, ఆదాయల పంపిణీ మరియు వనరుల కేటాయింపులను లెక్కలోకి తీసుకోవాలి."

R.A. మస్ గ్రేవ్ పన్ను అంతిమ భారాన్ని ఆదాయ పంపిణీలో వచ్చిన మార్పుల ద్వారా వివరించాడు. ఇందులకై అంతిమ భారానికి సంబంధించిన మూడు భావనలు కల్పించాడు. అవి.1. నిశ్చిత అంతిమ భారం (Specific or absolute incidence) 2. వ్యత్యాస అంతిమ భారం (differential incidence) 3. బడ్జెట్ అంతిమ భారం (budget incidence) నిశ్చిత అంతిమ భారంలో పన్ను విధించడం వల్ల ఆదాయ పంపిణీలో కలిగిన మార్పులను

లెక్కిస్తాము. వ్యత్యాస అంతిమ భారంలో ప్రభుత్వానికి ఒకే ఆదాయ మొత్తాన్నిచ్చే రెండు పన్నుల విధానాల వల్ల కలిగే ఆదాయ పంపిణీలలో తేడాలను పరిశీలిస్తాం. బడ్జెట్ అంతిమ భారంలో పన్ను ప్రభుత్వ వ్యయాల వల్ల కలిగే సమీకృత ప్రభావాన్ని విశ్లేషిస్తాం. అంటే బడ్జెట్ భారం పన్ను భారాన్నే కాకుండా ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను కూడా లెక్కలోకి తీసుకుంటుంది. దీనివల్ల తెలియవచ్చేదేమంటే వివిధ ఆర్థిక వేత్తలు వివిధ కోణాల నుంచి ఈ సమస్యను పరిశీలించారు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ఈ క్రింది పన్ను భారం యొక్క వివిధ భావనలను గుర్తించుము.

| | | | |
|---|---|---|---|
| (a) | ద్రవ్య భారం | (b) | నిజ భారం |
| (c) | వ్యావహారిక అంతిమ భారం | (c) | సార్థక అంతిమ భారం |
| (d) | నిశ్చిత అంతిమ భారం | (e) | వ్యత్యాస అంతిమ భారం |
| (e) | బడ్జెట్ అంతిమ భారం | | |

## 12.3 పన్ను భారం – స్వభావం

మస్ గ్రేవ్ ప్రకారం పన్ను భారంలో నాలుగు అంతర్భాగాలున్నాయి. అవి 1. వనరుల బదిలీ 2. అమిత భారం 3. ఉత్పత్తి ప్రభావాలు 4. ఉద్యోగిత ప్రభావాలు. పన్ను భారాన్ని విశ్లేషించేటప్పుడు మొత్తం భారం వసూలు చేసిన మొత్తం ఆదాయానికి సమానమో కాదో తెలుసుకోవాలి.

### 12.3.1 వనరుల బదిలీ

మొదటి రకం భారాన్ని (అనగా వనరుల బదిలీ) ప్రైవేటు రంగానికి అందుబాటులో ఉన్న వనరులలో వచ్చిన మార్పుల ద్వారా లెక్కిస్తారు. పన్ను విధించడం వల్ల ప్రైవేటు ఉపయోగం నుండి ప్రభుత్వ ఉపయోగానికి వనరులు బదిలీ అయినప్పుడు పన్నుల భారం పన్నుల వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయానికి సమానంగా ఉంటుంది.

### 12.3.2 అమిత భారం

రెండవ రకంలో అనగా అమిత భారంలో పన్ను విధింపు వల్ల వినియోగదారుని ఎంపికలో వచ్చే మార్పులు కూడా గుర్తించబడతాయి. ఉదాహరణకు మోటారు వాహనాలపై పన్ను విధిస్తే పన్ను మొత్తానికి సమానంగా ధరలు పెరుగుతాయి. ఈ పెరుగుదల వినియోగదారుల ఎంపికలో మార్పులు తెస్తే ఏమౌతుంది? ( మార్పులు వస్తాయా రావా అన్నది మోటారు వాహనాల డిమాండు వ్యాకోచత్వాన్ని బట్టి ఉంటుంది) వినియోగదారుని ఎంపిక మారిందనుకుందాం. పన్ను వల్ల కొందరు వినియోగదార్లు కొనడం ఆపివేస్తారు. ఇలా ఆపివేయడం ద్వారా పన్ను చెల్లించకపోయినప్పటికి వీరి బడ్జెట్ ఎంపిక మునుపటి కంటె తక్కువ సంతృప్తినే కలుగజేస్తుంది. ఇది కొందరు వినియోగదార్లకే వర్తిస్తుంది. కాని అందరకూ కాదు. కాబట్టి ఈ పన్ను ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చినా కొందరి వినియోగదార్ల ఎంపికను కూడా మార్చి ఆ మేరకు అమిత భారాన్ని కలుగజేస్తుంది. మస్‌గ్రేవ్ అమిత భారాన్ని సామర్థ్య వ్యయంగా వివరించాడు. ఉదాహరణకు – పన్ను విధించడం వల్ల ప్రైవేటు రంగ ఆర్థిక నిర్ణయాలు మారాయనుకుందాం. దీనివల్ల సంక్షేమం దెబ్బతింటే దీన్ని అమిత భారం అంటారు. మస్ గ్రేవ్ మాటల్లో చెప్పాలంటే "అధిక భారం అంటే పన్ను విధించడం వల్ల శ్రేయస్సులో కలిగే నష్టానికి అలా కాకుండా అంతే



BRAOU

మొత్తాన్ని ప్రైవేటు రంగంలో ఆర్థిక నిర్ణయాలను మార్చకుండా వసూలు చేస్తే వచ్చే శ్రేయస్సు నష్టానికి గరిష్ఠంగా తెలియజేస్తుంది." మార్పులు లేని పన్ను (natural tax) అనగా అధిక భారంలేని పన్ను. కాని ఈ స్థితిని పొందడం ఆచరణలో సాధ్యం కాదు.

### 12.3.3 ఉత్పత్తి ప్రభావం

మూడవరకంలో (ఉత్పత్తి ప్రభావం) పన్ను విధించడం వల్ల పనిచేసే ప్రయత్నం దెబ్బతినే పరిస్థితిని గమనిస్తాము. ఈ అంశాన్ని క్రిందటి పాఠంలోనే (పన్నుల ప్రభావాలు చూడండి) చర్చించాము.

### 12.3.4 ఉద్యోగితా ప్రభావం

అలాగే నాలుగో రకంలో అనగా ఉద్యోగితా ప్రభావాల్లో పన్ను విధించడం వల్ల సమిష్టి డిమాండు మరియు నిరుద్యోగితా స్థాయిలలో వచ్చే మార్పులు గమనించబడతాయి. పన్ను విధించబడినపుడు ఉద్యోగితా స్థాయి తగ్గవచ్చు అలాగే ప్రభుత్వ వ్యయం పెరిగినపుడు ఉద్యోగితా స్థాయి పెరగవచ్చు.

పైనాల్గు రకాల భారాలు ఒక దానితో ఒకటి తలపడతాయి. ఆదాయ పంపిణీలో చివరకు ఏర్పడ్డ మార్పుల ద్వారా భారాన్ని లెక్కిస్తాము.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి – 2**

2. పన్ను భారంలో గల వివిధ భారాలు ఏవి?

---

## 12.4 పన్ను భారం లెక్కింపు

పన్ను భారం లెక్కించిన చాలా అధ్యయనాలు ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను లెక్కలోకి తీసుకోలేదు. దీనికి కారణం వివిధ ఆర్థిక వర్గాలకు వచ్చే ప్రయోజనాలను సరిగా లెక్కించలేకపోవడమే. ఈ పాఠంలో ముందుగా ప్రభుత్వ వ్యయం వల్ల కలిగే ప్రయోజనాలలో మార్పులు లేవనేఊహతో పన్ను భారాన్ని లెక్కించడం ప్రారంభిద్దాం. పన్ను భారాన్ని రెండు పరిస్థితులలో అనగా నిశ్చిత అంతిమ భారం, వ్యత్యాస అంతిమ భారం అను రెండు పరిస్థితులలోపంపిణీ ప్రభావాల ద్వారా కొలుస్తాము. సాధారణంగా పన్ను భారాన్ని చెల్లించే సంస్థ యొక్క ఆదాయంలో శాతంగా తెలుపుతాము. కొన్ని అధ్యయనాల్లో దీన్ని చెల్లించే సంస్థ యొక్క వినియోగ వ్యయంలో శాతంగా కూడా తెలిపారు.

### 12.4.1 నిశ్చిత అంతిమ భారం

ప్రభుత్వ వ్యయాన్ని స్థిరంగా ఉంచి పన్నును విధించామనుకోండి. ఆదాయపంపిణీ ఏమౌతుంది.? పంపిణీ మార్పులను నిర్ణయించేటప్పుడు ఆర్థిక వ్యవస్థపై స్థూల ప్రభావాలను వదలివేయరాదు.అలా వదిలివేసిన పక్షంలో పన్ను విధించడం వల్ల ఏర్పడ్డ పంపిణీ మార్పులు స్థూల ప్రభావాలతో కలిసిపోతాయి. ఒక ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని స్పష్టీకరించవచ్చు. ప్రభుత్వం ఆదాయపు పన్నును పెంచిందనుకుందాం. దీనివల్ల సమిష్టి డిమాండు తగ్గి నిరుద్యోగితకు దారితీసి ధరలు తగ్గి ద్రవ్యోల్బణం రేటును తగ్గిస్తాయి. ఈ మార్పుల కారణంగా ఆదాయ పంపిణీలో ఏర్పడ్డ మార్పును పూర్తిగా పన్ను మార్పుకే వర్తింపచేయరాదు. పన్నుప్రభావాలు ద్రవ్యోల్బణ, ప్రతి



BRAOU

ద్రవ్యోల్బణాం వల్ల ఏర్పడ్డ స్థూల ప్రభావంతో కలిసిపోయాయి. ఈ స్థూల ప్రభావాలను వేరుచేయకుండా పంపిణీ మార్పులను గణిస్తే అది నిశ్చిత అంతిమ భారమౌతుంది. మస్‌గ్రేవ్ ఈ రకమైన అంతిమ భారాన్ని బలపర్చలేదు. అందుచే వ్యత్యాస అంతిమ భారమనే పరికల్పనని బలపర్చెను.

### 12.4.2 వ్యత్యాస అంతిమ భారం

ఆదాయ వ్యయాలను స్థిరంగా ఉంచి ఒక పన్నుకు బదులుగా మరొక దానిని ప్రతి క్షేపించి ఆదాయ పంపిణీలో మార్పులను గమనించవచ్చు. ప్రభుత్వ ఆదాయంలో మార్పు లేకపోయినా వ్యక్తిగత ఆదాయాల్లో మార్పులు వస్తాయి. కొందరి ఆదాయాలు పెరిగితే మరికొందరి ఆదాయాలు తగ్గుతాయి. అంటే వ్యత్యాస అంతిమ భారం ద్వారా ఆదాయ పంపిణీలో మార్పులు తేవచ్చు. (అయితే పంపిణీలో వచ్చే ఈమార్పులన్నిటినీ పన్ను ప్రతిక్షేపానికి వర్తింపచేయగలం. ఆర్థిక వ్యవస్థ పరిపూర్ణ ఉద్యోగితా స్థాయిని చేరనప్పుడు ఈ పద్ధతి పనికిరాదు. అయితే ఇప్పుడు అట్టి స్థితిని వివరించలేము.).

పన్నుల విధింపు ప్రభుత్వ వ్యయాల వల్ల వచ్చిన పంపిణీలో వచ్చిన మార్పులన్నిటినీ లెక్కలోకి తీసుకొని నికర ప్రభావాన్ని తేల్చవచ్చు. ఈనికర ప్రభావాన్నే బడ్జెట్ అంతిమ భారం అంటారు.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి – 3**

---

3. నిశ్చిత అంతిమ పన్ను భారంను గురించి వివరించుము?
4. వ్యత్యాస అంతిమ పన్నుభారం విధింపులో ఆదాయ పంపిణీల లోని మార్పులు ఏవి?

BRAOU

---

## 12.5 పన్నుల భారం పంపిణీ

---

పన్నుల భారం వివిధ పన్నుల అంతిమ భారాన్ని గూర్చిన ఊహలపై ఆధారపడుతుంది. ఉదాహరణకు కార్పోరేషన్ పన్నుఅంతిమ భారం వాటాదారులపైనే పడుతుందనుకోవచ్చు. లేదా కొన్ని పరిస్థితులలో దీనికి పాక్షికబదలాయింపు ఉంటుందని కూడా ఊహించవచ్చు. అలాగే అమ్మకం పన్నుగాని, ఎక్సైజ్ సుంకంకాని వినియోగదార్లపై వారి వినియోగానికి అనుపాతంలో ఉంటుందని ఊహించవచ్చు. ఈ అంతిమ భారాన్ని గూర్చిన ఊహ ఆధారంగానే భారం పంపిణీ లెక్కించబడుతుంది. పన్నుల భారం పంపిణీలోని వివిధ ఆదాయవర్గాలకు గాని వివిధ వ్యయ వర్గాలకు గాని లెక్కించవచ్చును. ఆదాయపు పన్ను, ఆస్తి పన్ను, కార్పోరేషన్ పన్ను మొదలగు ప్రత్యక్షపన్నుల భారాన్ని వినియోగ వ్యయం ప్రాతిపదికగా ఏర్పరచబడ్డ వర్గాల మధ్య విభజించలేము. కాబట్టి ఆదాయం ప్రాతిపదికగా ఏర్పరచబడిన వర్గాలే పన్నుల భారం పంపిణీని తెలుసుకునేందుకుఅనుకూలంగా ఉంటాయి. పన్నుల భారాన్ని విశ్లేషించేటప్పుడు ఏర్పరుచుకునే ఊహలుకొన్ని ఈ క్రింది పట్టికలో పొందుపరచబడ్డాయి.

అంతిమ భారాన్ని గూర్చిన ఊహలు

| పన్ను వివరం | అంతిమ భారాన్ని గూర్చిన ఊహ | కేటాయింపు పద్ధతి |
|---|---|---|
| 1. వ్యక్తిగత ఆదాయపు పన్ను | మొదటి చెల్లింపుదారుని పైనే ఉంటుంది. | పన్ను మొత్తం. |
| 2. ఎక్సైజ్ మరియు అమ్మకం పన్నులు | వినియోగదారులకు బదలాయించబడును | వినియోగ వస్తువుల ఆధారంగా |
| 3. కార్పోరేషన్ ఆదాయ పన్ను | కొంత వాటాదార్లపైన కొంత వినియోగదార్ల పైన ఉంటుంది. | వాటాల అనుపాతంలోను వినియోగం అనుపాతంలోను |

పై పట్టికలో ముఖ్యమైన పన్నులకు అంతిమ భారాన్ని గూర్చిన ఊహలను ఇచ్చాం. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించిన వ్యక్తిపైనే ఉండిపోతుంది. కాబట్టి భారం, పంపిణీ వివిధ ఆర్థిక వర్గాలకు చెందిన కుటుంబాలు చెల్లించిన మొత్తాల అనుపాతంలో ఉంటుంది. అలాగే పరోక్ష పన్నులలో అతిముఖ్యమైన ఎక్సైజ్ సుంకం, అమ్మకం పన్ను పూర్తిగా వినియోగదారులకు బదలాయించబడుతుందని ఊహిస్తే భారం, పంపిణీ వివిధ వస్తువుల వినియోగ ఆధారంగా చేయవలసి ఉంటుంది. కొందరి అభిప్రాయంలో కార్పోరేటు ఆదాయపు పన్ను పాక్షికంగా వాటాదార్లపై ఉండిపోయి మిగిలినది వినియోగదార్లకు బదలాయించబడుతుంది. కావున భారంలో కొంత మొత్తాన్ని వివిధ కుటుంబాల వాటాల అనుపాతంలోనూ, మిగిలిన మొత్తాన్ని వినియోగానుపాతంలోనూ పంచాలి.

పన్ను భారాన్ని కుటుంబ ఆదాయంలో శాతంగా కాని కుటుంబ వినియోగ వ్యయంలో శాతంగా కాని చూపవచ్చు. ఈ రెంటిలో ఆదాయంలో శాతంగా చూపడమే శ్రేష్టం.

## 12.6 పన్నుల అంతిమ భారం – పురోగామి, అనుపాతపు, తిరోగామి పంపిణీలు

పన్నుల భారాన్ని వివిధ ఆదాయ వర్గాలకు పంచిన తర్వాత ఈ పన్నులు విడివిడిగా కాని, పన్నుల వ్యవస్థ మొత్తానికిగానీ పురోగామియా, అనుపాతమా, తిరోగామియా అనే విషయాలను తెలుసుకోవాలి. వెనుకటి పాఠంలో పురోగామి, అనుపాత , తిరోగామి పన్ను పద్ధతులను చర్చించినపుడు రేట్ల నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకునే చర్చించాం. కానీ ఇక్కడ ఒక పన్ను పురోగామియా, అనుపాతమా, తిరోగామియా అనే విషయాలు పన్ను భారం పంపిణీని బట్టి నిర్ణయించబడుతుంది. ఒక విధంగా పన్నుల రేట్ల నిర్మాణం ఆధారంగా పురోగామియా, అనుపాతమా, తిరోగామియా అని విచారించడంకంటె పన్ను భారం పంపిణీని బట్టి నిర్ణయించడమే సమంజసం. ఈ విషయాన్ని విపులీకరించడానికి ఈ క్రింద పరికల్పన పట్టిక పొందుపరుస్తున్నాం.

పట్టిక

ఆదాయ వర్గాల వారీగా పన్ను భారం పంపిణీ (కుటుంబాదాయంలో శాతంగా)

| పన్ను వివరం | ఆదాయపు వర్గాలు రూ॥లలో | | | | |
|---|---|---|---|---|---|
| | 0-1000 | 1001-2000 | 2001-4,000 | 4,001-10,000 | 10,001 -20,000 |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1. సామాన్య అమ్మకం పన్ను | 2.7 | 3.0 | 3.3 | 3.0 | 2.2 |
| 2 ఎక్సైజ్ సుంకాలు | 3.0 | 3.4 | 3.6 | 4.2 | 5.8 |
| 3. ఆదాయం పన్ను | -0- | 0.1 | 0.3 | 0.2 | 0.1 |

పన్ను భారం వివిధ ఆదాయ వర్గాల మధ్య ఏ విధంగా పంపిణీ అయిందో పై పట్టికలో చూపినాము. సామాన్య అమ్మకపు పన్నును తీసుకుంటే భారం, పంపిణీ రు॥ 2001-4000 వర్గం వరకు పురోగామిగా ఉంది. కాని తరువాతి వర్గాలలో ఆదాయం పెరిగే కొద్ది భారం తగ్గుతుందని తగ్గుతున్న భార శాతాన్ని బట్టి తెలుస్తుంది. కాబట్టి 2001 - 4000/- రు॥లకు పై బడ్డ ఆదాయ వర్గాలకు అమ్మకం పన్ను తిరోగామిగా ఉందని చెపుతాము. ఎక్సైజ్ సుంకాల విషయంలో భార పంపిణీ అన్ని తరగతులకు పురోగామిగానే ఉంది. పన్నుల మొత్తాన్ని తీసుకొన్నపుడు భారం అన్ని తరగతులకు ఒకే శాతంలో ఉంటే పన్నుల విధానం అనుపాతంగా ఉందంటాము.

1. *Hugh Dalton* : *'Principles of Public Finance', Allied Publishers Private Ltd., New Delhi.Part I - Chapters 1-3, Part II - 4 to 11.*
2. *J.A.Kay & M.A. Kieg* : *'The British Tax System', Oxford University Press, Chapters 5 and 8.*
3. *A.R. Prest* : *'Public Finanance in Developing Countries' ELBS, Chapters 2 and 3.*
4. *A.R.Prest* : *'Public Finance Theory and Practice' ELBS, Chapters 6 and 7.*
5. *E.D.Allen & O.H. Brownlee* : *'Economics of Public Finance', The World Press Ltd, Calcutta, Chapter 1.*
6. *R.A. Musgrave* : *'The Theory of Public Finance', Mc Graw Hill, New Delhi, Chapters 4,5 10 and 11.*
7. *R.A. Musgrave & Peggy B. Musgrave* : *'Public Finance in Theory and pactice'. Mc Graw Hill, New Delhi, Chapters 3, 8 and 15.*
8. *Carl S. Shoup* : *'Public Finance' Weidenfeld and Nicolson, London, Chapters 1 and 2.*
9. *J.F. Due* : *' Sales Taxation', Routeledge, London.*
10. *J.F.Due* : *'Indirect Taxation in Developing Countries' Baltimore.*
11. *R.J. Chelliah* : *'Fiscal Policy in underdeveloped Countries'. Allen and Unwin, London.*
12. *J.F.Due & A.F. Friedlaender* : *'Government Finance-Ecopnomics of the Public Sector'. Richard D. Irwin, 1973, Chapters 3 & 4.*
13. *T. Divakara Rao* : *'Tax Burden in Indian economy', Criterion Publications, New Delhi, Chapters 5,6 and 7.*
14. *Otto Eck Stein* : *'Public Finance' Prentice - Hall of India, New Delhi, Chapters 1, 5 and 6.*


•••

BRAOU

# ఖండం – 3

## భారతదేశ పన్నుల వ్యవస్థ

భారతదేశంలో అమలులో వున్న పన్నుల వ్యవస్థ గురించి ఈ ఖండంలో చర్చించుకొంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల విధానపు పెరుగుదల, సమ్మేళనంలో తీరు తెన్నులను విశ్లేషిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వివిధ ప్రత్యక్ష పరోక్ష పన్నుల స్వభావం, పరిమాణం రేటు, ఆధారం, ఆవశ్యకత మొదలగు వాటిని రెండు భాగంలలో వివరంగా చర్చించుకోవటం జరుగుతుంది. భారతదేశంలో ప్రస్తుతం ఏ పన్నుల విధానం అమలులో వుందో చివరి భాగం ద్వారా తెలుసుకొంటాం. ప్రత్యక్ష పరోక్ష పన్నుల విధానంపై ప్రభుత్వం నియమించిన వివిధ సంఘాల సిఫారసులను కూడా చివరి భాగంలో చర్చించాం.

ఈ ఖండంలో చేర్చబడిన 4 భాగాలు :

భాగం – 13 : పన్నుల రాబడి తీరు, పెరుగుదల
భాగం – 14 : ముఖ్యమైన ప్రత్యక్ష పన్నులు
భాగం – 15 : ముఖ్యమైన పరోక్ష పన్నులు
భాగం – 16 : స్వాతంత్ర్యానంతరం పన్నుల విధానం – వివిధ సంఘాల సూచనలు

+++

BRAOU

BRAOU

# భాగం – 13 : భారతదేశ పన్నుల వ్యవస్థ

విషయక్రమం


13.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
13.1 పరిచయం
13.2 పన్నుల వ్యవస్థ – అర్థం, ప్రాముఖ్యం
13.3 మూలధన బడ్జెటు మరియు రెవిన్యూ బడ్జెటు
13.4 పన్నుల ద్వారా వచ్చే రాబడి మరియు ఇతర మార్గాల ద్వారా వచ్చే రాబడి
13.5 పన్ను రకాలలోని పోకడలు
13.6 వ్యాకోచత మరియు ప్లవనశీలత
13.7 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాబడులు
13.8 సారాంశము
13.9 సంప్రదింపు గ్రంధాలు
13.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 13.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రకాలలోని పోకడలను క్షుణ్ణంగా విశ్లేషించడమే ఈ భాగం ఉద్దేశం.

ఈ భాగం చదివన తరువాత మీరు ఈ క్రింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు.

- పన్నుల వ్యవస్థ యొక్క అర్థం మరియు ప్రాముఖ్యం
- మూలధన బడ్జెట్టుకు మరియు రెవెన్యు బడ్జెటుకు గల వ్యత్యాసం
- పన్నుల ద్వారా వచ్చే రాబడికి మరియు ఇతర మార్గాల ద్వారా వచ్చే రాబడికి గల వ్యత్యాసం
- పన్ను రకాలలోని వివిధ పోకడలు
- వ్యాకోచత మరియు ప్లవనశీలత భావనలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాబడులు

## 13.1 పరిచయం

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే రాబడులలో అత్యధిక భాగం పన్నుల ద్వారా లభిస్తోంది. ఉదాహరణకు భారతదేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం రాబడిలో 70 నుండి80 శాతం వరకు పన్నుల ద్వారానే లభిస్తుంది. స్థూలజాతీయోత్పత్తిలో పన్నుల రాబడి శాతం 1950-51లో 6.8 నుండి 1984 - 85లో 16.3 కు పెరిగింది. నిరపేక్షకంగా చూస్తే, 1950-51 మరియు 1984-85ల మధ్యకాలంలో పన్ను రాబడి 55 రెట్లు పెరిగింది. 1983-84లో భారతదేశంలో సగటున ప్రతివ్యక్తి రోజుకు రూ.1.24 పైగా పన్నుల రూపంలో చెల్లించాడు. పన్ను రాబడిలో పరోక్ష పన్నుల భాగం ప్రత్యక్ష పన్నుల భాగం కంటే ఎక్కువగా వుండడమే కాకుండా పరోక్ష పన్నుల ప్రాముఖ్యత పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు మొత్తం పన్ను రాబడిలో పరోక్ష పన్నుల భాగం



BRAOU

1950-51లో 63 కాగా 1984 - 85లో 86 శాతానికి పెరిగింది. పన్ను రాబడిలోని ఈ తేడాలు రెండు కారణాల వల్ల ఏర్పడుతున్నాయి. అవి 1 వివిధ పన్నుల ద్వారా వచ్చే రాబడి వివిధ రకాల రేట్లలో పెరగడం, 2. కాలం గడిచే కొద్దీ పన్ను రేట్లలో మార్పులు సంభవించడం. అందువల్ల భారతదేశంలోని పన్నుల వ్యవస్థను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం.

## 13.2 పన్నుల వ్యవస్థ అర్థం, ప్రాముఖ్యం

ఒక ప్రభుత్వం విధించే పన్నుల సముదాయాన్ని 'పన్నుల వ్యవస్థ' అంటారు. పన్నుల వ్యవస్థ వివిధ రకాలయిన పన్నుల సాపేక్ష ప్రాముఖ్యాన్ని కూడా తెలియజేస్తుంది. కాబట్టి పన్నుల వ్యవస్థ ప్రభుత్వం విధించే వివిధ పన్నుల మిశ్రమాన్ని వాటి సాపేక్ష ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల పన్నులను విధిస్తాయి. కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నులలో కేంద్ర ఎక్సైజ్ సుంకాలు మరియు కస్టమ్స్ సుంకాలు చాలా ముఖ్యమైనవి. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులలో అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, స్టాంపులు మరియు రిజిస్ట్రేషను, మోటారు వాహనాలపై పన్ను, భూమి శిస్తు మరియు వినోదపుపన్ను ముఖ్యమైనవి.

**R.A.** మస్ గ్రేవ్, **P.B.** మస్ గ్రేవ్ చెప్పినట్లు, తలసరి ఆదాయం పెరిగే కొద్దీ కస్టమ్స్ సుంకాలు, స్థానిక ఉత్పత్తులు, అమ్మకం పన్నులలో పోల్చి చూస్తే ఆదాయపు పన్నుల సాపేక్ష ప్రాముఖ్యం పెరుగుతుంది. తలసరి ఆదాయం పెరిగే కొద్దీ పేరోల్ (Payroll) పన్నుల సాపేక్ష ప్రాధాన్యం కూడా పెరుగుతుంది. అయితే ఈ పరిశీలన అన్ని దేశాలకు వర్తింపకపోవచ్చు. ఉదాహరణకు భారతదేశ పన్నుల వ్యవస్థ పైనచెప్పిన పద్ధతికి అనుకూలంగా లేదు. ప్రగతి శీలమైన సమాజంలోనైనా పన్నుల వ్యవస్థ స్థిరంగా వుండకుండా మారుతూ వుంటుంది. ఈ మార్పులు కొంతవరకు ఆర్థిక, రాజకీయ, సాంఘికమార్పులవల్ల కలుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల పన్నుల వ్యవస్థ కన్నులిన్మోంగా వుంటుంది. అదే విధంగా పెట్టుబడి దారి, సామ్యవాద ఆర్థిక వ్యవస్థల పన్నుల వ్యవస్థలలో తేడాలుంటాయి. ఒక దేశ ప్రజల అక్షరాస్యత స్థాయి, పౌర విజ్ఞానం, పన్నులు సేకరించే వారి పరిపాలన సామర్థ్యం, ప్రజల రాజకీయ దృక్పథం ముదలగు అంశాలు ఆ దేశపు పన్నుల వ్యవస్థను ప్రభావితం చేస్తాయి.

B R A O U

## 13.3 మూలధన బడ్జెట్ మరియు రెవెన్యూ బడ్జెట్

పన్నుల రాబడి, ప్రభుత్వం కొత్తగా చేసే ఋణాలు, పాత ఋణాల వసూళ్ళు కలసి సంచిత నిధి (Consolidated fund) గా ఏర్పడుతుంది. ప్రభుత్వం ఖర్చు అంత ఈ సంచిత నిధి నుండే చేబడుతుంది. ఆదాయ వ్యయాల వివరాలు ప్రభుత్వ బడ్జెట్ లో తెలుపడం జరుగుతుంది. ప్రభుత్వ బడ్జెట్ లో 1. రెవిన్యూ బడ్జెట్ 2. మూలధన బడ్జెట్ అనేవి రెండు ప్రధాన అంశాలు మూలధన ఆస్తుల కల్పనకు సంబంధించిన ప్రభుత్వ రాబడి వ్యయాలను 'మూలధన బడ్జెట్' తెలియజేస్తుంది. ఉదాహరణకు రోడ్లు, భవనాలు, ఆనకట్టల నిర్మాణాలు మూలధన వ్యయం లోకి వస్తాయి. ప్రభుత్వ ఋణ చెల్లింపులు కూడా మూలధన వ్యయంలోకే వస్తాయి. మూలధన ఆస్తులనుండి వచ్చే రెవిన్యూ తక్కువగా ఉంటుంది. మూలధన ఆస్తుల నుండి వచ్చే ఆదాయం రెవిన్యూ బడ్జెట్ లోని మిగుళ్ళు ప్రభుత్వ ఋణాలు మూలధనబడ్జెట్ లోని రెవిన్యూఖాతాకి చెందుతాయి.

ఇప్పుడు రెవిన్యూ బడ్జెటు గురించి పరిశీలిద్దాం.

పన్నుల రూపంలో వచ్చే రాబడి ఇతర రూపాల ద్వారా వచ్చే రాబడి మరియు ఈ రకమైన రాబడుల నుండి చేసే వ్యయము సమిష్టిగా 'రెవిన్యూ బడ్జెట్' గా పరిగణింపబడుతుంది. ప్రభుత్వం విధించే పన్నుల ద్వారాను ఇతర సుంకాల ద్వారాను వచ్చే రాబడిని 'పన్నుల రాబడి' (Tax Revenue) అంటారు. ప్రభుత్వానికి వచ్చే ఇతర

రాబడులలో ముఖ్యమైనవి ప్రభుత్వం ఇచ్చిన ఋణాలపై వచ్చే వడ్డీ, ప్రభుత్వ పెట్టుబడులపై వచ్చే డివిడెండ్లు (లాభాంశాలు) ప్రభుత్వం చేసే సేవలకై చెల్లించే ఫీజు మొదలైనవి. రాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంట్లుకూడ ఒక అంశంగా వుంటాయి.

## మీ అవగాహనను పరిక్షించుకోండి – 1

1. సంచిత నిధి అంటే ఏమిటి ?
2. మూలధన బడ్జెటు అంటే ఏమిటి?
3. రెవిన్యూ బడ్జెటు అంటే ఏమిటి?

## 13.4 పన్నుల ద్వారా వచ్చే రాబడి మరియు ఇతర మార్గాల ద్వారా వచ్చే రాబడి

స్థూలంగా చెప్పాలంటే పన్నుల ద్వారా వచ్చే రాబడి (Tax Revenue) ఇతర మార్గాల ద్వార వచ్చే రాబడి (Non tax Revenue) ప్రభుత్వ రెవిన్యూ బడ్జెట్ రాబడిలో ముఖ్యాంశాలు. 1983-84 సంవత్సరంలో రెవిన్యూ ఖాతా క్రింద కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన రాబడిలో 75.5% పన్నుల ద్వారానే లభించింది. 1970-71లో ఇది 73.3% గా ఉండేది. 1950-51 లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి రాబడిలో 79.7% పన్నుల ద్వారానే లభించింది. కాబట్టి ప్రభుత్వ రెవిన్యూ ఖాతాలో సుమారు 70 నుండి 80 శాతం వరకు ఆదాయం చేకూర్చే పన్నుల వ్యవస్థ గురించే క్షుణ్ణంగానూ వివరంగానూ పరిశీలించడం ఎంతైన అవసరం.

1981-82 వ సంవత్సరములో భారతదేశంలో పన్నుల ద్వారా వచ్చినరాబడి రూ.24,142 కోట్లు. ఇది భారతదేశపు స్థూల జాతీయోత్పత్తి (G.N.P.) లో 18.3 శాతం. ఆ సంవత్సరంలో సగటున ఒక్కొక్క పౌరుడు 352 రూపాయలు పన్నుల రూపంలో చెల్లించాడు అంటే సుమారు రోజుకు ఒక్క రూపాయన్నమాట. 1983-84 నాటికి ఇది సగటున మనిషికి రోజుకు రూ.1-24 పైసలకు పెరిగింది. 1983-84లో తలసరి నికర జాతియాదాయం రూ॥ 2201.40 అంటే నికర జాతియోత్పత్తిలో 20.6 శాతం పన్నుల రూపంలో వచ్చింది. ఒకటో పట్టికలో పన్నుల రాబడి పెరుగుదలకు సంబంధించిన వివరాలు చూడవచ్చు.

గత 35 సంవత్సరాలలో పన్నుల వల్ల వచ్చే రాబడి అత్యధికంగా పెరిగిందనే విషయాన్ని ఒకటో పట్టిక ద్వారా గ్రహించవచ్చు. ఈ పెరుగుదల 35 సంవత్సరాలలో 55 రెట్లు. ఈ పన్నుల వృద్ధి రేటు (Annual compound growth rate) సంవత్సరానికి సుమారు 12 శాతం. కేంద్ర ప్రభుత్వ పన్నుల పెరుగుదల రేటు రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల పెరుగుదల రేటు కంటే హెచ్చుగా వుంది. స్థూల జాతీయోత్పత్తిలో పన్నుల శాతం 7 నుండి 18కి పెరిగింది. నెదర్లాండ్స్, స్వీడన్, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్‌లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో పన్నులు ఆ దేశాల స్థూల జాతీయ ఉత్పత్తిలో (G.N.P.) 35% నికి పైగా వున్నందున భారతదేశంలోని జాతీయాదాయంలో పన్నుల శాతం తక్కువగా వున్నట్లు కన్పించవచ్చు. ఈ నిష్పత్తి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల భారతదేశాన్ని పన్నుల భారము తక్కువగా ఉన్న దేశంగా పరిగణించలేము.

## 13.5 పన్నుల రకాలలోని పోకడలు

ప్రత్యక్ష పన్నుల రాబడిలోని వృద్ధికంటే పరోక్ష పన్నుల రాబడిలోని వృద్ధి చాలా హెచ్చుగా ఉంది. పరోక్ష పన్నుల రాబడి 1950-51, 1984-85ల మధ్యకాలంలో 75 రెట్లు పెరిగింది. అయితే ప్రత్యక్ష పన్నుల రాబడి మాత్రము 20 రెట్లు మాత్రమే పెరిగింది. ఈ రెండు రకాల పన్నుల సాపేక్షప్రాముఖ్యాన్ని పరిశీలించినపుడు ప్రత్యక్ష

పన్నుల రాబడి ప్రాముఖ్యం 1950-51లో వున్నదానికంటె 1981-82లో సగానికి తగ్గిందనే విషయం స్పష్టం (37 నుండి 17 శాతానికి). 1950-51లో పరోక్ష పన్నుల రాబడి శాతం 63 కాగా 1984-85 నాటికి ఇది 86 శాతానికి పెరిగింది. పరోక్ష పన్నుల ఆధిక్యం ప్రస్తుత భారతదేశపు పన్నుల వ్యవస్థలో ఒక ముఖ్య అంశము. 1985-86 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వపు పన్నుల రాబడి (రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో సహా) 25,992 కోట్ల రూపాలయలని అంచనా. ఇందులో పరోక్ష పన్నుల ద్వారా వచ్చే రాబడి శాతము 81, ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే రాబడి శాతం 19. అభివృద్ధి చెందుతున్న అన్ని దేశాలలో పరోక్ష పన్నులు ఎక్కువగా ప్రాముఖ్యాన్ని సంతరించుకోవడం ప్రధానలక్షణము. ఈ విషయములో భారతదేశం కూడా వాటితో పాటే ఉంటుంది. దేశాభివృద్ధికి అవసరమైన వనరుల సేకరణలో పన్నులకు ఒక ప్రముఖ స్థానం కలదు. వనరుల కేటాయింపులో అభిలషణీయమైన మార్పులను తీసుకొని వచ్చుటకు ప్రత్యక్ష పన్నులు వాంఛనీయము కాని ఈ రకమైన ప్రత్యక్ష పన్నుల విధింపుకు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అవకాశం తక్కువ. అందువల్ల పరోక్ష పన్నుల ప్రాబల్యం హెచ్చింది. విలాసవస్తు వినియోగాలపై పురోగామి పద్ధతులలో పరోక్షపన్నులు విధించడానికి అవకాశాలు పెరుగుతున్నందున ప్రగతిశీలమైన ప్రత్యక్ష పన్నులకు తిరోగామి పరోక్ష పన్నులకు అనాదిగా వస్తున్న భేదము తగ్గిపోవడం ఆరంభించింది.

## 13.6 వ్యాకోచత మరియు ప్లవనశీలత

జాతీయాదాయం పెరుగుదలతోపాటుగా పన్నుల ద్వారావచ్చే రాబడి కూడా పెరుగుతుంది. అందువల్ల జాతీయాదాయంలో కల్గిన మార్పులకు పన్నుల ద్వారా వచ్చే రాబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో పరిశీలించుట ఎంతైనా అవసరం. ఈ ప్రతిస్పందనను పన్నుల రాబడి వ్యాకోచత ద్వారా గణించవచ్చు. ఇది జాతీయాదాయంలో 1 శాతం మార్పు వల్ల, పన్ను రాబడి శాతంలో కల్గిన మార్పులను తెలుపుతుంది. జాతీయాధాయంలో ఒక శాతం పెరుగుదల వల్ల పన్నుల రాబడిలోని పెరుగుదల ఒక శాతంకంటె హెచ్చుగా నున్నచో పన్ను రాబడి వ్యాకోచత్వం కల్గి యున్నదని అంటాము. అలా కాకుండా జాతీయాదాయంలో ఒక శాతం పెరుగుదల వల్ల, పన్నుల రాబడిలోని పెరుగుదల ఒక శాతం కంటె తక్కువగా నున్న పన్నురాబడి అవ్యాకోచత్వం కల్గియున్నదని అంటాము. దీనిని మనం ఒక సులభమైన సూత్రం ద్వారా చూపించవచ్చు. వ్యాకోచతను 'E' తోను, జాతీయాదాయమును 'Y' తోను మరియు పన్ను రాబడిని 'T' తోను, సూచించినపుడు వ్యాకోచత్వ సూత్రాన్ని ఈ విధంగా వ్రాయవచ్చు.

$$e = \frac{\Delta T}{T} \div \frac{\Delta T}{y}$$

$$\frac{\Delta T}{T} \times \frac{Y}{\Delta Y}$$

BRAOU

పై సూత్రంలోని ΔT మరియు Δy లు ప్రాతిపదిక సంవత్సరానికీ, వర్తమాన సంవత్సరానికీ మధ్య జాతీయాదాయంలోను, పన్నుల రాబడిలోను వచ్చిన పెరుగుదలను సూచిస్తాయి. భారతదేశంలో మొత్తము పన్నుల రాబడి లోనే గాక, ప్రత్యక్ష పన్నుల రాబడిలోను, పరోక్ష పన్నుల రాబడిలోను వ్యాకోచత ఒకటికంటె హెచ్చుగా వున్నట్లు తెలుస్తోంది. కాని పరోక్ష పన్నుల విషయంలో ఈ వ్యాకోచత విలువ ప్రత్యక్ష పన్నుల కంటె హెచ్చుగా వుంది. అందువల్లనే ప్రత్యక్ష పన్నుల కంటె, పరోక్ష పన్నులే జాతీయాదాయానికి ఎక్కువ ప్రతిస్పందిస్తాయి. వ్యాకోచతను గణించేటప్పుడు పన్నుల రేట్లలోను మరియు పన్నుల ప్రాతిపదిక (base) లోను మార్పులు ఉండరాదు. ఒక వేళ ఆకాలంలో పన్నుల ప్రాతిపదిక (base) లోను, పన్నుల రేట్లలో ను కూడ మార్పులు సంభవిస్తే, దానిని మనం పన్నుల ప్లవనశీలత అని పిలుస్తాము. కనుక పన్నుల ప్లవనశీలతలో అన్ని రకాల మార్పులు ఇమిడి

వుండి పన్ను ప్రాతిపదిక లోను, రేట్లలోను కూడా మార్పులు వచ్చినప్పుడు పన్ను రాబడి లోని వృద్ధిని జాతీయాదాయములోని వృద్ధితో పోలుస్తుంది.

## 13.7 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాబడులు

ఇప్పుడు, భారతదేశంలోని కేంద్ర ప్రభుత్వం విధించే పన్నుల రకాలని, పన్నుల మిశ్రమాన్ని పరిశీలిద్దాము. దాని తరువాత రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థను కూడా పరిశీలిద్దాము. రెండవ, మూడవపట్టికలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థలకు సంబంధించిన వివరాలను తెలియచేస్తాయి. నాలుగో పట్టికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన పన్నుల వ్యవస్థ వివరాలున్నాయి.

### 13.7.1 కేంద్ర ప్రభుత్వ పన్ను రాబడి

కేంద్రప్రభుత్వం విధించే పన్నులను సాధారణంగా మూడు తరగతులుగా వర్గీకరిస్తారు.

1. ఆదాయం పైన, వ్యయంపైన,విధించే పన్నులు
2. ఆస్తులపైన, మూలధన లావాదేవీలపైన విధించే పన్నులు
3. వస్తువులపై, సేవలపై విధించే పన్నులు

పైన చూపిన మూడు రకాల పన్నులలో వస్తువుల సేవలపై విధించే పన్నులు రాబడి దృష్ట్యా అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. దాని తరువాత ఆదాయంపైన వ్యయం పైన విధించే పన్నులు ప్రాముఖ్యంలోకి వస్తాయి. ఆస్తులపైన మూలధనలావాదేవీలపైన విధించే పన్నులు అత్యల్ప ప్రాధాన్యతను కల్గివున్నాయి.

పన్నుల సాపేక్ష ప్రాముఖ్యతలో మార్పులు వస్తూ వుంటాయి. 1950-51లో కేంద్ర ప్రభుత్వ పన్నుల వ్యవస్థలో కస్టమ్స్ సుంకాలు (ఎగుమతులు, దిగుమతి పన్నులు) అత్యంత ప్రాధాన్యాన్ని కలిగి వుండినది. అవి మొత్తం పన్నుల రాబడిలో 38 శాతం రాబడిని చేకూర్చాయి. ఆదాయాలపై పన్ను రెండవ స్థానాన్ని ఆక్రమించింది. మొత్తం పన్నుల రాబడిలో 16.8 శాతం ఆదాయాన్ని చేకూర్చిన యూనియన్ ఎక్సైజ్ సుంకాలు మూడవ స్థానాన్ని ఆక్రమించాయి. కార్పోరేషన్ పన్ను నాల్గవస్థానాన్ని ఆక్రమించింది. కేంద్రప్రభుత్వ పన్నుల రాబడిలో మొత్తం 90 శాతం ఈ నాలుగు రకాల పన్నుల ద్వారానే లభించింది.

1960-61 నాటికి కేంద్ర ప్రభుత్వ పన్నుల వ్యవస్థలో ఈ పన్నుల యొక్క సాపేక్ష ప్రాధాన్యతలో మార్పులు వచ్చాయి. మొత్తం పన్నుల రాబడిలో ఎక్సయిజ్ సుంకాల భాగం 4 శాతం కావడంతో ఇది ప్రధమస్థానానికి చేరుకుంది. దీని తరువాత స్థానాలను కస్టమ్స్ సుంకాలు, ఆదాయపు పన్ను, కార్పోరేషను పన్నులు అదే క్రమంలో ఆక్రమించాయి. 1970-71 నాటికి వీటి ప్రాధాన్యతలో మార్పులు రాకపోయినా ఎక్సయిజు సుంకాల భాగం 55 శాతానికి పెరిగింది. 1983-84 వ సంవత్సరంలో మొదటి రెండు పన్నులు అనగా ఎక్సయిజు సుంకాలు మరియు కస్టమ్స్ సుంకాలు వాటి వాటి స్థానాలను నిలబెట్టుకొనగా, ఆదాయపు పన్ను, కార్పోరేషన్ పన్ను స్థానాలు తారుమారయ్యాయి. కార్పోరేషను పన్నుమూడవ స్థానాన్ని ఆక్రమించి ఆదాయపు పన్నును నాల్గవస్థానానికి నెట్టి వేశాయి. ఇప్పటికీ కూడా కేంద్ర ప్రభుత్వ పన్నుల వ్యవస్థలో పైన చెప్పబడిన ఈ నాల్గు పన్నులు ప్రాధాన్యతను వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పన్నుల స్థూల రాబడిలో నాలగింటమూడు వంతులు, పరోక్ష పన్నులయిన ఎక్సయిజ్ సుంకాల ద్వారాను, కస్టమ్స్సుంకాల ద్వారాను లభించాయి.

BRAOU

### 13.7.2 రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల రాబడులు

రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థలో సుమారు 6 రకాల పన్నులు ప్రాముఖ్యతను కలిగివున్నాయి. అవి 1. అమ్మకంపన్ను,2. రాష్ట్ర ఎక్సైయిజ్ సుంకాలు, 3. భూమిశిస్తు, 4. స్టాంపులు, రిజిస్ట్రేషను, 5. మోటారు వాహనాలపై పన్ను 6. వినోదపు పన్ను. ఈ ఆరు పన్నులలో మొదటి ఐదింటికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. 1950-51 వ సంవత్సరం నాటికే అమ్మకపు పన్ను ప్రధమస్థానాన్ని ఆక్రమించి ఉండేది. భూమి శిస్తు, రాష్ట్ర ఎక్సైయిజ్ సుంకాలకు ఇంచుమించు సమాన ప్రాముఖ్యం వుండి, రెండు మూడు స్థానాలను ఆక్రమిన్చాయి. స్టాంపులు, రిజిస్ట్రేషను నాల్గవస్థానాన్ని, మోటారువాహనాలపై పన్ను ఐదవస్థానాన్ని ఆక్రమించాయి. ప్రత్యక్ష పన్నులలో ముఖ్యమైన భూమిశిస్తు, స్టాంపులు, రిజిస్ట్రేషను, ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం పన్నుల రాబడిలో 34 శాతం రాబడి చేకూరేది.

1960 - 61 సం॥ నాటికి కూడా పైన చెప్పబడిన పన్నుల సాపేక్ష ప్రాముఖ్యతలలో మార్పు రాలేదు. కాని అమ్మకంపన్ను, మోటారు వాహనాలపై పన్నులు మొత్తం పన్నులు తమ తమ వాటాలను అధికంగా పెంచుకున్నాయి. కాని రాష్ట్ర ఎక్సయిజ్ సుంకాలు, స్టాంపులు, రిజిస్ట్రేషను తమ తమ వాటాలలో తరుగుదలను పొందాయి.

తరువాత కాలంలో అమ్మకం పన్ను తన వాటాను మరింత పెంచుకొనగా, రాష్ట్ర ఎక్సయిజు సుంకపు వాటాలో మాత్రం మార్పు లేదు. మిగిలిన మూడు పన్నుల వాటాలు వరుసగా తగ్గుతూనే వచ్చాయి. ఈ మార్పుల ఫలితంగా 1986-87 సం॥రం నాటికి అమ్మకం పన్నువాటా 58.2% శాతానికి పెరిగింది. అదే సమయములో రాష్ట్ర ఎక్సయిజు సుంకాల వాటా మాత్రం 14.4% దగ్గరే నిలిచిపోయింది. మోటారు వాహనాలపై పన్ను, స్టాంపులు, రిజిస్ట్రేషను ఫీజుల యొక్క వాటా 5.5% వద్ద పూర్వపు స్థితిలో యుండిపోయింది. భూమిశిస్తు తన వాటాగా 2.0% కల్గియుంటూ ప్రాధాన్యతను కోల్పోయింది. ఆ విధంగా ప్రత్యక్షపన్నుల వాటా (భూమిశిస్తు, స్టాంపులు, రిజిస్ట్రేషను ఫీజు) 1950-51 లో 34% నుండి 1984 -85 లో 7.5% కు దిగజారింది.

### 13.7.3 ఆంధ్రప్రదేశ్ యొక్క పన్ను రాబడులు

ఆంధ్రప్రదేశ్ యొక్క పన్ను వ్యవస్థ ఇంచుమించు ఇతర రాష్ట్రాల పన్ను వ్యవస్థలతో సరిపోలుతుంది. పరోక్షపన్నులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోగా, ప్రత్యక్షపన్నులు మాత్రం అతి తక్కువ వాటా కల్గి వున్నాయి. ఉదాహరణకు 1983-84 సం॥పు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్ లో పరోక్ష పన్నుల వాటా, రాష్ట్రం యొక్క సొంత పన్ను రాబడిలో 93.6% గా వున్నది. అయినప్పటికీ మొత్తం రాష్ట్రాల పన్ను వ్యవస్థతో పోల్చి చూసినపుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమ్మకం పన్నులో తక్కువ వాటాను, రాష్ట్ర ఎక్సయిజు సుంకాలు మోటారు వాహనాల పన్నులలో ఎక్కువ వాటాను కల్గి వున్నది.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి - 2**

---

1. పన్ను వ్యాకోచత అంటే ఏమిటి?
2. పన్ను ప్లవనశీలత అంటే ఏమిటి?
3. కేంద్రప్రభుత్వ పన్నులలో ముఖ్యమైన నాల్గు రకాలను తెలుపుతూ, కేంద్రంకు వచ్చే మొత్తం పన్ను రాబడిలో వాటి వాటి వాటాలను వ్రాయండి?
4. రాష్ట్ర ప్రభుత్వాల పన్నులలో ప్రధానమైన ఆరు రకాలను వ్రాస్తు, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం సొంత పన్ను రాబడిలో వాటి వాటి వాటాలను తెలపండి?



BRAOU

## 13.8 సారాంశము

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం రాబడిలో 70 నుండి 80 శాతం వరకు పన్నుల ద్వారా లభిస్తోంది. అందువల్ల పన్నులను రాబడి యొక్క ముఖ్యమైన వనరుగా భావించడం జరిగినది. కేంద్ర ఎక్సయిజు సుంకాలు, కస్టమ్స్ సుంకాలు కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నులలో ముఖ్యమైనవి. కేంద్రం మొత్తం రాబడిలో వాటి వాటా 75% మించి వుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పన్నులలో అమ్మకంపన్ను, రాష్ట్ర ఎక్సయిజు సుంకాలు, స్టాంపులు, రిజిస్ట్రేషనులు, మోటారు వాహనాల పన్ను, భూమిశిస్తు, వినోదపన్ను ప్రధానమైనవి. అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సయిజు సుంకాలు కలిసి రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే సొంత పన్ను రాబడిలో 70 శాతం కన్న ఎక్కువ సమకూరుస్తున్నాయి

ప్రభుత్వ రాబడి, ఖర్చులను వివరించు బడ్జెటులో కేపిటల్ బడ్జెటు, రెవిన్యూ బడ్జెటూ అనే రెండు అంగాలుంటాయి. పెట్టుబడి బడ్జెటు ఖర్చులో ఆస్తులపైన, ఋణాల చెల్లింపుల పైన చేసిన ఖర్చులు ఇమిడి వుంటాయి. రాబడిలో పెట్టుబడుల పై లాభాలు రెవెన్యూ బడ్జెటులోని మిగులు, ప్రభుత్వం చేసిన అప్పులు చేరి ఉంటాయి. రెవిన్యూ బడ్జెటులో పన్నులు, ఇతర మార్గాలద్వారా వచ్చే రాబడి మరియు ఈ రాబడి నుండి చేసిన ఖర్చు ఇమిడి వుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ బడ్జెటులో సహాయ ప్రదానము (grants in - aid) కూడా చేరి వుంటుంది.

క్రమేపి పరోక్ష పన్నుల వాటా పెరుగుతూ వచ్చింది. ఇటీవల ఆ పెరుగుదల 80% అధిగమించింది. కేంద్ర ప్రభుత్వ పన్ను వ్యవస్థను పరిశీలించినపుడు ఆదాయ పన్ను కార్పోరేషను పన్ను తరువాత స్థానానికి తోసివేయబడుట గమనిస్తాం. రాష్ట్ర ప్రభుత్వాల విషయంలో అమ్మకం పన్ను వాటా అత్యధికంగా పెరగ్గా, భూమి శిస్తు వాటా తగ్గిపోయి నామమాత్రంగా మిగిలింది.

## 13.9 సంప్రదింపు గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | Hugh Dalton | : | Public Finance |
| 4. | తెలుగు అకాడమి | : | పబ్లిక్ ఫైనాన్స్ |


## 13.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. భారత ప్రభుత్వ పన్నుల వ్యవస్థను పరిశీలించండి?
2. భారతదేశంలోని రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థను గూర్చి విశదీకరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. భారతప్రభుత్వ పన్నుల నిర్మాణంలోని ముఖ్యమైన పోకడలు ఏమిటి.
2. భారతదేశంలోని రాష్ట్రాల పన్నుల నిర్మాణం లోని పోకడలను గూర్చి విశదీకరించండి.
3. పన్నుల రాబడి యొక్క వ్యాకోచత మరియు ప్లవన శీలతల అర్థమును వివరిస్తూ, వాటి మధ్య గల భేదాను విశదీకరించండి.

●●●



BRAOU

## పట్టిక – 1
## భారతదేశంలోని పన్నుల రాబడి – పెరుగుదల

( కోట్ల రూ॥లలో)

| సంవత్సరము | ప్రత్యక్ష పన్నుల మొత్తము + | పరోక్ష పన్నుల మొత్తము = | మొత్తము పన్నుల రాబడి = | కేంద్ర పన్నులు + | రాష్ట్ర ప్రభుత్వ పన్నులు | స్థూల జాతీయోత్పత్తిలో పన్నుల శాతం |
|---|---|---|---|---|---|---|
| 1950-51 | 231 (36.8) | 396 (63.2) | 627 (100) | 05 (64.6) | 222 (35.4) | 6.8 |
| 1960-61 | 402 (29.8) | 948 (70.2) | 1,350 (100) | 895 (66.3) | 455 (33.7) | 9.6 |
| 1970-71 | 1,009 (21.2) | 3,743 (78.8) | 4,752 (100) | 3,207 67.5) | 1,545 (32.5) | 13.0 |
| 1979-80 | 3,096 (17.5) | 14,587 (82.5) | 17,683 (100) | 11,974 (67.7) | 5,709 (32.6) | 18.8 |
| 1981-82 | 4,133 (17.1) | 20,009 (82.9) | 24,142 (100) | 15,847 (65.6) | 8,295 (34.4) | 18.3 |
| 1984-85 | 4759 (13.8) | 29720 (86.2) | 34479 | 22219 (64.4) | 12260 (35.6) | 16.3 |
| సాలుసరి వృద్ధి రేటు (1950 – 51 నుండి 1984 -85 వరకు) | 9.03 | 13.13 | 12.13 | 12.12 | 12.14 | |

గమనిక : బ్రాకెట్లలోని అంకెలు శాతాన్ని సూచిస్తాయి.

BRAOU

## పట్టిక – 2

### కేంద్ర ప్రభుత్వ పన్నుల వ్యవస్థ (స్థూల పన్నుల రాబడి)

(కోట్ల రూపాయలలో)

| వివరణ | 1950-51 | 1960-61 | 1970-71 | 1980-81 | 1983-84 | 1984-85 | 1985-86 (RE) | 1986-87 (BE) |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. పన్నుల రాబడి (స్థూలంగా) | 405 | 895 | 3,207 | 13180.0 | 20722.0 | 23470.59 | 28469.61 | 30907.27 |
| 2. కార్పోరేషన్ పన్ను | 40 (9.88) • | 111 (12.40) | 370 (11.54) | 1310.8 (9.9) | 2492.7 (12.0) | 2555.90 (10.89) | 3118.00 (10.90) | 3123.00 (10.10) |
| 3. ఆదాయంపై పన్ను (కార్పోరేషన్ పన్ను మినహా) | 133 (32.84) | 167 (18.66) | 473 (14.75) | 1506.4 (11.4) | 1699.1 (8.2) | 1927.76 (8.21) | 2397.00 (8.42) | 2588.00 (8.37) |
| 4. కేంద్ర ఎక్సైజ్ సుంకాలు | 68.0 (16.79) | 416 (46.48) | 1759 (54.85) | 6500.0 (49.3) | 10221.8 (49.3) | 11150.84 (47.51) | 12920.02 (45.38) | 14066.81 (45.51) |
| 5. కస్టమ్స్ సుంకాలు | 155 (37.27) | 168 (18.77) | 490 (15.28) | 3409.3 (25.9) | 5583.4 (26.9) | 7040.52 (30.00) | 9296.00 (32.65) | 10404.10 (33.66) |
| 6. సంపదపై పన్ను | - | 8.0 (0.89) | 15.0 (0.47) | 67.4 (0.5) | 93.3 (0.4) | 107.58 (0.46) | 110.00 (0.39) | 100.00 (0.32) |
| 7. ఎస్టేట్లపై పన్ను | - | 3.00 (0.34) | 8.00 (0.12) | 16.3 (0.1) | 26.5 (0.1) | 24.37 (0.1) | 23.50 (0.08) | 15.00 (0.05) |

*గమనిక : మొత్తము పన్ను రాబడిలోని శాతాన్ని బ్రాకెట్లలోని అంకెలు సూచిస్తాయి.*

## పట్టిక – 3

## రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థ

(కోట్ల రూపాయలలో)

| సంవత్సరము | అమ్మకపు పన్ను | రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు | భూమిశిస్తు | స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ | మోటారు వాహనాలపై పన్ను |
|---|---|---|---|---|---|
| 1950-51 | 55.79 (25.13) | 47.34 (21.31) | 49.58 (22.33) | 26.02 (11.72) | 8.48 (3.82) |
| 1960-61 | 143.00 (31.43) | 53.10 (11.67) | 97.00 (21.32) | 43.30 (9.52) | 34.00 (7.47) |
| 1970-71 | 562.00 (36.38) | 193.00 (12.55) | 113.00 (7.31) | 122.00 (7.90) | 105.00 (6.80) |
| 1975-76 | 1944.00 (54.41) | 436.00 (12.03) | 230.00 (6.44) | 217.00 (6.07) | 203.00 (5.68) |
| 1982-83 అకౌంట్స్ | 5496.0 (57.9) | 1343 (14.2) | 189 (2.0) | 590 (6.2) | 531 (5.6) |
| 1984-85 | 7060.16 (57.59) | 1839.31 (15.0) | 281.80 (2.30) | 702.74 (5.73) | 700.34 (5.71) |
| 1985-86 (RE) | 8250.52 (57.71) | 2097.44 (14.67) | 299.40 (2.09) | 804.71 (5.63) | 836.47 (5.85) |
| 1986-87 (BE) | 9361.71 (58.20) | 2313.39 (14.38) | 319.18 (1.98) | 883.26 (5.49) | 931.35 (5.79) |

BRAOU

## పట్టిక – 4
## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెటు

(కోట్ల రూపాయలలో)

| వివరణ | 1983-84 అకౌంట్స్ | 1985-86 అకౌంట్స్ | 1986-87 RE | 1987-88 BE |
|---|---|---|---|---|
| రాష్ట్రం యొక్క స్వంత పన్నుల రాబడి | 967.30 | 140.79 | 1671.72 | 2096.78 |
| ఆదాయ, వ్యయాలపై పన్ను-కేంద్రం నుంచి వాటా | 94.00 | 151.18 | 176.84 | 192.22 |
| యూనియన్ ఎక్సైజ్ నుండి రాష్ట్ర ప్రభుత్వ వాటా | 312.39 | 428.20 | 479.09 | 515.86 |
| రాష్ట్ర ప్రభుత్వ మొత్తం పన్నుల రాబడి (1+2+3) | 1373.69 | 2020.17 | 2327.65 | 2804.86 |
| రాష్ట్ర ప్రభుత్వ మొత్తం పన్నుల ద్వారాకాక ఇతర రాబడి | 309.42 | 390.48 | 503.68 | 501.57 |
| కేంద్ర ప్రభుత్వం నుండి లభించే గ్రాంట్లు | 270.24 | 362.55 | 485.44 | 409.33 |
| మొత్తం రాబడి ( 4+5+6) | 1953.35 | 2773.20 | 3316.77 | 3715.76 |
| మొత్తం రాబడిలో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల రాబడి శాతం | 49.52 | 51.95 | 50.40 | 56.43 |
| మొత్తం రాబడిలో ఆదాయ మరియు వ్యయాలపై పన్నుల శాతం | 4.81 | 5.45 | 5.33 | 5.17 |
| మొత్తం రాబడిలో యూనియన్ ఎక్సైజ్ సుంకాల నుండి రాష్ట్ర ప్రభుత్వ వాటా శాతము | 15.99 | 15.44 | 14.44 | 13.88 |
| మొత్తం రాబడిలో కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే గ్రాంట్ల శాతము | 13.83 | 13.07 | 14.64 | 11.02 |
| మొత్తం రాబడిలో మొత్తం పన్నుల ద్వారా కాక ఇతర రాబడి శాతము | 15.84 | 14.08 | 15.18 | 13.50 |
| రాష్ట్రము యొక్క సొంత పన్నుల రాబడి | 967.30 | 1440.79 | 1671.72 | 2096.78 |
| అందులో.. | | | | |
| అమ్మకపు పన్ను | 496.73 | 761.33 | 920.00 | 1208.00 |
| రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు | 282.48 | 416.77 | 436.00 | 492.00 |
| మోటారు వాహనాలపై పన్ను | 79.78 | 112.53 | 127.25 | 185.00 |
| సరుకులపైనను మరియు సేవలపైనను పన్నుల మొత్తము | 905.05 | 1346.91 | 1571.13 | 1976.89 |
| భూమి శిస్తు | 14.47 | 21.23 | 20.00 | 25.50 |
| స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ ఫీజు | 45.22 | 69.26 | 78.19 | 92.07 |
| (ఆస్తులపైన మూలధన లావాదేవీలపై లభించే మొత్తం పన్నులు) | 62.24 | 93.87 | 100.60 | 119.89 |

RE : సవరించబడిన అంచనాలు

BE : బడ్జెట్ అంచనాలు

BRAOU

# భాగం – 14 : ముఖ్యమైన ప్రత్యక్ష పన్నులు

విషయక్రమం


14.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
14.1 పరిచయం
14.2 ఆదాయ పన్ను
    14.2.1 చరిత్ర
    14.2.2 వ్యవసాయ, వ్యవసాయేతర ఆదాయ పన్నులు
    14.2.3 పన్ను ప్రాతిపదిక
    14.2.4 ఎవరిపై పన్ను విధించాలి?
    14.2.5 మినహాయింపులు – పన్ను విధింపు రేట్లు
    14.2.6 సూపర్ టాక్సు
    14.2.7 1965 తర్వాత వచ్చిన మార్పులు
    14.2.8 పన్ను రాబడి
    14.2.9. ఆదాయపన్ను వ్యాకోచత మరియు ప్లవనశీలత
    14.2.10 పురోగామిత్వము
    14.2.11 ఆదాయ పన్ను ఎగవేత
    14.2.12 వ్యయ పన్ను
14.3 కార్పొరేషను పన్ను
    14.3.1 హేతుబద్ధత
    14.3.2 చరిత్ర
    14.3.3 లక్షణాలు
    14.3.4 అంతిమ భారము
    14.3.5 1985-86 బడ్జెటు, డిశెంబరు, 1985 నాటి దీర్ఘ కాలిక కోశ విధానము
14.4 సంపద పన్ను
    14.4.1 హేతుబద్ధత
    14.4.2 చరిత్ర
    14.4.3 మినహాయింపులు
    14.4.4 పన్ను రేట్ల నిర్మాణం
    14.4.5 రాబడి ప్రాధాన్యత
14.5 సారాంశము
14.6 సంప్రదింపు గ్రంథాలు
14.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 14.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతప్రభుత్వం విధించు ప్రత్యక్షపన్నులలో ఆదాయపన్ను, కార్పొరేషను పన్ను, సంపద పన్నుల స్వభావాన్ని ప్రాతిపదిక మరియు రేట్ల నిర్మాణాలను ఈ భాగం పరిశీలిస్తుంది.

BRAOU

ఈ భాగం చదివిన తరువాత, మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

- ఆదాయ పన్ను చరిత్ర, లక్ష్యాలు, ప్రాతిపదిక, మినహాయింపులు, రేట్ల నిర్మాణం
- కార్పొరేషను పన్ను హేతుబద్ధత, చరిత్ర, లక్షణాలు, భారము, రేట్ల నిర్మాణం
- సంపద పన్ను హేతుబద్ధత, చరిత్ర, మినహాయింపులు, రేట్ల నిర్మాణం

## 14.1 పరిచయం

భారతదేశంలోని ప్రత్యక్ష పన్నులలో వైయుక్తిక ఆదాయ పన్ను, కార్పొరేషను పన్ను, సంపదపన్ను ప్రధానమైనవి. ఇందు వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషను పన్నుల వాటా ప్రత్యక్షపన్నుల మొత్తం రాబడిలో 90% కంటే ఎక్కువగా వుండగా, సంపద పన్ను వాటా 2% మాత్రమే వున్నది. క్రీ॥శ 1860లో ప్రప్రథమంగా ఆదాయపు పన్ను ప్రవేశపెట్టబడినది. వనరుల కేటాయింపులో సమానత్వాన్ని సామర్థ్యాన్ని సాధించడంలో ఆదాయపన్ను ప్రధానపాత్ర వహిస్తుంది. ఆదాయ పన్ను రాబడిలో రాష్ట్రాలకు వాటా వుంటుంది.

కార్పొరేషను పన్ను రాబడి పూర్తిగా కేంద్రానికే చెందుతుంది. పన్ను మదింపుకు యోగ్యమైన లాభాలపై కార్పొరేషను ఒకేరేటు (Flat rate) లో పన్ను చెల్లిస్తాయి. అంతేగాక వాటాదారులకు పంచే లాభాలపై కూడా నిర్ణీతరేట్లలో వాటాదారుల పక్షంగా ఆదాయం పన్నును కార్పొరేషను చెల్లిస్తుంది. సంపద పన్ను ప్రప్రథమంగా 1957 లో ప్రవేశపెట్టబడింది. వ్యక్తుల మరియు హిందూ అవిభక్త కుటుంబాల నికరసంపదలపై ఈ పన్ను విధిస్తారు.

## 14.2 ఆదాయపన్ను

### 14.2.1 చరిత్ర

ఆదాయపుపన్ను క్రీ.శ. 1857 లో జరిగిన తిరుగుబాటు వల్ల ఏర్పడిన ఆర్థిక వత్తిడులను తట్టుకునేందుకు 1860లో సర్ జేమ్స్ విల్సన్ తాత్కాలిక చర్యగా ఆదాయపుపన్నును ప్రవేశపెట్టాడు. ఈ పన్నును వ్యవసాయ ఆదాయంపైనా వ్యవసాయేతర ఆదాయంపైనా కూడా విధించారు. ఈ పన్ను క్రీ. శ. 1865లో తీసివేయబడింది. తిరిగి క్రీ.శ. 1886లో శాశ్వత ప్రాతిపదికపై తిరిగి ప్రవేశపెట్టబడింది. వ్యవసాయాదాయం అప్పట్లో వ్యవసాయాదాయంపై ఒక ప్రత్యేకమైనసెస్సు ను విధించి ఉండడమే. కాలక్రమేణా వ్యవసాయాదాయంపై విధించియుండిన సెస్సు ను తొలగించి నప్పటికే ఆదాయపు పన్నును మాత్రం వ్యవసాయాదాయంపై విధించలేదు. క్రీ.శ. 1919 వ సంవత్సరపు సంస్కరణల ప్రకారం ఆదాయ పన్ను కేంద్ర ప్రభుత్వ విషయంగా పరిగణించబడింది. దీని తర్వాత కొద్ది సంవత్సరాలకే క్రీ.శ. 1922 వ సంవత్సరపు ఆదాయపు పన్ను చట్టం అమలులోకి వచ్చింది. ఈచట్టం సుమారు 40 సంవత్సరాలు అమలులో ఉంది. తర్వాత ప్రస్తుతం అమలులో ఉన్న క్రీ.శ. 1961వ సంవత్సరపు ఆదాయపు పన్ను చట్టం అమలులోకి వచ్చింది.

ఈ చట్టాన్ని తేవటానికి ప్రధానమైన కారణాలు.

1. క్రీ.శ. 1958 వ సంవత్సరపు లా కమీషన్ సిఫారసులు.

2. ప్రత్యక్ష పన్నులపరిపాలన సంబంధమైన విచారణా సంఘం - (Direct Taxes Administration Enquiry Commission) మహావీర్ త్యాగి కమిటి సిఫారసులు.

1.4.1961 నుంచి ఈ చట్టం అమలులోనికి వచ్చింది. కాని తర్వాత ఈ చట్టం ఎన్నో మార్పులకు లోనయింది. అయినప్పటికి ఈ చట్టం సులభం గాను సుభోదకంగాను లేదు. అనేక క్లిష్ట సమస్యలు ఇమిడి ఉన్నాయి. కోర్టు వ్యాజ్యాలు కూడ పెరిగాయి. అందువల్ల భారత ప్రభుత్వం ఈ ప్రత్యక్ష పన్నుల చట్టాలను తిరిగి వ్రాయుటకునిర్ణయం చేసింది. ప్రత్యక్షపన్నుల చట్టాలను మార్పు చేసినప్పుడు ఆదాయపు పన్ను చట్టంలో కూడా మార్పులు వస్తాయి. ఈ మార్పుకు ముఖ్యమైన ఉద్దేశాలను ఈ విధంగా తెల్పవచ్చు.

### 14.2.2 వ్యవసాయ, వ్యవసాయేతర ఆదాయపన్నులు

క్రీ.శ. 1950 వ సంవత్సరపు రాజ్యాంగాన్ననుసరించి వ్యవసాయదాయంపై పన్నువిధించే అధికారం రాష్ట్రాలకు మాత్రమే కలదు. కాని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాదాయంపై పన్ను విధించుట లేదు. అందువలన పన్ను విధింపు ప్రాతిపదికలోని ఒక ముఖ్యమైన భాగం ఆదాయపు పన్ను ప్రాతిపదికనుండి తొలగింపబడింది. అయినప్పటికి వ్యవసాయాదాయము సంపదలపై పన్నులకు సంబంధించిన కమిటీ (Committee on the taxation of Agricultural income and wealth) కె.యన్.రాజ్ కమిటీ వారి సిఫారసులననుసరించి క్రీ.శ. 1973వ సంవత్సరపు ఫైనాన్స్ చట్టంలోకొన్ని మార్పులను ప్రవేశపెట్టారు. ఈ మార్పులు 1974-75వ సంవత్సరంనుంచి అమలులోకి వచ్చాయి. వ్యవసాయేతర ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయపు పన్నురేట్లను నిర్ణయించుటకు ఆయా వ్యక్తుల వ్యవసాయాదాయాన్ని కూడా పరిగణనకు తీసుకొనబడును. అనగా మినహాయింపు స్థాయి (exemption limit) కి మించిన వ్యవసాయేతర ఆదాయం కల వ్యక్తులు పన్ను చెల్లించవలసివచ్చినపుడు వ్యవసాయాదాయాన్ని వ్యవసాయేతర ఆదాయాన్ని కలిపి తీసుకొంటారు. ఈ సమిష్టి ఆదాయంపై పన్ను రేటు నిర్ణయించి ఆ ప్రకారం వ్యవసాయేతర ఆదాయంపై పన్ను విధిస్తారు. ఈ విధంగా వ్యవసాయాదానికి వ్యవసాయేతర ఆదాయానికి మధ్య ఏర్పడిన ఈ పాక్షిక ఏకీకరణ వలన వ్యవసాయాదాయం వ్యవసాయేతర ఆదాయం రెండూ కల్గిన వ్యక్తులపై పన్ను 1973వ సంవత్సరంలో కంటె హెచ్చు రేటులో విధింపబడుతుంది. కాని ఇందువలన కూడా వ్యవసాయేతర ఆదాయం మాత్రమే కల వ్యక్తికీ, వ్యవసాయ ఆదాయం, వ్యవసాయేతర ఆదాయం రెండూ కల్గిన వ్యక్తికి మధ్య పన్ను చెల్లించుటలో సమానత్వం ఏర్పడుటలేదు. వీరిద్దరి ఆదాయ స్థాయి ఒకటే అయినప్పటికి మొదటివాడు రెండవవాడి కన్న హెచ్చు పన్నుచెల్లిస్తాడు. అయినప్పటికి వ్యవసాయాదాయంపై పన్ను విధించే ఉద్దేశమే లేదని భారత ప్రభుత్వ ఆర్థిక శాఖామాత్యులు 19.12.1985 తేదీన చేసిన దీర్ఘకాలిక కోశ విధానపు ప్రకటనలో తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వపు ఆలోచన విధానాన్ని ఈ విషయంలో విశదీకరిస్తూ ఆర్థిక శాఖామాత్యులు ఈ విధంగా ప్రకటించారు. వైయక్తిక ఆదాయపు పన్ను విధింపు ప్రాతిపదికలోవ్యవసాయాదం చేరకుండుట ఒక గొప్ప లోపమని సాధారణంగా చెప్తారు. వైయుక్తిక ఆదాయపు పన్ను రాబడి తగినంతగా పెరగకుండా ఉండుటకు ఇదే ప్రధానకారణమని అంటారు. కానీ వ్యవసాయాదాయంపై పన్ను విధించుటలో పరిపాలనా సంబంధమైన, భావనాపరమైన ఇబ్బందులు ఎన్నో ఎదురవుతాయి. అంతేకాక భూమి శిస్తు, వ్యవసాయదాయంపై పన్నులు రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అంశాలు అందుకే మార్పు తీసుకురావలనే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదు.

### 14.2.3 పన్ను ప్రాతిపదిక

#### దేనిపై పన్నువిధించాలి?

భారతదేశపు ఆదాయపు పన్ను చట్టంలో ఆదాయం అనే పదానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. కానిఆదాయ మార్గాలను ఆదాయాన్ని ఏవిధంగా లెక్కించాల్సింది మాత్రం ఇందులో సూచించారు. ఆదాయమంటే వేతనాలు సెక్యూరిటీలపై వడ్డీలు స్వగృహాల మీద వచ్చే ఆదాయం, వ్యాపారం ద్వారా వచ్చే లాభాలు, మూలధన

ఆదాలు, యజమానులనుండి లభించే ప్రయోజనాల విలువ, లాటరీల ద్వారా వచ్చే ఆదాయం మొదలగునవి. ఆదాయపు పన్ను చట్టం క్రింద పన్ను చెల్లింపు దారుడు తన మొత్తం ఆదాయంపై పన్ను చెల్లించాలి. పైన పేర్కొన్న మార్గాలలో ఏ మార్గం ద్వారా ఆదాయం వచ్చినా (పన్ను విధింపు నుండి మినహాయింపబడితే తప్ప) మొత్తం ఆదాయంపై పన్ను చెల్లించాలి.

### 14.2.4 ఎవరిపై పన్ను విధించాలి ?

ఒక భారతీయుడు అతడి దేశీయ ఆదాయంపైన, విదేశీ ఆదాయంపైన పన్నును చెల్లించాలి. భారతదేశంలో సంపాదించిన ఆస్తిని భారతీయ ఆస్తి అని, ఇతర దేశాలలో సంపాదించిన ఆస్తిని విదేశీ ఆస్తి అని అనవచ్చు. సాధారణంగా భారతీయుడు కాని వ్యక్తి యొక్క విదేశీ ఆదాయంపై కొన్ని పరిస్థితులలో తప్ప పన్ను విధింపబడదు. ప్రవాస భారతీయుడి దేశీయ ఆదాయంపై మాత్రమే పన్ను విధిస్తారు. వ్యక్తిగత ఆదాయపుపన్ను చట్టం ప్రకారం అందరు వ్యక్తుల, ఉమ్మడి హిందూ కుటుంబాల రిజిస్టర్ కాని సంస్థల, ఇతర ప్రజాసంఘాల నికర ఆదాయాలు పన్నుల పరిధిలోకి వస్తాయి. సహకార సంస్థలు మత సంస్థలు చారిటీ ట్రస్ట్‌లు, కొన్ని ఇతర సంస్థలు ఆదాయపు పన్ను పరిధినుండి మినహాయింపబడుతాయి.

### 14.2.5 మినహాయింపులు – పన్ను విధింపు రేట్లు

వనరుల కేటాయింపు దృష్ట్యాను సమానత్వం దృష్ట్యాను ఆదాయపు పన్నును ముఖ్యమైన పన్నుగా పరిగణిస్తారు. సమానత్వ సూత్రం దృష్ట్యా పన్ను చెల్లింపు విషయంలో అందరినీ ఒకే విధంగా చూడవలెను. ఆర్థిక సామర్థ్యం ఎక్కువ ఉన్నవారు తక్కువ ఉన్నవారికంటె హెచ్చుగా పన్ను చెల్లించాలి. ఒకే రకమైన ఆర్థిక స్థాయిలో ఉన్నవారు సమానంగా పన్ను చెల్లించాలి. వివిధములైన ఆర్థిక స్థాయిలలో ఉన్నవారు పన్నును భిన్నమైన రేట్లలో చెల్లించాలి. ఈ విధమైన సమానత్వ సూత్రానికి వీలు కల్పించేది ఆదాయపు పన్ను. ఒక స్థాయికంటె తక్కువ ఆదాయంగల వ్యక్తులను పన్ను విధింపునుండి మినహాయిస్తారు. కొన్ని ప్రత్యేకమయిన పరిస్థితుల్లోపన్ను చెల్లింపు నుండి రాయితీ ఇస్తారు. చెల్లింపు రేట్లను తగ్గిస్తారు లేదా అలవెన్సుల నిస్తారు. ఆధునిక యుగంలోని పన్నులలో పన్ను విధింపు రేట్లలో పురోగామిత్వము చాలమందికి ఆమోదకరమైన సూత్రము. అంతేగాక పురోగామిత్వము గల ఆదాయపు పన్నుద్వారా ఆర్థిక అసమానతలనుతగ్గించవచ్చును.

పన్నుచెల్లింపుకు మినహాయింపు స్థాయిలు కాని, పన్ను చెలింపు రేట్లు కాని ఆదాయపు పన్ను చట్టంలో నిర్దేశించబడలేదు.వాటిని ప్రతి సంవత్సరము బడ్జెట్ సమావేశ సమయంలో ప్రతిపాదిస్తారు. అవి ఫైనాన్స్ చట్టంలో భాగంగా ఏర్పడుతాయి. పన్ను చెల్లింపుదారు స్థితి (Status) ని బట్టి పన్ను చెల్లింపు రేట్లు, మినహాయింపు స్థాయిలు మారుతూవుంటాయి. సాధారణంగా ఒక సగటు కుటుంబానికి కనీస జీవితావసరాలు తీరుటకు అవసరమైన మొత్తాన్ని పరిగణలోకి తీసుకొని మినహాయింపు స్థాయిని నిర్ణయిస్తారు. దీనినే 'పన్ను చెల్లింపనవసరము లేని స్లాబ్ (Slab) అని అంటారు. క్రీ.శ 1939 వ సంవత్సరము నుండి ఆదాయపు పన్నును స్లాబ్ పద్ధతిలో విధిస్తున్నారు. అంతకు పూర్వమున్న పద్ధతిని 'స్టెప్ (Step) పద్ధతి' అంటారు. మొత్తం ఆదాయంతో నిమిత్తం లేకుండా వివిధ స్లాబ్ లకు చెందిన ఆదాయ వర్గాలవారు పన్నును ఒకే రకంగా చెల్లించవలెను. పై స్లాబ్ లకు పోయే కొద్దీ హెచ్చు రేట్లలో పన్ను చెల్లించాలి. వివిధ స్లాబ్ లోని పన్ను చెల్లింపు రేట్లను "ఉపాంత పన్ను రేట్లు" అంటారు. మొదటి స్లాబ్ లో చెల్లించవలసిన పన్ను రేటు ధనికులకైననూ, ధనికులు కాని వారికైననూ ఒకే రకంగా ఉంటుంది. కానిధనికులు ఉన్నత స్థాయి స్లాబ్ లకు చేరుతూ హెచ్చు రేట్లలో పన్ను చెల్లిస్తారు. అందువలన విభిన్న వ్యక్తుల మధ్య సగటు పన్ను రేటు, T/Y (మొత్తం 'చెల్లించిన పన్నును మొత్తం ఆదాయంతో భాగిస్తారు), విభిన్నంగా ఉంటుంది. ధనికులకు ఇది హెచ్చుగా ఉంటుంది. ధనికులు కాని వారికి అంత హెచ్చుగా ఉండదు. మూడో పట్టిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

#### 14.2.6 సూపర్ టాక్సు (Super Tax)

1917-1965 సంవత్సరాల మధ్యకాలంలో ఆదాయాలపై భారతప్రభుత్వం రెండు రకాల పన్ను విధించేది. (1) ఆదాయ పన్ను (2) సూపర్ టాక్సు. 1965వ సం॥లో పన్ను లెక్కలను సరళం చేసే పుద్దేశంతో ఆదాయపన్నులో సూపర్ టాక్సును విలీనం చేశారు. ఆదాయపన్నుకు లోనయ్యే అదిక ఆదాయాలపై అదనంగా వేసే పన్నును "సూపర్ టాక్సు " (Super Tax) అంటారు . ఈ పన్నును ప్రప్రథమంగా 1917 లో యద్ధకాలంలో ఏర్పడ్డ వనరుల ఆవశ్యకతదృష్ట్యా విధించారు. కంపెనీలను మినహాయించి ఇతర ఆదాయపన్ను చెల్లింపుదార్లపై ఈ పన్ను విధించారు. ప్రారంభం నుండి సూపర్ టాక్సును శ్లాబ్ పద్ధతిలోనే విధించేవారు.

జాయింట్ స్టాక్ కంపెనీల ఆదాయంపై కూడా రెండు రకాల పన్నులను విధించేవారు (1) ఆదాయ పన్ను(2) కార్పోరేషన్ పన్ను. క్రీ.శ. 1965వరకు కంపెనీలపై విధించే పన్నుగా దీనిని వ్యవహరించేవారు. 1965లో కంపెనీలపై విధించే సూపర్ టాక్సును ఆదాయపు పన్నులో విలీనం చేసి సంయుక్తంగా పన్ను రేట్లను విధించారు.

కంపెనీల ఆదాయంపై ప్రస్తుతం విధించే కార్పొరేషన్ పన్ను వాస్తవానికి 1965కు పూర్వం విడివిడిగా విధింపబడిన ఆదాయపన్ను, కంపెనీల ఆదాయ పన్నుల కలయిక మాత్రమే.

#### 14.2.7 1965 తర్వాత వచ్చిన మార్పులు

1965-1985 సంవత్సరాల మధ్య పన్ను విధింపు మినహాయింపు స్థాయిలలోను (పన్ను లేని శ్లాబ్ స్థాయి), పన్ను విధింపు రేట్లలో అనేక మార్పులు వచ్చాయి. 1966-67 నుండి 1969-70 వరకు పన్ను విధింపు మినహాయింపు స్థాయి (ఒకరికంటె ఎక్కువ మంది పిల్లలు కలిగివున్న వివాహిత వ్యక్తులకు) సంవత్సరానికి రూ.4,000/-గా ఉండేది. 1970-71లో ఈ మినహాయింపు స్థాయి రూ.5,000/- కు పెంచబడింది. పన్ను విధింపు మినహాయింపు స్థాయిని 1974-75లో రూ.6,000/-కు, 1980-81లో రూ.12,000/- పెంచినప్పటికి పన్ను విధింపుకు లోనుకాని మినహాయింపు స్థాయి (Zero Tax Slab) మాత్రం 1981-82 వరకు రూ.8,000/- మాత్రమే ఉండేది. మినహాయింపు స్థాయిలను తర్వాత కాలంలో అనగా 1981-82లో రూ. 15,000/-లకు, 1885-86లో రూ.18,000/- కు పెంచారు. మినహాయింపు స్థాయిని తరచుగా పెంచుటకుప్రధాన కారణం ద్రవ్యోల్బణం వల్ల రుపాయి విలువలోఏర్పడిన కోత. 1972-73 అసెస్మెంటు సంవత్సరం నుండి రూ.2,00,000/- కు మించిన ఆదాయంపై ఉపాంత ఆదాయ పన్ను రేటు 85% గా నిర్ణయింపబడింది. ఇదిగాక ఆదాయ పన్నుపై15% సర్ చార్జీ కూడ విధించేవారు. అందువలన రూ.2,00,000/- కు మించిన ఆదాయంపై గరిష్ఠ పన్ను రేటు 97.75%గా ఉండేది. (85% +15% of 85%).

ప్రత్యక్ష పన్నులకు సంబంధించిన "వాంఛూ కమిటి" అనబడే "డైరెక్ట్ టాక్సెస్ ఎంక్వయిరీ కమిటీ" వారు ఉపాంత పన్ను గరిష్ఠ రేటు 75% మించరాదని సిఫారస్ చేశారు. పన్ను రేటు 97.75% ఉన్నప్పుడు పన్ను ఎగవేతకు ఆకర్షణహెచ్చుగా ఉంటుంది. అంటే పన్ను ఎగవేయాలనే కోరికను నిరోధించటం కష్టమవుతుంది. జర్మనీ దేశంలో ఆర్థిక రంగంలో ఆశ్చర్యకరమైన అభివృద్ధికి కారణభూతుడైన లడ్విగ్ ఎర్హర్డ్, ఆర్థిక శాస్త్రవేత్త కాలిన్ క్లార్క్ మొదలైనవారు ఆదాయపన్ను విధింపు పన్ను విషయంలో గరిష్ఠ పన్ను రేటు 50% కుమించరాదని అభిప్రాయపడ్డారు. ఈ గరిష్ఠ పన్ను శాతం 45గా ఉండాలని కాల్డర్ వాదించాడు. భారతదేశంలోని నల్లధనంపై ఇటీవలనే నివేదికను సమర్పించిన అధ్యయనబృందం కూడా (Study Team on some aspects of the black money in india March - 1985) అమలులో ఉన్న ఆదాయపు పన్ను, సంపద పన్ను రేట్లు హెచ్చుగా ఉన్నట్లు అభిప్రాయబడింది. పన్ను విధింపు రేట్లు హెచ్చుగా ఉన్నపుడు అవి పన్ను ఎగవేతకు ప్రబలమైన ప్రోత్సాహాన్ని



BRAOU

కలుగజేస్తాయి. అందువలన కంపెనీ ఆదాయంపైనా, వైయక్తిక ఆదాయాలపైనా అమలులో ఉన్న ఆదాయపన్ను రేట్లనూ, సంపద పన్ను రేట్లనూ, స్టాంపు డ్యూటీలనూ, ఎస్టేట్ సుంకాల రేట్లనూ కేంద్ర ప్రభుత్వం బాగా తగ్గించాలని అధ్యయన బృందం వారు సూచించారు.

పన్ను రేట్లు హెచ్చుగా గాని, ఆదాయాలను పూర్తిగా హరించేటట్లు గాని ఉన్నప్పుడు పన్ను ఎగవేతకు ప్రలోభం హెచ్చుగా ఉంటుందనే వాదనలో ఉన్న బలాన్ని బహుశా గ్రహించి భారత ప్రభుత్వం వారు గరిష్ఠ ఉపాంత పన్ను రేటును 1974.75 లో 77% కు తగ్గించారు. (70% +10% Tax of 70%). రూ.1,00,000/-కు మించిన ఆదాయాలపై ఉన్న గరిష్ఠ ఉపాంత పన్నురేటును 1976-77 లో 66%కు తగ్గించారు. పన్ను చెల్లించే అలవాటును పెంపొందించాలనే ఉద్దేశంతో ఆదాయపు పన్నులో అంతర్భాగంగా ఉండే వ్యాకోచతను మెరుగుపరచడం కోసం దీర్ఘకాలిక కోశ విధానవ్యూహంలో భాగంగా 1985-86 బడ్జెట్ లో పన్ను రేట్లను మరింత తగ్గించారు. తరచుగా పన్ను రేట్లను మార్చుట వలన అనిశ్చయత పెరిగి పన్ను చెల్లించే అలవాటుకు ప్రోత్సాహము తగ్గిపోయి, పన్నును సమర్థంగా సేకరించడంలో పరిపాలనా సంబంధమైన చిక్కులు ఏర్పడి ఆర్థికాభివృద్ధి లక్ష్యానికే భంగం వాటిల్లే ప్రమాదం ఉందనే విషయాన్ని కేంద్ర ఆర్థికమంత్రి 19.12.1985 నాటి ప్రకటనలో తెలియజేశారు. అనిశ్చితను తొలగించి పన్ను రేట్ల విధింపులో ఒక స్థిరత్వాన్ని ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను రేట్లను కాని, సంపద పన్ను రేట్లను కాని కనీసం 5 సంవత్సరాల పాటు మార్చే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని ఆర్థిమంత్రి స్పష్టం చేశారు. వైయక్తిక ఆదాయపు పన్ను పై విధించే 12.5% సర్ చార్జీని కూడా 1985-86 బడ్జెట్ లో తొలగించారు. వివిధ రకాలైన పన్ను చెల్లింపుదార్లకు వర్తించే పన్ను రేట్లను పునర్వ్యవస్థీకరించబడిన పన్ను రేట్లు పూర్వపు పన్ను రేట్ల కంటె అన్ని స్థాయిల్లోను తక్కువగా ఉన్నాయి.

1989-90 వ సంవత్సరం నుండి వ్యక్తులకు, అవిభక్త హిందూ కుటుంబాలకు రిజిస్టరు కాని సంస్థలకు వర్తించే ఆదాయపు పన్ను రేట్లను క్రింది పట్టికలో చూపినాము.

| ఆదాయ వర్గము | ఆదాయ వర్గానికి చెందిన పన్ను రేటు |
|---|---|
| రూ. 22,000 వరకు | పన్ను లేదు |
| రూ. 22,001/- నుండి రూ. 30,000/- వరకు | 20% |
| రూ. 30,001/- నుండి రూ. 50,000/- వరకు | 30% |
| రూ. 50,001/- నుండి రూ. 1,00,00/- వరకు | 40% |
| రూ. 1,00,000/- కు పైన | 50% |

పై సుదహరించిన పన్ను రేట్లతో బాటుగా ప్రస్తుతం, రూ.70,000/-లు ఆదాయం మించిన వారిపై 12 శాతం సర్ చార్జి (surcharge) విధించుచున్నారు.

భవిష్యత్ సంవత్సరాలలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని, ఇతరముఖ్యమైన సంబంధింత అంశాలను పరిగణనలోనికి తీసుకొని పన్ను చెల్లింపుదారుల వర్గీకరణ బ్రాకెట్లను (పైన చూపిన) అవసరమైతే సర్దుబాటు చేస్తామనే విషయాన్ని ప్రభుత్వ దీర్ఘకాలిక కోశ విధానపు ప్రకటనలో స్పష్టం చేశారు.

### 14.2.8 పన్ను రాబడి

ఒకటో పట్టికలో ఆదాయ పన్ను రాబడిని ఇతర అన్ని ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే రాబడిని చూపినాము. ఆదాయపన్ను రాబడిలోని వృద్ధి రేటు కార్పొరేషన్ పన్ను రాబడిలోని వృద్ధిరేటు కన్నా తక్కువగా ఉన్నదనే



B R A O U

విషయం పట్టికద్వారా తెలుసుకోవచ్చు. ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే మొత్తం రాబడిలో ఆదాయపన్ను రాబడి శాతం తగ్గుచున్నదనే విషయం గమనించవచ్చు. ఈ శాతం 1950-51లో 75కాగా 1980-81 నాటికి 50కి, 1985-86 లో 38 కి తగ్గింది.

### 14.2.9 ఆదాయ పన్ను వ్యాకోచత ప్లవనశీలత

1960-61 నుండి 1978-79 వరకు గల మధ్య కాలంలో ఆదాయపుపన్ను వ్యాకోచత 0.88 మాత్రమే. ఇది ఆదాయ పన్ను అవ్యాకోచతను తెలుపుతోంది. కాని అదేసమయంలో ప్లవనశీలత గుణకం 1.14 గా ఉన్నది. కేంద్ర పన్నులన్నింటిలోని కార్పోరేషన్ పన్ను అత్యధిక ఆదాయ వ్యాకోచతను కలిగివుంది.

### 14.2.10 పురోగామిత్వము (Progressive)

1985 వ సంవత్సరము వరకు ఆదాయ పన్ను రేట్లు హెచ్చుగానే ఉన్నప్పటికీ పురోగామిత్వము గణనీయంగా లేనందువల్ల ఆదాయాల అసమానతలను తగ్గించే శక్తి తగినంతగా లేదని తెలుస్తుంది. పన్ను చెల్లింపునుండితప్పించుకొనుటకు గల అవకాశాలు, పన్ను ఎగవేతకు గల అవకాశాలు, పన్నుల సేకరణ సమర్థంగా లేకపోవడంతో బకాయిలు పేరుకుపోవడం మొదలైనవి ఆదాయ పన్నుకు అసమానతలను తగ్గించే శక్తిని లోపింప జేసే కారణాలు.

### 14.2.11 ఆదాయపన్ను ఎగవేత

ప్రభుత్వ విత్త విధానాల జాతీయ సంస్థ (National Institute of Public Finance and Policy) యొక్క అధ్యయన బృందముభారతదేశములోని నల్లధనానికి సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించి 1985 మార్చిలో తమ నివేదికను ప్రభుత్వానిక సమర్పించారు. పన్ను చెల్లింపు విషయంలో అమలులో ఉన్న సార్థకపు పన్ను రేట్లు హెచ్చుగా ఉండటమే పన్ను ఎగవేతకు ప్రధాన దోహదకారిగా ఈ అధ్యయన బృందం విశ్వసించింది. పన్ను విధింపు పరిధిలో వుండి కూడా సేకరణ అధికారుల దృష్టికి రాని ఆదాయాల మొత్తాన్ని "నల్ల ఆదాయం (Black Money) అంటారు. దీనిని "పన్ను ఎగవేయబడిన ఆదాయం" అని కూడా అంటారు. భారతదేశంలో ఉత్పన్న మైన నల్లధనం1975-76 సం॥లో రూ.9,950 కోట్ల నుండి రూ. 11,870 కోట్ల వరకు 1980-81 సం॥లో రూ.20,362 కోట్ల నుండి రూ.23,678 కోట్లవరకు ఉన్నట్లు అంచనా వేశారు. దేశీయ స్థూల జాతీయోత్పత్తిలో ఈ నల్లధనం శాతం 1975-76లో 15 నుండి 18 కాగా, 1980-81 లో 18, 21 మధ్య ఉంటుంది. 1983-84 సంవత్సరంలో భారతదేశంలో ఉత్పన్నమైన నల్లధనం సుమారు 37 వేలకోట్ల రూపాయలు అనీ, ఇది దేశీయ స్థూల జాతీయోత్పత్తిలో 18 శాతానికి తక్కువ ఉండదనీ అంచనా వేశారు. మదింపుకు వచ్చిన ఆదాయపన్ను మొత్తం ఆదాయంలో ఎగవేతకు లోనయ్యే ఆదాయాల మొత్తం 1975-76లో 57% నుండి 87% వరకు, 1980-81లో 68% నుండి 139% వరకు ఉన్నట్లు అంచాన వేశారు. ఆదాయపన్ను విధింపు దాని సేకరణకే సంబంధించిన యంత్రాంగము యొక్క సామర్థ్యము పై ఇది గొప్ప వ్యాఖ్యానము. నల్లధనం యొక్క ఉత్పత్తిని తగ్గించి, పన్నుల సేకరణను సమర్థవంతంగా చేయగలిగితే ఆదాయ పన్నువల్ల వచ్చే రాబడి ఎంత పెరుగ గలదో కూడా పై అంచనాలు సూచిస్తాయి. పన్ను ఎగవేతదార్లను శిక్షించడం పట్ల అవసరమైన రాజకీయ దృఢసంకల్పమే ఉంటే ఆదాయపన్ను వ్యాకోచత్వమూ ఉత్పాదకత గల పన్నుగా రూపొందడానికి సందేహం లేదు. ఇటీవల సంవత్సరాలలో ఆదాయ పన్ను బకాయిల సమస్య కూడ తీవ్రంగా పరిణమించినందువల్ల పన్ను సేకరణ యంత్రాంగం మరింత సమర్థంగా పనిచేయవలసిన అవసరం ఎంతైన కలదు.

### 14.2.12 వ్యయ పన్ను

ఆదాయపన్నుకు ప్రత్యామ్నాయంగా వ్యయపన్నును తరచు సూచిస్తుంటారు. పరిమితమైన రేట్లలోని ఆదాయపన్నుకు అనుబంధంగా వ్యయంపై పన్నును ప్రవేశపెట్టాలనే సూచనను ఇంగ్లాండ్ కు చెందిన పన్నుల నిపుణుడు నికోలస్ కాల్డార్ సూచించారు. పన్ను చెల్లింపు సామర్థ్యానికి ఆదాయంకంటె వ్యయం మెరుగైన సూచిక అనీ,దానిని సులభంగా నిర్వచించవచ్చనీ, వ్యయంపై పన్ను మంచిదని చెప్పినాడు. వ్యక్తుల అవిభక్త హిందూ కుటుంబాల వ్యయాలపై పన్నును భారత దేశంలో 1-4-1958న ప్రవేశపెట్టారు. కాని ఇది ఉత్పాదకతా దృష్ట్యా ఇతరకారణాల దృష్ట్యా చాలా మందికి అమోదయోగ్యం కాలేదు.కావున దీనిని 1962లో తొలగించారు. అయితే 1964లో తిరిగి ప్రవేశపెట్టి 1966 లో పూర్తిగా తొలగించారు. భారతదేశంలో వ్యయ పన్నుకు సంబంధించిన ప్రయోగము సఫలంకాకపోయినందున ఆదాయపన్నును మరింత పటిష్టమైన ఉత్పాదకమైన పురోగామి పన్నుగా రూపొందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

కేంద్రప్రభుత్వమే ఆదాయపు పన్నును విధించి, సేకరించినప్పటికి ఆదాయపు పన్నువల్ల వచ్చే నికర రాబడిలో రాష్ట్రాలకు వాటా ఇవ్వవలసిన అవసరం రాజ్యాంగ రీత్యా ఉంది. ప్రస్తుతం ఆదాయపు పన్ను నికర రాబడిలో 85% రాష్ట్రాలకు కేటాయిస్తున్నారు. పోగా మిగిలిన రాబడి కేంద్రానికి చెందుతుంది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ఆదాయ పన్ను ప్రప్రథమంగా ఎపుడు ప్రవేశపెట్టబడినది? దాని అవసరమేమి?
2. ఆదాయపన్ను ప్రాతిపదికను వివరింపుము?
3. సగటు పన్ను రేటుకు, ఉపాంత పన్ను రేటుకు గల తేడా ఏమిటి?
4. సూపర్ టాక్సు మొట్టమొదటిసారిగా ఎప్పుడు ప్రవేశపెట్టిరి? దాని ప్రస్తుత స్థితి ఏమిటి?
5. నల్లధనం అంటే ఏమిటి? భారతదేశంలో దాని పరిమాణంను గూర్చివివరింపుము?

---

### 14.3 కార్పొరేషన్ పన్ను

కార్పొరేషన్ పన్ను ప్రధానంగా భారతదేశంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన పన్ను రాష్ట్రాలకు ఇందులో వాటా లేదు. కార్పొరేషన్లకు (జాయింట్ స్టాక్ కంపెనీలకు) వచ్చే ఆదాయంపై విధించే పన్నును "కార్పొరేషన్ పన్ను" అంటారు. వ్యక్తుల ఆదాయంపై విధించే పన్నును, "వైయక్తిక ఆదాయపు పన్ను" అంటారు. దీనిని మనము ఇంతకు మునుపే పరిశీలించాము. కార్పొరేషన్ కు చట్టరీత్యా ప్రత్యేక అస్థిత్వము కలదు. తనసొంత పేరుతో ఇది వ్యాపారము చేసుకోవచ్చు. కార్పొరేషన్లకు వచ్చే లాభాలే ఈ పన్ను విధింపుకు మూలము. ఒక కంపెనీకి వచ్చిన ఆదాయన్ని ఆ కంపెనీ వాటాదార్లకు పంపిణీ చేయవచ్చు లేదా చేయకపోవచ్చు. కాని ఈ పన్నును కంపెనీలకు వచ్చే ఆదాయం పై విధిస్తారు. కార్పొరేషనును వాటాదార్లకు భిన్నమై ప్రత్యేకమైన అస్తిత్వంగల యూనిటుగా పరిగణిస్తారు. వాటాదార్ల జీవితాలతో సంబంధం లేక ప్రత్యేకమైన స్వతంత్రమైన అస్తిత్వం గలవి కార్పొరేషన్లు. కార్పొరేషన్ కు చెందిన వాటాదార్లు మారవచ్చు కానికార్పొరేషన్ మాత్రము మారనవసరము లేదు. కాబట్టి కార్పొరేషను తన కొచ్చే ఆదాయంపైపన్ను చెల్లిస్తున్న దే కాని, వాటాదారుల పక్షంగా వాటాదారు ఏజెంటుగా పన్ను చెల్లించడం లేదు.

BRAOU

### 14.3.1 హేతుబద్ధత

ఈ పన్ను విధింపుకు సంబంధించిన ఆర్థికపరమైన సమర్థన ఈ క్రింది వాదాలపై ఆధారపడి ఉన్నది.

i) ప్రయోజన సిద్ధాంతము ప్రత్యేక హక్కుల సిద్ధాంతము : జాయింట్ స్టాక్ కంపెనీలకు ప్రభుత్వపరంగా ఎన్నో ప్రయోజనాలందుతాయి. అందువల్ల వాటి ఉత్పత్తి ఖర్చు తగ్గవచ్చు. మార్కెట్లు విస్తృతము కావచ్చు, ద్రవ్య సంబంధమైన లావాదేవీలకు అవకాశం ఏర్పడవచ్చు కావున ప్రభుత్వం నుండి లభించిన సేవలకు ప్రతిఫలంగా కార్పొరేషన్ పన్నులు చెల్లించాలి.

ii) సంస్కరణ సాధనము : కంపెనీల ప్రవర్తనను క్రమబద్ధం చేయుటకు నియంత్రణ చేయుటకు కార్పొరేషన్ పై పన్ను అవసరము. ప్రత్యేకమైన రంగాలలో పెట్టుబడి పెట్టుటకు లేదా మానుటకు, సాధారణ పెట్టుబడులను పెంపొందించుటకూ, తగ్గించుటకూ అవసరమైన ప్రోత్సాహకాలనూ, అవరోధాలనూ కలిగించుటకు ఈ పన్నును ఉపయోగించవచ్చు.

iii) పన్ను చెలింపు సామర్థ్యానికి సంబంధించిన సూత్రము : పన్ను చెల్లింపు సామర్థ్యం గల వివిధ రకాలైన పన్ను చెల్లింపుదార్ల మధ్య అసమానతలను నిరోధించుటకు కార్పొరేషన్లపై ప్రత్యేకమైన పన్ను అవసరం.

iv) సామాజిక నియంత్రణ : సామాజిక వ్యయాల కేటాయింపులను మెరుగుపరచుటకేగాక, కంపెనీలపై సమర్థమైన సామాజిక నియంత్రణ ఉండునట్లు చేయుటకు కూడ కార్పొరేషన్లపై పన్ను అవసరము.

v) అనాదిగా వచ్చే పన్ను : కంపెనీల ఆదాయంపై ప్రత్యేకమయిన పన్ను విధించే పద్ధతి చాలా దేశాలలో చాలాకాలంగా ఉంది. భారతదేశ పన్నుల వ్యవస్థలో కూడా కార్పొరేషన్ పన్ను ప్రవేశించి అలానే ఉండిపోయింది.

BRAOU

కార్పొరేషన్ పై ఆదాయపన్ను భారతదేశంలో వైయుక్తిక ఆదాయాలపై పన్ను ఎంత పురాతనమో అంత పురాతనమైనది. కాని ఈ పన్ను పరిధికి సంబంధించి అనేకమైన మార్పులు కాలానుగతంగా వచ్చాయి. ఆదాయపు పన్ను చట్టం ప్రతి సంవత్సరం పార్లమెంటు ఆమోదం పొంది, ఫైనాన్స్ చట్టాలు కార్పొరేషన్ పన్నుకు సంబంధించిన విషయాలను నిర్దేశిస్తాయి.

లాభాలు వచ్చే కార్పొరేషన్లు మాత్రమే పన్ను విధింపుకు లోనవుతాయి. ఏదైనా ఒక చిన్న కార్పొరేషను భాగస్వామ్య సంస్థగా పరిగణింపబడాలని కోరుకుంటె దానిపై పన్నును ఆ విధంగానే విధిస్తారు. అప్పుడు ఆ సంస్థ కార్పొరేషన్‌పన్నును చెల్లించదు. కాని ఆ సంస్థకు వచ్చే మొత్తం ఆదాయంపై (భాగస్థుల ఆదాయంగా) వైయుక్తిక ఆదాయపు పన్ను చట్టం క్రింద పన్ను విధిస్తారు.

### 14.3.2 చరిత్ర

క్రీ.శ. 1917 వరకు కంపెనీలు ఆదాయ పన్నును మాత్రమే చెల్లించేవి. 1.4.1917 నుండికంపెనీల లాభాలపై స్లాబ్ పద్ధతిలో సూపర్ టాక్సును విధించారు. 1965 వ సంవత్సరపు ఫైనాన్స్ చట్టం సూపర్ టాక్సును ఆదాయపు పన్నును విలీనం చేసింది. ఈ విలీనం వల్ల ఏర్పడ్డ కార్పొరేషన్ పన్నును మొదట 80%గా ఉంచారు. అందులో నుండి వివిధ రకాలైన కంపెనీలకు, ఆదాయాలకు భిన్నమైన రేట్లలో రిబేట్లను ఇచ్చేవారు. 1966 వ

సంవత్సరపు ఫైనాన్స్ చట్టాన్ననుసరించి వివిధ్న కంపెనీలు చెల్లించాల్సిన పన్ను రేట్లను విభిన్నంగా నిర్ణయించారు. ఈ రేట్లు 45% నుండి 70% వరకు ఉండేవి. ఆటు తర్వాత అనేక పర్యాయాలు ఈ రేట్లను మార్చారు. ప్రస్తుతం అమలులో ఉన్న పన్ను రేట్ల షెడ్యూలును ఈ పాఠములో చూపాము.

### 14.3.3 లక్షణాలు

కార్పోరేషన్ పన్నుకు సంబంధించి ప్రధానమైన లక్షణాలు

1. పన్ను విధింపుకు లోనయ్యే ఆదాయాలపై కంపెనీ పన్నును ఒకే విధమైన రేటు (Flat rate) లో చెల్లిస్తుంది. ఈ పన్నును కంపెనీ పరంగా కడతారే కాని, వాటాదార్ల ఏజంట్లుగా కాదు.

2. వాటాదార్లకు చెల్లించే లాభాంశాల (డివిడెండ్ల) పై నిర్ణీతమైన రేట్లలో పన్నును మినహాయించి నికర మొత్తాన్ని మాత్రమే చెల్లించే బాధ్యత కంపెనీపై ఉంది. లాభాంశాలను పంపిణీ చేసినప్పుడు పై విధంగా మినహాయించిన పన్నును వాటాదార్లు విడివిడిగా చెల్లించవలసిన ఆదాయపు పన్నుకు సర్దుబాటు చేయడం జరుగుతుంది. ఎప్పుడైన వాటాదారుడు చెల్లించవలసిన పన్ను మూలంలో మినహాయించిన పన్ను కన్న తక్కువైనచో ఆ వ్యత్యాసాన్ని వాటాదారునికి తిరిగి ఇచ్చేస్తారు.

3. కార్పోరేషన్ పన్ను వల్ల ఒకే ఆదాయంపై రెండు సార్లు పన్ను కట్టడం జరుగదు. ఎందుకంటె ప్రప్రథమంగా కంపెనీ తన కొచ్చిన లాభాలపై తనపరంగానే పన్ను కడుతుంది. లాభాలను పంపిణీ చేసినప్పుడు వాటాదారుడు తన మొత్తం ఆదాయంపై లాభాంశాల నుండి వచ్చిన ఆదాయంతో సహా విడిగా పన్ను చెల్లిస్తారు.

### 14.3.4 అంతిమ భారము

ఈ పన్ను అంతిమ భారం ఎవరిపైపడుతుందో నిర్ధారించడం కష్టం. స్థూలంగా మూడు వర్గాలకు చెందిన వ్యక్తులు ఈ పన్ను విధింపు ప్రభావానికి లోనవుతారు. ఎ) వాటాదారులు, బి) కంపెనీ ఉత్పత్తి చేసే వస్తువుల వినియోగదార్లు, సి) కంపెనీ శ్రామికులు, ముడిపదార్థల సరఫరదారులు. ఈ వివిధ వర్గాల మధ్య పన్ను భారము ఏవిధంగా పంపిణీ అవుతుందనేది మార్కెట్ల వ్యవస్థ పైన, ఇతర అంశాలపైన ఆధారపడి ఉంటుంది.

పెట్టుబడి వల్ల ఆదాయము, ఉద్యోగిత ఉత్పన్నమౌతాయనేది బాగా తెలిసిన విషయమే. పెట్టుబడులను పెంచుటకూ. యంత్రాల ఆధునికీకరణను ప్రోత్సహించుటకు ఈ క్రింద తెలియజేసిన పద్ధతిలో వ్యాపార సంస్థలకు, పరిశ్రమలకు రాయితీలు,అలవెన్సులు మినహాయింపులు ఇస్తారు.

i) క్రొత్తగా ప్రారంభింపబడిన సంస్థలకు మొదటి 5 సంవత్సరాలు ఆదాయ పన్ను నుండి కార్పోరేషన్ పన్ను నుండి మినహాయింపు లభిస్తుంది. దీనిని "పన్ను విరామము (Tax Holiday) " అని పిలుస్తారు.

ii) యంత్రాలపై చేసే అన్ని రకాల పెట్టుబడులకు "డెవలప్‌మెంటు రిబేట్" అనే సౌకర్యము లభిస్తుంది. పెట్టుబడి పెట్టిన సంవత్సరము ఈ రిబేటును మినహాయించుకొనుటకు తగినంత ఆదాయం కంపెనీకి లభించినచో భవిష్యత్తు సంవత్సరాలలోని ఆదాయంనుండి దీనిని మినహాయించుకొనవచ్చును.

iii) 1.4.1980 నుండి 31.3.1985 వరకు యంత్రాలు మొదలగు వాటిపై పెట్టిన పెట్టుబడికి



BRAOU

"అదనపు తరుగుదల అలవెన్సు (Additional Depreciation Allowance) " ఇచ్చేవారు. ఇది మామూలు అలవెన్సుకు సమానంగా ఉండేది. 1985-86 వ సంవత్సరపు బడ్జెట్ లో దీనిని తొలగించారు. కాని సాధారణంగా యిచ్చే డిప్రిసియేషన్ అలవెన్సు రేటును (1985-86) నుండి 10% నుండి 15% కు పెంచారు.

### 14.3.5 1985–86 బడ్జెట్ దీర్ఘకాలిక కోశ విధానపు ప్రకటన

1985-86 సంవత్సరపు బడ్జట్‌ను ప్రవేశపెడుతూ కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు ఈక్రింది విధంగా ప్రకటించారు. కార్పొరేషన్ పన్ను రేట్లు భారతదేశంలో హెచ్చుగా ఉన్నాయి. కాని అనేక రకాలైన మినహాయింపులవలన వాస్తవ పన్ను రేటు చాలా తక్కువగా ఉంది. సదుద్దేశంతోయిచ్చిన అనేక రకాల మినహాయింపుల వలన కోర్టు వాజ్యాలు పెరిగాయి. పన్ను విధింపు ప్రాతిపదికలో కోత ఏర్పడింది. అందుచే పన్ను రేట్లను శాస్త్రీయంగా క్రమబద్ధం చేసి వాటికొక లక్ష్యాన్ని నిర్దేశించే ఉద్దేశం ఉన్నట్లు ఆర్థిక శాఖామాత్యులు తెలియజేశారు. అందుకనుగుణంగా కంపెనీల ఆదాయ పన్ను లోని మౌలిక రేటును 5% తగ్గించారు. ఉదాహరణకు:

i) దేశీయ కంపెనీల విషయంలో

1) ఆర్థిక పరంగా ప్రజలకు గణనీయమైన ఆసక్తిగల కంపెనీల మొత్తం ఆదాయంలో 50%.

2) ఆర్థికపరంగా ప్రజలకు గణనీయమైన ఆసక్తిలేని కంపెనీలు;
   ఎ) వాణిజ్య పెట్టుబడి కంపెనీల విషయంలో మొత్తం ఆదాయంలో 60%
   బి) ఇతర సంస్థల విషయంలో మొత్తం ఆదాయంలో 55%

ii) దేశీయ కంపెనీలు కాని విషయంలో మొత్తం ఆదాయంలో 50% నుండి 65% వరకూ.

**సర్ చార్జి (Sur Charge)**

పై పేరాలో చూపిన విధంగా ఆదాయపు పన్ను విధించిన తర్వాత దానిపై 5% సర్ చార్జీని విధిస్తారు.

కార్పోరేషన్లపై పన్నును తిరిగి తగ్గించడం జరగదని ఆర్థిక శాఖామాత్యులు 19.12.1985 తేదీన దీర్ఘకాలిక కోశ విధానంపై చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. పన్ను రేట్లను హెచ్చించడం కూడా జరగదని తర్వాత ప్రకటనలో స్పష్టం చేశారు. అయితే 1.4 1987న ప్రారంభమయ్యే అసెస్‌మెంటు సంవత్సరం నుండి సర్ చార్జీని, సర్ టాక్సును రద్దు చేస్తున్నట్లు కూడా చెప్పారు. పెట్టుబడికై ఇచ్చే అలవెన్సును రద్దు చేస్తున్నప్పటికి దానితోపాటే కొత్త స్కీము ఒకటి ప్రతిపాదించారు. ఈ క్రొత్త స్కీము ప్రకారం కార్పొరేట్ రంగానికి చెందిన సంస్థలు పన్ను విధింపుకు యోగ్యమైన లాభాల నుండి 20% లాభాలను పారిశ్రామికాభివృద్ధి బాంకులో కాని, ప్రభుత్వంచే ప్రకటించబడిన ఏ ఇతర సంస్థలో కాని డిపాజిట్ చేయవలయును. ఆ విధంగా డిపాజిట్ చేసినప్పుడు ఆయా సంస్థలు యంత్రాల కొనుగోలు మొదలైన వాటికై పెట్టే పెట్టుబడులపై కొంత వరకు పన్నురాయితీ లభిస్తుంది.

పన్ను విధింపుకు చట్టాలను పకడ్బందీగా అమలు జరపడం ద్వారాను, పన్ను రేట్లను తగ్గించుట వలన కలిగే రాబడిలోని ప్లవన శీలత ద్వారాను, వనరులను హెచ్చుగా సమీకరించుటకు వీలవుతుందనే ఆశాభావాన్ని ఆర్థికశాఖామంత్రి ప్రకటించారు. ఒకటో పట్టిక ద్వారా కార్పొరేషను పన్ను యొక్క ఆర్థిక ప్రాముఖ్యం పెరుగుతుందనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ప్రత్యక్ష పన్నులలో కార్పొరేషన్ పన్ను యొక్క సాపేక్ష ప్రాముఖ్యం పెరుగుతూ ఉంది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పన్నులలో 1960-61, 1978-79 మధ్య గల

కాలంలో ఆదాయ వ్యాకోచత అత్యధికంగా ఉండిన పన్ను కార్పోరేషన్ పన్ను మాత్రమే. అయినప్పటికీ వ్యాకోచగుణకం విలువ 0.94 అదే కాలంలో ప్లవనశీలత గుణకము 1.04.

కేంద్ర ఆర్థికశాఖామంత్రి వక్కాణించినట్లు ఆదాయపన్ను విషయంలోగాని, కంపెనీల లాభాలపై పన్ను విషయంలో కాని పన్ను రేట్లు కాగితాలపై ఎంత ఉన్నవి అన్నది కాదు ప్రధానాంశము. ముఖ్యమైనదేమిటంటే పన్నుల సేకరణ, పన్నుల అంతిమ భారమునంఘములోని ధనికవర్గాలవారు పన్ను ఎగవేసినప్పుడు పన్నుల వ్యవస్థలో న్యాయతాసూత్రం, సమానతా సూత్రం దెబ్బతింటాయి. విధించిన పన్నులను సంపూర్ణంగా సేకరించాలని,పన్ను ఎగవేతకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే విషయాలు కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక కోశ విధానంలో ముఖ్యమైనవి. ప్రత్యక్ష పన్నుల ప్రాముఖ్యం తగ్గడాన్ని అరికట్టి అవి ముఖ్యపాత్ర వహించేటట్లు చేయడం ఈ కోశ విధానంలో ఇంకో అంశము.

## 14.4 సంపద పన్ను

### 14.4.1 హేతుబద్ధత

ఆదాయం లాగే సంపద కూడా పన్ను విధింపుకు ఒక మంచి ప్రాతిపదిక. ఆర్థిక సాంఘిక సమానత్వాలక్ష్యాల దృష్ట్యా సంపదపై ప్రతి సంవత్సరం పన్ను విధించడం అవసరం అనే విషయాన్ని టాక్సేషన్ ఎంక్వయిరీ కమీషన్ (Taxation Enquiry Commission) స్పష్టపరిచింది. నికోలస్ కాల్డార్ తను సమర్పించిన నివేదికలో (1956) కూడ ఈ పన్ను విధింపును సిఫారస్ చేసినారు. సంపదపై వేసే పన్నులు వివిధ రూపాలలో ఉండవచ్చు. (ఎ) నికర సంపదపై వేసే పన్ను, (బి) భవనాలు మొదలగు రుపాలలో ఉన్న ఆస్తులపై వేసే పన్ను , (సి) ఒక వ్యక్తి మరణించినందువల్ల అతని సంపద ఇతరులకు ఘూరేటప్పుడు వేసే పన్ను - ఎస్టేట్ డ్యూటి (Estate Duty) (డి) కానుకలపై వేసే పన్ను మొదలగునవి. నికర సంపదపై వేసే పన్ను గురించి మనం ప్రధానంగా ఈ పాఠంలో చర్చిస్తాము. సంపదలలోను, ఆదయాలలోను గల అసమానతలను తగ్గించే సాధనంగా ప్రత్యక్ష పన్నుల యొక్క ఉపయోగం గురించి అందరికీ తెలిసిందే. దీనిని విస్తారంగా చర్చించనక్కరలేదు. ఆర్థిక, సాంఘిక సమానత్వాన్ని పెంపొందించడానికి సంపదపై పన్ను ఒక ముఖ్యమైన సాధనము. ఆదాయపు పన్నుకు అనుబంధంగా సంపద పన్ను ఆర్థిక సమానత్వాన్ని పెంపొందించడమే కాక, ఆదాయపు పన్నులోని ఎగవేతకు గల అవకాశాన్ని కూడ తగ్గిస్తుంది. సంపద గలవారు తమ సంపదను పన్నులోని ఎగవేతకు గల అవకాశాన్ని కూడ తగ్గిస్తుంది. సంపద గలవారు తమ సంపదను ఉత్పాదక రంగాలలో వినియోగించడానికి కూడ సంపద పన్ను ఉపయోగపడుతుంది. ఆదాయాన్నిచ్చే రంగాలలో వారు తమ సంపదను ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఆభరణముల రూపములో సంపద గలవారు. ఆభరణములవలన ఎటువంటి ఆదాయమును పొందరు కాబట్టి ఆదాయపు పన్నును చెల్లించరు. కాని ఆభరణములపై సంపద పన్ను విధించినపుడు వారు తమ ఆస్తులను ఉత్పాదక రంగాలలో ఉపయోగించుకొనవచ్చును. అంతేగాక అభివృద్ధి చెందుచున్న దేశాలలోసంపద పన్ను అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులను చేకూరుస్తుంది.

BRAOU

### 14.4.2 చరిత్ర

భారతదేశంలో సంపద పన్నును ప్రప్రథమంగా 1.4.1957 నుండి ప్రవేశపెట్టారు. వ్యక్తులకు, హిందూ అవిభక్త కుటుంబాలకు, కంపెనీలకు చెందిన నికర సంపదలపై సాలీనా పన్నువిధించుటకు 1957 వ సంవత్సరపు సంపద పన్ను చట్టం వీలు కల్పించింది. కాని 1960-61 నుండి కంపెనీలపై వేసే సంపద పన్నును రద్దుచేశారు ఈ పన్నును చెల్లింపుదారు మొత్తం సంపదపై విధించరు. నికర సంపదపై మాత్రమే పన్ను విధిస్తారు. మదింపు తేదీ నాటికి

అప్పులను మినహాయించగా మిగిలిన సంపదను 'నికర సంపద' అంటారు. ఆదాయపు పన్ను చెల్లింపులో ఏ తేదీని ఆదాయ నిర్ణయంకోసం ప్రాతిపదికగా తీసుకుంటారో ఆ తేదీనే సంపద పన్ను విషయంలో కూడా ప్రాతిపదికగా తీసుకొనవచ్చు లేదా మార్చి 31వ తేదీని ప్రాతిపదికగా తీసుకొనవచ్చు.

అన్ని రకాల స్థిరచరాస్తులను సంపదపన్ను విధింపుకు ప్రాతిపదికగా తీసుకొనవచ్చును. ఉదాహరణకు బ్యాంకులో గల నగదునిల్వలు, కంపెనీలలో గల వాటాలు, ఆభరణాలు, కంపెనీ ఆస్తులు మొదలైనవి. కాని క్రింద చెప్పిన ఆస్తులను సంపద పన్ను పరిధి నుంచి తొలగించినారు. (ఎ) పశువులు, (బి) వ్యవసాయ భూములు, అందు పెరుగు చున్న పంటలు, (సి) వ్యవసాయదారుడు నివసించే భవనం (డి) వార్షికాలపై గల హక్కులు.

### 14.4.3 మినహాయింపులు

పన్ను విధింపు నుండి మినహాయించిన ఆస్తులను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చును. (1) పూర్తి మినహాయింపు పొందిన ఆస్తులు (2) పాక్షికమైన మినహాయింపు పొందిన ఆస్తులు. పాక్షికమైన మినహాయింపు పొందిన ఆస్తులలో ఒక నిర్ణీత స్థాయికి మించిన ఆస్తులపైమాత్రమే సంపద పన్ను విధిస్తారు. పాక్షిక మినహాయింపు పొందిన ఆస్తులేవనగా

ఎ) ఒక ఇల్లు లేదా చెల్లింపుదారుకు చెందిన ఇంటిలో ఒక భాగము - లక్ష రుపాయల పరిమితి వరకు ( రూ.1,00,000/-).

బి) 1.4.1976 తర్వాత 80 చదరపుమీటర్ల కంటె తక్కువ వైశాల్యంతో నిర్మింపబడిన, క్రొత్తనివాస యోగ్యమైన భవనాలు లేదా భవనాలలో భాగాలు

సి) గృహోపకరణాలు, ఇండ్లలో వాడే పాత్రలు.

డి) వృత్తులకుపకరించే పనిముట్లు, సాధనాలు రూ.20,000/- విలువ వరకు.

ఇ) కళాత్మక విలువగల వస్తువులు, పుస్తకాలు, చిత్రములు, వర్ణచిత్రాలు ఫోటోలు మొదలైనవి.

సంపద పన్ను మినహాయింపుకు సంబంధించిన మినహాయింపు స్థాయిలు, పన్ను రేట్లు పలుమార్లు మార్చబడినాయి. ప్రప్రథమంగా సంపదపన్నును 1957-58లో ప్రవేశపెట్టినపుడు ఈ మినహాయింపు స్థాయిని వ్యక్తులకు రూ.2,00,000/- గాను, హిందూ అవిభక్త కుటుంబాలకు రూ.4,00,000/- గాను నిర్ణయించినారు. ఈ పన్నును పురోగామి పద్ధతిలో విధించారు. పన్ను విధింపుకు నిర్ణయించిన మినహాయింపు స్థాయి దాటినచో, సంపద పన్నును మొత్తం సంపదపై ఇటీవల వరకూ విధించేవారు. సంపద పన్ను "సార్థకరేటు (Effective Rate) " 1961-62లో 0.61% కాగా 1976-77 నాటికి 2.0% కు పెరిగింది. సంపద పన్ను విధింపులో గల పురోగామిత్వం కూడా గణనీయమైనది కాదనీ, సంపద పన్ను వల్ల ఆర్థిక అసమానతలు గణనీయంగా తగ్గవని కూడ పరిశీలకులు చెబుతారు.

### 14.4.4 పన్ను రేట్ల నిర్మాణం

సంపద పన్ను నిర్మాణాన్ని ఉన్నతాధికారాలు గల అనేక సంఘాలు పరిశీలించాయి. వాటిలో అంచనాల సంఘం, పబ్లిక్ అకౌంట్సు కమిటీలు కూడా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో పొదుపు పెట్టుబడులను ప్రోత్సాహించుటకు దోహదం చేసే విధంగా సంపద పన్నును సంస్కరించడానికి అనేక సూచనలు చేయబడ్డాయి. 1985-86 బడ్జెట్ లో పై సూచనల దృష్ట్యా సంపద పన్ను మినహాయింపు స్థాయిని రూ.2,50,000/- కు పెంచారు. సంపద పన్ను చెల్లింపుదారులు మొదట రూ.2,50,000/- పై ఎటువంటి పన్ను చెల్లించనక్కరలేదు. 1985-86కు పూర్వం ఈ



BRAOU

రకమైన పన్ను మినహాయింపు ఉండేది కాదు. మార్చబడిన పన్ను షెడ్యూలు క్రింది విధంగా ఉంది.

| పన్ను విధింపు తరగతి | పన్ను రేటు |
|---|---|
| రూ. 2,50,000/- లోపు | పన్ను లేదు |
| రూ. 2,50,001/- నుండి రూ.10,00,000/- వరకు | 1/2 శాతం |
| రూ. 10,00,001/- నుండి రూ. 20,00,000/- వరకు | 1 శాతం |
| రూ. 20,00,000/- కు మించినచో | 2 శాతం |

ఉపాంత పన్ను రేటు గరిష్ట స్థాయిని 5% నుండి 2%కు తగ్గించారు నిర్దిష్టమైన ఆస్తులపై ఇచ్చే మినహాయింపుల మొత్తాన్ని రూ.5,00,000/- గా నిర్ణయించారు.

ఒక వ్యక్తి జీవించి ఉండగా అతని సంపదపై వేసే పన్ను సంపద పన్ను కాగా ఆ వ్యక్తి మరణించి అతని సంపద చేతులు మారేటప్పుడు విధించే పన్నును ఎస్టేట్ సుంకము (Estate Duty) అంటారు. సంపద పంపిణీలో గల అసమానతలను తగ్గించుటకు, ఆర్థికాభివృద్ధికవసరమైన వనరులను చేకూర్చుటకు ఎస్టేట్లపై సుంకాలను విధించినప్పటికి ఆ రెండు లక్ష్యాలు ఎస్టేట్ సుంకాల ద్వారా నెరవేరలేదని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి స్పష్టం చేశారు. అందుచే ఎస్టేట్లపై గల సుంకాన్ని 16.3.1985 నుండి తొలగించారు.

### 14.4.5 రాబడి ప్రాధాన్యత

సంపద పన్ను రాబడి ప్రాముఖ్యాన్ని తెలియజేసే వివరాలు ఈ పాఠం చివరి పట్టికలో పొందుపరచబడ్డాయి. కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో 2% మాత్రమే సంపద పన్ను ద్వారా వస్తోందనే విషయం పట్టిక ద్వారా తెలుస్తుంది. కేంద్రప్రభుత్వపు ప్రత్యక్ష పన్నులలో ప్రముఖమైనవి కార్పోరేషన్ పన్ను మరియు ఆదాయపు పన్ను. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పన్నులరాబడిలో ఈ రెండు పన్నులు 9.2 శాతం ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి.

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

1. కార్పోరేషన్ పన్ను లక్షణాలను వ్రాయుము?
2. సంపద పన్ను అంటే ఏమిటి? అది ఎప్పుడు విధించబడినది?
3. సంపద పన్నులో కల్పించబడిన మినహాయింపులు ఏవి?
4. రాబడి ప్రాముఖ్యతను వివరింపుము.

BRAOU

## పట్టిక – 1 : ప్రత్యక్ష పన్నుల వ్యవస్థ

| సంవత్సరము | ప్రత్యక్ష పన్నుల ద్వారా మొత్తము రాబడి | | ఆదాయపు పన్ను సర్ చార్జీల ద్వారా స్థూల రాబడి | | కార్పొరేషన్ పన్ను ద్వారా స్థూల రాబడి | | సంపద పన్ను ద్వారా స్థూల రాబడి | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1950-51 | 177.03 | (100) | 132.73 | (74.78) | 40.49 | (22.87) | | |
| 1955-56 | 172.70 | (100) | 131.53 | (76.01) | 37.04 | (21.44) | | |
| 1960-61 | 295.74 | (100) | 167.38 | (55.60) | 111.05 | (37.55) | 8.15 | (2.76) |
| 1965-66 | 603.68 | (100) | 271.80 | (45.02) | 304.84 | (50.50) | 12.05 | (2.00) |
| 1970-71 | 876.80 | (100) | 473.20 | (53.96) | 370.50 | (42.26) | 15.30 | (1.72) |
| 1975-76 | 2,222.00 | (100) | 1,214.40 | (54.66) | 861.70 | (38.78) | 53.70 | (2.42) |
| 1980-81 | 3,007.10 | (100) | 1,506.40 | (50.10) | 1,310.80 | (43.58) | 67.40 | (2.24) |
| 1983-84 | 4.513.41 | (100) | 1,699.14 | (37.65) | 2,492.73 | (55.23) | 93.31 | (2.07) |
| **Accounts :-** | | | | | | | | |
| 1984-85 | 4813.83 | (100) | 1927.76 | (40.05) | 2555.90 | (53.09) | 107.58 | (2.24) |
| 1985-86 (RE) | 5680.36 | (100) | 2397.00 | (42.20) | 3118.00 | (54.89) | 110.00 | (1.94) |
| 1986-87 (BE) | 5858.47 | (100) | 2588.00 | (44.17) | 3123.00 | (53.31) | 100.00 | (1.71) |

Source : Explanatory Memorandum on the Budget of the Central Government.

**Note:** RE : సవరించబడిన అంచనాలు
BE : బడ్జెట్ అంచనాలు

BRAOU

**పట్టిక 2 : పన్ను చెల్లించే వారి సంఖ్య**

| | ఆదాయపు పన్ను | సంపద పన్ను | ఎస్టేటు సుంకము |
|---|---|---|---|
| 1950-51 | 3,95,017 | - | - |
| 1960-61 | 9,26,000 | 23,726 | - |
| 1965-66 | 15,95,000 | 66,161 | 4,791 |
| 1970-71 | | 1,21,406 | 6,496 |
| 1975-76 | 21,67,000 | 1,25,144 | 8,226 |
| 1980-81 | 45,94,000 | - | - |
| 1981-82 | 41,61,000 | - | - |

**పట్టిక 3 : ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలు**

| | 1979 – 80 లో | | 1981 – 82 లో | |
|---|---|---|---|---|
| మదింపు అయ్యే ఆదాయం (రూపాయలు, 000) | పన్ను చెల్లింపు దారుల శాతం | పన్ను పడ్డ ఆదాయంలో చెల్లించిన శాతం | పన్ను చెల్లింపు దారుల శాతం | పన్ను పడ్డ ఆదాయంలో చెల్లించిన శాతం |
| 15 | 56.3 | 6.2 | 51.6 | 5.95 |
| 15-20 | 21.0 | 10.1 | 24.2 | 10.8 |
| 20-25 | 9.2 | 13.0 | 10.3 | 13.8 |
| 25-50 | 10.9 | 21.8 | 10.7 | 22.8 |
| 50-100 | 2.2 | 36.5 | 2.6 | 46.9 |
| 100-500 | 0.45 | 32.0 | 0.22 | 54.0 |
| 500- అంతకు పైగా | 0.02 | 66.0 | 0.008 | 71.5 |

## 14.5 సారాంశం

వైయక్తిక ఆదాయపన్ను, కార్పోరేషను పన్ను, సంపదపన్నులు భారతదేశ ప్రత్యక్షపన్నులలో ముఖ్యమైనవి. 1857లో జరిగిన తిరుగుబాటువల్ల ఏర్పడిన ఆర్థిక వత్తిడులను తట్టుకునేందుకు 1860లో ప్రప్రథమంగా సర్ జేమ్సు విల్సన్ తాత్కాలిక చర్యగా ఆదాయ పన్నును ప్రవేశపెట్టాడు. 1865లో ఈ పన్ను తీసివేయబడింది. తిరిగి 1886లో శాశ్వత ప్రాతిపదికపై తిరిగి ప్రవేశపెట్టబడింది. ప్రత్యక్షపన్నుల ద్వారా వచ్చే మొత్తం రాబడిలో ఆదాయ పన్ను రాబడి శాతం తగ్గుతూ, 1950-51 నాటి 75% నుండి 1980-81 నాటికి 50% కి; 1985-86 నాటికి 38% కి తగ్గింది. అంతేకాక ఆదాయ పన్నురాబడి అవ్యాకోచంగా వున్నది. కాని దాని ప్లవనశీలతా గుణకం ఒకటి కన్న ఎక్కువ యున్నది. భారతదేశంలో ఆదాయపన్ను ఎగవేత చాల ఎక్కువగా వున్నది. భారతదేశపు స్థూల జాతీయోత్పత్తిలో నల్ల ఆదాయం వాటా 18 శాతంగా వుంది. 1958లో ఆదాయపన్నుకు ప్రత్యామ్నాయంగా వ్యయ పన్ను ప్రవేశపెట్టబడింది. దీనిని 1966లో తొలగించారు.

BRAOU

కేంద్ర పన్నులలో ఒకటైన కార్పోరేషను పన్ను నష్టం లాభాలపై విధించబడుతుంది. పరిశ్రమల ఆధునీకరణను ప్రోత్సహించు దృష్ట్యాముతో ప్రభుత్వం ఈ పన్ను విధింపులో అనేక రాయితీలు, అలవెన్సులు, మినహాయింపులు ఇవ్వబడ్డాయి. ఈ పన్ను వ్యాకోచతా గుణకం కేంద్రపన్నులన్నింటికంటె అత్యధికంగా అనగా 0.94 గా వుంది. దీని ప్లవనశీలతా గుణకం 1.04.

కాల్డార్ సిఫార్సులననుసరించి, భారతదేశంలో సంపదపన్నును 1957లో ప్రవేశపెట్టారు. సంపద పన్ను విధింపులో గల పురోగామిత్వం గణనీయమైనది కాదనీ, దీనివల్ల ఆర్థిక అసమానతలు గణనీయంగా తగ్గవనీ పరిశీలకుల భావన. కేంద్రానికి వచ్చే ప్రత్యక్ష పన్నుల రాబడిలో దీని వాటా 2 శాతం మాత్రమే.

## 14.6 సంప్రదింపు గ్రంథాలు

| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | Hugh Dalton | : | Principles of Public Finance |
| 4. | తెలుగు అకాడమి | : | పబ్లిక్ ఫైనాన్స్ |

## 14.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింద ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి

1. భారత దేశంలోని ఆదాయపు పన్ను చరిత్రను తెలుపుతూ, నేటి వరకు ఆదాయపు పన్ను వ్యవస్థలో వచ్చిన మార్పులను గూర్చి విశదీకరించుము.

2. భారతదేశములో కార్పోరేషను పన్ను పన్ను విధింపులో గల హేతుబద్ధతను వివరిస్తూ దాని ముఖ్య లక్షణములను విశదీకరించుము.

3. భారతదేశం లోని సంపద పన్ను యొక్క చరిత్ర, హేతుబద్ధత మరియు పన్ను విధింపు రేటును గూర్చి వివరించుము.

II. ఈ క్రింద ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సుమారు 15 పంక్తులలో సమాధానములు వ్రాయుము.

1. సూపర్ టాక్సు (Super Tax) అనగా నేమి? దానిలో కల్గిన మార్పులను గూర్చి వ్రాయండి.

2. ఆదాయపు పన్ను లక్షణాలను, పన్ను రాబడి, వ్యాకోచత, ప్లవనశీలత మరియు పురోగామిత్వము మొదలగు వానిని దృష్టిలో నుంచుకొని పరిశీలించండి.

3. పన్ను ఎగవేత సమస్యను గూర్చి చర్చించండి.

●●●

# భాగం – 15 : ముఖ్యమైన పరోక్ష పన్నులు

విషయక్రమం


15.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

15.1 పరిచయం

15.2 పరోక్ష పన్నుల అర్థం మరియు ప్రాముఖ్యత

15.3 కేంద్ర ఎక్సయిజ్ సుంకాలు

- 15.3.1 అర్థం
- 15.3.2 చరిత్ర
- 15.3.3 లక్ష్యాలు
- 15.3.4 ఎక్సయిజ్ సుంకాలలోని రకాలు
- 15.3.5 మినహాయింపులు
- 15.3.6 రేట్ల వ్యవస్థ
- 15.3.7 పన్నురాబడి
- 15.3.8 భారతదేశంలో పరోక్ష పన్నుల భారం

15.4 కస్టమ్స్ సుంకాలు

- 15.4.1 అర్థం
- 15.4.2 కస్టమ్స్ సుంకాల ఆవశ్యకత
- 15.4.3 దిగుమతి సుంకాలు
- 15.4.4 ఎగుమతి సుంకాలు

15.5 అమ్మకపు పన్ను

- 15.5.1 అర్థం
- 15.5.2 అభివృద్ధి
- 15.5.3 ఆంధ్రప్రదేశ్ లో అమ్మకం పన్ను
- 15.5.4 రాబడి ప్రాధాన్యత
- 15.5.5 అమ్మకం పన్నులోతేబడిన సంస్కరణలు

15.6 సారాంశము

15.7 సంప్రదింపు గ్రంథాలు

15.8 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 15.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమైన పరోక్ష పన్నులయొక్క స్వభావాన్ని, హేతుబద్ధతను, రేట్ల వ్యవస్థను, పోకడలను మరియు ప్రాధాన్యతను పరిశీలించడం ఈ భాగం ఉద్దేశ్యం.

BRAOU

ఈ భాగాన్ని చదివిన తరువాత ఈ క్రింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు.

- పరోక్ష పన్నుల ప్రాముఖ్యత
- కేంద్ర ఎక్సయిజ్ సుంకాలు మరియు కస్టమ్స్ సుంకాలకు సంబంధించిన చరిత్ర, రేట్ల వ్యవస్థ, పన్నురాబడి మరియు భారము.
- అమ్మకం పన్ను యొక్క అర్థం మరియు ఆంధ్రప్రదేశ్‌లో దాని అభివృద్ధి.

## 15.1 పరిచయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థ నిర్మాణంలో పరోక్ష పన్నులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే మొత్తం పన్ను రాబడిలో, పరోక్షపన్నుల వాటా క్రమంగా 1950-51 నాటికి 63 శాతం నుండి 1984-85 లో 86 శాతం వరకు పెరుగుతూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వపు పరోక్షపన్నులలో కేంద్ర ఎక్సయిజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు ముఖ్యమైనవి. కేంద్ర ప్రభుత్వం యొక్క పన్నుల స్థూల రాబడిలో ఈ రెండు సుంకాల యొక్క వాటా 75% ను మించి యున్నది. అమ్మకం పన్ను రాష్ట్రానికు చెందిన పన్నులలో అతి ముఖ్యమైనది. 1985-86 లో దాని వాటా రాష్ట్రానికి లభించిన మొత్తం పన్ను రాబడిలో 58 శాతంగా యున్నది.

## 15.2 పరోక్ష పన్నుల అర్థం మరియు ప్రాముఖ్యం

వేరొక వర్గం వారు పరోక్షంగా పన్ను చెల్లిస్తారనే వుద్దేశంతో, ఒక వర్గం పై పన్ను విధించి సేకరించే పన్నులను 'పరోక్ష పన్నులు' అంటారు. ఆర్థికాభివృద్ధికి అవసరమయిన వనరుల సమీకరణలో పరోక్ష పన్నులు ఒక ముఖ్య సాధనము. పారిశ్రామిక ఉత్పత్తుల వృద్ధి మరియు వ్యాపార విస్తరణ కారణంగా, మొత్తం పన్నుల రాబడిలో ప్రత్యక్ష పన్నుల వాటా తగ్గిపోయి, పరోక్షపన్నుల ప్రాముఖ్యత బాగా పెరిగిపోయింది. ఇటీవలి కాలంలో పరోక్షపన్నుల వృద్ధి మరియు ప్లవనశీలత హెచ్చుగా యున్నాయి. ఎక్సయిజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాల మధ్య కస్టమ్స్ సుంకాలలోని పెరుగుదల, ఎక్సయిజ్ సుంకాలలోని పెరుగుదలకంటే ఎక్కువగా వుంది.కాని ఈ ఎక్సయిజ్ సుంకాలు చేకూర్చే ఆదాయం ఇప్పటికే హెచ్చుగా వుంది. భారత దేశంలోని ఎక్సయిజ్ సుంకాల ప్రాముఖ్యాన్ని ప్రస్తుతం పరిశీలిద్దాం.

BRAOU

## 15.3 కేంద్ర ఎక్సయిజు సుంకాలు

### 15.3.1 అర్థం

ఒక దేశంలో వినిమయము లేదా అమ్మకము చేయు వుద్దేశంతో ఆ దేశంలో ఉత్పత్తి అయిన లేదా తయారు చేయబడిన వస్తువులపై విధించే దేశీయ పన్నులను "యూనియన్ ఎక్సయిజు సుంకాలు" అంటారు. ఉత్పత్తి స్థాయిలోనే ఈ పన్నులను విధిస్తారు. ఈ సుంకాలను వస్తువుల మీదనే కాని సేవలపై, సౌకర్యాలపై విధించరు. భారతదేశంలో ఎక్సయిజ్ సుంకాలను చాలరకాల వస్తువులపై విధిస్తారు. ఈ సుంకాలను ఉత్పాదక వస్తువుల మీదనే కాక, మధ్యస్థ వస్తువుల మీద కూడ విధిస్తారు. భారతరాజ్యాంగం ప్రకారం ఒక సుంకాన్ని ఎక్సయిజ్ సుంకమని పిలిచి, ఉత్పత్తి స్థాయిలో విధించాల్సినప్పుడు ఆ పన్నును కేంద్ర ప్రభుత్వం మాత్రమే విధించవచ్చు. మత్తుపదార్థాల మీద, సారాయిమీద, మాత్రం పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలే విధిస్తాయి.

### 15.3.2 చరిత్ర

ప్రాచీన కాలం నుండి ఎక్సైజ్ సుంకాలను భారతదేశంలో విధించేవారు. సంప్రదాయ పన్ను ద్వారా వచ్చే ఆదాయానికి అనుబంధంగా మౌర్యుల కాలంలో కూడా మద్యపానీయాలపై సుంకాన్ని విధించేవారు. మొగలాయిల కాలంలోను, మహారాష్ట్రుల కాలంలోను, బ్రిటిష్ పరిపాలనలోను ఉప్పుపై అనేక రకాల పన్ను విధించేవారు. వారు దానిని ఏకస్వామ్య మార్కెట్ వస్తువుగా భావించేవారు. కాని 1894 నాటికి పరిస్థితి మారింది. 20వ నెంబరుకు మించిన నూలు ధరపై 5% పన్నును ఎక్సైజ్ సుంకంగా విధించటంతో 1894లోనే ఆధునిక ఎక్సైజ్ సుంకాల విధింపుకు శ్రీకారం చుట్టినట్లు భావించవచ్చు. 1917లో మోటారు స్పిరిట్ పై కూడ పన్ను విధించారు. దీని తర్వాత కిరసనాయిలుపై పన్ను విధించారు. తర్వాత కొద్ది సంవత్సరాలవరకు క్రొత్తగా ఏ వస్తువు పైనా పన్ను విధించలేదు. ఎక్సైజ్ సుంకాల విధింపు, విస్తరణలను 1934లో ప్రప్రధమంగా క్రమబద్ధం చేశారు. పంచదార, అగ్గిపెట్టెలు, ఇనుపకడ్డీలపై కూడా పన్ను విధించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వనరుల అవసరం దృష్ట్యా ఎక్సైజ్ సుంకాలను విస్తృతంగా విధించడం జరిగింది. పాతవాటిపై పన్ను రేట్లను పెంచారు. కాని 1943 వరకు మూడు వస్తువులపై వివిధ చట్టాల క్రింద పన్ను విధించేవారు. 1944లో ఎక్సైజ్ సుంకాల విధింపు, సేకరణలకు సంబంధించి 16 కంటె తక్కువ కాకుండా చట్టాలు ఉండేవి. అందుచే 1944లో ఈ చట్టాలన్నిటినీ స్థిరపరచి, కేంద్ర ఎక్సైజ్, ఉప్పుకు సంబంధించిన చట్టాన్ని ప్రవేశపెట్టి, దాని నిబంధనలను అన్ని వస్తువులకు విస్తరింప జేశారు. పన్ను విధింపుకు మూలమైన ఈ చట్టాన్ని అనేక మార్లు సవరించారు. సవరింపుల తర్వాత కూడ క్రొత్త సవరింపులు అవసరమైనాయి. తరచుగా వచ్చిన ఈ మార్పుల వల్ల పరిపాలనా సంబంధమైన చిక్కులు కూడ ఏర్పడ్డాయి. అందుచే కేంద్ర ఎక్సైజ్ సుంకాల పునర్వ్యవస్థీకరణ కమిటీ (Central excise Re-organisation Committee) 1963లో ఎక్సైజ్ చట్టాన్ని దానికి సంబంధించిన నిబంధనలను పూర్తిగా పునర్విమర్శ చేయాలని సూచించింది. (చందా కమిటీ). క్రొత్త ఎక్సైజ్ బిల్లును 1970లో పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటికి అది చట్టంగా కాకుండానే కాలదోషం పట్టిపోయింది. 1971–1975 ల మధ్య ప్రతి సంవత్సరము ఎక్సైజ్ సుంకాల ప్రాతిపదికను విస్తృతం చేయటం వల్ల యంత్రాలద్వారా తయారయ్యే అన్ని వస్తువులపైనా పన్ను విధించడం జరిగింది. పరోక్ష పన్నుల విచారణా సంఘం (ఝా కమిటీ), పరోక్ష పన్నుల పునర్వ్యవస్థీకరణకూ, సుసంబద్ధీకరణకు సిఫారస్ చేసింది. ఆర్థిక వృద్ధి, ఆర్థిక సమానత, సరళత, ఆదాయ వ్యాకోచత మొదలైన లక్ష్యాలను సంపాదించే ఉద్దేశంతో ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాల చట్టాన్ని సవరించే ఉద్దేశం ఉన్నట్లు
19–12–1985 న కేంద్ర ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన ద్వారా తెలుస్తుంది.

### 15.3.3 పన్ను విధింపు లక్ష్యాలు

భారతదేశంలో ఎక్సైజ్ సుంకాలను ఈ క్రింది లక్ష్యాలతో ప్రభుత్వం విధిస్తుంది.

ఎ) రాబడి సంపాదించుటకు.

బి) దేశీయ వినియోగాన్ని తగ్గించుటకు లేదా నిర్దిష్టమైన వస్తువుల వినియోగాన్ని తగ్గించుటకు

సి) ప్రత్యక్ష పన్నులకు లోనుకాని ప్రజలపై పన్ను విధించుటకు

డి) ఎగుమతులను ప్రోత్సహించుటకు.

ఇ) ద్రవ్యోల్బణాన్ని అరికట్టుటకు.

ఎఫ్) ఆదాయాలను తిరిగి పంపిణీ చేయుటకు

జి) వనరులను సక్రమంగా కేటాయించుటకు

హెచ్) ఏఏ వస్తువులపై ప్రజలు తమకు నూతనంగా లభించిన ధనాన్ని ఖర్చుపెడతారో, ఆయా వస్తువులకు సంబంధించిన పరిశ్రమలపై పన్ను విధించుట.

ఐ) ఎక్కువ లాభాలు వచ్చే కంపెనీలపై పన్ను విధించుట.

జి) కుటీర పరిశ్రమలకు, చిన్న తరహా పరిశ్రమలకు సహాయం చేయుట.

కె) ఆర్థిక వృద్ధిని, సమానత్వమును పెంపొందించుటకు.

### 16.3.4 ఎక్సైజ్ సుంకాలలోని రకాలు

కేంద్రప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను ప్రస్తుతం ఈ క్రింది రూపాలలో విధిస్తుంది. (ఎ) మౌలికమైన ఎక్సైజ్ సుంకము. (బి) స్పెషల్ ఎక్సైజ్ సుంకము, (సి) పంచదార, పొగాకు, నూలు వస్త్రములపై విధించుచుండిన రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను స్థానంలో 1957 నుంచి విధించే ఎక్సైజ్ సుంకము. పైన చెప్పిన సుంకములు కాక ఈ క్రింది చెప్పిన సుంకములను కూడ విధించుచున్నారు. (ఎ) వస్త్రములను కంట్రోలు ధరకు సరఫరా చేయుటకయ్యే ఖర్చును భర్తీ చేయుటకై జవుళీలు, జవుళీల ఉత్పాదకాలపై విధించే అదనపు సుంకాలు. (బి) కొన్ని కార్యక్రమాల నిర్వహణకై ప్రత్యేకంగా విధించే సెస్సులు.

మౌలిక ఎక్సైజ్ సుంకాల ద్వారా, స్పెషల్ ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చే రాబడిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేసుకుంటాయి. కాగా అమ్మకపు పన్ను స్థానంలో విధించే అదనపు ఎక్సైజ్ సుంకాలవల్ల వచ్చే రాబడి రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రమే చెందుతుంది. కాని ఈ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకిచ్చేముందు ఈ పన్ను సేకరణకయ్యే ఖర్చులను, కేంద్ర పాలిత ప్రాంతాల వాటాలను రాబడిలో నుండి మినహాయిస్తారు. పలు రూపాలలో ఎక్సైజ్ సుంకాలను విధించడం వలన ఈ ఎక్సైజ్ సుంకాల వ్యవస్థ క్లిష్టమవుతుంది. అంతేకాక ఈ సుంకాలవల్ల కలిగే భారాన్ని అంచనా వేయడం కూడా కష్టమవుతంది. అందుచే ఈ వివిధ రకాలైన ఎక్సైజ్ సుంకాల నన్నింటినీ ఒకే రకమైన మౌలిక రేటులో విలీనం చేసి సరళమైన రీతిలో విధించే ఆలోచన ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. (అయితే అమ్మకం పన్ను స్థానంలో విధించే అదనపు ఎక్సైజ్ సుంకాలు ఇందులో చేరవు). 1985-86 లో ఈ దిశలో కొన్ని ప్రారంభచర్యలను కూడ తీసుకోవడం జరిగింది. సెస్సుల సంఖ్యను కూడ తగ్గించే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉంది. అమ్మకపు పన్ను స్థానంలో విధించే అదనపు ఎక్సైజ్ సుంకాలను కూడ మౌలిక ఎక్సైజ్ సుంకంలో విలీనం చేయడం వాంఛనీయమే. అయినప్పటికీ అది సాధ్యం కాదు. ఎందువల్లనంటే వస్త్రాలు, పంచదార, పొగాకులపై వేసే అదనపు ఎక్సైజ్ సుంకాలరాబడిని రాష్ట్రాలకు ఏ విధంగా కేటాయించాలి అనే సమస్యపై ఒక పరిష్కార మార్గం కనుగొనవలసి ఉంటుంది.

BRAOU

వస్తువులపై విధించే పన్నులు రెండు రూపాలలో ఉండవచ్చు. (1) వస్తువుల విలువ ననుసరించి విధించే పన్నులు (2) వస్తువులపై నిర్దిష్టమైన రేట్లలో విధించే పన్నులు (advalorem and Specific duties). వస్తువు విలువలో లేదా ఉత్పాదకాల విలువలో ఒక నిర్దిష్టమైన శాతంలో పన్ను విధించితే దానిని "Advalorem duties" అంటారు. ధర పెరిగేకొద్దీ పన్ను మొత్తం కూడ పెరుగుతుంది. (పన్ను రేటు కాదు). వస్తువులపై నిర్దిష్టమైన రేట్లలో పన్ను విధించినప్పుడు దానిని "Specific duties" అంటారు. చాలా కాలం వరకు ఎక్సైజ్ సుంకాల విధింపులో Specific duties హెచ్చుగా ఉండేవి. కాని ఇటీవలి కాలంలో Advalorem పద్ధతి కూడ ప్రాముఖ్యం లోకి వచ్చింది. Advalorem పద్ధతిలో పన్ను విధించినప్పుడు పన్ను ఎగవేతకు అవకాశాలుండడమేకాక, పాలనాపరమైన సమస్యలు కూడ తలెత్తాయి. అందుచే Specific duties యొక్క ప్రాముఖ్యత తగ్గిపోలేదు. అయితే ద్రవ్యోల్బణం వల్ల ధరలు పెరిగినా Specific duties ద్వారా వచ్చే రాబడి అదే నిష్పత్తిలో పెరుగుట లేదు. అందుచే Specific duties విధించినప్పటికి ప్రభుత్వానికి నష్టంరాని రీతిలో ఈ సుంకాలను తరచుగా పెంచే పద్ధతిని ప్రవేశపెట్టే ప్రతిపాదన ప్రభుత్వ ఆలోచనలో ఉంది. అమ్మకపు పన్నును Advalorem పద్ధతిలో మాత్రమే విధిస్తారని, ఎక్సైజ్ సుంకాలను మాత్రంగా Specific రేట్ల లోనైనా విధించవచ్చునని, విషయాన్ని మనం ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

### 15.3.5 మినహాయింపులు

ఎక్సైజ్ సుంకాల విధింపుకు నామమాత్రంగా కొన్ని రేట్లు ఉన్నప్పటికి పలురకములైన మినహాయింపులు లభిస్తున్నాయి. ఎక్సైజ్ సుంకాల రేట్ల వైవిధ్యాన్ని మినహాయింపులను ఒక పద్ధతి ప్రకారం పునర్విమర్శ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉంది.

ఉత్పాదకాలపై విధించే సుంకాల విషయం కూడా ప్రత్యేకంగా గమనార్హమైన విషయం. ఉత్పాదకాలపై పన్ను విధించడం వలన (ముడి పదార్థాలు మధ్యస్థ వస్తువులు) ఉత్పత్తి వ్యవస్థలో అవకతవకలు ఏర్పడి పన్నుల కాస్కేడింగ్ (Cascading) (పన్నులపై పన్నులు పడి భారం పెరగడం) కు దారితీయవచ్చు. ఉత్పాదకాలపై వేసే పన్ను భారాన్ని, సమానీకరణ సుంకాల (Counterbealing) భారాన్ని క్రమేపి తగ్గించడం పరోక్ష పన్నుల సంస్కరణ కార్యక్రమంలో ఒక ప్రధాన అంశం. ఉత్పాదకాలపై పన్నులు వేయడం తొలగించాలంటే ఉత్పత్తి ప్రక్రియలో వివిధ స్థానాలలో చేరే విలువననుసరించి పన్నులు వేసే పద్ధతిని ప్రవేశపెట్టాలి. దీనినే Value-added tax అంటారు. కాని ఈ విధమైన పన్నును సంపూర్ణంగా ప్రవేశపెట్టడంలో ఇబ్బందులు ఉన్నందువల్ల కొన్ని మార్పులతో ఈ పన్నును MODVAT- Modified System of Value-added tax- రూపంలో విధించాలని ఝా కమిటి వారు ప్రతిపాదించారు. MODVAT ను ప్రవేశపెట్టి, ఎక్సైజ్ సుంకంలోని భారాన్ని గణనీయంగా తగ్గించాలనే ఉద్దేశం మాత్రం లేదు. ఉత్పాదకాలపై పన్ను విధించినందువల్ల కలిగే నష్టాన్ని పూర్తిగా తయారైన సరకులపై హెచ్చు రేట్లలోపన్ను విధించుట ద్వారా భర్తీ చేసుకోవచ్చు. ఈ MODVAT పద్ధతిని 1986-87 బడ్జెట్ లో ప్రవేశ పెట్టినారు.

### 15.3.6 రేట్ల వ్యవస్థ

అదనపు వనరులను సమీకరించుకోవాలనే లక్ష్యంతోను, అనేక రకాలైన సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలను కోశ పద్ధతుల ద్వారా సాధించాలనే ఉద్దేశంతోను గత కొన్ని సంవత్సరాలుగా పన్ను రేట్లను వరుసగా పెంచే ప్రయత్నం వల్లనే ఎక్సైజ్ సుంకాలలోని ప్రస్తుత పన్ను రేట్లు ఏర్పడ్డాయి. రాబడి దృష్టితోనే ఎక్సైజ్ సుంకాల రేట్లను తరచుగా పెంచడం జరిగింది. ఎక్సైజ్ సుంకాల రేట్లు 2% నుండి 37% వరకు ఉంటున్నాయి. పన్ను రేట్ల ఈ విస్తరణయే ఈ పన్ను యొక్క విశిష్ట లక్షణము. ఈ విషయం గురించి పరోక్షపన్నుల విచారణ కమిటి (Indirect taxes enquiry committee) వారు కూడ వ్యాఖ్యానం చేశారు. పొగాకుపైన, పెట్రోలియం ఉత్పత్తులపైన విధించే పన్నులను మినహాయిస్తే, ఈ పన్ను రేట్ల విస్తృతి 2% నుండి 100% వరకు ఉంటుంది. 1985 లో సుమారు 133 అంశాలపై సుంకాలను విధించారు.

### 15.3.7 పన్ను రాబడి

1920-21 లో రెండు అంశాలపైన విధించిన ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ. 2.85 కోట్లు వసూలైనవి. 1950-51లో పన్ను విధింపుకు లోనైన వస్తువుల సంఖ్య 13, కాగా వాటి రాబడి రూ. 68 కోట్లు. 1970-71 లో పన్ను విధించబడ్డ అంశాల సంఖ్య 88, పన్ను రాబడి రూ. 1759 కోట్లు. 1976-77 లో పన్ను విధించబడ్డ అంశాలు 124, కాగా 1985 లో వీటి సంఖ్య 133కు పెరిగింది. పదమూడో భాగం చివరగల పట్టిక పరోక్ష పన్నుల మొత్తం రాబడిని అందులో ఎక్సైజ్ సుంకాల వాటాను సూచిస్తుంది. మొత్తం పన్నుల రాబడిలో ఎక్సైజ్ సుంకాల రాబడి 1950-51లో 16.7% కాగా అది 1976-77 నాటికి 52.0% వకు పెరిగింది. ఆతర్వాత అది 1985-86 నాటికి 47.2% కు తగ్గింది.

ఎక్సైజ్ సుంకాల రాబడి పెరుగుదలకు అనేక కారణాలున్నాయి. (1) కొత్త వస్తువులపై పన్ను వేయుట

(బి) పన్ను రేట్ల మార్పులు (సి) వినియోగంలోని పెరుగుదల. ఝా కమిటీవారు చెప్పినట్లు పన్ను రేట్ల పెంపుదల రాబడి పెరుగుదలకు ముఖ్యకారణము. 1960-61, 1978-79 మధ్య కాలంలో ఎక్సైజ్ సుంకాల ఆదాయవ్యాకోచత 0.79 అంటే ఒకటి కన్న తక్కువ. పరోక్ష పన్నుల విధింపులో ఈ క్రింది లక్ష్యాలు ఉండాలని పరోక్ష పన్నుల విచారణ కమిటీ (Indirect taxes Enquiry committee) సూచించింది.

ఎ) **జాతీయాదాయం** పెరిగినపుడు పన్నుల రాబడి పెరుగుట-ఆదాయవ్యాకోచత కలిగి ఉండుట.

బి) పన్నుల మొత్తం భారంలో పురోగామిత్వము.

సి) ఆర్థిక వనరుల ఉపయోగానికి సంబంధించిన లక్ష్యంతోను, ఉత్పత్తి ఉద్యోగితా, పెట్టుబడుల పెరుగుదలలక్ష్యంతోను పన్నుల విధానం తటస్థ వైఖరిని అవలంబించకుండా ఉండుట.

డి) పాలనా సౌకర్యం.

19-12-85 న కేంద్ర ఆర్థికశాఖామంత్రి చేసిన దీర్ఘకాలిక కోశ విధాన ప్రకటనలో ఎక్సైజ్ సుంకాల సంస్కరణలోని ముఖ్య ఉద్దేశ్యాలను ఈ క్రింది విధంగా చెప్పారు. బహుళంగా ఉన్న కేంద్ర ఎక్సైజ్ సుంకాల రేట్లను సరళము చేయుట, ఉత్పాదకాలపై విధించే పన్నులను తగ్గించుట, చిన్నతరహా పరిశ్రమలకు సహాయం చేసే ఉద్దేశ్యముతో అమలులో ఉన్న పథకాల సంఘటితకరణ. మార్కెట్ లో ఉన్న వస్తువుల కొరత తగ్గించి సందున హెచ్చు పన్నుల ద్వారా అదనపు వనరులు సమీకరించే పాత పద్ధతికి స్వస్తి చెప్పవలసిన అవసరముందని పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు చెపుతున్నారు. వస్తూత్పత్తి పెరిగి అమ్మకాలు పెరిగితే పన్నుల రాబడి కూడా పెరుగుతుంది.

### 15.3.8 పరోక్ష పన్నుల భారము

వినియోగదారుల వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నపుడు పరోక్ష పన్నుల భారంలో పురోగామిత్వం కన్పిస్తుందని "జాతీయ పబ్లిక్ ఫైనాన్స్" సంస్థ కేంద్ర ఆర్థికశాఖ తెలియ జేశాయి. వినియోగ వ్యయాల మొత్తం పెరిగే కొద్దీ పన్నుల భారం కుడా పురోగామి పద్ధతిలో పెరిగింది. కాని పరోక్ష పన్నుల లోని పురోగామిత్వము ఇంకా పెంచవలెనని 'షా' కమిటీ వారు సిఫారసు చేశారు. పరోక్ష పన్నుల ఆదాయ వ్యాకోచత్వాన్ని కూడా పెంచవలసిన ఆవశ్యకతను ఆర్థికశాఖా మంత్రి గుర్తు చేశారు.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి - 1**

---

1. ఎక్సైజ్ సుంకాల లక్ష్యాలను వివరింపుము.
2. ఎడ్వాలరమ్, స్పెసిఫిక్ డ్యూటీల మధ్య తేడా ఏమిటి?
3. స్పెసిఫిక్ డ్యూటీలో నున్న లోపమేమి? దానిని ఏవిధంగా సవరించగలవు.
4. మోడిఫైడ్ వేల్యూ ఏడెడ్ టాక్సు అంటే ఏమిటి?

---

## 15.4 కస్టమ్స్ సుంకాలు

### 15.4.1 అర్థం

ఒక కస్టమ్స్ ఏరియాలో ప్రవేశించే వస్తువులపై విధించే పన్నులను (దిగుమతి పన్నులు), లేదా ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళే వస్తువులపై విధించే పన్నులను (ఎగుమతి పన్నులు) 'కస్టమ్స్ సుంకాలు' అంటారు. భారత

రాజ్యాంగము ప్రకారం కస్టమ్స్ సుంకాలయిన ఎగుమతి దిగుమతి పన్నులను కేంద్ర ప్రభుత్వం మాత్రమే విధించి రాబడిని సేకరించుతుంది. ఈ రాబడిని రాష్ట్రాలతో పంపిణీ చేసుకోదు.

### 15.4.2 కస్టమ్స్ సుంకాల ఆవశ్యకత

రాబడి ఉద్దేశంతో కాని రక్షణ ఉద్దేశంతో కాని సుంకాలు విధిస్తారు. రాబడి ఉద్దేశంతో విధించే పన్నులను 'రెవిన్యూ సుంకాలని' దేశీయ పరిశ్రమల రక్షణకై విధించే సుంకాలను 'రక్షణ సుంకాల' ని పిలుస్తారు. కాని చాలా వరకు కస్టమ్స్ సుంకాలు రెండు రకాలకూ చెంది ఉంటాయి. ఆర్థికాభివృద్ధి దృష్ట్యా ప్రారంభదశలో ఉన్న దేశాలకు 'కస్టమ్స్ సుంకాలు' చాలా లాభాలను చేకూరుస్తాయి. ఒక వస్తువుపై పన్ను విధించి (దిగుమతి చేయబడిన) ప్రత్యామ్నాయ వస్తువులపై (దేశీయ వస్తువులపై) పన్ను విధింపక పోవుట కస్టమ్స్ సుంకాలలోని ప్రత్యేక లక్షణము. ఒక దేశపు ఆర్థికాభివృద్ధి ప్రణాళికల ఉద్దేశ్యంతో ఇది సాగుతుంది. అభివృద్ధి వ్యూహంలోని ఒకానొక లక్ష్యాన్ని సాధించడంలో కస్టమ్స్ సుంకాలు చాలా సమర్థమయిన ఉపకరణాలు-వినియోగ వస్తువుల దిగుమతులపై నిర్బంధాలు ముఖ్యంగా భోగాలకు సంబంధించిన వస్తువులపై, ఆర్థికాభివృద్ధికి అంతగా అవసరంలేని మూలధన వస్తువులపై నిర్బంధాలు. విదేశ మారకానికి డిమాండు తగ్గించడానికి కూడా కస్టమ్స్ సుంకాలు ఉపయోగకరాలు. వనరుల కేటాయింపును ప్రభావితం చేయడానికి కూడా ఇవి ఉపయోగిస్తాయి. కొన్ని నిర్దిష్ట ప్రాంతాల నుండి మాత్రమే ఈ సుంకాలను సేకరిస్తారు. కాబట్టి ఈ సుంకాల సేకరణ కూడా సులభమయిన విషయమే. కస్టమ్స్ సుంకాల ప్రాముఖ్యం ఒక దేశపు విదేశీ వ్యాపారపు ప్రాముఖ్యం మీద ఆధారపడి ఉంటుంది.

### 15.4.3 దిగుమతి సుంకాలు

BRAOU

కస్టమ్స్ సుంకాలలో ముఖ్యమైన భాగంగా దిగుమతి సుంకాలు ఉంటూ ఉన్నాయి. దిగుమతులపై పన్నుల విధింపు పన్నుల విధింపు పద్ధతిలో ఒకానొక ప్రాచీన పద్ధతి. క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రములో కూడా దిగుమతి, ఎగుమతి అయిన వస్తువులపై పన్నులు విధించే సూత్రాలు చేర్చబడి ఉన్నాయి. మౌలిక అవసరాల విషయములో ఒక్కొక్క దేశాన్ని స్వయం సమృద్ధిగా ఉంచడమే. ఈ రకమయిన పన్నుల విధింపుకు మూలకారణము భోగాలకు సంబంధించిన వస్తువులను మాత్రమే ఎక్కువగా దిగుమతి చేసుకోనిచ్చేవారు. కానీ దేశాలు అభివృద్ధి చెందే కొద్దీ అంతర్జాతీయ వ్యాపారపు స్వభావం కూడా మారింది. శిల్క్ వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలే కాక ఆహార పదార్థాలు, నూలు వస్త్రాలు కూడా సముద్రాలు దాటుతున్నాయి. 1776 లో ఆడమ్‌స్మిత్ తనపుస్తకం వ్రాసినపుడు స్వేచ్ఛా వ్యాపార ఆవశ్యకతను నమ్మించే విధముగా అతను చెప్పగలిగాడు. కాని అనేక పరిస్థితుల ప్రాబల్యం వల్ల విధాన నిర్ణేతలు స్వేచ్ఛా వ్యాపారాన్ని వదలి వేయవలసి వచ్చింది. స్వదేశీ పరిశ్రమలను సంపాదించాల్సి రావడం ఒకానొక కారణం. శైశవావస్థలో ఉన్న పరిశ్రమలను పోషించి రక్షించవలసిన బాధ్యత ఒక ముఖ్య ఉద్దేశ్యముగా రూపొందినది. విదేశీ చెల్లింపులలో సమతౌల్య సాధన ఇంకొక లక్ష్యము. దిగుమతులపై నియంత్రణ చేయుటకు దీనిని వేరొక సాధనముగా అభివృద్ధి చెందుతున్న దేశాలు పరిగణించాయి.

1923 కు పూర్వము భారత ప్రభుత్వము అవలంబించిన విధానము స్వేచ్ఛావ్యాపార సిద్ధాంతముపై ఆధారపడి ఉండేది. పన్ను విధింపు రేటులోని మార్పులన్నీ రాబడి కోసం చేసినవే. 1921-22లో "ఫిస్కల్ కమీషన్" (Fiscal Commisssion) వారు చేసిన సిఫారసుల ననుసరించి భారత ప్రభుత్వము విచక్షతతో కూడిన రక్షణ విధానాన్ని అంగీకరించింది. స్వాతంత్ర్యానంతరం రాబడి లక్ష్యాన్ని విస్మరించక పోయినప్పటికీ దేశ పారిశ్రామికాభివృద్ధికి దిగుమతి సుంకాలను దోహదకారులుగా చేసే ప్రయత్నం ఉండేది. 1950 ప్రాంతములో భారతదేశపు స్టెర్లింగ్ నిల్వలు తగ్గిపోవడముతో దిగుమతులపై విధించే ఆంక్షలు మరింత బలమయినాయి. 1965 ప్రాంతములో భారతదేశపు విదేశీ నిల్వలు చాలా తక్కువ స్థాయికి పడిపోయాయి. రూ. 100 కోట్ల లోపు ఈ

పరిస్థితులలోనే దిగుమతి పన్నుల సంబద్ధీకరణకు 1965 ఆగస్టులో ప్రయత్నం జరిగినది. ఫలితంగా మూడు రకాల రేట్ల అమలులోకొచ్చాయి. 40% 60% 100%, Advolorem పన్నుల విధింపుకు మూడు రకాల ప్రామాణిక రేట్లు ఉన్నప్పటికి వాస్తవానికి ఏడు రకాల రేట్లు ఉండేవి. 15%, 27 1/2%, 35%, 40%, 50%, 60%, 100%.

పై ఏడు రకాల రేట్లను నాలుగు రకాల రేట్లుగా 1971 లో తగ్గించడముతో 30% 40% 60% 100% దిగుమతి పన్నుల సంబద్ధీకరణ ప్రయత్నంలో మరొక ప్రయత్నం జరిగింది. ఇవి మౌలికమయిన దిగుమతి పన్నుల వ్యవస్థకు సంబంధించిన రేట్లు. 1963 ఫైనాన్స్ చట్టాన్ననుసరించి రెగ్యులేటరీసుంకాలను విధించే హక్కును ప్రభుత్వం తీసుకుంది. మౌలికమయిన ఎక్సైజ్ సుంకాలు, ఆక్సిలరీ సుంకాలు కాక 1975 కస్టమ్స్ టారిఫ్ యాక్ట్ క్రింద వేరొక అదనపు సుంకాలను విధించే హక్కు ప్రభుత్వానికి ఉంది. దీనిని 'సమానీకరణసుంకం' (Counterfeating) అంటారు. ఒక దేశీయ పరిశ్రమపై ఎక్సైజ్ సుంకం విధించినపుడు అదే పరిమాణములో దిగుమతి పన్నును కూడా విధిస్తారు. దీని వలన స్వదేశీ పరిశ్రమకు రక్షణ వలన కలిగే లాభం పోకుండా ఉంటుంది.

దిగుమతి పన్నులను సుమారు 100 వస్తువులపై విధించుచున్నప్పటికి అందులో ముఖ్యమయినవి యంత్రాలు, ఉపకరణాలు, ఇనుము-ఉక్కు, కెమికల్స్, మోటారు వాహనాల విడి భాగాలు, కిరోసిన్ మొదలగునవి.

దిగుమతులను పరిదిద్ది క్రమేపి పరిమాణాత్మకమయిన నిర్బంధాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఆర్థిక శాఖామంత్రి తెలియజేశారు. ప్రస్తుత పారిశ్రామికాభివృద్ధి స్థాయి దృష్ట్యా మూలధన వస్తువులపై ముడి పదార్థాలపై, విడిభాగాలపై ఒకే రేటుతో పన్ను విధించడం సాధ్యముకాదు. యంత్ర భాగాలపై విధించే పన్ను మౌలిక రేటు, ముడి పదార్థాలపై విధించే పన్ను కన్న కొంచెం ఎక్కువ స్థాయిలో ఉంది. కస్టమ్స్ సుంకపు రాబడిలో దిగుమతి పన్నుల ద్వారా వచ్చే రాబడి హెచ్చుగా ఉంది. 1985-86 నాటికి కస్టమ్స్ సుంకాల రాబడి రూ. 7,881 కోట్లు కాగా, దిగుమతి పన్నుల రాబడి రూ. 7, 696 కోట్లు. అంటే మొత్తములో 97.7% ఎగుమతి పన్నుల ద్వారా వచ్చిన రాబడి 96 కోట్లు. కస్టమ్స్ సుంకాల రాబడిలో కేవలం 1.2 శాతం. 1960-61, 1978-79 సంవత్సరాల మధ్య కస్టమ్స్ సుంకాలకు సంబంధించిన ఆదాయ వ్యాకోచత అన్ని పన్నుల వ్యాకోచత కన్నా తక్కువగా ఉంది. (0.59) పరోక్ష పన్నుల విచారణ కమిటీ వారు మాత్రము ఆదాయాలను ధరలకు అనుగుణంగా దిగుమతి పన్నులు జరుగుతాయనే ఆశాభావాన్ని ప్రకటించారు.

## 15.4.4 ఎగుమతి పన్నులు

కాలక్రమంలో వివిధ వస్తువులపై ఎగుమతి పన్నులను విధించేవారు. ప్రారంభంలో ఇది "టారిఫ్ పాలసీ" లో ఇది అంతర్భాగంగా ఉండేది. బ్రిటిష్ పాలన తొలిరోజుల్లో తక్కువ రేట్లతో అనేక వస్తువులపై Advalorem పద్ధతిలో ఎగుమతి పన్నులను విధించేవారు. భారతదేశానికి ఏకస్వామ్య హక్కులు ఉన్న వస్తువులమీద మాత్రమే ఎగుమతి పన్నును విధించాలని Indian Fiscal Commisssion (1921-22) అభిప్రాయ పడింది. 1924-25 నాటి Indian taxation Enquiry Committee కూడా ఈ అభిప్రాయానికి మద్దతు ప్రకటించింది. స్వాతంత్ర్యానంతరం ఎగుమతులకు ప్రోత్సాహం కలుగచేసే ఉద్దేశంతో ఎగుమతి పన్నులను క్రమంగా తగ్గించడం జరిగింది. ఉదాహరణకు జనుము వస్తువులు, టీ, జనపనార వస్తువులు, మొదలయినవి. మూడవ పంచవర్ష ప్రణాళికాంతానికి ఈ పన్నులు చాలా వరకు అదృశ్యమైనాయి. ఎగుమతి పన్నులు భారతదేశపు వినియోగదారుని మీద పడవనే ఉద్దేశ్యముతో పార్లమెంటు యొక్క ఆమోదం ముందుగా పొందకుండానే ఎగుమతి పన్నులను విధించడానికి, హెచ్చించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. కాఫీ, పొగాకు, ముడిపత్తి ఇనుప ఖనిజం లాంటి 19 వస్తువులపై ప్రస్తుతము ఎగుమతి పన్నులను విధిస్తున్నారు. స్వదేశములో అవ్యాకోచ సప్లయిగల వస్తువులపై ఎగుమతి పన్నులను విధించడం న్యాయమే అంటారు. ఎగుమతి పన్నులను ఒక్కొ వస్తువు పై విధించడముతో

ఈ క్రింది అంశాలను పరిగణనలోనికి తీసుకుంటారు. దేశీయ ఉత్పత్తి, ఎగుమతి చేయడానికి లభించే మిగులు, ఈ వస్తువులకు విదేశీ మార్కెట్ లోగల డిమాండు, అంతర్జాతీయ మార్కెట్ లో ఈ వస్తువుల ధరలు, విదేశీ మారకపు రేట్ల మార్పులు.

## 15.5 అమ్మకపు పన్ను

### 15.5.1 అర్థము

ప్రపంచంలో ఇంచు మించుగా అన్ని రకాల దేశాలు విధించే పన్నులలో అమ్మకపు పన్ను ఒకటి. ఇది రాబడి రీత్యా చాలా ప్రముఖమయినది. అమ్మకాలపైకాని, అమ్మకాలకు సంబంధించిన అంశాలపై కాని అన్ని రకాల వస్తువుల అమ్మకాలపైకాని, హెచ్చు వస్తువుల అమ్మకాలపై కాని విధిస్తారు.

### 15.5.2 అభివృద్ధి

ప్రాచీన భారతదేశానికి అమ్మకపు పన్ను అపరిచితమైన పన్ను కాదు. కాని ఆధునిక భారతదేశములో 1938 కి పూర్వం ఏ రాష్ట్రంలోనూ ఈ పన్ను ఉండేది కాదు. కాగా నేడు ఈ పన్నును విధించని రాష్ట్రంలేదు. భారత రాజ్యాంగం ప్రకారం (1950) వస్తువుల అమ్మకాలపైన కొనుగోలుపైన (వార్తాపత్రికలపై తప్ప) పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు ఉంది. అమ్మకపు పన్నులు ప్రధానంగా మూడు రకాలు. సాధారణ అమ్మకపు పన్ను, అంతర్రాష్ట్ర అమ్మకపు పన్ను, మోటారు స్పిరిట్ పై ప్రత్యేక చట్టాల ననుసరించి విధించే పన్ను. అంతర్రాష్ట్ర అమ్మకాలపై పన్నును ప్రత్యేక చట్టంక్రింద కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది.

అమ్మకపు పన్నులను మూడు రకాలుగ విధిస్తారు. ఒక స్థానంలో విధించే అమ్మకపు పన్ను, అనేక స్థానాలలో విధించే అమ్మకపు పన్ను. మూడో రకపు పన్ను సాధారణ టర్నోవర్ టాక్సు యొక్క రూపములో ఉంటుంది. చాల రాష్ట్రాలు అమ్మకపు పన్నును ఒకే స్థానంలో విధిస్తాయి. కొన్ని రాష్ట్రాలలో పైన చెప్పిన మూడు రకాల పన్నుల యొక్క మిశ్రమముంటుంది. ఈ మిశ్రమ పద్ధతిలో పన్ను విధింపుకు ఆంధ్ర ప్రదేశ్ ఒక ఉదాహరణ. అందుచే ఆంధ్రప్రదేశ్ లోని అమ్మకపు పన్ను వర్ణన, అమ్మకపు పన్ను యొక్క పూర్తి స్వభావ స్వరూపాలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

### 15.5.3 ఆంధ్రప్రదేశ్‌లో అమ్మకపు పన్ను

1957 సంవత్సరపు అమ్మకపు పన్ను చట్టము ననుసరించి కొన్ని రకాల వస్తువులపై అమ్మకపు పన్నును రూపాయకు 5 పైసలు చొప్పున అనేక స్థానాలలో విధిస్తారు. ఒకటవ షెడ్యూలులో పేర్కొన్న వస్తువులపై అమ్మకపు పన్నును ఒక స్థానం లోనే అమ్మినప్పుడు (First Sale) విధిస్తారు. రెండవ షెడ్యూలులో పేర్కొన్న వస్తువులపై పన్నును కొనుగోలు స్థానంలో విధిస్తారు. మూడవ షెడ్యూలులో పేర్కొన్న వస్తువులను ప్రకటించిన వస్తువులంటారు. వీటిపై పన్ను ఒక స్థానములోనే ఉంటుంది. నాలుగవ షెడ్యూలులో పేర్కొనిన వస్తువులపై పన్ను లేదు. సాధారణ వస్తువులపై అమ్మకపు పన్ను విధించినప్పుడు పన్ను విధింపుకు డీలర్ల టర్నోవరు పరపతి రూ. 50 వేలు. షెడ్యూల్లలో పేర్కొన్న వస్తువులపై విధించే పన్నుకు టర్నోవర్ కు సంబంధించిన పరిమితి లేదు. కాబట్టి పన్ను రేట్లు, పన్ను విధించే స్థానాలు, వస్తువులను బట్టి మారుతూ ఉంటాయి. విలాస వస్తువులపై విధించే పన్ను రేట్లు 10% నుండి 15% వరకు మారుతు ఉంటాయి. అమ్మకపు పన్నును వినియోగ వస్తువుల మీదనే గాక, ముడి పదార్థాల పైనను కూడ విధిస్తారు.



B R A O U

### 15.5.4 రాబడి ప్రాముఖ్యం

రాష్ట్ర ప్రభుత్వాల రాబడిలో హెచ్చుభాగం పరోక్ష పన్నుల ద్వారానే వస్తుంది. మొత్తం పన్నుల రాబడిలో, పరోక్ష పన్నుల రాబడి శాతం 1950-51 లో 63 శాతం కాగా, ఇది 76-77 లలో 87 శాతానికి, 82-83లో 91.8 శాతానికి పెరిగింది. వీటిలో అమ్మకపు పన్ను చాల ముఖ్యమైనది. రాష్ట్ర ప్రభుత్వాలకు తాము విధించే పన్నుల ద్వారా వచ్చే రాబడిలో 57 శాతం అమ్మకం పన్ను ద్వారానే 1976-77 లలో లభించింది. 1950-51 లో ఈ శాతం 26. 1982-83 (Accounts)1984-85 ( B. E) లలో కూడా అమ్మకపు పన్ను 58 శాతం రాబడిని చేకూర్చింది. ఆదాయ వ్యాకోచితా నియమం దృష్ట్యా కూడా అమ్మకపు పన్ను బాగానే ఉందని పరోక్ష పన్నుల విచారణా కమిటీ అభిప్రాయపడింది. 1960-61, 1978-79 కాలానికి అమ్మకపు పన్ను ఆదాయ వ్యాకోచితా గుణకం. 1.38. అనగా ఒకటి కంటే హెచ్చు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అమ్మకపు పన్ను కామధేనువులాంటిది. అభివృద్ధి చెందుచున్న దేశాలలో ఎక్కువ మందిపై ప్రత్యక్ష పన్నులను విధించుటకు వీలుండదు. కాబట్టే అభివృద్ధి విత్తములో అమ్మకపు పన్నుకు ప్రముఖ స్థానం ఉంది. ఝా కమిటీ వారు చెప్పినట్లు పెరుగుతున్న ఆర్థిక అవసరాలను తీర్చుటకు రాష్ట్ర ప్రభుత్వాలు పెంపొందించిన పన్ను అమ్మకపు పన్ను.

### 15.5.5 అమ్మకపు పన్ను సంస్కరణ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గల పరోక్ష పన్నులలో, కేంద్ర పరోక్ష పన్నులు ప్రగతిశీలమైనవని చెపుతారు. అందుచే అమ్మకపు పన్ను భారంలో కూడ పురోగమిత్వాన్ని పెంచవలసిన అవసరం ఉంది. విభిన్న రాష్ట్రాల మధ్య అమ్మకపు పన్ను విధింపు రేట్లలో భేదాలు ఉన్నందున, వాటిలో కొంతవరకైనా ఏకరూపత సాధించవలసిన అవసరముంది. లేనిచో హెచ్చు పన్నులు ఉండే రాష్ట్రాల నుండి వ్యాపారాలు, పరిశ్రమలు తరలిపోయే ప్రమాదముంది. వాని ఏకరూపత పేరిట అమ్మకపు పన్ను విధించే హక్కును వదులుకొని కేంద్రానికి ఆ హక్కును దత్తం చేయడానికి రాష్ట్రాలు సిద్ధంగా లేవు. అమ్మకపు పన్ను స్థానంలో Value Added Tax (VAT) విధించాలని గూడ తరచు సూచనలు వినవస్తూ ఉంటాయి. రిటైల్ వ్యాపార స్థాయి దగ్గర కాదుగదా, హోల్ సేల్ స్థాయి వద్దకూడా ప్రస్తుతం VAT గురించి ఆలోచించడం వివేకంతో కూడిన పని కాదు. దీనిని గూర్చి మరికొన్ని వివరాలు పదహారో పాఠంలో పరిశీలిద్దాము.

BRAOU

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

1. రెవిన్యూ సుంకాలకీ, రక్షణ సుంకాలకీ తేడా ఏమిటి.
2. కస్టమ్స్ సుంకాల లక్ష్యాలేమిటి.
3. సమానీకరణ సుంకాలు అంటే ఏమిటి.
4. రాబడిని దృష్టిలో యుంచుకొని ఎగుమతి, దిగుమతి సుంకాల ప్రాముఖ్యాన్ని వివరించండి.

### 15.6 సారాంశము

ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు, అమ్మకం పన్నులు పరోక్ష పన్నులలో ముఖ్యమైనవి. 1894 లోనే ఆధునిక ఎక్సైజ్ సుంకాల విధింపుకు శ్రీకారం చుట్టారు. 1971-1975 సంవత్సరముల మధ్యకాలంలో ఎక్సైజ్ సుంకాల ప్రాతిపదికను విస్తృతం చేయటం వల్ల యంత్రాలద్వారా తయారయ్యే అన్ని వస్తువులను ఈ పన్ను పరిధిలోకి తీసుకు రావడం జరిగింది. ఇటీవల ఈ ఎక్సైజ్ సుంకాల విధింపులో స్పెసిఫిక్ డ్యూటీ విధించే పద్ధతికి బదులుగా ఏడ్ వేలరమ్ డ్యూటీ విధించే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఎక్సైజ్ సుంకాల పన్ను రేట్లు 2%

నుండి 37% వరకూ వున్నాయి. కేంద్రానికి వచ్చే మొత్తం పన్ను రాబడిలో కేంద్ర సుంకాల ద్వారా సమకూరే రాబడి గణనీయంగా అభివృద్ధి చెందింది. దాని వాటా 1950-51 లో 16.7% నుండి 1985-86 లో 47.2% కి పెరిగింది.

కస్టమ్స్ సుంకాలను రాబడి వుద్దేశంతో కాని, రక్షణ వుద్దేశంతోకాని విధిస్తారు. విదేశీ మారకానికి డిమాండు తగ్గించడానికి కూడ ఇవి వుపయోగిస్తాయి. కస్టమ్స్ సుంకాల రాబడిలో 97.2% వాటా కల్గి యున్న దిగుమతి సుంకాలు, ఎగుమతి సుంకాల కంటే ప్రాధాన్యం వహించాయి. ఒక దేశీయ వుత్పాదనపై కస్టమ్స్ సుంకం విధించినపుడు అదే పరిమాణంలో ఆ వస్తువుపై దిగుమతి సుంకాన్ని విధిస్తారు. దీనివల్ల దేశీయ వుత్పాదకతకు రక్షణ లభిస్తుంది. దీనినే 'సమానీకరణసుంకం' అంటారు.

– ఆచార్య ఎం.ఎల్. కాంతారావు

## 15.7 సంప్రదింపు గ్రంథాలు

1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public finance
3. Hugh Dalton : Public finance
4. తెలుగు అకాడమి : పబ్లిక్ ఫైనాన్స్.

## 15.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింద ఇచ్చిన ప్రతిప్రశ్నకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. కేంద్ర ఎక్సయిజ్ సుంకాల లక్ష్యాలను మరియు వాటి రకాలను గూర్చి వ్రాయుము.
2. కస్టమ్స్ సుంకాల ఆవశ్యకతను వివరిస్తూ అందుగల రెండు భాగముల ఆవశ్యకతను వివరింపుము.

II. ఈ క్రింద ఇచ్చిన ప్రతిప్రశ్నకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. అమ్మకం పన్ను అభివృద్ధిని పరిశీలిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వ్యవస్థలో వాటి పాత్రను వివరించుము.
2. కేంద్ర ఎక్సయిజు సుంకాల రేట్ల నిర్మాణ వ్యవస్థను మరియు దాని వల్ల వచ్చే పన్ను రాబడిని గురించి విశదీకరించుము.

●●●

B R A O U

# భాగం – 16 : స్వాతంత్ర్యానంతరం పన్నుల విధానం – వివిధ సంఘాల సూచనలు

**విషయక్రమం**


16.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
16.1 పరిచయం
16.2 కోశ విధానపు ప్రాధాన్యత – పన్నుల విధానపు ప్రాధాన్యత
16.3 పన్నుల పథకం – పన్నుల సంస్కరణ
16.4 భారతదేశ పన్నుల విధానం
    16.4.1 భారతదేశంలో పన్నుల సంస్కరణలు
    16.4.2 నికోలస్ కాల్డార్స్ నివేదిక
    16.4.3 వాంఛూ కమిటీల సూచనలు
    16.4.4 ఛోక్సి కమిటీ సూచనలు
    16.4.5 కె.యన్. రాజ్ కమిటీ సూచనలు
    16.4.6 పరోక్ష పన్నుల విధానంపై కమిటీలు
    16.4.7 నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వారి అధ్యయన బృందపు నివేదిక, మార్చి, 1985.
16.5 సారాంశము
16.6 సంప్రదింపు గ్రంథాలు
16.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 16.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశపు పన్నుల విధానాన్ని, ప్రత్యక్ష పరోక్ష పన్నుల వ్యవస్థపై వివిధ సంఘాల సూచనలను ఈ భాగం వివరిస్తుంది.

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను అర్థం చేసుకోగలరు.

- కోశవిధానపు మరియు పన్నుల విధానపు ప్రాముఖ్యతను గుర్తించుట
- పన్నుల పథకం, పన్నుల సంస్కరణల మధ్యనున్న తారతమ్యం
- భారతదేశపన్నుల వ్యవస్థ విశ్లేషణ
- పన్నుల వ్యవస్థ పై వివిధ సంఘాల సూచనలను గ్రహించుట
- 1985 సంవు భారతదేశపు దీర్ఘకాలిక కోశ విధానంలోని ముఖ్యమైన ఘట్టాలను గుర్తించడం.

## 16.1 పరిచయం

పన్నుల విధానం, కోశ విధానంలో ఒక భాగం. మరియు అభివృద్ధిని, స్థిరత్వాన్ని సాధించడంలో దీనికి ప్రముఖ పాత్ర కలదు. వనరుల సేకరణ ఉద్దేశ్యంతో బాటుగా భారతదేశ పన్నుల విధానంలో సమానత్వం, ఆర్థికాభివృద్ధి మరియు ఉత్పాదకత ఉద్యోగిత మొదలైన మరిన్ని లక్ష్యాలు ఇమిడివున్నాయి. అందుచే ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఈ పన్నుల వ్యవస్థను మలచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆశించిన లక్ష్యాలను సాధించలేనప్పుడు పన్నుల వ్యవస్థలో మార్పులు చేర్పులు చేయుట పన్నుల సంస్కరణయొక్క ఉద్దేశ్యము. ఆర్థికాభివృద్ధికి ఉపయోగకరంగా ఉండే విధంగా పన్నుల వ్యవస్థను తీర్చిదిద్దుటకు అవసరమైన సలహాలను, సిఫారసులను చేయడానికి వివిధ సంఘాలను ప్రభుత్వం నియమించింది.

జాతీయ స్థాయిలో ఉన్న (National institute of Public Finance and Policy) పబ్లిక్ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఒక అధ్యయన బృందము, హెచ్చుగా ఉన్న రేట్లు పన్ను ఎగవేతకు దారి తీస్తుందని తెలియజేశారు. 1985-86 బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖామంత్రి ప్రత్యేకపన్ను రేట్లను తగ్గించడమే కాక ఎస్టేట్ సుంకాన్ని కూడా రద్దు చేశారు. పన్నుల విషయంలో స్థిరత్వం యొక్క ప్రాధాన్యాన్ని గ్రహించిన కేంద్ర ఆర్థిక శాఖామంత్రి ఒక దీర్ఘకాలిక కోశ విధానాన్ని ప్రకటించారు.

## 16.2 కోశ విధానపు, పన్నుల ప్రాధాన్యత

ఆర్థికంగా అభివృద్ధి చెందని దేశాలలో, ఆర్థికాభివృద్ధిని, స్థిరత్వాన్ని చేకూర్చడంలో కోశ విధానానికి అందులో భాగమైన పన్నుల విధానానికి ప్రముఖ పాత్ర ఉంది. కోశ విధానానికి ముఖ్యమైన సాధనాలు-పన్నులను విధించుట, ఖర్చు పెట్టుట, అప్పుచేయుట, అప్పులను తీర్చివేయుట, అమ్ముట, కొనుట. ఈ సాధనాలన్నింటిలో పన్నుల విధింపు సాధనం గొప్ప శక్తివంతమైనది. అభిలషణీయం కాని వాటిని నిరుత్సాహపరచడమే కాక, అభిలషణీయమైన వాటిని ప్రోత్సహించుటకు కూడా పన్నులను ఉపయోగించవచ్చును. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలినంత మేరకు మూలధన సమీకరణ చేయుట కోశ విధానము యొక్క ముఖ్యమైన ధర్మము. ఉద్యమిత్వాన్ని ప్రోత్సహించుట, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు ప్రోత్సాహకాలనిచ్చుట, వనరులను సమర్థవంతంగా కేటాయించుటకు వీలు కల్పించుట కూడా అవసరమైన విషయాలే. ప్రణాళికాబద్ధమైన వృద్ధి రేటును సాధించుటకు ఏ మేరకు మూలధన సమీకరణ చేయవలెనో ఆ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని పొదుపు పెరగవలెను. ఈ స్థాయిని చేరుటలో ప్రైవేటు రంగములోని పొదుపు తక్కువగా ఉన్నచో ప్రభుత్వ రంగంలోని పొదుపు దానిని భర్తీ చేయవలెను. కాన చాలినంత మేరకు పొదుపు పెరిగేలా చూడడంలో పన్నుల విధానం తోడ్పడవలె. అయితే ఆదాయపు పన్ను విధింపులో కాని, కార్పొరేషన్ పన్ను విధింపులో కాని పన్ను రేట్లు హెచ్చుగా నున్న అభివృద్ధి కుంటుపడుతుంది.

అంతేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రత్యక్ష పన్నుల సాధింపుకుగల అవకాశం తక్కువ. అందుచే వినియోగం మీద లభించే పన్నులు, వస్తువులపై విధించే పన్నులు, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు చాలా ప్రాముఖ్యం వహిస్తాయి. అభివృద్ధి లక్ష్యానికి, ఆర్థిక సమానత లక్ష్యానికి మధ్య వైరుధ్యం కూడా ఏర్పడవచ్చు. అభివృద్ధి జరుగుతున్నపుడు ఏర్పడే ద్రవ్యోల్బణాన్ని బడ్జెట్ విధానం ద్వారా నిరోధించవలసి ఉంటుంది. ఒక సమాజంలో అందుబాటులో ఉండే పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడం పన్నుల విధానపు ముఖ్య కర్తవ్యం. అందుచే పన్నుల విధానంలోని ముఖ్యమైన అంశాలు-పన్నుల విధింపు స్థాయి (స్థూల జాతీయోత్పత్తిలో పన్నుల దామాషా) పన్నుల వ్యవస్థలో అంతర్భాగంగా ఉండే విడివిడి పన్నులు, విడివిడి పన్నుల నమూనాలు. ఈ అంశాలన్నీ సామాజిక ప్రయోజనాలను సాధించటంలో తోడ్పడవలె.



BRAOU

## 16.3 పన్నుల పథకం – పన్నుల సంస్కరణ

ఈ సందర్భంలో 'పన్నుల పథకం', 'పన్నుల సంస్కరణ' అనే పదాల మధ్యగల వ్యత్యాసాన్ని గ్రహించటం అవసరం. ఒక అర్థశాస్త్రవేత్త చెప్పినట్లు సరికొత్తగా ఒక పన్నునుకాని పన్నుల వ్యవస్థనుగాని, రూపకల్పన చేసుకొంటే, అది పన్నుల పథకం కాగా, అమలులో ఉన్న పన్నుల వ్యవస్థను గాని, పన్నును గాని మారిన దేశ కాల పరిస్థితుల కనుగుణంగా మార్చే ప్రయత్నం పన్నుల సంస్కరణ. పన్నుల సంస్కరణలో ఈ క్రింది విషయాలు చేరివుంటాయి. ఎ) సరికొత్త పన్నును విధించడం, బి) పాత పన్ను స్థానంలో కొత్త పన్ను విధించడం సి) పన్నుల వ్యవస్థకు కొత్తరూపం ఇవ్వడానికి అమలులో ఉన్న పన్నును రద్దుచేయడం, డి) అమలులో ఉన్న పన్నులకు కొత్త ప్రాతిపదికను ఏర్పర్చడం, లేదా కొత్త రేట్లను ప్రవేశపెట్టడం పన్నుల విధింపు ప్రాతిపదికలోను, రేట్లలోను, మినహాయింపులలోను, రాయితీలలోను మార్పులు తెస్తే అది పన్నుల సంస్కరణ అవుతుంది. పన్నుల పథకం గృహ నిర్మాణాలు మొదలైన వాటికి ప్లాను వేయటం లాంటిది. ఆ ఇంటిని కట్టిన తర్వాత చేసే మార్పులు, రిపేర్లు పన్నుల సంస్కరణలాంటిది. ఒక పన్నుల వ్యవస్థ, లేదా పన్ను నిర్మాణానికి సంబంధించిన శాస్త్రం లేదా కళ పన్నుల పథకానికి సంబంధించినది. ప్రప్రథమంలో ఆశించిన లక్ష్యాలను నెరవేర్చకుండా ఉన్నప్పుడు, పన్నుల వ్యవవస్థను సరిచేయడానికి ప్రవేశపెట్టే మార్పులు పన్నుల సంస్కరణకు సంబంధించినది.

ఇరవయ్యో శతాబ్దపు ద్వితీయార్థంలో పన్నుల సంస్కరణపై అనేక పరిశీలక పుస్తకాలు రావడమేగాదు, కోశవిధానాన్ని సంస్కరించడానికి కూడా నిరంతర యత్నం సాగుతూ ఉంది. ప్రత్యక్ష పన్నుల రంగంలో ఆదాయపు పన్నును కార్పోరేషన్ పన్నులను ప్రాతిపదికగా పెంచుట – సంపద పన్ను మెరుగు పరచుట, పన్నుల సంస్కరణకు నమూనాలు, పరోక్ష పన్నుల రంగాన్ని Value Added Tax (V.A.T.) అనబడే పన్నును ప్రవేశ పెట్టడం ద్వారా సంస్కరించడానికి ప్రయత్నం జరుగుతూ ఉంది. కోశ విధాన సంస్కరణ మార్కెట్‌లో కొత్తనమూనాలు బాగానేలభ్యమవుతాయి. ఆశించిన లక్ష్యాలను నెరవేర్చేదే ఆర్థిక పరిస్థితులకు అనువైనదీ అయిన నమూనాను ఎన్నుకోవాలి.

ఈ భాగంలో మనం పరిశీలించాల్సిన విషయాలు: ఎ) భారతదేశపు పన్నుల విధానం సాధించడానికి ప్రయత్నించిన లక్ష్యాలు. బి) లక్ష్య సాధనలో లభించిన విజయం, సి) ఆశించిన లక్ష్యాలను సాధించడానికి పన్నుల విధానాన్ని సంస్కరించుటకు అవలంబించాల్సిన పద్ధతులు. భారతదేశపు పన్ను వ్యవస్థను సంపూర్ణంగాను పాక్షికంగాను అనేక కమిటీలు పరిశీలించి వందల కొలది సిఫారసులు చేశాయి. అయితే పన్నుల విధానం అద్భుతాలను చేయలేదు– అనేక రకాల సంస్థలు, అలవాట్లు సంబంధాలకు ఆలయమైన సామాజిక బంధంలో పన్నుల విధానం ఒక భాగం మాత్రమే. లక్ష్య సాధనకి అత్యుత్తమమైన మార్గంలో పన్నులు ఒక నిర్దిష్టమైన పద్ధతిలో పనిచేస్తాయి.

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. కోశ విధానపు ముఖ్య సాధనాలేమిటి?
2. పన్ను విధానపు లక్ష్యాలేమిటి?
3. పన్నుల పథకం, పన్నుల సంస్కరణలను వివరించండి?

## 16.4 భారతదేశపు పన్నుల విధానం

ఏవో కొన్ని స్పష్టమైన లక్ష్యాలను సాధించే విధంగా భారతదేశ పన్నుల వ్యవస్థను ఏ శిల్పి రూపొందించలేదు.

ఏహోకాన్ని చారిత్రక కారణాల వల్ల 1947 వరకూ ఉన్న బ్రిటిష్‌వారి ఆలోచనా పద్ధతికి అనుగుణంగా పన్నుల వ్యవస్థ అస్తవ్యస్తంగా పెరిగింది. ఆర్థికాభివృద్ధికి అవసరమైన వనరుల సమీకరణ సాధనంగా పన్నుల వ్యవస్థను స్వాతంత్ర్యానంతరం గ్రహించారు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడిని పెంచి, ఆర్థిక అసమానతలను తగ్గించే సాధనంగా కూడా పన్నుల వ్యవస్థ గుర్తింపబడింది. దేశములో లభ్యమయ్యే ఆర్థిక మిగులును సమగ్రంగా సమీకరించాలనే సూత్రమే భారతదేశ పన్నుల పద్ధతికి ప్రాతిపదిక. ఆర్థికాభివృద్ధి వల్ల ఏర్పడే ఆర్థిక మిగులును పన్నుల ద్వారా స్వీకరించాలి. జాతీయాదాయం పెరిగేకొద్దీ అందులో పన్నుల భాగం కూడా పెరగాలి. ఆదాయ వ్యాకోచితా సూత్రం మొత్తం పన్నుల వ్యవస్థకే కాక అందులోని ప్రత్యేకమైన పన్నులకు కూడా వర్తిస్తుంది. వనరులను సమీకరించేటప్పుడు, ఆర్థిక సమానతను కూడా పెంపొందించాలి. ధనిక వర్గాలవారు తమ ఆర్థిక మిగులును, అధిక వినియోగం కోసం ఉపయోగించకుండా నిరోధించడమే పన్నుల వ్యవస్థ లక్ష్యం కాదు. బీదవారు కూడా తమకు నూతనంగా లభించిన ఆదాయం పూర్తిగా వినియోగానికే ఖర్చు పెట్టకుండా చూడాలి.

ప్రభుత్వ పన్నుల విధానం కూడా, ఇతర విధానాలవలెనే, అది పనిచేసే సమాజంలోని ప్రజల ఆశయాలకు, అభీష్టాలకు, లక్ష్యాలకు అనుగుణంగా గమ్యాన్ని ఏర్పర్చుకొంటుంది. ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థలో, పన్నుల విధానపు లక్ష్యాలు సంబంధిత ప్రణాళిక లక్ష్యాలకు భిన్నంగా ఉండవు. 1-4-51 నుండి భారతదేశపు పన్నుల వ్యవస్థ లక్ష్యాలను ఈ దృష్టితో చూడవలసివుంటుంది. ప్రజల చేతులలో ఉన్న కొనుగోలు శక్తిని ప్రభుత్వ పరంచేసే ప్రముఖ సాధనంగా పన్నులను ఈ కాలంలో ఉపయోగించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తే, ఆర్థిక రాజకీయ స్థిరత్వం సాధ్యంకాదు కాబట్టి ఆదాయంలోని, సంపదలోని అసమానతలను తొలగించే సాధనంగా పన్నులను ఉపయోగించారు. కాబట్టి ఆర్థికాభివృద్ధి, ఆర్థిక సమానత అనేవి పన్నుల విధానపు జంట లక్ష్యాలు. ఆర్థిక అసమానత అనే గుర్రాన్ని, ఆర్థిక అభివృద్ధి అనే గుర్రాన్ని ఏకకాలంలో స్వారీ చేయుటకు వీలు అవుతుందా అనేది వేరే ప్రశ్న. ప్రైవేటు రంగములో మూలధన సమీకరణకు ప్రోత్సాహకాలను కలుగచేయుట పన్నుల విధానంలో మూడో లక్ష్యం. విస్తృత ప్రాతిపదికపై వినియోగాన్ని అరికట్టి ద్రవ్యోల్బణపు ఒత్తిడులను తగ్గించుటకు మరియొక లక్ష్యం.

### 16.4.1 భారతదేశంలో పన్నుల సంస్కరణలు

పన్నుల వ్యవస్థయొక్క సామర్థ్యాన్ని సమిష్టిగానూ, వ్యష్టిగానూ పెంచే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం పన్నుల సంస్కరణకై, అనేక కమిటీలను, కమీషన్లను నియమించింది. స్వాతంత్ర్యానికి పూర్వం 'Indian Taxation Committee' వారు భారతదేశంలో పన్నుల రంగాన్ని 1925లో పరిశీలించారు. దీనికి 30 సం॥ల తర్వాత, స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం ఏప్రిల్, 1953లో Taxation Enquiry Commission ను నియమించింది. దీనికి డా॥ జాన్ మత్తాయ్ అధ్యక్షులు. ఈ కమీషన్ వారు పరిశీలించాల్సిన అంశాలలో ముఖ్యమైనవి: (i) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు విధించే పన్నుల భారాన్ని పరిశీలించడం. (ii) ఆర్థికాభివృద్ధి, ఆర్థిక సమానత్వ లక్ష్యాల దృష్ట్యా అప్పుడు అమలులోవున్న పన్నులు ఎంతవరకు సరిపోతాయో పరిశీలించి, అవసరమైన మార్పులను సూచించడం. (iii) ఇతరత్రా కూడా పన్నుల విధింపులో అవసరమైన మార్పులను సూచించడం. ఈ కమీషన్ వారు నివేదికను మూడు భాగాలుగా సమర్పించారు. దేశంలోని మూడు స్థాయిల ప్రభుత్వాల పన్నుల వ్యవస్థను మొదటి భాగంలో పరిశీలించారు. రెండవ భాగంలో కేంద్ర ప్రభుత్వ పన్నులను, ముఖ్యంగా ఆదాయపు పన్ను, కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ సుంకాలు, ఎక్సయిజ్ సుంకాలు, వివరంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వాల పన్నులను గురించి మూడవ భాగంలో పరిశీలించారు. స్థానిక సంస్థల పన్నుల గురించి కూడా ఈ భాగంలో పరిశీలించారు. అప్పుడు అమలులో ఉన్న పన్ను రేట్లు, పన్నుల ప్రాతిపదిక, దేశములో లభ్యమయ్యే పన్ను చెల్లింపు శక్తిని పూర్తిగా వినియోగించలేకపోయిందని కమీషన్ అభిప్రాయపడింది. రాష్ట్రప్రభుత్వాల పన్నులకు సంబంధించి, అమ్మకపు పన్ను రాష్ట్రాలు విధించే పన్నుగానే ఉండాలని కమీషన్ అభిప్రాయంవెలిబుచ్చింది. అంతర్‌రాష్ట్ర అమ్మకాల విషయం మాత్రం కేంద్రప్రభుత్వ ఆధీనానికే వదిలివేయబడింది. స్థూలంగా చెబితే తిరోగామి ధోరణిలో



BRAOU

సాంప్రదాయబద్ధంగా ఉండిన భారతదేశపు పన్నుల వ్యవస్థను అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన వనరులను చేకూర్చే వ్యవస్థగా రూపొందించడానికి కమీషన్ ప్రయత్నం చేసినది. ఉదాహరణకు అభివృద్ధికై రిబేటు, పన్నుల విరామము మొదలైనవి.

### 16.4.2 నికోలస్ కాల్డార్స్ నివేదిక

ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు అవసరమైన ఆర్థిక వనరులను చేకూర్చటానికి పన్నుల వ్యవస్థలో వివిధమైన మార్పులు చేయాలని పరిశీలించవలసిందిగా భారతదేశపు ఆర్థిక మంత్రిత్వశాఖ, కేంబ్రిడ్జ్ యూనివర్శిటీకి చెందిన నికోలస్ కాల్డార్‌ని 1956 జనవరిలో కోరింది. కాల్డార్ ప్రత్యక్షపన్నులపై తన దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించి, ముఖ్యమైన మార్పులను సూచించారు. సమగ్రమైన ప్రత్యక్ష పన్నుల పథకాన్ని వీరు సూచించారు. అందులో అంతర్భాగంగా ఐదు పన్నుల విధింపును వీరు సిఫారసు చేశారు. (1) ఆదాయపుపన్ను (2) మూలధన లాభాలపై పన్ను (3) సంపదపై సాలీనా పన్ను (4) వైయక్తిక వ్యయముపై పన్ను (5) కానుకలపైపన్ను. పన్ను చెల్లింపుదారుడు సమర్పించే సమగ్రమైన రిటర్న్ ఆధారంగా ఈ పన్నులను మదింపు చేయవలసివుంటుంది. భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్థల మనుగడకు, సమర్థమైన పురోగామి పన్నుల పద్ధతి అవసరమని వీరు నొక్కి చెప్పారు. ఆదాయపు పన్ను విధింపులో గరిష్ఠ ఉపాంత పన్ను రేటు 45% మించి ఉండరాదని వీరు భావించారు. పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని సూచించేందుకు ఆదాయం కంటె వ్యయం మెరుగైన సూచికని వీరి అభిప్రాయం. 25% నుండి 300% పన్ను రేటు పెరిగేట్టుగా పురోగామి పద్ధతిలో వ్యయముపై పన్ను నొకదానిని వీరు సిఫారస్ చేశారు. పన్ను చెల్లించాల్సిన ఆదాయంలో మూలధన లాభాలను కూడా చేర్చాలి. ఎస్టేట్ సుంకాల చెల్లింపులో పన్ను ఎగవేత నరికట్టుటకు కానుకలపై పన్ను నొకదానిని, సంపదలపై సాలీనా పన్నును ఒకదానిని కూడా వీరు సిఫారస్ చేశారు.

పురోగామి పద్ధతిలో ఆదాయపు పన్నును విధించుటవల్ల పని, పొదుపు, ఉద్యమిత్వం మున్నగు వానిపై కలిగే దుష్ఫలితాల ప్రభావాన్ని తగ్గించుటకు వైయక్తిక వ్యయముపై పన్ను, సంపదలపై సాలీనా పన్ను తోడ్పడుతాయని వీరు భావించారు. తిరిగి రీఫండు చేయని రీతిలో కంపెనీలపై ఆదాయపు పన్ను రుపాయకు 7 అణాలు చొప్పున (44%) విధించాలని వీరు సూచించారు. పంపిణీ అయిన, పంపిణీ కాని మొత్తం లాభాలపై ఈ పన్ను విధించవలెను. అయితే ఇతర వ్యాపార పన్నులను రద్దుచేయాలని కూడా వీరు సూచించారు. వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంలో ఈ పన్ను ఎగవేత అరికట్టుటకు కంపెనీల అకౌంట్లను నిర్బంధంగా ఆడిటు చేయవలెనని వీరు సూచించారు. ఈ నిర్బంధ ఆడిట్ కనీస పరిమితి వ్యాపార ఆదాయాల విషయంలో రూ.50,000, ఇతర వైయక్తిక ఆదాయాల విషయంలో రూ.1,00,000 పన్ను ఎగవేతను నియంత్రణ చేయుటద్వారా ద్వితీయ పంచవర్షప్రణాళికా కాలంలో తగినంత రాబడి వస్తుందని వీరు భావించారు. ఆదాయానికి సంబంధించి సమగ్రమైన రిటర్నుద్వారాను, ఒక దానిలో ఎగవేతను ఇంకొకటి అరికట్టే విధంగా ఉండే పన్నుల విధింపువల్లను ఆర్థిక వ్యవస్థలో అవసరమైన వనరులను సమీకరించవచ్చు.

పన్ను సంస్కరణల విషయంలో తన నివేదికను 1958 డిసెంబర్ లో కాల్డార్ ఈ విధంగా ప్రకటించారు. మూలధనలాభాలపైన, సంపదపైన వైయక్తిక వ్యయముపైన, కానుకలపైన పన్ను విధింపు ప్రారంభించి, భారతదేశం సమర్థమైన పురోగామి పన్ను వ్యవస్థను ప్రవేశపెట్టుటకు గత కొద్ది సంవత్సరాల నుండి మంచి ప్రయత్నమే చేసింది. ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఆదర్శంగా ఉండే వ్యవస్థకు భారత దేశం ఒక గట్టి ప్రాతిపదికను తయారు చేసింది. కాని ఇంతవరకు ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రారంభదశలోనే ఉన్నాయన్న విషయాన్ని కొన్ని నూతన పన్నులకు సంబంధించిన శాసనాలు లోపభూయిష్ఠంగా ఉన్నాయనే విషయాన్ని మనం విస్మరించరాదు. సమర్థవంతమైన పాలనకు, అవసరమైన కొన్ని చర్యలను తీసుకొనలేదు సరికదా, వ్యాపారాలపైన, కంపెనీలపైన విధించే పన్నుకు సంబంధించిన ముఖ్యమైన సంస్కరణలను కూడా చేపట్టలేదు.

BRAOU

అప్పుడు అమలులో ఉన్న శాసనాలలో కొన్ని మార్పులు చేసి మరికొన్ని క్రొత్త సంస్కరణలను పరిపాలనారంగములో ప్రవేశపెట్టనిదే సమానత్వ ప్రాతిపదికపై ఆధారపడిన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించే ప్రయత్నం విఫలమవుతుందని కూడా వారు హెచ్చరిక జేసారు. ఆదాయాలపై గరిష్ఠ ఉపాంత పన్ను రేటు 45% ఉండాలని కాల్డార్ సిఫారస్ చేసినప్పటికి అది ఇంతవరకు అమలులోనికి రాలేదు. కంపెనీలపై విధించే పన్నును కూడా ఈనాటికి ఏడలాల స్థాయికి (44%) తగ్గించలేదు. ఆతని సిఫారస్‌ల ఆధారంగా ప్రవేశపెట్టిన వ్యయంపై పన్నును కూడా కొనసాగించక 1956లో రద్దుచేశారు.

### 16.4.3 వాంఛూ కమిటీ సూచనలు

ప్రత్యక్ష పన్నుల రంగంలో మరి రెండు కమిటీలను కూడా ప్రభుత్వం నియమించింది. 1970 మార్చిలో జెస్టిస్ కె. ఎన్. వాంఛూ అధ్యక్షతన ప్రత్యక్ష పన్నుల విచారణా సంఘము (Direct Taxes Enquiry Committee) ను ప్రభుత్వం నియమించింది. ఆదాయపన్నుకు సంబంధించి గరిష్ఠ ఉపాంతపన్ను రేటు 97.75% నుండి 75%కి తగ్గించవలెనని ఆ కమిటీ సిఫారసు చేసింది. అల్పాదాయ వర్గాలకు చెందినవారి పన్ను చెల్లింపు విషయములోను, మధ్యతరగతికి చెందినవారిపన్ను విషయంలోను కొన్ని రాయితీలను ఈ కమిటీ సిఫారసు చేసింది. ఆదాయపు పన్ను చెల్లించే ప్రతివారికి ఒక పర్మినెంటు నెంబరు ఇవ్వవలెనని కూడా వీరు సూచించారు. పన్ను విధింపుకై భార్యాభర్తల ఆదాయాన్ని విలీనం చేయటానికి కూడా సుముఖులు కారు. ఈ కమిటీ వారి విచారణపరిధి పరిమితంగా ఉన్నప్పటికి వీరు చాలా ఉపయోగకరమైన సూచనలు చేసారు. పన్ను రేట్లు హెచ్చుగా ఉండడమే పన్ను ఎగవేతకు ముఖ్యమైన కారణమని వీరు స్పష్టం చేశారు.

### 16.4.4 చోక్సి కమిటీ సూచనలు

The Direct Tax Laws Committee అనబడే ప్రత్యక్ష పన్నుల శాసనాల కమిటీ, "చోక్సి" అధ్యక్షతన 1977 జూన్‌లో నియుక్తమై 1978 లో సెప్టెంబరులో నివేదికను సమర్పించింది. ఆదాయపు పన్ను, సంపదపన్ను, కానుకలపన్ను sur tax (సర్‌టాక్సు)ల విధింపులు పాలనా సంబంధమైన సంస్కరణలను ఎన్నింటినో ఈ కమిటీ సిఫారసు చేసింది. ఈ నాలుగు పన్నులకు కలిపి సంఘటితమైన శాసనాన్ని కూడా ప్రవేశపెట్టవలెనని ఈ కమిటీ సూచించింది. రెండు లక్షలకుమించిన ఆదాయాలపై ఉపాంత పన్ను గరిష్ఠ రేటు 60%కు మించరాదని ఈకమిటీ సిఫారసు చేసింది. ఆదాయపుపన్ను పై విధించే సర్ చార్జీని రద్దు చేయమని కూడా ఈ కమిటీ సిఫారసు చేసినది.

### 16.4.5 కె.ఎన్. రాజ్ కమిటీ సూచనలు

వ్యవసాయ సంపద ఆదాయములపై విధించే పన్నుకు సంబంధించిన కమిటీ నొక దానిని కె.ఎన్.రాజ్ అధ్యక్షతన 1972 ఫిబ్రవరిలో నియమించారు. ఈ కమిటీని 'The Committee on Taxation of Agriculture Weath and Income' అని అంటారు. ప్రస్తుతం అమలులో నున్న భూమి శిస్తు స్థానంలో Agriculture Holidays tax "(A.H.T.) అని పిలువబడే పన్నును విధించాలని ఈ కమిటీ సూచించింది. వ్యవసాయేతర ఆదాయంపైవిధించే ఆదాయపు పన్ను రేటు నిర్ధారించుటకు వ్యవసాయేతర ఆదాయాన్ని కాక, వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా విలీనం చేయవలెనని ఈ కమిటీ సిఫారసు చేసినది.

### 16.4.6 పరోక్షపన్నుల విధానంపై కమిటీలు

ఈ క్రింద పేర్కొన్న కమిటీలు పరోక్షపన్నులకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించాయి. 1963లో

BRAOU

చాందా కమిటి, 1965లో భూతలింగం గారి ఏకసభ్య కమీషన్, 1967లో డి.ఎన్.తివారి అధ్యక్షతన కస్టమ్స్ సుంకాలకు చెందిన అధ్యయన బృందము మరియు వెంకటప్పయ్యగారి అధ్యక్షతన ఏర్పడిన కమిటీ కాని ఆర్థిక రంగములో త్వరితగతిన వచ్చుచున్న మార్పుల దృష్ట్యాను పరోక్ష పన్నుల ప్రాధాన్యత దృష్ట్యాను 'ఎల్.కె.ఝా' అధ్యక్షతన పరోక్ష పన్నుల విచారణకై ఒక కమిటీ ని ప్రభుత్వం నియమించింది.Indirect Taxation Enquiry Committee గా పిలువబడే ఈ కమిటీ తన తుది నివేదికను 1978లో సమర్పించింది. ఆర్థిక సాంఘిక వృద్ధిని పెంపొందించుటకు అవసరమైన వనరులను సమీకరించుట పన్నులవ్యవస్థ యొక్క ముఖ్యోద్దేశ్యమని ఈ కమిటి అభిప్రాయపడినది. ఏ ఆర్థిక కార్యకలాపాన్ని పరిపూర్తించుటకై వనరులను సమీకరిస్తున్నారో ఆ కార్యకలాపాలను ప్రోత్సహించవలసిన బాధ్యత పన్నుల వ్యవస్థపై గలదు. అయితే వనరులను ఉపయోగించడము లోని సామర్థ్యన్ని పన్నుల వ్యవస్థ సాధించాలంటే పన్నుల వ్యవస్థలో స్థిరత్వముండాలి.

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్వతంత్రంగాను విడివిడిగాను సమన్వయములేకుండా విధించిన పన్నుల విధాన ఫలితమే ప్రస్తుత పరోక్ష పన్నుల వ్యవస్థ. ఏ ఒక్క పరోక్షపన్నుల వ్యవస్థ పూర్తిగా హేతుబద్ధంగాను, అంతర్గతమైన పొందిక కలదిగాను లేదు. అవి ఒక దానితో ఒకటి కలసి హానికరమైన ఫలితాలు ఎక్కువజేసాయి. ఒక్కొక్క పన్నులో అంతర్గతమైన పొందికను పెంపొందించడము, విభిన్న పన్నుల మధ్య సమన్వయాన్ని హెచ్చించి పన్నుల వ్యవస్థను హేతుబద్ధం చేయడం పన్నుల సంస్కరణలో ముఖ్యోద్దేశాలు. వాటిలో ఉన్న లోపాలను సరిదిద్దినప్పుడు పరస్పరం వైరుధ్యంలేని పరోక్షపన్నుల వ్యవస్థ నిర్మాణానికి అవి తోడ్పడతాయి. ముడి సరుకులపైన ఇతర ఉత్పాదకాలపైనను ఎక్సైజు సుంకాలను, కస్టమ్స్ సుంకాలను, అమ్మకపు పన్నునూ సమన్వయం లేకుండా విస్తారంగా విధించడం ప్రస్తుత పరోక్షపన్నుల వ్యవస్థలో పెద్ద లోపం. రాబడి కోసమే పన్నులను విస్తృతంగా విధించడం జరిగింది. అటువంటి పన్ను విధింపు వలన కలిగే హానికరమైన ఆర్థిక పరిణామాలను విస్మరించడం మరియొక లోపము. అందువల్ల ఆర్థికంగా, సాంఘికంగా పాలనాపరంగా అవాంఛనీయమైన వైపరీత్యాలతో. కూడిన ఒక సంక్లిష్టమైన పన్నుల వ్యవస్థ ఆవిర్భవించింది.

పైకారణాల దృష్ట్యా ఎక్సైజు సుంకాలలో గల విభిన్నమైనపన్ను రేట్లను తగ్గించాలని ' ఝా' కమిటి సిఫారసు చేసినది. విభిన్న ఉత్పత్తులపైన, ఉత్పాదకాలపైన విధించే పన్నుల సంఖ్యను తగ్గించాలి. ఉత్పత్తులపై ఎక్సైజు సుంకాన్ని విధించినప్పుడు ఆ ఉత్పత్తులకు తోడ్పడే ఉత్పాదకాలపై తగిన రీతిలో పన్ను మినహాయింపు ఉండాలి. వివిధ పన్నులకుసంబంధించిన ప్రతాపాన్ని (Cascanding) అరికట్టడానికి నిర్ణీత కాలంలో ఒక పరిష్కారమార్గాన్ని కనుగొనాలి. అమ్మకపు పన్ను ఒక్కొక్క రాష్ట్రములోని వినియోగదారులపై విధించే పన్నుగా ఉండాలి. కాని, అది ఉత్పత్తి ప్రక్రియలో కలిసిపోరాదు. క్రమేపి రాష్ట్రప్రభుత్వాలు అమ్మకపు పన్నును చివరిదశలో ఏకస్థానపు పన్నుగా విధించాలి. ఈ పన్నుకు ఒక నిర్దిష్టమైన స్థానం ఉండాలంటే ఉత్పత్తి స్థాయిదాటిన తరువాత స్థాయిలలో వస్తువుకు చేకూరే అధిక విలువలపై పన్ను పడేలా రూపొందించాలి. అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ప్రస్తుతం గరిష్ట పన్ను రేటు 4%గా ఉంది. దీనిని క్రమేపి 1%కు తగ్గించాలి.

దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో కస్టమ్స్ సుంకాలను కొన్ని వస్తువులపై విధించడం జరుగుతుంది. అప్పుడు ఆ రకమైన సుంకాల విధింపులో రెండు భాగాలుంటాయి. (1) దేశీయ పరిశ్రమల రక్షణ కోసం విధించే పన్ను భాగం రెండవ భాగం అదే రకమయిన దేశీయ ఉత్పత్తులపై విధించే ఎక్సైజ్ సుంకానికి పోలిన భాగం. ఈ రెండవ భాగం దేశీయ వస్తువుల ఎక్సైజ్ సుంకం కంటె హెచ్చుగా లేకుండా కస్టమ్స్ సుంకాలను పరిష్కరించాలి. వివిధ ఉత్పత్తి సంస్థలు తాము చేకూర్చే విలువల ఆధారంగా నిర్దిష్టమైన మినహాయింపు పొంది ఉంటే తప్ప వస్తువుల, సేవల అమ్మకందార్లు చెల్లించే పన్నును "Value - AddedTax" (V.A.T.) అంటారు. V.A.T. అనబడే ఈ పన్నును సమగ్ర రూపంలో ప్రవేశపెట్టడానికి రెండు పెద్ద అవరోధాలున్నాయి. ఒకటి రాజకీయమైనది, రెండవది పరిపాలనాపరమైనది. కాని ఉత్పత్తి స్థాయిలో ప్రప్రథమంగా V.A.T. అనబడే పన్నును సంస్కరించబడిన

అమ్మకపు పన్నుతో పాటు విధించవచ్చునని 'ఝా' కమిటి అభిప్రాయపడింది.

ఝా కమిటి వారి సిఫారస్ లలో కొన్నిటికి భారత ప్రభుత్వం కార్యరూపం చేకూర్చింది. మరికొన్ని భారతప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

**16.4.7 National Institute of Public Finance and Policy వారి అధ్యయన బృందపు నివేదిక : March 1985.**

భారతదేశంలో పన్ను ఎగవేతకు సంబంధించిన ప్రశ్నను National Institute of Public Finance and Policy వారి అధ్యయన బృందం పరిశీలించి తమ నివేదికను 1985 మార్చిలో సమర్పించింది. స్థానికమైన పన్ను రేట్లు హెచ్చుగా ఉండడం, పన్ను ఎగవేతకు,నల్లధనం ఉత్పత్తికి ప్రధానమైన హేతువని ఈ బృందం అభిప్రాయపడింది. కంపెనీల లాభాలపై విధించే పన్ను స్టాంపు డ్యూటీలు, ఎస్టేటు డ్యూటీల భారాన్ని కేంద్రప్రభుత్వం బాగా తగ్గించవలెనని ఈ బృందం అభిప్రాయపడింది. ఆస్తులకు సంబంధించిన లావాదేవీలపైననూ, ఇతర లావాదేవీలపైననూ విధించే స్టాంపు డ్యూటీలను కూడా అదేవిధంగా తగ్గించవలెనని ఈ బృందం అభిప్రాయపడింది, కంపెనీల అవసరం ఉండదని వీరు అభిప్రాయపడ్డారు. పన్నుల నామమాత్రపు రేట్లను పెంచకుండా ద్రవ్యోల్బణముతో సరిసమానంగా ఉండే విధంగా పన్ను రేట్ల వ్యవస్థకు 'Automatic Inflation Indexation' ఉండటం శ్రేయస్కరమని ఈ కమిటి అభిప్రాయపడింది.

భారతదేశం లాంటి దేశంలో పన్నుల వ్యవస్థ సరళంగా ఉండవలసిన అవసరముంది. రాబడి లక్ష్యానికి, ఆర్థిక సమానతల లక్ష్యానికి, అనుగుణంగాను, సుసంగతంగాను ఈ వ్యవస్థను రూపొందించాలి. హెచ్చు రేట్లతో పన్ను విధించి అనేక రకాలయిన మినహాయింపులు ఇచ్చేకంటే పరిమితమైన రేట్లతో విస్తృత ప్రాతిపదికపై పన్నులు విధించడం శ్రేయస్కరమని ఈ బృందం అభిప్రాయపడింది.

భారతదేశంలోని పన్నుల వ్యవస్థ సంస్కరణకై వివిధ కమీషన్లు, కమిటీలు చేసిన సిఫారస్‌లను, ఆయా సిఫారస్‌లను ఏఏ సందర్భాలలో చేసినారో గుర్తుంచుకోవలసి ఉంటుంది. అప్పుడు అమలులో ఉన్న సాంఘిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వాటిని అర్థం చేసుకోవలెను. అంతేకాక పన్నుల సంస్కరణ అనేది నిరంతరం సాగే ప్రక్రియ. ఆర్థిక సమానత, ఆర్థిక సామర్థ్యము, ఉత్కృష్టత మొదలైనవి సాధించుటయే ఈ సంస్కరణల ఉద్దేశం. పన్ను సంస్కరణ ఫలితం కేవలం పన్ను భారంలో తగ్గింపుకాదు. సామర్థ్యం, సమానత్వాల పెంపుదల కూడా. పన్ను చెల్లింపుదారులు తాము ఏ స్థాయిలో పన్ను చెల్లిస్తున్నామో, ఎంత భారాన్ని వహిస్తున్నామో తెలుసుకొనివుంటే, పన్నుల సంస్కరణ సులభతరమవుతుంది.

---

సి. అవగాహనను పరీక్షించుకోండి – 2

---

1. ప్రత్యక్ష పన్నుల వ్యవస్థలోని రకాలేమిటి?
2. సమగ్ర ప్రత్యక్షపన్నుల పథకంలో కాల్డార్ సూచించిన పన్నులేమిటి?
3. కాల్డార్ సూచించిన ముఖ్య సిఫార్సులను వివరింపుము.
4. వాంఛూకమిటీ చేసిన సూచనలను వ్రాయుము.
5. చోక్సి కమిటి సూచించిన సవరణలను పరిశీలించుము.
6. ఎల్.కె. ఝా కమిటి చేసిన సూచనలనుసంక్షిప్తంగా వివరించుము.

## 16.5 సారాంశము

పన్ను విధింపు, ప్రభుత్వవ్యయం, ఋణములు చేయుట అనేవి కోశవిధానపు ముఖ్య సాధనాలు. సముచితమైన పన్ను విధింపు ద్వారా సమాజపు పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని సమగ్రంగా వినియోగించుకోవడం పన్ను విధానపు ముఖ్య లక్ష్యం. భారతదేశంలో ప్రణాళికాలక్ష్యాలే పన్ను విధానపు లక్ష్యాలుగా కూడ వుంటాయి. పన్ను విధానంలో తగిన సంస్కరణలను సూచించే నిమిత్తం ప్రభుత్వము అనేక సంఘాలను కాలానుగుణంగా నియమిస్తూ వచ్చింది. కాల్డార్ ఆదాయపన్ను గరిష్ట రేటు 45% గాను, ఆదాయపన్ను స్థానంలో పురోగామిత్వం కల్గివున్న వ్యయపన్నును సిఫార్సు చేశాడు. వాంచూ సంఘం నివేదికలో, గరిష్ట ఉపాంత ఆదాయపన్ను రేటును 97.5% నుండి 75% కి తగ్గింపుతో మధ్యతరగతి, బడుగువర్గాలకు ఆదాయపన్ను రాయితీ కల్పించడానికి సిఫార్సు చేసింది. ఛోక్సి కమిటీ గరిష్ట ఉపాంత రేటు 60 శాతంగా వుండాలని సూచించింది.

పరోక్షపన్నుల విషయంలో, యల్.కె. ఝా కమిటీ ఎక్సైజు సుంకాలలో గల విభిన్నమైన పన్నురేట్లను తగ్గించాలని సిఫార్సు చేసింది. అమ్మకపు పన్ను చివరిదశలో ఏకస్థానపు పన్నుగా విధించాలని కూడా సూచించింది.

– ఆచార్య ఎం. ఎల్. కాంతారావు

## 16.6 సంప్రదింపు గ్రంథాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Hugh Dalton : Principles of Public Finance
4. తెలుగు అకాడమి : పబ్లిక్ ఫైనాన్స్


## 16.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింద ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి?

1. భారతదేశంలోని ప్రత్యక్షపన్నులకు సంబంధించి వివిధ విచారణ సంఘాలు సూచించిన సిఫార్సులను పరిశీలించుము.
2. ఎల్.కె. ఝా కమిటీ చేసిన సిఫార్సులను పరీక్షించుము.

II. ఈక్రింద ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. పన్నుల పథకానికి,పన్నుల సంస్కరణకు మధ్యగల భేదం ను వివరిస్తూ, భారతదేశ పన్నుల సంస్కరణ ఆవశ్యకతను తెలుపుము.
2. భారతదేశపన్నుల లక్ష్యాలను విశదీకరింపుము.
3. కేంద్ర విత్తమంత్రి ప్రకటించిన దీర్ఘకాల విత్త విధానంను గూర్చి చర్చించుము.
4. భారతదేశంలో పన్ను ఎగవేతకు సంబంధించి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వారి అధ్యయన బృందం వారు వెలిబుచ్చిన అభిప్రాయములను చర్చించండి.

●●●



BRAOU

# ఖండం – 4

## ప్రభుత్వ వ్యయం

ప్రభుత్వ విత్తంలోని ముఖ్యమైన భాగాంలో ఒకటి ప్రభుత్వ వ్యయం. ఈ ఖండంలో మనం ప్రభుత్వ వ్యయాన్ని చర్చించుకొందాం. ప్రభుత్వవ్యయ నియమాలను వివరిస్తూ, ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు గల కారణాలను విమర్శనాత్మకంగా విశ్లేషించుకొందాం. ప్రభుత్వ రంగ పెరుగుదలకు సంబంధించిన సిద్ధాంతాలను తెలుసుకొందాం. ఇక రెండవ భాగంలో భారత దేశంలో ప్రభుత్వ వ్యయ వర్గీకరణ, తీరు తెన్నులు, పెరుగుదల గురించి విశ్లేషించుకుందాం. చివరి భాగంలో ఉత్పత్తిపై, పంపిణీపై, వనరుల కేటాయింపు పై ప్రభుత్వ వ్యయ ప్రభావం ఏ విధంగా వుంటుందో చర్చించుకొందాం.

ఈ ఖండంలో చేర్చబడిన 3 భాగాలు :

భాగం – 17 : ప్రభుత్వ వ్యయ పెరు దలకు కారణాలు
భాగం – 18 : భారతదేశంలో ప్రభుత్వ వ్యయ తీరులు, పెరుగుదల
భాగం – 19 : ప్రభుత్వ వ్యయ ప్రభావాలు

❖❖❖

BRAOU

# భాగం – 17 : ప్రభుత్వ వ్యయం పెరుగుదలకు కారణాలు

**విషయక్రమం**


17.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
17.1 పరిచయం
17.2 ప్రభుత్వవ్యయ పరిధి
17.3 ప్రభుత్వవ్యయ నియమాలు
17.4 ప్రభుత్వరంగ వృద్ధిని గురించిన శాస్త్రీయ విశ్లేషణ
    17.4.1 వాగ్నర్ పరికల్పన
    17.4.2 పీకాక్-వైజ్ మన్ ల పరికల్పన
17.5 ప్రభుత్వ వ్యయం పెరగడానికి గల కారణాలు
17.6 ముగింపు
17.7 సంప్రదించు పుస్తకాలు
17.8 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 17.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగం యొక్క ముఖ్యోద్దేశము ప్రభుత్వ వ్యయం పెరగడానికి కల కారణాలు మరియు ప్రభుత్వ వ్యయ నియమాలను పరిశీలించడముతోబాటు ప్రభుత్వ రంగములోని శాస్త్రీయసిద్ధాంతాలను విశ్లేషించడము.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకోగుల్గుతారు.

- ప్రభుత్వ రంగ వ్యయనియమాలను విశదీకరించడము.
- ప్రభుత్వ రంగవృద్ధికి సంబంధించిన శాస్త్రీయ పద్ధతులను విశ్లేషించడము.
- ప్రభుత్వ వ్యయం పెరగడానికి గల కారణాలను గుర్తించడము.

## 17.1 పరిచయం

కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాల వ్యయాల మొత్తాన్ని ప్రభుత్వ వ్యయమంటారు. ప్రభుత్వకార్యకలాపాలు నిరవధికంగా పెరుతూండడంవల్ల ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ప్రభుత్వవ్యయం పెరుగుతోంది. 19వశతాబ్దంలో ప్రభుత్వ విధులు చాలా పరిమితంగా ఉండడంవల్ల ప్రభుత్వ వ్యయం యొక్క అవసరం ఎక్కువగా ఉండేదికాదు కాని 20వశతాబ్దంలో విద్య, ఆరోగ్యం, వాణిజ్యం, పరిశ్రమలు,నీటిపారుదల ప్రాజెక్టులు మొదలగు అనేక రంగాలకు ప్రభుత్వ విధులు విస్తరించడంలో ప్రభుత్వ వ్యయ ప్రాధాన్యం పెరిగింది. ప్రభుత్వ వ్యయ స్వభావం, పరిమాణం ఆర్థికరంగ ఉత్పత్తి, ఉద్యోగిత, పంపిణీలను ప్రభావితం చేసి పౌరుల ఆర్థిక జీవనంలో మార్పులు తెస్తాయి. ఈ విషయాన్ని గుర్తించడంవల్ల ప్రభుత్వ వ్యయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతోంది.

BRAOU

## 17.2 ప్రభుత్వ వ్యయ పరిధి

ప్రభుత్వ వ్యయపరిధిని గూర్చి రెండు రకాల వాదాలున్నాయి. ఒక వాదం ప్రభుత్వ విధులను దేశరక్షణ, శాంతిభద్రతలు, పౌరుల ముఖ్యఅవసరాలకు చెందిన నిర్వహణలకు మాత్రం పరిమితం చేస్తుంది. రెండవవాదం ప్రభుత్వ విధులు విస్తరించాలని తెలుపుతుంది. మొదటి వాదానికి చెందిన వారిలో ఆడమ్‌స్మిత్ ముఖ్యుడు. రాజ్యానికి మూడే విధులుండాలని ఈయన అభిప్రాయపడినాడు. అవి విదేశీ దురాక్రమణాలనుండి దేశాన్ని రక్షించడం (దేశరక్షణ) సంఘంలోని ప్రతి వ్యక్తిని ఇతర వ్యక్తుల అక్రమాల నుండి కాపాడడం.(న్యాయం), తక్కువ ప్రైవేటు లాభాలు ఉండడం వల్ల ప్రైవేటు వ్యక్తులు చేపట్టలేని కొన్ని పనులను నిర్వహించడం. ఇటువంటి అభిప్రాయాన్నే జే.బి.సే ఈ విధంగా వ్యక్తం చేసారు, అవి విత్త ప్రణాళికలలోకి అతి తక్కువ వ్యయంతో కూడుకొన్నది. మంచి ప్రణాళికలనీ, అన్ని పన్నుల విధానాలలోకి అతి స్వల్ప మొత్తంలో ఉండేది మంచి పన్నుల విధానమని ఈయన అభిప్రాయం. సమాజ భద్రత కాపాడుటకు, దేశాన్ని రక్షించుటకూ మినహాయించి మిగిలిన ఏ కార్యక్రమాలకు చేసిన వ్యయమైనా వృధా, న్యాయ విరుద్ధం, ప్రజలపైఅణగద్రొక్కు చర్య అని పార్నెల్ అభిప్రాయపడెను. ఆధునాతన ఆర్థిక వేత్తలు దీనికి భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చినారు. అనేక నూతన కార్యక్రమాలకు ప్రభుత్వ పరిధి విస్తరించాలని వీరి వాదము. కీన్స్ రచనల మూలంగా ఆలోచనా సరళిలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా ఆర్థిక కార్యక్రమాలను క్రమబద్ధం చేయడం ప్రభుత్వం యొక్క ముఖ్యవిధిగా గుర్తింపబడింది. వనరుల అభిలషణీయమైన కేటాయింపు ఆర్థిక అసమానతలను తగ్గించడం ఆర్థిక వ్యవస్థను స్థిరీకరణ చేయడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలకు ప్రభుత్వ కార్యకలాపాలు విస్తరించాలని మస్‌గ్రేవ్ అభిప్రాయపడెను.

## 17.3 ప్రభుత్వ వ్యయ నియమాలు

ప్రభుత్వ వ్యయం కొన్ని నియమాలను అనుసరించాలి. షిరాస్ నాలుగు నియమాలు ప్రతిపాదించాడు. ఇతర ఆర్థికవేత్తలు మరికొన్ని నియమాలను ప్రతిపాదించారు. ఈ నియమాలను పరిశీలిద్దాం.

### 17.3.1 ప్రయోజన నియమం

ప్రభుత్వ వ్యయం సంఘానికి ప్రయోజనం చేకూర్చేదిగా ఉండాలని షిరాస్ అభిప్రాయం. ఈ ప్రయోజనం ఒక ప్రత్యేకవర్గానికి గాక సంఘానికంతకూ చేకూరాలి.అదనపు ఉత్పత్తి, అంతఃకల్లోలాల నుండీ, విదేశీ దురాక్రమణం నుండి సాంఘిక జీవితాన్ని రక్షించడం, ఆర్థిక అసమానతలను తగ్గించడం వంటిప్రయోజనాలు ప్రభుత్వ వ్యయం వల్ల సిద్ధించాలి. డాల్టన్ మాటల్లో "ఉపాంత సాంఘిక ప్రయోజనాలు ప్రతివ్యయ దిశలోను సమానంగా ఉండి అదనపు ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టడంలో ఏర్పడే ఉపాంత సాంఘిక ప్రయోజనాలకు సమానంగా ఉండేవరకూ ప్రభుత్వ వ్యయాన్ని విస్తరింపజేయవచ్చు."

ఈ ప్రభుత్వ వ్యయ నియమం వినియోగదారుని ప్రవర్తనకు చెందిన సమ ఉపాంత ప్రయోజన సూత్రాన్ని పోలి ఉంది. తన పరిమిత ఆదాయం నుంచి లభించే తృప్తిని గరిష్టం చేసుకునేందుకు ప్రతి వస్తువు మీద ఖర్చు చేసిన అంతిమ రూపాయి నుండి వచ్చిన ప్రయోజనం సమానంగా ఉండేటట్లు వినియోగదారు తన ఖర్చును వివిధ వస్తువులపై పంపిణీ చేస్తారు. ఇదే విధంగా ప్రభుత్వం కూడా తన పరిమిత ఆదాయాన్ని ప్రతి వ్యయం నుంచీ లభించే ఉపాంత సాంఘిక ప్రయోజనం సమానంగా ఉండేటట్లు వ్యయపద్ధతిని నిర్ణయించుకోవాలి. కాని ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టడంలో చాలా సమస్యలు ఎదురవుతాయి. ఉదాహరణకు విద్య, ఆరోగ్యం మున్నగు వానిపై చేయు ప్రభుత్వ వ్యయాలనుండి కలిగే ప్రయోజనాల పరిమాణాన్ని లెక్కించడం చాలా కష్టం.



BRAOU

## 17.3.2 మిత వ్యయ నియమం

ప్రభుత్వ వ్యయంలో వృథా ఉండరాదని ఈ నియమం తెలుపుతుంది. వృథా వ్యయాన్ని పూర్తిగా తొలగించలేకపోతే కనీసం అతి తక్కువ స్థాయికైనా తీసుకురావాలి. మిత వ్యయమనే మాటను లోభత్వమనే సందర్భంలో వాడరాదు. ఈ మాటను విస్తృతార్థంలో కాని పరిమితార్థంలో కాని వాడవచ్చు. పరిమితార్థంలో మితవ్యయమనగా కావలసిన దానికంటె అధికంగా వ్యయం చేయకుండుట, విస్తృతార్థంలో మితవ్యయంఅంటే తక్కువ ప్రయోజనం లభించే అంశంపై వ్యయం చేయుట. ఈ రెండవభావన వాడినపుడు మిత వ్యయనియమం ప్రయోజన నియమానికి చాల దగ్గరగా ఉంటుంది.

## 17.3.3 మంజూరు నియమం

ప్రభుత్వ వ్యయ విధానాన్ని నిర్ణయించడంలో నిర్హేతుకతనూ (arbitratiness) స్వప్రయోజనాల ప్రభావాన్ని అరికట్టుటకై ఒక నిర్ణీత స్థితిని అవలంబించవలెనని ఈ నియమం తెలుపుతోంది. వ్యయ పరచే ప్రతి అధికారి కూడా ముందుగా పై అధికారులనుండి మంజూరును పొందాలి. ఈ నియమ సాధన మొదటి రెండు నియమాలను అనగా ప్రయోజన, మితవ్యయ నియమాలను సాధించడానికి ఉపకరిస్తుంది. ఈ నియమాన్ని పాటిస్తే మంజూరు చేసే అధికారుల ప్రయోజనాల విశ్లేషణ చేసి మితవ్యయంతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించ బడేటట్లు చూడవీలగును. అంతేకాక ప్రతివ్యయ అంశానికి తగు మంజూరుకావాలనిఅనడం వల్ల అన్ని సాంఘిక వర్గాలకు , అన్ని ప్రాంతాలకు న్యాయం చేకూర్చవీలవుతుంది. ప్రతి అంశానికి, ప్రతి ప్రాంతానికి కేటాయింపులు జరిగాక తగు స్థాయిలలోని అధికారులు వ్యయ కార్యక్రమాలు చేపట్టవచ్చు.

## 17.3.4 మిగులు నియమం

ప్రభుత్వ వ్యయంలో లోటు ఉండరాదని ఈ నియమం తెలుపుతుంది. ఒక వ్యక్తి తన ఖర్చును ఆదాయానికి తగినట్లు ఎలా సర్దుకుంటాడో ప్రభుత్వం కూడా తనఖర్చును ఆదాయానికి తగినట్లు సర్దుకోవాలి. ప్రభుత్వంతోసహా ప్రతి వ్యక్తి తమ ఆదాయాల పరిమితిలోనే జీవన విధానాన్ని ఏర్పాటుచేసుకోవాలని షిరాస్ అభిప్రాయం. ఈ విధానం 16వ శతాబ్దంలోని మెర్కంటలిస్టు (Mercantalist) ఆలోచనకు అనుగుణంగా ఉంది. కానీ నవీనకాలంలో లోటు బడ్జెట్ విధానం అన్ని వేళలా తిరస్కరించ తగినది కాదు. నిజానికి ఆర్థిక మాంద్యం సంభవించినపుడు లోటు బడ్జెట్ విధానమే అభిలషణీయమైనది..

ఈ మిగులు నియమాన్ని ఇంకోవిధంగా కూడా అర్థం చేసుకోవచ్చు. మిగులు అనే పదాన్ని ప్రభుత్వ వ్యయం తద్వారాలభించిన ప్రయోజనాల మధ్యగల తేడాగా నిర్వచించవచ్చు. ఈ మిగులు అధికమయ్యేకొలది సాంఘిక సంక్షేమం పెరుగుతోందని చెప్పవచ్చు. అయితే షిరాస్ మాత్రం మిగులు అనే పదాన్ని ఈ సందర్భంలో వాడలేదు.

ఈ పై నాల్గు నియమాలే కాక ఇంకా కొన్ని నియమాలు ఏర్పరుచబడ్డాయి.

## 17.3.5 వ్యాకోచ నియమం

ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల ననుసరించి వ్యయ పరిమాణము పద్ధతిమారేటట్లుగా ప్రభుత్వ వ్యయ విధానంఉండాలని ఈ నియమం చెప్పుతోంది. ఇంకో మాటలో చెప్పాలంటే వ్యయ విధానం సరళమైనదిగా



BRAOU

ఉండవలెనే కాని కఠినమైనదిగా ఉండరాదు. ఉదాహరణకు, కరువుకాలంలో ప్రభుత్వ వ్యయంలోని అధిక మొత్తాన్ని పేదరికపు నిర్మూలనా కార్యక్రమాలకై వినియోగించాలి.

### 17.3.6 ఉత్పాదకతా నియమం

ఉత్పాదక కార్యకలాపాలకే ప్రభుత్వ వ్యయం పరిమితమై ఉండాలని ఈ నియమం చెపుతోంది. అంటే అనుత్పాదక కార్యకలాపాలపై వ్యయాన్ని కనీస స్థాయిలో ఉంచాలి. కాని ఏ వ్యయాలు ఉత్పాదకమైనవో ఏ వ్యయాలు అనుత్పాదకమైనవో నిర్ణయించడం చాలా కష్టం. ఉదాహరణకు, విద్యపై వ్యయం తక్షణ కాలంలో ఉత్పాదకమైనది కాక పోయిన భవిష్యత్తులోని ఉత్పాదకతను ప్రభావితం చేస్తుంది. ఇదే విధంగా వృద్ధాప్య పింఛనులు, వింతంతు పింఛనులు గ్రహీతల పిల్లల ఉత్పాదకతను వృద్ధి చేయవచ్చు.

### 17.3.7 సమాన పంపిణీ నియమం

ప్రభుత్వ వ్యయం ఆదాయ పంపిణీలోని అసమానతలను తగ్గించే విధంగా ఉండాలని ఈ నియమం చెపుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యయ విధానంలో ఈ నియమం ప్రముఖ పాత్ర వహిస్తుంది. దీనికి కారణమేమంటే ఈ దేశాల్లో ఆర్థికవృద్ధితో పాటు ఆర్థిక అసమానతలుకూడా పెరిగే అవకాశం ఉంది. కావున ప్రభుత్వం ఈ సరళిని వ్యయ విధానం ద్వారా అరికట్టడానికి ప్రయత్నించాలి.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి – 1**

---

1. ప్రభుత్వ వ్యయ నియమాలు ఏవి?

---

## 17.4 ప్రభుత్వ రంగ వృద్ధిని గూర్చిన సైద్ధాంతిక విశ్లేషణ

---

ప్రతిదేశంలోను ప్రభుత్వ వ్యయం నిరవధికంగా పెరుగుతోంది. ఇట్టి పోకడ 19 వ శతాబ్దంలోనే ప్రారంభమై 20 వ శతాబ్దానికి సుస్పష్టమైంది. ఈ పెరుగుదల నిరపేక్ష భావంలోనే గాక సాపేక్ష భావంలో కూడా కనబడుతోంది. ప్రభుత్వపు మొత్తం వ్యయం (ప్రైవేటు ప్రభుత్వరంగాల మొత్తం) పెరిగినప్పుడు ప్రభుత్వరంగ వ్యయంకూడా పెరిగి అనుపాతాన్ని మాత్రం స్థిరంగా ఉంచితే దాన్ని నిరపేక్ష పెరుగుదల అంటారు. ఉదాహరణకు మొత్తం వ్యయం రూ.100 కోట్ల నుండి రూ.200 కోట్లకు పెరిగి, ప్రభుత్వ వ్యయం రూ.40 కోట్ల నుండి రూ. 80 కోట్లకు పెరిగినపుడు ఈ పెరుగుదలను నిరపేక్ష పెరుగుదల అంటారు. ఎందుకంటే రెండు స్థితులలోనూ మొత్తం వ్యయంలో ప్రభుత్వ వ్యయ శాతం 40 గానే ఉండిపోయింది. ఈ శాతం పెరిగినపుడు సాపేక్ష భావంలోకూడా పెరిగిందంటారు. పై ఉదాహరణలో ప్రభుత్వరంగ వ్యయం రూ.120 కోట్లకుపెరిగిందనుకుందాం అంటే నిరపేక్ష భావంలో కూడా పెరిగిందన్న మాటా. దీనికి కారణం ప్రభుత్వ వ్యయ శాతం 40 నుడి 60 కి $\left\langle \frac{120}{200} \times 100 \right\rangle$ పెరగడమే.

ఈ ప్రభుత్వ కార్య కలాపాల పెరుగుదలకు సైద్ధాంతికపరమైన వివరణలను క్రింద విశేషిద్దాం.

### 17.4.1 వాగ్నరు సూత్రం

అడాల్ఫ్ వాగ్నరు (1835–1917) అనే జర్మన్ రాజకీయ ఆర్థిక తత్వవేత్త పారిశ్రామికీకరణకు ప్రభుత్వ వ్యయ సాపేక్ష పెరుగుదలకు ప్రమేయ సంబంధముంటుందని ప్రతిపాదించాడు. ఆ రాజ్యాలలో తలసరి ఆదాయం.



BRAOU

ఉత్పత్తి పెరుగుతుంటే మొత్తం ఆర్థిక కార్యకలాపంలో ప్రభుత్వరంగ భాగం తప్పనిసరిగా పెరుగుతుందని వాదించాడు.

పారిశ్రామికీకరణ సాధిస్తున్న రాజ్యంలో ప్రభుత్వ వ్యయం పెరుగుదలకు సాంఘిక ప్రగతి మూలకారణమని వాగ్నర్ భావించాడు. సాంఘిక ప్రగతి ప్రభుత్వ విధులను విస్తరింపచేస్తుందని దాని ఫలితంగా ప్రభుత్వ కార్యకలాపాలు నిరపేక్షంగాను సాపేక్షంగానూ విస్తరిస్తాయని ఈయన అభిప్రాయపడెను. ఈ సూత్రం దీర్ఘకాలిక మార్పును తెలుపుతుంది.

వాగ్నర్ ప్రభుత్వ విధులను కొన్ని రకాలుగా వర్గీకరించాడు. శాంతిభద్రతలను నెలకొల్పడం, ప్రభుత్వం యొక్క మొదటి విధి. - విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, బ్యాంకులు వంటి ఆర్థిక అవస్థాపనలను కలుగజేయడం మరొక విధి. ఆర్థికాభివృద్ధితోపాటు మొదటిరకమైన కార్యకలాపాల అవసరం పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధివల్ల శ్రామిక ప్రత్యేకీకరణ పెంపొంది ఆర్థిక సాంఘికజీవనంలో పరస్పరానుబంధాలు పెరుగుతాయి. ఈ స్థితిలో ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడానికి అదనపు ప్రభుత్వ వ్యయం అవసరమౌతుంది. ఈ రెండవరకమైన విధుల నిర్వహణకు భారీ ఎత్తున పెట్టుబడి కావాలి. ప్రైవేటు కార్పోరేషనులు ఇట్టి పెట్టుబడిని నిర్వహించలేవు. ఈ పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమలు స్వాభావిక ఏకస్వామ్యలక్షణాలను కాని సమిష్టి వినియోగలక్షణాలను కాని గణనీయమైన వినియోగ బహిర్గతాలను (Externalities) గాని కలిగి ఉంటాయి. ఇట్టి వస్తువులను 'ప్రభుత్వ వస్తువులు' (Public goods) అంటాము. వీటపై పెట్టుబడి పెట్టాలంటే సామాజిక దృష్టి అవసరం.




BRAOU

17.1 : వాగ్నర్ సూత్రానికి రేఖా పటం

17.1 : వాగ్నర్ సూత్రానికి రేఖా పటం

రేఖాపటం 17.1లో ప్రభుత్వరంగ వస్తువుల తలసరి ఉత్పత్తి OY అక్షం మీద, తలసరి ఆదాయం OX అక్షం మీద చూపబడినవి. ఈ చిత్రంలో కాలం. అవే మూడవ అంశంఅంతర్గతంగా ఇమిడి ఉంది. అంటే ఈ చలనరాశులలో వృద్ధి కాలానుసారంగా జరుగుతోందన్నమాట.

మూలబిందువు నుండి బయలు దేరిన OA అను సరళరేఖ పరిశీలనలోకి తీసుకున్న కాలం అంతలోను మొత్తం వ్యయంలో ప్రభుత్వ వ్యయం స్థిరంగా ఉన్న స్థితిని తెలుపుతోంది. అనగా తలసరి ఆదాయం పెరుగుతోంటే ప్రభుత్వ వస్తువుల ఉత్పత్తి కూడా పెరగడమే కాకుండా వీటి విస్తృతి ప్రతి సమయంలోను స్థిరంగా ఉంటోంది. ఈ రేఖను స్థిర అనుపాతపు రేఖ అందాము. ఈ స్థిర అనుపాతపు రేఖను ఆధారంగా తీసుకుని OB అనే రెండవ రేఖను పరిశీలిద్దాం. ఈ రేఖపై బిందువులు ప్రభుత్వ వ్యయం, మొత్తం వ్యయాల విస్తృతి కాలక్రమేణా పెరుగుతోన్న పరిస్థితిని సూచిస్తాయి. ఈ OB అను వక్రరేఖయే కాలానుసారంగా ప్రభుత్వ వ్యయంలో వచ్చే పెరుగుదలయొక్క వాస్తవిక పదాన్ని తెలుపుతుందని వాగ్నర్ గమనించాడు.

### 17.4.1 వాగ్నరు సూత్రంపై విమర్శ

ఈ సూత్రం ఒక ప్రత్యేక అధ్యయన శాఖకు కాక అనుబంధ శాఖలకు చెందిన విషయాన్ని చర్చిస్తోంది. కాని విశ్లేషణలో అనుబంధ శాఖలేవీ లెక్కలోకి తీసుకోబడలేదు. ప్రభుత్వ వ్యయానికి చెందిన అంశాలు రాజనీతి శాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రాల పరిధిలో ఉంటాయి. కాని వాగ్నర్ తన విశ్లేషణలో ఆర్థికపరమైన అంశాలనే పరిగణించడం జరిగింది. పీకాక్, వైజ్‌మన్‌లు వాగ్నర్ సూత్రంలో మూడు లోపాలను ఎత్తిచూపారు అవి

1. ఈ సిద్ధాంతం రాజ్యం ప్రజలకు భిన్నంగా ఉండే ఒక ప్రత్యేక సజీవ యూనిట్ అనే వాదనపై ఆధారపడినది.
2. ప్రభుత్వ వ్యయంపై యుద్ధ ప్రభావం లెక్కలోనికి తీసుకోబడుటలేదు.
3. ఈ సూత్రం ప్రభుత్వ వ్యయంలోని కాలానుగతమైన తీరును నిర్లక్ష్యం చేసి దీర్ఘకాలిక పరిస్థితిని తెలియజేస్తోంది.

### 17.4.2 పీకాక్, వైజ్‌మన్‌ల పరికల్పన

పీకాక్, వైజ్‌మన్‌లు ప్రభుత్వరంగ వృద్ధిని గూర్చిన తమ విశ్లేషణను 1960 సం ప్రాంతంలో ప్రచురించినారు. ఈ విశ్లేషణ ప్రభుత్వ వ్యయపు కాల సరళని లెక్కలోనికి తీసుకొంటోంది. వీరి విశ్లేషణ మూడు సన్నిహిత సంబంధంగల వేర్వేరు భావనలపై ఆధారపడి ఉంది. అవి తొలగింపు ఫలితము (displacement effect), విమర్శనా ఫలితం (inspection effect) కేంద్రీకరణ ఫలితం (concentration effect).

వీరి విశ్లేషణ 1890–1955 సంవికి బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంక సమాచారం (empirical data) ఆధారంగా చేయబడింది. ప్రభుత్వరంగ వ్యవస్థయొక్క సాపేక్ష వృద్ధిపథం మృదువుగా కాక మెట్లమాదిరిగా ఉండునని పరిశీలించిరి. యుద్ధ సమయాల్లోను, ఆర్థిక మాంద్య సమయాల్లోనూ పన్ను విధింపు వ్యయాల్లో నిరపేక్షంగానూ, సాపేక్షంగాను కూడా వృద్ధి ఉండును. ఈ ఆటంకాల మూలంగా వెనుకటి పన్ను వ్యయస్థాయిలు పెంచబడి క్రొత్త స్థాయిని చేర్చబడతాయి. ఈ ఆటంకాల తరువాత కూడా సమాజం ఈ కొత్త స్థాయిలోని ప్రభుత్వ వ్యయాన్ని సహిస్తుంది. దీనికి కారణం సంఘం పూర్వం ఊహించిన దానికంటేఅధికమైన పన్నుల భారాన్ని వహించగలమనే విషయం తెలుసుకొనుటయే కావున ఆటంకానికి పూర్వమున్న పన్నుల స్థాయికి వెళ్ళాలనే దృఢ సంకల్పం ఉండదు. అదనంగా వచ్చిన ఈ పన్నుల వసూళ్ల ప్రభుత్వరంగాన్ని విస్తరింపజేయడానికి ఉపయోగించబడును. ఈ సరళినే 'తొలగింపు ఫలితం' అంటారు. 1890–1960 మధ్యకాలంలో బ్రిటన్‌లో ఈ స్థితి ఎన్నో సార్లు సంభవించింది. క్రింద చూపిన రేఖాపటంలో తొలగింపు ఫలితం చూపబడింది.




రేఖాపటం 17.2

రేఖాపటం 17.2

కాలం (సంవత్సరాల్లో) OX అక్షం మీద, ప్రభుత్వరంగ ఆదాయం (అధిక భాగం పన్నుల నుండి వచ్చినది) ప్రభుత్వ వ్యయం జాతీయాదాయంలో శాతంగా OY అక్షంపై చూపబడినవి. సాంఘిక ఆటంకాలవల్ల ప్రభుత్వరంగం విస్తరించగా తొలగింపు ఫలితం ప్రభుత్వరంగ వృద్ధియొక్క కాలక్రమాన్ని తెలియజేస్తుంది. ఈ తొలగింపు ఫలితం అధికస్థాయికి వెళ్ళిన ప్రభుత్వ వ్యయం సాంఘిక ఆటంకాల సందర్భంలోని వ్యయ సమ్మేళనమే (Composition) ఉండాలని శాసించదు. పెరిగిన వ్యయాలలో కొని సాంఘిక ఆటంకాల ప్రత్యక్ష ఫలితం కాగా మరికొన్ని వ్యయాంశాలు ప్రభుత్వ వ్యయ పరిధిని క్రొత్త ఆర్థిక కార్యకలాపాల వైపుకు మళ్ళించేవిగా ఉంటాయి. ఈ క్రొత్త కార్యకలాపాలలో కొన్ని ప్రైవేటు రంగం ఆధీనంలో ఉన్నాయి. కాగా మరి కొన్ని సాంకేతిక ప్రగతి వల్ల ఏర్పడినవి. సాంకేతిక ప్రగతి పూర్వం కేటాయింపులేని ఎన్నో క్రొత్త వస్తువుల ఉనికికి దోహదం చేస్తుంది. అంతేకాక యుద్ధము లేక ఇతర సాంఘిక కలతలుసంభవించినచో ప్రజలు, ప్రభుత్వము గతంలో నిర్లక్ష్యం చేయబడిన అనేక సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటాయి. దీనినే 'విమర్శనా ఫలితం' అంటారు.

BRAOU

తొలగింపు విమర్శనా ఫలితాలనే కాక పీకాక్, వైజ్ మన్ లు 'కేంద్రీకరణ ఫలితాన్ని' కూడా ప్రతిపాదించారు. ఈ భావన సంఘం ఆర్థికవృద్ధిని సాధిస్తున్న కొద్దీ కేంద్ర ప్రభుత్వ ఆర్థికకార్యకలాపాలు పెరుగుతాయని తెలియజేస్తోంది. ఉదాహరణకు ఆర్థికవృద్ధికి అసమానతల పెరుగుదలకు దారి తీస్తుంది. ఇట్టి స్థితిలో ఆర్థికంగా వెనుకబడ్డవారి ప్రయోజనార్థం కార్యకలాపాలను రచించడానికి ప్రభుత్వ జోక్యం అవసరం. ఈ కార్యక్రమాల అమలు ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు దారి తీయును.

ఈ విధంగా పీకాక్ వైజ్ మన్ లు బ్రిటన్ అనుభవం ఆధారంగా మూడు అంశాలను తేల్చారు.

1. ప్రభుత్వ రంగ సాపేక్షవృద్ధి మెల్లమాదిరిగా ఉండును. (తొలగింపు ఫలితం)
2. తీవ్రమైన కలతలు (disturbances) కలిగినప్పుడు సమస్యలను స్పష్టంగా గుర్తించడం వాటి పరిష్కారాలు కనుగొనడం జరుగును. (విమర్శనాఫలితం)
3. ఆర్థికాభివృద్ధితోపాటు ప్రభుత్వరంగంలో కేంద్ర ప్రభుత్వ వాటా రాను రాను పెరుగును. (కేంద్రీకరణ ఫలితం)

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

2. తొలగింపు విమర్శనా మరియు కేంద్రీకరణ ఫలితములు అనగా నేమి?

## 17.5 ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు కారణాలు

ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు పైన పేర్కొన్న వివరణలు అభివృద్ధి చెందుతున్న దేశాలకంటె అభివృద్ధి చెందిన దేశాలకే ఎక్కువగా వర్తించును. అంతేకాక 20వ శతాబ్దంలో కంటే 19వ శతాబ్దానికి తగియున్నవి. 1930 ప్రాంతాలలో వచ్చిన ఆర్థిక మాంద్యం, ఈ సందర్భంలో కీన్సు రచనలవల్ల కలిగిన ఆలోచన వరళిలోని మార్పులు ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పాత్రను పెంచాయి. శ్రేయోరాజ్య భావనను గుర్తించడంలో కూడా ప్రభుత్వ పాత్ర పెరిగింది. కావున ఈ మధ్య కొన్నిదశాబ్దాలనుండి సంభవిస్తున్న ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు కారణాలను గుర్తించడం అవసరం. ఈ క్రింది పేరాలలో ఈ కారణాలు వివరించబడ్డాయి.

### 17.5.1 శ్రేయోరాజ్య భావన

శ్రేయోరాజ్యభావన అంగీకరించబడటంతో ప్రభుత్వ కార్యకలాపాలు అవిచ్ఛిన్నంగా పెరిగాయి. 19వశతాబ్దంలోని రాజ్యం పోలీసు రాజ్యం. ఇట్టి రాజ్యానికి విదేశీ దాడులనుండి పౌరులను కాపాడ్డం, దేశంలో శాంతి భద్రతలను నెలకొల్పడం మాత్రమే ముఖ్య విధులే. కాని ఆధునిక రాజ్యాలు పౌరుల సాంఘీక ఆర్థిక రాజకీయ ప్రగతిని వృద్ధిచేయాలి. రాజ్యం యొక్క విధులలో వచ్చిన ఈ మార్పుతో ప్రభుత్వం వ్యాపార చక్రాలను అదుపుచేయడం, సంపూర్ణ ఉద్యోగితను సాధించడం, పేదరికాన్ని నిర్మూలించడం, ప్రాంతీయ అసమానతలను తొలగించడం, పారిశ్రామికీకరణ వంటి ఎన్నో బాధ్యతలను స్వీకరించవలసి వచ్చింది. ఆధునిక ప్రభుత్వాం కొన్ని ముఖ్య కార్యకలాపాలు ఏవనగా-

1) సంపూర్ణోద్యోగిత స్థాయిలో ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేందుకు కావలసిన పరిహార వ్యయాన్ని (Compensatory spending) చేపడుతున్నారు.
2) అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారీ మొత్తాల్లో ధనం ఆర్థికాభివృద్ధికి కావలసిన కార్యక్రమాలపై వెచ్చింపబడుతున్నది.
3) ప్రభుత్వాలు విద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమ చర్యలు మొదలగు కార్యక్రమాలపై పెద్ద మొత్తాలను ఖర్చు చేస్తున్నాయి.

ఈ విధంగా ప్రభుత్వ వ్యయాన్ని విపరీతంగా పెంచే ఎన్నో కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతోంది.

### 17.5.2 యుద్ధం, సైనిక ఖర్చు

జాతీయ అంతర్జాతీయ రాజకీయాల్లో ఏర్పడుతున్న ఆందోళనల మూలంగానూ, రెండు రాజకీయ శక్తి కూటాలు ఆధిక్యతకై పోరాడుచుండుటవల్లనూ ప్రతి దేశపు రక్షణ వ్యయంలోను పెరుగుదల వచ్చింది. యుద్ధ తంత్రంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. అణు రసాయనిక పరికరాలు యుద్ధసామాగ్రిలోనికి చొచ్చుకున్నాయి. ఆధునాతన యుద్ధపరికరాలను పొందుపరుచుకొనుటకై ప్రభుత్వాలు పెద్ద మొత్తాలను ఖర్చు చేస్తున్నాయి. అంతేగాక రక్షణ వ్యయంలో యుద్ధ సమయాల్లోనూ, యుద్ధ విరామసమయాల్లోనూ సిబ్బంది, సామాగ్రులపై చేయు ఖర్చు మాత్రమేగాక పదవీ విరమణ చేసిన సైనిక సిబ్బందికి చెల్లించుపింఛనులు, యుద్ధ ఋణాలపై చెల్లించు వడ్డీ కూడా



BRAOU

కలిసి ఉంటాయి. అంతేగాక యుద్ధ వ్యయాలు కావించిన సమయంలో ధరలు హెచ్చు స్థాయిలో ఉంటాయి. యుద్ధం తర్వాత ధరలు తగ్గినమా ఈ వ్యయాలను తగ్గించడానికి వీలుండదు.

### 17.5.3 జనాభాపెరుగుదల, పట్టణీకరణ

జనాభాపెరుగుదల,పట్టణీకరణ ప్రభుత్వవ్యయ పెరుగుదలకు మరొక కారణము. జనాభా పెరుగుదల పట్టణీకరణాలతో ఎన్నో ప్రభుత్వ కార్యకలాపాల స్థాయిని పెంచవలసి వచ్చింది. జనాభా పెరుగుదల మూలంగా విద్య ఆరోగ్యం, గృహ నిర్మాణం, వృద్ధాప్య పించనులు, మొదలగు అంశాలపై వ్యయం పెరుగుతుంది. పట్టణీకరణలో విద్యా ఆరోగ్యాలపైననే గాక శాంతిభద్రతలు, రవాణా సౌకర్యాలు పారిశుధ్యము, కాలుష్య నిర్మూలన, పబ్లిక్ పార్కు, క్రీడా స్థలాల నిర్మాణం మొదలగు అంశాలపై వ్యయంఅమితంగా పెరుగుతుంది. గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబము తనకుగా తాను ఏర్పరుచుకోగల ఎన్నో సేవలను (మంచినీరు, మురికికాలువలు)నగరాల్లోని ప్రజలు తమకు తాము ఏర్పాటు చేసుకోలేరు.

### 17.5.4 ఆర్థిక మాంద్యం

ప్రభుత్వ కార్యకలాపాలు విస్తరించడానికి 1929-33 సంవత్సరాల కాలంలో సంభవించిన ఆర్థిక మాంద్యం కారణం. ఈ కాలంలో ఎన్నో క్రొత్త కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టవలసివచ్చింది. పరిశ్రమలు, వ్యవసాయం, ఉద్యోగితలను ప్రోత్సహించడానికై ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకొన్నాయి. సంపూర్ణ ఉద్యోగితను సాధించడం, ప్రజాశ్రేయస్సును పెంచడం ఆర్థికరంగంపై తగిన అదుపు ఉంచుకోవడం వంటి బాధ్యతలను ప్రభుత్వం స్వీకరించింది.

### 17.5.5 ప్రజాస్వామ్య సంస్థలు

ఆధునిక ప్రజాస్వామ్యసంస్థలను ఏర్పాటు చేయడం నిర్వహించడం ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు మరొక కారణం. నూతన ప్రజాస్వామ్యం రాజ్యం దేశాధిపతినీ కేంద్ర రాష్ట్ర స్థానిక స్థాయిలలో శాసన నిర్మాణ, కార్యనిర్వాహణ, న్యాయ నిర్వహణ శాఖలను నిర్వహిస్తుంది. అంతేకాక ఆధునిక ప్రభుత్వాలు ఇతర దేశాలన్నిటి తోను దౌత్య సంబంధాలు ఏర్పరుచుకున్నాయి. అంతేగాక చాలా ప్రభుత్వాలు ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ కార్మికసంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలలో సభ్యులు, ఈ దేశాలు పాలుపరి చందాలను చెల్లించుటయే గాక శాశ్వత ప్రతినిధులపైననూ అంతర్జాతీయ సమావేశాలకూ (Conferences) అగుఖర్చునుకూడా భరించాలి.

### 17.5.6 ధరల పెరుగుదల

పెరుగుతున్న ధరలు ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు ఒక ముఖ్యకారణము. ధరలుపెరగటంవల్ల ప్రభుత్వం కొనుగోలు చేసే అన్ని వస్తు సేవలకు హెచ్చుధరలను చెల్లించవలసి వస్తుంది. ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలను పెంచవలసివస్తుంది. ఈ పెరుగుతున్న వ్యయాన్ని ఎదుర్కోవేందుకు ప్రభుత్వం ఆర్థిక వనరులను పెంచుకోవాలి. దీని వల్ల మళ్ళీ ధరలు పెరుగుతాయి. ఈ విధంగా పెరుగుతున్న ప్రభుత్వ వ్యయం ధరల పెరుగుదల ఫలితమే కాక ధరలపెరుగుదలకు కారణం కూడా అవుతుంది.

BRAOU

### 17.5.7 పారిశ్రామికాభివృద్ధి

ఆధునిక పారిశ్రామికాభివృద్ధి క్రొత్త పరిశోధనల మూలంగా ఉత్పత్తి పద్ధతులలో ఎన్నో మార్పులు వచ్చాయి. దీనివల్ల ఎన్నో ఆర్థిక, సాంఘిక, రాజకీయపరమైన మార్పులు వచ్చి ప్రభుత్వ వ్యయాన్ని పెంచాయి. పరిశ్రమల పెరుగుదలతో వీటిలో పని చేయుచున్న పనివారల అవసరాలను తీర్చవలసి వచ్చింది. శ్రామిక సంబంధాలు పరిశ్రమలను క్రమబద్ధం చేయడం, వినియోగదారులకు చిన్న తరహా పరిశ్రమలకూ రక్షణ కల్పించడం, ఆర్థిక అసమానతలనూ ప్రాంతీయ వ్యత్యాసాలను తగ్గించడం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ కార్యకలాపాల విస్తరణ జరుగుతోంది.

### 17.5.8 వ్యవసాయాభివృద్ధి

భారతదేశం వంటి అధిక జనాభా గల దేశాలకు ఆర్థిక సాంఘికాభివృద్ధికి వ్యవసాయాభివృద్ధి అత్యావశ్యకము. వ్యవసాయ వ్యవసాయేతర రంగాల పరస్పర సంబంధం రెండింటి పెరుగుదలకు తోడ్పడుతుంది. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాలు వ్యవసాయదారులకు తక్కువ వడ్డీ రేటుతో ఋణాలు, దిగుమతి సబ్సిడీలు, ఎగుమతి, దిగుమతి సుంకాల ద్వారా రక్షణ, కనీస ధరలు మున్నగు చర్యల నిమిత్తం పెద్ద మొత్తాలను వ్యయం చేస్తున్నాయి. ఈ దేశాలు వ్యవసాయ పరిశోధనలు, భూసార పరిరక్షణ మున్నగు కార్యక్రమాలపై చాలా ధనాన్ని ఖర్చు చేస్తున్నాయి.

### 17.5.9 పరిశ్రమలు, వాణిజ్యాల జాతీయికరణ

ప్రభుత్వాలు వస్తు సేవలను తగిన ధరలకు అందజేయడానికి ఏకస్వామ్యాలను క్రమబద్ధం చేయడానికి , శ్రామికుల స్థితిగతులను ఆదాయ సంపద పంపిణీలను మెరుగుపరచడానికి కొన్ని పారిశ్రామిక, వ్యాపార వాణిజ్య యూనిట్లను జాతీయం చేస్తున్నాయి. కాని నష్ట పరిహారం చెల్లింపు ఈ ఉద్యమాల నిర్వహణలకు ప్రభుత్వానికి చాలా ఖర్చవుతుంది.

BRAOU

### 17.5.10 త్వరిత ఆర్థికాభివృద్ధికై ప్రణాళికలు

పెక్కు అభివృద్ధి చెందుతున్న దేశాలు పెద్ద మొత్తాల్లో వ్యయంతో రవాణా విద్యుచ్ఛక్తి రహదారులు మొదలగు అవస్థాపనా పెట్టుబడులతో కూడిన అభివృద్ధి ప్రణాళికలను అమలు పరుస్తున్నాయి. ఈ దేశాలు పారిశ్రామిక అభివృద్ధికి కావలసిన ఆర్థిక, సాంఘిక, అవస్థాపనా పెట్టుబడులను నిర్వహిస్తున్నాయి. అంతే గాక వ్యవసాయదారులకు పారిశ్రామిక వేత్తలకు కానుకలు, ఋణాలు, సహాయక గ్రాంటులు (Grants-in-aid) ద్వారాను సాంకేతిక పరిజ్ఞానం, ముడిపదార్థాల అందుబాటు వంటి సౌకర్యాలను కలుగజేయడం ద్వారాను సహాయపడుతున్నాయి. ఈ విధంగా అభివృద్ధి ప్రణాళికల పెరుగుదల నీటి పారుదల అవస్థాపన సౌకర్యాలు పారిశ్రామిక కేంద్రాలపై వ్యయం విపరీతంగా పెరగడానికి కారణమైంది.

### 17.5.11 ఆర్థికాభివృద్ధి – సాంఘిక న్యాయం

అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థికవృద్ధి సాధనకే గాక సాంఘిక న్యాయంతో కూడిన వృద్ధికై పాటుపడుతున్నాయి. ఆర్థికవృద్ధి సాధించినంతమాత్రాన బీదరికం, నిరుద్యోగిత వంటి సమస్యలు పరిష్కారం కావు సరికదా ఈ సమస్యలు తీవ్రతరమయ్యే ప్రమాదముంది. ఎందుకంటే వ్యవసాయిక, పారిశ్రామికాభివృద్ధులు, కొన్ని

తరగతుల వారికి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమౌతున్నాయి. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశాలు సాంఘిక వ్యయం సాధించడానికి సమాజంలోని బలహీనవర్గాలపైనా వెనుకబడిన ప్రాంతాలలోను పెద్ద మొత్తాలను వ్యయంచేస్తున్నాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 3

3. ప్రభుత్వ వ్యయం పెరగడానికి గల కారణాలను గుర్తించుము.

## 17.6. ముగింపు

19వశతాబ్దంలోని రాజ్యపు విధులను పరిమితం చేసే వాదనలు ఈకాలానికి సరిపడవు. ఇప్పుడు రాజ్యం అనేక విధులను నిర్వర్తించాలి. అందుచే జాతీయాదాయంలో ప్రభుత్వ వ్యయ భాగం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ వ్యయం అనుసరించవలసిన నియమాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవేమనగా :

1. ప్రభుత్వ వ్యయం సాంఘిక ప్రయోజనాన్ని చేకూర్చాలి.
2. వృధా వ్యయం కనీస స్థాయిలో ఉంచబడాలి.
3. ప్రభుత్వ వ్యయం తగిన మంజూరు పొందిన తర్వాతనే ఖర్చు చేయబడాలి.
4. ప్రభుత్వ వ్యయం ఆర్థిక అసమానతలను తగ్గించేందుకూ సహాయపడాలి.
5. ప్రభుత్వ వ్యయం ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఉత్పత్తిదాయకంగా ఉండాలి.

ప్రభుత్వ వ్యయం అవిచ్ఛిన్నంగా పెరగడాన్ని వాగ్నర్ మరియు పీకాక్. వైజ్‌మన్‌లు సిద్ధాంతపరంగా వివరించారు. వాగ్నర్ సూత్రం దీర్ఘకాలిక స్వభావం కలది. పారిశ్రామికీకరణ చెందుతున్న దేశాల్లో శాంతభద్రతలనూ సాంఘిక ఆర్థిక అవస్థాపనలనూ కల్పించవలసిన అవసరం పెరుగుతుండడంల్ల ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు దారితీసింది. పీకాక్, వైజ్‌మన్లు ప్రభుత్వ వ్యయ పెరుగుదలను తొలగింపు ఫలితం, విమర్శనాఫలిత, కేంద్రీకరణ ఫలితం అను మూడు భావనల ద్వారా వివరించారు. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ మధ్య కాలంలో అనగా 1930 తర్వాతెన్నో కారణాల వల్ల ప్రభుత్వ వ్యయం పెరిగింది. శ్రేయోరాజ్యభావనను అంగీకరించడం, జనాభా పెరుగుదల, పట్టణీకరణ ప్రజాసామ్య సంస్థల ఏర్పాటు తీవ్రగతి ఆర్థిక వృద్ధికై ప్రణాళికల నిర్మాణం, 1930 దశాబ్దంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం ప్రభుత్వ వ్యయపెరుగుదలకు ప్రధానకారణాలు.

– ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం.

## 17.7 సంప్రదించు పుస్తకాలు


1. H.Dalton : Public Finance
2. A.R.Prest : Public Finance in theory and Practice
3. R.A. Musgrave : The theory of Public Finance
4. U.K. Hicks : Public Finance




BRAOU

## 17.8 నమూనా పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. ప్రభుత్వ వ్యయ నియమాలను విశదీకరించుము.
2. ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు సంబంధించిన వాగ్నర్ సూత్రంలను పరీక్షింపుము.
3. ప్రభుత్వ వ్యయ పరిధిని వివరింపుము
4. ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు గల కారణాలను విశదపరుచుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. ప్రయోజన, మితవ్యయ నియమాలను వివరించుము.
2. తొలగింపు, పరిశీలన మరియు కేంద్రీకరణ ఫలితములను వివరించుము.

●●●

BRAOU

# భాగం – 18 : భారతదేశంలో ప్రభుత్వ వ్యయ తీరులు – పెరుగుదల

విషయక్రమం

18.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
18.1 పరిచయం
18.2 ప్రభుత్వ వ్యయ వర్గీకరణ
18.3 భారతదేశంలో ప్రభుత్వ వ్యయవర్గీకరణ
18.4 భారతదేశంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదల తీరు
18.5 ముగింపు
18.6 సంప్రదించు పుస్తకాలు
18.7 నమూనా పరీక్షాప్రశ్నలు

## 18.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ప్రభుత్వ వ్యయవర్గీకరణ పద్ధతులను పరిశీలించడం, భారతదేశంలో అవలంబించబడిన వర్గీకరణ పద్ధతిని చర్చించడం, భారతదేశంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదలను, తీరును పరిశీలించడం. ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకోగలుగుతారు.

- ప్రభుత్వ వ్యయమును వివిధ భాగాలలో విభజించడం.
- భారతదేశంలో విధులననుసరించిన వర్గీకరణను గుర్తించడం.
- భారతదేశంలో ప్రభుత్వ వ్యయ తీరులు– పెరుగుదలను గుర్తించడం.

BRAOU

## 18.1 పరిచయం

ప్రభుత్వ వ్యయతీరును పెరుగుదలను అర్థం చేసుకోవాలంటే ముందుగా వర్గీకరణపద్ధతిని తెలుసుకోవాలి. వర్గీకరణ అనగా వ్యయాంశాలను శాస్త్రీయ పద్ధతిలో క్రమబద్ధంగా నిర్ణయించడం. ప్రభుత్వ వ్యయంలోని ప్రతి అంశము ఆర్థిక వ్యవస్థపై ఒక ప్రత్యేక ప్రభావాన్ని కలుగజేస్తుంది. కొన్ని వ్యయాలు వృద్ధికి దోహదం చేస్తే మరికొన్ని వ్యయాలు ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ఉపకరిస్తాయి. కొన్ని వ్యయాలు దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా సమర్థనీయమైతే మరికొన్ని తక్షణ సమస్యలను అల్పకాలిక అవసరాలను తీర్చడానికి ఉపకరిస్తాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగిన రీతిలో వర్గీకరించడంవల్ల చేసిన వ్యయాల ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవడం సాధ్యమౌతుంది.

## 18.2 ప్రభుత్వ వ్యయ వర్గీకరణ

ప్రభుత్వ వ్యయ వర్గీకరణసంతృప్తికరంగా ఉండాలంటె రెండు షరతులు ఆమోదింపబడాలి. మొదటిది - వర్గాలుపరస్పర వైవిధ్యము (Nutuarly Exclusive) కలవై ఉండాలి . అంటే ఏ వ్యయాంశమైనా ఏదో ఒక వర్గానికి మాత్రమే చెందాలి. వర్గీకరణ సరిగాలేనిచో ఏఅంశం ఏ తరగతికి చెందుతుందో ఖచ్చితంగా చెప్పలేము. పరస్పర వైవిద్యకల వర్గాలను ఏర్పరిచినపుడే ఇది సాధ్యమౌతుంది. రెండవది- వర్గీకరణ యొక్క ఆధారం ప్రభుత్వ వ్యయపు ముఖ్య లక్షణమై ఉండాలి. ఉదాహరణకు ప్రభుత్వ వ్యయం యొక్క ఉద్దేశం సంఘంలోని వివిద వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమైతే వివిధ సమూహాలుపొందిన ప్రయోజనాల ఆధారంగా వ్యయాన్ని వర్గీకరించాలి. ఈ రెండు సూత్రాలను అనుసరిస్తే వర్గీకరణ శాస్త్రీయమై నదౌతుంది. ఈ క్రింద కొన్ని వర్గీకరణలు పొందుపరచబడ్డాయి.

### 18.2.1 ప్రయోజనాల ఆధారంగా వర్గీకరణ

ప్రభుత్వవ్యయపు ప్రదానలక్ష్యం ప్రజలకు ప్రయోజనాలను కలుగజేయటం కనుక వివిద వర్గాలకు లభించిన ప్రయోజనాలనుబట్టి వ్యయాన్ని వర్గీకరించవచ్చు. కోన్ మరియు ప్లెన్ ప్రభుత్వ వ్యయాన్ని నాల్గుతరగతులుగా వర్గీకరించారు. మొదటి వర్గంలోని వ్యయాలు అందరికి సామన్యప్రయోజనాలను చేకూర్చేవి. విద్య ఆరోగ్యం, రవాణా,సాధారణపరిపాలనపై వ్యయాలు ఈ రకానికి చెందుతాయి. రెండవతరగతిలోని వ్యయాలు కొన్ని తెగలకు మాత్రమే ప్రయోజనాన్ని ఇస్తాయి. పోలీసు, న్యాయం, మొదలైన వాటిపై వ్యయాలు ఈ రకానికి చెందుతాయి. ఈ సేవలు కొద్దిమందికి మాత్రమే ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. మూడవతరగతిలోని వ్యయాలు కొన్ని తెగలకు ప్రత్యక్షంగా ప్రత్యేక ప్రయోజనాన్ని కలుగజేస్తూ పరోక్షంగా సంఘానికంతకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. సాంఘిక భద్రత నిరుద్యోగిత నివారణ, వృద్ధాప్య ఫింఛనులు, మొదలైనవి ఈ రకానికి చెందాయి. నాల్గోతరగతిలోని వ్యాయాలు కొందరు వ్యక్తులకు మాత్రం ప్రత్యేక ప్రయోజనాలు చేకూరుస్తాయి. ఈ వ్యయాలు మొత్తం సమాజానికిగాని ఏ తెగకుగాని ప్రయోజనాలను చేకూర్చవు. ఒక ప్రత్యేకమయిన పరిశ్రమకు ఇవ్వబడిన సబ్సిడీ ఈ వర్గానికి చెందిన వ్యయానికి ఉదాహరణ.

పై వర్గీకరణ వ్యయాలనుండి వచ్చే ప్రయోజనాల స్వభావాన్నీ లెక్కలోకి తీసుకుంటోంది. కనుక సంతృప్తికరంగా కనిపిస్తోంది. కానిపై నాల్గు విభాగాలు మాత్రం పరస్పర వైవిద్యం కలవికావు. అందుచేత ఒక వ్యయం ఒక వర్గానికి ప్రయోజనం చేకూరుస్తుందా మొత్తం సమాజానికి ప్రయోజనాన్ని చే కూరుస్తుందా అనే విషయాన్ని నిర్ణయించడం కష్టం.

### 18.2.2 విధులననుసరించిన వర్గీకరణ

ఈ వర్గీకరణ ప్రభుత్వ విధులను ఆధారంగా తీసుకొని వ్యయాన్ని ఈ విధుల ప్రకారం వర్గీకరిస్తుంది. ఈ వర్గీకరణ మొదట ఆడమ్స్మిత్ చే రూపొందించబడింది. తర్వాత బాస్టబుల్ దానిని బలపర్చెను. దాని ఆధారంగా ప్రభుత్వ వ్యయము మూడు తరగతులుగాచేయబడింది అవి : 1. రక్షణ వ్యయం - దీనిలో యుద్ధసామాగ్రి కొనుగోలు, సైన్యాన్ని. [illegible] న్యాయ పరిపాలన, శాంతి నిర్వహణ మొదలగు వ్యయాలు ఇమిడి ఉండును. 2. వాణిజ్య వ్యయం - దానిలో రైల్వే, రోడ్లు మున్నగు అంశాలపై వ్యయము కలుపబడును. 3. అభివృద్ధి వ్యయం - దానిలో విద్య ఆరోగ్యం, పబ్లిక్ ప్రయోజనాలపై వ్యయాలు ఈ కోవకు చెందుతాయి. ఈ వర్గీకరణ వల్ల ముఖ్య ప్రయోజనమేమంటే ఒక వ్యయాన్ని మరొక వ్యయంనుండి ప్రజల శ్రేయస్సుపై ప్రభావం ఆధారంగా వేరు చేయవచ్చు. కాని ఈ వర్గీకరణలోని ప్రధాన లోపమేమంటే ఒక వ్యయాన్ని రక్షణపరమైనదే కాని అభివృద్ధిపరమైనది కాదని, అలాగే ఇంకొక వ్యయాన్ని వాణిజ్యపరమైనదేకాని అభివృద్ధిపరమైనదికాదని చెప్పడం సాధ్యం కాదు. ఉదాహరణకు రవాణా పై ప్రభుత్వ వ్యయం వాణిజ్యపరమైనదే కాక అభివృద్ధికి దోహదం చేసేది కూడా.



BRAOU

### 18.2.3 ఆదాయాల ఆధారంగా వర్గీకరణ

ప్రభుత్వంచే రాబట్టబడిన ఆదాయాల ఆధారంగా చేయబడిన ఈ వర్గీకరణ నికోల్సన్‌చే ప్రతిపాదించబడింది. దీని ప్రకారం ప్రభుత్వ వ్యయం నాల్గురకాలుగాఉంటుంది. ఏవిధమైన ప్రత్యక్ష ప్రతిఫలనంలేని వ్యయాలు మొదటి కోవకు చెందుతాయి. బీదరికపు నిర్మూలనకై చేయబడిన వ్యయాలను ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. పరోక్ష ప్రతిఫలనం గల వ్యయాలు రెండో రకానికి చెందుతాయి. ప్రాథమిక విద్యపై వ్యయం వల్ల ప్రత్యక్ష ప్రతిఫలనమేమి ఉండదు. కాని భవిష్యత్తులోని ఉత్పాదకతను పెంచడానికి ఈ వ్యయం ఉపకరిస్తుంది. మూడవ రకంలోని వ్యయాల వల్ల ప్రత్యక్ష ప్రతిఫలనముంటుంది. కానివ్యయం చేయబడిన మొత్తంలో కొంత భాగం మాత్రమే తిరిగివచ్చును. కొంత ఫీజు వసూలు చేసి ఉన్నత విద్య నొసంగుచున్నారు. అనగా చేసిన వ్యయంలో కొంత భాగం ఫీజు రూపంలో వసూలవుతుంది. కాని నాల్గవ తరగతిలో పూర్తి ఆదాయం రావడం జరుగును. తంతితపాలా, రేల్వేశాఖల వ్యయాలు ఇందులకుదాహరణలు.

ఈ వర్గీకరణకూడా పూర్తి సంతృప్తికరమైందికాదు. కొన్ని వ్యయాలవల్ల ప్రత్యక్ష ప్రతిఫలనముండకపోవచ్చు. కాని పరోక్ష ప్రతిఫలనముండవచ్చు. ఉదాహరణకు రక్షణ వ్యయం, బీదరికపు నిర్మూలనా వ్యయం, జాతీయాదాయంపై పరోక్ష ప్రభావాలు కల్గి ఉండవచ్చు. అంతేకాక ఈ వర్గీకరణ ఆదాయ ప్రతిఫలాన్ని ఆధారంగా తీసుకుంటోంది. కాని ప్రభుత్వ వ్యయం యొక్క ప్రధానోద్దేశ్యం ఆదాయాన్ని సంపాదించుట కాదు. అందుచేత ప్రభుత్వ వ్యయాన్ని ఆదాయం ఆధారంగా వర్గీకరించుట సరికాదు.

### 18.2.4 ప్రాముఖ్యత ఆధారంగా వర్గీకరణ

ఈ వర్గీకరణ షిరాస్‌చే ప్రతిపాదింపబడింది. అతడు ప్రభుత్వ వ్యయాన్ని (i) ప్రాథమిక వ్యయం (Primary expenditure) (ii) గౌణవ్యయం (Secondary expenditure) అని రెండు తరగతులుగా విభజించెను. ప్రతి ప్రభుత్వం తప్పనిసరిగా చేపట్టవలసిన కార్యకలాపాలపై వ్యయాన్ని ప్రాథమిక వ్యయమన్నాడు. దేశరక్షణ శాంతి భద్రతల నిర్వహణ, ప్రభుత్వ ఋణచెల్లింపులు ఈ కోవకు చెందుతాయి. మిగిలిన వ్యయాలన్నీ గౌణమైనవిగా భావించబడ్డాయి. కాని ఆధునిక కాలంలో విద్య ఆరోగ్యం, మొదలైన సేవలపైచేయు వ్యయం కూడా ముఖ్యమైనదే కనుక ఈ వ్యయాలను కూడ ప్రాథమిక వ్యయాలుగా భావించాలి.

BRAOU

### 18.2.5 డాల్టన్ వర్గీకరణ

డాల్టన్ ప్రభుత్వ వ్యయాన్ని గ్రాంట్లు, కొనుగోలు ధరలుగా విభజించాడు. ప్రభుత్వం కొంత వ్యయం చేసి ఆ వ్యయానికి ప్రతిఫలంగా ఎట్టి వస్తువునుకాని, సేవను కాని, తిరిగి పొందనిచో ఇట్టి వ్యయాన్ని గ్రాంట్లు అంటారు. నిరుద్యోగభృతి పింఛనులు మొదలైనవి గ్రాంట్లు ప్రభుత్వం వ్యయం చేసి ప్రతిఫలంగా ఏదైన వస్తువునుగాని సేవనుగాని తిరిగిపొందినచో దానిని కొనుగోలు ధర అంటారు.ప్రభుత్వోద్యోగులకు చెల్లించే జీతాలు కొనుగోలు ధరలక్రిందకు వస్తాయి.

ప్రభుత్వ వ్యయాన్ని గ్రాంట్ల కొనుగోలు ధరలుగా వర్గీకరించడం ప్రభుత్వ ఆదాయాన్ని పన్నులు, అమ్మకపు ధరలుగా విభజించడాన్ని పోలియున్నది. పన్నుల విషయంలో ప్రభుత్వంనుండి చెల్లింపుదారుకు ఎట్టి ప్రత్యక్ష ప్రతిఫలనములేదు. అదే విధంగా గ్రాంట్లు పొందినవాడు ప్రభుత్వానికి ఎట్టి వస్తువుగాని సేవనుగాని అందివ్వడు. ప్రభుత్వ వ్యయ సందర్భంలో కొనుగోలు ధరలు ఎట్టివో ప్రభుత్వ ఆదాయ సందర్భంలో అమ్మకపు ధరలు అట్టివే. అమ్మకపు ధరల విషయంలో ధర చెల్లింపుదారుకు ప్రభుత్వం నుండి వస్తువు గాని సేవగాని ప్రతిఫలంగా ఉంటుంది

కొనుగోలు ధరల విషయంలో ప్రభుత్వం వ్యక్తుల నుండి వస్తు సేవలను ప్రతిఫలంగా పొందుతుంది. అయితే ఈ వర్గీకరణలోని రెండు తెగలూ పరస్పర వైవిధ్యం కలవికావు. ప్రభుత్వం చేయు కొన్ని వ్యయాలను గ్రాంట్లో, కొనుగోలు ధరలో నిర్ణయించడం కష్టం. ఒక కోణం నుంచి చూస్తే గ్రాంట్లుగాను మరొక కోణం నుంచి చూస్తే కొనుగోలు ధరలుగాను కనబడతాయి. ప్రభుత్వ ఋణాలపై చెల్లించు వడ్డీలు, పించనులు తీసుకుందాం. ప్రస్తుత కాలాన్ని లెక్కలోకి తీసుకొని చూస్తే వీటిని గ్రాంట్లుగానే భావించాలి. ఎందుకంటే ఈ వ్యయాలనుండి ప్రభుత్వానికి ఎట్టి వస్తువుకాని సేవగాని లభించుటలేదు. కాని గతాన్ని కూడా లెక్కలోకి తీసుకొంటే మరోరకంగా కనబడుతుంది. ఈ చెల్లింపులు గతంలో వీరు అందించిన వస్తు సేవలకు ప్రతిఫలంగా అందజేయబడుతున్నాయి. అందుచేత వీటిని కొనుగోలు ధరలుగా భావించాలి.

### 18.2.6 పిగూ వర్గీకరణ

పిగూ ప్రభుత్వ వ్యయాన్ని రెండు రకాలుగా వర్గీకరించాడు. అవి (i) బదిలీ వ్యయం, (ii) బదిలీ కాని వ్యయం,పౌరుల ప్రయోజనం కొరకు ప్రభుత్వం చేసే వ్యయాన్ని 'బదిలీ వ్యయం' అని చెప్పవచ్చు. వృద్ధాప్య పించను, నిరుద్యోగ భృతి, ఉచిత వైద్య సహాయం, మొదలగు వాటిని ఈ తరగతి క్రింద చేర్చవచ్చు. అందుకు విరుద్ధంగా పౌరుల ప్రయోజనం కొరకు గాకుండా ప్రభుత్వం తన ప్రయోజనం కొరకు వెచ్చించే వ్యయాన్ని 'బదిలీ కానివ్యయం' అని అంటారు. ఈ తరగతిలో ప్రభుత్వపాలన కయ్యే వ్యయం ఇమిడి వుంటుంది. కాని ఈ వర్గీకరణలోని ముఖ్యమైన లోపమేమిటంటే బదిలీ వ్యయమూ, బదిలి కాని వ్యయాల మధ్య ఖచ్చితమైన హద్దులను నిర్ణయించలేము.

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ప్రయోజనాల ఆధారంగా ప్రభుత్వ వ్యయాన్ని ఏ విధంగా వర్గీకరించగలరు.
2. విధులననుసరించిన ప్రభుత్వ వ్యయాన్ని ఎన్ని తరగతులుగా వర్గీకరించవచ్చు.
3. ప్రభుత్వవ్యయాలపై పిగూ వర్గీకరణను వివరింపుము.

## 18.3 భారతదేశంలో ప్రభుత్వ వ్యయ వర్గీకరణ

భారతదేశంలో ప్రభుత్వ వ్యయాన్ని 1957-58 సం॥ నండి ఆర్థిక మరియు విధులననుసరించిన వర్గీకరణాన్ని అవలంబించారు. ఆర్థిక వర్గీకరణం ప్రకారం వ్యయాన్ని రెవెన్యూ మూలధనం (Capital) పద్దుల క్రింద విడదీసినారు. వివిధ ప్రభుత్వ శాఖలపైనను, ప్రభుత్వం యొక్క సామాన్యవిధుల నిర్వహణకును అగు వ్యయాన్ని రెవెన్యూ వ్యయం అంటారు. ఈ వ్యయం దేశాభివృద్ధి కవసరమగు ఎట్టి ఆస్తులను నిర్మించదు. ప్రభుత్వోద్యోగులకు చెల్లించేవేతనాలు, అంతర్జాతీయ సంస్థలకు చెల్లించు చందాలు, ఆరోగ్యం, విద్యలపై చేయు వ్యయాలు రెవెన్యూ పద్దు కిందకు వస్తాయి. ఈ వ్యయాలు ఆర్థిక వృద్ధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని కల్గిఉండకపోయిననూ దీర్ఘకాలంలో అధికవృద్ధిని సాధించడానికి తప్పక సహాయపడతాయి. మూలధన వ్యయం భూమి, భవనాలు, యంత్రాలు, ఇతర పరికరాలు మొదలగు ఆస్తులను సంపాదించుకొనుటకు ఉపయోగపడతాయి. ఈ వ్యయం మార్కెట్ ఋణాలు, రిజర్వుబ్యాంకు, విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థల నుండి తీసుకున్న ఋణాలు నుండి చెల్లించబడతాయి.

రెవెన్యూ వ్యయం అభివృద్ధికి దోహదం చేయని వ్యయమనీ, మూలధన వ్యయాన్ని అభివృద్ధి వ్యయమనీ విస్తృతార్థంలో వాడినప్పటికీ ఈ భావం సరికాదు. కొన్ని మూలధన వ్యయాలు అభివృద్ధికి దోహదం చేయకపోవచ్చు. అట్లే కొన్ని రెవెన్యూ వ్యయాలు అభివృద్ధి దాయకాలు కావచ్చు. అందుచే మూలధన వ్యయాన్ని అభివృద్ధి వ్యయం,



BRAOU

అభివృద్ధేతర వ్యయం అని వర్గీకరిస్తారు. అలాగే రెవిన్యూ వ్యయాన్ని కూడా అభివృద్ధివ్యయం, అభివృద్ధేతర వ్యయం అని వర్గీకరిస్తారు.

భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలను అమలు జరుపుచుండడంవల్ల ప్రభుత్వ వ్యయం ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయమనీ వర్గీకరించబడుతోంది. ఈ తేడాను ఒక ఉదాహరణ ద్వారా వివరించవచ్చు. ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఒక పాఠశాల నిర్మించబడిందనుకొందాం. దానిపై చేసిన వ్యయాన్ని ప్రణాళికా వ్యయమంటారు. ఈ వ్యయంలో కొంతభాగం రెవెన్యూ వ్యయంగానూ, కొంతభాగం మూలధనవ్యయంగానూ ఉంటుంది. రెండూ కలిపి ప్రణాళికా వ్యయమౌతుంది. కాని తరువాత ప్రణాళికా కాలంలో ఈ పాఠశాలపై జీతాల రూపంలో గాని, భవన రిపేర్ల రూపంలో గాని చేసే వ్యయం ప్రణాళికేతర వ్యయం క్రిందకు వస్తుంది. ఎందుకంటే తరువాత ప్రణాళికా కాలంలో దీనిపైన వ్యయం వెనుకటి ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించడం క్రిందకే వస్తాయి. కాని క్రొత్త కార్యకలాపం క్రిందకు రాదు. ఇంకొక ఉదాహరణ పరిశీలిద్దాం. ఒక క్రొత్త ఉద్యోగాన్ని సృష్టించామనుకొందాం. ఇది ఏ ప్రణాళికా కాలంలో సృష్టించబడిందో ఆ ప్రణాళికాంతం వరకూ ప్రణాళికా వ్యయం క్రిందకే వస్తుంది. కాని తరువాతి ప్రణాళికా కాలంలో దీనిపై వ్యయం ప్రణాళికేతర వ్యయం క్రిందికి వస్తుంది. ప్రతీ ప్రణాళికా కాలంలోను చేపట్టిన కొత్త కార్యకలాపాలేమిటో తెలుసుకోవాలి. కనుక ఈ వర్గీకరణ అవసరం.

విధులననుసరించిన వర్గీకరణలో ప్రభుత్వ వ్యయం క్రింది తరగతులుగా విభజింపబడుతుంది.

i) సామాన్య సేవలు
ii) ఆర్థిక సేవలు
iii) సాంఘిక సేవలు
iv) రక్షణ సేవలు
V) రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకూ ఇచ్చే ఋణాలు, ముందు చెల్లింపులు (Advances)

ఈ వర్గీకరణ రెవెన్యూ, మూలధన పద్దులు రెండింటికీ వర్తిస్తుంది. ఉదాహరణకు మూలధన పద్దులో సామాన్య సేవలు రాజ్యాలు చెందిన పార్లమెంటు, దాని శాఖలు, న్యాయశాఖ, ఎన్నికలు మొదలగువాటికి సంబంధించిన ఆఫీసు భవనాల నిర్మాణం, ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి, ప్రపంచబ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలకు చెల్లించు మొత్తాలు కూడా ఈ తరగతిలోకే చెందుతాయి. రక్షణ సేవలలోని వ్యయాలలో జీతాలు, పింఛనులు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు రెవెన్యూ వ్యయానికి, భవనాల నిర్మాణం,యంత్ర సామగ్రి, పనిముట్లు మొదలగు వాటికొనుగోలు మూలధన వ్యయం క్రిందకు వస్తాయి. సాంఘిక సేవల్లో విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఉద్యోగిత మొదలైనవి ముఖ్యమైనవి. ఈ వ్యయాలు కూడా రెవెన్యూ మూలధన వ్యయాలుగా విభజించబడినవి. దేశం శీఘ్రగతిని ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కొన్ని సేవలు చాల అవసరము. వాటిని ఆర్థిక సువలంటారు. వ్యవసాయం, వ్యవసాయ సంబంధమైనవి, పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహం, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, రవాణా మొదలైనవి ఆర్థికసేవలు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇచ్చే సహాయక గ్రాంటులు(Gtants-in-aid), ప్రభత్వ వ్యవస్థలకు ఇమ్చ అడ్వాన్సులు, ఋణాలు ఆఖరి తరగతికి చెందుతాయి.

## 18.4 భారతదేశంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదల తీరు

పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనప్పటి నుండి భారతదేశంలో ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరుగుతోంది. ఈ పెరుగుదల అభివృద్ధి వ్యయంలోనే కాక అభివృద్ధేతరవ్యయంలో కూడా కనబడుతోంది. 1950-51 సం॥ నుండి 1980-81 సం॥ల మధ్యకాలంలో భారతదేశంలోని ప్రభుత్వ వ్యయ పెరుగుదల 1వ పట్టికలో చూపబడింది.

**పట్టిక 1**

**భారతదేశంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదల**

**(కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు)**

*(కోట్ల రూ॥లలో)*

| సంవత్సరం | ప్రభుత్వ వ్యయం | స్థూలజాతీయ ఉత్పత్తి | స్థూలజాతీయ ఉత్పత్తిలో ప్రభుత్వ వ్యయ శాతం |
|---|---|---|---|
| 1950-51 | 899.8 | 9,136 | 9.8 |
| 1955-56 | 1,437.2 | 9,710 | 14.8 |
| 1960-61 | 2,673.4 | 13,999 | 19.1 |
| 1965-66 | 5,464.5 | 21,866 | 25.0 |
| 1975-76 | 17,305.0 | 66,227 | 26.1 |
| 1980-81 | 35,258.0 | 114,319 | 30.8 |
| 1981-82 | 39,977 | 148,671 | 26.9 |
| 1982-83 | 46,098 | 164,399 | 28.0 |
| 1983-84 (R.E.) | 54,678 | 192,000 | 28.5 |
| 1984-85 (B.E.) | 60,280 | 217,500 | 27.7 |

*ఆధారం :* *బేసిక్ స్టాటిస్టిక్స్ రిలేటింగ్ టు ఇండియన్ ఎకానమీ, సి.ఎస్.ఓ. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా.*

BRAOU

మొత్తం వ్యయం 1950-51 సం॥లో రు. 899.8 కోట్ల నుండి 1980-81 సం॥లో రు. 35,258.0 కోట్లకు పెరిగింది. అనగా 40 రెట్లు పెరిగిందన్న మాట. ప్రభుత్వ వ్యయ పెరుగుదలను సరియైన పద్ధతిలో తెలుసుకోవాలంటే ప్రభుత్వ వ్యయం, స్థూల జాతీయోత్పత్తుల నిష్పత్తిని పరిశీలించాలి. ఈ పద్ధతి నవలంబించిననూ ప్రభుత్వ వ్యయం అవిచ్ఛిన్నంగా పెరుగుతోందని తెలుస్తోంది. స్థూల జాతీయోత్పత్తిలో ప్రభుత్వ వ్యయ శాతం 9.8 కాగా 1980-81 సం॥లో 30.8 కి పెరిగింది.

ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ వ్యయ ప్రభావాలు వ్యయ స్వభావంపై ఆధారపడి ఉంటుంది. కేవలం వ్యయ మొత్తాల పరిమాణాన్ని బట్టి ప్రభావాలను తెలుసుకోలేము. ఆర్థిక వ్యవస్థపై వ్యయ ప్రభావాలను తెలుసుకొనేందుకు వ్యయాన్ని అభివృద్ధి వ్యయం, అభివృద్ధేతర వ్యయం అని రెండు వర్గాలుగా విభజించాలి. భారతదేశానికి సంబంధించిన ఈ సమాచారం పట్టిక 2లో చూపబడినది.

## పట్టిక 2
## అభివృద్ధి, అభివృద్ధేతర వ్యయాల పెరుగుదల
## (కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు)

(కోట్ల రూ॥ంలో)

| సంవత్సరం | అభివృద్ధి వ్యయం | అభివృద్ధేతర వ్యయం | ఇతరములు | మొత్తం ప్రభుత్వ వ్యయంలో శాతం అభివృద్ధి వ్యయం | మొత్తం ప్రభుత్వ వ్యయంలో శాతం అభివృద్ధేతర వ్యయం |
|---|---|---|---|---|---|
| 1950-51 | 326.3 | 545.0 | 28.5 | 36.2 | 60.6 |
| 1955-56 | 667.3 | 654.1 | 115.8 | 46.4 | 45.5 |
| 1960-61 | 1,260.7 | 1,033.6 | 379.1 | 47.1 | 38.7 |
| 1965-66 | 2,387.3 | 2,140.3 | 936.9 | 43.7 | 39.2 |
| 1975-76 | 8,181.5 | 7,142.6 | 1,980.9 | 47.3 | 41.3 |
| 1980-81 | 17,715.5 | 13,293.2 | 4,249.3 | 50.2 | 37.7 |
| 1981-82 | 20,794 | 14,992 | 4,191 | 52.2 | 37.5 |
| 1982-83 | 23,794 | 17,897 | 4,407 | 51.6 | 38.8 |
| 1983-84 (R.E.) | 27,905 | 21,940 | 4,833 | 51.0 | 40.1 |
| 1984-85 (B.E.) | 30,840 | 23,418 | 6,022 | 51.2 | 38.8 |

*ఆధారం: పట్టిక 1 వలెనే*

BRAOU

ఈ పట్టిక లోని సమాచారాన్ని పరిశీలిస్తే అభివృద్ధి వ్యయం 1950 51 సం॥లో రు. 326 కోట్లు కాగా 1980-81 సం॥లో రు. 17,715 కోట్లకు పెరిగింది. కాని అభివృద్ధేతర వ్యయం ఇదే కాలంలో రు. 545 కోట్ల నుండి రు.13,293 కోట్లకు పెరిగింది. ఇంకో విధంగా చెప్పాలంటే అభివృద్ధి వ్యయం 55 రెట్లు పెరుగగా అభివృద్ధేతర వ్యయం 24 రెట్లు మాత్రమే పెరిగింది. అభివృద్ధి వ్యయం యొక్క ఈ అధికతర పెరుగుదల వల్ల మొత్తం వ్యయంలో దీనిభాగం గణనీయంగా పెరిగింది. 1950-51 సం॥లో అభివృద్ధి వ్యయం 31.2 శాతం కాగా అభివృద్ధేతర వ్యయం 60.6 శాతంగా ఉండేది. కాని 1980-81 సం॥నాటికి ఈ అనుపాతంలో గణనీయమైన మార్పులు వచ్చి అభివృద్ధి వ్యయం 50.2 శాతానికి పెరిగి, అభివృద్ధేతర వ్యయం 37.7 శాతానికి తగ్గిపోయింది. ఈ విధంగా గత మూడు దశాబ్దాల్లోనూ భారతదేశంలోని వ్యయ తీరులో తీవ్రమైన మార్పులు వచ్చాయి.

భారత ప్రభుత్వం (కేంద్ర) వ్యయ సమాచారాన్ని ఆధారంగా వివిధ విధులపై చేయబడుతున్న వ్యయాన్ని పరిశీలిద్దాం. అనగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల సమాచారం ఈ పరిశీలనలో లెక్కలోకి తీసుకోవడం లేదు. పట్టిక 3 ఈ సమాచారాన్ని తెలియచేస్తోంది.

## పట్టిక : 3
## కేంద్రప్రభుత్వ వ్యయం

(కోట్ల రూపాయలలో)

| | 1965–66 మొత్తం శాతం | 1970–71 మొత్తం శాతం | 1975–76 మొత్తం శాతం | 1980–81 మొత్తం శాతం | 1984–85 మొత్తం శాతం | 1986–87 (B.E.) మొత్తం శాతం |
|---|---|---|---|---|---|---|
| అ) అభివృద్ధి వ్యయం | 1081.0 (39.77) | 1477.5 (35.86) | 3945.4 (41.80) | 8549.7 (46.14) | 18504.8 (51.80) | 23559.4 (49.13) |
| i) సాంఘిక సేవలు | 1315.5 (4.83) | 227.4 (5.52) | 601.0 (6.37) | 1007.8 (5.44) | 2146.0 (6.01) | 3294.4 (6.87) |
| 1. విద్య | 87.2 (3.21) | 159.2 (3.86) | 355.9 (3.77) | 542.3 (2.94) | 1257.0 (3.51) | 1712.5 (3.57) |
| 2. ఆరోగ్యం, నీటి సరఫరా | 15.2 (0.56) | 28.7 (0.70) | 59.7 (0.63) | 116.4 (0.68) | 211.9 (0.60) | 387.8 (0.81) |
| 3. ఇతరములు | 29.1 (1.07) | 39.5 (0.96) | 185.4 (1.96) | 349.1 (1.88) | 677.1 (1.90) | 1193.1 (2.49) |
| ii) ఆర్థికసేవలు | 714.4 (26.26) | 863.7 (20.96) | 2703.4 (28.64) | 5405.5 (29.17) | 12029.6 (33.67) | 14250.2 (29.71) |
| 1. వ్యవసాయము, తత్సంబంధ సేవలు | 21.1 (0.78) | 77.7 (1.88) | 727.4 (7.71) | 1278.8 (6.90) | 2570.2 (7.19) | 14250.2 (29.71) |
| 2. పరిశ్రమ | 183.6 (6.75) | 296.7 (7.20) | 1001.5 (0.61) | 1641.2 (8.86) | 5200.6 (14.56) | 2900.9 (6.08) |
| 3. ఇతరములు | 509.7 (8.74) | 489,4 (11.88) | 806 (8.54) | 2485.5 (13.41) | 4258.8 (11.92) | 5561.8 (11.60) |
| iii) రాష్ట్రాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయక గ్రాంట్లు | 236.0 (8.68) | 386.4 (9.38) | 641 (6.79) | 233.8 (11.52) | 4329.2 (12.1) | 5787.5 (12.07) |
| | | | | | 17219.2 (48.20) | 6015.8 (12.50) |
| ఆ) రక్షణలో కూడిన అభివృద్ధేతర వ్యయం | 638.5 (60.23) | 2643 (64.14) | 5493 (58.00) | 9979.2 (53.86) | | 24396.4 (50.87) |
| మొత్తం వ్యయం | 2720.4 | 4120.5 | 9438.9 | 18528.9 | 35724.0 (100.00) | 47955.8 (100.00) |

1980-81 సం॥లో సాంఘిక సేవలపై రు॥ 1007.8 కోట్లు ఆర్థిక సేవలపై రు. 54055.5 కోట్లు ఖర్చు చేయబడెను. మొత్తం వ్యయంలో వీటి భాగం వరుసగా 5.44 మరియు 29.17 శాతం సాంఘిక సేవలోని వ్యయభాగం 1965-66 సం॥కంటే కొద్దిగా పెరిగింది. ఈ వ్యయంలో విద్య, ఆరోగ్యం ఎక్కువభాగాన్ని పొందుతున్నాయి.

ఆర్థిక సేవలపై వ్యయం రు. 5405.2 కోట్లు లేదా మొత్తం వ్యయంలో 29.17 శాతం అని పైన పేర్కొన్నాం. ఈ అంశం కూడా 1965-66 మరియు 1980-81 మధ్య కాలంలో తన భాగాన్ని పెంచుకుంది. వ్యవసాయం, పరిశ్రమలు, ఖనిలో ముఖ్య అంశాలు. ఈ రెండింటిలోను పరిశ్రమలు అధికభాగాన్ని పొందుతున్నాయి. అయితే గమనించవలసిన విషయమేమంటే వ్యవసాయంపై వ్యయంలో విపరీతమైన పెరుగుదల ఉంది. ఈ వ్యయం రు. 21.1 కోట్ల నుండి (1965-66 సం॥లో) రు. 1278.8 కోట్లకు (1980-81లో) పెరిగింది. అంటే దీని భాగం 0.78 శాతం నుండి 6.90 శాతానికి పెరిగిందన్నమాట. దీనిని బట్టి వ్యవసాయానికి కివ్వబడిన ప్రాధాన్యత 1961 సం॥ తర్వాతనే పెరిగిందని తెలుస్తోంది.

విధుల ననుసరించిన వర్గీకరణలో మరియొక ముఖ్యాంశం రక్షణ. ఇది అభివృద్ధేతర వ్యయంలో కలిపి చూపబడినది. ఈ అంశంపై వ్యయం నిరపేక్షంగా పెరిగినా అధికభాగాన్నైతే తీసుకొనుటలేదు. ఈ వ్యయంయొక్క భాగం 1965-66 సం॥లో 60.23 శాతం నుండి 1980-81 సం॥నకు 53.86 శాతానికి తగ్గిపోయింది.

## 18.5 ముగింపు

భారతదేశంలో ప్రభుత్వవ్యయ తీరు పెరుగుదల అర్థం చేసుకోవాలంటే ముందుగా వర్గీకరణ తెలుసుకోవాలి. ఏ వర్గీకరణయైనా శాస్త్రీయ పద్ధతిలో ఉండాలంటే వర్గాలు పరస్పర వైవిధ్యం కలవిగా ఉండి వర్గీకరణ ఆధారం ప్రభుత్వ వ్యయంయొక్క ప్రధాన లక్షణమై ఉండాలి. ఉదాహరణకు ఆదాయాన్ని అనుసరించిన వర్గీకరణ సరియైనది కాదు. ఎందుకంటే ప్రభుత్వ వ్యయం యొక్క ప్రధాన గమ్యం ఆదాయాన్ని సంపాదించుటకాదు. చాల వర్గీకరణలు పరస్పర వైవిధ్యం కల వర్గాలను కల్గియుండవు. ప్రయోజనాన్ని ఆధారంగా వర్గీకరించినపుడు ఒక వ్యయం ఒక ప్రత్యేక వర్గానికి ప్రయోజనాలనిస్తుంది లేక సమాజానికంతకూ ప్రయోజనాలనిస్తుందా అనే విషయం నిర్ణయించడం కష్టం. విధుల ననుసరించిన వర్గీకరణలోని లోపమేమంటే ఒక వ్యయం రక్షణనిస్తుంది. కాని అభివృద్ధికి దోహదం కాదనియూ మరొక వ్యయం వాణిజ్యపరమైనదేకాని అభివృద్ధికి దోహదం చేసేది కాదనీ నిర్ణయించడం కష్టసాధ్యం. ఆదాయాన్ని ఆధారంగా తీసుకొని చేయబడిన వర్గీకరణ పరోక్ష ప్రతిఫలాన్ని లెక్కలోకి తీసుకోవడంలేదు అంతేకాక ఈ వర్గీకరణ ఆధారం కూడా సరియైనది కాదు.

ఇండియాలో ఆర్థిక మరియు విధుల ననుసరించిన వర్గీకరణ అమలు జరుపబడుతోంది. ఆర్థిక వర్గీకరణలో రెవెన్యూ, మూలధన పద్దులు అనియూ అభివృద్ధి, అభివృద్ధేతర వ్యయాలనియూ వేర్పాటు కలదు. విధుల ననుసరించిన వర్గీకరణలో సామాన్య సేవలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు, రక్షణ సేవలు అని వర్గాలు కలవు.

ఇండియాలో ప్రభుత్వ వ్యయం అవిచ్ఛిన్నంగా పెరుగుతోంది. స్థూల జాతీయోత్పత్తిలో ప్రభుత్వ వ్యయశాతం 1950-51 సం॥లో 9.8 నుండి 1980-81 సం॥లో 30.8 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదలకు అభివృద్ధి వ్యయం ప్రధాన కారణమైంది. ఎందుకంటే అభివృద్ధి వ్యయం 55 రెట్లు పెరుగగా అభివృద్ధేతర వ్యయం 24 రెట్లు మాత్రమే పెరిగింది. దీనివల్ల వ్యయ తీరులో మార్పు వచ్చింది. 1950-51 సం॥లో అభివృద్ధి వ్యయం 36.2 శాతం మాత్రం కాగా 1980-81 సం॥లో 50.2 శాతానికి పెరిగింది. అభివృద్ధేతర వ్యయం 60.6 శాతం నుండి 37.7 శాతానికి తగ్గిపోయింది భారతప్రభుత్వ వ్యయ తీరును పరిశీలిస్తే ఇంకొక ముఖ్య విషయం తెలుస్తోంది. వ్యవసాయరంగ ప్రాధాన్యత 1965 సం॥నకు పూర్వం చాల తక్కువగా ఉండేది. 1965 వ సం॥నుండి



BRAOU

వ్యవసాయరంగం మీద వ్యయభారం తీవ్రగతిని పెరుగుతోంది. 1980-81 వ సం॥ నాటికి పారిశ్రామిక రంగానికి ఇవ్వబడిన భాగానికి దగ్గరగా చేరుకుంది.

– ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం.

## 18.6 సంప్రదించు పుస్తకాలు

1. H.Dalton : Public Finance
2. B.P. Thyagy : Public Finance
3. H.L. Bhatia : Public Finance

## 18.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ప్రభుత్వ వ్యయ వర్గీకరణను వివరింపుము.
2. భారతదేశంలో ప్రభుత్వ వ్యయం ఏవిధంగా వర్గీకరింపబడింది? ప్రభుత్వ వ్యయ తీరును పరీక్షింపుము.

II. ఈ క్రింది వాటికి సుమారు 15 పంక్తులలో వివరణలిమ్ము.

1. ప్రయోజనాల ఆధారంగా వ్యయివర్గీకరణను వివరించుము?
2. నికల్‌సన్ మరియు డాల్టన్ ప్రభుత్వ వ్యయవర్గీకణను వివరించుము.
3. భారతదేశంలో ప్రభుత్వ వ్యయతీరు, విధానాన్ని క్లుప్తంగా వివరించుము.

B R A O U

●●●

# భాగం – 19 : ప్రభుత్వ వ్యయ ప్రభావాలు

**విషయక్రమం**

**19.0 ఉద్దేశాలు, లక్ష్యాలు**
**19.1 పరిచయం**
**19.2 ఉత్పత్తి పై ప్రభుత్వ వ్యయప్రభావం**
**19.3 పంపిణీపై ప్రభుత్వ వ్యయప్రభావం**
**19.4 ఇతర ప్రభావాలు**
**19.5 ముగింపు**
**19.6 సంప్రదించు పుస్తకాలు**
**19.7 నమూనా పరీక్షాప్రశ్నలు**

## 19.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ వ్యయప్రభావం ఉత్పత్తి, పంపిణీ, మరియు వనరులను ఇతర రంగాలలోకి తరలించడం. ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అవగాహన చేసుకోగలుగుతారు.

- ఉత్పత్తి పై ప్రభుత్వ వ్యయ ప్రభావం
- ఆదాయ పంపిణీపై ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని విశ్లేషించడం
- ఆర్థికవృద్ధి మరియు ఆర్థిక స్థిరత్వమును సాధించడములో ప్రభుత్వవ్యయ ప్రభావాన్ని విశదీకరించడము.

## 19.1 పరిచయం

ఆర్థికాభివృద్ధి సాధించే కొద్దీ ప్రభుత్వ వ్యయపరిమాణం కూడా పెరుగుతుందనే విషయం వెనుకటి పాఠంలో తెలుసుకున్నాం. భారతదేశంలో ప్రభుత్వ వ్యయం జాతీయోత్పత్తిలో దాదాపు 33 శాతం వుంది. ఇంత పెద్ద మొత్తంలో చేయబడుతున్న ప్రభుత్వ వ్యయాన్ని కేవలం విత్తసంబంధమైన యంత్రాంగంగా ఊహించరాదు. ప్రభుత్వ వ్యయం ఉత్పత్తి స్థాయి, తీరులను, ఆదాయ పంపిణీని ప్రభావితం చేస్తుంది. కావున సాంఘిక న్యాయంతో కూడిన అభివృద్ధిని సాధించడానికి ఇది ఒక సాధనం.

ప్రభుత్వ వ్యయం ఆర్థిక వనరుల వినియోగ తీరును రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంది. మొదటి విధమేమనగా ఇంతకు ముందు వినియోగించబడని వనరులు ప్రభుత్వవ్యయ సహాయంతో వినియోగంలోకి రావచ్చు. ఇలా ఎందుకు జరుగుతుందంటే. ఈ రంగాల్లో ప్రైవేటు వ్యక్తుల శక్తికి మించిన పెద్దమొత్తాలలో పెట్టుబడి అవసరం వుండవచ్చు. లేదా ఈ రంగాలు లాభసాటి కాకపోవచ్చు. ఒక ఉదాహరణ తీసుకొని పరిశీలిద్దాం. విద్యుత్పాదనకు అధిక పెట్టుబడి అవసరం. పైగా ఈ పెట్టుబడివల్ల తగినంత లాభం వుండకపోవచ్చు. కాని దీనివల్ల తక్కిన వస్తువుల ఉత్పత్తి పెరుగుతుంది. రెండవ విధమేమనగా-ప్రభుత్వ వ్యయ సేవల వినియోగ మార్గాన్ని ప్రభావితం చేయవచ్చు. దీనివలన ఉత్పత్తి తీరులో సాంఘిక న్యాయ లక్ష్య సాధనకవసరమగు మార్పులు



B R A O U

కలుగుతాయి. ఉత్పత్తి కార్యక్రమాన్ని పూర్తిగా మార్కెట్టు యంత్రాంగానికి వదిలేస్తే అధిక డిమాండు కలిగిన వస్తువులు మాత్రమే ఉత్పత్తిచేయబడతాయి. మరియు ఈ వస్తువుల ఉత్పత్తికే వనరులు వినియోగించబడతాయి. కొనుగోలు శక్తి లేనందున పేదవారికవసరమైన వస్తువులు అనగా వేతన వస్తువులు ఎక్కువ డిమాండును కలిగి వుండవు. అందువల్ల వాటి ఉత్పత్తి అశ్రద్ధ చేయబడుతుంది. ఇట్టి పరిస్థితిలో వనరులను వేతన వస్తువుల ఉత్పత్తి మార్గం వైపు తరలించడానికి ప్రభుత్వ వ్యయం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఉపయోగపడుతుంది. ఈ విధంగా ప్రభుత్వ వ్యయ ప్రభావం ప్రస్ఫుటంగా తెలుసుకొనేందుకు ఉత్పత్తి పంపిణీ లపై ప్రభుత్వ వ్యయ ప్రభావాలను వేరువేరుగా పరిశీలించడం అవసరం. క్రింది భాగాలలో ఈ అంశాలు చర్చించబడతాయి.

## 19.2 ఉత్పత్తిపై ప్రభావం

ఉత్పత్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని వుండ వచ్చు. ఉదాహరణకు నీటి పారుదల సౌకర్యం కలుగజేయుటకై చేయు ప్రభుత్వ వ్యయం ప్రత్యక్షంగా ఉత్పత్తిదాయకం. సాంఘిక, ఆర్థిక అవస్థాపనా పెట్టుబడులైన రోడ్లు, రవాణా సౌకర్యాలు మరియు విద్య, ఆరోగ్యం మున్నగు మానవ రూపంలోని పెట్టుబడిపై వ్యయాలు పరోక్షంగా ఉత్పత్తిదాయకమైనవి.

ఉత్పత్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావాలను డాల్టన్ ఈ క్రింది కారణాల ద్వారా విశ్లేషించాడు.

(i) పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం
(ii) పని చేయాలని, పొదుపు చేయాలని, పెట్టుబడి పెట్టాలనే ఉత్సుకతలపై ప్రభావం.
(iii) ప్రాంతాల మధ్య, ఉపయోగాల మధ్య వనరుల తరలింపుపై ప్రభావం.

### 19.2.1 పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం

BRAOU

ఒక వ్యక్తి యొక్క సామర్థ్యాన్ని ప్రభుత్వ వ్యయం ప్రభావితం చేస్తే అతని పని చేసే సామర్థ్యం పెరుగుతుంది. ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం మొదలగు వాటిపై ప్రభుత్వ వ్యయం పని సామర్థ్యాన్ని పెంపొందింప జేస్తుంది. కాని వీటిలో కొన్నిటిని వస్తు రూపంలో అందజేస్తేనే కోరిన ఫలితాలు లభిస్తాయి. ఎందుచేతనంటే ద్రవ్య రూపంలోని గ్రాంట్లు వేరే ప్రయోజనాలకు ఉపయోగింపబడి ప్రధానలక్ష్యాన్ని దెబ్బతీస్తాయి. ఉదాహరణకు, విద్య ఆరోగ్యాలపై వ్యయం వస్తు రూపంలో అందజేస్తేనే సార్థకమౌతుంది. కొన్ని వ్యయాలు పొందుతున్న వారి సామర్థ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని కలుగజేయకపోవచ్చు. కాని పొందుతున్న వారి పిల్లల సామర్థ్యాన్ని భవిష్యత్తులో ప్రభావితం చేయవచ్చు. వితంతు పింఛనులపై వ్యయం ఈ రకానికి ఉదాహరణగా గ్రహించవచ్చు.

పొదుపు సాధ్యమగుట కవసరమగు అదనపు ఆదాయాన్ని ప్రభుత్వ వ్యయం కలుగజేస్తే అది వ్యక్తుల యొక్క పొదుపు చేసే సామర్థ్యాన్ని పెంచుతుంది. విద్య ఆరోగ్యాలపై ప్రభుత్వ వ్యయం పొదుపు చేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ఎందుచేతనంటే వ్యక్తులు ఈ సేవలపై ఖర్చు చేయవలసిన అవసరం వుండదు. కాని ఈ వ్యయాని కవసరమైన మొత్తాన్ని వ్యక్తుల నుండి పన్నుల రూపంలో వసూలు చేయవలసి వుంటుంది. అందుచేత ఎవరివద్ద నుండి పన్నులు వసూలు చేయబడుతున్నాయో ఆ వ్యక్తుల పొదుపు సామర్థ్యం తగ్గించబడుతుంది. ఈ రెండు శక్తులను లెక్కలోనికి తీసుకొని నికర ప్రభావాన్ని నిర్ణయించడం చాల కష్టం. ప్రభుత్వ వ్యయం పెట్టుబడి సామర్థ్యాన్ని పెంచాలంటే ఈ మొత్తాలను పెట్టుబడి పెట్టేవారికి అందేటట్లు చూడాలి.

### 19.2.2 పనిచేయడానికి, పొదుపు చేయడానికి, పెట్టుబడి పెట్టడానికి ఉత్సుకతలపై ప్రభావం

పని, పొదుపు, పెట్టుబడుల కోరికలపై ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని అంత స్పష్టంగా చెప్పలేము. ప్రభుత్వ వ్యయంవల్ల ఈ ఉత్సుకత పెరుగుతుందా తగ్గుతుందా అనే విషయం ప్రభుత్వ వ్యయం ద్వారా భవిష్యత్తులో వచ్చే ఆదాయాలను గూర్చిన వ్యక్తుల, అంచనాలపై ఆధారపడి వుంటుంది. అంతే కాని ప్రస్తుత ఆదాయంపై ఆధారపడి వుండదు. ప్రభుత్వ వ్యయం ద్వారా నిర్ణీత కాలంలో ఏ షరతులు లేకుండా స్థిరమైన ఆదాయం వస్తుందనే వూహ ఉన్నప్పుడు పొదుపు చేయాలనే కోరక వృద్ధి పొందదు. యుద్ధ పింఛనులు యుద్ధ రుణాలపై వడ్డీలు మొదలగునవి దీనికి ఉదాహరణలుగా పేర్కొన వచ్చు. ఈ వ్యయాలు పనిచేయాలనే కోరికను, పొదుపు చేయాలనే కోరికలను దెబ్బతీస్తాయి. ఎందుకంటే ఈ ఆదాయాలు వ్యక్తులకు తప్పనిసరిగా వచ్చేవి కనుక వారికి కష్టపడి పనిచేసి ఎక్కువగా సంపాదించాలని, భవిష్యత్తుకై పొదుపు చేయాలని కోరిక వుండదు.

కొన్ని గ్రాంటులు ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ఇవ్వబడతాయి. అనారోగ్యకాలంలో ఇవ్వబడే శలవు, పురిటిశలవు ఈ కోవకు చెందుతాయి. వీటిపై వ్యయాలు పని చేయాలనే కోరికను, పొదుపు చేయాలనే కోరికను దెబ్బ తీయవు. పైగా ఈ కోరికలను పెంచవచ్చుకూడా. ఉదాహరణకు, ఆదాయం పెరిగిన రేటులోనే ఈ గ్రాంట్లు కూడా పెరిగివనిచేయాలనే కోరిక పెరుగుతుంది. కాని ఈ పద్ధతిని ఆచరణలో పెట్టడంచాల కష్టం. పనిచేసే కాలం పెరిగినప్పుడు తక్కువ గ్రాంటు ఇవ్వబడుతోందనుకుందాం. ఇప్పుడు పని చేయాలనే కోరిక పొదుపు చేయాలనే కోరిక దెబ్బతింటాయి. గ్రాంట్లు వ్యక్తి ఆర్థికస్తోమత ననుసరించి యివ్వబడినప్పుడు కూడ పనిచేయాలనే కోరిక పొదుపు చేయాలనే కోరిక ప్రభావితమౌతాయి. ఉదాహరణకు నిరుద్యోగ భృతిని కుటుంబ ఆదాయానికి ముడిపెడితే పని చేయాలని, పొదుపు చేయాలనే కోరికలు దెబ్బతినవచ్చు. ప్రభుత్వ వ్యయం పెట్టుబడి పెట్టాలనే కోరికను కూడా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు శాంతిభద్రతలను నెలకొల్పడంవల్ల ప్రజల హృదయాల్లో నమ్మకం పెరిగి ఉత్పాదక కార్యక్రమాలపై పెట్టుబడులు పెరగవచ్చు.

### 19.2.3 ఆర్థిక వనరుల మళ్ళింపు

వనరుల మళ్ళింపు సాధించడానికి ప్రభుత్వ వ్యయం ఒక సమర్థవంతమైన సాధనం. ఈ మళ్ళింపు వివిధ రకాలుగా వుంటుంది.

1. ప్రభుత్వ వ్యయం ద్వారా ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి వనరులను మళ్ళించవచ్చు. ఒక్కొక్కసారి ఈ మళ్ళింపు ఉత్పాదకశక్తిని పెంచవచ్చు. వెనుకబడిన ప్రాంతాలకు సాంఘిక, ఆర్థిక అవస్థాపనా పెట్టుబడుల నిమిత్తం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లు ఆ ప్రాంతాల్లోని ప్రజల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చు. అదే విధంగా వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించినట్లయితే నిరుద్యోగ సమస్య కొంతవరకూ పరిష్కరింపబడవచ్చు. కాని వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలను స్థాపించడంలో అనేక సమస్యలు ఎదురౌతాయి. వీటిలో కొన్నటిని ప్రభుత్వ వ్యయం మాత్రమే పరిష్కరించగలదు.

2. రెండవరకం మళ్ళింపు కాలానికి సంబంధించినది ప్రభుత్వ వ్యయం వనరులను ప్రస్తుత వాడకాన్నుండి భవిష్యత్తులో వాడకానికి మళ్ళించగలదు. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వ వ్యయం చాల తక్కువగా వుండి భవిష్యత్తుకు కావలసిన కేటాయింపు తగినంతగా వుండదు. దీనికి కారణమేమంటే వ్యక్తులు భవిష్యత్తుకు తక్కువ ప్రాధాన్యత నిస్తారు. అనగా, ఒకవ్యక్తి వచ్చే సంవత్సరంలో రు. 105 వ్యయం చేయడం కంటే ఈ సంవత్సరంలో రు. 100 వ్యయం చేయడాన్నే ఎన్నుకొంటాడు. మరీ దీర్ఘమైన కాలాన్ని లెక్కలోకి తీసుకుంటే ఈ తీరు మరీ స్పష్టంగా కనబడుతుంది. ఒక వ్యక్తి 30 సంవత్సరాల తర్వాత రు.

1000 ఖర్చు చేయడం కంటే ఇప్పుడు రు. 1000 ఖర్చు చేయడాన్నే ఎక్కువగా ఇష్టపడతాడు. అంతేగాక, భవిష్యత్తుకు ప్రాధాన్యతనిచ్చిన సందర్భాల్లో కూడా వస్తురూపంలోని మూలధనానికే ప్రాధాన్యతనిస్తారు. గాని మానవరూపంలోని మూలధనానికి ఎట్టి ప్రాధాన్యతనూ ఇవ్వరు. అందుచేత భవిష్యత్తుకై చేయబడిన ప్రభుత్వ వ్యయంలోని కేటాయింపు వర్తమాన భవిష్యత్తుల మధ్య సరియైన సంతులనాన్ని (Balance) ఏర్పరచి ఉత్పాదకశక్తి అవిచ్ఛిన్నంగా పెరగటానికి తోడ్పడుతుంది.

3. ప్రభుత్వ వ్యయం ద్వారా సాధించకలిగిన మరొక మళ్ళింపు వనరులను ఒక వాడకం నుండి మరొక వాడకానికి మళ్ళించడం, రక్షణ, పోలీసు, పౌరపరిపాలన మున్నగు వాటిపై వ్యయాలు వనరులను ప్రైవేటు రంగం నుండి ప్రభుత్వ రంగానికి తరలిస్తాయి. ఇట్టి వ్యయం కొన్ని సందర్భాల్లో వృధాగా పరిగణించబడుతోంది. ఈ రకమైన వ్యయాల విషయంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు రెండు విషయాలను లెక్కలోకి తీసుకోవాలి. ఒకటి ఏమనగా మరికొంత రక్షణ కల్పించడం వల్ల కలిగే ప్రయోజనాన్ని లెక్కించాలి. అదే విధంగా ఈ రక్షణ కల్పించిన ఫలితంగా ఏ వస్తువులను ఉత్పత్తి చేయలేకపోతున్నామో దానివల్ల కలిగే నష్టాన్ని లెక్కించాలి. ఈ రెండింటిని ఆధారం చేసుకొని ప్రయోజన నష్టాలను సంతులనం చేసే స్థాయిలో ప్రభుత్వ వ్యయాన్ని వుంచాలి. కొన్ని రకాల ప్రభుత్వ వ్యయాలు ఆ మొత్తాలను ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో వుంచడంకంటే అధిక ఉత్పాదకతనూ చేకూరుస్తాయి. రవాణా సౌకర్యాలు, నీటిపారుదల, ఆటవీకరణ, విద్య, పరిశోధనలు, ప్రజారోగ్యం, సాంఘికభద్రతలపై చేయు ప్రభుత్వ వ్యయాలు ఈ తరగతికి చెందుతాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ప్రభుత్వ వ్యయంపని, పొదుపు మరియు పెట్టుబడులను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది?
2. ఆర్థిక సామర్థ్యాలను పెంచడములో ప్రభుత్వ వ్యయం ఏవిధంగా ఉపయోగపడుతుంది?

BRAOU

## 19.3 పంపిణీపై ప్రభావాలు

ప్రభుత్వ వ్యయం ఆదాయ పంపిణీని ప్రభావితం చేస్తుంది. ఆదాయపంపిణీలోని అసమానతలను తగ్గించడానికి ఉపకరించే ప్రభుత్వ వ్యయం కోరతగినది. అన్నిరకాల ప్రభుత్వ వ్యయాల్లోకి గ్రాంట్లు, సబ్సిడీలు ఆదాయ పంపిణీపై నిశ్చితమైన ప్రభావాన్ని కల్గిస్తాయి. కాని అవి ఆర్థిక అసమానతలను పెంచుతాయా తగ్గిస్తాయా అనే విషయం ఇచ్చిన గ్రాంట్లు లేక సబ్సిడీల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. గ్రాంట్లను అనుపాతపు, పురోగామి, తిరోగామి అని మూడు రకాలుగా విభజించవచ్చును. ఆదాయంలో ఒక స్థిరమైన అనుపాతములో ఇవ్వబడిన గ్రాంట్లను అనుపాతపు గ్రాంట్లు అంటారు. ఆదాయం పెరిగిన కొద్దీ గ్రాంటు అనుపాతం తగ్గినచో దాని పురోగామి గ్రాంట్లు అంటారు. ఆదాయం పెరిగినకొద్దీ గ్రాంటు అనుపాతం కూడా పెరిగినచో తిరోగామి గ్రాంటు అంటాము. ఉదాహరణకు ఒక నిర్ణీత మొత్తంలో ఇవ్వబడిన వృద్ధాప్య పింఛను పురోగామిగా ఉంటుంది. ఎందువలననగా ఆదాయం పెరిగిన కొద్దీ ఈ గ్రాంటును ఆదాయంలో శాతంగా తీసుకొంటే తగ్గుతుంది. ప్రభుత్వ ఋణాలపై వడ్డీ తిరోగామిగా ఉంటుంది. ఎందువలననగా అధిక ఆదాయవర్గాలు ఎక్కువ అనుపాతంలో చెల్లించుటవల్ల వారు పొందే వడ్డీ మొత్తాలు కూడా ఎక్కువగానే ఉంటాయి.

ఆదాయపంపిణీపై ప్రభావాల విషయంలో పురోగామిగా గ్రాంట్లు అసమానతలను తగ్గిస్తాయి. అట్లే తిరోగామి గ్రాంట్లు అసమానతలను పెంచుతాయి. కనుక పంపిణీ ప్రయోజనాలదృష్ట్యా పురోగామి గ్రాంట్ల పద్ధతి ఆచరణయోగ్యమైనది. ఏ గ్రాంట్ల పద్ధతి ఒక నిర్ణీత స్థాయికి క్రిందనున్న ఆదాయాలన్నింటినీ ఆ స్థాయి వరకు తీసుకువస్తూ అంతకు పై నున్న ఆదాయాలను మార్చకుండా ఉంటుందో ఆ గ్రాంట్ల పద్ధతిని, అధికతను పురోగామి

పద్ధతి అనవసరము. అయితే ప్రభుత్వ రుణం తత్సంబంధమైన తిరోగామి పన్ను చెల్లింపులు ఉన్నంతకాలం నిర్ణీత స్థాయికి పై బడ్డ ఆదాయాలు మారకుండా చూడ్డం అసాధ్యం.

ఇక సబ్సిడీల విషయం చూద్దాం, రొట్టె, పాలు, మొదలగు వాటిపై సబ్సిడీలు ధరను తగ్గించి పురోగామి గ్రాంటును పోలి వుంటాయి ప్రైవేటుపాదువులపై సబ్సిడీలు మాత్రం తిరోగామిగా ఉంటాయి. ఆహారపదార్థాలపై సబ్సిడీలు అన్ని సందర్భాల్లోనూ పురోగామిగా ఉంటాయనడం సరికాదు. సబ్సిడీ పొందిన వస్తువుల ధనికుల వ్యయంలో కంటే బీదల వ్యయంలో ఎక్కువ అనుపాతంలో ఉంటేనే ఆ సబ్సిడీలు పురోగామిగా ఉంటాయి. సబ్సిడీలను రెండు విధాలుగా యివ్వవచ్చు. ఏ వర్గం వారు వాడుకుంటున్నారో చూడకుండా ఒక వస్తువుకు సబ్సిడీ యిస్తే ఆ సబ్సిడీని సామాన్య సబ్సిడీ అంటారు. అలాకాక, కొన్ని వర్గాలవారిచే మాత్రమే వినియోగించబడే వస్తువులకు సబ్సిడీ యిస్తే అది ప్రత్యేక సబ్సిడీ అవుతుంది. పాఠశాలకు పోవు పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పాలను తక్కువ ధరలకు సప్లయి చేస్తే ఇది ప్రత్యేక సబ్సిడీ అవుతుంది. పంపిణీ ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యేక సబ్సిడీలు సమర్థనీయం. ఆహారపదార్థాలపై సబ్సిడీలు ఇచ్చేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ సబ్సిడీలు వినియోగాన్ని పెంచాలంటే వ్యాకోచ డిమాండుగల వస్తువులను ఎన్నుకోవాలి గాని అవ్యాకోచ డిమాండుగల వస్తువులను ఎన్నుకోరాదు.

గ్రాంట్ల వల్ల కొన్ని పరోక్ష ప్రభావాలు కూడా ఉంటాయి. గ్రాంట్లు అదనపు ఆదాయాన్ని చేకూర్చి గ్రహీత యొక్క పని ఉత్సుకతను దెబ్బ తీయవచ్చును. ఈ విషయంలో పరోక్ష ప్రభావం ఆదాయపంపిణీ ధ్యేయాన్ని దెబ్బతీస్తుంది. ఒక్కొక్కప్పుడు పరోక్ష ప్రభావం కూడా అతని ఆదాయాన్ని పెంచవచ్చు. ఇప్పుడు ఆదాయ పంపిణీలో కోరిన మార్పులు వస్తాయి.

## 19.4 ఇతర ప్రభావాలు

ప్రభుత్వ వ్యయం ఎన్నో ఆశించిన మార్పులను తెచ్చుటకు విధాన సాధనంగా ఉపయోగపడుతుంది. ఆర్థికస్థిరత్వాన్ని ఆర్థికవృద్ధి మరియు మిగిలినవి సాధించడానికి దీన్ని ఉపయోగించవచ్చు.

### 19.4.1 ఆర్థిక స్థిరత్వము సాధించడము

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత ఒక లక్షణం. ఈ ఆర్థిక వ్యవస్థలు వ్యాపార చక్రాలకు లోనవుతాయి. అనగా ఆర్థికమాంద్యం, సౌభాగ్యం ఏర్పడుతూంటాయి. 1930వ సం॥ ప్రాంతాల్లో వచ్చిన ఆర్థిక మాంద్యం ఆర్థిక వేత్తల ఆలోచన సరళిలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది. వ్యాపార చక్రాలను అదుపులో వుంచడానికి ప్రభుత్వ వ్యయం ఒక ముఖ్య సాధనంగా గుర్తించబడింది.

కీన్సు విశ్లేషణ ప్రకారం ఆర్థిక మాంద్యం సౌభాగ్యాలకు సార్థకడిమాండు ముఖ్యకారణం. సార్థక డిమాండు తక్కువగా వుంటే ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. సమిష్టి డిమాండు మితిమీరితే సౌభాగ్యం ఏర్పడుతుంది. ప్రభుత్వ వ్యయం సర్దుబాటు ద్వారా సార్థక డిమాండు కోరదగిన స్థాయిలో వుంచడమే వ్యాపార చక్రాలను అదుపులో పెట్టడానికి కీన్సు యిచ్చిన పరిష్కారం. ఉదాహరణకు ఆర్థిక మాంద్య సమయంలో మూలధనపు ఉపాంత సామర్థ్యము చాలా తక్కువగా వుండి సమిష్టి డిమాండును తగ్గిస్తుంది. ఈస్థితిలో ప్రభుత్వ వ్యయం ద్వారా అదనపు కొనుగోలు శక్తిని చొప్పిస్తే, సమిష్టి డిమాండు పెరిగి మాంద్యాన్ని అరికడుతుంది. ఆర్థిక సౌభాగ్య స్థితిలో కూడా ప్రభుత్వ వ్యయాన్ని విధాన సాధనంగా వాడి పరిస్థితిని అదుపుచేయవచ్చు. ఈ సందర్భంలో మితిమీరిన ప్రైవేటు డిమాండు ద్రవ్యోల్బణం (Inflation) కు దారి తీస్తుంది. ప్రభుత్వ వ్యయపు కోతవల్ల సమిష్టి డిమాండు తగ్గుతుంది.



BRAOU

ఆర్థిక స్థిరత్వాన్ని సాధించేందుకు కేన్సు యిచ్చిన పై విధాన సంపోను పరిహారపు వ్యయ విధానము (Scheme of Compensatory spending) గా తెలుపవచ్చును.ప్రభుత్వ వ్యయాన్ని ప్రైవేటు డిమాండు తక్కువగా వున్నప్పుడు దాన్ని సరిదిద్దడానికి మితిమీరి వున్నప్పుడు దాన్ని తగ్గించడానికి గాని వాడవచ్చు. ఆర్థిక మాంద్యం సంభవించినపుడు ప్రభుత్వ వ్యయంలో పెరుగుదలను లోటు, ద్రవ్యవిధానం (deficit financing) ద్వారాఅనగా ప్రభుత్వ ఆదాయం కంటే వ్యయాన్ని ఎక్కువ స్థాయిలో వుంచడం ద్వారా సాధించవచ్చు. అట్లే ఆర్థిక సౌభాగ్య కాలంలో పన్ను విధింపును, ప్రభుత్వ రుణాలను అదే స్థాయిలో వుంచి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని అదుపులోనికి తీసుకురావచ్చు.

అయితే కొన్ని పరిస్థితుల్లో పరిహార వ్యయవిధానం సమర్థవంతంగా పనిచేయకపోవచ్చును. ఉదాహరణకు ప్రైవేటు డిమాండును ప్రోత్సహించుటకై లోటు ద్రవ్యవిధానాన్ని అమలు పరచినపుడు సప్లై వైపునుంచి లోపాలు (అనగా ముడి పదార్థాలు, నైపుణ్యత మొ॥ వాటి ద్వారా) లేకుండా వున్నపుడే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి.

### 19.4.2 ఆర్థికవృద్ధిని సాధించడము

ప్రభుత్వ వ్యయం యొక్క మరొక ముఖ్య ప్రభావం ఆర్థిక వృద్ధిని సాధించడం. అదనపు ఉత్పత్తిని పెరుగుతూన్న అనుపాతలో మూలధన సంచయనానికి వాడాలని జాన్ అడ్లర్ సూచించాడు. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ బడ్జెట్ లో రెండు రకాల మార్పులు అవసరం. అదనపు ఉత్పత్తిలో అధిక భాగాన్ని అభివృద్ధి కార్యకలాపాలకు వాడేటట్లు ప్రభుత్వ బడ్జెటును పెంచాలి. ప్రభుత్వ ఆదాయంలో అభివృద్ధి కార్యక్రమాలకు వాడే మొత్తం యొక్క భాగం పెరుగుతూ వుండాలి. ఈ విధంగా ప్రభుత్వ వ్యయం అభివృద్ధి సాధనంగా ప్రముఖ పాత్ర వహిస్తోంది.

### 19.4.3 ప్రయివేటు ఉత్సుకతను తగ్గించడం

ప్రభుత్వ వ్యయాన్ని ప్రైవేటు ఉత్సుకతను ఉత్తేజపరచటానికిగాని, ప్రైవేటు రంగాన్ని తొలగించడానికి గాని ఉపయోగించవచ్చును.. ప్రైవేటు రంగాన్ని ఉత్తేజపర్చడం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని సాధించవచ్చు. రుణాలు, సబ్సిడీలు, పన్ను మినహాయింపులు మొదలగు చర్యలు ప్రైవేటు రంగానికి ప్రత్యక్షంగా ప్రోత్సాహకాన్ని కలుగజేస్తాయి. సాంఘిక ఆర్థిక అవస్థాపనా పెట్టుబడులు పరోక్షంగా ప్రోత్సాహాన్ని కలుగజేస్తాయి. విద్య ఆరోగ్యాలపై వ్యయాలు సాంఘిక అవస్థాపనా పెట్టుబడులుగా చెప్పబడతాయి. విద్యుచ్ఛక్తి, రవాణా, కమ్యూనికేషన్లపై వ్యయాలు ఆర్థిక అవస్థాపనా పెట్టుబడులుగా చెప్పబడుతున్నాయి. ఈ ఆర్థిక సాంఘిక అవస్థాపనలు ఆర్థిక వృద్ధికి అత్యావశ్యకము. ఇవేకాక ప్రైవేటురంగం చేపట్టుటకు ఇష్టపడని కొన్ని వ్యవస్థల్లో ప్రభుత్వం పెట్టుబడి పెట్టాలి. నీటి పారుదల, విద్యుచ్ఛక్తి పథకాలు (Projects), ప్రాథమిక పరిశ్రమలు (Basic Industries), కీలక పరిశ్రమలు (Key Industries) ఈ రకానికి చెందుతాయి. ఈ మార్గాల్లోకి ప్రైవేటు రంగం ప్రవేశించకపోవటానికి తక్కువ లాభముండడంగాని, దీర్ఘకాలం తర్వాతనే ఫలితాలు ఉద్భవించడం (long gestation) వల్ల కాని కావచ్చును.

### 19.4.4 ఇతర లక్ష్యాలు

ప్రభుత్వ వ్యయాన్ని మరికొన్ని ప్రయోజనాలు సాధించడానికి కూడా వాడవచ్చు. ఉదాహరణకు, వెనుకబడ్డ ప్రాంతాల్లో నిరుద్యోగితను తొలగించడానికి ప్రభుత్వ వ్యయాన్ని వాడవచ్చు. తగిన విధానాలను ఎన్నుకొంటే ప్రభుత్వ వ్యయం ద్వారా పెద్ద పట్టణాల పెరుగుదలను అరికట్టడం కూడా సాధ్యమవుతుంది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

3. ప్రభుత్వ వ్యయం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని ఎలా సాధించగలుగుతారు?
4. ఆర్థిక వృద్ధిలో ప్రభుత్వ వ్యయం పాత్రను గురించి వివరించుము.
5. ఆదాయపంపిణిని ప్రభుత్వ వ్యయం ప్రభావితం చేయగల్గుతుందని నీవు అంగీకరింతువా?

## 19.5 ముగింపు

ప్రభుత్వ వ్యయాన్ని కేవలం విత్త సంబంధమైన యంత్రాంగంగా చూడరాదు. ఆర్థికవ్యవస్థకు తగిన స్థాయి తీరులో ఉత్పత్తి పంపిణి కార్యక్రమాలను సాధించడానికి ప్రభుత్వ వ్యయాన్ని ఒక సాధనంగా వాడవచ్చు. అంతేకాక వెనుక ఉపయోగంలోకి తీసుకురాబడని వనరులను ఉపయోగంలోకి తీసుకువచ్చి అవసరమైన మార్గంవైపు మళ్ళించటానికి కూడా ప్రభుత్వ వ్యయం ఉపయోగపడుతుంది. పని, పొదుపు పెట్టుబడుల సామర్థ్యాలన్ని ఉత్సుకతనూ ప్రభావితం చేయడం ద్వారా అధిక ఉత్పత్తిని సాధించడానికి, ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి గాని ఒక ఉపయోగం నుండి మరొక ఉపయోగానికి గాని వనరులను తరలించడానికి కూడా ప్రభుత్వ వ్యయం ఉపయోగపడుతుంది. అంతేకాక ప్రభుత్వ వ్యయంద్వారా సమకూర్చబడే వివిధ గ్రాంట్లు, సబ్సిడీలు అనేక ప్రభావాలను కలిగి ఉంటాయి. ఉదాహరణకు, ఆర్థిక అస్థిరత్వం , ఆర్థికవృద్ధి, నిరుద్యోగిత, నగరాల మితిమీరిన పెరుగుదల వంటి అనేక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వ్యయం ఉపయోగపడుతుంది.

– ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం.

## 19.6 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Hugh Dalton : Public Finance


## 19.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. ఉత్పత్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని పరిశీలింపుము.
2. ఆర్థిక స్థిరత్వం, ఆదాయ పంపిణిలో తగు మార్పులు చేయడానికి ప్రభుత్వ వ్యయం ఏ విధంగా ఉపయోగకరమైనది.

II. ఈ క్రింది వానికి 15 పంక్తులలో జవాబు లిమ్ము.

1. ప్రభుత్వ వ్యయం పని, పొదుపు మరియు పెట్టుబడులను ఏవిధంగా ప్రభావితం చేస్తుంది.
2. ఆర్థిక వనరులను ప్రభుత్వ వ్యయం ద్వారా ఎలా పంపిణీ చేయవచ్చు.
3. ఆర్థిక వృద్ధిని సాధించడంలోను ఆర్థిక స్థిరత్వమును ఏర్పరచడంలో ప్రభుత్వ వ్యయం ఎలా తోడ్పడుతుంది?



●●●

BRAOU

BRAOU

# ఖండం - 5

## ప్రభుత్వ ఋణం

ఈ ఖండంలో ప్రభుత్వ ఋణం స్వభావాన్ని, లక్షణాలను, వర్గీకరణను, ప్రభుత్వ ఋణ పాత్రను చర్చిస్తాం. ప్రభుత్వ ఋణ సిద్ధాంతం, భారం, తిరిగి చెల్లింపుకు చెందిన ప్రధాన సమస్యలను కూడా పరిశీలించడం జరిగింది. ప్రభుత్వ రాబడి యొక్క వివిధ ఆధారాల స్వభావంలోని విభేదాలను విశ్లేషించడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ఋణం, పన్నుల విధానం, లోటు ద్రవ్య విధానంల మధ్య పోలికలను, తారతమ్యాలను పోల్చడం జరిగింది.

ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి : అవి

భాగం - 20 : ప్రభుత్వ ఋణ స్వభావం - భారం - తిరిగి చెల్లింపు.

భాగం - 21 : ప్రభుత్వ ఋణం - పన్నుల విధానం - లోటు ద్రవ్య విధానం.

***

BRAOU

ప్రభుత్వ ఋణ స్వభావాన్ని, వర్గీకరణను ముందుగా చర్చిద్దాం. వర్గీకరణలో స్వదేశీ, విదేశీ ఋణాలుముఖ్యమైనవి. భారతదేశంలో ప్రభుత్వ ఋణ పరిమాణం ఏ విధంగా పెరుగుతున్నది,ప్రభుత్వ ఋణ పాత్ర ఏమిటి అను అంశాలను పరిశీలిద్దాం. ప్రభుత్వ ఋణ భారం గురించి, ప్రభుత్వ ఋణాన్ని తిరిగి చెల్లించే విధానాలేమిటో చర్చించాల్సిన ఆవశ్యకత ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా వుంది. ఈ భాగం చివరిలో ఈ విషయాలను తెలుసుకొందాం.

## 20.2 ప్రభుత్వ ఋణం – స్వభావం, భారం, తిరిగి చెల్లింపు

ప్రభుత్వం తనకు వచ్చే రాబడి కంటే అధికంగా ఖర్చు చేసినపుడు ప్రభుత్వ ఋణం ఉద్భవిస్తుంది. ప్రజలనుండి పుచ్చుకునే అప్పుకు ప్రభుత్వం విధించే పన్నుకు మధ్య భేదముంది. వనరుల సమీకరణకు, రాబడులను పెంపొందించుకొనేందుకు ఈ రెండూ ఉపయోగపడతాయి. పన్నుల వ్యవస్థవలె గాకుండా, ప్రభుత్వ ఋణమనేది ముఖ్యంగా స్వచ్ఛందమైన వ్యవహారం. ప్రభుత్వం సెక్యూరిటీలను, ఋణ పత్రాలను (Bonds)బిల్లులను లేదా సర్టిఫికేట్‌లను అమ్మినప్పుడు వ్యక్తులుగాని, వారి తరపున విత్త సంస్థలుగాని కొనుగోలు చేయవచ్చు. ఆ విధంగా కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ విత్త ఆస్తులను కలిగివుంటారు. ఆ ఆస్తులపై వారికి అన్ని రకాల హక్కులు, యోగ్యతలు, వుంటాయి.ఈ ఆస్తులను మార్కెటులో ఎప్పుడైననూ అమ్మవచ్చులేదా కొనవచ్చు.ప్రభుత్వ ఋణ స్వభావంను వివరంగా తెలుసుకొనుటకు ఋణ వ్యవహారానికి సంబంధించిన వివిధఅంశాలను విశదపర్చాలి.

(i) అప్పుగా తీసుకొన్న నిధులను ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి వుంటుంది. (ఐతే పన్నుల ద్వారా అంతే మొత్తంలో రాబడులను పొంది ప్రభుత్వం తన ఋణాలను తీర్చుకోవచ్చుననేది మరువ కూడదు). అప్పుతో బాటు వడ్డీని కూడా చెల్లించాలి. వడ్డీపై వ్యయమనేది సులభమైనది. ఎందుకంటే ఇతర ప్రభుత్వ వ్యయాలవలెదీనిని పన్ను రాబడి నుండి తీర్చవచ్చు. ప్రభుత్వ ఋణ చెల్లింపులో కీలకమైన సమస్యలున్నాయి. ఉదాహరణకు, ఋణ పత్రాలు సెక్యూరిటీలను కలిగి వున్న వారి జీవితకాలంలో ఋణ చెల్లింపు జరగకపోవచ్చు. అటువంటి పరిస్థితిలో వారి వనరులు ప్రభుత్వానికి బదిలీచేసినందుకుగాను ప్రతిఫలం పొందనప్పుడు ప్రస్తుత ఋణ పత్రాలున్నవారు చివరికిప్రభుత్వ ఋణ భారంను భరించవలెనా అనేది సమస్య. దీనికి సమాధానం అంత సులభంగా లభించదు. దీనిపై వివిధ ఆర్థిక వేత్తలు విభిన్నాభిప్రాయాలు తెలియజేసారు. ఈ ఋణభారం గురించి తర్వాత తెల్సుకొందాం.

(ii) ప్రభుత్వం విడుదల చేసే అన్ని ఆస్తులు లేదా క్లైయిములు (Claims) స్వజాతీయమైనవి కావు. సాదారణంగా అవి నిర్ణీత కాల వ్యవధి (Maturity Period) ని బట్టి లేదా ఋణ పత్రాలున్న వ్యక్తుల వర్గీకరణ పద్ధతిని బట్టి మారుతుంటాయి. వివిధ రకాలైన క్లైయిమ్‌లలో గల భేదాలు ఆర్థిక విధానానికి సాధనంగా ప్రభుత్వ ఋణ పరిధిని, ప్రాధాన్యతను నిర్ణయించడంలో కీలకపాత్రను నిర్వహిస్తాయి. ఉదాహరణకు, సగటు ఋణాల వ్యవధి తక్కువగా వుంటే ఋణ ద్రవ్యత్వత అధికంగా వుండును. కావున అదనపు ద్రవ్య సప్లయ్ ద్వారా ఆర్థిక వ్యవస్థలో సాధారణ ధరల స్థాయిని స్వల్పకాల ఋణ వ్యవస్థ ప్రభావితం చేస్తుంది. ఋణ కాల వ్యవధి ధరలను ఇంకొక విధంగా కూడా ప్రభావితం చేస్తుంది. అదేమంటే ఆర్థిక వ్యవస్థలో వడ్డీ రేటు వ్యవస్థపై ప్రభావాన్ని కలిగించి ధరలను మార్చును. ఒక దేశ కేంద్ర బాంకు ఋణానికి, వ్యక్తుల ఋణాలకు మధ్య భేదముంది. అదనపు ప్రభుత్వ ఋణ నిధుల ఆధారంగా కేంద్రబాంకు ద్రవ్య సప్లయ్‌ని విస్తరించవచ్చు. (ఈ విధంగానే ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని పాటిస్తుంది.) కాని వ్యక్తిగత ఋణాలకు అటువంటి పరిణామం వుండదు. ప్రభుత్వ ఋణానికి సంబంధించిన పైన తెల్పిన కాల వ్యవధి, యాజమాన్యపు పద్ధతి సమస్యలు " ప్రభుత్వ ఋణ నిర్వహణ" (Management of Public Debt) కు చెందినవి. ద్రవ్య, పరపతి నియంత్రణ విధానాలపై ఈ సమస్యలు కీలకమైన ప్రభావాన్ని చూపుతాయి.

(iii) లోటు ద్రవ్య విధానం ప్రభుత్వ ఋణ స్వభావానికి సంబంధించి ఇంకొక సమస్యను లేవనెత్తుతుంది.



BRAOU

ప్రభుత్వానికి బ్యాంకరుగా కేంద్ర బ్యాంకు క్రొత్త కరెన్సీ నోట్లను ముద్రించడం ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ఋణ వ్యవహారం స్వచ్ఛందమైంది కాదు. దానినే 'నిర్బంధపు పొదుపు' అనిఅంటారు. లోటుఋణ విధానం సాధారణంగా ద్రవ్యోల్బణపు ధరల పెరుగుదలకు దారితీస్తుంది. అందుకే అన్ని ప్రభుత్వ ఋణాలవల్ల ప్రైవేటు రంగంనుండి ప్రభుత్వ రంగానికి వనరుల బదిలీ సక్రమంగా జరుగదు.

(iv) ప్రభుత్వ ఋణ విక్రయం పరిమితమైనది.పోస్ట్ ఆఫీస్ పొదుపులు, ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లవంటి ఋణ అంశాలు విక్రయం కాలేవివి.ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు మొదలగునవి విక్రయం కాగలిగినవి. ఇంకా చెప్పాలంటే 'విక్రయం కాగల ఋణం' నిజ మార్కెట్ పరిస్థితుల్లో పరిమితమైనదే. భారతదేశంలోని ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్ విస్తృతమైనది కాదు. ఎందుకంటే ప్రభుత్వ ఆధీనంలో వుండే సంస్థలు, వ్యవస్థలు తప్ప వీటి కొనుగోలుదార్లు అల్పంగా వుంటారు.

(v) ఇంతవరకు మనం ఋణ సమీకరణ, చెల్లింపుల గురించి దేశీయ ఆర్థిక వ్యవస్థకే పరిమితం చేసాం. కాని ఇది నిజం కాదు. ప్రభుత్వాలు ఇతర దేశాల నుండి కూడా ఋణాలను సేకరించవచ్చు. ఇటువంటి ఋణాలను 'విదేశీ ఋణాలని అంటారు. స్వదేశీ ఋణ సమస్యలతో పోల్చి చూస్తే విదేశీ ఋణ సమస్యలు వేరుగా వుంటాయి. విదేశీ ఋణ స్వభావాన్ని సంక్షిప్తంగా పరిశీలిద్దాం. విదేశీ పొదుపు ద్వారా వచ్చిన విదేశీ ఋణాన్ని వస్తువుల దిగుమతిపై వెచ్చిస్తారు. ఋణ చెల్లింపుకు మరియు వడ్డీ చెల్లింపుకు దానికి తగిన మొత్తంలో ఋణదాత దేశానికి వస్తుసేవలను ఎగుమతి చేయవలెను. ఈ ఉద్దేశంలో విదేశీ ఋణం నిజవనరుల (వస్తుసేవలు) బదిలీతో కూడి వుంటుంది. కావున విదేశీ ఋణం కూడా వ్యక్తిగత ఋణం వలె దేశానికి భారమౌతుంది. విదేశీ ఋణానికి చెందిన సమస్యలను అంతర్జాతీయ వర్తకంలో చర్చిస్తారు.

## 20.3 ప్రభుత్వ ఋణ వర్గీకరణ

రెండు ప్రత్యమ్నాల ఆధారం మూలంగా ప్రభుత్వ ఋణాన్ని వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు (పట్టిక 1) అవి:

ఎ) పొదుపు ఆధారాల మూలంగా.

బి) ఋణ సాధనాల (netruments) మూలంగా.

ఈ రెండు రకాలు వాటికవే వేరుకావు, అవి అంతర్గత సంబంధం కలవి.

నిధీకృతమైన, నిధీకృతంకాని, తేలియాడుచున్న ఋణాలు అను వర్గీకరణను భారతీయ బడ్జెటులో ఉపయోగిస్తారు. వీటని చారిత్రకంగా ఉపయోగించడం జరిగింది తప్ప వీటికి శాస్త్రీయ నిర్వచనాలేమీ లేవు. నిధీకృత లేదా శాశ్వత ఋణం క్రింద ఋణవిమోచన నిధి (Sinking Fund) రూపంలో ప్రభుత్వం క్రమమైన రీతిలో చెల్లింపులు చేయడానికి ఏర్పాటు చేసింది.

ఉదాహరణకు, భారతప్రభుత్వం తన కరెంట్ రాబడుల నుండి ప్రతి సంవత్సరం 5 కోట్ల రూ.లను ఋణ విమోచన (sinking fund) నిధికొరకు ప్రత్యేకిస్తుంది. ఈ మొత్తం ఋణ చెల్లింపుకు సరిపోదు. ఋణ విమోచన నిధిని కల్పించని బాధ్యతల కొరకు నిధీకృతం కాని ఋణాన్ని ఉపయోగిస్తారు. తేలియాడుచున్న ఋణం సాధారణంగా తాత్కాలికమైన పరపతిని తెలియజేస్తుంది. నిధీకృత లేదా శాశ్వత ఋణంలో ముఖ్యంగ దీర్ఘకాలిక వ్యవధి (10 సంలు) లేదా అంతకు ఎక్కువ కలిగిన సెక్యూరిటీలు, ఋణ పత్రాలు (Bonds) ఇమిడి వుంటాయి. నిధీకృతంకాని ఋణంలో మధ్యకాలిక (5 నుండి 10 సంలు) దీర్ఘకాలిక బాధ్యతలు వుండును. ఇక తేలియాడుచున్న ఋణాలు స్వల్పకాలికమైనవి. ఈ కాలవ్యవధి దృష్ట్యాప్రభుత్వ ఋణాలను ఎ) స్వల్పకాలిక, బి) మధ్యకాలిక, సి) దీర్ఘకాలిక ఋణాలుగా వర్గీకరించవచ్చు.



B R A O U

## స్వదేశీ ఋణ వ్యవస్థ

| | | | |
|---|---|---|---|
| (I) | విక్రయం కాగల ఋణం | 65,083 | 59.06 |
| | 1. ప్రభుత్వ సెక్యూరిటీలు/మార్కెటు ఋణాలు (విధీకృత ఋణం) | 37,352 | 33.89 |
| | 2. తేలియాడుచున్న ఋణం | 27,731 | 25.17 |
| | ఎ) ట్రెజరీ బిల్లులు | 19,452 | 17.65 |
| | బి) ఇతర తేలియాడుచున్న ఋణాలు | 8,279 | 7.52 |
| (II) | విక్రయంకాలేని ఋణం | 45,107 | 40.94 |
| | 1. విధీకృతం కాని ఋణం | 35,090 | 31.83 |
| | ఎ) చిన్న పొదుపులు | 17,157 | 15.56 |
| | బి) ప్రావిడెంట్ ఫండ్ | 17,933 | 16.27 |
| | 2. ఇతర ఋణాలు (iii) | 10,017 | 9.11 |

(i) రాష్ట్రాలకు కేంద్ర ఋణాలు గాకుండా, (ii) అంతర్జాతీయ ద్రవ్యనిధి ఋణాలతో కూడి, (iii) బ్యాంకులనుండి మరియు ఇతర సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొన్న ఋణాలు కూడా ఇమిడి వుంటాయి.

Source: RBI, Currency and FinanceReport, 1983-84, Vol.II.

## 20.5 భారతదేశంలో ప్రభుత్వ ఋణ పెరుగుదల

భారతదేశ ప్రభుత్వ ఋణం మొదటి పంచవర్ష ప్రణాళిక ఆరంభంనుండి ఇతోధికంగా పెరుగుతూ ఉంది. 1951 చివరిలో ప్రభుత్వ ఋణం రూ.2,615 కోట్లు వుండగా, అది 1983 వరకు రూ.93,735 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా 11975 తర్వాత ప్రభుత్వ ఋణ పెరుగుదల అత్యధికంగా వుంది. 1976 నుండి 1983 వరకు అనగా 7 సంవత్సరాల స్వల్పకాలంలో ప్రభుత్వ ఋణం దాదాపు 60 కోట్లు రూ.లు పెరిగింది. అది ప్రస్తుత ఋణ పరిమాణంలో 64 శాతం. ప్రభుత్వం లోటు ద్రవ్య విధానంపై అధికంగా ఆధారపడడమే అందుకు ముఖ్య కారణం.

BRAOU

**పట్టిక – 3 : భారత ప్రభుత్వ ఋణ పెరుగుదల, 1951–87**

(కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కలిపి) (రూ. కోట్లలో)

| మార్చినెల అంతం వరకు | స్వదేశీ ఋణం | విదేశీ ఋణం | మొత్తం ఋణం |
|---|---|---|---|
| 1951 | 2,563 | 52 | 2,615 |
| 1961 | 6,226 | 781 | 7,007 |
| 1971 | 15,763 | 6,577 | 22,340 |
| 1976 | 26,561 | 7,489 | 34,050 |
| 1981 | 54,094 | 11,298 | 65,392 |
| 1983 | 80,053 | 13,682 | 93,735 |
| 1984 | 90,912 | 15,120 | 1,06,032 |
| 1985 | 1,10,190 | 16,637 | 1,26,827 |
| 1986 RE | 1,34,833 | 18,342 | 1,53,175 |
| 1987 BE | 1,59,133 | 20,949 | 1,80,082 |

ఆధారాలు : Budget Documents and RBI's Currency and Finance Reports ( Annual )

## 20.6 ప్రభుత్వ ఋణం

ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలె భారతదేశంలో కూడా ఆర్థికాభివృద్ధిని పెంపొందించుటలో ప్రభుత్వ పెట్టుబడిని కూర్చుట కవసరమైన వనరులను సమీకరించడానికి ప్రభుత్వ ఋణం ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, నాల్గవ, ఐదవ, ఆరవ ప్రణాళికలలో ప్రభుత్వ రంగ నిధులు 45శాతం వరకు స్వదేశీ ఋణం నుండి, ఇంకా 10 నుండి 11 శాతం వరకు విదేశీ ఋణం నుండి సమకూర్చబడినాయి. అయినప్పటికీ, ప్రభుత్వ ఋణపు పెరుగుదల సర్వ సామాన్యంగా గోచరమైనది. అభివృద్ధి చెందిన దేశాలలో కూడ ప్రభుత్వ ఋణం ఇతోధికంగా పెరిగింది. ఉదాహరణకు, అమెరికాలో 1952లో ప్రభుత్వ ఋణం $ 267 బిలియన్లు ఉండగా 1984 చివరికి అది $ 1309 బిలియన్లకు పెరిగింది, అనగా 5 రెట్ల పెరుగుదల ఏర్పడింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన కల్పనకై ప్రైవేటు పొదుపును సేకరించే సాధనంగా ప్రభుత్వ ఋణాలు ఉపయోగపడగా, అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వ ఋణాల పాత్ర ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంగా వుంటుంది. పశ్చిమ దేశాల్లో ఆధునిక ప్రభుత్వ ఋణం యుద్ధ వ్యయం - మొదటి రెండు ప్రపంచయుద్ధాలు - ఫలితంగా ఉద్భవించింది. రెండు యుద్ధాల మధ్య కాలంలో (1919-1940), ముఖ్యంగా 1929-33 ఆర్థిక మాంద్య పరిస్థితి మరియు దానికి జే.ఎమ్.కీన్స్ వివరణ తర్వాత ప్రైవేట్ ఆర్థిక వ్యవస్థలో తగ్గిన సార్థక డిమాండ్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వ ఋణ విధానాన్ని ప్రభుత్వాలు పాటించాయి. ఆధునిక పశ్చిమదేశాల్లో అధిక ప్రభుత్వ ఋణ స్థాయి ఒక శాశ్వత లక్షణంగా ఏర్పడింది. ఆర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతయైన జేమ్స్ టోబిన్ 1985లో భారతదేశాన్ని సందర్శించినప్పుడు "అమెరికా ఫెడరల్ బడ్జెట్ యొక్క ప్రస్తుత అంశాలు తెలిపేవేమంటే ఫెడరల్ ఋణం ఆర్థిక వ్యవస్థ కన్న వేగంగా పెరుగుతూనే వుంటుందని అభిప్రాయపడినాడు. ఆరంభంలోనే తెలిపినట్లు, ప్రభుత్వ విత్త సాధనాలు (సెక్యూరిటీలు, ఋణ పత్రాలు మొదలగునవి) ఆధునిక ఆర్థిక వ్యవస్థలలో విత్తవ్యవస్థను నెలకొల్పడానికి కీలకాంశాలుగా దోహదపడును.

ప్రభుత్వ ఋణంపై సాంప్రదాయిక ఆర్థిక వేత్తల అభిప్రాయాలతో ప్రస్తుత ఆర్థికవేత్తల ఆలోచనా సరళిని పోల్చినట్లయితే పరిణామాత్మక మార్పు సంభవించినట్లుగా గోచరిస్తుంది. ప్రభుత్వ విత్తానికి వ్యతిరేకంగా సాంప్రదాయక వాదులు వాదిస్తూ సంపూర్ణోద్యోగిత వుంటుందని, ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమైందని, మరియు రక్షణ, న్యాయం, ఇతర కొన్ని ఉద్దేశాలకు తప్ప వ్యయం చేయడం అనుచితమని భావించారు. అందుకే, వారు ప్రభుత్వం ఋణాల సేకరించడాన్ని వ్యతిరేకించారు. వారి ఉద్దేశంతో ఆర్థిక వ్యవస్థ యొక్క మూలధనాన్ని, ద్రవ్యాన్ని ప్రభుత్వ ఋణాలు పన్నులుకబలించి వేస్తాయి. అంతేగాకుండా వారి భావనలో ప్రైవేట్ నిర్వహణలో వలె గాకుండా ప్రభుత్వ ఉపయోగంతో వనరుల ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. యుద్ధకాల ఋణ చెల్లింపుల విషయంలో మాత్రమే ఆర్థిక ఇబ్బందులు కలుగజేయకుండా వుండాలని సాంప్రదాయిక శాస్త్రవేత్తల ప్రభుత్వ ఋణ నిర్వహణ గురించి చర్చించారు.

ఆర్థిక విధాన లక్ష్యాలు అత్యల్ప జోక్యం, లోటు లేకుండా వుండడం నుండి ఆర్థిక స్థిరత్వాన్ని నెలకొల్పడానికి మారడం వల్ల అర్థ శాస్త్రవేత్తలు ప్రభుత్వ విత్త ప్రాధాన్యతను వాస్తవిక దృష్టితో పరిశీలించారు. ఈ క్రొత్త దృక్పథాన్ని 'ప్రమేయ విత్తం' (Functional Finance) అనే. పదం ద్వారా ఏ.పి.లర్నర్, అర్థర్ స్మిత్, ఏ.హెచ్. హెన్సన్, మొదలగు వారు అభివృద్ధి చేసారు. ఈ దృక్పథంలో ప్రభుత్వం తన వ్యయ రాబడి పథకాలను, అప్పులను లోటును కోరదగిన ప్రభావాలను కలిగించడానికి అదే విధంగా జాతీయాదాయం, ఉత్పత్తి ఉద్యోగితలపై కోరదగిన ప్రభావాలు పడనీయకుండా ఉపయోగించుకొంటుంది. ఈ ఉద్దేశంలో అవసరమైనంత మేరకు ప్రభుత్వ ఋణం పెరగవచ్చు. దేశం దివాలా తీస్తుందని, దేశ వ్యవస్థపై భారం పడుతుందనేవి భ్రమలు మాత్రమే. సంపూర్ణ ఉద్యోగితను నిలుపుకొనేంతవరకు, జాతీయాదాయం ఉద్యోగిత పెరుగుతున్నంత వరకు ప్రభుత్వ ఋణాన్ని పెరగనీయవచ్చు.

BRAOU

ప్రభుత్వ ఋణంపై గల ఈ దృక్పథం మూడు ముఖ్యమైన ప్రమేయాలపై ఆధారపడివుంది.

i) ప్రభుత్వ ఋణ సృష్టి వలన ప్రాథమిక నిజభారం ముందు తరాలపై వుండదు.

ii) వ్యక్తిగత, ప్రభుత్వ ఋణాల మధ్య సాదృశ్యం అన్ని సందర్భాలలోను భ్రాంతి జనకమైనవి.

iii) స్వదేశీ, విదేశీ ఋణాల మధ్య ప్రధానమైన భేదముంది.

## 20.7 ప్రభుత్వ ఋణ భారం

ప్రైవేటు ఆర్థిక రంగంనుండి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు వాస్తవిక వనరుల తరలింపు దృష్ట్యా 'ప్రభుత్వ ఋణ భారం'ను నిర్వచిస్తారు. ప్రభుత్వ ఋణ సేకరణ సమయంలో సాంఘిక వనరులను ప్రభుత్వం వినియోగించడం వల్ల ఈ సాంఘిక భారమేర్పడుతుంది. అంతేగాని భవిష్యత్తులో కాదు. ఇంతకు ముందుగానే ప్రవచించినట్లు విదేశీ ఋణ సేకరణ వల్ల ప్రస్తుతం లభ్యమయ్యే వస్తువుల ప్రవాహాన్ని విస్తరించి దానికి బదులుగా భవిష్యత్ ఉత్పత్తినుండి చెల్లించాలి. కాని విదేశీ ఋణంగాని, విదేశీ వర్తకం గాని లేక ఆర్థిక వ్యవస్థలో (Closed Economy) ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న వస్తు సేవల కన్న ఎక్కువ వినియోగించలేము. కాబట్టి భవిష్యత్ ఉత్పత్తి నుండి ప్రస్తుత ప్రవాహాన్నీ పెంచలేము. కావున స్వదేశీ ఋణ సేకరణ ద్వారా ప్రభుత్వం పొందిన వస్తు సేవలను ప్రస్తుత సంతతి వారే చెల్లించాలి. ఋణ పత్రాలున్న వారు, పన్ను చెల్లింపుదార్లు అంతా ముందు తరాల వారే. కావున నికర భారమేమివుండదు. ఈ చెల్లింపులనేవి రాబోయే సమాజంలోని వ్యక్తుల మధ్య ఆదాయ బదిలీలు మాత్రమే. ఒక వేళ ప్రైవేటు వ్యవస్థలో వలె ప్రభుత్వ వ్యవస్థలో కూడా వనరుల ఉపయోగిత సమర్థవంతంగా వుంటే స్వదేశీ ఋణం వల్ల ఎటువంటి భారం వుండదు. స్వదేశీ ఋణం వల్ల మనం మనకే బాధ్యులమై వుంటాము.

ప్రభుత్వ ఋణం వల్ల భారముండదనే పై వాదన విమర్శింపబడింది విమర్శకులలో జె.ఎమ్.బుచానన్ ఒకరు. 'పబ్లిక్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ పబ్లిక్ డెట్' (1958) అనే గ్రంథంలో బుచానన్ ప్రమేయ విత్త సిద్ధాంతం లోని మూడు అంశాలు తప్పని నిరూపించాడు. ఋణ చెల్లింపులకు, ఋణ సేవలకు రాబోయే సమాజంలోని జనం తమ వినియోగాన్ని తగ్గించుకోవడాన్నే 'భారమ'ని అనవచ్చని బుచానన్ వక్కాణించాడు. ఋణ సృష్టి జరిగిన తర్వాత వచ్చే కాలపు ప్రజలను 'ముందు తరాలవారు' అని చెప్పవచ్చు. ఋణ వ్యవహారం స్వచ్ఛందమైంది కాబట్టి ప్రస్తుత సంతతి వారు లేదా ఋణ పత్రాలను కొనుగోలు చేసినవారు ఎటువంటి త్యాగం చేయనవసరంలేదు. పన్నులు పెరగవు కాబట్టి ఎవరూ ప్రభావితం కారు. ఋణభారపు చర్చపై ఇతర అర్థశాస్త్ర వేత్తలలో బోవెన్-డెవిస్-కాఫ్ (Bowen-Davis-Kopt), ఆర్. మస్‌గ్రేవ్, ముదిగిలి యాని మొదలగు వారు ముఖ్యులు. జీవితకాలపు వినియోగాన్ని ఆధారంగా బోవెన్-డేవిస్ కాఫ్ అనే అర్థ శాస్త్రవేత్తలు ఋణాన్ని తిరిగి చెల్లించడానికి ఋణ భారం ముందు తరాలపై పడుతుందని భావించారు. (వీరి ప్రకారం ప్రతి సంతతి లేదా తరం యొక్క జీవితకాలం 44 సం॥లు). ఇతర అర్థ శాస్త్రవేత్తల ప్రకారం ఋణ భారమనేది పెట్టుబడి మార్గం ద్వారా ముందు తరాలపై వుంటుంది. ఎందుకంటే ప్రభుత్వ ఋణ సృష్టి ప్రైవేటు పెట్టుబడిని కుదించి దాని ద్వారా ముందు తరాలవారి నిజ ఆదాయపు ప్రవాహాన్ని తగ్గిస్తూ, వారి ప్రైవేటు వినియోగాన్ని కుదింపజేస్తుంది. ప్రభుత్వ ఋణ భారంపై చర్చలు అధికంగా సాగినప్పటికి వివిధ అర్థశాస్త్రవేత్తల మధ్య ఒక ఒప్పందం కుదురలేదు. అందుకే ప్రభుత్వ ఋణ స్వభావాన్ని గురించి, ఋణ భారాన్ని చివరికి ఎవరు భరించాలనే దాన్ని గురించి ఇప్పటికి స్పష్టమైన అభిప్రాయంలేదు.

ఆధునిక ప్రభుత్వ ఋణ సిద్ధాంతం యొక్క ప్రముఖ అర్థశాస్త్రవేత్తలైన డి.మకార్డ్-రైట్, రాచ్‌ఫోర్డ్, జే.ఇ. మీడే భారపు బదిలీ ఉండదని భావించారు. అంతే కాకుండా స్వదేశీ ఋణం వల్ల అనేక సమస్యలు ఉంటాయని వక్కాణించారు. ప్రభుత్వ ఋణం వల్ల ఆర్థిక వ్యవస్థలో వనరుల కేటాయింపు అభిలషణీయంగా వుండకపోవచ్చు. ఉదాహరణకు, మీడే వాదన ప్రకారం ఎల్లప్పటికి పెరుగుతూవుండే ప్రభుత్వ ఋణం వల్ల పన్నుల స్థాయి అధికంగా

BRAOU

పెరుగుతుంది. జాతీయాదాయం మరియు బదిలీల మొత్తంలో ఇటువంటి పన్నుల విస్తృతి జాతీయాదాయంలో ప్రభుత్వ వ్యయ విస్తృతిని అధిగమించి పన్ను నష్టాలు ఏర్పడును. సమతులన బడ్జెట్ ద్వారా గాని, మితమైన లోటు బడ్జెట్ ద్వారా గాని ప్రభుత్వ ఋణాన్ని నిభాయించదగిన స్థాయిలో వుంచి పై పన్ను నష్టాలను తొలగించుకోవచ్చు.

అధిక ప్రభుత్వ ఋణాన్ని సృష్టించడంవల్ల ఏర్పడే ఆర్థిక సమస్యలు ఈ క్రింది విధంగా వుంటాయి.

i) ఋణ సేవను, ఋణ విమోచన నిధి నిర్వహణను చేపట్టడానికి పన్నులను పెంచుతూపోతే ప్రభుత్వం తిరోగామి పన్ను విధానాన్ని పాటించవలసివుంటుంది. తిరోగామి పన్ను విధానంలో అధిక ఆదాయ వర్గాలపై కన్న తక్కువ ఆదాయ వర్గాలపై పన్ను భారం అధికంగా వుంటుంది. ఒక వేళ అంతవరకే ఆర్థిక వ్యవస్థలో తిరోగామి పన్ను విధానం అమలులో వుంటే దాని ఫలితాలు ఇంకా తీవ్రంగా వుంటాయి.

ii) సంపూర్ణోద్యోగితా స్థాయిని కలిగిన ఆర్థిక వ్యవస్థలో క్రొత్తగా సృష్టించిన నిలువలనుండి బ్యాంకులు ఋణాలిస్తే ధరల ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ఇంతకుముందే తెలుసుకొన్నట్లుగా కేంద్రబ్యాంకు అప్పులు ప్రత్యక్షంగా ద్రవ్యోల్బణకరమైనవి. కాబట్టి అప్పులు పెరిగితే ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువ పెరుగుతుంది.

iii) ఋణ సృష్టి ద్వారా చేసే ప్రభుత్వ వ్యయం ప్రైవేటు రంగానికన్న తక్కువ ఉత్పాదకమైనది. దానివలన ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక సామర్థ్యం దుర్వినియోగం జరిగి కొన్ని వర్గాలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని కలిగించజేయవచ్చు.

## 20.8 ప్రభుత్వ ఋణ చెల్లింపు

భారతదేశంతో సహా దాదాపు అన్ని దేశాలలో యుద్ధానంతర సంవత్సరాలలో ఆర్థికవ్యవస్థలు అధిక ఋణాన్ని కలిగివున్నప్పటికి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ప్రభుత్వ ఋణంవల్ల ప్రతికూల ఆర్థిక ప్రభావాలేర్పడ్డాయనేది నిరూపించబడలేదు. కాని నిజానికి ఆధునిక ఆర్థిక వ్యవస్థలు అధిక మొత్తపు ప్రభుత్వ ఋణాలతో కొనసాగుతూ వున్నాయి. అంతేగాకుండా, ఆధునిక సంశ్లిష్టమైన ఆర్థిక వ్యవస్థల నిర్వహణ ప్రభుత్వ ఋణ సాధనాలు అధికంగా లభ్యం కాకుంటే కష్ట సాధ్యమే. ఉదాహరణకు, వివిధ ప్రభుత్వ సెక్యూరిటీల రూపంలో పెట్టుబడి సౌకర్యాలు లభ్యం కానట్లయితే ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థముందుకు సాగడం సాధ్యం కాకపోవచ్చు. ఈ సెక్యూరిటీలే బ్యాంకులకు రెండవ నిల్వలుగా ఉపయోగపడుతున్నాయి. బ్యాంకులు తమ నిల్వలన్నింటిని కరెన్సీ నోట్లలోనేనిలువలేవు. ద్రవ్య విధానము, నిర్వహణ ఫలప్రదం కావాలంటే ప్రభుత్వ ఋణ యజమాన్యం, కాలవ్యవధి పద్ధతి కీలకమైనవి. ఒకవేళ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఋణాన్ని తగ్గించాలని భావించినచో ఆర్థిక వ్యవస్థలో ఎ) అనవసరమైన ప్రభుత్వ వ్యయంలో కోత, బి) పన్ను వ్యవస్థపై ఆశించని ప్రభావంలాంటి తీవ్రమైన ఫలితాలు ఏర్పడవచ్చు.

ఋణ చెల్లింపులో (లేదా ఋణ భారంలో) ప్రాధాన్యత నివ్వవలసిన అంశం ఋణానికి జాతీయాదాయానికి గల సంబంధం. జాతీయాదాయం అధికంగా ఉంటే ఋణభారం తగ్గిపోతుంది. డోమర్ ఉద్దేశంలో ఋణపెరుగుదల ఏ విధంగా వున్నప్పటికీ, దానికి జాతీయాదాయం, బ్యాంకింగ్ వ్యవస్థ వనరులు, ప్రైవేట్ సెక్యూరిటీల పరిమాణం మొదలగు వాటితో గల సంబంధం ముఖ్యమైనది.

ప్రభుత్వ ఋణాన్ని తిరిగి చెల్లించడాన్ని 'విమోచన' అని అంటారు. ఋణ విమోచన అనేక కారణాల దృష్ట్యా చాల ప్రధానమైనది. అది ప్రభుత్వ ప్రతిష్టను, ద్రవ్య విపణిలో ప్రభుత్వ పరపతిని పెంచుతుంది. అంతేగాక ఇది



BRAOU

4. కాపిటల్ లేవీ దోషాలేవి?
5. సింకింగ్ ఫండును గూర్చి వివరించుము.
6. ఋణ మార్పిడి అనగా నేమి?

## 20.9 సారాంశము

ప్రభుత్వ ఋణము పన్నువిధింపు కంటె భిన్నమైనది. ఎందువల్లనేంటే పన్ను రాబడి మాదిరి గాకుండా ప్రభుత్వం ఋణం ద్వారా సేకరించిన నిధులను తిరిగి ఋణదాతలకు చెల్లించవలసిన బాధ్యత కలిగి ఉంది. ప్రభుత్వం లోటు విత్తం ద్వారా కూడా ఋణం చేయవచ్చు. ఇది ఐచ్ఛికమైన ఋణం కాదు. దీనినే నిర్బంధ పొదుపు అంటారు. ప్రభుత్వ ఋణాన్ని మార్కెట్ చేయతగ్గది, మార్కెట్ చేయతగనిది అని రెండు రకాలుగా వర్గీకరించగలిగినప్పటికి, ప్రభుత్వ అజమాయిషీలో గల సంస్థలు తప్ప అట్టి సెక్యూరిటీలను కొనే వ్యక్తులు చాలా కొద్ది మంది మాత్రమేఉంటారు. అలాగే వాస్తవిక వనరుల బదిలీ బహిర్గత ఋణంలోనే తప్ప అంతర్గత ఋణంలో ఉండదు.

భారత ప్రభుత్వ ఋణం జాతీయాదాయంలో 73శాతం ఉంది. మొత్తం ఋణంలో బహిర్గత ఋణం 13 శాతం. దేశీయ ఋణంలో సుమారు 64 శాతం మార్కెటు చేయగల తరగతికి చెందినదే.

సాంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఋణాన్ని వ్యతిరేకించారు. సంపూర్ణోద్యోగితను, ప్రభుత్వ వ్యయ అనుత్పాదకతను, దేశరక్షణ, శాంతి భద్రతలు, న్యాయం మొదలగునవి కాకుండా ఇతర అంశాలపై చేసే ఖర్చు అవాంఛనీయమైందని వారు పరికల్పించుకొన్నారు. ఆర్థికవ్యవస్థ అవసరాల కనుగుణంగా తెచ్చే ప్రభుత్వ ఋణం పెరుగుదల వలన ప్రమాదం లేదని విధులననుసరించిన విత్త విధానం భావిస్తుంది.భారతదేశపు అభివృద్ధి ప్రణాళికలు అధిక భాగం లోటు విత్తం ద్వారా సమకూర్చుకున్న ప్రభుత్వ ఋణంపై ఆధారపడి ఉన్నాయి. ఇది ధరల పెరుగుదలకు దారితీసింది.

– ఆచార్య ఎస్. సారుప్రియ

## 20.10 సంప్రదింపు గ్రంథాలు

| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | Hugh Dalton | : | Public Finance |
| 4. | తెలుగు అకాడమి | : | పబ్లిక్ ఫైనాన్స్ |

BRAOU

## 20.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింద ఇచ్చిన ప్రతి ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. ప్రభుత్వ ఋణమును నిర్వచించి దాని స్వభావమును వివరించుము.
2. ప్రభుత్వ ఋణభారం ముందు తరాల వారిపై వుంటుందనేది సరియైనదా? కారణాలను విశదపరచుము.

II. ఈ క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. భారతదేశంలో 1951 నుండి ప్రభుత్వం యొక్క ఋణ పెరుగుదలను వివరింపుము.
2. వివిధ రకాల ప్రభుత్వ ఋణాల ఆర్థిక ప్రాముఖ్యతను విశ్లేషించుము.
3. స్వదేశీ ఋణము మరియు విదేశీ ఋణముల మధ్య వ్యత్యాసమును వివరించుము.
4. ప్రభుత్వ ఋణం తిరిగి చెల్లింపు విషయంలో అవలంబించు వివిధ పద్ధతులను గూర్చి విశదీకరించుము.

●●●

# భాగం – 21 : ప్రభుత్వ ఋణం – పన్ను విధింపు – లోటు ద్రవ్య విధానం

విషయక్రమం


21.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
21.1 పరిచయం
21.2 ప్రభుత్వ ఋణం – పన్ను విధింపు
21.3 ప్రభుత్వ ఋణం – లోటు ద్రవ్య విధానం
21.4 ముగింపు
21.5 సంప్రదింపు గ్రంథాలు
21.6 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 21.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ప్రభుత్వ విత్త వనరులైన ప్రభుత్వ ఋణం, పన్ను విధింపు, లోటు ద్రవ్యాలనుఈ భాగం వివరిస్తుంది. ఈ మూడు వనరులలోని భేదాలను వివరిస్తూ ఈ విధానాల ఆర్థిక పర్యవసానాలను వివరించడం ఈ భాగం ఉద్దేశం.

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ప్రభుత్వ ఋణం పన్ను విధింపుల మధ్య తేడాలు తెలుసుకుంటారు.
- ప్రభుత్వ ఋణం లోటు ద్రవ్య విధానాల మధ్య తేడాలు తెలుసుకుంటారు.
- ప్రభుత్వఋణం,పన్ను విధింపు, లోటు ద్రవ్య విధానాలు ఆర్థిక పర్యవసానాలు విశ్లేషించగలుగుతారు.

## 21.1 పరిచయం

ప్రభుత్వ విత్త వనరుల్లో పన్నులు, ప్రభుత్వరుణం, లోటు ద్రవ్యం ముఖ్యమైనవి. భారతదేశంలో 1980-81 సంllలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయం రూ.36,845 కోట్లు, ఇందు 54 శాతం పన్నుల ద్వారాను, 35శాతం ప్రభుత్వ రుణం ద్వారాను 11 శాతం లోటుద్రవ్యం ద్వారాను లభించింది. ఇప్పుడు ఒక ముఖ్య ప్రశ్న ఎదురౌతుంది. ప్రభుత్వం వనరుల సేకరణకు వివిధ పద్ధతులనెందుకు అవలంబించాలి? ప్రతి పౌరుని పైన సమానంగా పన్ను విధించి అవసరమైన విత్త వనరులనెందుకు పొందకూడదు? అయితే ఈ పద్ధతి తక్కువ పౌరులుండి ఆదాయ సంపదల మధ్య అసమానతలు తక్కువగా వున్న సాధారణ ఆర్థికవ్యవస్థ లోనే సాధ్యమౌతుంది. అంతేగాక ప్రభుత్వవ్యయ లక్ష్యం పరిమితమైన ప్రభుత్వ వస్తుసేవలను అందజేయడమే కావాలి. కాని ఆధునిక ఆర్థిక వ్యవస్థలో వస్తు సేవలను అందజేయడం ముఖ్యమైన లక్ష్యమేగాని ప్రభుత్వ విత్తానికి ఇతర లక్ష్యాలు కూడ వున్నాయి. ఆదాయ, సంపదల్లో అసమానతలు తగ్గించడం, సంపూర్ణ ఉద్యోగిత, ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక పురోభివృద్ధికూడ ప్రభుత్వ వ్యయానికి ముఖ్యమైన లక్ష్యాలు. అయితే ఒక పద్ధతి ఒక లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగపడవచ్చు. అదే పద్ధతి మరొక లక్ష్యాన్ని సాధించలేకపోవచ్చు. అంతేకాక రెండు లేక అంతకు ఎక్కువ లక్ష్యాల మధ్య ఘర్షణ ఏర్పడవచ్చు. అలాగే వివిధ సమస్యల మధ్య బేధాలున్నాయి. కొన్ని అభివృద్ధి చెంది వుంటే, మరికొన్ని అభివృద్ధి చెందుతూవున్నాయి. కొన్ని సామ్యవాద వ్యవస్థను పాటిస్తే మరికొన్ని పెట్టుబడిదారీ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అందువల్ల వివిధ ప్రభుత్వ విత్త పద్ధతుల ఆర్థిక ఆరంభం నిర్ణయించడం కష్టం.

## 21.2 ప్రభుత్వ ఋణం, పన్నుల విధానం

ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ప్రతి పౌరుడు వివిధ ప్రభుత్వ వస్తు సేవలను – భద్రత న్యాయ సంరక్షణ, రోడ్లు, రవాణా, విద్యా వైద్య సౌకర్యాలు మొదలగునవి వినియోగించుతున్నాడు. ఈ సేవలను పొందినందుకుగాను పౌరుడు ప్రత్యక్షంగా ఏమి చెల్లించడు. కాని, ప్రభుత్వ సేవలను కల్పించడానికి, ప్రభుత్వ వ్యయానికి విత్తాన్ని కల్పించడానికి ప్రభుత్వం పన్నులవంటి నిర్బంధపు లేవీల ద్వారా వ్యక్తిగత ఆదాయాలను నియంత్రణ చేస్తుంది. కాబట్టి వ్యక్తులు తాము పొందే ప్రభుత్వ వస్తు సేవలకు పన్నుల ద్వారా 'ధరలను' చెల్లిస్తారు. పన్నులకు సంప్రదాయ నిర్వచనమైన నిర్బంధపు లేవీలు, లేదా నిర్బంధపు చెల్లింపులు అనేది వినిమయ ప్రక్రియను సూచించదు. ఈ వినిమయం యొక్క భావమేమంటే పన్ను చెల్లింపు ద్వారా వ్యక్తిగత ఆదాయం తగ్గింపబడితేఅదే సమయంలో పబ్లిక్ వస్తు సేవల లభ్యత పెరుగుతుంది. తద్వారా సంఘ సంక్షేమంలో నికరంగా ఎటువంటి నష్టముండదు.

**ప్రభుత్వ ఋణానికి, పన్నులకూ మధ్యగల భేదాలు :**

ప్రభుత్వ వ్యయాన్ని భరించడానికిగాను రాబడులను పొందడానికి ప్రభుత్వ ఋణం ప్రత్యమ్నాయ మార్గంగా ఉపయోగింపబడును. ప్రభుత్వ ఋణం ద్వారా విత్తాన్ని సమకూర్చినప్పుడు వ్యక్తిగత ఆస్తులుగాని, సంపదలు గాని తగ్గకుండానే ప్రభుత్వం ప్రజాసేవలను కల్పించవచ్చు. (ఐనప్పటికి స్థూలంగా, ప్రభుత్వం నిజవనరుల నుపయోగించి పబ్లిక్ వస్తువులను కల్పించినప్పుడు ఇది నిజం కాకపోవచ్చు. ఈ విషయాన్ని ప్రస్తుతం చర్చించడంలేదు.). ప్రభుత్వ ఋణ విధానం వలన ప్రభుత్వం స్వచ్ఛందంగా రాబడులను పొందవచ్చు. పన్నుల విధానంలో నిర్బంధంగా రాబడులను ప్రభుత్వం పొందుతుంది. భవిష్యత్తు ఆదాయం వస్తుందనే ఆశతో ప్రభుత్వ సెక్యూరిటీలు, ఋణ పత్రాలు కొనుగోలు చేయబడును. అందుకే, ప్రభుత్వ ఋణం, పన్నులు అనేవి పబ్లిక్ వస్తు సేవలను కల్పించడానికి ఉపయోగించే రెండు విభిన్నమైన పద్ధతులు, సంక్షిప్తంగా చెప్పాలంటే ప్రభుత్వం కల్పించే పబ్లిక్ లేదాసమిష్టి వస్తు సేవలకు వినిమయంగా ప్రజల వ్యక్తిగత ఆస్తులు, సంపద పన్నుల రూపంగా తగ్గింపబడును. కాని ప్రభుత్వ ఋణ విషయంలో ప్రజ[illegible]ష్టి వస్తుసేవలను పొందడానికి తమ నిజవనరులను కోల్పోరు.

BRAOU

పై వివరణ అతి సూక్ష్మీకరణను తెలుపుతుంది. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఈ రెండు ప్రత్యామ్నాయ పద్ధతులు వేరు పరిణామాలను కలిగించవచ్చు. ఈ ఉద్దేశంతోనే ఈ రెండు ప్రభుత్వ విత్త ఆధారాల సాపేక్ష ప్రాధాన్యాన్ని అర్థశాస్త్ర వేత్తలు వింకా గుర్తిస్తూనే వున్నారు. సంప్రదాయ, నవ్య సంప్రదాయ ఆర్థికవేత్తలు పన్నులతో పోల్చితే ఋణ విత్తం నిమ్నమైనదని వాదించారు. వారి వాదనలు, సంక్షిప్తంగా, క్రింది విధంగా వున్నాయి.

i. ప్రస్తుత పన్నులకన్న ఋణ విత్తం తక్కువ హానికరమైనదనే వాదన అనవసరపు ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతుంది.

ii. మిల్ ప్రకారం, ప్రభుత్వ ఋణం శ్రామికులకుద్దేశింపబడిన 'వేతన నిధుల' నుండి ఉత్పాదక ప్రైవేటు వనరులను లేదా మూలధనాన్ని కుదించివేస్తుంది. ఇతరుల ఉద్దేశంలో ప్రైవేటు పెట్టుబడిని తగ్గిస్తుంది.

iii. వారసత్వం వల్ల, ఋణ చెల్లింపుకై విధించే పన్నుల వల్ల ఋణ విత్తం భవిష్యత్ మూలధన సంచయనాన్ని తగ్గించును. సంప్రదాయ అర్థశాస్త్రవేత్తల భావంలో ఋణ భారం ముందు తరాల వారికి మార్చబడుతుంది.

iv. ప్రభుత్వ ఋణం అసమతౌల్య బడ్జెట్లను సూచించును. దీని వల్ల ద్రవ్యోల్బణం ద్వారా ద్రవ్య

పరిభ్రంశం (deterioration) నకు దారి తీస్తుంది.

v. పీగు వంటి నవ్య సంప్రదాయవాదులు పన్ను చెల్లింపుదార్ల నుండి ఆదాయం ఋణపత్రాలున్నవారికి బదిలీ అయినచో ఆదాయ పంపిణీ ఎక్కువ అసమానస్థితికి దారి తీస్తుంది.

ఋణవిత్తంపై పైన తెలిపిన అభిప్రాయాలు తప్పని అంగీకరింపబడింది. ఎర్విన్ మిల్లర్ ఉద్దేశంలో చిన్న ప్రభుత్వం, తక్కువ ప్రభుత్వం ఋణం, సులభ ప్రవర్తనా తీరును కలిగిన ఆర్థిక పంఘపు ప్రపంచం నుండి పెద్ద ప్రభుత్వం, అధిక ప్రభుత్వ ఋణం సంక్లిష్టమైన ప్రవర్తనా తీరును కలిగిన ఆర్థిక ప్రపంచానకు మార్పు జరిగింది. కాని పన్నులు, ఋణ విత్తం ఆర్థికవ్యవస్థను వేర్వేరు విధాలుగా ప్రభావితం చేయునన్నది పగ్గు సత్యంగానే వుంటుంది. మస్‌గ్రేవ్ అభిప్రాయంలో పన్ను విధానం, ఋణవిత్తాల మధ్యగల భేదం ఎల్లప్పటికి ముఖ్యమైనదే. ఎందుకంటే ఇది ప్రైవేటు రంగంనుండి వనరుల బదిలీకి వినియోగం, మూలధన కల్పనల మధ్య భేదాన్ని తెలుపుతుంది. ఋణ విత్త విధానం క్రింద వినియోగం, మూలధన కల్పనల మధ్య బేధాన్ని తెలుపుతుంది. ఋణ విత్త విధానం క్రింద వినియోగం, పొదుపులమధ్య వనరుల మళ్ళింపు పంపిణీ సాధారణంగా పొదుపు, పెట్టుబడి జాబితా యొక్క సాపేక్ష వడ్డీ వ్యాకోచితపై ఆధారపడి వుండును. (వ్యయార్హ ఆదాయం, వడ్డీ రేటులపై పొదుపు ఆధారపడివుందనే ప్రమేయం చేయనైనది). ప్రభుత్వం అప్పులను సేకరించినప్పుడు ఋణ స్వీకృతి నిధి (loanable fund) డిమాండ్ పెరిగి వడ్డీ రేటు పెరగడానికి దోహదం చేస్తుంది. ఒక వేళ పొదుపు, పెట్టుబడి పట్టీలు వడ్డీ వ్యాకోచాలైతే పెట్టుబడి తగ్గి పొదుపు పెరుగును. వినియోగం, ప్రైవేటు మూలధన కల్పన రెంటి నుండి ప్రభుత్వ ఋణానికి వనరులు బదిలీ అవుతాయి. అవ్యాకోచిత పెట్టుబడి పట్టీ వల్ల, వ్యాకోచిత పొదుపు పట్టీ వల్ల ప్రైవేటు వినియోగం తగ్గిపోతుంది. అలాగే వ్యాకోచిత పెట్టుబడి, అవ్యాకోచిత పొదుపువల్ల ప్రైవేటు వినియోగం పెరుగును. కావున ప్రభుత్వ ఋణం ప్రైవేటు మూలధన కల్పనను ప్రభావితం చేయడమే కాకుండా; వడ్డీ రేటు ద్వారా వినియోగాన్ని కూడా ప్రభావితం చేయును. కాని ఈ సందర్భంలోనే పన్ను ద్వారా వచ్చిన విత్తాన్ని పోల్చినచో వినియోగం నుండి వనరుల బదిలీ ఇంకా ఎక్కువగా వుంటుంది. (పొదుపు, పెట్టుబడుల వ్యాకోచత్వాలుపై విధంగానే వున్నట్లు భావించిన). కావున పన్ను, ఋణ విత్తము పాటించిన వేర్వేరు ప్రభావాలు వుంటాయి.

వినియోగాన్ని తగ్గించడంలో ఋణ విత్తానికన్నా,పన్ను విత్తం యొక్క ప్రభావం ఎక్కువని మనకు తెలుసు. అయితే ఆర్థికవృద్ధి పై కూడా పన్ను విత్తం యొక్క ప్రభావం ఋణవిత్తం ప్రభావంకన్నా ఎక్కువగా వుంటుందా అన్నది మనం అధ్యయనం చేయాలి. మొత్తం ప్రభుత్వ వ్యయాన్ని పెట్టుబడిని పన్నుల ద్వారా సమకూర్చడం కోరతగినది కాదు, ఆశించదగినది కాదు. అధిక పన్నులను రాజకీయంగా సాధించలేరు. ఒక స్థాయిని మించిన తర్వాత పన్నుల విధింపువల్ల చెడు ఫలితాలు కలుగును. అల్పంగా వున్న వినియోగస్థాయిలను ఇంకా తగ్గించడం వాస్తవానికి శక్యంకాదు. సాంఘికంగా అంగీకరింపతగినది కాదు. స్టీలు , విద్యుత్ లాంటి పరిశ్రమలలో పెట్టుబడిని ప్రభుత్వ ఋణాల ద్వారా చేయడమే కోరతగినది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పెట్టుబడిని కల్పించడానికి పన్నుల విధానానికి ప్రభుత్వ ఋణం అనుబంధంగా వుండాలి.

అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వ ఋణ పాత్ర వేరుగా ఉండును. కీన్స్ ప్రభావం వల్ల అభివృద్ధి చెందిన దేశాలలో స్థూల ఆర్థిక విధానాలు డిమాండ్ నిర్వహణపై దృష్టిని కేంద్రీకరించును. ఆర్థిక స్థిరత్వాన్ని, సంపూర్ణోద్యోగితను సాధించడానికి ఋణ విత్తం సమిష్టి డిమాండ్‌ను పెంచును. కీన్స్ తదుపరి కీన్సియన్ ఆర్థిక వేత్తల దృష్టిలో ఋణం లేదా ఋణ పత్రాల ప్రకటన ప్రైవేటు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసి వారి వినియోగ ప్రమేయంలో హెచ్చుదలను కల్పించును. కాని, సంపూర్ణోద్యోగిత లేదా సమీప సంపూర్ణోద్యోగిత స్థాయిలో ఋణ విత్తం ద్వారా విలువ గల పబ్లిక్ వస్తువులను ఉత్పత్తి చేయలేము. ఎందుకంటే ద్రవ్యోల్బణ మేర్పడవచ్చును. ద్రవ్యోల్బణ పరిస్థితులలో పన్నుల విధానాన్ని, పరిమిత పరపతి విధానాలను పాటించాలి.

B R A O U

పన్నులు, ఋణ విత్తాలమధ్య ఎంపికను నిర్ణీతమైన (apriori) పరిస్థితులను బట్టిగాకుండా స్థూల ఆర్థిక అవసరాలను ఆధారంగా నిర్ణయించాలి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. ప్రతి పౌరుడు వినియోగించే కొన్ని ప్రభుత్వ వస్తువు (Public goods) లను గూర్చి వ్రాయుము.
2. పన్నులకు, ప్రభుత్వ ఋణానికి గల ముఖ్య భేదాలేమిటి?
3. సాంప్రదాయిక మరియు నవ్య సాంప్రదాయిక ఆర్థికవేత్తలు ఋణవిత్తసేకరణను పనికిమాలిన విధానంగా ఎందుకు వర్ణించారు.
4. పన్ను విత్తాన్ని అసంపూర్ణ వనరుగా ఎందుకు పరిగణించారు.

## 21.3 ప్రభుత్వ ఋణం–లోటు ద్రవ్యం

ఇంతవరకు పన్నులకు ప్రత్యామ్నాయ మార్గంగా ప్రభుత్వ ఋణ చర్యను చర్చించాం. సంపూర్ణోద్యోగిత గల ఆర్థిక వ్యవస్థలో రెండు పద్ధతుల ఉపయోగం అంతగా వుండదు. ఎందుకంటే ప్రత్యక్ష ద్రవ్య సృష్టి పన్నులతో సమానమైన ఫలితాలను కలుగచేస్తుంది. ప్రభుత్వ ఋణం వాస్తవమైనదని ఈ ప్రకటన భావిస్తుంది. వాస్తవ ఋణ సృష్టి ఆర్థిక వ్యవస్థలో కొందరు వ్యక్తులు గాని సమూహాలు గాని తమ ప్రస్తుత కొనుగోలు శక్తిని భవిష్యత్ ఆదాయానికి గాను ప్రభుత్వ ఋణ పత్రాలకు మార్చుకొంటారు. కాని వాస్తవిక కోశ విధానంలో వాస్తవిక ప్రభుత్వ ఋణం యొక్క మూల అర్థం వర్తించదు. జాతీయ ప్రభుత్వ లోటు సృష్టింపబడినప్పుడు, అనగా పన్ను రాబడి రేటును ప్రభుత్వ వ్యయ రేటు మించినప్పుడు, ఋణ విడుదల (debt issue) ద్వారా విత్తం సమకూర్చబడుతుంది. లోటు బడ్జెట్ ద్వారా ప్రభుత్వ ఋణం పెరుగుతుంది. వాస్తవిక ఋణం నకిలీ ఋణం (fake debt) ల మధ్య ప్రచ్ఛన్న ద్రవ్య సృష్టి (disguised money creation) ఋణ ద్రవ్యీకరణల మధ్య స్పష్టమైన భేదాన్ని తెలుపడానికి గట్టి ప్రయత్నం జరుగలేదు.భేదాన్ని తెలుపకపోవడం గజిబిజిని సృష్టిస్తుంది. ఒక సం॥లో ప్రభుత్వం పొటించిన ప్రభుత్వ ఋణ పరిమాణంను చూసినచో అందులో ఎంతెంత భాగాలు వాస్తవిక నకిలీ ఋణాలో లేదా ప్రచ్ఛన్న ద్రవ్యసృష్టి ద్వారా పొందడం జరిగిందో కచ్చితంగా చెప్పలేము. రెండు ఋణ పద్ధతుల మధ్యభేదాన్ని తెలుపడం అత్యవసరం ఎందుకంటె అవి వేర్వేరు ఆర్థిక పరిమాణాలకు దారీ తీయును.

ఋణ ద్రవ్యీకరణను లోటు ద్రవ్య విధానంగా చెప్పవచ్చు. ద్రవ్యీకరణ ప్రక్రియ ప్రత్యక్ష ద్రవ్య సృష్టి (కేంద్ర బాంకు ద్వారా) తో బాటు ఇతర పరపతి సృష్టి రకాలను కూడా కలిగి వుంటుంది. ప్రభుత్వ ఋణం ద్వారా ద్రవ్య పరపతి సృష్టి యంత్రాంగంల గురించి సంక్షిప్తంగా క్రింద చర్చించడం జరిగింది.

కేంద్ర బ్యాంకు ప్రభుత్వ ఋణ పత్రాల సెక్యూరిటీలు ట్రెజరీ బిల్లుల రూపంలో ప్రభుత్వ ఋణాన్ని కొనుగోలు చేసినచో ప్రత్యక్ష ద్రవ్య విస్తరణ పెరుగుతుంది. అనగా క్రొత్త విత్త ఆస్తుల ఆధారంగా కేంద్రబాంకు క్రొత్తగా కరెన్సీని సృష్టించును. భారతీయ రిజర్వుబ్యాంకు వద్ద స్వతంత్ర ద్రవ్య నిధులుండవు కాబట్టి ప్రభుత్వ ఋణాన్ని కొనుగోలు చేయడానికి క్రొత్త కరెన్సీని విడుదల చేయడం ఒక్కటే అది ఆచరించవలసిన పద్ధతి. ప్రభుత్వానికి బాంకరు కాబట్టి రిజర్వు బాంకు ప్రభుత్వం ఇచ్చు సెక్యూరిటీలను, బిల్లులను కొనవలసి వుంటుంది. భారతదేశంలో రిజర్వుబాంకు నుండి ప్రభుత్వం తీసుకునే ఋణ పరిమాణానికి పరిమితి లేదు. స్వదేశీ ప్రభుత్వ ఋణంలో దాదాపు మూడవ వంతు రిజర్వుబాంకు నుండి పొందినదే. భారతప్రభుత్వం రిజర్వు బాంకునుండి పొందినదే. భారతప్రభుత్వం రిజర్వు బాంకునుండి పరపతిని అడ్ హక్ ట్రెజరీ బిల్లుల (విక్రయించదగని స్వల్పకాల సెక్యూరిటీల) రూపంగా పొందుతుంది. వీటికాల వ్యవధి 91 రోజులుంటుంది. కాని ఈ ట్రెజరి బిల్లులు సాధారణంగా

BRAOU

మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రభుత్వ సెక్యూరిటీలుగా తర్వాత మార్పు చెందును. ఈ ప్రక్రియను 'ఋణ నిధుల సమీకరణ' (Fuanding of debt) అని అంటారు. ఇంతేగాకుండా, ప్రజలు కొనుగోలు చేయని ప్రభుత్వం సెక్యూరిటీలను రిజర్వు బాంకు కొంటుంది. అందుకనుగుణంగా, భారతదేశంలో లోటు ద్రవ్య నిర్వచనంలో క్రిందివి ఇమిడి వుంటాయి:

i) ప్రభుత్వంచే ద్రవ్య నిల్వల స్వీకరణ.

ii) కేంద్రబాంకుచే అన్ని రకాల ప్రభుత్వ సెక్యూరిటీల,బిల్లుల కొనుగోలు 1980-81లో ఈ విధమైన లోటు ద్రవ్యం ప్రభుత్వ విత్తంలో 11 శాతముంది. లోటు ద్రవ్యవిధానానికి ఇంతకు ముందు ఇచ్చిన నిర్వచనం విస్తృతమైన లోటు ద్రవ్యాన్ని అర్థం చేసుకోవడానికిఋణ విత్తకల్పనలో వాణిజ్య బాంకుల పాత్రను చర్చిద్దాం.

కేంద్ర బాంకుచే సృష్టింపబడే కరెన్సీ (ఋణంపై ఆధారపడే) తో పోల్చినప్పుడు వాణిజ్యబ్యాంకులు మరియు ఇతర పరపతిసంస్థలతో సంబంధాన్ని కలిగివున్న ఋణ ద్రవ్యీకరణ యంత్రాంగం ఎక్కువ సంశ్లిష్టమైనది. ఊహాజనితమైన ఉదాహరణతో దీనిని వివరిద్దాం. క్రింది ప్రమేయాలను తీసుకొందాం.

i) ప్రభుత్వం రూ.100 కోట్ల వ్యయానికి గాను బాంకులకు తన సెక్యూరిటీలను అమ్ముతుంది.
ii) బాంకులు 'నగదు నిల్వల నిష్పత్తి'గా కనీసం 20%ను తమ వద్ద నిలువుకొనాలి.
iii) ఈ వ్యవహారంలో కాల విరామాలు వుండవు.

ఈ పరిస్థితిలో బాంకుల నగదు నిల్వల రూ.100 కోట్లు తగ్గును. అంతే మొత్తంలో ప్రభుత్వ సెక్యూరిటీలలో బాంకుల పెట్టుబడి పెరుగును. కావున నికరంగా ఏమి మార్పు వుండదు. అదే సమయంలో ప్రభుత్వం పొందిన రూ.100 కోట్లను వ్యయపరుచును. ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ప్రభుత్వం నుండి ఆదాయాన్ని గాని, చెల్లింపులను గాని పొందిన వ్యక్తుల నగదు బాంకు డిపాజిట్ల నిష్పత్తి 10 శాతమని భావిద్దాం. అనగా బాంకులు ప్రభుత్వానికిచ్చిన మూలనిధుల నుండి రూ.90 కోట్లను తిరిగి పొందుతాయి. 20 శాతం నగదు నిల్వల నిష్పత్తి ఆధారంగా బాంకులు అదనంగా రూ.72 కోట్ల నిధులను పొందుతాయి. ఇది ప్రభుత్వానికి గాని, ప్రైవేటు రంగానికి గాని మరల పరపతికి ఆధారమగును. ఒక వేళ ప్రభుత్వం ఋణ సేకరణను కొనసాగిస్తే ఈ ప్రక్రియ చాలాసార్లు జరుగుతుంది. కాని ప్రతిసారి అదనపు నిల్వలు తగ్గుతూ పోవును కాబట్టి ఈ ప్రక్రియ ఒక స్థాయి వరకు మాత్రమే జరుగుతుంది. ఈ పరపతి విస్తరణ ప్రక్రియను 'కీన్సియన్ గుణకం' నుపయోగించి క్రింది విధంగా చెప్పవచ్చు.

$$M = \frac{1}{1 - r(1 - y)}$$

ఇందులో
M = పరపతి గుణకం
r = ప్రజల అదనపు డిపాజిట్ / నగదు నిష్పత్తి
y = నగదు నిల్వల నిష్పత్తి
పై సంఖ్యాగత ఉదాహరణలో, ఈ పరపతి గుణకం 3.57 గావుంది.

ప్రైవేటు రంగంనుండి ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలు జరిగినప్పుడు ఈ ప్రక్రియ మారదు. కాని ఈ పరిస్థితిలో ప్రైవేటు రంగం చే వ్యయం జరుగుతుంది. ఇతర మధ్యంతర (intermediary) విత్త సంస్థలు కల్పించే విత్తంతో ప్రభుత్వానికి బాంకులు కల్పించే విత్తం విభేదిస్తుంది. బాంకులు పరపతి విస్తరణను జరుపవచ్చు. కాని ప్రైవేటు రంగానికి విస్తరణ ప్రభావం వుండదు.

BRAOU

ఇంకొక పద్ధతి ద్వారా కూడా ద్రవీకరణ జరుగవచ్చు. ఋణ కాలవ్యవధి సూచీ తగ్గించబడితే ఆర్థికవ్యవస్థ యొక్క ద్రవ్యత్వత (Liquidity) సూచీ పైకి కదులుతుంది. ఇతర మాటలలో చెప్పాలంటే ప్రభుత్వ సెక్యూరిటీ పరిపక్వ స్థాయికి దగ్గరైన కొలది, దాని ద్రవ్యత్వం పెరగును. శూన్య పరిపక్వతతో ఋణంగా కరెన్సీ వుంటుంది.

భారతదేశ ప్రభుత్వ ఋణం యొక్క ద్రవ్యీకరణ పరిమాణం గత కొద్ది సంవత్సరాలలో ఏవిధంగా వుందో రిజర్వు బ్యాంకు, వాణిజ్య బాంకుల మూలాధారంగా పరిశీలిద్దాం. ద్రవ్య సప్లయ్ (ద్రవ్యరాశి) పెరుగుదలగా ప్రభుత్వానికి నికరబాంకు పరపతి దత్తాంశాన్ని (1970-71 నుండి 1983/84 వరకు) పట్టిక 1 తెలుపుతుంది. ద్రవ్యరాశి విస్తరణలో ప్రభుత్వానికి బాంకు పరపతి ప్రధానపాత్రను నిర్వహించింది. ఉదాహరణకు, 1980-81లో అది 64.3 శాతముంది ఇక్కడ వాణిజ్య బాంకులన్నింటి మొత్తంకన్న రిజర్వుబాంకు వాటా చాలా ఎక్కువగా ఉంది. 1984 మార్చి అంతానికి ద్రవ్యరాశి పరిమాణం రూ.85,567 కోట్లు ఉంది. అందులో ప్రభుత్వానికి బాంకు పరపతి రూ.40,566 కోట్లుగా వుంది, అనగా 47.7 శాతం. రిజర్వు బాంకు 31.1 శాతంను కలిగివుంది.

ప్రత్యక్షలోటు ద్రవ్యం (కేంద్ర బాంకుచే నూతన కరెన్సీ సృష్టి) పరోక్ష లోటు ద్రవ్యంల మధ్య భేదం వాస్తవిక బడ్జెట్ లోటును లెక్కించడాన్ని కష్టతరం చేస్తుంది. అంతేగాకుండా, ద్రవ్యత్వ నిర్వహణ సమస్యలు (ధానిపరిమాణం, నిర్మాణంతో కూడి వున్న) కోశ విధాన లేదా బడ్జెట్‌కి కార్యకలాపాలతో పూర్తిగా పరిమితమై లేవు. ఈ సమస్యలు ద్రవ్య ఋణ నిర్వహణ విధానాలను మించిపోతాయి. ద్రవ్య సప్లయ్ (ద్రవ్యరాశి మరియు ఇతర ద్రవ్యత్వ ఆస్తులు)లో పెరుగుదల ఒకవేళ వాస్తవిక వస్తుసేవల సప్లయ్ పెరుగుదలతో సమతౌల్యముగా లేనట్లయితే సాధారణ ధరలస్థాయిని పెంచుతుంది. (ద్రవ్య పరిమాణ సిద్ధాంత భావం). ద్రవ్య సప్లయ్, ద్రవ్య డిమాండ్ (వాస్తవిక ఉత్పత్తికి లేదా ఆర్థిక వ్యవస్థ వ్యవహారాల పరిమాణంనకు ద్రవ్య డిమాండ్ ప్రమేయమైనది)ల మధ్య సమతౌల్యం ధరల స్థిరత్వాన్ని నిలుపుటకు తప్పనిసరి. ద్రవ్యసప్లయ్ డిమాండ్‌ల మధ్య అసమతౌల్యం వల్ల ధరల స్థాయి పెరిగి అది ద్రవ్య వాస్తవిక కొనుగోలు శక్తిని తగ్గించును. ఇది సాధారణ పన్నులకు దారితీయును, తద్వారా లోటు ద్రవ్యం లేదా బడ్జెటు వల్ల ప్రజల వాస్తవిక ద్రవ్య కొనుగోలు శక్తిలో కొద్ది భాగం తగ్గిపోవును. ఈ విధమైన పన్నుల వల్ల కొనుగోలు శక్తి తగ్గడంవల్ల అనేక తరగతుల జనాభా ప్రభావితమగుతుంది. అందులో బీదవారు, తక్కువ ఆదాయం గలవారు ఇంకా ఎక్కువ ప్రభావితమగుదురు. ఇంకొక పరోక్ష యంత్రాంగం ద్వారా కూడా లోటు ద్రవ్యం ఆర్థిక వ్యవస్థను ప్రభావితపరుచును. ప్రభుత్వ లోటు ఋణం వల్ల ద్రవ్య డిమాండ్ పెరిగి వడ్డీ రేటును పెంచి కొత్త పెట్టుబడులను ఖరీదైనవిగా చేస్తుంది. సహజంగానే ఇది ఆదనపు ఉద్యోగితాకల్పనపై వ్యతిరేక ప్రభావాన్ని కలిగించుతుంది.

పై విశ్లేషణ వల్ల లోటు ద్రవ్య విధానానికి ధనాత్మక పాత్ర (positive role) లేదని భావించరాదు. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలె ఆర్థిక వ్యవస్థ ద్రవ్యీకరింపబడినచో లోటు విత్త వ్యయం స్వల్పకాలంలో వాస్తవిక ఉత్పత్తిని, వనరుల ఉపయోగాన్ని పెంచుతుంది. కొత్త పెట్టుబడి కార్యకలాపాలు పెరగడానికి ధరల స్థాయిలో కొద్దిగా క్రమమైన పెరుగుదల అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పై కొన్ని పరిస్థితులు అమలులో వుండును. ఈ కారణం వల్ల రాజకీయంగా వీలు కానప్పటికి ఆధునిక ప్రభుత్వాలు లోటు ద్రవ్యాన్ని పాటించుచున్నాయి. ఐనప్పటికి కోశ, ద్రవ్య విధానాల ద్వారా లోటు ద్రవ్యంను సబబైన స్థాయిలో ఉంచాలి.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

---

1. విక్రయింపదగని స్వల్పకాల సెక్యూరిటీలు ( adhoc treasury bills ) అనగా నేమి.
2. ఋణ నిధుల సమీరణ అనగా నేమి.
3. వాణిజ్య బాంకులు ఒక 100 కోట్ల రూపాయలు ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టాయనుకోండి మరియు నగదు బాంకు డిపాజిట్ల నిష్పత్తి 15 శాతం, మినిమమ్ నగదు నిష్పత్తి 25 శాతం అనుకోండి. అప్పుడు

మొత్తం పరపతి విస్తరణను లెక్కించండి.

4. ప్రత్యక్ష లోటు ద్రవ్యానికి, పరోక్షలోటు ద్రవ్యానికి గల భేదమేమి.

## 21.4 ముగింపు

పన్నులు, ప్రభుత్వ ఋణ సృష్టి అనేవి ప్రభుత్వ వ్యయానికి విత్తాన్ని కల్పించడానికి ప్రత్యామ్నాయ పద్ధతులుగా దోహదమగును. లోటు ద్రవ్యం సాధారణ స్థాయితో కూడిన పొంచివున్న పన్నులకు (hidden taxation) దారి తీయును. ఈ వివిధ ప్రభుత్వ విత్త పద్ధతులవల్ల ఏర్పడే ఆర్థిక పరిణామాలు ఆర్థిక వ్యవహారాలలోని వైవిధ్య స్వభావం వల్ల ఏర్పడును. ఒక ఆర్థిక వ్యవస్థలోని కోశ విధాన లక్ష్యాలు ఉద్దేశాల కనుగుణంగా ప్రభుత్వ విత్త పద్ధతులలో దేనిని పాటించాలనేది నిర్ణయమగును. సాధారణంగా లోటు ద్రవ్యం ధనాత్మక పాత్రను నిర్వహించాలంటే కోశ ద్రవ్య, ఋణ నిర్వహణ విధానాలను సమర్థవంతంగా రూపొందించి సమ్మిశ్రమాన్ని పాటించాలి.

– ఆచార్య ఎస్. సాదుప్రియ

## 21.5 సంప్రదింపు గ్రంథాలు

| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | తెలుగు అకాడమి | : | పబ్లిక్ ఫైనాన్స్ |

## 21.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింద ఇవ్వబడిన ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. ప్రభుత్వ విత్తానికి ప్రత్యామ్నాయ రూపాలుగా పన్ను, ప్రభుత్వ ఋణముల స్వభావాన్ని వివరించండి.
2. లోటు ద్రవ్య విధానం అంటే ఏమిటి? దానిని 'పొంచి వున్న పన్ను' (hidden taxation) గా ఎందుకు భావిస్తారు.
3. లోటు ద్రవ్య విధానపు యంత్రాంగాన్ని విశదీకరించుము.

II. ఈ క్రింద ఇవ్వబడిన ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. లోటు ద్రవ్య విధానపు ఆర్థిక పర్యవసానాలు ఏవిధంగా వుంటాయి.
2. సాంప్రదాయక మరియు నవ్య సాంప్రదాయక ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఋణానికి ఎందుకు వ్యతిరేకత తెలిపారు.
3. ప్రభుత్వం ఏ పరిస్థితుల్లో లోటు ద్రవ్య విధానాన్ని పాటిస్తుంది.

●●●

BRAOU

**పట్టిక – 1 : ద్రవ్యరాశి మార్పు మూలాధారంగా ప్రభుత్వానికి నికర బాంకు పరపతి ($M^3$) ***

**1970/71 – 1983/84**

| కాలం | | 1970–71 | | 1975–76 | | 1980–81 | | 1983–84** | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మార్పుకు మూలాధారం | | రూ. కోట్లలో | శాతంలో | రూ. కోట్లలో | శాతంలో | రూ. కోట్లలో | శాతంలో | రూ. కోట్లలో | శాతంలో |
| A. | ప్రభుత్వానికి నికర బాంకు పరపతి | 512 | 38.8 | 579 | 20.5 | 5501 | 64.3 | 5818 | 45.8 |
| i. | ప్రభుత్వానికి రిజర్వుబాంకు నికర పరపతి | 311 | 23.6 | 127 | 4.5 | 3698 | 43.2 | 4311 | 33.9 |
| ii. | ప్రభుత్వానికి ఇతర బాంకుల నికర పరపతి | 201 | 15.2 | 452 | 16.0 | 1803 | 21.1 | 1507 | 11.9 |
| B. | $M_3$లో మొత్తం మార్పు | 1319 | | 2829 | | 8558 | | 12699 | |

* $M_3$ = ప్రజల వద్ద గల కరెన్సీ + బాంకుల వద్ద గల డిమాండ్ డిపాజిట్లు + రిజర్వు బాంకు వద్ద గల ఇతర డిపాజిట్లు + పోస్టాఫీస్ పొదుపు + బాంకు డిపాజిట్లు + బాంకుల కాల డిపాజిట్లు

** తత్కాలానికు ఏర్పాటు చేయబడినది (Provisional).

Source : R.B.I., Report on Currency and Finance, 1983-84, Vol.II P.39

BRAOU

# ఖండం – 6

## విధులననుసరించిన విత్తం, అభివృద్ధి విత్తం

కోశ విధానపు అర్థం, పాత్రను చర్చిస్తూ ఈ ఖండంలోని మొదటి భాగం కోశ సిద్ధాంతపు పరిణామ క్రమాన్ని భారతదేశపు కోశ విధానంలో ప్రధానంగా తెలుపబడిన 'దీర్ఘకాల కోశ విధానం'ను విశ్లేషించడం జరిగింది. బడ్జెట్‌కు సంబంధించిన వివిధ అంశాలను, భారతదేశంలో బడ్జెట్‌ను తయారుచేయడానికి అనుసరిస్తున్న విధానాన్ని వివరించాం. విధులననుసరించిన విత్తం, అభివృద్ధి విత్తం అను భావనలను విశదపరుస్తూ, అభివృద్ధి విత్తపు వివిధ ఆధారాలను తెలుపుతుంది.

ఈ ఖండంలోని 3 భాగాలు :


భాగం – 22 : భారత దేశంలో విత్త విధానం పాత్ర

భాగం – 23 : బడ్జెట్ రూపకల్పన

భాగం – 24 : భారత దేశంలోని విత్త రూపాలు, అభివృద్ధి విత్తం


❖❖❖

BRAOU

BRAOU

# భాగం – 22 : భారతదేశంలో కోశ విధానపు పాత్ర

విషయ క్రమం

22.0 ఉద్దేశాలు, లక్ష్యాలు
22.1 పరిచయం
22.2 కోశవిధానపు అర్థం
22.3 విధులననుసరించి విత్త విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తూ కోశ విధానపు క్రమ పరిమాణం
22.4 ఆర్థికవృద్ధి, అభివృద్ధుల సాధనకు తగిన విత్త విధానము
22.5 కోశ విధాన ముఖ్య లక్ష్యాలు
22.6 అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ సాధనాలు వాటి ఆటంకాలు
22.7 భారతదేశంలో కోశ విధానపు నిర్మాణం, విధానపు సాధన
22.8 భారతదేశ కోశ విధాన నిర్మాణంలో ముఖ్య లక్షణాలు
22.9 భారత కోశ విధానపు సమస్యలు
22.10 దీర్ఘకాలిక కోశ విధానం
22.11 ముగింపు
22.12 సంప్రదించు పుస్తకాలు
22.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

*"ఒక సంఘం యొక్క మరియు నాగరికత యొక్క స్వభావాన్ని కోశ విధానత తెలియవర్చినంత మన్పష్టంగా మరేది తెలుపదు...............” జోసఫ్, ఎ. షుంపీటర్.*

## 22.0 ఉద్దేశాలు, లక్ష్యాలు

ఈ భాగము యొక్క ముఖ్య ఉద్దేశము

స్థూల ఆర్థిక విశ్లేషణ ఆధారంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోనూ, భారతదేశంవంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ కోశ విధానపు అర్థాన్ని, పాత్రను వివరించడం; కోశ సిద్ధాంతపు క్రమ పరిణామాన్ని వివరించడం; భారతకోశ విధానపు సాధన, సమస్యలు, భవిష్యత్తులో సాధించవలసిన లక్ష్యాలు వివరించడం; దీర్ఘకాలిక కోశ విధానాన్ని చర్చించడం.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అర్థం చేసుకోగలుగుతారు.

- కోశ విధానపు క్రమ పరిమాణం
- కోశ విధానములోని ముఖ్య లక్షణాలను, సాధనాలను గుర్తించడము
- భారతదేశములో కోశ విధాన నిర్మాణ లక్షణాలు మరియు సాధన పరిశీలనా తీరు
- భారతదేశ కోశ విధానములోని సమస్యలను గుర్తించడము
- దీర్ఘకాలిక కోశ విధానాన్ని విశ్లేషించడం

B R A O U

జాన్ మెయినార్డ్ కీన్సు వాదన. పరిపూర్ణ ఉద్యోగితను సాధించేందుకు అందుబాటులో నున్న వనరులు (అల్పకాలంలో స్థిరంగా ఉంటాయని భావింపబడే) సంభావ్య సమిష్టి (ద్రవ్య) వ్యయంలేదా డిమాండుకు తగినట్లుగా ఉండాలి.జాతీయాదాయ అకౌంట్ల నుండి (A) అందుబాటులో నున్న మొత్తం వనరులు (B) సంభావ్య డిమాండు (ప్రభుత్వ, ప్రైవేటు రంగాల వినియోగవ్యయం మరియు పెట్టుబడి వ్యయం) అంచనా వేయవచ్చు. A కంటె B ఎక్కువగా నున్నచో (A>B) ఈ వ్యవధిని (Gap) కోశ విధాన చర్యల ద్వారా పూడ్చాలి. B కంటె A ఎక్కువగా నున్నప్పుడు కూడ వ్యవధి వస్తుంది. దీన్ని కూడా కోశ విధాన చర్యల ద్వారానే పూడ్చాలి. ఇదే బహుళ ప్రాచుర్యంలో నున్న కీన్సు " Y=C+I+G" అనే సమీకరణము. కోశ సంబంధమైన సాధనాల ద్వారా (ప్రభుత్వ వ్యయం, పన్ను విధింపు, లోటుదారీ ఆర్థిక విధానం) ఈ వ్యవధిని పూడ్చడమనే పద్ధతి పరిహారపు కోశ విధానమనే భావన (Compensatory Finance) ద్వారా వ్యక్తీకరించబడింది. ఈ భావనకు ఎ.హెచ్. హేన్‌సెన్ తొలి రూపమిచ్చాడు.

**ఏ.పి. లర్నర్ విధులననుసరించిన విత్త విధానము :**

కానీ కీన్సు కోశ సిద్ధాంతం ఎ.పి.లర్నర్ చేతిలో కొంత మెరుగు దిద్దబడి "నియంత్రణ అర్థశాస్త్రం" (Economics of Control) అనే గ్రంథంలో "విధులననుసరించిన విత్త విధానమనే" పేరుతో పరిపూర్ణ తుదిరూపాన్ని దిద్దుకొంది. కోశ విధానాన్ని గూర్చిన ఈ వివరణను జస్సీ బర్క్ హెడ్ ఈ విధంగా సంక్షిప్తీకరించెను. " ఈ వివరణ ప్రభుత్వ ఆదాయాన్ని వ్యయ, ఋణాలు సమిష్టి వ్యయాలను నియంత్రణ చేసే సాధనాలుగా మాత్రమే చూస్తోంది. వీటిని సాధనాలుగా తీసుకొని స్థిర ధరల వద్ద స్థిరఉద్యోగిత అనే గమ్యాన్ని చేరాలి". ఈపద్ధతిలో ఉదాహరణకు పన్నులను ఆదాయన్ని సాధించే ఆధారాలుగా చూడరాదు. ప్రైవేటు వినియోగం, పెట్టుబడి వ్యయాలను ప్రభావితం చేసే సాధనాలుగా చూడాలి. ఈ ఆలోచనలో పైన చర్చించిన సంప్రదాయ (Classical) లేదా కీన్సుకు పూర్వపు ఆర్థిక వేత్తల ఆలోచనలకు పూర్తి వ్యతిరేకంగా వున్నాయి. విధులననుసరించిన విత్త విధానంలోని ముఖ్యమైన అంతరార్థాలు (implications) ఈ క్రింద పొందుపరచడ్డాయి.

1) ప్రభుత్వ విత్తాన్ని విధుల ఆధారంగానే లెక్కలోకి తీసుకోవాలి. ఆదాయ వ్యయాలు సామూహిక అవసరాలను తీర్చడానికి మాత్రమే లెక్కలోకి తీసుకోరాదు.

2) బడ్జెట్ ఎల్లప్పుడూ సంతులితం కానక్కరలేదు. నిజానికి ఆర్థిక మాంద్యపు పరిస్థితుల్లో సంతులిత బడ్జెట్ కోరదగినది కాదు.

3) అదేవిధంగా ప్రభుత్వ వ్యయాన్ని (పన్ను విధింపును కూడ) ప్రత్యక్షప్రయోజనాల కొరకు మాత్రమే లెక్కలోనికి తీసుకోరాదు. సార్థక డిమాండు పెంచడం రూపంలో కలుగజేసే పరోక్ష ప్రభావాన్ని కూడ లెక్కలోకి తీసుకోవాలి.

BRAOU

స్థూల ఆర్థిక విశ్లేషణను గూర్చిన కొంత పరిజ్ఞానంతో ఇట్టి కోశ విధానం ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన చేసుకోవడం కష్టంకాదు. వెనుక చర్చించిన సమీకరణ మైన Y=C+I+G ని తీసుకుందాం. ఎగుమతి దిగుమతులను గూడా లెక్కలోకి తీసుకొన్నచో Y=C+I+G+X - M అవుతుంది. ప్రభుత్వవ్యయాన్ని ప్రభుత్వం నియంత్రణ చేయగలదు. కాని ఇతర చలాంకాలను పన్ను విధింపు మరియు ఇతర కోశ విధానపు చర్యల ద్వారా ప్రభావితం చేయవచ్చు. ఈ విధంగా కేన్సు విశ్లేషణ కోశ విధానాన్ని ఆర్థిక విశ్లేషణ యొక్క ప్రధాన అంశాలతో సంఘటిత పరుస్తుంది.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి -1**

---

1. సాంప్రదాయ కోశ విధాన ముఖ్య సూత్రాలు ఏవి?
2. కోశ విధానంపై కీన్స్ అభిప్రాయం ఏమిటి?
3. విధులననుసరించిన విత్త విధానమనగానేమి?

## 22.4 వృద్ధి, అభివృద్ధులకు కోశ విధానం

యు.కె. హిక్సు చెప్పినట్లు "కోశ విధానం ప్రభుత్వపు ఆర్థిక విధిగా అభివృద్ధి చెందడం వల్ల, ప్రతీ దేశం ప్రభుత్వ విత్తం ద్వారా స్థిరీకరణ, వృద్ధి అనబడే జంట లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తున్నది. కాని వీటి సాపేక్ష ప్రాముఖ్యత ఒక దేశం నుండి మరొక దేశానికి వేర్వేరుగా ఉంటోంది. ఆర్థికంగా వెనుకబడ్డ దేశం ముఖ్యంగా జనాభా తీవ్రగతిని పెరుగుతుంటే ఆర్థికవృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది". ఈ వివరణ ఆధారంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ విధానపు పాత్రను పరీక్షించాలి.

ఆర్థిక సిద్ధాంతంపై విప్లవాత్మక ప్రభావాన్ని కలుగజేసినప్పటికీ పరిహారక కోశవిధానం నేటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏవిధంగాను వర్తించదు. పరిహారక కోశ విధానం చక్రీయ హెచ్చుతగ్గుల సందర్భంలో ఆవిర్భవించింది. ఇది అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకే తగినది. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆదాయ ఉత్పత్తుల క్రమవృద్ధికి (Steady Growth) అడ్డంకి, సార్థక డిమాండు యొక్క కొరత కాదు. వనరుల కొరత మరియు అందుబాటులో నున్న వనరుల అల్పఉత్పాదకత ఇందుకు కారణాలు. వనరుల అభివృద్ధి (a) మూలధనకల్పన లేదా పొదుపు యొక్క పరిమాణం పైనా (b) మూలధనపు ఉత్పాదకత (మానవరూపంలో ఉన్న మూలధనంతో సహా) లపై ఆధారపడి ఉంటుంది. ( ఈ వివరణ యొక్క తత్వం హారాడ్, డోమార్ వృద్ధి నమూనాపై ఆధారపడినది.) కాబట్టి భారతదేశం వంటి వెనుకబడిన దేశంలో కోశ విధానం నిర్వహించవలసిన ప్రధానపాత్ర అదనపు వనరుల సమీకరణ కాని అభివృద్ధి వ్యూహాన్ని తెలుసుకోకుండా వనరుల సమీకరణను లెక్కలోకి తీసుకోవడం అర్థంలేని పని. వనరుల సమీకరణ తీరు, వాటి ఉపయోగం, సార్థకత (కోశ విధానపు అన్ని ప్రధాన ప్రశ్నలు) అభివృద్ధి వ్యూహంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉంటాయి. భారతదేశం ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వ్యూహాన్ని ఎన్నుకొన్నదని మనకు తెలిసినదే. ఇందు ప్రభుత్వరంగానికి కీలకపాత్ర ఇవ్వబడింది. మన పెట్టుబడుల్లో 60 శాతం ( ఒక ప్రణాళికకు మరొక ప్రణాళికకు ఈ శాతంలో కొంచెం తేడా వున్నప్పటికీ) ప్రభుత్వ రంగానికి కేటాయించబడుతోంది. ప్రణాళికలోని ఇతర అభివృద్ధి వ్యయాలు కూడ జాతీయాభివృద్ధికి ప్రముఖంగా తోడ్పడుతున్నాయి. ప్రభుత్వరంగంలోని ఈ అధిక పరిమాణంలోని వ్యయాలకు నిధులు సమకూర్చడానికీ, ప్రైవేటు రంగంలో పెట్టుబడిని పెంచడానికి కోశ విధానానికి ప్రత్యామ్నాయం లేదు. ఆర్.జె. చెల్లయ్య "ఆర్థికాభివృద్ధిని పెంచడానికి ప్రభుత్వం వాడు సాధనాలలో కోశవిధానం అతి శక్తివంతమైనదీ, కోరదగని ఫలితాలు అతి తక్కువగా గలది" అని చెప్పాడు.

పై చర్చను బట్టి అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ విధానం అదనపుపొదుపు నిష్పత్తిని (Incremental Saving Ratio) పెంచాలని తేలుతోంది. అనగా అదనపు ఆదాయంలో అధిక అనుపాతంలో పొదుపు చేయబడాలి. వినియోగానికి వాడబడనీయరాదు. అంతేకాక ఆదాయ సంపదల్లోని అమితమైన వ్యత్యాసాలు అభివృద్ధి సాధనకు ఆటంకాలు. ఇట్టి వ్యత్యాసాలు విపరీతమైన సాంఘిక, ఆర్థిక సందిగ్ధతలకు (crises) దారితీస్తాయి. ఉదాహరణకు ఆహారధాన్యాల నిల్వలు అధికంగా ఉన్నప్పటికీ అధిక సంఖ్యలో నున్న పేద వారికి కొనుగోలు శక్తి లేదు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలు వెనుకబడ్డ ప్రాంతాల యొక్కయు, బడుగు వర్గాల యొక్కయు ప్రత్యేకావసరాలను తీర్చేవిగా ఉండాలి. అంతిమంగా, ఒక కనీస స్థాయిలో ధరల స్థిరీకరణ ఆర్థికాభివృద్ధికి అత్యవసరము. నిరంతరంగా పెరిగే ధరలు అభివృద్ధి ప్రక్రియను దెబ్బతీస్తాయి. కాని ధరల స్థిరీకరణకు కోశ చర్యలు ఎంతవరకు తీసుకోవాలనేది చాల చిక్కు సమస్య. ఎందుకంటే కొంత పరిమాణంలో ధరల పెరుగుదల తప్పించరానిదే కాక ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు అవసరము కూడ.

ఆధారం : సి.ఎస్.ఒ.బేసిక్ స్టాటిస్టిక్స్ రిలేటింగ్ టు ఇండియన్ ఎకానమీ *1950 -51. 1981 - 82,* పుట *25.*

1950-51 నుండి 1981-82 కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత వ్యయం మూడు రెట్లు కాగా మూలధన వ్యయం ఏడు రెట్లు పెరిగింది. 1981-82 సంగలో భారతదేశంలో ప్రభుత్వ వ్యయం రూ.43,738 కోట్లు లేదా స్థూల జాతీయ ఉత్పత్తిలో 32.2 శాతం. దీనిలో 65.5 శాతం అభివృద్ధి వ్యయం (ఆర్థిక, సాంఘిక సేవల నిమిత్తం) కాగా 34.5 శాతం నిర్వహణ,రక్షణ, వడ్డీ , చెల్లింపులు, సబ్సిడీలు మొదలగు అంశాలపై అభివృద్ధేతర వ్యయం. ఇంత పరిమాణంలో ప్రభుత్వ వ్యయం ఉండగా పన్నుల రాబడి రు:24,142 కోట్లు మాత్రమే ఉండేది. పన్ను ఆదాయపు విస్తృతి 1950-51లో 7 శాతం నుండి 1980 వ సంవత్సరానికి 10 శాతానికి పెరిగింది. ఈ దత్తాంశాలన్నీయు ప్రభుత్వపు కోశ కార్యకలాపాల్లో గణనీయమైన పెరుగుదలను తెలుపుతున్నాయి. 3వపట్టికలో 1981-82 సంవత్సరానికి భారతదేశ కోశవిధానపు నిర్మాణం పొందు పర్చబడినది.

**పట్టిక - 3 : భారతదేశ కోశ విధానపు నిర్మాణం ●**

**1981-82** **(రూ.లు కోట్లలో)**

| | | | |
|---|---|---|---|
| I. | ప్రభుత్వ వ్యయం | | 43,738 |
| | 1. అభివృద్ధి వ్యయం | 28,653 | |
| | | (65.5) | |
| | దీనిలో ప్రణాళిక వ్యయం | 18,373 | |
| | | (42.0) | |
| | 2. అభివృద్ధేతర వ్యయం | 15,085 | |
| | | (34.5) | |
| II. | ప్రస్తుత ఆదాయం | | 30,425 |
| | 1. పన్ను ఆదాయం | 24,142 | |
| | (a) ఆదాయ, కార్పొరేషన్ పన్ను | 3,445 | |
| | | (14.3) | |
| | (b) కస్టమ్స్ | 4,300 | |
| | | (17.8) | |
| | (c) యూనియన్ ఎక్సైజ్ సుంకాలు | 7,421 | |
| | | (30.7) | |
| | (d) అమ్మకపు పన్ను | 5,063 | |
| | | (21.0) | |
| | (e) ఇతర పన్నులు | 3,913 | |
| | | (16.2) | |
| | 2. పన్నుకు ఇతరమైన ఆదాయం | 6,283 | |
| | దీనిలో ప్రభుత్వ సంస్థల మిగులు (ప్రణాళికకు) | 2,235 | |
| III. | మూలధన ఆదాయం (నికరం) | | 10,794 |
| | 1. అంతరంగిక ప్రభుత్వ ఋణాలు | 6,567 | |
| | 2. చిల్లర ఆదాయాలు | 2,946 | |
| | 3. విదేశీ ఋణాలు, గ్రాంటులు | 1,301 | |
| IV. | బడ్జెటు లోటు | | 2,519 |

• కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి

గమనిక : బ్రాకెట్లలోని సంఖ్యలు శాతాలను తెల్పుతాయి
ఆధారం : గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఎకనామిక్ సర్వే 1983-84 పుట 112-113.

## 22.8 భారతదేశ కోశ నిర్మాణపు ప్రముఖ లక్షణాలు

పై దత్తాంశాల ఆధారంగా భారతదేశ కోశ నిర్మాణపు లక్షణాలను పరిశీలిద్దాం.

i) ప్రభుత్వ వ్యయంలో అధికభాగం అనగా 65 శాతం పైబడి అభివృద్ధి కార్యకలాపాలకు ఖర్చు చేయబడుచున్నది.

ii) ప్రభుత్వ వ్యయంలో గణనీయమైన భాగం అనగా 42 శాతం ప్రణాళికా పథకాలపై ఖర్చు చేయబడుచున్నది.

iii) ప్రభుత్వ వ్యయంలో సగానికి పైగా పన్నుల నుండి వచ్చుచున్నది.

iv) పన్నుల నిర్మాణంలో ప్రత్యక్ష పన్నులు తక్కువ ప్రాధాన్యతను వహిస్తున్నాయి. ఇది పన్నుల నుంచి వచ్చే ఆదాయంలో 5వవంతు కంటె తక్కువ మొత్తాన్ని (ఇతర పన్నులలో కొంత భాగం ప్రత్యక్ష పన్నులు అనుకోగా) ఇస్తున్నాయి. 80శాతం పన్నుల ఆదాయం వివిధ వస్తువులపై వేయు పరోక్ష పన్నుల నుండి లభిస్తోంది. మొత్తం పన్నుల ఆదాయంలో కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, అమ్మకపు పన్నులు కలిపి 55 శాతం ఆదాయాన్ని ఇస్తున్నాయి.

v) విదేశీ వనరులు (విదేశీ ఋణాలు, గ్రాంటులు) మొత్తం వ్యయంలో 3 శాతం మూలధన ఆదాయంలో 12 శాతం మాత్రమే ఉండి ప్రభుత్వ ఆదాయ వనరులుగా అప్రముఖమైన పాత్రను వహిస్తున్నాయి.

vi) దేశీయ లేదా అంతరంగిక మార్కెటు ఋణాలు ప్రముఖమైన ఆధారంగా ఉండి ప్రభుత్వపు మూలధన వ్యయంలో 60 శాతానికి పైగా అందజేస్తున్నాయి. ఈ ఆధారం నుంచి వచ్చే ఆదాయం మొత్తం వ్యయంలో అయితే 15 శాతం ఉంది.

vii) లోటు ద్రవ్య ఆర్థిక విధానం వల్ల 6 శాతం ఆదాయం వస్తోంది. అయితే లోటు ద్రవ్య ఆర్థిక విధానం వల్ల వాస్తవంగా వచ్చే ఆదాయం ఇంకా ఎక్కువ. ఎందుకంటే భారతీయ రిజర్వుబ్యాంకు, వాణిజ్యబ్యాంకుల చందాలు అంతరంగిక ఋణాలలో ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి. కాని ఈ ఋణాలను లోటు ద్రవ్య ఆర్థిక విధానాల క్రిందే జమ చేయాలి.

## 22.9 భారతీయ కోశ విధానపు సమస్యలు

భారతకోశ విధానంలోని కొన్ని అంశాలను చర్చిద్దాం. ఈ మధ్య ముఖ్యంగా 1975 సం॥ తర్వాత ప్రభుత్వపు కోశ నిర్వహణ కొన్ని ఇబ్బందులకు లోనైంది. ఈ అంశాలను సంగ్రహంగా చర్చిద్దాము.

BRAOU

### 22.9.1 ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యం

ప్రభుత్వ ఆదాయాలకు ప్రస్తుత వ్యయాలకు అసమతౌల్యం కొనసాగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెటులు కలుపగా 1980-85 కాలంలో సాలుసరి లోటు రు.861 కోట్లు ఉంది. కాని 1975-80కాలంలో సాలుసరి మిగులు రూ.1400 కోట్లు ఉండేది. ఈ పరిస్థితికి ముఖ్య కారణం స్థూల దేశీయ ఉత్పత్తిలో రెవిన్యూ వ్యయంతో పోల్చడం పన్ను ఆదాయపు నిష్పత్తి తగ్గడమే. ఏడవ పంచవర్ష ప్రణాళికలో ఈ విధంగా సూచించబడింది. "ఈ లక్షణాలు మిగుళ్ళను సమకూర్చి అత్యవసర ప్రభుత్వ సేవలను విస్తరించడానికి అవసరమైన ప్రభుత్వ పెట్టుబడికి నిధులు సమకూర్చడానికి కావలసిన ప్రభుత్వరంగపు సామర్థ్యాన్ని వివరించాయి. పై దత్తాంశాలు మూలధన ఆదాయంలో కొంత భాగం ప్రస్తుత వ్యయానికి వాడబడుతోందని తెలుపుతున్నాయి.

### 22.9.2 బయాన్సు కాదని మరియు ద్రవ్యోల్బణం

ప్రణాళికేతర ప్రస్తుత వ్యయం పన్నుల ఆదాయం కంటె వేగంగా పెరగడం వ్యయాలు తక్కువగా పన్ను ఆదాయాలకంటె ద్రవ్యోల్బణంకు తగినట్లు (responsive)గా ఉన్నట్లు తెలుస్తోంది. దీని అర్థం భారతీయ పన్నుల నిర్మాణం బయాన్సు (buyant) కాదని ఆదాయ పెరుగుదలకు తగినట్లు లేదని తెలుస్తోంది.

### 22.9.3 నల్లధనం లేదా లెక్కకు రాని ధనం

పై నిర్ణయం ఇంకో విధంగా కూడా పరిస్తుంది. ఆర్థికాభివృద్ధి సాధింపబడినప్పటికీ స్థూల జాతీయుత్పత్తిలోనూ మొత్తం పన్ను ఆదాయంలోనూ ప్రత్యక్ష పన్నుల భాగం (ఆదాయ సంపద పన్నుల భాగం) ఈ మధ్యకాలంలో తగ్గుతోంది. ఈ పరిస్థితి అదనపు ఆదాయాన్ని సేకరించడంలోనూ, ఆదాయ సంపదల కేంద్రీకరణను తగ్గించడం లోనూ పన్నుల నిర్మాణం యొక్క వైఫల్యాన్ని తెలియజేస్తుంది. బహుశ ఈ సమస్యకు మూలకారణం ఆదాయపు లెక్కలలోకి రాకుండా పన్నుల బారినుంచి తప్పించుకొనే నల్లధనం పెరుగుదల కావచ్చును. ఈ నల్లధనపు పరిమాణం రూ.32,000 - 35,000 కోట్లు ఉంటుందని ఈ మధ్య అంచనా వేయబడింది. అంతేకాక ఈ మధ్య ప్రభుత్వం పన్నుల ఎగవేతను అరికట్టేందుకు తీసుకున్న కఠిన చర్యలు 10 శాతం నల్లధనాన్ని మించి తాక లేకపోతున్నాయని తేలింది. కావున పన్నుల ఎగవేత భారతకోశ విధానపు ముఖ్యమైన దౌర్బల్యం.

BRAOU

### 22.9.4 ప్రభుత్వ పెట్టుబడులపై వచ్చే తక్కువ లాభాలు

పన్నుల విధానంలో బాయెన్సీ (buoyancy) లేకపోవడమే కాక ప్రభుత్వ పెట్టబడిపై వచ్చేలాభాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. మన ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడి రు.50,000 కోట్లు ఉన్నప్పటికి చాల సంస్థలు నష్టాలను ఎదుర్కోవడం వల్ల ప్రభుత్వ పెట్టుబడి నుండి వచ్చిన లాభం చాల తక్కువగా ఉంది. అంటే విస్తరణ కార్యక్రమాలు చేపట్టడానికి తగిన మిగులు నిధులు ప్రభుత్వ రంగం నుండి లభించడం లేదు. ప్రభుత్వ సంస్థలు కొన్ని సాంఘిక లక్ష్యాలను సాధించడానికి స్థాపించబడ్డాయి. కాని లాభాలు ఆర్జించడానికి కాదనే వాదనకు ఒక హద్దు ఉంది.

### 22.9.5 లోటు దారి ద్రవ్య విధానం

పై వాదనల నుండి తేలేదేమంటే ప్రభుత్వం లోటు దారీ ఆర్థిక విదానాన్ని ఏటేటా పెంచవలసి వచ్చి ద్రవ్యోల్బణను, తత్ఫలితంగా వచ్చే సాంఘిక ఆర్థిక మార్పులను ఎదుర్కోవలసి వస్తోంది. దీని వల్ల ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుంది. అంతేగాక ప్రభుత్వపు లోటు బడ్జెట్ కోశనిర్వహణ సమర్థవంతంగా లేదు. గత కొద్ది సంవత్సరాలలో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు పన్నులు, ప్రత్యక్ష లోటు ద్రవ్య ఆర్థిక విధానానికి బదులు నిర్వహణ ధరలను (ప్రభుత్వ రంగపు ఉత్పాదక వస్తువుల) విపరీతంగా పెంచాయి. ఈ ఎంపిక ఎట్టి ఆర్థిక కారణాల మీద ఆధారపడ్డదికాదు. రాజకీయ అనుకూలతపై ఆధారపడినది. ఇది ద్రవ్యోల్బణను మరికొంత ప్రేరేపించి వనరుల వాడకంలో అనేక అవకతవకలకు దారి తీసింది.

### 22.9.6 సరియైన ప్రభుత్వ వ్యయ విధానం లేకపోవడం

సరియైన ప్రభుత్వ వ్యయ విధానం లేకపోవడం కోశ విధానంలో మరొక ముఖ్య అంశం ప్రభుత్వ వ్యయాలను పరిశీలించే పద్ధతులు ముఖ్యంగా అభివృద్ధేతర స్వభావంకల వ్యయాల వ్యయ సామర్థ్యపు విశ్లేషణపై ఆధారపడుట లేదు.

### 22.9.7 కోశపరమైన క్రమశిక్షణ లోపించడం

దేశంలో పన్నుల విధానంలో కాని, లోటు దారి ఆర్థిక విధానంలో గాని, వ్యయ నియంత్రణలోగాని కోశ పరమైన క్రమశిక్షణ లోపించింది.

పైన చర్చించిన అంశాలు కోశ సమస్యలను అన్నింటిని లెక్కలోనికి తీసుకోకపోయినా,ఆర్థిక వృద్ధి, స్థిరత్వము, సాంఘిక న్యాయాలకు చెందిన అనేక విషయాలపై సరియైన అవగాహన ఏర్పరుస్తాయి. 1985 సం॥ డిసెంబరు నెలలో భారత ప్రభుత్వ విధానకాలిక కోశ విధానాన్ని (Long term fiscal policy) ప్రకటించడాన్ని బట్టి తీవ్ర దీర్ఘ కోశ సంస్కరణలు అవసరమని గుర్తించినట్లు తెలుస్తోంది.ఇప్పుడు దీర్ఘకాలిక కోశవైనాన్ని క్లుప్తంగా చర్చిద్దాం.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

---

4. కోశ విధానం యొక్క ముఖ్యమైన లక్ష్యాలు ఏవి?
5. ముఖ్యమైన కోశ విధాన సాధనాలను గుర్తించుము.
6. భారతకోశ విధానంలోని కొన్ని ముఖ్యమైన అంశాలను గుర్తించుము.

---

## 22.10 దీర్ఘకాలిక కోశ విధానం

---

ఏడవ పంచవర్ష ప్రణాళిక "బడ్జెట్ ఆదాయవ్యయాలను సమకూర్చుకుని ద్రవ్యోల్బణం లేకుండా ప్రభుత్వ రంగానికి కావలసిన నిధులు సమకూర్చుకునేందుకూ అదే సమయంలో ప్రైవేటు రంగానికి కూడా సరియైన కోశ విధానాన్ని ఆచరించడానికి " దీర్ఘకాలిక కోశ విధానం అవసరమని పక్కాణించింది. ప్రణాళిక దీర్ఘకాలిక వ్యూహపు నాల్గు భాగాలను నిర్దేశించింది.

i) పన్నుల నిర్మాణాన్ని సంస్కరించి, దృఢపరచి, ఆదాయవృద్ధికి తగినట్లు గాను బాయెన్టు (buoyant) గాను ఉండేటట్లుచేయడం.

ii) తగిన వ్యయ విధానాన్ని తయారు చేయడం.

iii) ద్రవ్యోల్బణకు దారితీయని కోశ విధానానికి అవసరమైన కోశపరమైన క్రమశిక్షణను ఆచరించడం.

B R A O U

iv) ప్రభుత్వరంగ సంస్థల సాధనను పెంచి మిగుళ్ళను సాధించడానికి తగిన విధానాలను తయారు చేయడం.

ప్రణాళిక నిర్దేశానుసారం భారత ప్రభుత్వం 1985 నుండి డిసెంబరులో దీర్ఘకాలిక కోశ విధానాన్ని ప్రకటించింది. దీర్ఘకాలం అనగా ప్రణాళికా కాలంతో సమన్వయంగా ఉండే 5 సంవత్సరాల కాలం. దీర్ఘకాలిక కోశ విధానాన్ని తయారుచేయడంతో ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి కోశ విధానానికి ఎక్కువ సమన్వయం ఏర్పరచబడింది.

దీర్ఘకాలిక కోశ విధానం ప్రణాళిక యొక్క ప్రాతిపదిక లక్ష్యాలైన వృద్ధి, ఆధునికీకరణ, స్వావలంబన, సాంఘిక నిర్ణయాలకు కోశ పరమైన జవాబు. దీని ప్రత్యేకమైన ఉద్దేశ్యాలు.

1) సాలుసరి బడ్జెట్ల అనుక్రమమునకు (Sequence) అవసరమైన, నిర్దిష్టమైన పంథాను పొందికను (Coherence) కలుగజేయడం.

2) నియమావళిపై ఆధారపడ్డ కోశ, ఆర్థిక విధానాలకు అధికమైన పాత్రను ఇవ్వడం.

3) ఆర్థిక విధానాలకు నిర్వహణకు ఇంకా ఎక్కువ సంఘటిత పంథాని పెంపొందించడం.

4) కోశ విధానానికి సూచనాపరమైన సంవత్సరిక ఆర్థిక చట్రాన్ని తయారుచేయడం ద్వారా ఏడవ ప్రణాళికకు సాలుసరి బడ్జెట్లకు గల అనుబంధాన్ని బలపర్చడానికి ఒక సమర్థవంతమైన సాధనంగా వాడటం.

దీర్ఘకాలిక కోశ విధానం తలపెట్టబడిన కోశ పరమైన సంస్కరణలన్నిటికీ వివరాలను ఇవ్వదు. ప్రభుత్వ వ్యయ విధానం, ప్రభుత్వరంగ సంస్థల సాధన మొదలగు అంశాలపై విస్తృతమైన మార్గదర్శక సూచనలను మాత్రమే ఇస్తుంది. అంతే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ముఖ్యమైన సంస్కరణలు సూచింపబడ్డాయి. దీర్ఘకాలిక కోశ విధానంలో పొందుపర్చబడ్డ పన్ను విధింపు చర్యల సంక్షిప్త సారాంశం దిగువ పొందుపరచబడింది.

B R A O U

## 22.10.1 ప్రత్యక్ష పన్నులు

i) అవసరమైన స్థిరత్వాన్ని ఏర్పాటు చేయుటకుగాను వ్యక్తిగత ఆదాయ సంపదలపై 5 సం॥ల వరకు ప్రస్తుత పన్నుల షెడ్యూలులో మార్పులురావు.

ii) ఈ క్రింది లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం క్లిష్టంగా ఉన్న ప్రత్యక్ష పన్నుల చట్టాలు తిరిగి వ్రాయబడాలి.

a) నిర్వహణ సౌలభ్యానికై చట్టాలలోని అంశాలు సహేతుకంగాను,సులభంగాను ఉండేటట్లు చూడాలి.

b) చట్టాలలోని అంశాలు పన్ను ఎగవేతను నిరోధించడానికి వీలుగా ఉండాలి.

c) తగిన జరిమానాలు ఏర్పరచబడాలి.

d) పద్ధతుల్లో ఏకత్వాన్ని (Unity) తీసుకురావాలి.

e) పన్ను విధించబడు అంశాలలోని వర్గాలను తగ్గించాలి.

iii) పొదుపు ప్రోత్సాహకాలను దృఢపరచడానికి జాతీయ డిపాజిట్ పథకం (National Deposit Scheme) ప్రారంభించబడుతుంది.

iv) ప్రస్తుతం అమలులో ఉన్న కార్పోరేటు పన్ను రేట్లు కొనసాగింపబడతాయి.కాని కార్పోరేటు రంగం లాభంలో ఒక నిర్దిష్ట భాగాన్ని (అనగా 20 శాతం వరకు) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి గుర్తించబడిన సంస్థల్లో డిపాజిట్ చేస్తే పన్ను చెల్లించవలసిన ఆదాయాన్నుండి మినహాయింపు వస్తుంది.

v) 1987 సం॥ ఏప్రిల్ ఒకటవ తేది నుండి కార్పోరేటు పన్నుపై సర్‌చార్జి సర్‌టాక్స్ రద్దు చేయబడుతాయి.

vi) కార్పోరేటు పన్ను లెక్కల్లోని తరుగుదలకు సంబంధించిన చట్టాలను సులభతరం చేయాలి. మూలధనాదాయంపై పన్ను ఆస్తులను ఏప్రిల్ 1, 1974 నాటికి తిరిగి వెలకట్టబడటం ద్వారాను రెండు వరసల పద్ధతి పన్ను రేట్లను ప్రవేశపెట్టడం ద్వారాను (నిజ ఆస్తులపై 50శాతం, ఇతర ఆస్తులపై 60 శాతం) కొన్ని విత్త పరమైన పెట్టుబడులకు మినహాయింపు ఇవ్వడం ద్వారాను హేతుబద్ధం చేయబడుతుంది.

## 22.10.2 పరోక్ష పన్నులు

i) వివిధ ఎక్సైజ్ సుంకాలను ఒకే ప్రాతిపదిక రేటులోకి తీసుకురావడానికి నిర్ణయించబడింది.

ii) కస్టమ్ టారిఫ్‌కు కొత్త వర్గీకరణ పద్ధతి ప్రవేశపెట్టబడుతుంది.

iii) దీర్ఘకాలిక కోశ విధానం ప్రస్తుతం అమలులో ఉన్న పరోక్ష పన్నుల స్థానంలో మూల్యానుగతమైన పన్నును ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా ప్రతిపాదించింది. పరోక్షపన్నుల విధానంలో ఇట్టి తీవ్రమైన మార్పును వెంటనే తీసుకురావడం సాధ్యం కాదు కనుక కొంచెం మార్పు చేయబడిన మూల్యానుగత పన్నును వెంటనే ప్రవేశపెట్టాలని ప్రతిపాదిస్తోంది. ఈ పద్ధతి ఉత్పాదకాలపై పన్ను విధింపును తొలగించి పరోక్ష పన్నుల విఘాత ప్రభావాలను తప్పిస్తుంది.

iv) చిన్న తరహా పారిశ్రామిక రంగానికి ప్రత్యేకపన్ను మినహాయింపులు ఇవ్వబడతాయి.

v) కస్టమ్స్ టారిఫ్ సంస్కరణల్లో ముఖ్యాంశం దిగుమతులను క్రమబద్ధం చేయడానికి దీనికి సంబంధించిన పరిణామాత్మకమైన అదుపులను క్రమేణా తగ్గించడానికి టారిఫ్‌లపై అధికంగా ఆధారపడటం.

పై పన్ను సంస్కరణలే కాక దొంగ వ్యాపారం, పన్ను ఎగవేత వంటి ఆర్థిక చెడుగులను అరికట్టడానికి కూడా దీర్ఘకాలిక కోశ విధానం అనేక చర్యలను సూచించింది. ఈ చర్యలు కఠినమైన అమలు, న్యాయ పరమైన లోపాలను పూడ్చడం,పన్ను విధింపుకు సంబంధించిన చట్టాలను సూక్ష్మమైనవిగా చేయడం మొదలగు అంశాలకు సంబంధించినవి.

దీర్ఘకాలిక కోశ విధానంలోని అనేక సలహాలు 1985-86, 1986-87 సం॥లకు చెందిన కేంద్ర బడ్జెట్ లో



BRAOU

అమలు పరుచబడ్డాయి. ఈ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరమైనది. దీర్ఘకాలిక ఆర్థిక విధానం భారతదేశ కోశ విధానపు ప్రాతిపదిక అంశాలను తెలియజేయడమే కాక దేశపు ప్రభుత్వ విత్తాంలోని భాగాలను నిర్ణయించుటకు కావలసిన ప్రమాణాలను పెరా మీటర్లను నిర్ణయిస్తుంది.

## 22.11 ముగింపు

ఏడవ పంచవర్ష ప్రణాళికలో "కోశ విధానం ప్రభుత్వరంగానికి అవసరమైన వనరులను పెంచడమే కాదు, పొదుపు, పెట్టుబడి, ధరలస్థాయి వ్యయాలు, వనరుల కేటాయింపు వంటి స్థూల చలాంకాలను ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనాలెన్నో ఇందు ఇమిడి ఉన్నాయి. ఈ సాధనాలు అత్యుత్తమ ప్రయోజనాలకై వాడబడాలి." అని వ్రాయబడినది. కోశ విధానం ఈ సరళిలోకి రావడానికి దీర్ఘకాలం పట్టింది. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ జోక్యం అతి తక్కువగా ఉండాలని సనాతన ఆర్థిక వేత్తలు నమ్మారు. ఈ ఆలోచన కోశ విధానానికి అతి తక్కువ పాత్రను ఇస్తుంది. ప్రభుత్వ పాత్ర సామూహిక అవసరాలను తీర్చడానికి, పంపిణీలో న్యాయాన్ని చేకూర్చడానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. కీన్సు ఆర్థిక విశ్లేషణ ప్రాచుర్యంలోకి రాగానే కోశ విధానపు పాత్ర పెరిగింది. కీన్సు కోశ విధానం "విధుల ననుసరించిన విత్తము (functional finance) " అను భావనలో సుస్పష్టంగా చెప్పబడినది. అయితే కీన్సు విశ్లేషణ గాని ఆ తర్వాతి వివరణగాని చేసిన విధాన సలహాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తించవు. ఎందుకంటే ఈ దేశాలు వృద్ధి, అభివృద్ధులకు అధిక ప్రాధాన్యమివ్వాలిగాని ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి కావలిసిన లోటును పూడ్చేపాత్రను వహిస్తేచాలదు.

1951 వ సం॥ నుండి భారత కోశ విధానం వృద్ధి, స్వావలంబన, సాంఘిక న్యాయం పెంచడం వైపుకే దృష్టిని కేంద్రీకరించింది. కాని కోశ విధానపు సాధన కోశపరమైన స్థూల చలాంకాల పరిమాణాత్మ విస్తరణకు సహాయపడినప్పటికీ ఎన్నో విషయాల్లో లోటుపాట్లు కనిపించాయి. మొత్తంమీద కోశ విధానపు సామర్థ్యం తక్కువనే చెప్పాలి. ఏడవ పంచవర్ష ప్రణాళిక దీర్ఘకాలిక కోశ విధానం భారత కోశ విధానానికి నూతనశక్తిని కలుగజేస్తున్నాయి.

చివరగా జొసెఫ్, ఎ. షూంపీటర్ మాటను గమనిద్దాం. " ......కోశ చర్యలు ఆర్థిక ఆర్గానిజం (organism) ను సెల్లు (cells) వరకూ ప్రభావితం చేస్తాయి. ఒక నిర్ణీత మొత్తాన్ని ఏ పద్ధతి ద్వారా సంపాదిస్తున్నామనే విషయం స్తంభనకు ప్రోత్సాహానికి గల తేడాను నిర్ణయిస్తుంది.

BRAOU

రచన – ఆచార్య ఎస్. సారుప్రియ

అనువాదం – ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం

## 22.12 సంప్రదించు పుస్తకాలు


1 B.P. Thyagi : Public Finance

2. H.L. Bhatia : Public Finance

3. R. J.Chellaiah : Fiscal policy in under developed Countries


## 22.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. కోశ విధానమంటే ఏమిటి? కోశ విధానపు పరిణామాన్ని సంగ్రహంగా తెల్పుము.

2. కోశ విధానంపై సనాతన ఆర్థికవేత్తల అభిప్రాయాలను తెల్పుము?
3. పరిహారాత్మక విత్తము (compensatory finance) విధులననుసరించి విత్తము (functional finance) అనే భావనలను వివరింపుము.
4. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో కోశ విధానపు లక్ష్యాలేవి? ఇట్టి దేశంలో కోశ విధానం ఎలా పని చేస్తుందో వివరించుము.
5. భారతదేశంలో కోశ విధానపు సాధనను విమర్శనాత్మకంగా చర్చింపుము.
6. భారతదేశంలో ముఖ్యమైన కోశ సమస్యలను వివరింపుము.
7. భారతదేశంలో కోశ విధానపు పాత్ర, ప్రాముఖ్యతలను గూర్చి మీ అభిప్రాయాలను తెల్పండి.
8. దీర్ఘకాలిక కోశ విధానాన్ని గూర్చి సంగ్రహంగా వ్రాయుము.
9. భారతదేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న కోశ నిర్మాణాన్ని వివరించుము.
10. భారతదేశంలో ఆర్థికవిధాన లక్ష్యాలను సాధించడానికి వివిధ కోశ సాధనాలు ఎలా వాడబడుతన్నాయో తెలుపుము

II. ఈ క్రింది వాటికి 15 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. కోశ విధానపు లక్ష్యాలేవి?
2. అభివృద్ధి చెందుతున్న దేశానికి, అభివృద్ధి చెందిన దేశానికి భిన్నమైన కోశ విధానంఎందుకు అవసరం?
3. భారతదేశాన్ని దృష్టిలో యుంచుకొని 'వనరుల సమీకరణ' అంటే ఏమిటి?
4. ప్రతిదేశం జంట లక్ష్యాలైన స్థిరత్వం, వృద్ధి సాధించడాకి ఎందుకు ఆతృత చెందాలి.
5. లోటుద్రవ్య ఆర్థిక విధానమంటే ఏమిటి; మనమెప్పుడు ఈ విధానాన్ని ఆచరించకూడదనేటంత చెడ్డదా ఈ విధానం?
6. కోశ విధానపు వివిధ సాధనాలేమిటి? వాటి ప్రాముఖ్యతను వివరింపుము.
7. మన ప్రణాళికల విజయం కోశ విధానపు సాధనతో ఎందుకు ముడిపడి ఉంది?
8. భారతదేశంలో పన్నుల విధానాన్ని క్లుప్తంగా వివరింపుము.
9. భారతదేశ కోశ విధానాన్ని వివరింపుము.

BRAOU

●●●

# భాగం – 23 : బడ్జెటు తయారీ

విషయక్రమం


23.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
23.1 పరిచయం
23.2 "బడ్జెటు" అనే పదం పుట్టుక
23.3 బడ్జెటు ప్రయోజనాలు
23.4 సంతులిత, అసంతులిత బడ్జెట్ లు
23.5 సంతులిత బడ్జెట్ – అనుకూల వాదన
23.6 అసంతులిత బడ్జెట్ – అనుకూలవాదన
23.7 భారతదేశంలో బడ్జెటు తయారీ
23.8 బడ్జెటు లావాదేవీల ఆర్థిక వర్గీకరణ
23.9 ముగింపు
23.10 సంప్రదింపు గ్రంథాలు
23.11 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 23.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

బడ్జెటుకు సంబంధించిన వివిధ అంశాలను భారతదేశంలో బడ్జెటు తయారీ పద్ధతిని ఈ ఖండిక చర్చిస్తుంది. ఈ ఖండిక చదివిన తర్వాత

- బడ్జెటు ప్రయోజనాలు తెలుసుకుంటారు.
- సంతులిత అసంతులిత బడ్జెటుల మధ్య తేడా తెలుసుకుంటారు
- సంతులిత అసంతులిత బడ్జెటుల అనుకూల వాదనలను విశ్లేషించగలుగుతారు.
- భారతదేశపు బడ్జెటు లావాదేవీల ఆర్థిక మరియు వర్గీకరణ తెలుసుకుంటారు.

BRAOU

## 23.1 పరిచయం

స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతంపై సే మార్కెటు సూత్రంపై గల విశ్వాసం వల్ల సనాతన ఆర్థికవేత్తలు సంతులిత బడ్జెటును దృఢమైన కోశ సూత్రంగా భావించారు. కాని కీన్స్ ఆర్థిక విధానం పరిపూర్ణ ఉద్యోగిత సాధనకు లోటు బడ్జెటు అవసరం కావచ్చునని తెలిపింది. కాలక్రమేణా సంతులిత బడ్జెటు సిద్ధాంతం నెట్టి వేయబడి అసంతులిత బడ్జెటు విధానంఉపయోగకరమైనదిగా భావించబడింది. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ స్థాయిలో రైల్వే బడ్జెటు, సాధారణ బడ్జెటు వుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో సూక్ష్మమైన బడ్జెటు వుంటుంది.

## 23.2 "బడ్జెటు" అనే పదం పుట్టుక

బడ్జెటు అనే పదం ఫ్రెంచి పదమైన "బగెట్" (Bougette) నుండి పుట్టింది. దీని అర్థం తోలు సంచి. ఈ మాట 1773 సం॥ నుండి వాడుకలోనికి వచ్చింది. చన్స్‌లర్ ఆఫ్ ఎక్సకర్ (Chancellor of Exchequer) కు

కోశ సంబంధమైన కాగితాలను హౌస్ ఆఫ్ కామన్స్ (House of Commons) కు తీసుకువెళ్ళడానికి ఒక తోలు సంచీ వుండేది. అతడు తన కోశ ప్రణాళికను సభ ముందు వుంచేటప్పుడు తన బడ్జెటు అనగా తోలుసంచిని తెరిచేవాడు.

## 23.3 బడ్జెటు వల్ల ప్రయోజనాలు

బడ్జెటు తయారు చేయడం ఒక దేశపు విత్త మంత్రి చేపట్టు సాలుసరి కోశానికి సంబంధించిన ఒక అభ్యాసం, దీనిలో కొన్ని ముందే నిర్ణయింపబడిన గమ్యాలు చేరడానికి పాటుపడే అసంఖ్యాకాలైన ప్రభుత్వ సేవలకు సమర్థవంతముగా ఆరుదైన వనరులను కేటాయిచడం యిమిడి వుంటుంది. బడ్జెటు పన్ను విధింపు పరిధి, విస్తారాలను, ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను నిర్ణయిస్తుంది. ఇదిదీర్ఘ అల్పకాలికవిధానాల తయారీకి ఆ విధానపు ఆచరణను తెలియజేయడానికి ఉపకరిస్తుంది. ఇది ప్రభుత్వ కార్యకలాపాలను వెలుగు లోనికి తెచ్చి శాసనసభ (Legislature) కు ముందు చూపు కలిగేటట్లు చేస్తుంది. విధానాన్ని చర్చించడానికి ఉపకరిస్తుంది. ప్రభుత్వ సేవల అసమాన పెరుగుదలను అరికడుతుంది. అంతేకాక బడ్జెటు సరియైన కొలబద్దలను నిర్ణయించడం ద్వారా మిత వ్యయంతో కూడిన సమర్థవంతమైన నిర్వహణకు సహకరిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థ నిజస్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రజల పన్నులు భరించే శక్తి, జాతీయదాయం పెరుగదల, పొదుపు, పెట్టుబడి రేటుల,ఉద్యోగితా పరిమాణం, ఆర్థిక వ్యవస్థ పయనిస్తున్న దిశ మొదలగు అంశాలెన్నో జాతీయ బడ్జెటులో ప్రతిబింబిస్తాయి.. బడ్జెటులో ప్రతిబింబించే వివిధ ప్రభుత్వ సేవలకు ఇవ్వబడిన ప్రాముఖ్యతలు,ప్రభుత్వ వ్యయపరిమాణం, వివిధ ప్రభుత్వకార్యకలాపాలకు దాని కేటాయింపు, ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిని తెల్పడమే కాక కోశ సాధనాల ద్వారా ప్రభుత్వం సాధించతలచిన లక్ష్యాలను కూడా తెల్పుతాయి.

ఈ మధ్యకాలంలో తీవ్రమైన క్రమమైన ఆర్థిక ప్రగతిని సాధించడానికి, సాంఘిక మార్పులను తీసుకురావడానికి అవసరమైన ప్రత్యక్ష, పరోక్ష సాధనాలను తనలో ఇముడ్చుకొని ప్రయివేటు రంగ కార్యకలాపాలు కోరదగిన గమ్యాలను చేరడానికి కావలసిన అదుపులను నిర్ణయించి బడ్జెటు అమూల్యమైన సాధనంగా తయారైంది.

## 23.4 సంతులిత, అసంతులిత బడ్జెట్‌లు

ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, అదే సమయంలో ప్రభుత్వ వ్యయం రెండూ సమానంగా వున్న బడ్జెటును "సంతులిత బడ్జెట్" అంటారు. అలా కాక ప్రభుత్వ ఆదాయవ్యయాల మధ్య తేడా గణనీయంగా యున్నచో దానిని "అసంతులిత బడ్జెటు" అంటారు. అసంతులిత బడ్జెటులో "మిగులు బడ్జెటు", "లోటు బడ్జెటు" అని రెండు రకాలు వున్నాయి. అసంతులిత బడ్జెటులో వర్తమాన వ్యయంకన్న ఆదాయమే హెచ్చుగా నున్న దానిని మిగులు బడ్జెటు అంటారు. అలా కాక వర్తమాన ఆదాయంకన్న వ్యయమే హెచ్చుగా నున్న దానిని లోటు బడ్జెటు అంటారు. సంతులిత బడ్జెటులో ఋణాంకు తావుండదని పై భావనలవల్ల తెలుస్తోంది.

## 23.5 సంతులిత బడ్జెటు – అనుకూల వాదన

సనాతన ఆర్థికవేత్తలు ప్రభావ శూన్యమైన కోశ విధానాన్ని సమర్థించారు. దీని ప్రకారం ప్రభుత్వరంగం అతి తక్కువగా వుండి ప్రభుత్వ విధులు సాధ్యమైనంత వరకూ తగ్గించబడతాయి. దీని వల్లమార్కెటు యంత్రాంగం ఫంక్షనరమైన ఆటంకాలు లేకుండానిర్వహించబడుతుంది. స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం నందునూ, సే మార్కెటు సూత్రం నందునూ విశ్వాసముండుటవల్ల చాల చిన్న పరిమాణంలో వుండే ప్రభుత్వ బడ్జెటు ఉత్తమ మైనదని భావించారు. దీని కారణమేమంటే, పరిపూర్ణ ఉద్యోగిత, వనరుల అభిలషణీయమైన కేటాయింపు, సమాన



BRAOU

3. 'సంతులిత బడ్జెట్' ను నిర్వచించండి.
4. మిగులు బడ్జెట్, లోటు బడ్జెట్‌ల మధ్య తేడా ఏమిటి?

## 23.7 భారతదేశంలో బడ్జెటు తయారీ

భారతదేశంలో బడ్జెటును సాలుసరి కోశ నివేదిక (Annual Fiscal Statement) అంటారు. బ్రిటన్, ఫ్రాన్సు దేశాల్లోవలె భారతదేశంలో దేశానికంతటికూ ఒకే బడ్జెటు ఉండదు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోనూ కూడా బడ్జెటులుంటాయి. కేంద్ర ప్రభుత్వానికి రైల్వే బడ్జెటు, సాధారణ బడ్జెటు అని రెండు బడ్జెటులుంటాయి.

రైల్వే బడ్జెటు రైల్వే మంత్రిత్వశాఖకు చెందిన కోశపరమైన అంచనాలను కలిగి వుంటుంది. సాధారణ బడ్జెటు మిగిలిన అన్ని ఏజన్సీల కోశ అంచనాలను కల్గివుంటుంది. రైల్వే బడ్జెటు రైల్వే మంత్రిత్వ శాఖచేతయారు చేయబడి సాధారణ బడ్జెటు కంటె ఒక వారం ముందుగా రైల్వే మంత్రిచే పార్లమెంటుకు సమర్పించబడుతుంది. సాధారణబడ్జెటు విత్తమంత్రిచే తయారు చేయబడి అతని చేతనే పార్లమెంటుకు సమర్పించబడుతుంది, రైల్వేల ఆదాయ వ్యయాలు కేంద్ర ప్రభుత్వ బడ్జెటు నివేదికలో చేర్చబడాతాయి.

రైల్వే అంచనాలు తీవ్రమైన హెచ్చు తగ్గులకు లోనయ్యే స్వభావం కలవగుటచే సాధారణ బడ్జెటులో స్థిరత్వాన్ని పరిరక్షించేటందుకు 1924 వ సం॥లో రైల్వే విత్తం సాధారణ విత్తం నుండి వేరు చేయబడినది. ఈ వేర్పాటు సాంప్రదాయం (Separation Convention) ప్రకారం రైల్వేలు సాలుసరిమూలధన పెట్టుబడిలో ఒక నిర్ణీత రేటులో సాధారణ ఆదాయాలకు తోడ్పడాలి. రైల్వే అంచనాల్లో రైల్వే ఆస్తుల నవీకరణాలు, పునఃస్థాపనకగు వ్యయాలు (Cost of Replacement and Renewal) , ప్రయాణీకుల సౌకర్యాలకగు వ్యయం, శ్రామికుల శ్రేయస్సు, లాభసాటి కాకపోయినా అవసరమైన పథకాలపై వ్యయాలు పొందుపరచబడతాయి.

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలు మూడు భాగాలుగా వుంటాయి. అవి 1. ఏకీకృత నిధి (Consolidated Fund) 2. అగంతుక నిధి (Contingency Fund) 3. ప్రభుత్వ ఖాతా (Public Account).

ఏకీకృత నిధి అనగా ప్రభుత్వపు అన్ని ఆదాయాలు (ఋణ ఆదాయాలతో సహా) జమపర్చబడే నిధి. ప్రభుత్వ వ్యయమంతా ఈ నిధి నుంచే చేయబడుతుంది. పార్లమెంటు లేదా శాసనసభ మంజూరు లేనిదే ఏకీకృత నిధి నుంచి వ్యయం చేయరాదు. అయితే భారతరాజ్యాంగంలో పేర్కొనబడినకొన్ని నిర్ణీత అంశాలపై వ్యయాలకు ఇట్టి మంజూరు అవసరం లేదు. సుప్రీం కోర్టు (Supreme Court) , హైకోర్టు (High Court) న్యాయమూర్తుల జీతాలు, భారతకంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (Controller and Auditor General of India) జీతం ఇట్టి అంశాల్లోనే చేరతాయి. ఈ అంశాలు బడ్జెటులో చేర్చబడతాయి. కాని పార్లమెంటు లేదా శాసనసభ ఓటింగు కొరకు వుంచబడవు. అగంతుక నిధి భారత అధ్యక్షుని లేదా రాష్ట్ర గవర్నరు ప్రత్యక్ష నియంత్రణలో వుంటుంది. ఈ నిధి ఊహించని (Unforeseen) వ్యయాలకు వాడబడి తరువాత పార్లమెంటులేదా శాసనసభ అంగీకారం తీసుకోవచ్చును. ప్రస్తుతం భారత ప్రభుత్వపు పార్లమెంటుచే అధీకృతమివ్వబడిన అగంతుక నిధి రూ.30 కోట్లు.

ప్రభుత్వ ఖాతా (Public Account) లోని నిధులు ప్రభుత్వానికి చెందవు. ప్రావిడెంటు ఫండు, చిన్న పొదుపులు మొ॥ అంశాల మూలంగా వసూలైన మొత్తాలు ఈ నిధిలోకి వస్తాయి. ఈ నిధుల నుండి చెల్లింపులకు శాసనసభ మంజూరు అవసరం లేదు.

BRAOU

## 23.8 బడ్జెటు లావాదేవీల ఆర్థిక వర్గీకరణ

భారతదేశంలో 1957-58 సంll లో కేంద్ర బడ్జెటు ఆర్థికవర్గీకరణ ప్రవేశపెట్టబడినది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలు రెవిన్యూ ఖాతా, మూలధనం ఖాతాలుగా విభజింపబడ్డాయి. రెవిన్యూ ఆదయాలు రొటీన్ (routine) మరియు అవృతమయ్యే స్వభావం కలవి. మూలధనం ఆదాయలలో మార్కెటు ఋణాలు, ప్రభుత్వ సంస్థల ఆదాయాలు మూలధన ఆస్తులనుండి వచ్చిన ఆదాయాలు, విదేశీ సదుపాయాలు ముఖ్యమైనవి.

మూలధనం ఆస్తుల నిర్మాణం జరగని వ్యయాలు రెవెన్యూ వ్యయాల క్రిందకూ వస్తాయి. ఈ వ్యయాలు అవృతమయ్యే స్వభావం కలవి. ఈ వ్యయాలు రెవిన్యూ ఆదాయాలనుంచి చేయబడతాయి. భారతదేశంలో పౌర నిర్వహణ, రక్షణ, వడ్డీ చెల్లింపులు, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయక గ్రాంట్లు (grants-in-aid) కేంద్ర ప్రభుత్వపు రెవెన్యూ వ్యయంలోని అంశాలు.

రెవెన్యూ వ్యయంలో అభివృద్ధి వ్యయం (Developmental Expenditure), అభివృద్ధేతర వ్యయం (Non Development Expenditure) అని రెండు వర్గాలున్నాయి. అభివృద్ధి వ్యయంలో ఈ క్రింది అంశాలుంటాయి.

i) విద్య, వైద్యము, ప్రజారోగ్యము వంటి సాంఘిక సామాజిక సేవలపై వ్యయం;

ii) వ్యవసాయం, తదనుబంధ సేవలు (ఆహార సబ్సిడీలతో సహా) పరిశ్రమలు, గనులు, రవాణా, కమ్యూనికేషన్లు, విదేశీ వ్యాపారం,ఎగుమతులు ప్రోత్సాహం, నీరు విద్యుత్తుల అభివృద్ధి మొదలగు అంశాలపై వ్యయాలు.

iii) రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయక గ్రాంట్లు.

అభివృద్ధేతర వ్యయంలోకి పన్నులు సుంకాల వసూళ్ళు, నిర్వహణ సేవలు, ఋణ చెల్లింపులు, రక్షణ, రాష్ట్రాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు అభివృద్ధేతర ప్రయోజనాలకై యిచ్చే సహాయకగ్రాంట్లు మొదలగు అంశాలపై వ్యయాలు చేర్చబడతాయి.

మూలధన పథకాలు (Capital projects), అనశ్వర (durable) పెట్టుబడి వస్తువులపై వ్యయాలు మూలధన వ్యయాలకోవకు చెందుతాయి.కేంద్ర ప్రభుత్వపు పెట్టుబడులు, రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు,, ప్రభుత్వ సంస్థలకు మూలధన వ్యయాల నిమిత్తమై అందజేయబడిన ఋణాలు, అడ్వాన్సులు కూడా మూలధన వ్యయం క్రిందకే వస్తాయి. ఈ వ్యయాలు మూలధన ఆదాయాలనుండి చేయబడతాయి. ఒక్కొక్కప్పుడు రెవెన్యూ ఖాతాలోని మిగుళ్ళు మూలధనఖాతాలోకి తీసుకోబడతాయి. 1991-92 సంll కేంద్ర బడ్జెటు వివరాలను 1వ పట్టికలో చూడండి.

మూలధన వ్యయాన్ని అభివృద్ధి వ్యయం, అభివృద్ధేతర మూలధన వ్యయం, అప్పులు, అడ్వాన్సులు, ఋణ చెల్లింపులు అని కూడా వర్గీకరిస్తారు. అభివృద్ధి వ్యయంలోకి (i) పరిశోధన, వైద్యము, ప్రజారోగ్యం, నీటి సరఫరా, గృహనిర్మాణం మొదలగు సాంఘిక, సామాజికసేవలు, (ii) వ్యవసాయం, తదనుబంధ సేవలు, పరిశ్రమలు, గనులు, నీరు, విద్యుచ్ఛక్తి, రవాణా, కమ్యూనికేషన్లు,రైల్వేలు, తంతి, తపాలా మొదలగు ఆర్థిక సేవలు చేరతాయి. అభివృద్ధేతర మూలధన వ్యయంలో రక్షణ పథకాలపైనా; కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకూ కేంద్ర పాలిత ప్రాంతలకూ, ప్రభుత్వ సంస్థలకూ ఇచ్చిన అప్పులు అడ్వాన్సులపైనా వ్యయాలు చేరతాయి. దేశీయ విదేశీ ఋణాల చెల్లింపులు మూలధన



B R A O U

బడ్జెటులో (Capital Budget) వేరుగా చూపబడతాయి.

ఇంతేకాక కేంద్ర బడ్జెటులో ప్రణాళికా బడ్జెటు (Plan Budget) అని వేరుగా వుంటుంది. దీనిలో కేంద్ర ప్రణాళికలో చేర్చబడిన ముఖ్యమైన పథకాలకు కార్యక్రమాలకు కేటాయించబడిన మొత్తం చూపబడుతుంది. కేంద్ర ప్రణాళికకు రంగాల వారీగా బడ్జెటు సమకూర్చే విధులను (రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర సహకారంతో సహా) వివరంగా తెలుపుతుంది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

1. సాధరణ బడ్జెట్ నుండి రైల్వే బడ్జెటు ఎందుకు వేరు చేయబడింది.
2. ఏకీకృత నిధి అంటే ఏమిటి?
3. అగంతుకనిధి అంటే ఏమిటి? దానిని ఎలా నిర్వహిస్తారు.
4. రెవెన్యూ ఖాతా అంటే ఏమిటి?
5. మూలధన ఖాతా అంటే ఏమిటి?

## 23.9 ముగింపు

సనాతన ఆర్థికవేత్తలు కోశ విధానం ప్రభావశూన్యం కావాలని నమ్మినారు. దీని ప్రకారం ప్రభుత్వరంగపు పరిమాణం, ప్రభుత్వ విధులు తక్కువగా వుండాలి. వీరి దృష్టిలో ప్రభుత్వపు కోశ చర్యలు జోక్యం లేకుండేటట్లు, క్రమబద్ధతను నియమింకుండే టట్లు వుండాలి. ఆదాయ పంపిణీ తీరు ఉత్పాదక వనరుల ప్రవాహాలను చెదరగొట్టదనే ఉద్దేశ్యంతో వీరు సంతులిత బడ్జెటును బలపరిచారు. కాని సనాతన కోశ విధానపు సూత్రాలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు సరిపడవు. ఎందుకంటే వీటిలో అనేక కారణాల వల్ల మార్కెటు యంత్రాంగం సమర్థవంతంగా పనిచెయ్యదు. సంతులిత బడ్జెటుకూ, అసంతులిత బడ్జెటుకు కూడా అనుకూలమైన వాదనలెన్నో వున్నా అసంతులిత బడ్జెటు విధానమే ప్రస్తుతం ప్రముఖ పాత్ర వహిస్తోంది. సనాతన ఆలోచనకు వ్యతిరేకంగా సంతులిత బడ్జెటు కూడా కొన్ని సందర్భాల్లో ఆదాయంపై గుణక ప్రభావాన్ని కలుగజేస్తుందని నవీన సిద్ధాంతం ఋజువు చేసింది. ఇప్పుడు అమలులో వున్న బడ్జెటు విధానం చాలా క్లిష్టతరమైనది.

భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ స్థాయిలో రైల్వే బడ్జెటు, సాధారణ బడ్జెటు అని రెండు బడ్జెటులున్నాయి. ప్రభుత్వ ఖాతాలు ఏకీకృతనిధి (consolidated fund), అగంతుక నిధి (contingency fund), ప్రభుత్వ ఖాతా (public account) అని మూడు భాగాలుగా వుంటాయి. 1957–58 సం॥లో ప్రవేశపెట్టబడిన బడ్జెటరీ లావాదేవీల ఆర్థికవర్గీకరణ నేటికిని కొనసాగుతోంది.

రచన : డా॥ కె. శివసుబ్రహ్మణ్యం.
అనువాదం : ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం

BRAOU

## 1వ పట్టిక : 1991 – 92 సంవత్సరపు బడ్జెటు

| | రాబడి (కోట్ల రుపాయలలో) | 1989–90 | 1990–91 | 1991–92 |
|---|---|---|---|---|
| 1. | రాబడి ఖాతా | 52.3 | 57.4 | 67.5 |
| | పన్ను రాబడి | 38.3 | 44.3 | 52.5 |
| | ఇతరమార్గాలనుండి రాబడి | 13.9 | 13.1 | 15.0 |
| 2. | మూలధన ఖాతా | 30.0 | 38.6 | 38.2 |
| | ఋణాల వసూళ్ళు | 5.0 | 6.0 | 5.7 |
| | ఇతర ఆదాయాలు | – | – | 2.5 |
| | ఋణాలు | 25.0 | 32.6 | 30.0 |
| 3. | మొత్తం రాబడి ( 1+2) | 82.3 | 95.9 | 105.7 |
| | **లోటు** | | | |
| | రాబడి లోటు | 11.9 | 17.6 | 13.9 |
| | రాబడి ఖాతాపైవ్యయం | 64.2 | 75.0 | 81.4 |
| | రాబడి ఖాతా ఆదాయం | 52.3 | 57.4 | 67.5 |
| | బడ్జెట్ లోటు (నికర రిజర్వు బ్యాంకు ఋణాలు) | 10.6 | 10.8 | 7.7 |
| | మొత్తం వ్యయం (ప్రణాళిక మరియు ప్రణాళికేతర) | 92.9 | 106.7 | 113.4 |
| | మొత్తం రాబడి (రాబడి ఖాతా మరియు మూలధన ఖాతా) | 82.3 | 95.9 | 105.7 |
| | ద్రవ్య లోటు | 35.6 | 43.4 | 37.7 |
| | ఋణాలు | 25.0 | 32.6 | 30.0 |
| | బడ్జెటు లోటు | 10.6 | 10.8 | 7.7 |

| | వ్యయం (కోట్ల రుపాయలలో) | 1989–90 | 1990–91 | 1991–92 |
|---|---|---|---|---|
| 1. | ప్రణాళికా వ్యయం | 28.4 | 29.9 | 33.7 |
| | రాబడి ఖాతా | 12.1 | 14.0 | 17.1 |
| | మూలధన ఖాతా | 16.3 | 15.9 | 16.6 |
| 2. | ప్రణాళికేతర వ్యయం | 64.5 | 76.8 | 79.7 |
| | రాబడి ఖాతా | 52.1 | 61.0 | 64.3 |
| | మూలధనఖాతా | 12.4 | 15.8 | 15.4 |
| 3. | మొత్తం వ్యయం (1+2) | 92.9 | 106.7 | 113.4 |
| | రాబడి ఖాతా | 64.2 | 75.0 | 81.4 |
| | మూలధన ఖాతా | 28.7 | 31.7 | 32.0 |

BRAOU

## 23.10 సంప్రదింపు గ్రంథాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance


## 23.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానం వ్రాయండి.

1. సంతులిత బడ్జెట్‌ను గూర్చి సనాతన ఆలోచనలను విమర్శనాత్మకంగా వివరింపుము.
2. భారతదేశంలో బడ్జెట్ తయారీని వివరింపుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానం వ్రాయండి.

1. సంతులిత బడ్జెటుకు అనుకూలమైన భావనలు ఏమి?
2. అసంతులిత బడ్జెటుకు అనుకూలమైన భావనలను వివరింపుము.

●●●

BRAOU

# భాగం – 24 : భారతదేశంలో విత్త సమీకరణ – అభివృద్ధి విత్తం

**విషయక్రమం**

24.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
24.1 పరిచయం
24.2 విధులననుసరించిన విత్తం అర్థం
24.3 అభివృద్ధి విత్తం – అర్థం
24.4 అభివృద్ధి విత్త మూలాల వర్గీకరణ
a). దేశీయ వనరులు
b). బాహ్య లేదా విదేశీ వనరులు
24.5 ముగింపు
24.6 సంప్రదింపు గ్రంథాలు
24.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 24.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

అభివృద్ధి విత్తం భావనను, భారతదేశంలో వివిధ అభివృద్ధి విత్త మూలాలను గూర్చి ఈ భాగం చర్చిస్తుంది. ఈ భాగంను చదివిన తరువాత, మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- విధులననుసరించిన విత్తం, అభివృద్ధి విత్తం భావనలు
- అభివృద్ధి విత్తం స్థూలంగా దేశీయ వనరులు, విదేశీ వనరులుగా వర్గీకరణ
- ఈ రెండు తరగుతుల వనరుల ప్రాధాన్యత పరిశీలన

B R A O U

## 24.1 పరిచయం

కొందరు ఆర్థికవేత్తలు అబ్బా పి. లెర్నర్ అడుగుజాడల్లో ప్రభుత్వ విత్తం విధులననుసరించిన విత్తమై వుండాలనీ అందువల్ల పరిపూర్ణ ఉద్యోగిత, ధరల స్థిరీకరణ సాధించవీలగునని పట్టుబడుతున్నారు. వీరు ఆదాయానికి చెందిన అంశాలను నిర్లక్ష్యం చేస్తూ పన్ను విధింపు, ప్రభుత్వ రుణాలు, ప్రభుత్వ వ్యయం పై లక్ష్యాల సాధనకు తోడ్పడేటట్లు చూడలని వాదిస్తున్నారు. అయితే విధులననుసరించిన విత్త విధానం అభివృద్ధి చెందుతున్న దేశాలకు సరిపోదు. ఎందుకంటే ఈ దేశాల్లో కోశ చర్యలు ధరల స్థిరీకరణను సాధించడమే కాక ఆదాయ సమీకరణ, మూలధన కల్పన, పునః పంపిణీ, న్యాయంతో కూడిన వృద్ధి సాధించడానికి కూడ తోడ్పడాలి. దీని వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అభివృద్ధి విత్త విధానం అవసరమౌతుంది. పన్ను విధింపు, ప్రభుత్వ రుణం, ప్రభుత్వ సంస్థల మిగుళ్ళు, లోటుదారీ ఆర్థిక విధానం వంటి వివిధ ఆదాయ మూలాల మేలు కలయిక ద్వారా అభివృద్ధి విత్త గమ్యాలకు చేరుకోవాలి.

## 24.2 విధులననుసరించిన విత్తం – అర్థం

విధులననుసరించిన విత్త విధానం సాలుసరి సంతులిత బడ్జెటు విధానానికి పూర్తి వ్యతిరేకం. సంతులిత బడ్జెటు

విధానంలో నియంత్రణ (Control) క్రమబద్ధతల (Regulation) ఆధారంగా కోశ కార్యకలాపాలు నిర్వహింపబడగా విధులననుసరించిన విత్త విధాన పద్ధతి బడ్జెటు సంతులనానికి సంబంధం లేకుండా స్థూల ఆర్థిక గమ్యాలను చేరుకోవచ్చని తెలుపుతుంది. సాంప్రదాయక సంతులిత బడ్జెటు విధానం వలె గాక విధులననుసరించిన విత్త విధానంలో కేటాయింపు, పునఃపంపిణీలకు తక్కువ ప్రాధాన్యమిస్తూ సమిష్టి ఆర్థిక వృద్ధి లక్ష్యాలకు అధిక ప్రాధాన్యమిస్తుంది.

విధులననుసరించిన విత్త భావన కీన్సు ఆర్థిక సిద్ధాంతం ఆధారంగా కల్పించబడినది. దీని ప్రకారం ఆర్థిక వ్యవస్థ ధరల స్థిరత్వంతో కూడిన పరిపూర్ణ ఉద్యోగిత వద్ద నిర్వహించబడుటకు సహాయపడటం ప్రభుత్వ విత్తపు ప్రాథమిక విధి. విధులననుసరించిన విత్త విధానాన్ని అబ్బా పి. లెర్నర్ ప్రతిపాదించెను. ప్రభుత్వ వ్యయం, పన్ను విధింపు, ఋణాలు చేయడం, ఋణాల చెల్లింపు, క్రొత్త ద్రవ్యపు జారీ, ద్రవ్యాన్ని చలామణీ నుంచి తొలగించడం వంటి అన్ని ప్రభుత్వ కోశ చర్యలు జాతీయాదాయంపై వాటి ప్రభావాలను దృష్టిలో వుంచుకొన్నాకే తీసుకోబడాలని వీరి వాదన. ఈ విధంగా లెర్నర్ ప్రకారం విధులననుసరించిన విత్తమనగా" కోశ చర్యలను ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావాన్ని బట్టి నిర్ణయించు సూత్రం".

## 24.3 అభివృద్ధి విత్తం – అర్థం

విధులననుసరించిన విత్తంవలె కాక అభివృద్ధి విత్తం (Development Finance) అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ సాంఘిక న్యాయంతో కూడిన తీవ్ర వృద్ధిని కోశ చర్యల ద్వారా సాధించడానికి సంబంధించినది. ఇది ప్రతి చక్రీయ కోశ విధానం కాదు. ఈ పద్ధతి ప్రకారం కోశ చర్యలు ఆర్థికాభివృద్ధి గమ్యాలను చేరుకొనేందుకు అవసరమైన మూలధనకల్పన, పునఃపంపిణీ న్యాయం, ధరల స్థిరత్వం మొదలగు అంశాలపై చూపే ప్రభావాలను బట్టి సమర్థించబడతాయి.

## 24.4 అభివృద్ధి విత్త మూలాల వర్గీకరణ

అభివృద్ధి విత్త మూలాలు స్థూలంగా రెండు వర్గాలుగా వుంటాయి. అవి – దేశీయ వనరులు, బాహ్య లేదా విదేశీ వనరులు.

అ) దేశీయ వనరులు :

ప్రభుత్వం దేశంలో సమీకరించగల వనరులను దేశీయ వనరులంటారు. వీటిలో పన్ను విధింపు, ప్రభుత్వ సంస్థల మిగులు, లోటు దారీ ఆర్థిక వ్యవస్థ అనే వర్గాలున్నాయి.

I) పన్ను విధింపు :

పన్ను విధింపు వనరుల సమీకరణకు అతి ముఖ్య సాధనం. నిజానికి రష్యా, జపాను వంటి ఎన్నో దేశాలు తమ అభివృద్ధి తొలిదశల్లో ఈ మూలంపైనే ఆధారపడ్డారు. అభివృద్ధి విత్త సందర్భంలో పన్ను విధింపు స్థూలంగా రెండు లక్ష్యాలను సాధించాలి. అవి-వినియోగాన్ని నిరోధిస్తూ లేదా తగ్గిస్తూ వనరులను వినియోగం నుండి పెట్టుబడికి బదిలీ చేయడం; మరియు పెట్టుబడి తీరులో మార్పులు తేవడం.

### వినియోగాన్ని నిరోధించడం లేదా తగ్గించడం

ప్రత్యక్ష పరోక్ష పన్నులు రెండూ వినియోగ స్థాయిని తగ్గిస్తాయి. ప్రత్యక్ష పన్నులు ప్రజల వ్యయార్హ ఆదాయాన్ని తగ్గిస్తూ వినియోగాన్ని తగ్గిస్తాయి. పరోక్ష పన్ను వినియోగ వస్తువులను ఎక్కువ ఖరీదయినవిగా జేసి వినియోగాన్ని తగ్గిస్తాయి. ఆర్థికాభివృద్ధి ప్రజల ఆదాయాలను పెంచుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని



BRAOU

ప్రజల ఉపాంత వినియోగ ప్రవృత్తి చాల ఎక్కువగా అనగా 1కి దగ్గరగా వుండటం వల్ల ఉత్పాదకత పెరుగుదల వల్ల వచ్చే ఆదాయ పెరుగుదల వినియోగానికే వాడబడుతుంది. ఈ సమయంలో వస్తువులపై పన్ను విధింపు ద్వారా వినియోగంలోని పెరుగుదలను అరికట్టి వనరులను ప్రభుత్వ పెట్టుబడికి అందుబాటులో వుండేటట్లు చేయవచ్చును. అయితే వినియోగంలో ఇట్టి తరుగుదల విలాసాలకు, జీవితావసరాలు, కాని వస్తువులకు మాత్రమే వర్తించాలి. పరోక్ష పన్ను విధింపు ఆదనపు పొదుపు రేటును పెంచడానికే ఉపయోగపడాలి కాని జీవితావసరాల ఉత్పత్తిని తగ్గించరాదు. ఈ ప్రయోజనాన్ని సాధించడానికి పరోక్ష పన్ను విధింపును రెండువిధాలుగా వాడాలి. మొదటిదేమంటే, పరోక్షపన్ను విధింపు విలాస వస్తువుల ఉత్పత్తి విస్తరణను అరికట్టేందుకు వాడబడాలి. రెండవదేమంటే, పరోక్ష పన్ను విధింపును ఆదనపు ఉత్పత్తిలో కొంత భాగాన్ని వేతన వస్తు రంగం నుండి పెట్టుబడి వస్తు రంగానికి తరలించబడాలి. ఈ విధంగా వనరులను ప్రయివేటు వినియోగం నుండి ప్రభుత్వ పెట్టుబడికి తరలించడం ద్వారా అభివృద్ధి విత్తంలో పన్ను విధింపు పొదుపు పెట్టుబడి రేట్లను పెంచే సాధనంగా వాడబడుతుంది.

## పెట్టుబడి తీరులో మార్పులు

పన్ను విధింపు వనరులను ప్రయివేటు రంగం నుండి ప్రభుత్వ రంగానికి. ప్రయివేటు రంగంలో వినియోగవస్తువులను తయారుచేసే పరిశ్రమలనుండి పెట్టుబడి వస్తువులను తయారుచేసే పరిశ్రమలకు, డిమాండును దిగుమతి వస్తువులనుండి దేశీయ వస్తువులకు మార్చును.

పన్ను విధింపు తప్పనిసరిగా వనరులను ప్రయివేటు రంగం నుండి ప్రభుత్వరంగానికి తరలించును. అంతేకాక, విలాసాలపై పన్ను విధింపు, మూలధన వస్తువులకు పన్నుమినహాయింపువల్ల వనరులు ప్రయివేటురంగంలో వినియోగ వస్తువులను తయారు చేసే పరిశ్రమలనుండి పెట్టుబడి వస్తువులను తయారు చేసే పరిశ్రమలకు తరలించబడును. దిగుమతి సుంకాల వల్ల డిమాండు దిగుమతి వస్తువుల నుండి దేశీయ వస్తువులకు తరలించబడి తద్వార దేశీయ వస్తువులను తయారు చేసే పరిశ్రమల్లో పెట్టుబడి పెరుగుదలకు దారి తీస్తుంది. ఈ విధంగా పన్ను విధింపు అభివృద్ధి విత్తంలో పెట్టుబడి తీరులో మార్పులు తేవడానికి సాధనంగా వాడబడుతుంది.

అంతేకాక సరియైన విచక్షణతో కూడిన పన్ను విధానాన్ని అనుసరించడంవల్ల కూడా పెట్టుబడి తీరులో మార్పులు తీసుకురావచ్చును. ఉదాహరణకు 1) తిరిగి పెట్టుబడికి వాడబడిన లాభాలపై కంటె పంపిణీ చేయబడిన లాభాలపై అధికేతర రేట్లలో పన్నులు విధించడం ద్వారా సాంఘికంగా ఉపయోగకరమైన అభివృద్ధిని సాధించవచ్చును. 2). సాంఘిక ప్రాముఖ్యత గల పరిశ్రమలకు తరుగు నిమిత్తంగాని, క్రొత్త పెట్టుబడి నిమిత్తంగాని ప్రభుత్వం ఇచ్చే ఎలవెన్సులను పెంచవచ్చును. అదే మాదిరిగా సాంఘిక ప్రయోజనం లేని పరిశ్రమల విషయంలో అట్టి ఎలవెన్సులు తగ్గించడం గాని, తొలగించడం కాని చేయవచ్చును. 3). దిగుమతి చేయబడిన పరికరాలు గాని, సామాగ్రి గాని అవసరమైన పరిశ్రమలు విశయంలో విభిన్నమైన దిగుమతి సుంకాల విధానం ద్వారా ప్రభుత్వం పెట్టుబడి పరిమాణాన్ని, దిశను నియంత్రణ చేయవచ్చును. ఒక విధంగా అభివృద్ధి ప్రణాళిక విషయంలో ప్రభుత్వం విచక్షతో కూడిన పన్ను విధానం ద్వారా ఒక ప్రక్క నియంత్రణను, మరయొక ప్రక్క ప్రోత్సాహకాలను కలుగజేస్తూ, ప్రైవేటు వ్యవస్థాపనా స్వేచ్ఛను దెబ్బతినకుండా చూడవచ్చును.

కాని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పన్ను విధింపు పరిధి చాలా తక్కువగా ఉంటుంది. తత్ఫలితంగా పన్ను విధింపు జాతీయాదాయంలో చాలా తక్కువ శాతం ఉంటుంది. ప్రజల ఆదాయాల స్థాయి తక్కువగా ఉండటం, ద్రవ్య చలామణి లేని రంగం పెద్దదిగా ఉండడం, పన్ను యంత్రాంగం అసమర్థం కావడం, భారీ ఎత్తు ఎగవేత మొదలగు కారణాల వల్ల ప్రత్యక్ష పన్నులు మొత్తం పన్ను ఆదాయంలో 25 శాతం కంటె ఎక్కువ లేవు. ఈ దేశాల్లో అధిక శాతం కనీస జీవనస్థాయికి అవసరమైన ఉత్పత్తుల వినియోగమే ఉంటుంది. ఈ వస్తువులు పన్ను విధింపు పరిధిలోకి

రావు. అందుచేత ఈ దేశాల్లో పరోక్షపన్ను విధింపుకు కూడా చాల హద్దులున్నాయి. అంతేకాక పరోక్ష పన్నులను అధికంగా విధించడం వల్ల ఉత్పత్తి వ్యయాలు పెరిగి ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. మరియు పరోక్ష పన్నుల అంతిమ ప్రభావం బీదవారిపై అధికంగా ఉంటుంది. కావున ఈ పన్నులు తిరోగామి స్వభావం కలవిగా ఉంటాయి. సాంఘిక న్యాయం దృష్ట్యా వనరుల సమీకరణకు పరోక్షపన్ను విధింపులో గణనీయమైన పెరుగుదల పనికిరాదు.

**(ii) ప్రభుత్వ ఋణాలు :**

అభివృద్ధి విత్తానికి అవసరమైన వనరులను పన్ను విధింపు ద్వారా సమీకరించలేదు. కనుక ప్రభుత్వం ఇతర మూలాల నుండి ఋణాలను స్వీకరించవలసి వస్తుంది. దేశీయ ఋణాలపథకపు సఫలత 1) పొదుపు పరిమాణాలపైన 2) ఈ పొదుపులను సమీకరించే సంస్థాగతమైన ఏర్పాటు పైన ఆధారపడును.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజల పొదుపు సామర్థ్యం తక్కువగా ఉండడం వల్లనూ, ఉపాంత వినియోగ ప్రవృత్తి అధికంగా ఉండడం వల్లనూ పొదుపు పరిమాణం తక్కువగా ఉంటుంది. అభివృద్ధి తొలి దశల్లో ప్రజల నుండి నిధులు సేకరించడం కష్టం కావచ్చును. ఎందుకంటె పెరిగిన ఆదాయాలను వారు వినియోగాలకై వాడతారు. పొదుపు ఉన్నప్పటికి ప్రజలు వాటిని ప్రభుత్వ సెక్యూరిటీలలో కాని, ఉత్పత్తి, రంగంలో కాని వాడక నిజ ఆస్తులు, స్పెక్యులేషన్ (Speculation) పునః పంపిణీ వ్యాపారాలు, నగలు, వడ్డీ వ్యాపారాలు వంటి ప్రతికూల మూలధనాలకు వాడతారు.

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో విత్తం కొరకు పొదుపును సమీకరించడానికి ఏర్పాటు చేయబడిన సంస్థాపరమైన ఏర్పాట్లు బలహీనంగా ఉంటాయి. క్రమబద్ధమైన ద్రవ్య మూలధన మార్కెట్లు, బ్యాంకింగ్ సంస్థలు బాగా అభివృద్ధి చెంది యుండవు. ఈ పరిస్థితి ప్రభుత్వ ఋణాల పరిధికి పరిమితి ఏర్పరుస్తోంది. కాబట్టి పొదుపు పెట్టుబడులను ప్రోత్సహించడానికి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1) బ్యాంకింగ్, పొదుపు సంస్థను తగినంతగా ఏర్పాటు చేయడం.
2) ద్రవ్య మూలధన మార్కెట్లను అభివృద్ధి చేయడం.
3) పన్ను సంబంధమైన ప్రోత్సాహకాల ద్వారా కార్పోరేటు పొదుపులను ప్రోత్సహించడం.
4) అవసరమైనచో నిర్బంధ పొదుపు పథకాలను ప్రవేశపెట్టడం.
5) ప్రజల్లో పొదుపు అలవాట్లను అలవరచడం.

**(iii) ప్రభుత్వ సంస్థల మిగులు**

రష్యా వంటి సామ్యవాద దేశాల్లో ప్రభుత్వ సంస్థలు ఖజానాకు గణనీయంగా తోడ్పడినప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాటి పాత్ర స్వల్పంగా ఉంటుంది. ప్రభుత్వ సంస్థలు లాభనష్టాల శూన్యత ఆధారంగా నిర్వహింపబడాలని కొందరి వాదన. ప్రైవేటు సంస్థలవలనే ఇవి కూడా వాణిజ్య సూత్రాలపై ఆధారపడలేదు. అభివృద్ధి విత్తాలపై నిధులను సమకూర్చాలని మరికొందరి వాదన. ప్రభుత్వ సంస్థల నుండి మిగుళ్ళను రాబట్టే గమ్యం ద్రవ్యోల్బణ కాలంలో వాటి వస్తు సేవల ధరలను పెంచడం ద్వారా ప్రజలనుంచి కొనుగోలు శక్తిని అదుపు చేయడానికి సహాయపడుతుంది. అంతేకాక, ఉక్కు, విద్యుత్తు, భారీ నీటి పారుదల వంటి అనేక ప్రభుత్వ సంస్థల తొలి దశలో అధిక మూలధన వ్యయాలు అవసరమై చాలా కాల వ్యవధి తరువాతనేలాభాలను సంపాదించడం మొదలు పెడతాయి. కాబట్టి ప్రభుత్వ సంస్థల వస్తు సేవల ధరలు తొలిదశల్లోనే నష్టాలను భర్తీ చేయడానికి వీలుగా



BRAOU

వ్యయాం కంటే అధికంగా ఉండాలి.

అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వ సంస్థల నుండి గణనీయమైన లాభాలను సంపాదించడానికి రెండు ముఖ్యమైన పరిమితులున్నాయి. 1) ఈ దేశాల్లో చాలా ప్రభుత్వ సంస్థలు అభివృద్ధి తొలి దశల్లోనే ఉన్నాయి. కాబట్టి చాలా సంవత్సరాల వరకు లాభాలను ఆర్జించలేవు. 2) ప్రభుత్వ సంస్థలన్నియు లాభాల పరిధి పరిమితంగా ఉంటే ప్రజోపయోగాలు, అవస్థాపనా సదుపాయాల్లో కేంద్రీకృతమౌతాయి.

### (iv) లోటు దారి ఆర్థిక విధానం

పన్ను విధింపు, ప్రభుత్వ ఋణాలు, ప్రభుత్వ సంస్థల మిగుళ్ళవల్ల సరిపడునిధులు సమకూర్చుకోలేనపుడు ప్రభుత్వం లోటుదారీ ఆర్థిక విధానం లేదా అదనపు ద్రవ్య సృష్టికి పాల్పడవలసి వస్తుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో సాధారణంగా ఆర్థిక మాంద్యము, యుద్ధ సమయాల్లోనే లోటుదారి ఆర్థిక విధానం చేపట్టబడును, కాని ఈ మధ్యనే లోటుదారీ ఆర్థిక విధానం అభివృద్ధి విత్తానికి సాధనంగా గుర్తించబడింది. కొందరు ఆర్థికవేత్తలు అభివృద్ధి చెందుతున్న దేశంలో పెట్టుబడి రేటును పెంచవలసి వచ్చినపుడు ద్రవ్యోల్బణంను సృజించడానికి లోటుదారీ ఆర్థిక విధానాన్ని బలపరుస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తక్కువ రేటులో ద్రవ్యోల్బణ మూలధన కల్పనను పెంచడం ద్వారా త్వరిత వృద్ధికి దారి తీయవచ్చు. ద్రవ్యోల్బణం వల్ల వాస్తవ వేతనాల్లో (Real Wages) తగ్గుదల ఏర్పడి, లాభాలను పెంచి మూలధన కల్పనపై రెండు రకాలైన ప్రభావాలను కలుగజేస్తుంది. మొదటిది, లాభాల పెరుగుదల పెట్టుబడి ప్రోత్సాహకాన్ని ఉత్తేజపరుస్తుంది. రెండవది, వేతనాల భాగంతో పోలిస్తే లాభాల భాగంలో ఎక్కువ పెరుగుదల వుంటుంది. దీని అర్థం ఏమంటే, వేతనాలపై ఆధారపడే వర్గం నుండి ఉపాంత పొదుపు ప్రవృత్తి అధికంగా వుండే వర్గానికి ఆదాయ పునః పంపిణీ జరిగి, పొదుపు పెట్టుబడుల వృద్ధికి దారి తీస్తుంది.

అయితే లోటు దారీ ఆర్థిక విధాన సాధనపు విజయం గుణక ప్రభావ ప్రవర్తనపై ఆధారపడుతుంది. గుణకం రెండు అంశాలపై ఆధారపడి వుంటుంది. అవి 1) మూలధన సామాగ్రి (Capital equipment) మితి మీరి వుండాలి. 2) వేతనాల కోత సాధ్యమయ్యేటట్లు అనైచ్ఛిక నిరుద్యోగిత (Involuntary unemployment) వుండాలి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చాల వరకు మూలధనపు అధిక సామర్థ్యం (excess capacity) అతి తక్కువగా వుంటుంది. అందుచేత లోటుదారీ ఆర్థిక విధానం ద్వారా ద్రవ్య సప్లై పెరిగినపుడు పనిముట్ల కొరతవల్లన, వినియోగ వస్తువులు తయారు చేసే పరిశ్రమల్లో అధిక సామర్థ్యం లేకపోవడం వల్లనూ ఉత్పత్తి వెంటనే పెరగదు. ఈ విధంగా డిమాండులోని పెరుగుదల సప్లైని అధిగమించి ద్రవ్యోల్బణ ఒత్తిడులను కలుగజేస్తుంది. అంతేకాక అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో అనైచ్ఛిక నిరుద్యోగిత కాక ప్రచ్ఛన్న నిరుద్యోగిత (Disguised unemployment) వుంటుంది. ఈ దేశాల్లో పని వారు కనీస జీవన స్థాయికి దగ్గరగా వుండుట వల్ల వేతనాల కోత సాధ్యం గాదు. అంతేగాక, నిర్మాణాత్మక లోపాల వల్ల (Structural bottlenecks) ఆర్థికవ్యవస్థలోకి అదనపు ద్రవ్యం చొప్పించడానికి ఉత్పత్తికి మధ్యకాల వ్యవధి వుంటుంది. ఈ కాల వ్యవధి (Time lag) ఎక్కువైన కొలదీ ద్రవ్యోల్బణ సంభావ్యత (Inflationary potential) ఎక్కువగా వుంటుంది. అదే మాదిరిగా, ఏవస్తువులకైతే డిమాండు సప్లై కంటె చాలా ఎక్కువగా వుంటుందో వాటి ధరలు ఎక్కువగా పెరుగుతాయి. పైకారణాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లోటు దారీ ఆర్థిక విధానం ద్రవ్యోల్బణ ఒత్తిడులకు దారి తీయవచ్చు.

లోటుదారి ఆర్థిక విధానం చెడ్డది కానప్పటికీ అభివృద్ధి విత్తంలో దీన్ని ఔషధం లాగే వాడాలి కాని నిత్యాహారంగా వాడరాదు. కాబట్టి లోటుదారీ ఆర్థిక విధానం నుండి ఉత్పన్నమయ్యే ద్రవ్యోల్బణ ఒత్తిడులను అరికట్టడానికి

BRAOU

ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకోవాలి. వీటిలో ముఖ్యమైనవి - 1) ఆహార ధాన్యాలు, వస్త్రములు వంటి ముఖ్యమైన వినియోగ వస్తువుల సప్లై పెంచడం. 2) తక్కువ కాలంలో ఫలవంతమయ్యే అభివృద్ధి పథకాలపై వ్యయాన్ని పెంచడం, 3) భౌతిక నియంత్రణలతో సహా అనేక ఆర్థిక నియంత్రణలను విధించడం, 4) దిగుమతి చేయబడే వినియోగ వస్తువుల సప్లైని పెంచడానికి విదేశీ సహకారాన్ని పొందడం, 5) పారిశ్రామిక కూలీల వేతనాల్లో మితిమీరిన పెరుగుదలను అరికట్టడం, 6) పన్ను విధింపు, ప్రభుత్వ ఋణాలు, ఇన్సూరెన్సు, ప్రావిడెంటు ఫండు పథకాలు మొదలగు వాని ద్వారా ప్రజలలోని అధిక కొనుగోలు శక్తిని తొలగించడం, 7) అంచనా (Speculative) కార్యకలాపాలను అదుపు చేయడానికి కొన్ని ప్రత్యేక ద్రవ్య నియంత్రణలను విధించడం, 8) ఆదాయాలను ప్రస్తుత వినియోగానికి కాకుండా పొదుపు చేయడానికి వాడాలని ప్రజలకు నచ్చచెప్పడం, 9) వృధా వ్యయం, అవినీతి, ఛిద్రాలను (Leakages) తప్పించడానికి పాలనా యంత్రాంగాన్ని దృఢీకరించడం.

## ఆ) బాహ్య లేదా విదేశీ వనరులు

అభివృద్ధి విత్తానికి దేశీయ వనరులు సరిపోనప్పుడు విదేశీ లేదా బాహ్య సహకారాన్ని ఆశించవలసి వస్తుంది.

విదేశీ సహకారం అంటే విదేశీ వ్యక్తులనుంచి కాని, విదేశీ ప్రైవేటు కార్పోరేషను నుంచి కాని, విదేశీ ప్రభుత్వాల నుంచి కాని, అంతర్జాతీయ కోశ సంస్థల నుంచి కాని పొందే విత్తపరమైన లేదా సాంకేతికమైన సహకారం.

జాతీయకరణ భయంవల్ల కాని, అవసరమైన అవస్థాపనా సదుపాయాలు లేక పోవడం వల్ల కాని, దేశీయ మార్కెట్ సంకుచితమైనందువల్ల కాని, లాభాల చెల్లింపులో ఇబ్బందుల వల్ల కాని, మాతృభూమికి మూలధనం తరలింపులో ఇబ్బందుల వల్ల కాని (Repatriation of Capital) విదేశీ ప్రైవేటు మూలధనం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలోకి చేరదు. చాలా సందర్భాల్లో ప్రైవేటు విదేశీ మూలధన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎగుమతుల కొరకు నిర్వహింపబడే ఉద్బహణ పరిశ్రమల్లోకే చేరింది కాని తయారీ పరిశ్రమల్లోకి (Manufacturing Industries) చేరలేదు. అయినప్పటికీ ఈ మధ్య కాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ సదుపాయల (aid) ద్వారానూ ప్రపంచబ్యాంకు వంటి అంతర్జాతీయ కోశ సంస్థల ద్వారానూ విదేశీ సహకారాన్ని అధికంగా పొందగలుగుతున్నాయి.

B R A O U

అభివృద్ధి తొలిదశల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు విదేశీ సహకారం అత్యావశ్యకము. కాబట్టి విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి ప్రయత్నాలు చేయాలి. దీని కొరకు పెట్టుబడి ఒప్పందాలు, విదేశీ పెట్టుబడికి నష్ట భయం (Risk), పన్ను మినహాయింపులు, అభివృద్ధి కార్యకలాపాలు మున్నగు విషయాల్లో ప్రభుత్వ హామీలు విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి చాలా సహకరిస్తాయి.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి - 1

---

1. విధులననుసరించిన విత్త సూత్రమనగా నేమి?
2. అభివృద్ధి విత్తమనే పదానికి అర్థమేమి?
3. అభివృద్ధి విత్తంలో ప్రభుత్వ ఋణాల పరిధిని వివరింపుము?
4. లోటు దారీ ఆర్థిక విధానం ఆర్థికాభివృద్ధి గతిని ఎట్లు త్వరితపరచును.
5. అభివృద్ధి విత్తానికి ప్రభుత్వ సంస్థలు ఎందుకు మిగుళ్ళను సంపాదించాలి.
6. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక సంస్థల్లోకి ప్రయివేటు విదేశీ మూలధనం తగినంతగా రాకపోవడానికి కారణాలేవి.

# భాగం – 20 : ప్రభుత్వ ఋణం – స్వభావం, భారం, తిరిగి చెల్లింపు

విషయక్రమం


20.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
20.1 పరిచయం
20.2 ప్రభుత్వ ఋణసృష్టి, స్వభావం
20.3 ప్రభుత్వ ఋణ వర్గీకరణ
20.4 ప్రభుత్వ ఋణ వ్యవస్థ – భారతదేశం
20.5 భారతదేశంలో ప్రభుత్వ ఋణపెరుగుదల
20.6 ప్రభుత్వ ఋణ పాత్ర
20.7 ప్రభుత్వ ఋణ భారం
20.8 ప్రభుత్వ ఋణ చెల్లింపు
20.9 సారాంశము
20.10 సంప్రదింపు గ్రంథాలు
20.11 నమూనా పరీక్షాప్రశ్నలు


## 20.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ప్రభుత్వ ఋణ స్వభావాన్ని లక్షణాలను, వర్గీకరణను మరియు దాని పాత్రను భారతదేశాన్ని ఉదాహరణగా చూపిస్తూ ఈ భాగం వివరిస్తుంది. అంతేకాకప్రభుత్వ ఋణానికి సంబంధించిన సిద్ధాంత విషయాలను, ఋణభారము మరియు తిరిగి చెల్లింపు పద్ధతులను కూడా వివరించడం జరిగింది.

ఈ భాగాన్ని చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు.

- ప్రభుత్వ ఋణ స్వభావం
- ప్రభుత్వ ఋణ వర్గీకరణ
- ప్రభుత్వ ఋణ పాత్ర
- భారతదేశంలో ప్రభుత్వ ఋణ పాత్ర మరియు దాని పెరుగుదల
- ప్రభుత్వ ఋణ చెల్లింపు పద్ధతులు

## 20.1 పరిచయం

ప్రజలనుండి గాని, ఇతర దేశాలనుండి గాని ప్రభుత్వం అప్పు తీసుకొన్నప్పుడు దానిని 'ప్రభుత్వఋణం' అంటున్నాం. ప్రభుత్వం తన ఖర్చులను భరించుకోవడానికి రాబడిపై ఆధారపడుతుంది. ప్రభుత్వ రాబడి ముఖ్యంగా మూడు విధాలుగా వస్తుంది. అవి పన్నులు, ప్రభుత్వ ఋణం, మరియు లోటు ద్రవ్య విధానం. మూడవ విభాగంలో పన్నులకు సంబంధించి వివరంగా చర్చించాం. తర్వాతి భాగంలో లోటు ద్రవ్యవిధానం గురించి సంక్షిప్తంగా తెలుసుకొంటాం. ఈ విభాగాన్ని పూర్తిగా ప్రభుత్వ ఋణం కొరకై కేటాయించాం.

BRAOU

ప్రభుత్వ ఋణ స్వభావాన్ని, వర్గీకరణను ముందుగా చర్చిద్దాం. వర్గీకరణలో స్వదేశీ, విదేశీ ఋణాలుముఖ్యమైనవి. భారతదేశంలో ప్రభుత్వ ఋణ పరిమాణం ఏ విధంగా పెరుగుతున్నది,ప్రభుత్వ ఋణ పాత్ర ఏమిటి అను అంశాలను పరిశీలిద్దాం. ప్రభుత్వ ఋణ భారం గురించి, ప్రభుత్వ ఋణాన్ని తిరిగి చెల్లించే విధానాలేమిటో చర్చించాల్సిన ఆవశ్యకత ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా వుంది. ఈ భాగం చివరిలో ఈ విషయాలను తెలుసుకొందాం.

## 20.2 ప్రభుత్వ ఋణం – స్వభావం, భారం, తిరిగి చెల్లింపు

ప్రభుత్వం తనకు వచ్చే రాబడి కంటే అధికంగా ఖర్చు చేసినపుడు ప్రభుత్వ ఋణం ఉద్భవిస్తుంది. ప్రజలనుండి పుచ్చుకునే అప్పుకు ప్రభుత్వం విధించే పన్నుకు మధ్య భేదముంది. వనరుల సమీకరణకు, రాబడులను సంపాదించుకొనేందుకు ఈ రెండూ ఉపయోగపడతాయి. పన్నుల వ్యవస్థవలె గాకుండా, ప్రభుత్వ ఋణమనేది ముఖ్యంగా స్వచ్ఛందమైన వ్యవహారం. ప్రభుత్వం సెక్యూరిటీలను, ఋణ పత్రాలను (Bonds)బిల్లులను లేదా సర్టిఫికేట్‌లను అమ్మినప్పుడు వ్యక్తులుగాని, వారి తరపున విత్త సంస్థలుగాని కొనుగోలు చేయవచ్చు. ఆ విధంగా కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ విత్త ఆస్తులను కలిగివుంటారు. ఆ ఆస్తులపై వారికి అన్ని రకాల హక్కులు, యోగ్యతలు, వుంటాయి. ఈ ఆస్తులను మార్కెటులో ఎప్పుడైననూ అమ్మవచ్చులేదా కొనవచ్చు.ప్రభుత్వ ఋణ స్వభావంను వివరంగా తెలుసుకొనుటకు ఋణ వ్యవహారానికి సంబంధించిన వివిధఅంశాలను విశదపర్చాలి.

(i) అప్పుగా తీసుకొన్న నిధులను ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి వుంటుంది. (ఐతే పన్నుల ద్వారా అంతే మొత్తంలో రాబడులను పొందిప్రభుత్వం తన ఋణాలను తీర్చుకోవచ్చుననేది మరువ కూడదు). అప్పుతో బాటు వడ్డీని కూడా చెల్లించాలి. వడ్డీపై వ్యయమనేది సులభమైనది. ఎందుకంటే ఇతర ప్రభుత్వ వ్యయాలవలెదీనిని పన్ను రాబడి నుండి తీర్చవచ్చు. ప్రభుత్వ ఋణ చెల్లింపులో కీలకమైన సమస్యలున్నాయి. ఉదాహరణకు, ఋణ పత్రాలు సెక్యూరిటీలను కలిగి వున్న వారి జీవితకాలంలో ఋణ చెల్లింపు జరగకపోవచ్చు. అటువంటి పరిస్థితిలో వారి వనరులు ప్రభుత్వానికి బదిలీచేసినందుకుగాను ప్రతిఫలం పొందనప్పుడు ప్రస్తుత ఋణ పత్రాలున్నవారు చివరికిప్రభుత్వ ఋణ భారంను భరించవలెనా అనేది సమస్య. దీనికి సమాధానం అంత సులభంగా లభించదు. దీనిపై వివిధ ఆర్థిక వేత్తలు విభిన్నాభిప్రాయాలు తెలియజేసారు. ఈ ఋణభారం గురించి తర్వాత తెల్సుకొందాం.

(ii) ప్రభుత్వం విడుదల చేసే అన్ని ఆస్తులు లేదా క్లెయిములు (Claims) స్వజాతీయమైనవి కావు. సాధారణంగా అవి నిర్ణీత కాల వ్యవధి (Maturity Period) ని బట్టి లేదా ఋణ పత్రాలున్న వ్యక్తుల వర్గీకరణ పద్ధతిని బట్టి మారుతుంటాయి. వివిధ రకాలైన క్లెయిమ్‌లలో గల భేదాలు ఆర్థిక విధానానికి సాధనంగా ప్రభుత్వ ఋణ పరిధిని, ప్రాధాన్యతను నిర్ణయించడంలో కీలకపాత్రను నిర్వహిస్తాయి. ఉదాహరణకు, సగటు ఋణాల వ్యవధి తక్కువగా వుంటే ఋణ ద్రవ్యత్వత అధికంగా వుండును. కావున అదనపు ద్రవ్య సప్లయ్ ద్వారా ఆర్థిక వ్యవస్థలో సాధారణ ధరల స్థాయిని స్వల్పకాల ఋణ వ్యవస్థ ప్రభావితం చేస్తుంది. ఋణ కాల వ్యవధి ధరలను ఇంకొక విధంగా కూడా ప్రభావితం చేస్తుంది. అదేమంటే ఆర్థిక వ్యవస్థలో వడ్డీ రేటు వ్యవస్థపై ప్రభావాన్ని కలిగించి ధరలను మార్చును. ఒక దేశ కేంద్ర బాంకు ఋణానికి, వ్యక్తుల ఋణాలకు మధ్య భేదముంది. అదనపు ప్రభుత్వ ఋణ నిధుల ఆధారంగా కేంద్రబాంకు ద్రవ్య సప్లయ్‌ని విస్తరించవచ్చు. (ఈ విధంగానే ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని పాటిస్తుంది.) కాని వ్యక్తిగత ఋణాలకు అటువంటి పరిణామం వుండదు. ప్రభుత్వ ఋణానికి సంబంధించిన పైన తెల్పిన కాల వ్యవధి, యాజమాన్యపు పద్ధతి సమస్యలు " ప్రభుత్వ ఋణ నిర్వహణ" (Management of Public Debt) కు చెందినవి. ద్రవ్య, పరపతి నియంత్రణ విధానాలపై ఈ సమస్యలు కీలకమైన ప్రభావాన్ని చూపుతాయి.

(iii) లోటు ద్రవ్య విధానం ప్రభుత్వ ఋణ స్వభావానికి సంబంధించి ఇంకొక సమస్యను లేవనెత్తుతుంది.

కార్యకలాపాల పరిధికే అంక్షలున్నాయనినమ్మింది. న్యాయ చట్టాం (Law and Order) నిర్వహణ , జాతీయ రక్షణ, ప్రధానమైనసేవలను అందజేయడం వంటి కొన్ని సామూహిక అవసరాలను ప్రభుత్వ వ్యయం ద్వారా అందజేయడం తప్ప ప్రభుత్వం ఆర్థిక విధానపు నడవడిలో జోక్యం చేసుకోరాదని వీరి వాదము. 1930 వ దశాబ్దానికి పూర్వం కోశ సిద్ధాంతంగాని, ఆదరణగాని ఉద్యోగితను అధికస్థాయిలో ఉంచడంలో గాని, జాతీయ ఉత్పత్తి వృద్ధి రేటును స్థిరీకరించడంతోగాని సంబంధం పెట్టుకోలేదు. దీర్ఘకాలంలో వాస్తవ కారకాలైన శ్రమ మూలధనాల సప్లై సాంకేతిక స్థాయిలవల్ల నిర్ణయింపబడిన రేటులో ఉత్పత్తి సాగుతుందని వీరు నమ్మారు. ఈ పద్ధతిలో ధరలు, కూలిరేట్లు, వస్తు సేవలపై ద్రవ్య వ్యయాన్ని బట్టి మారుతూ వాస్తవిక ఉత్పత్తిలో మార్పు రానివ్వవు. ఈ విధంగా ఏదైనా సవరణ అవసరమైనపుడు ద్రవ్య విధానం ద్వారా అనగా ద్రవ్య పరిమాణ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా అమలుపరచబడుతుంది.

అయినప్పటికి సంప్రదాయ ఆర్థికవేత్తలు కోశ విధానాన్ని పట్టించుకోలేదనడం సరికాదు. ప్రభుత్వాలు ఉన్నప్పుడల్లా కోశ విధానం అమలుపరచబడుతూనే ఉంది. సామూహికావసరాలను తీర్చడానికి ప్రభుత్వ వస్తువుల అవసరం గుర్తించబడింది. ఉదాహరణకు ఆడమ్‌స్మిత అంతరంగిక భద్రత, విదేశాలనుంచి రక్షణలను ప్రభుత్వ ప్రాథమిక గమ్యాలుగా గుర్తించడమే కాక కొన్ని సాంఘిక ఆర్థికప్రయోజనాలను కూడా ప్రతిపాదించాడు. సంఘానికి ప్రయోజనాలు చేకూర్చే సంస్థలను నిర్మించడం, నిర్వహించడం ప్రభుత్వం చేపట్టాలి. నవీన పదజాలంలో చెప్పాలంటే సాంఘిక మూలధన కల్పనకు ప్రభుత్వం పాటుపడాలని దీని అర్థం. అయినప్పటికీ సామూహిక అవసరాలను తీర్చడానికి అవసరమైన వనరుల కేటాయింపు ద్రవ్యభారపు పంపిణీ (పన్ను విధింపు), నైతిక, మానవతా హేతువుల ఆధారంగా మాత్రమే సమ్మతించారు. కాని ఆర్థిక హేతువుల ఆధారంగా కాదు. సాంప్రదాయ కోశ విధానపు సూత్రాలను సంక్షిప్తంగా చెప్పాలంటే ఈ క్రింది అంశాలు ముఖ్యమైనవి.

సాంప్రదాయ కోశ విధాన సూత్రాలు :

i) ముఖ్యమయిన సేవలు, ప్రజోపయోగ కార్యకలాపాలు నిర్వహించడం మినహాయించి ప్రభుత్వ వ్యయాన్ని ఇంకా ఏ ఇతర అంశాలకు వినియోగించరాదు.

ii) ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రభుత్వాలు పన్నుల వల్ల వచ్చిన ఆదాయాలను మించి వ్యయ కార్యకలాపాలను చేపట్టరాదు. సంతులిత బడ్జెటు విధానం కోశ విధానానికి మార్గదర్శకంగా ఉండాలి. సాంప్రదాయ ప్రమేయమైన (assuemption) పూర్ణ ఉద్యోగిత పరిస్థితుల్లో లోటు బడ్జెటు విధానం ద్రవ్యోల్బణ పరమైన ధరల పెరుగుదలకు దారి తీస్తుంది.

iii) పై సూత్రానికి ఉపసిద్ధాంతమేమంటే ప్రభుత్వ ఋణాలు వనరులను ఉత్పాదకత ఉద్యోగిత నుండి వెనుకకు తీసుకుంటాయి కనుక వీటిని సేకరించరాదు.

iv) పన్నులను సాధ్యమైనంత తక్కువస్థాయిలో ఉంచాలి. పన్ను భారపు పంపిణీ న్యాయబద్ధంగా ఉండాలి. కాబట్టి "ప్రభుత్వ వ్యయం కొన్ని సామూహిక వినియోగ వస్తువులను ప్రజలకు అందచేయడానికి మాత్రమే ఉపయోగింపబడుతూ ఈ వ్యయాలను ఎదుర్కోవడానికి మాత్రమే పన్నులు విధించబడాలి." వ్యక్తిగాని, సంస్థగాని చెల్లించే విధం గానే ప్రభుత్వం కూడా ఈ వ్యయాలను చెల్లించాలి.

కోశ విధానపు స్వభావం, పాత్రలను గూర్చిన పై ఆలోచన 1930వ దశాబ్దం లోని కీన్సు ఆర్థిక విశ్లేషణతో తీవ్రమైన మార్పు చెందింది. సార్థక డిమాండుస్థాయిని ప్రభావితం చేయడానికి ప్రభుత్వ విత్తం ఉపయోగిస్తుందని

జాన్ మెయిర్డ్ కీన్సు వాదన. పరిపూర్ణ ఉద్యోగితను సాధించేందుకు అందుబాటులో నున్న వనరులు (అల్పకాలంలో స్థిరంగా ఉంటాయని భావింపబడే) సంభావ్య సమిష్టి (ద్రవ్య) వ్యయంలేదా డిమాండుకు తగినట్లుగా ఉండాలి.జాతీయాదాయ అకౌంట్ల నుండి (A) అందుబాటులో నున్న మొత్తం వనరులు (B) సంభావ్య డిమాండు (ప్రభుత్వ, ప్రైవేటు రంగాల వినియోగవ్యయం మరియు పెట్టుబడి వ్యయం) అంచనా వేయవచ్చు. A కంటె B ఎక్కువగా నున్నచో (A>B) ఈ వ్యవధిని (Gap) కోశ విధాన చర్యల ద్వారా పూడ్చాలి. B కంటె A ఎక్కువగా నున్నప్పుడు కూడ వ్యవధి వస్తుంది. దీన్ని కూడా కోశ విధాన చర్యల ద్వారానే పూడ్చాలి. ఇదే బహుళ ప్రాచుర్యంలో నున్న కీన్సు " Y=C+I+G" అనే సమీకరణము. కోశ సంబంధమైన సాధనాల ద్వారా (ప్రభుత్వ వ్యయం, పన్ను విధింపు, లోటుదారీ ఆర్థిక విధానం) ఈ వ్యవధిని పూడ్చడమనే పద్ధతి పరిహారపు కోశ విధానమనే భావన (Compensatory Finance) ద్వారా వ్యక్తీకరించబడింది. ఈ భావనకు ఎ.హెచ్. హేన్‌సెన్ తొలి రూపమిచ్చాడు.

**ఏ.పి. లర్నర్ విధులననుసరించిన విత్త విధానము :**

కానీ కీన్సు కోశ సిద్ధాంతం ఎ.పి.లర్నర్ చేతిలో కొంత మెరుగు దిద్దబడి "నియంత్రణ అర్థశాస్త్రం" (Economics of Control) అనే గ్రంథంలో "విధులననుసరించిన విత్త విధానమనే" పేరుతో పరిపూర్ణ తుదిరూపాన్ని దిద్దుకొంది. కోశ విధానాన్ని గూర్చిన ఈ వివరణను జస్సీ బర్క్‌హెడ్ ఈ విధంగా సంక్షిప్తీకరించెను. " ఈ వివరణ ప్రభుత్వ ఆదాయాన్ని వ్యయ, ఋణాలు సమిష్టి వ్యయాలను నియంత్రణ చేసే సాధనాలుగా మాత్రమే చూస్తోంది. వీటిని సాధనాలుగా తీసుకొని స్థిర ధరల వద్ద స్థిరఉద్యోగిత అనే గమ్యాన్ని చేరాలి". ఈపద్ధతిలో ఉదాహరణకు పన్నులను ఆదాయన్ని సాధించే ఆధారాలుగా చూడరాదు. ప్రైవేటు వినియోగం, పెట్టుబడి వ్యయాలను ప్రభావితం చేసే సాధనాలుగా చూడాలి. ఈ ఆలోచనలో పైన చర్చించిన సంప్రదాయ (Classical) లేదా కీన్సుకు పూర్వపు ఆర్థిక వేత్తల ఆలోచనలకు పూర్తి వ్యతిరేకంగా వున్నాయి. విధులననుసరించిన విత్త విధానంలోని ముఖ్యమైన అంతరార్థాలు (implications) ఈ క్రింద పొందుపరచడ్డాయి.

1) ప్రభుత్వ విత్తాన్ని విధుల ఆధారంగానే లెక్కలోకి తీసుకోవాలి. ఆదాయ వ్యయాలు సామూహిక అవసరాలను తీర్చడానికి మాత్రమే లెక్కలోకి తీసుకోరాదు.

2) బడ్జెట్ ఎల్లప్పుడూ సంతులితం కానక్కరలేదు. నిజానికి ఆర్థిక మాంద్యపు పరిస్థితుల్లో సంతులిత బడ్జెట్ కోరదగినది కాదు.

3) అదేవిధంగా ప్రభుత్వ వ్యయాన్ని (పన్ను విధింపును కూడ) ప్రత్యక్ష ప్రయోజనాల కొరకు మాత్రమే లెక్కలోనికి తీసుకోరాదు. సార్థక డిమాండు పెంచడం రూపంలో కలుగజేసే పరోక్ష ప్రభావాన్ని కూడ లెక్కలోకి తీసుకోవాలి.

స్థూల ఆర్థిక విశ్లేషణను గూర్చిన కొంత పరిజ్ఞానంతో ఇట్టి కోశ విధానం ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన చేసుకోవడం కష్టంకాదు. వెనుక చర్చించిన సమీకరణ మైన Y=C+I+G ని తీసుకుందాం. ఎగుమతి దిగుమతులను గూడా లెక్కలోకి తీసుకొన్నచో Y=C+I+G+X - M అవుతుంది. ప్రభుత్వవ్యయాన్ని ప్రభుత్వం నియంత్రణ చేయగలదు. కాని ఇతర చలాంకాలను పన్ను విధింపు మరియు ఇతర కోశ విధానపు చర్యల ద్వారా ప్రభావితం చేయవచ్చు. ఈ విధంగా కేన్సు విశ్లేషణ కోశ విధానాన్ని ఆర్థిక విశ్లేషణ యొక్క ప్రధాన అంశాలతో సంఘటిత పరుస్తుంది.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి –1**

---

1. సాంప్రదాయ కోశ విధాన ముఖ్య సూత్రాలు ఏవి?
2. కోశ విధానంపై కీన్స్ అభిప్రాయం ఏమిటి?
3. విధులననుసరించిన విత్త విధానమనగానేమి?



BRAOU

## 24.5 ముగింపు

విధులననుసరించిన విత్త విధానం సనాతన ఆలోచనలగు సంతులిత బడ్జెట్‌ను తిరస్కరిస్తుంది. కాని దీర్ఘకాలిక ఆర్థికవృద్ధిని అశ్రద్ధ చేస్తుంది. ఈ విధానం ఆదాయ సమీకరణ, పొదుపు పెట్టుబడి రేట్లను పెంచడం, పునఃపంపిణీ న్యాయం, మూలధన కల్పన వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల కోశ విధానం వంటి అతి ముఖ్యమైన గమ్యాల నెన్నిటినో నిర్లక్ష్యం చేస్తుంది. అభివృద్ధి విత్త విధానంలో కోశ చర్యలు ఆర్థికాభివృద్ధి గమ్యాలను సాధించడంలో వాటి సఫలతను బట్టి నిర్ణయించబడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అభివృద్ధి విత్త విధానపు సఫలత కొరకు దేశీయ, విదేశీయ వనరులను సమీకరించుటకు కృషి చేయాలి.

*రచన : డా. కె. శివసుబ్రహ్మణ్యం*

*అనువాదం : ఆచార్య ఎస్. సుబ్రహ్మణ్యం*

## 24.6 సంప్రదింపు గ్రంథాలు


1. B.P. Tyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance


## 24.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయుము.**

1. అభివృద్ధి విత్తానికి వివిధ మూలాలను చర్చించుము.

**II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయుము.**

1. అభివృద్ధి విత్త సందర్భంలో పన్ను విధింపు లక్ష్యాలను చర్చించుము.
2. అభివృద్ధి విత్తంలో లోటు దారీ ఆర్థిక విధానపు పాత్రను వివరింపుము.

●●●

BRAOU

BRAOU

# ఖండం – 7

## ఫెడరల్ విత్తం

ఈ కోర్సులోని చివరి ఖండమైన ఫెడరల్ విత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరుల కేటాయింపుకు పాటించే నియమాలను చర్చించుకొందాం. ముఖ్యంగా భారతదేశానికి చెందిన విశ్లేషణను తెలుసుకొందాం. ఇక చివరి భాగంలో భారతదేశంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాలను విశ్లేషించుకొందాం. భారతదేశంలో విత్త సంఘపు ప్రస్తుత పరిస్థితిని; ఎనిమిదవ, తొమ్మిదవ విత్త సంఘాల సిఫారసులను వివరించడం జరిగింది.

ఈ చివరి ఖండంలో చేర్చబడిన 2 భాగాలు :

భాగం – 25 : ఫెడరల్ విత్తం సూత్రాలు

భాగం – 26 : భారతదేశంలో కేంద్ర – రాష్ట్రాల మధ్య గల విత్త సంబంధాలు – విత్త సంఘాలు

+++

BRAOU

BRAOU

# భాగం – 25 : ఫెడరల్ విత్తం – సూత్రాలు

## విషయ క్రమం

25.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
25.1 పరిచయం
25.2 ఫెడరల్ విత్తం – అర్థం
25.3 ఫెడరల్ విత్తంలో అసంతులనము
25.4 ఫెడరల్ విత్త సూత్రాలు
    25.4.1 స్వాతంత్ర్యము, బాధ్యత నియమం
    25.4.2 పర్యాప్తి (adequacy) వ్యాకోచితా నియమం
    25.4.3 యుక్తత నియమం (Principle of suitability)
25.5 భారతదేశంలో ఈ నియమాల వర్తింపు
25.6 ముగింపు
25.7 సంప్రదించు పుస్తకాలు
25.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 25.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఈ భాగం యొక్క ముఖ్య ఉద్దేశం. ఫెడరల్ మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్త వనరుల కేటాయింపును నిర్ణయించే సూత్రాల గురించి భారతదేశాన్ని ఉదహరిస్తూ వివరించడం.

ఈ భాగం చదివిన తదుపరి మీరు ఈ క్రింది భావనలను అర్థం చేసుకోగలరు.

- ఫెడరల్ విత్త భావనను వివరించడం
- ఫెడరల్ విత్తంలో గల అసమానతలను గుర్తించడం
- ఫెడరల్ విత్తంలో గల నియమాలను విశ్లేషించడం
- ఈ నియమాలను భారతదేశానికి వర్తింపచేయడం

## 25.1 పరిచయం

ఒక ఫెడరల్ వ్యవస్థ రెండు ప్రభుత్వ స్థాయిలను కలిగి ఉంటుంది. ఎ) ఫెడరల్ ప్రభుత్వం, బి) రాష్ట్ర లేదా ప్రాంతీయ ప్రభుత్వాలు. కావున ఫెడరల్ వ్యవస్థ గల ప్రభుత్వం ఈ రెండు ప్రభుత్వాల స్థాయిల మధ్య ప్రభుత్వ విధులను, విత్త వనరులను విభజించాలి. ఒక ప్రభుత్వ స్థాయి యొక్క కార్య ప్రవర్తనా సామర్థ్యం ఈ రెండు ప్రభుత్వ స్థాయిలకు కేటాయించే ప్రభుత్వ విధులపై ఆధారపడి ఉంటుంది. ఒక ప్రభుత్వ స్థాయికి కేటాయించిన ప్రభుత్వ విధులను సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వ విత్త వనరులను ఈ రెండు ప్రభుత్వ స్థాయిల మధ్య పంపిణీ చేయాలి. అంటే విధుల కేటాయింపుతో బాటు విత్త వనరుల కేటాయింపుకు కొన్ని సూత్రాలు తెలుపబడినాయి. ప్రస్తుత పాఠంలో ఈ సూత్రాలను పరిశీలిస్తూ భారతదేశంలో అవి ఏవిధంగా అన్వయించబడుతున్నావో తెలుసుకుంటాం



BRAOU

మార్చడం అవసరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీ పథకంలో కఠినత్వాలు వుండడం వలన అనేక ఫెడరల్ వ్యవస్థలలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు చెడిపోయినవి.

### 25.4.3 కార్య ప్రవర్తనా సామర్థ్యం, పరిపాలనలో మిత వ్యయ నియమం

దీనినే యుక్తత నియమం (principle of suitability) అని కూడా అంటారు. ఈ నియమం ప్రకారం సామర్థ్యం, మిత వ్యయం దృష్ట్యా ప్రతి ప్రభుత్వ స్థాయి కొన్ని పన్నులను సక్రమంగా పొందగలుగుతుంది. ఇంకొక ప్రభుత్వ స్థాయితో పోల్చినపుడు, ఒక ప్రభుత్వ స్థాయికి కేటాయించినపన్నులను సేకరించడానికి అయ్యే వ్యయంలో, పరిపాలనా వ్యయంలో ఆదా వుండేటట్లు, పన్నుల సేకరణ సమర్థవంతంగా ఉండాలి. ఈ నియమాన్ని పాటించినచో ఫెడరల్ వ్యవస్థలో లంబకోశ అసంతులనం ఏర్పడుతుంది. కాని, ఈ అసంతులనాన్ని తగ్గించడానికి ఫెడరల్ పన్ను రాబడి, గ్రాంట్ల సంక్రమణ వలె పై ప్రభుత్వ స్థాయినుండి క్రింది ప్రభుత్వ స్థాయికి రాడులను బదిలీ చేయాలి.

ఆచరణలో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపు పథకంలో పైన తెలిపిన నియమాలన్నిటిని తృప్తి పరచడం వీలు కాదు. ఎందుకంటే ఈ నియమాలు ఒక దానితో ఇంకొకటి ఘర్షణ పడతాయి. ఉదాహరణకు, స్వతంత్రత, బాధ్యతా నియమాన్ని పాటిస్తే పర్యాప్త, వ్యాకోచతా నియమాన్ని సంతృప్తి పరచలేము. అదే విధంగా, యుక్తత నియమాన్ని అనుసరిస్తే ఇతర రెండు నియమాలను పాటించలేము.అందుకే , ఈ నియమాల మధ్య ఘర్షణ వచ్చే స్వభావం ఉండడం వలన వివిధ ఫెడరల్ వ్యవస్థలలో వాస్తవిక కేటాయింపు పథకంలో ఈ నియమాల న్యాయమైన సమ్మిశ్రమాన్ని పాటిస్తారు.

## 25.5 భారతేదశంలో ఈ నియమాల వర్తింపు

భారతదేశంలో స్వతంత్రత, బాధ్యతానియమాన్ని పాక్షికంగా పాటిస్తారు. ఎందుకంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాబడులను భారత రాజ్యాంగం పాక్షికంగా మాత్రమే వేరుపరచడం జరిగింది. భారతరాజ్యాంగంచేత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యకొన్ని పన్నుల కేటాయింపు స్పష్టంగా జరిగింది. వాటి వాటి క్షేత్రాలలో ఆయా ప్రభుత్వాలకు పన్నులు విధించుకొనడానికి, వ్యయం చేయడానికి పూర్తి అధికారాలు ఉన్నాయి. ఋణ సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు తీవ్రంగా కుదింపబడ్డాయి. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది.

భారతీయఫెడరల్ విత్త వ్యవస్థలో ఇతర నియమాలకంటే పర్యాప్త, వ్యాకోచతా నియమం తక్కువ సంతృప్తి పరుచచబడింది. ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా సంఘటితం అవుతున్న కొలది మరియు రవాణా, వాణిజ్యం, వర్తకంలో పెరుగుదలలు జరుగుతున్న కొలది ఉత్పాదక వనరులు కేంద్రీకృతమవుతున్నాయి. రాష్ట్రాలు వాటి పన్నుల ద్వారా చాలినంత వనరులను పొందలేకపోతున్నాయి. ఫలితంగా అవి కేంద్ర ప్రభుత్వ సహాయానికై ఆధారపడవలసి వస్తుంది. దేశంలో ఆర్థిక ప్రణాళికను చేపట్టిన తర్వాత రాష్ట్రాల బాధ్యతలు అధికమైనవి. తత్ఫలితంగ, కేంద్ర ప్రభుత్వంపై సహాయం కొరకు రాష్ట్రాలు అధికంగా ఆధారపడినాయి.

భారతదేశములో విత్త వనరుల పంపణీ పథకం అధికంగా కార్యప్రవర్తనా సామర్థ్యం, పరిపాలనా మితవ్యయ నియమంపై ఆధారపడి ఉంది. ( ఈ నియమాన్నే యుక్తత నియమని అంటారు.) అనేక ఉత్పాదక, వ్యాకోచత గల పన్నులను పొందడానికి కేంద్ర ప్రభుత్వానికి పూర్తి అవకాశం ఉంది. రాష్ట్రాలకు తక్కువ పన్నులు కేటాయింపబడడమే గాకుండా, కేంద్ర ప్రభుత్వ పన్నులతో పోల్చినపుడు రాష్ట్రాల పన్నులు తక్కువ వ్యాకోచత,

తక్కువ ఉత్పాదక స్వభావాన్ని కలిగి ఉంటాయి. రాష్ట్రాల బాధ్యతలు, ముఖ్యంగా సాంఘిక సేవలు, బహు మూల్యమైనవి మరియు విస్తరింపబడేవి. ఈ కారణంగా అధిక పరిమాణంలో రాబడులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేయవలసిన అవసరం ఏర్పడింది. దీనిని గుర్తించి భారత రాజ్యాంగ నిర్మాతలు రాష్ట్రాల రాబడిలోటును పూర్తి చేయడానికి పరిహారపు ఏర్పాట్లు చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రత్యేకంగా పన్నుల కేటాయింపును చేయడమే గాకుండా కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇతర రకాల పన్నుల రాబడులను బదిలీ చేసే ఏర్పాటును కల్పించింది. వాటిని క్రింది విధంగా తెలుపవచ్చు.

(i) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడి, సేకరింపబడే పన్నుల లేదా సుంకాల నికర రాబడిని కేంద్ర రాష్ట్రాలు పంచుకొంటాయి. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయపు పన్ను మరియు కేంద్ర ఎక్సైజు సుంకాలు.

(ii) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడి, సేకరింపబడే పన్నుల మొత్తం నికర రాబడిని రాష్ట్రాలు పొందును. ఉదాహరణకు ఎస్టేట్ సుంకం.

(iii) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడే సుంకాలను రాష్ట్ర ప్రభుత్వాలే సేకరించి తమ వద్ద నిలుపుకొని వినియోగించుకొంటాయి. ఉదాహరణకు కేంద్ర అమ్మకపు పన్ను.

భారతీయ ఫెడరల్ విత్త వ్యవస్థలో సంభవించే లంబ మరియు సమతల కోశ అసంతులనల దృష్ట్యా భారత రాజ్యాంగం ఆర్థిక సంఘ ఏర్పాటుకు వీలు కల్పించింది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

4. ఫెడరల్ విత్తం యొక్క నియమాలు ఏవి?

## 25.6 ముగింపు

BRAOU

దాదాపు అన్ని ఫెడరల్ వ్యవస్థలలో విధులననుసరించే బాధ్యతల కేటాయింపులో మరియు విత్త వనరుల కేటాయింపులో విత్త అసంతులనలు సంభవించడం ఒక విశేషమైన లక్షణంగా గోచరిస్తుంది. లంబ, సమతల కోశ సమత్వాన్ని సాధించడానికి బాధ్యతలు మరియు విత్త వనరుల మధ్య పొందిక ఉండేటట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వనరుల కేటాయింపు చేయాలి. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపు కొరకు అర్థశాస్త్రవేత్తలు తెలిపిన కొన్ని నియమాలలో యుక్తత నియమం ( లేదా కార్య ప్రవర్తనా, పరిపాలనా మిత వ్యయ నియమం) మాత్రమే ఆచరణాత్మకమైనదని భారతదేశంతో సహా అనేక ఫెడరల్ వ్యవస్థలు గమనించాయి.

*రచన : డా॥ కె. శివసుబ్రహ్మణ్యం*
*అనువాదం : సతీష్ కె. రెడ్డి*

## 25.7 సంప్రదించు పుస్తకాలు


1. B.P. Thyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. U.K. Hicks & Olthers : Federalism and Economic growth

4. B.P. Adarkar : The Principles and Problems of Federal Finance
5. Wilfreed David(ed) : Public Finance, Planning and Economic Development (Essays in Honour of U.K. Hicks)
6. Raja J.Chellaiah & Association : Trends and Issues in Indian Federal Finance.

## 25.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు లిమ్ము.

1. ఫెడరల్ విత్తంలో కొశ అసంతులనమును చర్చించుము.
2. ఫెడరల్ విత్త నియమాలను విశదపరుస్తూ భారతదేశంలో అది ఏ విధంగా వర్తింపబడు చున్నాయి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ఫెడరల్ విత్త సమస్యను వివరించుము.
2. స్వాతంత్ర్యము, బాధ్యతా నియమంను పరీక్షించుము.
3. యుక్తత నియమమును విశదీకరించుము.

●●●

BRAOU

# భాగం – 26 : భారతదేశంలో కేంద్ర రాష్ట్రాల మధ్య గల విత్త సంబంధాలు

విషయ క్రమం

26.0 లక్ష్యాలు / ఉద్దేశాలు
26.1 పరిచయం
26.2 భారతదేశంలో కేంద్ర రాష్ట్రాల మధ్య విత్త సంబంధాలు
26.3 ఆర్థిక సంఘం
26.4 ఆర్థిక సంఘము – ప్రణాళికా సంఘం
26.5 ఎనిమిదవ ఆర్థిక సంఘపు సూచనలు
26.6 తొమ్మిదవ ఆర్థిక సంఘపు సూచనలు
26.7 సారాంశము / ముగింపు
26.8 సంప్రదించు పుస్తకాలు
26.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 26.0 లక్ష్యాలు మరియు ఉద్దేశాలు

ఈ భాగం యొక్క ఉద్దేశం

భారతదేశంలో కేంద్ర రాష్ట్రాల మధ్య గల సంబంధాలను, ఆర్థిక సంఘపు ప్రస్తుత స్థితిని, ఎనిమిదవ మరియు తొమ్మిదవ ఆర్థిక సంఘపు సూచనలను వివరించడం.

ఈ భాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది భావనలను అవగాహన చేసుకోగల్గుతారు.

- భారతదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్యగల విత్త సంబంధాలను వివరించడము.
- ఆర్థిక సంఘాల నిర్మాణం మరియు విధులను విశ్లేషించడము.
- ప్రణాళిక మరియు ఆర్థిక సంఘాల విధులను పరీక్షించడము మరియు
- ఎనిమిదవ మరియు తొమ్మిదవ ఆర్థిక సంఘాల సూచనలను వివరించడం

## 26.1 పరిచయం

ఏ విత్త వనరుల పంపిణీ కూడా అన్ని కాలాలకు, అన్ని పరిస్థితులకు సంతృప్తికంగా ఉండదని భారతరాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. రాష్ట్రాలకు రాబడి లోటు ఏర్పడే అవకాశం ఉందని వారు భావించారు. అందుకే వారు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల వాటాల ద్వారా, గ్రాంట్ల ద్వారా రాబడి సంక్రమించేటట్లు వీలు కల్పించారు. అయినప్పటికీ, జాతీయార్థిక ప్రణాళిక ఆచరణ వల్ల, రాష్ట్రాలకు చాలినంతగా లేని వనరుల వల్ల క్రమంగా ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై అధికంగా ఆధారపడుతున్నాయి. వాటి కోశ స్వతంత్రతను కేంద్ర ప్రభుత్వం క్రమంగా అపహరించి వేస్తున్నదని రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తున్నాయి. రాజ్యాంగం ద్వారా నెలకొల్పబడిన సంస్థయైన ఆర్థిక సంస్థయైన ఆర్థిక సంఘం కేంద్రం నుండి రాష్ట్రప్రభుత్వాలకు అధిక

పరిమాణంలో వనరులను బదిలీ చేస్తున్నప్పటికీ ఈ కోశ అక్రమత నుండి రాష్ట్రాలను రక్షించలేకపోతుంది.

## 26.2 భారతదేశంలో కేంద్ర రాష్ట్రాల మధ్య గల విత్త సంబంధాలు

### 26.2.1 భారతరాజ్యాంగములో విత్త అధికారాల పంపిణీ

భారతరాజ్యాంగం ద్వారా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేసిన విత్త/ఆర్థిక సంబంధాలు 1935వ భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా రూపొందింపబడినాయి. భారత రాజ్యాంగం మూడు రకాల జాబితాలను ఏర్పరచింది. అవి, కేంద్ర జాబితా, రాష్ట్రజాబితా మరియు ఉమ్మడి జాబితా, కేంద్ర జాబితాలో కేంద్ర ప్రభుత్వపు అధికార విధులను నిర్దిష్టంగా ప్రకటించారు. అదే విధంగా రాష్ట్ర జాబితాలో రాష్ట్ర ప్రభుత్వాలకు గల అధికారాలను, విధులను స్పష్టంగా తెలిపారు.ఉమ్మడి జాబితాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెంటికీ ఉభయంగా గల అధికార పరిధిని తెలిపారు. భారతరాజ్యాంగం ప్రకారం అవశిష్ట అధికారాలు (residuary powers) కేంద్ర ప్రభుత్వానికి అప్పగింపబడినవి. మూడు జాబితాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నట్లయితే కేంద్ర ప్రభుత్వానికి కస్టమ్స్ సుంకాలు, ఎక్సైజ్ సుంకాలు, కార్పోరేషన్ పన్ను, ఆదాయపు పన్ను మొదలగు వ్యాకోచిత గల పన్నులను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు తక్కువ వ్యాకోచిత గల భూమి రాబడి, అమ్మకపు పన్ను, మోటారు వాహనాల పన్ను, ఆల్కాహాలిక్ పానీయం, ఓపియం లాంటి మత్తుమందులపై విధించే ఎక్సైజ్ సుంకాలు మొదలగు పన్నులు ఇవ్వబడినవి. ఉమ్మడి జాబితాలోని అంశాలకు ఎటువంటి పన్నులను విధించే అధికారం లేదు.

### 26.2.2 సహాయక గ్రాంట్లు

పన్ను వనరులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడినప్పటికీ, ఆర్థిక సంఘపు సూచనల ఆధారంగా కొన్ని రకాల పన్నులకు చెందిన రాబడులను కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయడానికి భారతరాజ్యాంగం వీలు కల్పిస్తున్నది. వ్యక్తిగత ఆదాయపు పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, ఎస్టేట్ సుంకం మొదలగు పన్నులు అందుకు ఉదాహరణలు. అంతేగాకుండ గ్రాంట్ల ద్వారా కూడా కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు రాబడి తరలింపుకు భారతరాజ్యాంగం అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ గ్రాంట్లను మూడు ముఖ్యమైన తరగతులుగా వర్గీకరించవచ్చు. అవి ၊

అ) ప్రణాళికేతర గ్రాంట్లు లేదా శాసనాత్మక గ్రాంట్లు ( statutory grants)ఆర్థిక సంఘపు సూచనల మేరకు రాష్ట్రాలకు చెల్లించే గ్రాంట్లు.

ఆ) ప్రణాళికా గ్రాంట్లు - ప్రణాళికా పథకాల అమలుకు ప్రణాళిక సంఘపు సలహాతో రాష్ట్రాలకు చెల్లించే గ్రాంట్లు.

ఇ) ప్రకృతి వైపరీత్యాల వంటి అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొని సహాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వ విచక్షణతో రాష్ట్రాలకు ఇవ్వబడే గ్రాంట్లు.

ఋణ సేకరణ విషయంలో అంతర్గత మరియు బహిర్గత ఋణాలను పొందడానికి భారతరాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి అధికారమిచ్చింది. కాని రాష్ట్ర ప్రభుత్వాలు బహిర్గత ఋణాలను సేకరించడానికి వీలు లేదు. అవి కేంద్ర ప్రభుత్వంనుండి గాని భారతదేశ ప్రజలనుండి గాని దాని సంచిత నిధి (Consolidated fund) భద్రతకు అనుగుణంగా అప్పులను పొందవచ్చు. కాని, కేంద్ర ప్రభుత్వానికి ఋణపడివున్న రాష్ట్రం ఇంకా ఋణ సేకరణకు



BRAOU

పూనుకోదలచినట్లయితే ముందుగా కేంద్ర ప్రభుత్వఅనుమతిని తీసుకోవాలి. కావున రాష్ట్ర ప్రభుత్వాల ఋణ సేకరణ అధికారాలపై భారత రాజ్యాంగం అనేక ఆంక్షలను విధించింది. ప్రణాళికా మరియు ప్రణాళికేతర ఉద్దేశాల కొరకు కేంద్ర ప్రభుత్వం అనేక విధాలైన ఋణాలను రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తుంది. ఆచరణలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాని అధికంగా ఋణపడి వున్నాయి. అందువలన, ఈ రాష్ట్ర ప్రభుత్వాలు క్రొత్తగాఋణాలను సేకరించాలంటే కేంద్ర ప్రభుత్వ అంగీకారాన్ని పొందాలి.

### 26.2.3 కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వాలు ఆధారపడడం

భారతదేశంలో స్వాతంత్ర్యానంతర కాలంలో క్రమపరిణామం పొందిన కేంద్ర రాష్ట్ర విత్త సంబంధాలు జాతీయార్థిక ప్రణాళికతో సరిపడుతుంది. జాతీయార్థిక ప్రణాళికను అమలుపరచిన నుండి రాష్ట్ర ప్రభుత్వాలు అధిక విత్త సహాయంకై కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడుతూ ఉన్నాయి అంతేగాకుండ, అనేక ఉత్పాదక రాబడి వనరులు కేంద్రీకరింపబడడం వలన రాష్ట్రాల విత్త స్వతంత్రత క్రమంగా అపహరింపబడుతుంది.

### 26.2.4 రాష్ట్రాల విత్త అధికారాల ఆక్రమణ

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు, విధులు విపరీత వ్యయంతో కూడినవి మరియు విస్తారమైనవి. అందుకే అవి [illegible] లేని వనరుల గురించి, వాటి విత్త వనరుల ఆక్రమణ గురించి క్రింది అంశాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉంటాయి.

అ) ఆదాయం పన్నులో భాగంగా వున్న కార్పోరేషన్ పన్నును వేరుగా ప్రవేశపెట్టడం వలన రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు చాలా పరిమాణంలో హరించి వేయబడినది. ఎందుకంటే కార్పోరేషన్ పన్ను ద్వారా వచ్చే రాబడిని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంచియివ్వదు.

ఆ) ఆదాయం పన్నుకు అదనంగా విధింప బడే సర్‌ఛార్జి ద్వారా వచ్చే రాబడిని, ఆదాయం పన్ను పద్ధతికి విరుద్ధంగ, కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం జరుగదు. దాని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాల వాటా పెరగదు. కాని 1985-86 సంవత్సరం నుండి సర్‌ఛార్జి విధింపును నిషేధించారు.

ఇ) 1956 లో టెక్స్‌టైల్స్, పంచదార, మరియు పొగాకుపై అమ్మకం పన్ను విధింపును రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చివేసాయి. అందుకుగాను ఈ వస్తువులపై అదనపు ఎక్సైజ్ సుంకాలను విధించి ఆ రాబడిని రాష్ట్రాలకు బదిలీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కాని కేంద్రప్రభుత్వం ఈ సుంకాల పన్ను రేట్లను పెంచడానికి ఎటువంటి ఉత్సాహం చూపించలేదు. కావున ఆ ఆధారం ద్వారా వచ్చే రాబడి గుర్తింపదగినంతగా పెరగలేదు. ఈ అదనపు ఎక్సైజ్ సుంకాలు లేనట్లయితే, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వస్తువులపై అమ్మకం పన్నుల ద్వారా అధిక రాబడిని సేకరించి ఉండేవి. కావున, ఆ వస్తువుల విషయంలో అమ్మకం పన్ను రాబడి నష్టానికి పరిహారంగా రాష్ట్రాలు చాలినంత ఆదాయాన్ని పొందడం లేదు. ఈ కారణం వల్ల, కేంద్ర ప్రభుత్వం ఇతర కొన్ని వస్తువులను అదనపు ఎక్సైజ్ సుంకాల పరిధిలోనికి తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఆ వస్తువులపై అమ్మకం పన్ను విధింపు అధికారాన్ని కోల్పోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అంగీరించడం లేదు.

ఈ) రాష్ట్రాల రాబడిలో పాత్ర గల పన్నులను తగ్గించడానికి గాని, రద్దు చేయడానికిగాని కేంద్రప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించడం లేదు.

BRAOU

ఉ) బడ్జెట్ లో లోటు ఏర్పడినప్పుడు కేంద్ర ప్రభుత్వం నోట్లను ముద్రించడానికి అధికారాన్ని కలిగి ఉంది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో ఈ లోటు కొన్ని సంవత్సరంలో 10 నుండి 15 శాతంగా ఉంది. ఇంకొక ప్రక్క రాష్ట్రాలకు ఈ విధమైన అవకాశంగాని, సాధనంగాని లేదు. అవి తాత్కాలికంగా భారతీయ రిజర్వు బాంకు నుండి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొనే వీలుంది. అనేక రాష్ట్రాల మొత్తం సాంవత్సరిక వ్యయంలో ఓవర్ డ్రాఫ్టుల విలువ $2\frac{1}{2}$ శాతానికి మించి ఉండకూడదు. ఒక వేళ రాష్ట్రాలు వరుసగా ఏడు రోజులకు మించి ఈ పరిధిని దాటినట్లయితే భారతీయ రిజర్వు బాంకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రామాణిక బాంకింగ్ సౌకర్యాలను ఉపసంహరించుకోవచ్చు.

ఊ) భారతరాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఒక చట్టం చేయడం ద్వారా ఒక వస్తువును "ప్రత్యేక ప్రాధాన్యత" గల వస్తువుగా ప్రకటించవచ్చు. ఒక వస్తువు ఆ విధంగా ప్రకటింపబడిన తర్వాత ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ వస్తువుపై 4 శాతం కన్న ఎక్కువ రేటును అమ్మకం పన్నుగా విధించలేదు. ప్రత్తి, బొగ్గు, ఇనుము, ఉక్కు మొదలగు వస్తువులను ప్రత్యేక ప్రాధాన్యత గల వాటిగా ప్రకటిస్తుండడం వల్ల కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రాల ఆధారితం పెరుగుతూ ఉంది.

ఋ) కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసే మొత్తం వనరులలో ఆర్థిక / విత్త సంఘపు సూచనల కనుగుణంగా చేసిన వనరుల బదిలీలు ఆ మొత్తంలో 25 శాతానికి మించి ఉండవు. మిగిలిన 75 శాతం, ప్రణాళిక గ్రాంట్లతో సహా, కేంద్ర ప్రభుత్వ విచక్షణ ఆధారంగా ఇవ్వడం జరుగుతుంది. కావున, మొత్తం వనరులలో అధిక భాగాన్ని రాష్ట్రాలకు బదిలీ చేసేటప్పుడు పార్టీ లేదా రాజకీయ ఒత్తిడి కేంద్రంపై ఉండడానికి అవకాశం ఉంది.

## 26.3 ఆర్థిక / విత్త సంఘము (Finance Commission)

భారత రాజ్యాంగం విశేషమైనది. ఎందుకంటే అది ఆర్థిక / విత్త సంఘం అను స్వతంత్ర్యమైన నిపుణత గల సంస్థ నియామకానికి వీలు కల్పించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన ఆర్థిక, విత్త లేదా కోశ సంబంధాల గురించి, ఉద్భవించే సమస్యల గురించి ఆర్థిక సంఘము చర్చించి సూచనలిస్తుంది. ఇతర అనేక ఫెడరల్ వ్యవస్థల లోని రాజ్యాంగాలలో విస్తృతమైన అధికారాలు గల స్వతంత్ర్యమైన రాజ్యాంగ సంస్థ స్థాపనకు ఏర్పాటు లేదు.

B R A O U

రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 2 సంవత్సరాలలో, ఆ తర్వాత ప్రతి ఐదవ సంవత్సర అంతంలో గాని లేదా అంతకుముందు గాని ఒక ఆర్థిక సంఘాన్ని రాష్ట్రపతి నియమించాలని భారతరాజ్యాంగం నిర్దేశిస్తుంది. అది ఒక ఛైర్మన్, నలుగురు ఇతర సభ్యులతో కూడి ఉంటుంది. అధ్యక్షుడు (ఛైర్మన్) ప్రజా కార్యకలాపాలలో అనుభవం కలిగి ఉన్నవాడై ఉండాలి. మెంబర్ గా నియమింపబడే వ్యక్తి క్రింది వాటిలో ఏదో ఒక దానిలో అర్హుడై ఉండాలి.

(i) ఒక హైకోర్టులో న్యాయాధిపతి (Judge) గ నియమింపబడి ఉండాలి. లేదా అందుకు అర్హత కలిగి ఉండాలి. లేదా
(ii) ప్రభుత్వవిత్త మరియు ఖాతా ( Accounts ) అంశాలపై ప్రత్యేక పరిజ్ఞానం కలిగి ఉండాలి. లేదా
(iii) పరిపాలనలో ఆర్థిక సంబంధమైన విషయాలలో విస్తృతమైన అనుభవాన్ని కలిగి ఉండాలి. లేదా
(iv) అర్థ శాస్త్రంపై ప్రత్యేక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి.

### 26.3.1 ఆర్థిక విత్త సంఘ విధులు

భారత రాష్ట్ర పతికి క్రింది అంశాలపై సూచనలివ్వడమే ఆర్థిక సంఘపు విధి. అవి :

(అ) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడే లేదా విభజింపవలసిన అవసరం ఉండే పన్నులను పంపిణీ చేయడంలో,

(ఆ) రాష్ట్రాల వాటాను రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడంలో,

(ఇ) భారత సంచిత నిధి (consolidated fund ) నుంచి రాష్ట్రాలకు సహాయక గ్రాంట్లను ఇవ్వడానికి నియమాలను నిర్ణయించడంలో, మరియు

(ఈ) రాష్ట్రపతి ఆదేశం మేరకు ఉత్తమ విత్త విధానానికి అవసరమయ్యే ఏ ఇతర సూచనలనైనా చేయడంలో భారత రాష్ట్రపతికి ఆర్థిక సిఫారసులను చేస్తుంది.

ఆర్థిక సంఘానికి సివిల్ కోర్టుకున్న ప్రతిపత్తి ఉంటుంది. ఆర్థిక సంఘపు వ్యవహారపద్ధతిని అదే నిర్ణయించుకుంటుంది. చట్టం ప్రకారం, ఆర్థిక సంఘపు సూచనల నన్నింటిని రాష్ట్రపతి ఆమోదించవలసిన అవసరం లేదు. అయినప్పటికీ, సంప్రదాయకంగా ఆర్థిక సంఘపు అనేక సూచనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించి అమలుపరుస్తుంది. ఆర్థిక సంఘపు సూచనల ఆధారంగా రాష్ట్రాలు పొందే ఆర్థిక సహాయంచట్టబద్ధమైన స్వభావాన్ని కలిగి ఉంటుంది. కావున ఆ సహాయాన్ని వినియోగించుకొనే సమయంలో కేంద్రప్రభుత్వ నియంత్రణ ఉండదు. అందువలన, రాష్ట్రాలకు గల కోశ స్వతంత్రత ఆర్థిక సంఘం వల్ల దెబ్బ తినదు. అలా గాకుండా, భారత రాజ్యాంగపు 282వ ప్రకరణం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల కిచ్చే గ్రాంట్లు వివేకంతో నిర్ణయించినవి. అంతే గాకుండా ప్రణాళికా సంఘపు సలహా మేరకు రాష్ట్రాలకు షరతు పూర్వక గ్రాంట్లుగా ఇవ్వబడును. ఇంతవరకు భారత రాష్ట్రపతి ద్వారా తొమ్మిది ఆర్థిక సంఘాలు నియమింపబడినాయి.

---

## 26.4 ఆర్థిక సంఘం - ప్రణాళికా సంఘం

---

ఆర్థిక ప్రణాళికల అమలుతో ఆర్థిక సంఘపు పాత్రలో సంపూర్ణమైన మార్పు సంభవించింది. భారతదేశంలో ఆర్థిక ప్రణాళికల వల్ల వనరులు గణనీయంగా కేంద్రీకృతమైనాయి. 1950వ సంవత్సరంలో కార్య నిర్వాహక ఉత్తర్వుద్వారా స్థాపించబడిన ప్రణాళిక సంఘం కేంద్రీయ వనరుల బదిలీకి (ముఖ్యంగా అభివృద్ధి ఉద్దేశాల కొరకు) ప్రధానమైన సంస్థగా రూపుదాల్చింది. ప్రణాళికా రచన ఉద్దేశం కొరకు, ప్రణాళికా సంఘం కేంద్ర రాష్ట్ర ప్రణాళికలకు విత్తాన్ని సమకూర్చడానికి లభ్యమయ్యే వనరులను అంచనా వేస్తుంది. ఈ రకమైన అభ్యాసం రాష్ట్రాల అన్ని రకాల విత్త వ్యవహారాలను చుట్టుకొంటుంది. అందువలన, విత్తసంఘపు పరిధిని ప్రత్యేకంగా తెలుపలేము.

ప్రణాళికా సంఘం మరియు ఆర్థిక సంఘం మధ్య విధులకు సంబంధించి ప్రతిరూపణ ఉంటుంది. ఈ రెండు కూడా ప్రణాళికేతర ఖాతా క్రింద ప్రతి రాష్ట్రపు పరిస్థితిని అంచనా వేయడానికి వేర్వేరుగా వనరులను గురించి అంచనాలు తయారు చేస్తాయి. అయినప్పటికీ, భారతదేశంలో ఫెడరల్ విత్త వ్యవస్థను నెలకొల్పుకొన్నాం. కాబట్టి భారతరాజ్యాంగపు 275 వ ప్రకరణ ప్రకారం పన్నులు, సహాయక గ్రాంట్లకు సంబంధించి ఆర్థిక సంఘం చేసే సూచనలను కేంద్ర ప్రభుత్వం సాధారణంగా అంగీకరిస్తుంది.

ప్రణాళికా సంఘం స్వతంత్రంగా ప్రస్తుత రాబడి (current revenues) నుండి శేషం (ప్రస్తుత ప్రణాళికేతర వ్యయం నుండి ప్రీప్లాన్ పన్ను స్థాయి వద్ద రాబడి వసూళ్ళను తీసివేయగా వచ్చునది) ను అంచనా వేస్తుంది. ఈ శేషపు పరిమాణం ఆర్థిక సంఘపు అంచనాలతో విభేదిస్తుంది. ప్రణాళికా సంఘం దాని స్వంత అంచనాలలో ఆర్థిక సంఘపు సూచనలను మార్చదు. కాని ప్రణాళిక పరిమాణపు నిర్ణయానికి ఆధారమైన వనరుల అంచనాలలో, ప్రణాళికా సంఘపు అంచనాలే చివరికి ఉపయోగింపబడతాయి.

కావున ఆర్థిక సంఘం అంచనా వేసే రాబడి శేషపు పరిమాణం ఆధారంగా దాని ప్రాధాన్యత తెలుపబడదు.

BRAOU

తలసరి ఆదాయాన్ని జనాభాచే గుణించగా వచ్చు అంశానికి 25 శాతాన్ని మరియు ఒక రాష్ట్ర అధిక తలసరి ఆదాయం నుండి అన్ని రాష్ట్రాల సగటు తలసరి ఆదాయాన్ని తీసివేయగా వచ్చు మొత్తాన్ని జనాభాతో గుణించగా వచ్చు అంశానికి 50 శాతాన్ని ప్రామాణికంగా ఇవ్వాలి.

### 26.5.2 కేంద్ర ఎక్సైజ్ పన్ను విభజన – కేటాయింపు

ఆర్థిక సంఘం అన్ని ఎక్సైజ్ సుంకాలనుండి వచ్చు నికర రాబడులలో రాష్ట్రాల వాటను 40 నుండి 45 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. ఈ ఎక్సైజ్ సుంకాల నుండి అదనపు ఎక్సైజ్ సుంకాల (టెక్స్టైల్ మరియు టెక్స్టైల్ వస్తువులు) చట్టం, 1978 క్రింద వచ్చే అంశాలను, మరియు ప్రత్యేక ఉద్దేశాల కొరకు శాసనం తెలిపే సెస్సులను మినహాయించాలి. కొన్ని ఎక్సైజ్ సుంకాలను అత్యల్పంగా విధించాలి. విద్యుచ్ఛక్తిపై ఎక్సైజ్ సుంకం గురించి అంతకు ముందు కమీషన్ల సిఫారసులను ఆమోదిస్తూ మొత్తం విద్యుచ్ఛక్తి ఎక్సైజ్ సుంకాన్ని రాష్ట్ర వసూళ్ళకు సమానంగా పంపిణీ చేయాలని సూచించింది. అయితే 1984-85 బడ్జెట్ ముందు ప్రసంగంలో ఆర్థిక మంత్రి 1.10.1984 నుండి ఈ సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు, ఇక ముందు రాష్ట్రాలే వాటికి అనుకూలమైన విధంగా విధించుకోవచ్చని ప్రకటించాడు.

రాష్ట్రాల మధ్య ఎక్సైజ్ సుంకాల కేటాయింపుకై నియమం గురించి ఆర్థిక సంఘం సమ్మదర్గ గణాంక వివరాల పురోగామిత్వం (Progressivity). సాంభ్యత మరియు లభ్యత అను మూడు యోచనలను గుర్తించింది. ఏడవ ఆర్థిక సంఘం అవలంబించిన పద్ధతి – పంపిణీ నియమానికి జనాభాయే గాకుండ ఇతర మూడు సంయుక్త నియమాలను పాటించే పద్ధతి –ని సమీక్షించి ఎనిమిదవ ఆర్థిక సంఘం క్లిష్టం కాని పద్ధతిని దూరపు పద్ధతి Distance method) పాటించింది. ఇందులో రాబడి వనరులలో రాష్ట్రాల మధ్య అసంతులనలు వనరుల పెంపుదల సామర్థ్యం మరియు సాపేక్షిక వెనుకబడిన తనం ప్రాతిపదికగా ఎక్సైజ్ సుంకాల కేటాయింపు జరుగుతుంది. ఈ సంఘపు ఉద్దేశంలో గణాంక వివరాల కొరత మూలంగా ఈ నియమం దెబ్బతినదు మరియు ఈ నియమం అనేక రాష్ట్రాలకు ఆమోదయోగ్యమైనది. రాబడి ఖాతాలో [illegible]లు వున్న రాష్ట్రాలకు సహాయం చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు అవసరమని సంఘం భావించింది.

పై అంశాల దృష్ట్యా ఎనిమిదవ ఆర్థిక సంఘం క్రింది సిఫారసులను సూచించింది.

ఏ) విద్యుచ్ఛక్తిపై గాకుండ ఇతర పంపిణీ కాబడే ఎక్సైజ్ సుంకాల నికర రాబడిలో 40 శాతాన్ని 90 శాతపు పంపిణీ కాబడే ఆదాయపు పన్ను వలె విభజించాలి.

బి) రాబడి ఖాతాలో లోటును కలిగి వుండే రాష్ట్రాలకు సహాయం చేయడానికి ఆర్థిక సంఘం ఎక్సైజ్ సుంకాల నికర రాబడి నుండి 5 శాతాన్ని ప్రతి రాష్ట్రపు లోటు మరియు అన్ని రాష్ట్రాల లోటు మధ్య గల నిష్పత్తిని బట్టి పంపిణీ చేయాలని సూచించింది.

### 26.5.3 ఆదాయపు పన్నుపై సర్ చార్జి విభజన – పంపకం

సర్ చార్జి వరుసగా కొనసాగిస్తే అది అదనపు 'ఆదాయపుపన్ను' అవుతుందని ఆదాయ పన్ను నికరరాబడి పంపిణీ వలె సర్ చార్జిని కూడా పంపిణీ చేయాల్సివుంటుందని సంఘం అభిప్రాయపడింది. అందుకే 1985-86 ఆరంభం నుండి ఆదాయపు పన్నుపై సర్ చార్జిని తొలగించాలని మరియు ఆదాయపన్ను రేట్లలో తగిన సవరింపులు చేయాలని ప్రతిపాదించింది.

BRAOU

### 26.5.4 కార్పొరేషన్ పన్ను విభజన – పంపకం

కేంద్ర రాష్ట్రాల మధ్య విత్త సంబంధాలలో అసౌకర్యాలను తొలగించడానికి కార్పొరేషన్ పన్నును సమీక్షించాలని గట్టిగా ప్రతిపాదించింది.

### 26.5.5 అదనపు ఎక్సైజ్ సుంకాల విభజన – పంపకం

టెక్స్‌టైల్, పంచదార మరియు పొగాకులపై అదనపు ఎక్సైజ్ సుంకాల వల్ల వచ్చే నికర రాబడిని ప్రతి రాష్ట్రం ఆయా వస్తువులను వినియోగించే స్థాయిని బట్టి కేటాయించడమే సరియైన నియమంగా ఉంటుందని సంఘం భావించింది. కాని ఈ వస్తు వినియోగంపై ఆయా రాష్ట్రాలలో నమ్మదగిన అంచనాలు లభించనట్లయితే [illegible] రాష్ట్ర దేశీయ ఉత్పత్తిని (state domestic product) ఉపయోగించింది. అందుకు కారణమేమంటే రాష్ట్ర ఆదాయం పెరిగిన కొలది పంచదార, టెక్స్‌టైల్స్ మరియు పొగాకు వినియోగం పెరుగుతుందని సంఘం భావించడమే. స్వతంత్ర కారకరంగా జనాభాకు కూడా గణనీయమైన ప్రాముఖ్యతను ఇచ్చింది. తదనుగుణంగా, మూడు వస్తువుల విషయంలో అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విభజించి పంపిణీ చేయడానికి రాష్ట్ర దేశీయ ఉత్పత్తి మరియు జనాభాకు సమాన ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించింది. ఏ పంపిణీ నియమాన్ని పాటించినప్పటికీ గ్యారంటీ మొత్తానికన్నా అన్ని రాష్ట్రాలు ఎక్కువ మొత్తాన్నే పొందుతాయి. కాబట్టి గ్యారంటీ మొత్తాన్ని వేరు ఉంచాల్సిన అవసరం లేదని సంఘం తెలిపింది.

### 26.5.6 ఎస్టేట్ సుంకం విభజన – పంపకం

ఏడవ ఆర్థిక సంఘంతో ఏకీభవిస్తూ, ఎనిమిదవ సంఘం వ్యవసాయ ఆస్తులు గాకుండా ఇతర ఆస్తుల విషయంలో ఎస్టేట్ సుంకపు నికర రాబడులను రాష్ట్రాల స్థూల ఆస్తుల (స్థిర, చర ఆస్తుల) అనుపాతంలో పంపిణీ చేయాలని సిఫారసు చేసింది.

### 26.5.7 రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్నులకు బదులుగా గ్రాంట్లు

రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్నులకు బదులుగా ఇచ్చే గ్రాంట్ల పరిమాణాన్ని సంవత్సరానికి రూ.95 కోట్లకు పెంచాలని ఆర్థిక సంఘం సూచించింది. ఈ గ్రాంట్ల నుండి ఇచ్చే రాష్ట్రాల వాటాను 1978-79 నుండి 1981 - 82 వరకు గల సంవత్సరాలలో నగర శివారు కాని ప్రాంతాల ప్రయాణికుల ద్వారా వచ్చే సగటు సంపాదనకు అనుపాతంలో కేటాయించాలని ఈ సంఘం సిఫారసు చేసింది.

### 26.5.8 ఉపశమన వ్యయం (relief expenditure) నకు విత్తాన్ని సమకూర్చుట

ఏడవ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన ఉపశమన వ్యయానికి విత్తాన్ని కల్పించే ఏర్పాటును కొనసాగించాలని ఎనిమిదవ ఆర్థిక సంఘం సూచించింది. వివిధ రాష్ట్రాల మార్జిన్ ద్రవ్యాన్ని పై స్థాయికి సవరిస్తూనే, ఒక్కొక్క రాష్ట్రపు మార్జిన్ ద్రవ్యాన్ని అధిక స్థితిలో స్థిరపరిచింది. కేంద్ర రాష్ట్రాల మధ్య మార్జిన్ ద్రవ్యాన్ని సమాన వాటాలుగా పంచాలని సిఫారసు చేసింది.

### 26.5.9 రాష్ట్రాల ప్రణాళికేతర మూలధన లోటు (gap)

ఋణ విమోచన ఉద్దేశం కొరకు ఓవర్ డ్రాఫ్ట్ ఋణాలను, చిన్న పొదుపు అప్పులను లెక్కలోకి

BRAOU

తీసుకోకుండా రాష్ట్రాల ప్రణాళికేతర మూలధన లోటును ఆర్థిక సంఘం అంచనా వేసింది. 1984-85 నుండి 5 సంవత్సరాలకాలం కొరకు ఎనిమిదవ ఆర్థిక సంఘం రూ.2285.39 కోట్లను రాష్ట్రాలకు సిఫార్సు చేసింది. రాష్ట్రాల ఋణ విమోచన కొరకు రూ.405.20 కోట్ల చెల్లింపును కొట్టి వేయడాన్ని ఇందులో పరిరక్షితం చేసింది.

### 26.5.10 సహాయక గ్రాంట్లు

11 రాష్ట్రాల రాబడి ఖాతాలోని లోటును 1984-85 నుండి 5 సంవత్సరాల కాలంలో అనగా 1988-89 వరకు భర్తీ చేయుటకు రూ.2200.22 కోట్ల మొత్తాన్ని ఈ సంఘం ప్రతిపాదించింది. ఈ 5 సంవత్సరాల కాలంలో పరిపాలన ప్రమాణాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రత్యేక సమస్యలను ఎదుర్కోవడానికి అదనంగా రూ.967.33 కోట్ల గ్రాంట్లను సిఫారసు చేసింది. అంతేగాకుండ, రాష్ట్రాల మార్జిన్ ద్రవ్య అవసరాలను తీర్చడానికి ప్రతి సంవత్సరం రూ.120.375 కోట్లను రాష్ట్రాలకు కేటాయించాలని సూచించింది. చివరిగా, లోటుగల రాష్ట్రాలు కొత్త ఋణాలు తీసుకొన్నప్పుడు అదనపు నికర వడ్డీని చెల్లించడానికి, ప్రణాళిక పథకాలకు అవసరమయ్యే వ్యయాన్ని భరించుటకు అయ్యే అదనపు భారాన్ని పూరించడానికి ఎనిమిదవ ఆర్థిక సంఘం గ్రాంట్లను ప్రతిపాదించింది.

ఎనిమిదవ ఆర్థిక సంఘం గ్రాంట్ల ద్వారా, భారాన్ని మోపడం ద్వార రాష్ట్రాలు అధిక పరిమాణంలో ఆర్థిక సహాయం పొందేటట్లు ఏర్పాట్లు చేసింది. ఈ సంఘపు సిఫారసుల ఆధారంగా 1985-86వ సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం రూ. 7806.87 కోట్లను పొందగలవు.

## 26.6 తొమ్మిదవ ఆర్థిక విత్త సంఘ సూచనలు

జూన్ 1987లో భారత రాష్ట్రపతి తొమ్మిదవ ఆర్థిక విత్త సంఘం ఎన్.పి.కే.సాల్వే అధ్యక్షతన ఏర్పరచబడినది. ఈ సంఘం తన రెండవ నివేదికను 1989 డిసెంబరులో సమర్పించింది. దీనిలోని ముఖ్య సూచనలను ఈక్రింద చర్చించడం జరిగింది.

### 26.6.1 ఆదాయపు పన్ను

ఆదాయపు పన్ను ద్వారా వస్తున్నటువంటి ఆదాయాన్ని ఏ విధంగా వివిధ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలో తొమ్మిదవ ఆర్థిక సంఘం ఈ క్రింది విధంగా సూచించింది ఈ విభజన విషయంలో ఎనిమిదవ ఆర్థిక సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకొన్నట్లు మనకు తెలుస్తుంది.

ఎ) 1985-86 నుండి 1987-88 సంవత్సరాల ఆదాయ పన్ను వసూలు ప్రాతిపదికలో ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటా 10 శాతంగా కొనసాగించాలి.

బి) 1971వ సంవత్సరం జనాభా ఆధారంగా ఆదాయపు పన్నులో 25 శాతాన్ని కేటాయించాలి.

సి) ఒక రాష్ట్ర అధిక తలసరి ఆదాయం నుండి అన్ని రాష్ట్రాల సగటు తలసరి ఆదాయాన్ని తీసివేయగా వచ్చు మొత్తాన్ని 1971వ సంవత్సరపు ఆ రాష్ట్ర జనాభాతో గుణించగా వచ్చు అంశానికి 45 శాతాన్ని ప్రామాణికంగా ఇవ్వాలి.

డి) 11.25 శాతాన్ని తొమ్మిదవ ఆర్థిక సంఘం చేత గుర్తించబడిన పేదరికంపై ఆధారపడి కేటాయించాలి.



BRAOU

### 26.6.2 కేంద్ర ఎక్సైజ్ పన్ను విభజన కేటాయింపు

పంపిణీ చేయబడు కేంద్ర ఎక్సైజ్ సుంకాలలో అన్ని ఎక్సైజ్ సుంకాలనుండి వస్తున్నటువంటి రాబడులలో ప్రత్యేక ఎక్సైజ్ సుంకాలు కలిపి ఉండడం అనునది తొమ్మిదవ ఆర్థిక సంఘం సూచించినది కాదని దీనిలో 1978 చట్టప్రకారంగా అదనపు ఎక్సైజ్ సుంకాలను మాత్రం తీసి వేయడం జరిగింది. మొత్తము కేంద్ర ఎక్సైజ్ సుంకాల నికర ఆదాయంలో రాష్ట్రాల యొక్క భాగం 45 శాతము మాత్రమే.

### 26.6.3 ఎస్టేట్ సుంకం

కేంద్ర ప్రభుత్వము ఏప్రిల్ 1, 1985 నుండి ఎస్టేట్ సుంకాన్ని తొలగించడం జరిగినది. కావున తొమ్మిదవ ఆర్థిక సంఘం ఆదాయ పంపిణీల విషయంలో ఎలాంటి సూచనలు చేయవలసిన అవసరం ఏర్పడలేదు.

### 26.6.4 సహాయక గ్రాంట్లు

మొదటి ఆర్థిక సంఘం సిఫారసు చేయబడినటువంటి బడ్జెట్ అవసరాల సిద్ధాంతాన్ని ఉపయోగించాలనే అవసరాన్ని తొమ్మిదవ ఆర్థిక సంఘం పరిగణించలేదు. అందువలననే రాష్ట్రాల బడ్జెట్ తారతమ్యాలను భరించాల్సిన అవసరం లేదని గుర్తించడంతో పాటు ఆయా రాష్ట్రాల కోశ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని నిర్ణయించడం జరిగినది. కోశ అవసరాలు ఆదాయ రాబడులపై మరియు ప్రణాళికేతర వ్యయంపై ఆధారపడి ఉంటుందని గుర్తించడం జరిగినది. తొమ్మిదవ ఆర్థిక సంఘం 14 రాష్ట్రాలు రూ॥లు 6,016.35 కోట్లు ఆదాయ తారతమ్య గ్రాంట్లుగా పొందవచ్చునని నిర్ణయించడమైనది. 12 రాష్ట్రాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికల్లో ఏర్పడుతున్న ఆదాయ లోటును పూడ్చడం కొరకు రూ॥లు 9000.83 కోట్లు సహాయక గ్రాంట్లుగా పొందవచ్చునని సూచించింది.

## 26.7 సారాంశము / ముగింపు

భారతదేశంలో గత రెండు దశాబ్దాల కాలంలో కేంద్ర రాష్ట్రాల మధ్య విత్త సంబంధాల సమస్య అధిక ప్రాధన్యతను పొందుతున్నది. వనరులు క్రమంగా కేంద్రీకరింపబడుతుండడం వల్ల తమ కోశ విత్త స్వతంత్రత హరించివేయబడుతుందని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని విమర్శిస్తున్నాయి. జాతీయ ఆర్థిక ప్రణాళిక ఆచరణ వల్ల రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై అధిక విత్త సహాయానికై అర్రులు చాచాల్సి వస్తుంది. 1950లో స్థాపించబడిన ప్రణాళికా సంఘం ఒక ప్రధానమైన సంస్థగా ఏర్పడింది. ఈ ప్రక్రియలో ఆర్థిక సంఘం సూచనల మేరకు కేంద్రం రాష్ట్రాలకిచ్చే ఆర్థిక సహాయం మొత్తం పరిమాణంలో చాలా తక్కువే గాకుండా క్రమంగా తగ్గుతూ ఉంది. ప్రస్తుతం, ఆర్థిక సంఘం మరియు ప్రణాళికా సంఘం నిర్వహించే విధులలో ఎంతో ప్రతిరూపణ (Overlapping) కనిపిస్తుంది. అందువలన, ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి దాని విధులను ఒక శాశ్వత ఆర్థిక సంఘానికి ఇవ్వాలనేది ఒక అభిప్రాయం.

రచన : డా॥ కె. శివసుబ్రహ్మణ్యం
అనువాదం : సతీష్ కె. రెడ్డి

BRAOU

## 26.8 సంప్రదించు పుస్తకాలు


1. D.T. Lakadawala : Union - State Financial Relations
2. K.V.S. Sastri : Federal - State Fiscal Relations in India
3. G. Thimmaiah : Federal Fiscal Systems of Australia and India: A Study in Comparative Relevance
4. B.N. Gupta : Indian Federal Finance and Budgetary Policy.
5. Report of Eight Finance Commission, 1984.
6. Report of the Ninth Finance Commission, 1989.


## 26.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I.** క్రింది వాటికి సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. భారతదేశ ఫెడరల్ విత్తంలో ఆర్థిక / ఫైనాన్స్ సంఘపు పాత్రను విశదీకరించుము.
2. ఎనిమిదవ ఆర్థిక సంఘం చేసిన ముఖ్యమైన సిఫారసులేవి.
3. ఆర్థిక సంఘం మరియు ప్రణాళికా సంఘంల మధ్య విధుల ప్రతిరూపణ (overlapping of the functions) సమస్యను చర్చింపుము.
4. రాష్ట్ర ప్రభుత్వాలు వాటి కోశ/విత్త స్వతంత్రతపై కేంద్రంపై చేస్తున్న విమర్శలను తెలుపుము.

**II.** క్రింది వాటికి సుమారు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. భారతదేశంలో ఆర్థిక సంఘంపై వివరణ నిమ్ము.
2. ఆదాయ పన్నుకు సంబంధించి ఎనిమిదవ ఆర్థికసంఘపు సిఫారసులను వివరింపుము.
3. కేంద్ర ఎక్సైజు సుంకాల నుండి రాష్ట్రాలకు ఆదాయాన్ని పంపిణీ చేయడానికి ఎనిమిదవ ఆర్థిక సంఘం సూచించిన పద్ధతిని వివరింపుము.

●●●

# FACULTY OF SOCIAL SCIENCES

## B.A. III (3 Year Degree Course) Examination

## ECONOMICS

### PAPER III : PUBLIC FINANCE

### MODEL QUESTION PAPER

*Time 3 Hours ]* *[ Max. Marks 100*
*Min. Marks 35*

**Section A - (Marks 4 x 15 = 60 )**

*Answer any FOUR of the following eight questions.*
క్రింది ఎనిమిదింటిలో ఏ నాల్గింటికైనా జవాబులు రాయండి.

*Each question carries 15 marks.*
ప్రతి ప్రశ్నకు 15 మార్కులు.

*Answer the following in about 30 lines each*
క్రింది వానికి సుమారు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. గరిష్ఠ సాంఘిక ప్రయోజన భావాన్ని వివరింపుము. దీనిని ఎట్లు కొలిచెదవు ?

2. పురోగామి పన్ను విధానమనగా నేమి? ఉత్పత్తి, పంపిణీలపై దీని ప్రభావాలను చర్చించండి.

3. పన్ను అంతిమ మరియు తొలి ప్రభావాల మధ్య గల భేదాలను తెల్పండి. మీ జవాబును అమ్మకపు పన్నును ఆధారంగా తీసుకొని విశదీకరించండి.

4. పన్నుల పథకానికి, పన్నుల సంస్కరణకు మధ్య గల భేదాన్ని తెలపండి. భారతదేశంలో పన్నుల సంస్కరణ ఆవశ్యకతను పరిశీలించండి.

5. భారతదేశంలో ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు గల కారణాలను వివరించండి.

6. సంతులిత బడ్జెటును గూర్చి సాంప్రదాయ ఆర్థిక వేత్తల ఆలోచనలను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

7. ప్రభుత్వ సంస్థల వివిధ ధర నిర్ధారక సిద్ధాంతాలను పరిశీలించండి.

8. జాతీయాదాయాన్ని మదించు వివిధ పద్ధతులను వివరించండి.

**Section B - (Marks 5 x 8 = 40 )**

*Answer any FIVE of the following eight questions.*
క్రింది ఎనిమిదింటిలో ఏ ఐదింటికైనా జవాబులు రాయండి.

*Each question carries 8 marks.*
ప్రతి ప్రశ్నకు 8 మార్కులు.

*Answer the following in about 15 lines each*
క్రింది వానికి సుమారు 15 పంక్తుల్లో జవాబులు రాయండి.

9. ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక నిర్మాణాన్ని సంక్షిప్తంగా వివరించండి.

10. పన్ను చెల్లింపు సామర్థ్య సూచకలను వివరింపుము.

BRAOU

BRAOU

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

**HYDERABAD**

UNDERGRADUATE COURSES : **III Year**

SUBJECT : ECONOMICS

COURSE III : **PUBLIC FINANCE**

**ASSIGNMENT NO. II**

**N.B.**

1. Do not copy the answer directly from any of the books.
2. As far as possible try to answer the questions independently in your own words.
3. If it is necessary to quote from any source, give the correct reference.
4. Use your own foolscap pages for writing the assignment.
5. Leave sufficient margin for the comments of the evaluator.
6. Completion of this assignment normally should not take more than two hourstime.

**I. క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు లిమ్ము.**

1. భారతదేశంలో ప్రత్యక్ష పన్నులకు సంబంధించి నియమించబడిన వివిధ విచారణ సంఘాల సిఫారసులను పరిశీలించుము.
2. ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు సంబంధించి వాగ్నర్ దృక్పథాన్ని పరిశీలించుము.
3. పన్నుల సామర్థ్య భావనను నిర్వచించుము. పన్ను సామర్థ్యాన్ని నిర్ణయించు కారకాలను చర్చించుము.

**II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. క్రింది పన్ను భావనలను వివరింపుము.
   (a) నిశ్చిత అంతిమ భారం
   (b) వ్యత్యాస అంతిమ భారం
2. పన్నుల రాబడి వ్యాకోచిత మరియు ప్లవనశీలతల అర్థాన్ని, వాటి మధ్య గల తారతమ్యాన్ని తెలుపుము.
3. ప్రభుత్వ వ్యయంపై నికాల్సన్, డాల్టన్‌ల వర్గీకరణను వివరింపుము.

B R A O U

●●●

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

**HYDERABAD**

UNDERGRADUATE COURSES : III Year

SUBJECT : ECONOMICS

COURSE III : PUBLIC FINANCE

**ASSIGNMENT NO. III**

**N.B.**

1. Do not copy the answer directly from any of the books.
2. As far as possible try to answer the questions independently in your own words.
3. If it is necessary to quote from any source, give the correct reference.
4. Use your own foolscap pages for writing the assignment.
5. Leave sufficient margin for the comments of the evaluator.
6. Completion of this assignment normally should not take more than two hourstime.

**I.** ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు లిమ్ము.

1. లోటు ద్రవ్య విధానం అనగా నేమి? దానిని 'పొంచివున్న పన్ను'గా ఎందుకు భావిస్తారు ?
2. ఆర్థికాభివృద్ధిలో కోశ విధానపు పాత్రను పరిశీలించుము.
3. విత్త సంఘపు ప్రధాన కర్తవ్యమేమిటి? తొమ్మిదవ విత్త సంఘపు సిఫారసులను వివరింపుము.

B R A O U

**II.** ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులిమ్ము.

1. ప్రభుత్వ ఋణ చెల్లింపు వివిధ పద్ధతులను వివరింపుము.
2. సంతులిత, అసంతులిత బడ్జెట్‌ల మధ్య గల తారతమ్యాలను వివరింపుము.
3. ఫెడరల్ విత్త నియమాలను చర్చింపుము.

•••

BRAOU

తక్కువ ఉత్పాదక స్వభావాన్ని కలిగి ఉంటాయి. రాష్ట్రాల బాధ్యతలు, ముఖ్యంగా సాంఘిక సేవలు, బహు మూల్యమైనవి మరియు విస్తరింపబడేవి. ఈ కారణంగా అధిక పరిమాణంలో రాబడులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేయవలసిన అవసరం ఏర్పడింది. దీనిని గుర్తించి భారత రాజ్యాంగ నిర్మాతలు రాష్ట్రాల రాబడిలోటును పూర్తి చేయడానికి పరిహారపు ఏర్పాట్లు చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రత్యేకంగా పన్నుల కేటాయింపును చేయడమే గాకుండా కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇతర రకాల పన్నుల రాబడులను బదిలీ చేసే ఏర్పాటును కల్పించింది. వాటిని క్రింది విధంగా తెలుపవచ్చు.

(i) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడి, సేకరింపబడే పన్నుల లేదా సుంకాల నికర రాబడిని కేంద్ర రాష్ట్రాలు పంచుకొంటాయి. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయపు పన్ను మరియు కేంద్ర ఎక్సైజు సుంకాలు.

(ii) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడి, సేకరింపబడే పన్నుల మొత్తం నికర రాబడిని రాష్ట్రాలు పొందును. ఉదాహరణకు ఎస్టేట్ సుంకం.

(iii) కేంద్ర ప్రభుత్వంచే విధింపబడే సుంకాలను రాష్ట్ర ప్రభుత్వాలే సేకరించి తమ వద్ద నిలుపుకొని వినియోగించుకొంటాయి. ఉదాహరణకు కేంద్ర అమ్మకపు పన్ను.

భారతీయ ఫెడరల్ విత్త వ్యవస్థలో సంభవించే లంబ మరియు సమతల కోశ అసంతులనల దృష్ట్యా భారత రాజ్యాంగం ఆర్థిక సంఘ ఏర్పాటుకు వీలు కల్పించింది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి - 2

4. ఫెడరల్ విత్తం యొక్క నియమాలు ఏమి?

## 25.6 ముగింపు

దాదాపు అన్ని ఫెడరల్ వ్యవస్థలలో విధులననుసరించే బాధ్యతల కేటాయింపులో మరియు విత్త వనరుల కేటాయింపులో విత్త అసంతులనలు సంభవించడం ఒక విశేషమైన లక్షణంగా గోచరిస్తుంది. లంబ, సమతల కోశ సమత్వాన్ని సాధించడానికి బాధ్యతలు మరియు విత్త వనరుల మధ్య పొందిక ఉండేటట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వనరుల కేటాయింపు చేయాలి. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపు కొరకు అర్థశాస్త్ర వేత్తలు తెలిపిన కొన్ని నియమాలలో యుక్తత నియమం ( లేదా కార్య ప్రవర్తనా, పరిపాలనా మిత వ్యయ నియమం) మాత్రమే ఆచరణాత్మకమైనదని భారతదేశంతో సహా అనేక ఫెడరల్ వ్యవస్థలు గమనించాయి.

రచన : డా॥ కె. శివసుబ్రహ్మణ్యం
అనువాదం : సతీష్ కె. రెడ్డి

## 25.7 సంప్రదించు పుస్తకాలు


| | | | |
|---|---|---|---|
| 1. | B.P. Thyagi | : | Public Finance |
| 2. | H.L. Bhatia | : | Public Finance |
| 3. | U.K. Hicks & Olthers | : | Federalism and Economic growth |


BRAOU

4. B.P. Adarkar : The Principles and Problems of Federal Finance
5. Wilfreed David(ed) : Public Finance, Planning and Economic Development (Essays in Honour of U.K. Hicks)
6. Raja J.Chellaiah & Association : Trends and Issues in Indian Federal Finance.

## 25.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు లిమ్ము.

1. ఫెడరల్ విత్తంలో కోశ అసంతులనమును చర్చించుము.
2. ఫెడరల్ విత్త నియమాలను విశదపరుస్తూ భారతదేశంలో అది ఏ విధంగా వర్తింపబడు మన్నాయి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయుము.

1. ఫెడరల్ విత్త సమస్యను వివరించుము.
2. స్వాతంత్ర్యము, బాధ్యతా నియమంను పరీక్షించుము.
3. యుక్తత నియమమును విశదీకరించుము.

•••

B R A O U